

# అనంత యాత్ర

## ప్రథమ భాగం

**పూజ్య శ్రీ బాబూజీ మహరాజ్, కస్తూరీ బహెన్‌ల**

**ఉత్తర ప్రత్యుత్తరాలు**

**3 మే 1948 నుంచి 6 ఏప్రియల్ 1952 వరకు**

వ్యక్తిగత వినియోగం కొరకు మాత్రమే

కస్తూరీ బెహెన్ పుస్తకాల కొరకు

కె. రామదాస్ - 9440652774

కె. సుదర్శన్ - 9247805058

సంప్రదించగలరు.

# అభ్యాసులకు మనవి

**లాలాజీ మహరాజ్ ఏమి చేశారు?**

సమర్థ సద్గురువు, ఆధ్యాత్మిక మహాబలుడు, ఆదిగురువు అయిన శ్రీ రామచంద్రజీ, ఫతేఘర్ లాలాజీ పేరుతో ప్రసిద్ధులయ్యారు. వారి జీవితకాలం నాటికి ప్రకృతి నియతి తప్పిందని, మానవ మాత్రులు దైవచింతన నిర్లక్ష్యం చేసి, స్థూలత్వ ఆచరణల్లో మునిగి తేలుతున్నారని, ప్రకృతి ధర్మాన్ని అనుసరించటంలేదని గ్రహించి, నైతికతను పునరుద్ధరించటానికీ, మానవాళిని దివ్యత్వంవైపు చైతన్యపరచటాని, అవసరం ఏర్పడిందని భావించారు. తత్ఫలితంగా, ఆదిశక్తిని తమ తపోదీక్షతో ఆరాధించి, ప్రకృతి అవసరానికీ ఒక మహాశక్తిని ఈ పృథ్వీమీద అవతరింపజేయాలని ప్రార్థించారు. ఆ ప్రార్థన ఫలితంగా ఆదిశక్తిలో స్పందన కలిగి తన శక్తి రూపంగా ఒక యుగపురుషుని శ్రీరామచంద్రజీ, షాజహాన్‌పూర్, బాబూజీ గౌరవ నామంతో అవతరింప జేయటం జరిగింది. ఆ విధంగా అవతరించిన యుగపురుషుని కాంచి లాలాజీ తన ప్రయత్నం ఫలించినందున సంతోషంతో ఆ బాలుడిని తన ముద్దుబిడ్డగా స్వీకరించి, ఆ యుగపురుషుని రక్షణకై వారిలో ప్రవేశం పొందారు. ఆదిశక్తి భూమానైతే తన శక్తిరూపమైన ఆ దివ్యబాలుని చూసి మురిసిపోయింది. ఆ దివ్యపురుషుని పాదస్పర్శతో పృథ్వి పులకించిపోయి తాను తరించిపోయినట్లుగా పరవశించింది. ఆ తర్వాత లాలాజీ, బాబూజీని తన ప్రియశిష్యునిగా స్వీకరించి అనుపమానమైన దివ్యపురుషునిగా తీర్చిదిద్ది తమ ఆధ్యాత్మిక శక్తి సంతటినీ ధారపోశారు.

**బాబూజీ మహరాజ్ ఏమి చెప్పారు?**

ఈ విధంగా అవతరించిన బాబూజీ మానవమాత్రులను తరింపజేయటానికి ఏమని చెప్పారో పరిశీలించుకుందాం.

దైవం ఒక్కడేనని, 'అతడు' మన ప్రతి ఒక్కరి హృదయంలోనే ఉన్నాడని గ్రహించుకోమన్నారు. విగ్రహాలలో ఉన్నారని భావించడం తగదన్నారు. అందుచేత గృహస్థులైనవారు కుటుంబాన్ని, ఇల్లు వదలి అరణ్యాలకో, గుహలలోకో పోకుండా గృహస్థాశ్రమంలోనే గృహస్థునిగా తన కర్తవ్యాన్ని నేరవేరుస్తూ దేనితోను అనుబంధం పెంచుకోకుండా దైవస్మరణతో ఉపాసన చేయాలన్నారు. భౌతిక మరియు ఆధ్యాత్మిక జీవనం రెండూ సమతూకంలో ఉండాలన్నారు. అనగా ధ్యానం ద్వారా ఆ దైవాన్ని చేరటానికి సాధన చేయాలి. ఈ సాధన సహజమైనదిగా సరళమైనదిగా రూపొందించి దానికి "సహజమార్గం" ఏర్పాటుచేసి ఆ మార్గంలో ప్రయాణించమన్నారు. నిరంతర స్మరణతో దైవాన్ని పొందాలను తపనతో, నిరంతర స్మరణతో ఏకోన్ముఖంగా మనస్సును కట్టడిచేసి సాధన చేసినట్లయితే అది సాధ్యపడుతుంది అన్నారు. ఎన్నో జనన మరణాల చక్రభ్రమణంలో కూరుకుపోకుండా ఈ ఒక్క జన్మలోనే అదీ అనతికాలంలోనే సాధ్యమవునని తెలిపారు. ఒకేఒక్క దైవం అని నిశ్చితభావంతో, ఏకాగ్రతతోనే దానిని సాధించ వీలవుతుంది. ఎందుకంటే, అనేక దేవుళ్ళు, దేవతలను ఆరాధ్యంగా ఎంచుకుంటే దీక్షాదక్షతలు బహుముఖమైపోయి 'అసలు' అయిన దానిని పొందటానికి అశక్తులమవుతాము. అది ఎలాగంటే, ఒక వరవడి కలిగిన ప్రవాహానికి అనేక కాలువలు ఏర్పాటుచేసి వానిలోనికి దాని ధారాప్రవాహాన్ని మరలించినట్లయితే దాని ఉధృతి, ప్రవాహం బలహీనపడి

పోయినట్లుగానే మన సత్యత్వం వైపు ప్రయాణం కూడా మందగించిపోతుంది. ప్రకృతిధర్మాన్ని అనుసరించి జీవించాలి. సర్వమానవ సౌభ్రాతృత్వం అలవర్చుకోవాలి. దైవానికి ఆత్మ నివేదన చేసుకుని వాని శరణాగతిని పొందాలి. ప్రార్థనతో దైవానికి తనను అర్పించుకుంటూ, ప్రక్షాళనతో ఆత్మశుద్ధి అనగా గత సంస్కారాలను తొలగించుకోవాలి. భక్తి శ్రద్ధలు, విశ్వాసం కలిగి ఉండాలి. ఇటువంటి నియమాలను పాటిస్తూ గృహస్థ జీవితంలోనే గడుపుతూ జీవన్ముక్తిని, భగవదైక్యాన్ని సాధించవచ్చని ఘంటాపథంగా చెప్తూతూ, సిస్టర్ కస్తూరిగారిని తమ ఆధ్యాత్మిక పుత్రికగా స్వీకరించి, భౌతిక ప్రపంచం నుంచి మానవమాత్రలు ఏ విధంగా ఆధ్యాత్మిక స్థితులు పొందుతూ, ఆ దివ్యదేశము అనగా అంతిమం చేరశక్యమో, ఆమెపై ప్రయోగాలు, పరిశోధన చేసి ఈ సహజమార్గాన్ని సాదృశ్యం చేశారు. ఈ పయనంలో విజయం కేవలం ఆమె కొరకే కాకుండా, సమస్త మానవాళికి ఈ అంతిమం యొక్క ద్వారాలు తెరచి ఉంచబడ్డాయని చెప్పారు. ఆ స్థితులు ఏమిటో, వాటిని ఏమంటారో కస్తూరీజీ మరియు బాబూజీల ఉత్తరప్రత్యుత్తరాల ద్వారా మనకు సుబోధకమవుతున్నాయి.

**కస్తూరీ బహెన్‌గారు ఏమి వ్రాసారు?**

నిరంతర స్మరణతో దైవంపట్ల పరిపూర్ణ విశ్వాసంతో ధ్యానంలో మునిగిపోయినట్లయితే ఎటువంటి దివ్య స్థితులు, అనుభూతులు కలుగుతాయో కస్తూరీ బహెన్‌గారి రచనల ద్వారా మనకు తెలుస్తుంది. బాబూజీ కస్తూరీ బహెన్‌జీని తమ ఆధ్యాత్మిక పుత్రికగా స్వీకరించి ఆమెపై ప్రయోగం, పరిశోధన, పరిశీలన ద్వారా ధ్యానంలో ఎటువంటి దివ్య స్థితులు కలుగుతాయో, ఆ దివ్య స్థితులను ఏమని పేర్కొనవచ్చునో తెలియజేసారు. ఇవి కస్తూరీ బహెన్ బాబూజీకి వ్రాసిన ఉత్తరాలు, వాటికి బాబూజీ వ్రాసిన ప్రత్యుత్తరాల ద్వారా సర్వమానవాళికి విశదీకరించబడ్డాయి. అందుకోసం కస్తూరీ బహెన్‌జీని ఈ ఉత్తర ప్రత్యుత్తరాలు అన్నింటినీ భద్రపరచి సమయం వచ్చినప్పుడు పుస్తకరూపంలో ముద్రించి సర్వమానవాళికి సాదృశ్యంచేసి సమర్పితం చేయాలని బాబూజీ ఆదేశించారు. కస్తూరీ బహెన్ ఇంకా అనేక గ్రంథాలు, వ్యాసాలు వ్రాసి ఉన్నప్పటికీ ఈ 'అనంత యాత్ర' ఐదు భాగాల్లో పూర్తిగా ఆధ్యాత్మిక స్థితులు, సహజమార్గంలో ఆధ్యాత్మిక పురోగమనం ఆది నుంచి అంతం వరకు సమగ్రంగా విశ్లేషించారు. ఇది జరగాలన్నదే శ్రీ బాబూజీ సంకల్పం. బాబూజీ ఆజ్ఞను శిరోధార్యంగా ధరించి కస్తూరీ బహెన్ తమ కర్తవ్యాన్ని నెరవేర్చారు. "విపులాచ పృథ్వీ" అన్నారు పెద్దలు. ఈ పృథ్వియే ఎంతో విశాలమైనది. అయినపుడు కస్తూరిగారు తమ అనుభూతికి వచ్చిన అనంతం, సుదీర్ఘమైనది, సువిశాలమైనది, హద్దులు లేనిది అని తెలిపిన దానినిబట్టి దాని వైశాల్యాన్ని మనం ఊహించగలమా! దానిని మన ధ్యాన సాధన ద్వారానే స్వానుభవంతో గ్రహించగలుగుతాం. కస్తూరీగారి అనుభూతులను బట్టి పరమాత్మలో ఐక్యం అయిపోయినట్లుగా అనిపించినప్పటికీ, గమ్యం ఇంకా చాలా దూరం ఉందని బాబూజీ అనేక ఉత్తరాలలో వెల్లడించారు. అయినా కూడా లక్ష్యం సిద్ధించేంతవరకు వెనుకాడేది లేదని కస్తూరీగారు బాబూజీకి తమ దృఢసంకల్పాన్ని తెలిపారు, సాహసించి పురోగమించారు, లక్ష్యప్రాప్తిని సిద్ధింపజేసుకున్నారు. వీటిని (స్థితులను) ఆలంబనగా చేసుకుని మానవమాత్రులమైన మన మందరమూ గమ్యం చేరుకుని బాబూజీ సంకల్పాన్ని సఫలీకృతం చేయటానికి ఉద్యమించుదాం. ఇదే మన

కర్తకవ్యం కూడా.

కస్తూరీ బహెన్ మరియు బాబూజీ మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాల సంపుటాల్లో ప్రథమ సంపుటి యొక్క తెలుగు అనువాదాన్ని అభ్యాసులందరికీ అందజేస్తున్నాం. మిగిలిన సంపుటాల అనువాదం కూడా త్వరలో అందుబాటులోకి రావాలని ఆశిద్దాం. ఈ ముగ్గురి గురించి చాలా క్లుప్తంగా చెప్పబడింది, అందుకు క్షంతవ్యులం.

సమస్త మానవాళిపైన ఆదిగురు మహరాజ్ లాలాజీ, సద్గురు శ్రీ బాబూజీ మరియు పరమసాధ్వి కస్తూరీ బహెన్‌ల ఆశీస్సులు సదా వర్షించుగాక!

ఇట్లు

**సోదర అభ్యాసులు**

# ముందుమాట

"నేను 'వారి'ని చూసాను, చూడగానే ప్రణామం చేయటం మరచిపోయాను. నా నోటి నుండి ఒక్కసారిగా ఈ మాటలు వెలువడ్డాయి – ఓ బాబూజీ! ఇన్ని రోజులుగా నేను 'తమ'రినే వెదుకుతూ ఉన్నాను, 'తమరు' ఈ రోజున కలిశారు" అని. అప్పుడు నేను నా వీనులు (చెవులు)తో విన్నాను, ఒక అమృత వాక్కు– "బిటాయా! నేను కూడా నిన్ను వెదుకుతూ ఉండిపోయాను. ఈ రోజున నీవు నాకు కలిశావు" అని.

పూజ్య శ్రీ బాబూజీగారితో భక్తురాలైన సోదరి 'కస్తూరీ' ప్రథమ కలయిక సందర్భం ఇది. సర్వత్రా శిష్యుడే గురువును సమీపించటం సహజం, కాని అప్పుడప్పుడు గురువే తన విశిష్టమైన శిష్యుని ద్వారం వద్దకు సమీపించటం అరుదుగా సంభవిస్తుంది. సోదరి కస్తూరీ విషయంలో కూడా ఇలాగే జరిగింది. దీనినిబట్టి సోదరీ కస్తూరీ, పూజ్య శ్రీ బాబూజీకి అత్యంత ప్రియమైన శిష్యురాలుగా నిరూపితమైంది.

బ్రహ్మవిద్య యొక్క శిక్షణ ప్రారంభమై దానితోపాటుగానే ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయి. సోదరి కస్తూరీ ప్రథమ లేఖ, 3 మే 1948వ తదీన వ్రాయబడింది. అది శ్రీ బాబూజీకి సమర్పితంకాగానే దానికి సమాధానం 15 జూలై 1958న శ్రీ బాబూజీ మహరాజ్ సోదరి కస్తూరీకి వ్రాసారు. ఇంక అప్పటి నుండి ఇద్దరి మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు వరుసగా 1970 సంవత్సరం చివరి వరకు నిరంతరాయంగా కొనసాగాయి.

కస్తూరీ బహెన్ తమ ఉత్తరాలలో 'సహజమార్గ' పద్ధతి ద్వారా, బ్రహ్మవిద్య ప్రశిక్షణ ద్వారా పొందిన తమ అనుభూతులను ఉన్నది ఉన్నట్లుగా మాటల రూపంలో చిత్రీకరించారు. ఆమె ఏరోజుకు ఆరోజు కలిగినటువంటి స్థితిని, ఎంత విశిష్టంగా వర్ణీకరించారంటే అది సజీవంగాను, హృదయానికి హత్తుకునేటట్లు గాను ఉంది. ఆధ్యాత్మిక విద్య అభ్యాసంలో అడుగడుగునా కలిగిన స్థితుల వర్ణనను ఈ విధంగా చిత్రీకరించటం ఇంకెక్కడా జరగలేదు. ఆరంభం నుండి అంతం యొక్క అంతం వరకు కలిగిన అనుభూతుల సమర్పణ ఈ ఉత్తరాలలో ప్రతిబింబిస్తుంది.

పూజ్య శ్రీ బాబూజీ, కస్తూరీ బహెన్‌కి వ్రాయబడిన తమ లేఖలలో కేవలం ఆమె ఉత్తరాలకు తమ సమాధానం మరియు ఆమె యొక్క ఆధ్యాత్మిక దశల స్థాయిని పెంచుతూ వాటిని గ్రహించగల మార్గ దర్శనం చేయటమే కాకుండా, బ్రహ్మవిద్య యొక్క సంపూర్ణ భాండాగారాన్నే తెరచిపెట్టారు. అది కేవలం కస్తూరీ బహెన్ యొక్క ప్రయోజనం కొరకు మాత్రమే కాకుండా, సంపూర్ణ మానవజాతి కొరకు, యావత్తు సృష్టి కొరకు ఒక విశిష్ట సందేశంగా నిలిచిపోయింది. దీనికి చెందిన అనేక విషయాలు, నిగూఢమైన రహస్యాలు అలాగే వాటి మూలాలు ఏవైతే శ్రీ బాబూజీ తమ పుస్తకాలు (రచనలు) మరియు ఇతరత్రా వాటిల్లో వ్రాసి ఉండలేదో, వాటిని కస్తూరి బెహెన్‌కి వ్రాయబడిన తమ లేఖలలో పరిపూర్ణంగా వివరించి ఉన్నారు. శ్రీ బాబూజీ ఉత్తరాలలో ముఖ్యభాగం, సమస్త మానవజాతికి మరియు విశ్వకళ్యాణం నిమిత్తం వ్రాయబడ్డాయి.

అందుకు తగ్గట్లుగానే 'శ్రీ బాబూజీ' తమ లేఖ ఆగష్టు 18, 1954కు చెందిన దానిలో -"నేను నీ ప్రతి ఉత్తరానికి జవాబు వ్రాయాలని ఎందుకు అనుకుంటున్నాను అంటే, నీ ఉత్తరాలు వాటికి నా జవాబులు అన్నింటినీ ముద్రింపజేయాలని తలుస్తున్నాను. వీటి ద్వారా సమస్త జనులకు ప్రయోజనం చేకూరగలదు" అని వ్రాసారు.

ఇంతేగాకుండా, 2 మార్చి 1953వ తారీఖు ఉత్తరంలో, శ్రీ బాబూజీ, శ్రీ స్వామి వివేకానంద యొక్క ఒక ఆదేశాన్ని కూడా ప్రస్తావించారు-"ఇది అందరికి సంబంధించిన ఉత్తరం. దీని నకలును భద్రపరచి సమయం వచ్చినప్పుడు ప్రచురించాలి" అని.

ఇది మాత్రమే కాకుండా, తమ అనేక ఇతర ఉత్తరాలలో కూడా పూజ్య శ్రీ బాబూజీ, కస్తూరీ బహెన్‌కి, ఈ ఉత్తరాల నన్నింటిని  భద్రపరచి, సమయం వచ్చినప్పుడు పుస్తకరూపంలో ప్రచురింపజేయాలని నిర్దేశించారు.

పూజ్య శ్రీ బాబూజీ మరియు శ్రీ వివేకానందుల ఆ కోర్కె, ఆ ఉత్తరాలు ప్రచురించబడాలి అనునది నెరవేరటానికి బహుశా సమయ మాసన్నమైనది అని భావించాలి. ఈ కార్యం సఫలం కావటానికి కూడా వారి కృపయే కారణం.

వందనీయురాలైన కస్తూరీ బహెన్, మన మీద, సమస్త మానవజాతిపట్ల అపార దయతో, ఈ ఉత్తరాలన్నింటినీ స్వయంగా నకళ్ళను తమ స్వదస్తూరితో వ్రాసి ఉంచటం ద్వారాను, కొన్నింటిని యధాప్రకారం మూలరూపంలో భద్రపరచటంలోను, గత నలభై సంవత్సరాలుగా, వాటిని శ్రీ బాబూజీ యొక్క అమూల్యమైన నిధిగా భావించి కృషి సలిపినందుకు ఆమెకు మనం కృతజ్ఞులమై ఉండి ధన్యవాదాలు అర్పించటానికి మనకు తగిన మాటలు లేవు. లోక కళ్యాణార్థం బహెన్‌జీ చేసిన ఈ మేలు ఎన్నటికైన మరువగలమా? ఆధ్యాత్మిక ప్రపంచంలో ఇటువంటి ఉదాహరణ ఎక్కడైనా లభించగలదా?

ఈ ఉత్తరాలనన్నింటినీ ఒకే పుస్తకంలో ముద్రించటం అశక్యమైనందున, వీటిని కొన్ని భాగాలుగా విభజించి ముద్రించటం జరుగుతోంది.

దీనికిపూర్వం ఈ లేఖలు 'సహజమార్గం' పత్రికల్లో సంవత్సరాల తరబడి ధారావాహికంగా ప్రచురించబడుతూ ఉండేవి. వీటిలో కొన్ని మాత్రమే ఎంపిక చేయబడినవి ప్రచురితమయ్యాయి కాని, అన్నీ పూర్తిగా ప్రచరించబడలేదు. 'సహజమార్గం' పత్రికల్లో ఈ లేఖలు 'అనంత యాత్ర' శీర్షికన ప్రచురించబడుతూ ఉండేవి. వీటికి శ్రీ బాబూజీయే ఆ విధంగా నామకరణం చేశారు. ఆ కారణంగా ఈ లేఖల సంకలనానికి కూడా అదే పేరు **"అనంత యాత్ర"** అని పేరు పెట్టడం జరిగింది. వాటిలో ప్రథమ భాగం తమ స్వహస్తాల నలంకరించి ఉంది.

ఆధ్యాత్మిక అభిలాషాపరులైన సోదర సోదరీమణులందరూ ఈ 'అనంత యాత్ర'ను చదివి బ్రహ్మవిద్యకు చెందిన ప్రయోజనాలను అర్థం చేసుకుంటారని, ఈ 'అనంత యాత్ర' మార్గంలో పయనించి లక్ష్యం సాధించటంలోను మరియు 'మాలిక్' (పరమాత్మ)లో లయం కావటంలోను తప్పక సఫలీకృతులై జీవితాన్ని సార్థకం చేసుకొనగలరని విశ్వసిస్తున్నాను.

ధన్యవాదములతో,

ఎస్. ఎమ్. ప్రసాద్

అభ్యాసీ, లక్నో కేంద్రం.

**30 ఏప్రియల్ 1992**

**ఇవి లేఖలు కావు, సోపానాలు**
**బిందువుతో సాగర సంగమం**
**'సహజమార్గం'లో అనుభూతులకు**
**మాటల రూపంలో ఇది చిత్రీకరణం.**

**– ఫక్కర్.**

# అనంత యాత్ర ప్రథమ భాగం
## ఉత్తరం సంఖ్య - 1

లఖీంపుర్,

03.05.1948

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

నా వినమ్ర ప్రణామం. ఈ రోజు నా తండ్రిగారి సూచన ప్రకారం తమకు లేఖ వ్రాయటానికి సాహసిస్తున్నాను. దయతో స్వీకరించండి. నా శారీరిక స్థితి చాలావరకు బాగుంది. ఈ దీనురాలు, సాధన విహీనురాలైన కస్తూరి యొక్క ఆధ్యాత్మిక ఉన్నతి కొరకు తమరు దయతో దృష్టి నిలపండి. తమరు చెప్పిన ధ్యానాన్ని కొంతవరకు ఆచరిస్తున్నాను. మాస్టర్ సాహెబ్ కూడా రెండు రోజులకు ఒకసారి, అప్పుడప్పుడు రోజూ సిట్టింగ్ ఇచ్చి పరమ సుఖాన్ని, శాంతిని ప్రసాదిస్తున్నారు. నేను ప్రస్తుతం దైనందిని (డైరీ)ని వ్రాస్తున్నాను. దయతో దీనిలోని లోపాలను సవరించవలసిందిగా అర్థిస్తున్నాను. నాలో చాలా దోషాలు ఉన్నప్పటికీ తమ యొక్క దర్శనంతో ఆ దోషాలు నాకు మేలు చేకూర్చుతాయి.

ఇటీవల ఉదయం లేవగానే స్వామి వివేకానందకు నమస్కరిస్తున్నాను, తర్వాత తమకు ప్రణామాలు ఆచరిస్తున్నాను. మాస్టర్ సాహెబ్ ఆదేశానుసారంగా నా యొక్క అనవసరమైన ఆలోచనలన్నీ తొలగించుకుంటున్నాను. ప్రాణులందరి యందు ప్రియమైన ఈశ్వరుడు నెలకొని ఉన్నాడు అని గ్రహించి, తమరు తెలిపిన ధ్యాన సాధన చేస్తున్నాను. ఆ తరువాత పగలంతా కూడా అవకాశం ఉన్నంతవరకు, ఆ పరమప్రియుడైన ఈశ్వరుని స్మరించుకుంటున్నాను. నాది ఏమీ కాకుండా తమరే కర్తగా భావించి, "అంతా బాబూజీనే చేస్తున్నారు" అని భావించుకుంటూ నేను కర్మల నాచరిస్తున్నాను. ఈశ్వరుని అత్యంత పవిత్రమైన 'ఓం'కారాన్ని మనస్సులో జపించుకుంటూ దానిలోనే లీనమై ఉండటానికి ప్రయత్నిస్తున్నాను. నేను దానిలో పూర్తిగా నిమగ్నపోయేటట్లుగా తమరు ఆశీర్వదించండి. ప్రస్తుతం సిట్టింగ్ తీసుకుంటున్న సమయంలోను, అప్పుడప్పుడు ధ్యానం చేస్తున్నప్పుడు కూడా పరమ పవిత్ర 'ఓం'కార నాదం స్పష్టంగా, పెద్దగా వినబడుతోంది. అప్పుడప్పుడు కొన్ని రోజులు స్వప్నంలాగా గడచిపోతున్నాయి. నేను ఏమి చేశానో, ఏమి చేయాలో కూడా తెలియకుండా ఉంటోంది. అయితే బాబూజీ, నేను నా పరమ దయాళువుడైన ఈశ్వరుణ్ని ఒక్క క్షణమైనా  మరువకుండా ఉండునట్లుగాను, ఒక్క క్షణమైనా 'అతని' జ్ఞాపకం తొలగిపోకుండా ఉండునట్లుగాను, స్వయంగా నన్ను నేను మరిచిపోయి సదా, జగమంతా 'అతని'నే చూడగలుగునట్లుగాను, తమరు ఈ దీనురాలు కస్తూరిని ఆశీర్వదించమని వేడుకుంటున్నాను. భిక్షకుడు ఎలా ఉండాలో పూజ్యులైన మా తండ్రిగారికి జ్ఞానాన్ని ప్రసాదించి ఆశీర్వదించండి. భగవంతుడు కూడా తన కృపతో నన్ను అటువంటి భిక్షకురాలి (దీనురాలు)గా తయారుచేయాలి. రోజులో అప్పుడప్పుడు నా వ్యక్తిత్వం కూడా వ్యక్తమవుతూ ఉంటుంది. అది ఎందుకో తెలియదు. నాలో లెక్కలేనన్ని అనవసరమైన ఆలోచనలు కలుగుతున్నాయి. ఈశ్వర కృపతోను, తమ ఆశీర్వాదం మరియు సహాయంతోను అవన్నీ దగ్ధమైపోతాయి.

తమ పుత్రిక,

కస్తూరీ.

# ఉత్తరం సంఖ్య - 2

లఖీంపుర్,

12.07.1948

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

నా వినమ్ర ప్రణామం. తమరు దయతో వ్రాసిన ఉత్తరం నిన్న చేరింది. తమరు నన్ను ఏదైతే చేయమని చెప్పారో దానిని చేయనారంభించాను. నేను ఇంతకుముందే తమకు నా స్థితి గురించి వివరించాను. అది ఎలా ఉందంటే, కనీసం 3, 4 రోజుల నుండి నేను ఏమి చేసానో, ఏమి చేస్తున్నానో, ఏమి చేయాలో కూడా నాకు తెలియకుండా ఉంది. తమ ఆశీర్వాదంతోను, ఈశ్వర కృపవల్లను ఈ దశ నిలకడగా ఉండిపోయింది. అప్పుడప్పుడు నాకు ఒకటి రెండు రోజులుగా కోపం వస్తూ ఉంది. బహుశా ఇది శారీరిక, మానసిక బలహీనతవలన అయి ఉండవచ్చు. కాని ఏదైనా చేయబోయేముందు, 'మాలిక్' దయతో నాకు అనుగ్రహించినట్లుగాను, 'మాలిక్' స్వయంగా తానే ఆ పని చేస్తున్నట్లుగాను మనసులో భావన కలుగుతుంది. ఆ తర్వాత ఎలా, ఏమి జరిగిందో నాకు తెలియదు.

పది రోజుల నుండి నడుస్తూ ఉన్నప్పుడు, కన్నులు మూసుకొన్నప్పుడు, మాట్లాడుతున్నప్పుడు కళ్ళెదుట తరచుగా ప్రకాశం కనిపిస్తోంది. అది ఒకప్పుడు కొంచెంగాను, మరొకప్పుడు ఎక్కువగాను ఉంటున్నది. ఇది కూడా నా ప్రాణప్రియుడు, నా జీవన సౌభాగ్యం అయిన ఈశ్వరుని కృపయే. పూజ్య బాబూజీ! ప్రియతముడైన 'మాలిక్' యొక్క అనుగ్రహం పొందటం, అదే విధంగా 'అతని'ని పొందటమే నా జీవిత ముఖ్యలక్ష్యంగా ఉండాలనుకుంటాను. తమరు నన్ను ఆ విధంగా ఆశీర్వదించి, కటాక్షించి అనుగ్రహించండి. ఎల్లప్పుడూ సర్వత్ర, అందరిలోను నా ఈశ్వరునినే దర్శించుకుంటూ, జన్మ జన్మాంతరాల నుండి పేరుకుపోయిన నా 'అహం' యొక్క సంస్కారాల నుండి విముక్తమైన జీవితం గడపాలని ఉంది. ఆ తర్వాత 'మాలిక్' ఇచ్ఛ (దైవేచ్ఛ) ఎలా ఉంటే అలా జరుగుతుంది. పూజ్యులైన తండ్రిగారి ఆశీస్సులు సదా నన్నంటి ఉండే విధంగా నన్ను తమరు తమ కృపను నాకు అండగా నిలపండి. అప్పుడు ఇంక నా జీవిత నౌక ఖచ్చితంగా గమ్యం చేరిపోతుంది. పూజ్య మాస్టర్ సాహెబ్ కూడా సిట్టింగ్ ఇస్తూనే ఉన్నారు. వారు మళ్ళీ వచ్చినపుడు, వారి నుండి సిట్టింగ్ తీసుకుంటాను.

తమ విధేయురాలు, దీనురాలైన

కుమార్తె –కస్తూరీ

# ఉత్తరం సంఖ్య - 3

షాజహాన్‌పుర్,

15.07.1948

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

ఆశీస్సులు. నీ ఉత్తరం చేరింది. అది చదివిన తరువాత నా హృదయం ఎంతగానో సంతోషించింది. నీవు ఏ మార్గములో ఉన్నావో, నీవు తెలుసుకొని ఉంటావు. అది సరైనదే. భగవంతునికి రూపం (ఆకారం) ఏమీ లేదు. అందుకే 'అతడి'ని సర్వవ్యాపుడని అంటారు. ఒకవేళ 'అతని'కి రూపం అనేది ఉన్నట్లయితే ఆయన ఒకేచోట ఉండేవాడు. మనం మన దృష్టిని విశాలంగా చేసుకుంటూపోవాలి. సంకుచిత దృష్టి మనస్సును పరిమితం చేస్తుంది. మనలో కొంతమంది ఎలాంటివారు ఉన్నారంటే, జీవితాంతం స్థూలమైన పూజలను వదలరు. అటువంటి పరిస్థితులలో చేయవలసింది ఏమిటంటే, వారిని స్థూల అవస్థల నుంచి, స్థూల పూజలలోకి దింపి క్రమక్రమంగా వారిని బయటకు లాగి, సూక్ష్మత్వమువైపు మళ్ళించాలి. కాని మనమంతా స్థూలరూపంలో ఉన్న కారణంగా వారిని స్థూలత్వం అవలంబించేటట్లు చేస్తే ఈ దారి స్థూలమైందని తెలిసినా కూడా ఈ స్థూలత్వం (విగ్రహారాధన) నుంచి బయటకు రావటానికి మనస్సు అంగీకరించదు. ఒకవేళ నేను ఈ విషయాలు ఎవరికైనా చెబితే వారు ఏమని అనుకుంటారంటే, నేను విగ్రహపూజకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నానని అనుకుంటారు. నా ఉద్దేశ్యం అది (విమర్శించటం) కాదు. కేవలం స్థూలత్వమునే పట్టుకుని వ్రేలాడేవారిని గురించి నేనిలా చెప్పుతున్నాను. అదే విధానాన్ని పట్టుకుని ఉన్నప్పుడు ఏమౌతుందంటే, ఆ స్థూల పూజల ప్రభావం హృదయంలోపల స్థూలత్వానికి స్థావరమిస్తుంది. దీనిని పోగొట్టాలంటే చాలా సమయం పడుతుంది.

విగ్రహపూజను నేను కూడా చేసాను. అది కొన్ని రోజులు మాత్రమే. కాని నాకు దాని మీద నమ్మకం కుదరక అసలైన పరమలక్ష్యం పొందటానికి ఇది నిరర్ధకమని తెలుసుకున్న వెంటనే వదలివేసాను. విగ్రహారాధననే పట్టుకుని, 'నాకు దీని మీదనే విశ్వాసం ఉంది' అనేవాళ్ళకు, అంటే దానిని వదలటానికి తయారుగా లేనివాళ్ళకు, ధ్యానం లేదా సరైన మార్గం మీద విశ్వాసం ఉంటుందని ఎలా చెప్పగలం? ఎంతోకాలం నుంచి మన దేశములో వీరుల పూజలు జరుగుతున్నాయి. వారినే పూజిస్తూ వస్తున్న ఫలితంగా విగ్రహస్థాపనలు జరుగుతూ వస్తున్నాయి. నేను విగ్రహపూజ చేస్తూ ఉన్నట్లయితే, ఇంతకంటే మంచి మార్గం నాకు దొరికి, ఆ సరైన మార్గంలో తీసుకొని వెళ్ళే శిక్షకుడు దొరికి, నన్ను ఈ విగ్రహారాధన వదలమంటే, బహుశా నేను దీనినేమిటి, నన్ను నేను పోగొట్టుకోవటానికి కూడా సిద్ధంగా ఉంటాను.

మన సహజమార్గంలో దుర్గుణాలు వదిలిపోతాయి. మంచి అనే దానివైపు కూడా ఆకర్షణ ఉండకుండా, అన్ని కర్మబంధనాల నుంచి కూడా మనకు విముక్తి దొరుకుతుంది. చౌబేజీకి (కస్తూరీ బహన్ తండ్రిగారు) భయపడి ఈ విషయం వ్రాయలేదు. కాని నీకు వ్రాస్తున్నాను. బహుశా ఇది దైవేచ్ఛయే. నీవు ఎంతో ఉన్నతంగా ఆధ్యాత్మిక అభివృద్ధి పొందటానికై ఉంటుంది. నువ్వు ఏ ప్రకాశమైతే అప్పుడప్పుడు కనిపిస్తోందని వ్రాశావో, అది, ఆత్మ యొక్క ప్రతిబింబం; ఆధ్యాత్మిక ఉన్నతికి చిహ్నం. కాని ఆధ్యాత్మిక ఉన్నతి కొరకు ప్రతి ఒక్కరికి ఇది కనిపించితీరాలనే అవసరం లేదు. ఇదంతా వాళ్ళ వాళ్ళ సంస్కారాలు, ప్రకృతి మీద ఆధారపడి ఉంటుంది. భౌతికమైనవేకాక, ఆలోచనల ఆవరణ కూడా లేని, అంటే అన్నిటికంటే అతీతుడైన, అసలు భగవంతుని మాత్రమే ప్రేమించటానికి నీవు ఇష్టపడుతున్నట్లుగా నేను గ్రహించాను. నీ ఉత్తరంలో వ్రాసిన మిగతా కండిషన్‌లు (స్థితులు) చాలా మంచివి. వీటిని గురించి కొద్ది రోజుల తర్వాత నీకు ఉత్తరంలో వ్రాస్తాను.

నేను మీ తల్లిగారికి చెబుతున్నది, ఆమె తిరిగి వెళ్ళేటప్పుడు చెప్పింది కూడా ఏమిటంటే, మీ తండ్రిగారిలో మార్పు ఆమె చేతుల్లో ఉంది. స్త్రీ మొదట తాను ఆచరిస్తూ, భార్యగా మంచి పనులలో తన భర్తకు ఆమె సహాయపడాలి. బిటియా! ఇటువంటి సమయం మళ్ళీ మళ్ళీ రాదు. బహుశా కొంతమంది మాత్రమే దీనిని అర్థంచేసుకోగలరు.

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 4

లఖీంపుర్,

18.07.1948

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

నా వినమ్ర ప్రణామం. తమ ఉత్తరం అందింది. ఈ విధానం మంచిదని నాకు అవగాహనకు రావల్సిందని తమరు వ్రాశారు. అయితే నాకు ఈ మార్గం చాలా సరళమైనదిగాను, శీఘ్రంగా ఉన్నతి కల్పించేదిగాను ఉంటుందని గట్టి విశ్వాసం ఉంది. ఈ విశ్వాసం, భక్తి కూడా తండ్రిగారివల్లనూ, మాస్టర్ సాహెబ్‌గారి 'సిట్టింగ్' ద్వారాను ఏర్పడ్డాయి. నా పూజ్యులైన తండ్రిగారు ఎక్కడినుంచి అయినా తమకు అందిన విషయాలు మంచివి అని తలపించినప్పుడు వాటిని మాకందరికి తెలియజేసి, వాటిని ప్రశంసిస్తూ, వాటిపట్ల మాకు భక్తి విశ్వాసాలు కల్పించేవారు. వారు (కస్తూరీగారి తండ్రిగారు) తమ శ్రేయస్సుతోపాటు మా అందరి శ్రేయస్సును కాంక్షిస్తూ అందుకు ప్రయత్నిస్తున్నారు. వాస్తవానికి అన్నింటికీ కర్త ఆ 'మాలిక్'యే (దైవమే), 'అతని' ప్రేరణతోనే అన్నీ జరుగుతూ ఉంటాయి. 'అతని' దయ ఉంటే, 'అహం' మరియు 'మమకారము'లలో చిక్కుకుపోయిన ఈ కస్తూరీకి బంధానాల నుంచి విముక్తి కలిగి ఆత్మోన్నతిని పొందుతుంది. నాలో ఏమాత్రం లేనటువంటి శ్రమ, శక్తి, బుద్ధి బలం యొక్క అవుసరం లేనటువంటి ఈ విధానం నాకు చాలా మంచిది.

ప్రకాశం అప్పుడప్పుడు కనిపిస్తుంది కాని ఆనందంగా ఉంటున్నది. కేసర్ తమకు ప్రణామం తెలుపుతున్నది. తమరు చెప్పిన విధంగా ధ్యానం చేస్తున్నట్లు కూడా తెలియజేస్తోంది. అయితే స్థితి మాత్రం పూర్వంలాగానే ఉంది కాని, ఏమీ తేడా కనిపించలేదు.

తమ విధేయురాలు, దీనురాలైన

కుమార్తె -కస్తూరీ

## ఉత్తరము సంఖ్య - 5

షాజహాన్‌పుర్,

24.07.1948

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. నీ ఉత్తరం అంది, నీ ఆధ్యాత్మిక స్థితి గురించి తెలిసింది. ఇంతకుముందు వ్రాసినట్లుగానే, ప్రకాశం కొంతమందికి కనపడవచ్చు, కొందరికి కనపడదు. కాని అభివృద్ధి విషయంలో దీని మూలంగా తేడా ఉండదు. మరల నేను వ్రాసేది ఏమిటంటే, మంచి పద్ధతి దొరికినప్పుడు, దాని నియమానుసారంగా ఆ మార్గాన్నే అనుసరించి మనం ముందుకు సాగిపోవాలి. మీ తండ్రిగారు నిస్సందేహంగా మీ అందరి ఉన్నతి కోరుతున్నారు. నీవు కూడా వారు ఈ మార్గంలో చక్కగా ఉన్నతి చెందాలని, వారి ఉన్నతికి కలిగే ఆటంకాలు తొలగిపోవాలని ప్రార్థన చేయి. ఒక కవి ఎంత చక్కగా చెప్పారో కదా! – **"ఏకహి సాధే సబ్ సధై, సబ్ సాధే సబ్ జాయే"** అంటే, ఒకటి సాధించితే అన్నీ సాధించినట్లే. అన్నీ సాధించదలచు కుంటే, ఏదీ దొరకదు (అంటే ఒక్క మార్గాన్నే అనుసరించాలిగాని వేర్వేరు మార్గాలు అనుసరిస్తే ఏదీ దొరకదు). ఇది చాల మంచి విషయం. మీరందరూ దీనిని అమలుపరచాలి.

ప్రపంచం ఎలా మారిపోయిందంటే, అనేక పూజలు, పద్ధతులు, వారి వారి ఇఛ్ఛాను సారము (చెప్పేవారి స్వలాభం కొరకు) నియమాలు ఇవ్వబడ్డాయి. హృదయం ఒకే ఒక లక్ష్యంవైపు కాకుండా అనేకమువైపు మళ్ళింది. అనేక ఆలోచనా ధారలు కలిగి, అవి తమ తమ దేవతల చుట్టూ తిరగటం ప్రారంభించాయి (వాటికే పరిమితమైపోయాయి). ఫౌంటెన్‌లో నీరు వేలాది ధారలతో ప్రవహిస్తున్నట్లుగా పరిస్థితి తయారయ్యింది. ఏకాగ్రత క్షీణిస్తూ పోతోంది. అసలు (మూలం) నుంచి దూరమౌతూ ఉన్నాం. ఇప్పుడు, చెప్పినా కూడా వినలేని పరిస్థితి తయారయ్యింది. దీనికంతటికీ ఒకే ఒక చికిత్స – అదేమంటే, ఈశ్వరప్రాప్తి మాత్రమే మన ఉద్దేశ్యంగా ఉండాలి. **వేలాది సంవత్సరాల నుంచి ప్రపంచంలో ఉంటూ, ఇంకా ఎన్నో లక్షలాది సంవత్సరాలు ఇక్కడే ఉండాలనుకొంటున్నాము. అటువంటప్పుడు మనమంతా ఎక్కడి నుంచి వచ్చామో అక్కడికి చేరే పద్ధతిని గ్రహించి ముమ్మందు లక్షలాది సంవత్సరాలను ఆదా చేసుకోవచ్చు కదా!**

నీ శ్రేయోభిలాషి,
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 6

లఖీంపుర్,
28.08.1948

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

నా వినమ్ర ప్రణామం. నేను చాలా రోజులుగా ఉత్తరం వ్రాయలేకపోయినందుకు నన్ను దయతో క్షమించమని వేడుకుంటున్నాను. చాలా రోజులుగా నేను నా దశను సరిగా తెలుసుకోలేకపోతున్నాను. ఇప్పటికీ నాకు బోధపడటంలేదు. మొదట కొద్దిరోజులు దినమంతటిలోను ఒకటి, రెండు గంటలు ఆ సర్వేశ్వరుణ్ని మరచిపోవటం, మళ్ళీ జ్ఞాపకం రావటంతోనే చాలా వ్యాకులపడటం జరుగుతూ ఉండేది. ఆ తరువాత నాకు ఏ పని చేయటానికి కూడా ఇష్టం ఉండేదికాదు. పూజ్య శ్రీ బాబూజీ! నేను ఈ ప్రపంచంలో అన్నింటికంటే అధికంగా నా ఈశ్వరుణ్నే ప్రేమించాలనుకుంటూ, ఆ విధంగానే ప్రయత్నిస్తున్నాను కూడ. నా ఆరాధ్య దైవమైన జగదీశ్వరుని స్మరణలోనే సదా లయమై ఉండటంతప్ప ఈ ముల్లోకాల్లోను నాకు ఇంకా కావలసింది ఏమీ లేదు. ఆ ప్రబలమైన కోర్కెను సాధించుకోవటం కొరకే నేను పరిపూర్ణంగా ప్రయత్నిస్తున్నాను. నేను ఏ 'మాలిక్'కు అర్పితమైపోయానో 'అతని'కే నా ఈ కోరికను కూడా అర్పణ కావిస్తున్నాను. ఆ విధంగా రోజంతా 'అతని'నే స్మరించటం మూలంగా ఆ దశ తొలగిపోతూ ఉంది. కాని ఆ దశ తొలగిపోయినప్పటి నుండి పది, పన్నెండు రోజులుగా హృదయం చాలా భారంగా ఉంటూ, సిట్టింగ్ తీసుకునేప్పుడు కూడా మనస్సు లగ్నం కావటంలేదు. కాని నావంటి అల్పురాలికి, సాధన విహీనురాలికి నిన్నటి నుండి నా ప్రియతమ ఈశ్వరుడు దయతో నాకు కల్పించిన దశ మూలంగా, మీరు నిర్దేశించిన సాధన ద్వారాను, ఆ మాలిక్ దయతోను నాకు అత్యంత ప్రీతిపాత్రుడైన ఆ ఈశ్వరుణ్ని పొందగలను అను సంపూర్ణ విశ్వాసం నాకు కలిగింది.

నిన్న హృదయంలో చాలా భారంగా అనిపించింది కాని దానిలో కలిగిన అత్యంతానందంలో నేను పూర్తిగా తన్మయమైపోయి దానిలోనే విహరించాను. ఈరోజు షుమారు మూడు గంటల సమయం నుండి నాలో ఉదయించిన ప్రేమాతిరేకంవలన కాళ్ళు భారంగా అయిపోతున్నాయి. అవి ఒక్కసారిగా నడవటానికి, పండుకోవటానికి కూడా స్వాధీనంలో లేనంతగా అయిపోయాయి. పూజ్య శ్రీ బాబూజీ! ఇదంతా ఆ 'మాలిక్' యొక్క కృపవల్లనే. నేను ఇటువంటి ఆనందంలోనే మునిగి ఉండునట్లుగా చేయమని నేను తమరిని ప్రార్థిస్తూ ఉన్నాను. ఈ దీనురాలికి ఆనందం ప్రసాదించునట్లుగా అప్పుడప్పుడు ఆ 'మాలిక్'కు నాయందు దయ ఉంచి తమరు జ్ఞాపకం చేయండి. పూజ్యులైన తండ్రిగారు ఆనందంలో మునిగిపోయి ఆ 'మాలిక్'లోనే రమించి ఉంటున్నారు. ఆ సర్వశక్తిమంతుడైన ఈశ్వరుడు వారిని కూడా గుర్తించునట్లుగా చేయుటకు తమరు దయ చూపవలసిందిగా వేడుకుంటున్నాను. ఇక్కడ

అంతా బాగానే ఉంది. సిట్టింగ్‌లు తీసుకుంటున్నప్పటికీ దశ మారుతున్నట్లుగా తెలియటంలేదని కేసర్ చెప్తున్నది. నా శిరస్సుపై తమ ఆశీస్సులు సదా నిలిచి ఉండేటట్లుగా చేయండి. పూజ్య మాస్టర్ సాహెబ్ నిన్న సిట్టింగ్ ఇచ్చారు.

తమ విధేయురాలు, దీనురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 7

లఖీంపుర్,

10.09.1948

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

నా వినమ్ర ప్రణామం. నా ఉత్తరం మీకు అందే ఉంటుందని అనుకుంటున్నాను. తమరు పూజ్యులు మాస్టర్ సాహెబ్‌కు వ్రాసిన ఉత్తరంలో దానికి సమాధానం వ్రాశారని వారు నాకు చెప్పారు. తమరు నా ఉత్తరాలకు జవాబు వ్రాయటానికి శ్రమపడకుండా, తమ పవిత్ర సంకల్పంతో నన్ను ఉద్ధరించటానికి దయ చూపండి. నేను తమకు వ్రాసిన స్థితి ఎటువంటిదంటే, పరమ దయాళువుడైన ఈశ్వరుడు నావంటి దీనురాలికి ప్రేమతో ఒక గొప్ప స్థితిని అనుగ్రహించాడు. ఆ ప్రేమ పట్టలేనంతగా ఉండి, అప్పుడప్పుడు పండుకొని దొర్లుతూ ఉండేదానిని కూడా. అప్పుడు నన్ను నేను నియంత్రించుకోవలసి వచ్చేది. అయితే ఇప్పుడు మూడు, నాలుగు రోజుల నుండి హృదయం పూర్తిగా ఖాళీగా ఉన్నట్లు అనిపిస్తోంది. మాస్టర్ సాహెబ్ సిట్టింగ్‌లు ఇస్తున్న తర్వాత ఇప్పుడు కూడా ఒకటి, రెండు రోజులు మళ్ళీ ఆ ప్రేమ పల్లవి అనుభవమవుతూ ఉంది. ప్రాణప్రియమైన ఈశ్వరుని ప్రేమతో శరీరమంతా నిండిపోయింది. కాని అది ఇంతకుపూర్వం ఉన్న స్థితి వంటిది కాదు. అది పూర్తిగా మరపుస్థితిలో ఉన్నట్లుగా ఉంటున్నాను. హృదయం పూర్తిగా శూన్యంగా అనిపిస్తోంది. పూజ్య శ్రీ బాబూజీ! నేను ఎటువంటి సాధన (ధ్యానం) చేయలేకపోతున్నాను. నా మనస్సు ఎంత మలినంగా ఉందంటే, అది తమకు, మాస్టర్ సాహెబ్‌కు తెలియనిది కాదు. కాని ప్రయత్నం మాత్రం తప్పకుండా చేస్తూనే ఉన్నాను. అయితే, ఆ కరుణామయుడైన 'మాలిక్' (దైవం)ను ఒక క్షణం కూడా, మేల్కొని ఉన్నా, నిద్రపోతూ ఉన్నాగానీ నేను మరువకుండా ఉండాలి అని, ఆ 'మాలిక్'కు, తమరికి కూడా విన్నవించుకుంటున్నాను. నేను 'అతడి'ని ఎన్నటికీ మరువను. పూజ్య శ్రీ బాబూజీ! నేనయితే దరిద్రురాలునే కాని నా దైవమే నా "పరశుమణి" (అనగా చింతామణి) అనగా నా భాగ్యం. ఆ దైవానికి నేను నివేదించుకుంటున్నది ఏమిటంటే, అంతకుమించి నాకు కోరిక మరేదీ లేదు. తమ ఆశీస్సు ఫలితంగా, ఈ శరీరంతో ఎంత తక్కువగా సాధన చేయబడుతున్నప్పటికీ, దానివలన అంచెలంచెలుగా (మూడు పూవులు, ఆరు కాయలుగా) నాకు ఆత్మోన్నతి కలగాలనుకుంటున్నాను.

తల్లిగారు, కేసర్, తదితరులందరూ మీరు నిర్దేశించిన విధంగా సాధన చేస్తున్నారు.

తమ విధేయురాలు, దీనురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 8

దీవన్ జోగ్‌రాజ్, షాజహాన్‌పుర్,

14/17.09.1948

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

నువ్వు సుఖంగా ఉండాలని కోరుకుంటున్నాను. నీ ఉత్తరం అందింది. వ్రాయటానికి ఎవరూ దొరకని కారణంగా శీఘ్రంగా జవాబు వ్రాయలేక పోయాను. చాలా ఉత్తరాలు వచ్చాయి. అన్నింటికి ఇప్పుడు జవాబులు ఇస్తున్నాను.

నీ ఆధ్యాత్మిక దశ గురించి తెలిసిన తరువాత నాకు ఇప్పుడు చాలా సంతోషంగా ఉంది. భగవంతుడు నీ లక్ష్యసాధనను సఫలం చేయుగాక! భగవంతుని స్మరణలో 'అతని'ని పొందుటకై అశాంతి ఎంతో మంచిది. నేను ఎన్నో సంవత్సరాలుగా ఈ అశాంతికి గురియై ఉన్నాను. ఈ అశాంతి (restlessness) మాత్రమే మనల్ని లక్ష్యంవరకూ తీసుకొని వెళ్తుంది. ఇదే మనకు అసలైన శాంతి. 'మాలిక్' అంటే గురుదేవుని స్మరణ యొక్క ఆరాటంతో ఉండేవాడే అసలైన భక్తుడు. శాంతికై వెదుకుతూ జనులు అరణ్యాలకి వెళ్ళతారు. కాని నూటికో కోటికో ఒక్కరే ఈ అశాంతి అనే అమూల్యరత్నంవైపు ఆకర్షితులవుతారు. భారం యొక్క తీవ్రత నీకు ఎలా అనిపిస్తోందో, తగ్గిందో నీ తరువాత ఉత్తరంలో వ్రాయగలవు. భారంగా అనిపించటానికి రెండు కారణాలు ఉంటాయి. మొదటి కారణం ఏమిటంటే, విగ్రహారాధనలు చేసేవారికి హృదయంలో స్థూలత్వం తయారై ఉంటుంది. మనం చేసే ధ్యానం దానిని దూరంచేసే సమయంలో ఆ స్థూలత్వం కరిగిపోతూ ఉంటే అలా అనిపిస్తుంది, అంటే స్థూలత్వం తయారైనట్లు, భారంగా ఉన్నట్లు తెలుస్తుంది. రెండవ కారణం హృదయంలో ఆధ్యాత్మిక బలం ఎక్కువ చేరి, అది ఇముడ్చుకోలేనప్పుడు (జీర్ణంకాని కారణంగా) అలా ఉంటుంది. మొదటి కారణంవల్లనైతే హృదయంలో ఎక్కువ గ్రాస్‌నెస్ ఫీల్ అవుతాము, అంటే స్థూలత్వం ఉన్నట్లు అనుభూతి చెందుతాము. తక్కువ మందికి రెండవ కారణంవలన అలా ఉంటుంది (అలా భారంగా ఉన్నట్లు అనిపించటం జరుగుతుంది). నీ విషయంలో వీటిలో ఏది అనుకుంటున్నావో వ్రాయి. భారంగా ఉండటమనేది ఇప్పుడు నీకు తక్కువై ఉండవచ్చు. ఈ బరువుగా అనిపించడమనేది తనంతట తానుగా, కష్టం లేకుండా పోవాలని నేను కోరుకుంటున్నాను.

గడచిన 27.08.1948వ తేదీన శ్రీకృష్ణ జన్మాష్టమి. ఎక్కడెక్కడైతే జనులు ఆరోజు ఉపవాసం ఉన్నారో వాళ్ళందరికీ ఆధ్యాత్మిక లాభం అందించమని నాకు ఆదేశం. ఈ కారణంగా ఆ రోజు 24 గంటలూ ఆ పని చేస్తూనే ఉన్నాను. తరువాత రోజున కూడా ఉపవాసానికై నాకు ఆదేశమైంది. కాని నా శరీరం యొక్క దుర్బలత్వం అనే కారణంగా ఒక రోజు నేను, రెండవ రోజున ఆధ్యాత్మికంగా ఉన్నత స్థాయిలో ఉన్న నా గురుభాయి (ఆధ్యాత్మిక సోదరుడు) శ్రీ రామేశ్వర్ ప్రసాద్ మిశ్రగారు వ్రతంలో ఉండాలని ఆదేశం. ఇది రెండు, మూడు సంవత్సరాల నుంచి నడుస్తోంది. నేను ఇంతకుముందు ఒక ఉత్తరములో వ్రాసినట్లుగా మీ తండ్రిగారి ఆధ్యాత్మిక ఉన్నతికై నీవు ప్రార్థనచేసే ఉంటావు.

ఇంతకుపూర్వం నీవు వ్రాసిన ఉత్తరానికి జవాబు పూర్తి చేసాను. ఈ రోజు అనగా 16 సెప్టెంబర్‌న నీ రెండవ ఉత్తరం చేరింది. అందులో నీవు ఒక విషయం వ్రాశావు. అది ఏమిటంటే, "ఇంతకుముందు ఉన్న స్థితి ఇప్పుడు లేదు" అని. దీని ఉద్దేశ్యం నాకు అర్థం కాలేదు. ఇంతకుముందు ఏ స్థితి ఉండి, అది ఇప్పుడు లేనందువలన మనస్సులో దిగులు ఉందని అంటావు? మనం అడుగులు ముందుకు వేసుకుంటూనే పోవాలి. భగవంతుడ్ని దీని కోసమై ప్రార్థించాలి. 'అతను' ఏదైనా చేయగలడు.

కేసర్ (మీ చెల్లెలు), మీ అమ్మగారు కూడా ధ్యానం మొదలుపెట్టారని తెలిసింది. సంతోషం.

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 9

లఖీంపుర్,

22.09.1948

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

నా వినమ్ర ప్రణామం. తమ యొక్క ఉత్తరం అందింది. తమ ఆశీర్వాదాలు పొందినమీదట నాకు చాలా ఆనందం కలిగింది. తమరు స్థూలత్వం గురించి అడిగి ఉన్నారు. అది బహుశా తమరు వ్రాసిన రెండవ కారణం మూలంగా అయి ఉంటుంది. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా, నాలో ఈశ్వరునిపట్ల రోజంతా ఎంతగా ప్రేమ

నిండిపోయినట్లుగా అనిపించిందంటే, శరీరంలో తరచుగా పులకింతలు కలగటమేగాక, ఏదో శక్తి హృదయంలోకి నిరంతరంగా ప్రవేశిస్తూ ఉన్నట్లు అనిపించింది. ఆ రోజు నుంచే మూడు రోజులు వరుసగా భారంగా ఉంది. ఆ తర్వాత అది పూర్తిగా తొలగిపోయింది. అప్పుడు హృదయం పూర్తిగా ఖాళీ అయిపోయి తేలికగా అనిపించింది. నేను నా రెండవ ఉత్తరంలో ఈ భారంగా ఉండటం గురించి వ్రాశాను. ఎందుకంటే, నేను ఈ సాధన ప్రారంభించినప్పటి నుండి దైవానుగ్రహం వలన మానసంలో ఎన్నడూ నిస్పృహ చెందలేదు. దానికి బదులు పూర్తిగా ఉత్సాహమే కలుగుతోంది. ఏ కొద్దిసేపైనా దైవం యొక్క జ్ఞాపకం లేకుండాపోయినపుడు చాలా అశాంతిగా ఉంటున్నదని నిస్సందేహంగా చెప్పగలను. అటువంటి అనుభూతి మంచిదేనని తమరు వ్రాశారు. పూజ్య బాబూజీ! ఎట్టి పరిస్థితుల్లోను, ఈశ్వరప్రాప్తి కోసం నేను మోపిన పాదం వెనకడుగు వేయబోదని నేను ప్రతిజ్ఞ చేస్తున్నాను. సదా ఆ ప్రియతముని జ్ఞాపకంలోనే లీనమై ఉండి 'అతని' చేరిక కొరకే పురోగమిస్తూ ఉంటాను. 'అతని' (దైవం) ఎదుటకు పురోగమిస్తానే కాని, వెనుకాడనని నేను 'మాస్టర్'ను ప్రార్థిస్తాను. మరైతే బాబూజీ! నేను తమ ఆశీస్సులకొరకు, దైవానుగ్రహం కొరకు సదా భిక్షకురాలిగానే ఉంటాను. ఇప్పుడు నా స్థితిని గురించి వివరిస్తున్నాను. డాక్టర్‌గారిచేత పరీక్ష చేయించుకునేందుకు నేను సెప్టెంబర్ 14వ తేదీన లక్నో వెళ్ళాను. ఆ రోజున నాకు 'మాలిక్' ప్రసాదించిన స్థితి, ఇప్పుడు ఉన్న స్థితి చాలా బాగుందని అనిపిస్తోంది. ఆ రోజున ఉదయం 6 గంటలకు బయలుదేరే బస్సులో వెళ్ళాను. అయితే రోజంతా ఎటువంటి విస్మృతస్థితి ఉందంటే, నేను ఏదో వాహనంలో కూర్చుని ఉన్నట్లుగాని, ప్రయాణిస్తున్నట్లుగాని, నేత్రాలతో ఏదైనా చూస్తున్నట్లుగాని ఏమీ తెలియకపోయింది. అది చాలా వింతైన స్థితిగా అనిపించింది. శరీరం అంతా పూర్తిగా పూవు మాదిరిగా చాలా తేలికగా ఉంది. అప్పటి నుండి నేటి వరకు అదే తేలిక స్థితి ఉందిగాని, విస్మృత స్థితి (అనగా ఏమీ తెలియని స్థితి) మాత్రం లేదు. పూజ్య బాబూజీ! తమరు నాకు లేఖ వ్రాసిన తర్వాత, నేను నా పూజ్యులైన తండ్రిగారి కొరకు, వారి ఆత్మోన్నతికొరకు నా దైవాన్ని ప్రార్థిస్తున్నాను. ఈ దీనురాలను ఈ భగవంతుణ్ని గుర్తుంచుకోమని దయచేసి మీరు గుర్తుచేయండి. పూజ్యులు శ్రీ పండిత రామేశ్వర ప్రసాద్‌గారి చరణాలకు, చాలా అల్పురాలైన ఈ కస్తూరీ ప్రణామం చేస్తున్నది.

తమ విధేయురాలు, దీనురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 10

షాజహాన్‌పూర్,

27.09.1948

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

ఆశీస్సులు. నీ ఉత్తరం చేరింది. సంతోషకరంగా ఉంది. నీవు భారం అనిపించే పరిస్థితి గురించి వ్రాసినపుడు నీ కోసమై నేను భగవంతుడ్ని ప్రార్థించాను. భగవంతుని విషయంలో నీవు, నేను, ఇద్దరమూ బికారీలమే (భిక్షకులమే). భగవదేచ్ఛ ఏదైతే ఉందో, అలాగే జరుగుతుంది. ఎవరినైతే భగవంతుడు తనవైపుకు తిప్పుకుంటాడో, వారే సఫలీకృతులు. ఒక పర్షియన్ కవి ఏమన్నారంటే, "నీ (భగవంతుని) ఇష్టం లేకుండా నీ దర్శనం కూడా ఎవరికీ దొరకదు" అని. మరి, దర్శనం అని దేనినంటారు? నిజంగా అది ఎటువంటి స్థితి? జనసామాన్యం దీనిని ఏ విధంగా అర్థం చేసుకుంటోంది? ఒకవేళ నేను దీని గురించి వ్యాఖ్యానం చెయ్యాలంటే ఎంతైనా ఉంది. కాని ఇప్పుడు కాదు. భగవంతుడు నీలో ఆ స్థితి ప్రసాదించినప్పుడే దీని గురించి వ్యాఖ్యానం చేస్తాను. "బాబూజీ! భగవంతుడుని పొందుటకై వేసే నా అడుగులు ముందుకే సాగుతూ ఉంటాయి. ఇంక వెనక్కి తిరిగి వేసే ప్రసక్తియే ఉండదు" అని వ్యక్తపరచిన నీ ప్రతిజ్ఞతో చాలా సంతోషపడుతున్నాను. ఈ విషయంలో భగవంతుడు నిన్ను సఫలం చేయుగాక! భగవంతుడు నీ ఇంటిని ప్రకాశవంతంగా

చేయుగాక! అంతే కాదు. దుఃఖంలో మునిగిన ప్రజలు నీ ద్వారా లాభాన్వితులయ్యే సమయం భగవంతుడు ప్రసాదించుగాక! హృదయపూర్వకంగా చౌబేజీ (మీ తండ్రిగారు) కై నువ్వు భగవంతుడ్ని ప్రార్థిస్తే, నీ ఆ ప్రార్థన నిష్ఫలం కానేరదు. భగవంతుడు నిన్ను అహంకారం నుంచి కాపాడుగాక! చౌబేజీ ఇప్పుడు బాగానే ఉన్నారు. కాని కొన్ని (పారివారిక) బంధనాల మూలంగా మీ అమ్మగారి దృష్టి సర్వశక్తివంతుడైన భగవంతునివైపు సరైన విధంగా మరల్చబడటం లేదు. ఏ రంగూ, రూపమూ లేని 'అతని'నే మనం ప్రేమించాలి. సాధన నీవు చేస్తున్నావు. మనమందరమూ చేస్తున్నాము. ఎవరినైతే ఈ శరీరం వదలిన తరువాత భగవంతుడు తిరిగి ఈ సంసారంలోనికి రాకుండా చేయదలచాడో, వారే ఈ మార్గంవైపు సంపూర్ణ విశ్వాసంతో మొగ్గుచూపుతారు.

మీ అమ్మగారికి, నాన్నగారికి నమస్కారాలు. నీ సోదరీలకు నా ఆశీస్సులు అందజేయి.

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 11

లఖీంపుర్,

17.10.1948

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

నా వినమ్ర ప్రణామం. తమరు సుఖంగా చేరుకున్నారని భావిస్తున్నాను. తమరు ఇక్కడకు వచ్చి వెళ్ళిన కారణంగా మా అందరికీ మంచి ప్రయోజనం, శాంతి లభించాయి. తమకు నేను మరపు స్థితిలో ఉంటున్నట్లుగా ఇంతకు ముందే ఉత్తరంలో వ్రాశాను. మాస్టర్ సాహెబ్ రెండవ సిట్టింగ్ ఇచ్చినప్పటి నుండి హృదయంలో శాంతి బాగా అనుభవమైంది. షుమారు ఐదు మాసాలనుంచి, ఈశ్వరుని కృపవలన ఒక్క క్షణం కూడా నా మనస్సు అశాంతికి గురికాలేదు. కాని ఇప్పుడు తమరు నా హృదయంలో ఏమి నింపారోగాని, దానిని నేను వివరించలేక పోతున్నాను. ప్రస్తుత దశ బహుశా ఒక మృత స్థితిలాంటిదిగా ఉన్నదని మాత్రం చెప్పగలను. తమరు హృదయంలోని స్పందనలో 'ఓం' శబ్దం వినమని చెప్పినటువంటిది, అప్పుడప్పుడు వ్రేళ్ళలోను, వెనుక భాగంలోను వినపడుతున్నట్లుగా ఉంది. ఇంతకుముందు నేను తమవద్దకు వచ్చి వెళ్ళినప్పటి నుండి, నా దశ చాలా బాగున్నట్లుగా అనుభూతి చెందుతున్నాను కాని, ఆ మంచి స్థితి ఏమిటో నేను వివరించలేకపోతున్నాను. అదే రోజు రాత్రి పూజ్యులు తావూజీ తమతోపాటు విందుకు వెళ్ళినందున తిరిగి రావటానికి కొంత ఆలస్యమైనప్పుడు, నేను కొంచెంసేపు ధ్యానంలో కూర్చున్నాను. అప్పుడు ఎక్కడి నుండోగాని "ఇంత శ్రమ చేయవలదు" అని ధ్వని వినిపించింది.

పూజ్య బాబూజీ! నేను పైన వ్రాసిన స్థితులన్నియూ, నా 'మాలిక్' అనుగ్రహించిన కృప మూలంగాను, తమ ఆశీస్సులు మూలంగానే కలిగాయి. నేను ఎంత అయోగ్యురాలినో తమకు తెలియనది కాదు. ఆ దైవానికి, తమకు నివేదిస్తున్నది, నివేదించినది, నివేదించబోయే ప్రార్థన ఏమిటంటే, నా ఆత్మోన్నతి శీఘ్రంగా జరగాలని మరియు ఈశ్వరునిపట్ల నాకు అపరిమితమైన నిష్కామ ప్రేమ, బాంధవ్యం ఉండాలని. మాస్టర్ సాహెబ్ సిట్టింగ్ ఇచ్చి కొద్ది రోజులైంది. ఆ రోజంతా, తర్వాత రెండు మూడు రోజులవరకు కేసర్ నిద్రపోయింది. ఇటీవల ఆమె స్వయంగా ధ్యానం చేస్తూ ఉండగా ఎడమచేయి కొంత అచేతనంగా ఉంటున్నది. పూజ్య బాబూజీ! నేనయితే ప్రియమైన 'మాలిక్' యొక్క స్మరణలో నిశ్చింతగా ఉంటాను. అతి శీఘ్రంగానే 'అతని'ని పొందుతాను. అందుకు ఏది అవసరమో అది చేస్తాను. తనను జ్ఞాపకం ఉంచుకోవల్సిందిగా కేసర్ తమరిని వేడుకుంటున్నది.

ఈశ్వరప్రేమ మరియు తమ ఆశీస్సులనే అర్థించు తమ పుత్రిక

కస్తూరీ.

## ఉత్తర& సంఖ్య - 12

షాజహాన్‌పూర్,
23.10.1948

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

ఆశీస్సులు. నీ ఉత్తరం చేరింది. సంతోషకరంగా ఉంది. నీ ఆంతరిక దృష్టిని భగవంతునివైపు మరల్చుతున్నందుకు 'అతని'కి ధన్యవాదాలు. భగవంతుడు నీకు చాలినంత ఆధ్యాత్మిక ఉన్నతి ప్రసాదించుగాక! నీవు శాంతి పొందుతున్నట్లు వ్రాసావు. ఈ ప్రశాంతత అనే స్థితి మంచిదే. కాని ఈ శాంతిలో భగవంతునికై ఆరాటం (తపన) లేకపోతే, మంచి భోజనం ఉన్నా కూడా అందులో ఉప్పు (రుచి) లోపించినట్లవుతుంది. ఎప్పటికప్పుడు నీ స్థితి గురించి వ్రాసి తెలియజేస్తూ ఉండగలవు. నీవు వ్రాసిన నీ ప్రాణంలేని శరీరం వంటి దశ గురించి వివరంగా తెలియజేస్తూ కొద్దిరోజుల తరువాత జవాబు ఇస్తాను. దీని గురించి ఇప్పుడే ఎక్కువగా వ్రాయటం మంచిదికాదని అనిపిస్తోంది. వేరే ఇంకో ఉత్తరంలో కూడా ఒక దశ గురించి తరువాత చెబుతానని వ్రాసాను. ఇలాంటివి ఏవైనా డైరీలో నీవు వ్రాసుకుని నాకు గుర్తుచేస్తే, ఆ విషయాలు జ్ఞాపకం చేసుకుని వాటికి సమాధానం ఇస్తాను. కేసర్ (నీ చెల్లెలు) తరుచుగా నాకు జ్ఞాపకం వస్తుంది. ఆమె భజనలు నాకు ఎంతో నచ్చాయి. బహుశా అందువల్లనేమో ఆమె బాగా జ్ఞాపకం వస్తూ ఉంది. వీలైనంతవరకూ నీ ఆరోగ్యం చక్కబరచుకోవటానికి ప్రయత్నించు. ఇది చాలా అవసరం. మీ అమ్మగారికి నమస్కారాలు.

నీ శ్రేయోభిలాషి,
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 13

లఖీంపుర్,
28.10.1948

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

నా వినమ్ర ప్రణామం. నా ఉత్తరం ఒకటి మీకు చేరే ఉంటుందను కుంటాను. నేను ఆ ఉత్తరంలో వ్రాసినటువంటి అప్పుడు ఉన్న స్థితికి బదులుగా ప్రస్తుతం 10 రోజుల నుండి 'మాస్టర్' నాకు ప్రదానంచేసిన స్థితి నాకు చాలా స్పష్టంగా, ఇష్టమైనదిగా ఉంది. నా బాబూజీ! వ్రాయనలవికాని దానిని ఎలా వ్రాయను? అది ఎటువంటిదంటే, అప్పుడప్పుడు దుఃఖం కలుగుతుండేది. అలాగే అప్పుడప్పుడు అశాంతి కలుగుతూ ఉండేది. దీనికొరకే నేను నా ప్రియతమ 'మాస్టర్'ను ప్రతిరోజు అర్థిస్తూ ఉండేదానను. అదే దుఃఖం, అదే అశాంతి నాకు 9, 10 రోజుల నుండి ప్రతిక్షణం సహజీవనంగా ఉండిపోయాయి. ఈ దుఃఖంలో ఉన్న ఆనందం నాకు తనివి తీరటంలేదు. అయినప్పటికీ కూడ దానిని తమాయించుకొని ఏదైనా పనిచేస్తూ ఉన్నప్పటికీ లోపల (వెక్కి వెక్కి ఏడ్చినట్లుగా) దుఃఖం పొంగిపొర్లేది. ఇప్పుడు ఆ దుఃఖమైతే లేదు కాని అశాంతి మాత్రం చాలా ఎక్కువగా ఉంది. శ్రీ బాబూజీ! అయితే నిన్నటి నుండి ఆ రెండు స్థితులు నెమ్మదించాయి. హృదయంలో శాంతి, ఆనందం మరియు తేలికదనం బాగా అనుభవమవు తున్నాయి. 'మాలిక్' ఎటువంటి స్థితిని ప్రసాదించినా అది శిరోధార్యమే, అయితే ఆ స్థితులలో ఉన్నటువంటి ఆనందం, శాంతి ఉండవు. అందువలన ఆ సర్వవ్యాపియైన భగవంతుని ఎదుట నేను హృదయపూర్వకంగా వారి జ్ఞాపకంలో దుఃఖం మరియు అశాంతి కొరకు వేడుకునే భిక్షకురాలినే. ఈ దీనురాలు కొరకు ప్రియమైన ఆ దైవాన్ని ఎప్పుడైనా ప్రార్థించినప్పుడు, ముఖ్యంగా నాకు ఈ రెండు స్థితులను ప్రసాదించమని తమరిని వేడుకుంటున్నాను. నా తండ్రిగారికి కూడా అతిశీఘ్రంగా ఈ రెండు స్థితులను 'మాలిక్' ప్రసాదించాలని నేను హృదయపూర్వకంగా వేడుకుంటున్నాను. ఈ రెండు రత్నాలను నేను నా హృదయంలో దాచి ఉంచుకుంటాను. ఏడు, ఎనిమిది రోజుల క్రితం 'భక్త ప్రహ్లాద'

నాటకం నేను చూసినప్పటినుండి ఈ స్థితి ఇంకా తీవ్రమయ్యింది. నా కొరకు అపరిమితమైన ప్రేమ కలిగి ఉన్న ఆ భగవంతుని జ్ఞాపకంతో నా హృదయం ఇంకా నిండవలసి ఉంది. మా తల్లిగారు తమరు చెప్పిన రీతిలో సాధన చేస్తున్నారు. ఆ సమయంలో ఆమెకు 'ఓం' అను శబ్దం వినిపించడం ప్రారంభమయ్యింది. పైన వివరించినటువంటి స్థితి, అపరిమితమైన ప్రేమ కలిగి ఉన్న ఆ భగవంతుని మూలంగాను, తమరి యొక్క ఆశ్వీరాద ఫలితంగాను అలాగే పూజ్య మాస్టర్ సాహెబ్ యొక్క కృషి మూలంగాను నాకు లభించింది. బాబూజీ! నా హృదయం ఎటువంటిదో తమకు తెలియనిదికాదు. పూజ్య బాబూజీ! 'నేను', 'నా' అను స్థానంలో కేవలం ఈశ్వరుడు మాత్రమే నిలిచి ఉండాలని, మిగిలినవన్నీ నశించిపోవాలని నా యొక్క కోర్కెగా ఉంది. తమ ఆశీస్సులు ఉంటే ఇది త్వరలోనే జరుగుతుంది.

తమరు దయతో వ్రాసిన ఉత్తరం చేరింది. తమ ఆశీర్వాదాలు సదా నా శిరస్సుపై ఉన్నాయి. ఇప్పుడు నన్ను ఈశ్వరుని స్మరణ నుంచి ఒక్క క్షణమైనా తప్పించగల శక్తి అంటూ ఏదీ లేదు. పూజ్య బాబూజీ! నాలో ఇప్పుడు ప్రేమ అనేది ఏమాత్రమూ లేదు. ఎందుకంటే, సత్యవంతమైన ప్రేమలో 'నేను', 'నా' అనేది పూర్తిగా శాశ్వతంగా నశించిపోతాయి. అప్పుడింక సర్వదా, సర్వత్రా ఈశ్వరునిపట్ల ప్రేమ మాత్రమే నిలిచి ఉంటుంది. ఆ సర్వవ్యాపియైన భగవంతుడు ఎప్పుడైనా ఈ దీనురాలికి తన స్వచ్ఛమైన ప్రేమను అనుగ్రహరిస్తారేమో వేచి చూస్తాను. నేను నా డైరీలో ఈ విషయాలు వ్రాసుకుంటాను.

తమ దీనురాలైన పుత్రిక, కేవలం స్వచ్ఛమైన ప్రేమ కలిగి ఉన్న ఈశ్వరుని యొక్క భిక్షార్థిని,

కస్తూరీ.

## ఉత్తరం సంఖ్య - 14

షాజహాన్‌పుర్,

2.11.1948

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

ఆశీస్సులు. నీ ఉత్తరం చేరింది. సంతోషకరంగా ఉంది. భగవంతునివద్దకు చేరుకుంటూ, 'అతని'ని సమీపిస్తున్న సమయంలో ఎన్నో దశలు కలుగుతూ ఉంటాయి. ఈ దశలు ప్రతి అభ్యాసీకి సాధనలో వస్తూనే ఉంటాయి. సరైన భక్తి, శ్రద్ధ ఉంటే ఈ దశలను అనుభూతి చెందగలుగుతారు. నీ ఉత్తరాలను భద్రపరుస్తాను. ప్రతి ఒక్క స్థితినీ ఒక్కొటొక్కటిగా వెలుగులోనికి (అనుభవానికి) తేవచ్చు. కాని నీవు ఆ స్థితులను దాటి చాలా ఉన్నతంగా పురోగమించిన తరువాత మాత్రమే వీటి గురించి విపులంగా వ్రాయాలని భావిస్తున్నాను. భగవంతునికి ఏదీ దూరంగా లేదు. 'అతడు' ఏమైనా చేయగలడు. మనం చేసే పొరపాటు ఏమిటంటే, 'అతడు' మనకు ఎంతో దగ్గరగా ఉన్నా, మనం 'అతని' ఉనికిని గ్రహించలేకపోతున్నాం. ('అతడు' హృదయంలోనే ఉన్నాడు) మీ అమ్మగారికి నా నమస్కారాలు తెలియజేయి.

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 15

లఖీంపుర్,

10.11.1948

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సాదర ప్రణామాలు. నా ఉత్తరం తమకు చేరే ఉంటుందనుకుంటాను. ఎవ్వరూ లేఖరులు అందుబాటులో లేనందువలన తమరు ప్రత్యుత్తర మివ్వలేకపోయినట్లుగా తావూజీ ద్వారా తెలిసింది. నవంబర్ 1వ తారీఖు నుండి దశలో కొంత పురోగతి ఉన్నట్లుగా అర్థమైంది. అందువలన దానిని గురించి ఇప్పుడు వ్రాస్తున్నాను. ఆ రోజు రాత్రి

షుమారు 8 గం॥లకు ఎవ్వరో సిట్టింగ్ ఇస్తున్నట్లుగా అనిపించింది. ఆ సిట్టింగ్ ఉన్నంతగా ఆ రోజులో ఎప్పుడూ ఆ విధంగా లేదు. నేను గత ఉత్తరంలో బహుశా నా శిధిలత్వం (వినాశం) గురించి వ్రాసి ఉన్నాను. అయితే ఆ రోజున, నా లోపల నుండి ఎవ్వరో మనస్సును, ఇంద్రియాలను పూర్తిగా నిరర్థకం చేసినట్లుగా అనిపించింది. సిట్టింగ్ తర్వాత చాలా నీరసంగా ఉన్నట్ల నిపించింది. ఆ తర్వాత పది లేక పదిన్నర గంటలకు నిద్రపోయాను. అప్పుడు స్వప్నంలో – తమరు, పూజ్య మాస్టర్ సాహెబ్ కూర్చుని ఉన్నారు. నేను కూడా కూర్చున్నాను. నిజంగా తమరి స్పర్శతో అక్కడ ఉన్న చిన్న చిన్న మొటిమలు అన్నీ తొలగిపోయాయి. ఈ విధంగా చాలాసేపు గడిపిన తర్వాత తమరు – "కస్తూరీ, రా, నీకు సిట్టింగ్ ఇస్తాను" అనగానే కూర్చుండిపోయాను. నాకు ఆ స్వప్నంలో తమరు ఎంతసేపు సిట్టింగ్ ఇచ్చారో తెలియదు. కళ్ళు తెరవగానే నాకు షుమారు రెండు గంటలసేపు శరీరంలోని ఏ అవయవం కదపలేకపోయాను. అది ఎలా ఉందంటే, అప్పుడప్పుడు రాత్రిళ్ళు కొన్ని నిమిషాలసేపు మృత్యు స్థితి కలుగుతున్న విధంగా ఉంది. దేహంలో అసలు ప్రాణమే లేదన్నట్లుగా పగలుకాని, రాత్రిగాని పండుకొని ఉన్నప్పుడు అనిపించింది. ఈ విధంగా 5, 6 రోజులు మృత్యు స్థితిలాగా అనుభవమవుతూ వచ్చింది. పరమ ప్రియ బాబూజీ, ఇపుడు నా ప్రియతమ ఈశ్వరుడు లేకుండా నేను జీవించలేను అని గ్రహించాను. ఇపుడు ఏదో విధంగా దయచేసి అతి త్వరగా ఆ ఈశ్వరుని నేను చేరుకునేటట్లు, దర్శనం కలిగేటట్లుగా చేయండి. ఈ హృదయం ఇప్పుడు 'అతని' కొరకు తీవ్రంగా తపించిపోతున్నది. ఓ బాబూజీ, ఈ దీనురాలి వార్త ఇంకనూ ఆ 'మాలిక్' (దైవం) దరికి చేరలేదంటారా? ఒకవేళ అదే జరిగితే, తమరే స్వయంగా దయతో ఈ దీనురాలిని 'అతని' వద్దకు త్వరగా చేర్చండి. నిజం చెప్పాలంటే, ఇప్పుడు ఆ ఈశ్వరుడు లేకుండా నేను జీవింపజాలను. ఈ విషయాన్ని 'మాలిక్'కు తెలియజేయమని తమరిని వేడుకుంటున్నాను. నా హృదయం 'అతడి'ని పొందటానికి తల్లడిల్లిపోతున్నది. ఓ దైవమా! నా అస్థిత్వం ఇంక ఏమీ మిగలకుండునట్లుగా చేయి. నేను నీలో విలీనమైపోవాలి. నీవు నాకు అత్యంత ప్రియతమునిగా అయిపోవాలి. అది ఎంతగానంటే, నీవు – నేను ఏకమైపోవాలి. శ్రీ బాబూజీ, ఏ విధంగానైతే ఒక చిన్న అమాయక బాలుడు సాయంత్రమయ్యేసరికి తన తల్లి దగ్గర కాకుండా మరెవ్వరివద్దా ఉండలేడో, అదే విధంగా ఈ కస్తూరి ప్రపంచమనే సాయంకాలంలో తల్లి రూపమైన ఈశ్వరునిలో తప్ప జీవించి ఉండలేదు. ఈ హృదయాన్ని 'అతడు' కనుక చీల్చి చూసినట్లయితే, బహుశా ఇంత కాలం పట్టి ఉండదు. ఓ నా దైవమా, నీవే నా ప్రియమైన తల్లివి, తండ్రివి మరియు ఆధ్యాత్మిక గురువువి. నీవు దయచేసి ఇంకా ఆలస్యం చేయవద్దు. పూజ్య శ్రీ బాబూజీ, ఇప్పుడు హృదయ ఉద్వేగాన్ని నిలుపుకోలేని కారణాలను వ్రాసినందుకు నన్ను క్షమించండి.

నేనయితే నాలో నిజమైన ప్రేమ, పట్టుదల లేవని చెప్పగలను. అలాకాకుంటే, నిజమైన దీక్షాపరులకు ఈశ్వరుడు అత్యంత సమీపంగా ఉంటాడు అని తమరు వ్రాసి ఉండేవారు కాదేమో. శీఘ్రంగా 'మాలిక్' దయ పొందునట్లుగా తమరు ఈ దీనురాలిలో కూడా అసలైన పట్టుదల పురికొల్పండి. ఆంతరికంగా ఇటువంటి అగ్ని జ్వలిస్తూ ఉంటే నేనేమి చేయాలి? అది అప్పుడప్పుడు బయటకు వస్తుంది. దాని కారణంగా నన్ను నేను నిలువరించుకోలేకపోతున్నాను. ఇప్పుడు స్థితి ఎలా ఉందంటే, సిట్టింగ్ తీసుకున్నా, తీసుకోకపోయినా సరే 'అతని' జ్ఞాపకంలో ఉంటుంటే, హృదయం 'అతని'ని ఎంతగా గ్రహిస్తుందంటే, కొద్దిసేపు కాళ్ళ పాదాలుగాని, చేతులుగాని ఒకే భంగిమలో ఉంచినప్పుడు అవి నిద్రపోతున్నట్లుగా అనిపిస్తున్నాయి. అలాగే మనస్సు కూడా నిద్రపోతుంది. ఇంతకుపూర్వం ధ్యానం చేస్తూ ఉన్నప్పుడు – "ఎవ్వరైతే అందరిలోనూ నెలకొని ఉన్నాడో, అట్టి ఈశ్వరుడునే నేను స్మరిస్తున్నాను" అని భావించటం జరిగింది. అయితే ఇప్పుడు, "నేను లేను ఈశ్వరుడూ లేడు" అని తలపిస్తూనే 'ఆతని' స్మరణలోనే నేను పులకించిపోతున్నాను. హృదయంలో ప్రేమ అధికంగా ఉంది. అప్పుడప్పుడు పగలు భోజనం చేస్తున్నప్పుడుగాని, ఇంకా ఏదైనా పని చేస్తున్నప్పుడుగాని అప్రయత్నంగా చేస్తూన్న పనులన్నీ నిలిచిపోతున్నాయి. ఆ దైవ స్మరణలోనే పరవశమైపోతున్నాను. కసౌటి ఆకులు దొరకని కారణంగాను, మనోవేదన మూలంగాను పొట్ట రక్తనాళాలు మీద

ఒత్తిడిపడుతున్న కారణంగా వాటి పరిస్థితి బాగుండలేదు. మిగితాదంతా బాగానే ఉంది.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 16

లఖీంపుర్,
11.11.1948

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

వినయాంజలి. దయతో తమరు వ్రాసిన ఉత్తరం మాస్టర్ సాహెబ్ ద్వారా చేరింది. తమ ఆశీస్సులందుకున్నాను. నాకు చాలా ఆనందం కలిగింది. పూజ్య మాస్టర్ సాహెబ్‌గారి ద్వారా తమ ఆరోగ్యం బాగుండలేదని తెలిసింది. ఇప్పుడు తమ ఆరోగ్యం బాగుందని ఆశిస్తున్నాను. పూజ్య బాబూజీ! ఇపుడు నా స్థితిని గురించి ఏమని, ఎలా తెలియజేయాలి? ఎంత త్వరగా నా దైవాన్ని పొందగలను అని ఒకే ఒక్క కోరిక నాలో బలీయంగా ఉన్నందువలన నా లోలోపల అందుకుగాను చాలా తపన కలుగుతోంది. ధ్యానమైతే ఒక విధంగా ఉంది కాని అది హృదయంలో నిలకడగా ఉండటం లేదు. నేడో, రేపో లేదా మరో రోజున దైవంలో లయమైపోవాలి అను ఏకైక పట్టుదల మాత్రం ఇప్పుడు ఉంది. బాబూజీ! 'అతడు' అందరిలోను, అంతటా ఉన్నాడు. 'ఆతని'కి సమీపంలో ఉండి కూడా 'ఆతడి'ని పొందలేకపోయాను. హృదయంలో పగలంతానే కాదు, రాత్రి కళ్ళు తెరచినంతనే ఇటువంటి తపనయే రగులుతోంది. రాత్రి సమయంలో కళ్ళు తెరచినంతనే ఏదో విధంగా అతిత్వరగా నా జీవన ధనమైన ఆ దైవాన్ని పొందాలి అనే మాటలే నా హృదయంలో తలెత్తుతున్నాయి. తమ ఆశీర్వాదంవలన నాలో 'నేను', 'నాది' అనే భావన చాలా అరుదుగా అనుభవమవుతున్నాయి. ప్రస్తుతం, ఈశ్వరుని పొందాలి అని తపన మాత్రమే ఉంటోంది. పూజ్య బాబూజీ, హృదయం ఆవేదన చెంది అశాంతి ఎక్కువైనపుడు ఆ దీనదయాళుడైన ఈశ్వరుని తప్పకుండా పొందుతాను అనే విశ్వాసం కలుగుతుంది. ప్రియమైన శ్రీ బాబూజీ! ఈ నా జీవితం 'అతని'కే అర్పించుకున్నాను. నేను ఏ విధంగానైనాసరే, 'అతని'ని తప్పక పొందితీరతాను. నాలో అణువణువునా 'అతని'పట్ల ప్రేమయే నెలకొని ఉంది. 'అతడు' సర్వవ్యాపి అయినందున సమస్తంలో నేను 'అతడి'నే దర్శించుకుంటాను. నేను 'అతడి'ని మాత్రమే ప్రేమిస్తాను. ఆ ప్రియమైన 'మాలిక్' (దైవం) నావంటి భిక్షకురాలికి, జన్మ జన్మాంతరాల నుండి ఈ మానసం పొందుతూ వచ్చిన సంస్కారాలను, తాను (మనస్సు) ఆపాదించుకున్న సంస్కారా లన్నింటితో సహా ఈ జన్మలో నశింపు కలుగునట్లుగా భిక్ష అనుగ్రహించమని తమరు ఆశీర్వదించవలసిందిగా వేడుకుంటున్నాను. పూజ్య బాబూజీ! నేను చాలాసార్లుగా గమనిస్తూ వచ్చింది ఏమిటంటే, నా కొరకు ఏ స్థితినైతే తమరు కల్పించబడాలని కోరుతూ ఉండేవారో, అది 'తమ' ఉత్తరం రాకపూర్వమే 'మాలిక్' (దైవం) కృపతో నాకు ఆ స్థితి కలుగుతూ ఉండేది. కేసరి మరియు తల్లిగారు తమకు ప్రణామాలు తెలుపుతూ, వారిమీద కూడా తమ దయ చూపాలని కోరుకుంటున్నారు. 'మాలిక్' కృపతో త్వరలోనే 'అతని'ని తప్పకుండా పొందుతాను. నేను నా ఈశ్వరుని పొంది పరవశించే శుభ ఘడియ ఎప్పుడు వస్తుందో కదా! ఈ భిక్షకురాలికి భిక్షగా 'మాలిక్' (దైవం) మాత్రమే కావాలని కోరుకుంటుంది. హృదయంలో ఇంత అశాంతి ఉన్నప్పటికీ ఒక్క కన్నీటి చుక్క అయినా రాలకపోవటం ఆశ్చర్యంగా ఉంది. నా స్థితి ఎటువంటి దైనప్పటికీ, అది నా 'మాలిక్' యొక్క అపారమైన దయ, తమ ఆశీర్వాదం మరియు మాస్టర్ సాహెబ్ యొక్క శ్రమ ఫలితంగానే లభించింది అని విశ్వసిస్తున్నాను.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 17

లఖీంపుర్,
16.11.1948

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సాదర ప్రణామాలు. నా ఉత్తరం తమరికి అందే ఉంటుందను కుంటున్నాను. నేను ఉత్తరంలో ఏ స్థితినైతే వ్రాశానో ఇప్పుడు అది దానికి విరుద్ధంగా ఉంది. నేను తమరికి అశాంతి గురించి వ్రాసి ఉన్నాను, కాని ఇప్పుడది చాలా స్వల్పంగా ఉంది. నేను తమకు ఆ ఉత్తరం వ్రాసిన మరుసటి రోజునుంచే ఈ దశ కలిగింది. దానిలో నేను సిట్టింగ్ తీసుకుంటున్నప్పుడు మరియు తీసుకోనప్పుడు కూడా రోజంతా అనేకసార్లు, నేను పూర్తిగా ఈశ్వరమయమై పోయినట్లుగాను, అంతటా వ్యాపించిపోతున్నట్లుగాను అనిపించింది. నాలోనే కాకుండా సర్వత్రా ఈశ్వరుడే వ్యాపించి ఉన్నట్లుగా తోచింది. శాంతి మరియు తేలికదనం కూడా బాగా ఉన్నట్లు అనిపించింది. పరమ ప్రియులైన బాబూజీ! మరి నాకు ఆ దశ ఏమిటో తెలియదు. పూజ్య మాస్టర్ సాహెబ్‌కు అది తెలిసే ఉంటుంది. ఏది ఏమైనప్పటికీ నేను వెనుకడుగు వేయకుండా ముందుకు పురోగమించాలని ప్రార్థిస్తున్నాను. నా యొక్క ప్రస్తుత దశ బాగున్నప్పటికీ, అశాంతి దీనికంటే కూడా అధికంగా బాగున్నట్లనిపిస్తుంది. 'మాలిక్' యొక్క అభీష్టానికి ఈ భిక్షకురాలు సదా శిరసావహిస్తుంది. ఇది ఒక్కటే 'మాలిక్'ను అర్థించి ప్రార్థిస్తున్నాను. నా వంటి సాధనా విహీనురాలిపై తమ కటాక్షం కొరకు ప్రార్థిస్తున్నది ఏమంటే, ప్రతిక్షణం, నేను 'అతని' సామీప్యతను పొందుతూ సాగిపోవాలి అని. పూజ్య బాబూజీ! నేను అప్పుడప్పుడు నా అశాంతిని గురించి తలచుకొని కలత చెందుతున్నాను. అమ్మగారు ఇప్పుడు 'అనహద్ నాద్' (శబ్దం) అప్పుడప్పుడు మాత్రమే వినిపిస్తోంది అని చెబుతున్నది. హృదయం కూడా ఒక విధమైన సందిగ్ధంలో ఉంటున్నదని, బాగా శ్రద్ధ వహించిన మీదటనే 'అనహద్ నాద్' (శబ్దం) వినిపిస్తున్నదని తెలియజేస్తూ తమకు ఆమె ప్రణామం తెలుపుతున్నది.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 18

షాజహాన్‌పుర్,
19/20.11.1948

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

ఆశీస్సులు. నీ రెండు ఉత్తరాలు చేరాయి. అవి చదివి నేను ఎంతగానో సంతోషించాను. భగవంతుని కృప మూలంగా 'అతని'వైపు నీ దృష్టి అభివృద్ధి చెందుతోంది. నీవు వ్రాసినవన్నీ చదివిన తరువాత నాకు తెలిసింది ఏమిటంటే, నీ లయావస్థ స్థితి ఉన్నతి చెందుతోంది. కాని ఇంకా దశ నిలకడగా, స్థిరమైన రూపంలో లేదని చెప్పాలి. భగవంతుని కృపవలన నీవు సాధనలో ఇలాగే శ్రమపడుతూ ఉంటే, తప్పకుండా అలా నిశ్చలరూపం దాల్చుతుంది. దీనికి ఆరోగ్యం కూడా అవసరం. కాబట్టి ఈ విషయంలో కూడా నీవు శ్రద్ధ తీసుకోవాలి. నా ఆరోగ్యం కూడా బాగుండలేదు. శాశ్వతమైన వ్యధ నన్ను శారీరకంగా బలహీనుని చేసాయి. కాని నాకు ఈ దశ, ఎంతో నేర్చుకున్న తరువాత, సాధన తర్వాత మాత్రమే లభించింది.

భగవంతుడు బలహీనుని పిలుపు ఎక్కువగా వింటాడు, ఆదుకుంటాడు. కాని 'మాస్టర్' వినే ముందుగానే మన పిలుపు 'అతని'కి చేరగలిగేటట్లుగా మార్గాలు వెదకి, అభ్యాసం ద్వారా మనల్ని మనం సమర్థవంతులంగా చేసుకోవాలి. దీనికి ఆరోగ్యం కూడా అవసరం.

నీ శ్రేయోభిలాషి,
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 19

లఖీంపుర్,

26.11.1948

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు వ్రాసిన ఉత్తరం మరియు ఆశీస్సులు అందాయి. 'మాలిక్' దయతో ఇప్పుడు ప్రసాదించిన దశను గురించి వ్రాస్తున్నాను. ఇప్పుడు రోజంతా మరుపుస్థితిలో ఉంటున్నాను. అప్పుడప్పుడు కళ్ళు అప్రయత్నంగానే మూతపడటమేగాకుండా స్పృహ లేకుండా పోయినట్లుగా ఉంటోంది. శరీరంలోని జీవకణాలన్నీ లోపల శిథిల మౌతున్నట్లుగా అనిపిస్తోంది. అప్పుడప్పుడు ఆంతరికంగా అలుపు ఉన్న కారణంగా పండుకొని ఉండవలసి వస్తోంది. తరచుగా కొద్ది క్షణాలు మాత్రమే ఉత్సాహం, ఆనందం కలుగుతున్నాయి. అశాంతి అయితే తొలగిపోయింది కాని ఏదో వేదన ఆంతరికంగా నిలిచిపోయింది. పరమప్రియ బాబూజీ! 24 గంటలూ కేవలం ఒకే మాట – నేను లేను, నాదంటూ ఏమీ లేదు అనేదే నా మనస్సంతా నిండి ఉంటోంది. నేను ఏమైనా చూస్తున్నప్పటికీ, వింటూ ఉన్నప్పటికీ అంతా ఆ దివ్యత్వమై ఉంటూ ఉంటే నేను ఇంకేమని వ్రాయగలను. నేను కూడా ఈశ్వరుడినేనన్న భావం కలుగుతోంది. ఈ భావం అధికంగా ఉంటున్నది. పూజ్య బాబూజీ! జీవితానికి నిజమైన అర్థం ఏమిటంటే, ప్రతిదానిలోను అనగా ఆకుల్లో, కొమ్మల్లో, పశుపక్ష్యాదులలో, మనుషుల్లో మరియు వస్త్రం యొక్క ప్రతి దారంలోను ఈశ్వరుని దర్శనం మాత్రమే కలుగునట్టిది. మరింక ఇప్పుడు నాలో నాకు బదులు ఈశ్వరుడే దర్శనమిస్తున్నాడు. రోజులు స్వప్నంలా గడిచిపోతున్నాయి. తమ ఆశీస్సులు మరియు 'మాలిక్' యొక్క కృప ఉన్నట్లయితే శాశ్వతంగా ఇలాగే ఉంటుంది, ఉండి తీరుతుంది కూడ. ఈరోజు నాలో ఏదో ఒక శక్తి ఉత్పన్నమై బలవంతంచేసి ఉత్తరం వ్రాయిస్తున్నది. తమ దయ, 'మాస్టర్' యొక్క కృపతోపాటు మాస్టర్ సాహెబ్‌గారి కృషి కూడా తోడైనట్లయితే, నా ఏకైక లక్ష్యమైన ఈశ్వరుని శీఘ్రమే చేరుకొనగలనని నిశ్చయంగా చెప్పగలను. ఇటీవల ఆరోగ్యం కూడా బాగుంటున్నది. అప్పుడప్పుడు అస్వస్థత కలుగుతున్నప్పటికీ మళ్ళీ సర్దుకుంటోంది. నేను ఆరోగ్యం మీద ఎక్కువగా శ్రద్ధ వహిస్తున్నాను. ఈశ్వరుడు బలహీనుల పిలుపు బాగా ఆలకిస్తాడు అని తమరు వ్రాసి ఉన్నారు. అయితే బాబూజీ, నా దృష్టిలో తమరు మినహాయించి తదితర బలహీనులు తక్కువ స్వరంతో పిలుస్తారు, కాని ఆరోగ్యవంతుల పిలుపు బిగ్గరగా ఉంటుంది. ఏమైతే అది కానివ్వండి, నేనయితే 'అతని'కి అర్పణమైపోయాను. కొంత సమయం అటు–ఇటుగానైనా ఎప్పుడో ఒకప్పుడు 'అతడు' నా పిలుపు త్వరగానే వింటాడు అను విశ్వాసం నాకు ఉంది. ఎందుకంటే తమ యొక్క పిలుపు మరియు మాస్టర్ సాహెబ్ యొక్క పిలుపు, నా పిలుపుకు తోడైతే అది బిగ్గరగా తయారై అపుడు 'మాలిక్'కు త్వరగా ఆలకించక తప్పదు. ఈ లయ–అవస్థ నిలకడగా ఉండునట్లు తమరు ఆశీర్వదించండి. తమరు కనుక మనస్ఫూర్తిగా ఆశీర్వదించినట్లయితే అది నిశ్చయంగా నిలకడగా ఉంటుంది. నా అనుభూతి ఈ విధంగా ఉంది. ఏదో విధంగా ఈ దీనురాలి పిలుపు 'ఈశ్వరు'ని త్వరగా చేరునట్లుగా తమరు దయ చూపగలరు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 20

షాజహాన్‌పుర్,

10.12.1948

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

ఆశీస్సులు. నీ ఉత్తరం చేరింది. చాలా సంతోషముగా ఉంది. నీ స్థితి అభివృద్ధి చెందుతూ ఉన్నందుకు 'మాలిక్'కి (దైవానికి) ధన్యవాదాలు. ప్రయత్నం అంటూ ఉంటే ఏదైనా సాధించవచ్చు. భగవంతుడుని పొందటం

అనేది చాలా సులువైన పని అని నేను భావిస్తాను. 'అతని'వైపు శ్రద్ధా పూర్వకంగా హృదయాన్ని మళ్ళించడం అవసరం. ఇదే మాట నేను అందరితోనూ చెబుతాను. నీ లయావస్థ అభివృద్ధి చెందుతూ ఉన్నది. భగవంతుడు నీ మీద కృప నిలిపి, నీ ప్రయత్నం ఇలాగే కొనసాగుతూ ఉంటే, నీ స్థితి  నిలకడగా ఉంటుంది. ఆధ్యాత్మికతలో ఉన్నతికి ముగింపు అనేది ఏదీ లేదు. కేవలం 'లయ' చెందటం  మాత్రమే సరిపోదు. దీని తరువాత కూడా ఇంకా ఎంతో ఉంది. దానిలో కలిగే స్థితులకు కూడా అంతమనేది లేదు. సృష్టి ప్రారంభమైనప్పటి నుంచి మరెవ్వరూ పొందలేదు. ఎవ్వరైనా అత్యున్నత స్థితిని పొందగల్గినప్పటికీ దాని తరువాత కూడా నేర్చుకోవలసింది ఎంతో మిగిలి ఉంటుంది. ఈ రోజులలో మానవుడు తనకుతాను పరిపూర్ణుడనని ఎలా అనుకుంటాడు? పరిపూర్ణత్వమనేది కేవలం ఈశ్వరునిలోనే ఉంది. ఇలాంటి వాళ్ళను చూస్తే, ఒక సామెత గుర్తు వస్తుంది – ఎవరికో పసుపు కొమ్ము ముక్క దొరికితే తనకితాను ఒక వ్యాపారినని అనుకొన్నాడట. వేదాలు చెప్పాయి, 'నేతి', 'నేతి' అంటే 'ఇది కాదు', 'ఇది కాదు' అని. ఒక విషయం మనం దృష్టిలో ఉంచుకోవాలి. ఎవ్వరైనా సరే ఎవరితోనూ పరుషమైన మాటలు చెప్పకూడదు అని దృష్టిలో ఉంచుకోవాలి. ఎందుకంటే, ఒకవేళ అలా జరిగితే, వారి గౌరవాలకు కష్టం కలిగించే వారమవుతాము.

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 21

లఖీంపుర్,

13.12.1948

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

వినయపూర్వక వందనాలు. తమరు దయతో వ్రాసిన ఉత్తరం చేరింది. దానిని చదివాక నాకు అత్యంత ఆనందం కలిగింది. నా ఉత్తరం ఒకటి తమకు చేరిందనుకుంటాను. అప్పటినుండి దశలో ఏమీ మార్పు కనిపించలేదు గాని అప్పుడప్పుడు శిరస్సు మధ్యలో శాంతి వెలువడుతున్నట్లుగా అనిపిస్తోంది. సిట్టింగ్ తీసుకునే సందర్భంలో అప్పుడప్పుడు అక్కడ దృష్టి నిలిపినపుడు, ఏదో గుండ్రని చక్రం వంటిది ఉండి దానిలో కొద్దిగా స్పందనలు కలుగు తున్నట్లుగా అనిపిస్తోంది. ఎంత అధికంగా జీవత్వం అక్కడ ఉంటూ ఉందో దాని స్థానంలో మరణత్వం కూడా అంతే అధికంగా ఉంటున్నది. పూజ్య బాబూజీ! అయితే అంతరాంతరాల్లో శాంతి స్థానంలో అశాంతి కూడా అధికంగా ఉంటున్నట్లు అనిపిస్తోంది. కేవలం 'మాస్టర్'ను పొందాలను తపన తప్ప నాకు దేనిమీదా ఆసక్తి ఉండడంలేదు. ఎటువంటి స్థితి కొనసాగుతూ ఉందో, తమకు మరియు మాస్టర్ సాహెబ్‌కు తెలిసే ఉంటుంది. తమయొక్క సహకారం ఉండి కూడా నేను సర్వశక్తిమంతుడైన ఆ ఈశ్వరుని పొందలేకపోయాను అంటే అది నాకు అవమానంగా ఉంటున్నది. ఈ విషయంలో పురోగతికి అంతం లేకపోతే, భగవంతుని కృప మరియు తమ యొక్క ఆశీస్సులతో ఆ ఈశ్వరుని పొందాలను కోరిక మరియు 'అతని' స్మరణ కూడా అంతం లేకుండా ఉండునట్లు చూస్తాను. తమరు 'ఈశ్వరుడు' మాత్రమే పరిపూర్ణుడు, మిగిలినదంతా అసంపూర్ణం అని వ్రాసి ఉన్నారు. అటువంటప్పుడు నేను ఆ పరిపూర్ణుని పొంది పూర్ణత్వం చెందకుండా అపరిపూర్ణరాలుగా ఎందుకు ఉండిపోవాలి? 'తమరు' చెప్పినట్లుగా ఈ రోజు నుండి ఎప్పుడు కూడా ఎవరిపట్లనూ ఏది ఏమైనా సరే ఈ దీనురాలు కస్తూరీ అయిష్టమైన మాటలు చెప్పదు. పూజ్య బాబూజీ! నా ఆధ్యాత్మిక ఉన్నతితోపాటు, శారీరిక దారుఢ్యం కొరకు చేతికర్రను ఎంతో ప్రేమతో సేకరించి పంపించిన తమ ప్రేమ మరియు కారుణ్యాన్ని ఏమని కీర్తించను. తమ యొక్క ఈ పరమ ఉపకారానికి ధన్యవాదాలు. దీనితోపాటు కేసర్ ఉత్తరం కూడా పంపుతున్నాను.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 22

లఖీంపుర్,

24.12.1948

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరే ఉంటుందనుకుంటాను. తమరు దయతో స్వయంగా వ్రాసిన ఉత్తరం, పూజ్యులైన తండ్రిగారి నుద్దేశించి వ్రాసినది, విని చాలా ఆనందించాను. తావూజీ (కస్తూరిగారి పెదనాన్నగారు) పూర్తిగా మంత్రముగ్ధులైపోయారు. వారు అలా కావలసినదే కూడ. వారి ఆత్మోన్నతి తెలుసుకొని ఇంకా చాలా ఆనందం కలిగింది. తావూజీ మరియు తల్లిగార్ల దివ్య ఆత్మోన్నతి రెంటికి రెండింతలు, నాల్గుకు నాల్గింతలు కలగాలని తమకు విన్నవించుకుంటున్నాను. అనుక్షణం వారు 'మాలిక్' సామీప్యత పొందుతూనే ఉండాలి. నిద్రిస్తున్నా, మేల్కొని ఉన్నా కూడా వారు సదా దైవం యొక్క స్మరణలోనే నిమగ్నమై ఉండాలి. తమరు ఈ విధంగా జరుగనట్లు అనుగ్రహించాలి. ఎందుకంటే, నాకు ఇష్టం లేకపోయినప్పటికీ తావూజీనే నాకు పూజ్య మాస్టర్ సాహెబ్ వద్ద మొదటి సిట్టింగ్ ఇప్పించారు, తర్వాత వారే స్వయంగా తమ దర్శనం కల్పించారు. వారి యొక్క ఈ ఋణం తీర్చుకోలేనటు వంటిది. కనుక వారు ఈశ్వరునికి ప్రీతిపాత్రులుగా అయ్యేటట్లుగా చేయమని ఈ దీనురాలు సదా, సర్వదా తమరిని ప్రార్థిస్తూ ఉన్నది.

నేను ఇంతకుముందు వ్రాసినటువంటి దశ ఇప్పుడు పూర్తిగా అనుభూతికి రావటంలేదు. ఇప్పుడు పూజ్య తావూజీ మరియు మాస్టర్ సాహెబ్ ఎప్పుడైనా ఈశ్వరుని ప్రేమించటం గురించి చర్చిస్తూ ఉన్నప్పుడు నాకు అసలు ప్రేమ అనేది తెలియకపోగా, ఆపినా ఆగనంతగా కన్నీరు వస్తోంది. ఇప్పుడు అన్ని సమయాల్లోను చాలా సరళత్వం, తేలికదనం అనుభవమవు తున్నాయి. హృదయం యొక్క భారమంతా తొలగిపోయినట్లుగా అనిపిస్తోంది. ఎప్పుడైన ఎవ్వరైనా వచ్చినపుడుగాని, లేదా నేనే స్వయంగా ఎక్కడికైనా వెళ్ళినపుడుగాని, మాట్లాడుతున్నప్పుడు మధ్యలోగాని, తరువాతగాని హృదయంవైపు దృష్టిపెట్టినపుడు అది ఎక్కడో లగ్నమై ఉన్నట్లుగా తలపిస్తోంది. శిరస్సులో తీవ్ర కంపనం అనుభవమవుతోంది. ఏ విధంగానైతే మెదడు నిద్రపోతుందో, ఆ విధంగా శిరస్సులోను, నాభిలోను ఒక విధమైన శూన్యత్వం అనుభవమవుతున్నది. నాభిలో ఒక విధమైన దడగా ఉన్నట్లు అనిపిస్తోంది. అదే విధంగా శరీరం యొక్క ఉనికి కూడా తెలియకుండా ఉంది. రెండు రోజుల నుండి మెదడులో కొన్ని నిరర్థకమైన ఆలోచనలు తరచుగా వస్తూ ఉన్నప్పటికీ హృదయంలోకి చూస్తే అక్కడ శాంతంగానే ఉంది. ఇప్పుడు స్థితి బాగానే ఉంది. శిరస్సు నుంచి శాంతి ఇప్పుడు కూడా వెలువడుతున్నట్లుగా అనిపిస్తోంది. ఎందుకోగాని 8 లేదా 10 రోజుల నుండి సంభవించనున్న సంఘటనలు ముందుగానే వాటంతట అవే మనస్సులోకి వస్తూ ఉన్నాయి. ప్రస్తుత స్థితి ఎలా ఉందంటే, జీవిస్తూ ఉండి కూడా మరణించినట్లుగా అనిపిస్తున్నది. పూజ్య బాబూజీ! ఈ దీనురాలికి 'మాలిక్' నుంచి 'వారి' ప్రేమను అర్థించటం మరచిపోకండి. ఎందుకంటే ఈ దీనురాలిలో ప్రేమ చాలా తక్కువగా ఉంది.తల్లిగారు, కేసర్ తమకు ప్రణామం చేస్తున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 23

లఖీంపుర్,

10.01.1949

పరమ పూజ్య శ్రీ బాబూజీ,

సవినయ ప్రణామం. నేను వ్రాసిన ఉత్తరం తమరికి చేరే ఉంటుందను కుంటాను. ప్రస్తుతం ఉన్న దశను గురించి వివరిస్తున్నాను. చాలా రోజుల నుండి హృదయం పూర్తిగా ధ్యానంలో మునిగిపోయినట్లుగా అనిపిస్తోంది.

ఏదైనా చదవాలన్నా, మాట్లాడాలన్నా లేదా ఏదైనా పని చేయాలన్నా కూడా, ఇప్పుడే ధ్యానం నుంచి బయటకు వచ్చాను అన్నట్లుగా అనిపిస్తోంది. రాత్రిళ్ళు నిద్రనుంచి లేచినపుడు, అప్పటివరకు ధ్యానం కొనసాగించినట్లుగానే అనిపిస్తోంది. హృదయంమీద ఎటువంటి మాటల యొక్క ప్రభావం కాని, పనుల యొక్క ప్రభావం కాని ఉన్నట్లుగా అనిపించటంలేదు. మనసులో ఏవో ఆలోచనలు వచ్చినప్పటికీ, హృదయం మాత్రం ధ్యానంలోనే మగ్నమై ఉంటోంది. సిట్టింగ్ తీసుకోవటం ఆరంభించగానే శరీరం పూర్తిగా అచేతనంగా అయిపోతోంది. రోజంతా ఈ శరీరం, మనస్సు, బుద్ధితో ఎటువంటి పనులు చేస్తూన్నప్పటికీ, అవన్నీ 'మాలిక్' చేస్తున్నాడనీ, 'అతని' ప్రేరణతోనే జరుగుతున్నాయన్న భావన కలుగుతోంది. అప్పుడప్పుడు స్వప్నంలో కూడా తమరే సిట్టింగ్ ఇస్తున్నట్లుగా కనిపిస్తోంది. అది ఎలా ఉన్నా, అవన్నీ తమరికే వదిలి వేస్తున్నాను. నేను ఏమీ చేయలేను. నేను మాత్రం 'మాలిక్'కు అర్పితమైపోయాను. నేను మాత్రం పొందవలసింది 'అతడి'నే. 'తమరు' ఈ దీనురాలిపై దయ ఉంచి తమ ప్రేమలో ముంచేయండి.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 24

షాజహాన్‌పుర్,
16.01.1949

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. నీ ఆధ్యాత్మిక పురోగతిని సూచించే ఉత్తరాలందుకొని నేను హర్షిస్తున్నాను. ఈ పరిణామానికి భగవంతునికి ధన్యవాదములు. నా గురించి ఎవరూ అడగరు. నా గురించి తెలుసుకోవాలని తలంచరు. నాదగ్గర ఏ సంపదలూ లేనప్పుడు, నాగురించి ఎవరు పట్టించుకుంటారు? నా దగ్గరకి రావటమంటూ వస్తారు. నేను చెప్పేవి నేర్చుకుంటారు. కాని వారిలో బహుకొద్దిమంది మాత్రమే ఉత్తరాల ద్వారా బీదవాడినైన నా గురించి అడుగుతారు. నావైపు ఎవరైనా ఆకర్షితులు కావాలంటే నా దగ్గర దారిద్ర్యం తప్ప ఇంకేమి ఉంది? నేను మూటముల్లె (లగేజి) ఏమీ ఉంచుకోలేదు. ఎందుకంటే, నేను ప్రయాణం చేయనవసరము లేదు. ఒకవేళ నేను ఎవరినైనా మాతృభూమి (గమ్యం) వైపు ప్రయాణించమని చెబితే, ఇటువంటి ప్రయాణం చేసి లక్ష్యం సాధించి గమ్యం చేరాక నా సామాను (లగేజి) కూడా పోగొట్టు కోవలసివస్తే ఆ ప్రయాణం వలన ప్రయోజనం ఏమిటి? అని అడిగే హక్కు అతనికి ఉంటుంది కదా! పూర్తిగా అంతా పోగొట్టుకున్నాక, ఇప్పుడు మిగిలేది ఏమిటి? యాత్ర యొక్క ఫలితం ఇదేనా? పైగా మాటలలోనూ, సత్సంగ్‌లోనూ జనానికి ఇది తెలిస్తే, క్రమంగా శ్రద్ధ తగ్గి, వాళ్ళకు రావాలని అనిపించదేమో కూడా. దీనికి ఉదాహరణగా షాజహాన్‌పుర్‌లో ఒక వ్యక్తి ఇప్పటికీ జీవించి ఉన్నారు.

కాబట్టి, బిటియా! ఇప్పుడు నావద్ద ఏమి ఉందని మీ అందరికీ ఇవ్వగలను? పోగొట్టుకున్న వస్తువును మరల పొందటానికి ప్రయత్నించాలంటే అది కుదరదు. ఎందుకంటే, దానిని నేను ప్రయాణం కొరకై మూల్యంగా చెల్లించేసాను కదా! ఇంక నాదగ్గర ఏమి మిగిలింది? ఏమీ లేదు. ఈ 'ఏమీ లేదు' తీసుకోవటానికి అతికష్టం మీద ఒక్కరో ఇద్దరో మాత్రమే తయారుగా ఉంటారు. ఐతే ఇది నీకు నచ్చినట్లు అనిపిస్తుందా? నువ్వు కోరుకొనే ప్రేమ, వాత్సల్యం నీకు ఇద్దామనుకుంటే, అవి కూడా నాదగ్గర లేవు. అయితే ఒకటి మాత్రం నిజం. భగవంతుని ఎదురుగా నువ్వు, నేను చేతులు చాపి, ఇవి ఇవ్వమని ప్రార్థనచేస్తే ఇది సంభవిస్తుంది. ఇందులో కూడా నేను భయపడేది ఏమిటంటే, 'నావి అన్నీ నీకే అంకితం' అని సమర్పణ చేసిన నిరుపేద వ్యక్తికి, ప్రేమ అనేది ఇస్తే దానిని అతడు నిభాయించు కోగలడా? అని ఈశ్వరుడు ప్రశ్నించవచ్చు. బహుశా భగవంతుడు తన 'ప్రేమ'ను నీకు ఇస్తాడేమో. నా విషయంలో మాత్రం 'అతడు' నాకు ఇస్తాడో, ఇవ్వడో సందేహమే. ఎందుకంటే, నా సంగతి 'అతని'కి పూర్తిగా తెలిసిపోయింది. నువ్వు వ్రాసిన దానినిబట్టి చూస్తే, నాలాగే నీవు కూడా మోసపోయి యాత్రకు నీ దగ్గర ఉన్నవన్నీ చెల్లించి, సర్వమూ

పోగొట్టుకున్న నిరుపేద యాత్రీకురాలిగా అయిపోతావేమో అని నేను భయపడుతున్నాను. (యాత్రకు సామానులు అంటే సంస్కారాలు / అహంగా అర్థం చేసుకోవాలి)

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

**(ఎన్నో ఛలోక్తులతో ఎన్నెన్నో గూఢమైన ఆధ్యాత్మిక వివరాలు, తన గురించి శ్రీ బాబూజీ మహరాజ్ ఎంత చక్కగా వర్ణించారో పాఠకులు గమనించగలరు.)**

## ఉత్తరం సంఖ్య - 25

లఖీంపుర్,

24.01.1949

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఆశీర్వాదాలతోను, దయతోను నిండి ఉన్న ఉత్తరం అందింది. దానిని చదివి అత్యంత ఆనందం పొందాను. నిన్నటి రోజున పూజ్యులు మాస్టర్ సాహెబ్ మరియు తావూజీ (పెదనాన్నగారు) ద్వారా దాని అర్థం తెలుసుకొని, కొంతసేపు పూర్తిగా స్పృహ కోల్పోయినట్లు అనిపించింది. పూజ్య బాబూజీ! తమరు చాలా పేదవారు. ఒక పేదవాడు తన పేదరికంతప్ప ఇంకేమి ఇవ్వగలడు! అందుచేత ఓ పేదరికపు దేవుడా! ఈ దీనురాలికి తన పేదరికాన్నే ఇచ్చుగాక! నేను ధనవంతురాలనై చేయగలిగేది ఏముంటుంది. ఇంకా చెప్పాలంటే, ఈ దుర్బల శరీరంలో ఆ ధనికత్వాన్ని నిలుపుకోవటానికి బలం, బుద్ధి, తెలివితేటలు లేవు కూడ. ఇంక జరగాల్సింది యాత్ర మాత్రమే. బాబూజీ! ప్రయాణం చేసి చేసి నేను అలసిపోయాను. కనుక ఇప్పుడు అటువంటి యాత్ర నుంచి విరామం లభించేటట్లుగా దయ చూపండి.

శ్రీ బాబూజీ! నేను నిజంగా శపథంచేసి చెబుతున్నది ఏమిటంటే, ఈ దివ్యత్వాన్ని పొందటానికి నా సర్వస్వమూ అర్పించి వేశాను. ఇది మంచిదా, కాదా అను దానితో ఈ దీనురాలికి ఏమీ సంబంధం లేదు. ఏమైనా దీనిని పొందవలసిందే. నా ఈ పట్టు (దీక్ష) సడలేది కాదు. ప్రాపంచికంగా (సామాజికంగా) మూడు దీక్షలు ప్రసిద్ధమైనవిగా ఉన్నాయి. అవి బాల దీక్ష, నారీ దీక్ష, రాజ దీక్ష. నా దృష్టిలో ఈ మూడు దీక్షలు మాత్రమే కాకుండా నాలుగు ఉన్నాయి. అవి బాల దీక్ష, నారీ దీక్ష, రాజ దీక్ష మరియు రోగి దీక్ష. పూజ్య బాబూజీ, నిజంగా నాకు 'మాలిక్'ను ఏమి కోరుకోవాలో కూడా తెలియదు. నేను ఇప్పుడు పూర్తిగా 'అతని'కి అర్పితమైపోయి ఉన్నాను. నా అణువణువూ ఆ 'మాలిక్'దే అయిపోయింది. నాకంటూ స్వయంగా ఏమీ లేకుండాపోయింది. అందువలన నాకు అనుగ్రహించటమా లేదా అన్నది 'మాలిక్' అభీష్టం. 'మాలిక్' పేదరికాన్ని ఇచ్చినా లేదా దారిద్ర్యాన్ని ఇచ్చినా అది నాకు శిరోధార్యమే. వస్తువు ఎవ్వరిదైతే వారే దాని జాగ్రత్త వహిస్తారు. ఇప్పుడింక ద్వంద్వం (నేను, 'అతడు' అనునది) లేదు. 'అతడు' ప్రేమను అనుగ్రహిస్తే ఆ ప్రేమలో నేను పరవశిస్తాను. ఒకవేళ పేదరికాన్ని అనుగ్రహించినట్లయితే దానితోనే ఆనందం చెందుతాను. బాబూజీ! ఇప్పుడు మాతృభూమి 'అతడే', యాత్రా 'అతడే', సామానూ 'అతడే', అలాగే నేను కూడా 'అతడి'నే.

ప్రస్తుతం ఉన్న దశను గురించి ఉన్నది ఉన్నట్లుగా వ్రాశాను. ఇంక బసంత పంచమికి మేమందరం రాగలము.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

# ఉత్తరం సంఖ్య - 26

షాజహాన్‌పుర్,
09.02.1949

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

ఆశీస్సులు. 24.01.1949న నీవు వ్రాసిన జాబు అందింది. ఇప్పుడు ఉత్సవం ముగిశాక దానికి జవాబు వ్రాస్తున్నాను. ఒక నిరుపేద తన నిరుపేదరికాన్ని ఇవ్వగలడు –అని నా ఉత్తరానికి జవాబుగా వ్రాశావు. నేను కటిక పేదవాడిని అని నేను వ్రాసిన దానికి ఇది జవాబుగా ఉంది.

ఆ పేదరికం (సాధనలో) (అనగా తన దానిని తాను పోగొట్టుకోవటం) యొక్క స్థితికోసం లోకులు తపించిపోతూ ఉంటారు. బహుశా దాని ఆనందాన్ని (మజా) ఋషులు కూడా అనుభవించి ఉండరు. మన దగ్గర సంపద లేదు అంటే మనం బీదవారం అనే అర్థం. ధనవంతుని దగ్గర అన్నీ ఉంటాయి కాని బీదవాని దగ్గర ఏమీ ఉండవు. అనగా పేదవాని దగ్గర ఏమీ 'లేదు' అని అర్థం. ఎవ్వరివద్ద నయితే ఏమీ ఉండదో, ఇతరులకు ఇవ్వటానికి అతనివద్ద ఏమి ఉంటుంది? ఒకవేళ ఇవ్వవలసి ఉంటే దానిని 'ఏమీ లేదు' అని చెప్పవలసి ఉంటుంది. మరి అది ఇవ్వదగిన వస్తువు కాదని అనబడుతుంది. ఒకప్పుడు ధనికుడైన మానవుడు తన సంపదను ఇతరులకు వితరణ చేయగలిగి ఉండేవాడు. అది తరిగిపోయి పేదరికం పెరిగిపోతూ ఉంటే, అతడు ఇవ్వగల్గింది కూడా తరిగిపోతూ వచ్చింది. అసలేమీ మిగలనప్పుడు, ఏమీ ఇవ్వలేకపోయాడు. ఇప్పుడు అతడ్ని అర్థించి చూసినట్లయితే, అతనివద్ద మిగిలింది ఏదో దానినే ఇవ్వగలడు. ఒకవేళ నన్ను కూడా అటువంటివాడే అనుకుంటే నావద్ద ఇవ్వటానికి ఏమీ లేదన్న మాట. అయితే, దీనిలో ఒక విషయం తప్పనిసరిగా ఉంది. అది ఏమిటంటే, 'ఏమీ లేదు' అనుదాని లోతులో (నిగూఢంగా) 'ఏమీ లేదు' అని ఎవ్వరికైతే చెప్పబడిందో, దానిలో ఏదో ఖచ్చితంగా ఇవ్వదగినది ఉంది. ఇకమీదట ఇదేమీ ఉండదు. అప్పుడింక ఇచ్చి పుచ్చుకోవటాలు అన్నీ ముగింపు అవుతాయి. ఇప్పుడు ఈ స్థితికి చేరటానికి అనువైన విధానం ఏమంటే, ధనవంతుడైన వాని దగ్గర ఉన్న వాటిని గుంజుకుంటూ పోవటమే. చివరకు అతనివద్ద ఏమీ మిగలకపోయినప్పుడు, అతడు దరిద్ర స్థితికి దిగజారతాడు. ఎవరిదో సొత్తు లేక లగేజిని గుంజుకుపోవటం శాస్త్ర విరుద్ధం కాదా! అను విషయం చౌబేజీగారిని (కస్తూరీగారి తండ్రిగారు) అడిగి నాకు జాబు వ్రాయి. సామగ్రి ఉండి కూడా, దాని అజ (అజమాయిషీ) లేకపోయినట్లయితే ఈ ప్రశ్న ఉత్పన్నమవుతుంది అని, అయినప్పటికీ ఏదో విధంగా అతనివద్ద సామాను ఉన్నట్లుగానే అవుతుందని, అటువంటప్పుడు సామాను ఉండి కూడా బీదరికం ఎలా వస్తుందని, ప్రస్తుతానికి అజ (అజమాయిషీ) లేకపోయినా సమయం వచ్చినప్పుడు అతనికి తప్పక జ్ఞాపకం కలుగుతుందని మీ తండ్రిగారే అన్నారనుకుంటే ఇప్పుడు జరగాల్సింది ఏమిటి? దీనికి తరుణోపాయం ఏమిటంటే, అవసరం వచ్చినపుడు దాని సమాచారం అందేటటువంటి చోట సామాను ఉంచినట్లయితే, ఈ వస్తువులు ఇతరులవద్ద తనఖా ఉంచినట్లుగా అతని దృష్టికి వస్తుంది. ఇది ప్రారంభ దశలోని పద్ధతి. ఇంకొంచెం పురోగమించాక, ఏ సామాను అయితే ఇతరులవద్ద కుదువ పెట్టబడిందో, 'అతని'కి అర్పించిన దాని మీద తనకు ఏమీ అధికారం లేదని అనిపించినపుడు, అంతా ఉన్నా కూడా ఏమీ లేదనిపించినటువంటి స్థితి కలిగినప్పుడు, అంతా ఉన్నా కూడా ఏమీ లేదు అని అతనికి అనిపిస్తుంది. ఇప్పుడు మనకు ఆంతరిక శక్తులు, సిద్ధులు కలిగాయి అనుకుంటే అనగా ఏ శక్తులు మనకు ఈశ్వరుడు నుంచి లభించాయో, వాటి అన్నింటినీ ఈశ్వరునికి చెందినవిగానే భావించి, వాటన్నింటినీ 'అతని'కే (ఈశ్వర్) కైవసం చేస్తే, ఇంకో విధంగా చెప్పాలంటే, ఆ శక్తులు అన్నింటిని 'అతని'కే విక్రయించివేస్తే అపుడు మనం అన్నీ వదులుకుని రిక్తహస్తాలతో ఉంటాము. అయితే వీటిని సమర్పించదగిన యోగ్యుని వెదకటం ఎలా అను సమస్య ఉత్పన్నమవుతుంది. దృష్టి సారించినట్లయితే 'అతడు' చేర శక్యం కానంత దూరంలో ఉన్నాడు. ఒకవేళ 'అతను' మనకు అతిసమీపంలోనే ఉన్నప్పటికీ, మన కన్ను తనను తానే చూడలేకపోయినట్టి పరిస్థితిగా ఉంటుంది. మరి ఇటువంటి ఉత్తమ తనఖాదారును

పొందటం ఎలా? దీనికి పరిష్కారం ఏమిటంటే, మనం ఆపాదమస్తకం (పాదాల నుంచి శిరస్సు వరకు) కన్నులాగా అయిపోతే ఇప్పుడు మనం పూర్తిగా కన్నుగా అయిపోయామని కనీసం మనం చెప్పటానికి అవకాశం ఉంటుంది. ఇప్పుడు కేవలం చేయవలసిందల్లా మనం 'అతడు'ని వెదకటమే. ఒళ్ళంతా కన్నుగా అయిపోయినపుడు, మన శరీరాని కంతటికీ చూడగలిగిన శక్తి కలిగినట్లవుతుంది. ఇప్పుడింక చూడటం ఏమిటి, మన ఒళ్ళంతా కన్నే అయిపోయినపుడు మన దగ్గర అదికాక ఇంకేమి ఉంటుంది? ఇప్పుడు కన్నును కన్ను చూడలేదు అని చెప్పుకుంటున్న స్థితి ఇంక మిగిలి ఉండదు. ఎందుకంటే, మనం 'అతడి'వైపు చూడటానికి ఏ శక్తి అయితే ప్రేరణ కలిగిస్తూ ఉందో అది ఇప్పుడు పూర్తిగా మాయమైపోయింది. ఎందుకంటే, అనేక రూపాల్లో ఉన్న ఆ శక్తుల స్థానంలో ఇప్పుడు కన్ను మాత్రమే మిగిలి ఉంది. చూడు బిటియా! దేని నుంచి అయితే ప్రకాశం వ్యాపిస్తూ ఉందో అన్నివైపులా అదే వస్తువు (రియాలిటి) ఉన్న స్థితి కలుగుతుంది. ఏ కన్ను అయితే కన్నును చూడాలనుకుంటూ ఉందో, అది ఇప్పుడు ఆపాదమస్తకం అనగా పాదం నుంచి శిరస్సు వరకు ఒక్కటిగా అయిపోయింది. ఇప్పుడు ఎవ్వరూ స్వయంగా దానిని చూడవల్సిన అవసరం కూడా లేదు.

దీని సారాంశం ఏమిటంటే, కంటికి తనలోనే తనను చూడగలిగినటు వంటి స్థితి ఇప్పుడు తొలగిపోతూ ఉంది. ఇదే విధంగా మనం కంటికి బదులు భగవంతుడ్ని భగవంతుడే అని అనుభూతి చెందగల్గుతూ ఉంటే మనకింక కుదువబెట్టుకునే వారిని (తనఖాదారు) వెదకాల్సిన అవుసరం ఉండదు. ఇలా ఎందుకంటే, ఆ ఉన్నదంతా, దేనినైతే తనఖాదారునికి అర్పించాలని అనుకున్నామో అది అంతా అసలు రూపం దాల్చుతుంది. ఇప్పుడింక బీదరికం (దారిద్ర్యం) వచ్చింది. అయితే ఇంక ఈ కలిమిని, లేమిని (సంపద, దారిద్ర్యం) రెంటినీ మనం అంతం చేయాల్సి ఉంటుంది. ఆపాదమస్తకమూ నేత్రం (కన్ను) బదులు, భగవంతుడే అయినటువంటిది ఆ నిజనేత్రంగా అయిపోయినపుడు, దాని జాడ తెలియనటువంటిది స్వాభావికంగా జరిగినపుడు, సంపన్నత మరియు దారిద్ర్యం (లేక కలిమి లేములు) రెండూ అంతర్ధానం కావటం అప్పుడే జరుగుతుంది.

ఇంతకుక్రితం జాబులో నా దారిద్ర్యం (ఏమీ లేకపోవటం) గురించి నేను వర్ణించినది, ఒక భక్తుని (సేవకుని) స్థితి. దీని తర్వాత విశిష్ట వ్యక్తిత్వం (Great Personality) కాగా ఇంకా దాని తర్వాత అవతారాల స్థితి అవుతుంది. బిటియా! ఈ జాబుకు నీవు జవాబు వ్రాసినట్లయితే నా హృదయానికి చాలా సంతోషం కలుగుతుంది. జవాబు వ్రాయటంతోనే సరికాదు, అలాగే తయారవ్వాలని ప్రార్థించు. భగవంతుడు దూరంగా లేడు, 'అతడు' ఏదైనాసరే చేయగలడు. నీవు షాజహాన్‌పుర్‌లో ఉన్నప్పుడు, "బాబూజీ! నన్ను నౌకరుగా ఉంచుకోండి" అని నీవు నాతో అన్నావు. నీ ప్రేమార్ద్రమైన ఈ మాటలతో నేను సంతోషించాను. బిటియా! నీ ఆరోగ్యం గురించే ఆలోచిస్తున్నాను. ఈ ఆరోగ్య కారణంగానే నెమ్మది నెమ్మదిగా రూపాంతరం (మార్పు) చేయవలసి వస్తోంది. కాదంటే ఆధ్యాత్మికతను అసలు రూపంలో ఉత్పన్నం చేయటం క్షణంలో జరిగే పని. నీ నౌకరీకి జీతంగా నీవు రోజుకు ఆరు సిట్టింగులు కోరావు. భగవంతుడు ప్రసన్నుడైతే అనుక్షణమూ సిట్టింగులే సిట్టింగులు కలిగే స్థితిని అనుగ్రహిస్తాడు. ఇంకేముంది, నేను ఎవరి నౌకరునో, 'అతని' నౌకరివి నీవు కూడా అవుతావు.

కేసర్ నీ జాబుతోపాటు తన జాబును కూడా పంపించింది. దానికి జవాబు ఏమిటంటే, ఆమె నా కుమార్తె లేదా చెల్లెలుగా నాకు ఆమెతో బాంధవ్యం ఉంది. ఈ ప్రపంచమంతా నా కంటే మిన్నగా (మంచిగా) తయారుకావాలని నేను కోరుకుంటాను, అందుకు నేను ప్రార్థిస్తాను కూడా. దానికి ప్రతిఫలంగా నాకు ఎన్ని శిక్షలు పడినా వాటిని నేను భరిస్తాను. ఈ ఉత్తరంలో నేను వైరాగ్యం, లయావస్థ మరియు వాటితోపాటు ఈశ్వర సాక్షాత్కారం గురించి వివరించాను. ఈశ్వర దర్శనం (సాక్షాత్కారం) యొక్క స్థితి మరి దాని వలన కలిగే ఆనందం ఎలా ఉంటాయి అంటే ఉప్పుదనంలేని ఉప్పురాయిలా ఉండి ఇదే దశ ఆఖరి వరకూ ఉంటుంది. దీనికోసమే లోకులు జన్మజన్మాంతరాలుగా సాధనచేస్తూ ఉంటారు. దాని ఫలితంగా దొరికే దానిని (సూక్ష్మ దశను), సాధకులకు ఆరంభంలోనే ఇచ్చినట్లయితే వారు పారిపోవటానికి

సిద్ధమవ్వటమే కాకుండా భగవంతునివైపు ఆకర్షితులు కూడా కారు (ఆసక్తి కూడా చూపరు).

నీ శ్రేయోభిలాషి,
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 27

లఖీంపుర్,
13.02.1949

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

నమస్సులు. తమరు దయతో వ్రాసిన ఉత్తరం చేరింది. దానిని చదివాక అత్యంత ఆనందం కలిగింది. ఇటువంటి ఉత్తరం నేను ఇంతవరకు ఎప్పుడూ చూసి ఉండలేదు, విని ఉండలేదు. ఈశ్వరుడు, దయతో నాకు తమ పరిచయం కల్పించాడు. అందువలన ఇటువంటి ఉత్తరాలను చూస్తున్నాను. నేను ఇంతకుపూర్వం వ్రాసిన ఉత్తరంలో, ఒక పేదవాడు పేదరికం తప్ప ఇంకేమి ఇవ్వగలడు అని వ్రాశాను. కాని బాబూజీ, ఈ పేదరికం ముందు ప్రపంచంలోని సౌభాగ్యమంతా త్యజించవచ్చు. ఈ పేదరికపు దశ కొరకు జనం తహతహలాడి తనువు చాలించారు అని తమరు వ్రాశారు. అయితే నా అభిప్రాయం ప్రకారం ఈ పేదరికం ఈ మిషన్ సభ్యులందరిపైనా ఏదో ఒక రోజున ఆక్రమణచేస్తూ పోతుందని చెప్పగలను. ఎందుకంటే, మీరే ఈ విధంగా ఒకసారి వ్రాశారు. ఏమని అంటే, – ఒక వ్యక్తి ఉన్నాడనుకుందాం, అతడు ఒకప్పుడు ధనవంతుడు. తన సంపదను ఇతరులకు పంచిపెట్టగలిగి ఉండేవాడు. ఆ విధంగా పంచుతూ పంచుతూ పోగా సంపద కరిగిపోయి పేదరికం పెరిగిపోయి అతడు ఇతరులకు పంచిపెట్టటం కూడా తరిగిపోసాగింది. చివరకు అతనివద్ద ఏమీ మిగలకపోయి, ఏమీ ఇవ్వలేకపోయిన వాడై పేదవాడైపోయాడు. తమరు చెప్పినట్లు ఇదే విధంగా ఎప్పుడైతే ధనవంతులు తమ సంపదను (అస్థిత్వాన్ని) 'మాలిక్'కు అర్పిస్తారో లేదా పరమ దయాళువైన ఆ 'మాలిక్' స్వయంగా గుంజుకుంటూపోతాడో, అప్పుడు చివరకు సర్వస్వమూ ఇవ్వడమో లేదా గుంజివేయటమో జరిగాక, తామే స్వయంగా పేదవాడుగా అయిపోయి, ఇంకేమీ మిగలకుండాపోతుంది. ఈ విధంగా తమరు దయతో ధనవంతులమైన మా ధనాన్ని (సెల్ఫ్, అహం అని అర్థం) లాక్కుంటూ పోయినట్లయితే, ఈ విధంగా అపహరించటం అనేది శాస్త్ర విరుద్ధం కాదు అని తావూజీ (కస్తూరిగారి పెదనాన్నగారు) చెప్పారు. దానికి బదులు ఇలా జరగటమనేది ఆ బాధితులకు, అనగా అనవసరమైన మాయా ఝుంఝూటనాల్లో కూరుకుపోయి, స్వయంగా తమంతటతామే ఘోర దుఃఖ సాగరంలో మునిగి తేలేవారికి ఉపకారమే అవుతుంది. వాస్తవానికి ఎప్పుడైతే ఇవ్వటం, తీసుకోవటం అనేవి సమాప్తమైపోతాయో అప్పుడే నిజమైన ఆనందం కలుగుతుంది. పూజ్య బాబూజీ, తమరు ఈ ఉత్తరం వ్రాయటమే కాకుండా, ఎంతో చక్కనివి, ప్రభావంతం చేయగల ఉపదేశాలను ఈ దీనురాలికి అందించారు. మనం సామాను ఏమీ లేదనుకుంటున్నప్పటికీ, మనకు చెందిన సామాను ఏదో ఉన్నట్లయితే మరి పేదరికమని ఎలా అంటాము అని తమరు చెప్పిన ఉపదేశం ఎంతో అందంగా ఉన్న మాట నిజం. కనుక ఈ మాటల సారాంశం ఏమిటంటే, తనకు చెందినవి అన్నీ దైవానికి అమ్మివేయటమే.

బాబూజీ, సామాను ఎవరికైతే విక్రయించవలసి ఉందో ఆ 'తనఖాదారుడు' చాలా దూరంగా ఉన్నాడు అను ఆలోచన ఉండేది. కాని, ఆ 'తనఖాదారు'ని కృప మరియు దయవలన 'అతడే' స్వయంగా మనకు అతిసమీపంలోకి రావటమే కాకుండా, మన శరీరంలోని కణకణములోను, హృదయంలోపల చొచ్చుకుపోయి ఉన్నాడు. 'అతడు' ఎప్పుడూ దూరంగా గతంలో లేడు, ఇప్పుడూ లేడు, ఇకముందూ ఉండబోడు. ఎప్పటివరకైతే మన కళ్ళు స్వయంగా మన కంటినే చూడలేవను భ్రమతో ఉన్నామో అప్పటివరకు 'అతడు' దూరంగానే ఉన్నాడు. పరమప్రియులైన శ్రీ బాబూజీ, పూజ్యులైన మాస్టర్ సాహెబ్ మరియు పెదనాన్నగారు (తావూజీ) వివరించి చెప్పినమీదట తమరు వ్రాసిన ఉత్తరం కొంచెం అర్థం చేసుకోగలిగాను. అయితే "అతడు హృదయంలోనే ఉన్నాడు" అనేది అర్థం చేసుకుని

జవాబు ఇవ్వటం చాలా కష్టం. నేను నా పేదరికం గురించి వర్ణించినదానిలోని స్థితి తమదే అని తమరు వ్రాశారు. ఈ స్థితి ఇంతకుముందు ఇదే వ్యక్తిత్వం ఉన్న వారిదని, ఇంకా దానికి పూర్వం అవతారులదని వ్రాశారు. నేను ఇక్కడ పూజ్య మాస్టర్ సాహెబ్‌గారి ఇంటిలో ఒక వ్యాఖ్యను విన్నాను, కనుక తమరింక తమ గురించి దాచిపెట్టే ప్రయత్నం వ్యర్థమే. తమరు ఈ దీనురాలిపై ఇదే విధంగా సంతోషం కల్పించుకోండి. ఎందుకంటే, ఉత్తరానికి సమాధానం వ్రాయలేని అసమర్ధురాలను. తమ ఆశీర్వాదంతో ఈ విధంగా కావటానికి ప్రార్థన నయితే తప్పకుండా చేస్తాను కాని, నిన్న తమ ఉత్తరం చదివి, ఈ విధంగా తయారు కావటానికి 'మాలిక్'ను ప్రార్థించటం ఎప్పుడు ఆరంభించానో అప్పుడు ఏమయ్యిందో ఏమోకాని 'అతడి'ని జ్ఞాపకం చేసుకుంటూ ఉండగానే ఆనందంతో మైమరచినట్లుగా అయిపోయాను, దానివలన ఏమీ కోరుకోలేకపోయాను. ఈ హృదయం ఉప్పొంగి నా నుంచి ఎక్కడకు పోయిందో చెప్పలేకున్నాను. తమ ఆశీర్వాద ఫలితంగాను, పూజ్య మాస్టర్ సాహెబ్ యొక్క కృషి ఫలితంగాను షుమారు రెండు, రెండున్నర నెలల నుంచి నిద్రపోతున్నా, మేల్కొంటున్నా కూడా ఇరవై నాలుగు గంటలూ, సిట్టింగ్ నుంచి లేస్తున్నానా అన్నట్లుగా ఉంటోంది. షాజహాన్‌పుర్ వెళ్ళి తిరిగి వచ్చినప్పటి నుండి ఒక్క నిమిషం కూడా సిట్టింగ్ లేకుండా లేను. ఎంతో ప్రయత్నించి, హృదయాన్ని ధ్యానం నుంచి తప్పించి, నేడు దీనిని తమ ఉత్తరంగా భావించి, 'మాలిక్' దయతో శృతికలవని మాటల్తో వ్రాసాను. బాబూజీ, 'మాలిక్' నన్ను ఇపుడు కొనివేశాడు. తమరే నన్ను అమ్మివేశారు. ఇప్పుడు 'నేను' అను భావన ఉండదు. ఇప్పుడు ఈ స్థితి ఎంతగా స్థిరంగా ఉందంటే, 'అతను'తో పాటు తమరుకాని, మరింకేమైనాగాని కనిపించడం లేదు. నా ద్వారా 'అతడు' పని చేస్తూ ఉన్నట్లుగా గమనించాను. ఏదైతే వ్రాశానో అది అంతా 'ఆతని' ఇష్టప్రకారమే వ్రాయించాడు. నేను ఇప్పుడు 'మాలిక్' చేతిలో యంత్రంలాగా అయిపోయాను. 'అతడు' ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు, ఏ దిశగా కదిలించాలో అలా నన్ను కదిలిస్తున్నాడు. బహుశా నేను తమకు ఒక ఉత్తరం వ్రాశాననుకుంటున్నాను. దానిలో ఏమి వ్రాశానో జ్ఞాపకం లేదు. అది ఏమైనా అయి ఉండవచ్చు. నేను అజ్ఞానురాలను, నాకు వైరాగ్యం, లయ-అవస్థ, ఈశ్వర దర్శనం అంటే ఏమిటో ఏమి తెలుస్తాయి! అయితే, తమరు దయతో వ్రాసిన ఉత్తరం మూలంగా నా హృదయంలో ఎంతో కొంత సాదృశ్యమైంది. మీ దగ్గర నుండి తిరిగొచ్చాక, దశ కొంత మెరుగైంది. అదేమిటో తమరికే తెలుసు. తమకు ఎప్పుడు ఇవ్వాలనిపిస్తే అప్పుడు నాకు ఈ స్థితులు అనుగ్రహించండి. ఇది మాత్రం గుర్తుపెట్టుకోండి, ఇప్పుడు కస్తూరి తమరినింక విడిచి ఉండజాలదు. శ్రీ బాబూజీ, నేను తమ సేవకురాలనై పోయాను. ఎందుకంటే, గత రెండు నెలల నుండి దఫాలవారీగా తమ నుంచి జీతం తీసుకుంటున్నాను. ఇప్పుడు నేను 'అతడి'ని ప్రేమిస్తున్నానా లేదా అను అనుమానం అప్పుడప్పుడు కలుగుతూ ఉంటుంది. ఇప్పుడు జీవితంలో చాలా సరళత్వం వంటిది చోటుచేసుకుంది.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 28

లఖీంపుర్,

23.02.1949

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సాదర ప్రణామాలు. నా ఉత్తరం తమకు చేరే ఉంటుందనుకుంటాను. నేను గత ఉత్తరం పంపించినప్పటి నుండి బహుశా తొమ్మిది లేక పది రోజులనుంచి ఆధ్యాత్మిక స్థితిలో ఇంకొకటి ఏదో మార్పు కలిగింది, మిగతా దశ అంతా అలాగే ఉంది. అది ఏమిటంటే, హృదయం అతితేలికగాను, స్వచ్ఛంగాను అయిపోయింది. ఇంతకుపూర్వమైతే నేను రోజంతా సిట్టింగ్ తీసుకున్నట్లుగానే ఉంటున్నదని వ్రాశాను. కాని ఇప్పుడు నేను సిట్టింగ్ తీసుకుంటున్నప్పుడు కూడా సిట్టింగ్ తీసుకుంటున్నట్లుగా అనిపించటంలేదు. ఇప్పుడు కలిగిన ఈ సరళత్వం ఆశ్చర్యకరంగా ఉంది.

ఈ దశ ఏమిటో, ఎటువంటిదో నాకు సక్రమంగా తెలియదు. పూజ్య మాస్టర్ సాహెబ్ ఇది మంచిదే అన్నారు కాని నాకు మంచిగా అనిపించటంలేదు. అయితే హృదయం మాత్రం దీని నుంచి వైదొలగాలని అనుకోవటం లేదు. ఇప్పుడు నేను ఆ సర్వశక్తిమంతునికి ఎప్పుడో అమ్ముడుపోయాను. 'ఆతడు' కూడా నన్ను ఖరీదు చేసివేశాడు, ఇప్పుడు 'ఆతడు' ఏదైనా నాకు ఇవ్వనీ లేదా ఇవ్వకపోనీ. తమ ఆజ్ఞ ననుసరించి దైనందిని వ్రాయటం ప్రారంభించాను. ఒక వ్యాసం కూడా కొంత వరకు వ్రాశాను. అమ్మ తమకు ఆశీస్సులు తెలుపుతున్నది.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 29

లఖీంపుర్,

09.03.1949

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామము. తమరు సుఖంగా ప్రయాణించి ఇల్లు చేరి ఉంటారని భావిస్తున్నాను. తమ శుభాగమనంతో మేమంతానే కాకుండా సమస్త లఖీంపుర్, అంతటా సుఖశాంతులు మరియు పవిత్రత తరంగాలు వాతావరణంలో వ్యాపించాయి. ఇటువంటి సోదరుని పొంది ఈ సోదరి సార్థఖ్యం చెందింది. పూజ్య బాబూజీ, ఈశ్వరుని కృపవలన, తమరు నెలకొల్పిన "సహజమార్గం" అతిశీఘ్రంగా, ఇంతవరకు ఏ సంస్థ కూడా పొందనటువంటిది, భవిష్యత్తులో కూడా పొందలేనట్టి బహుళ ప్రచారాన్ని పొందుతుంది. తమరు ఈ విషయం గురించి ఏమీ చింతించవద్దు. ఇప్పుడు తమ యొక్క ఈ పుత్రిక కూడా తమ సేవలో తనువు, మనస్సు మరియు ధనం అన్నీ సమర్పించగలునట్లుగా తమరు ఆశీర్వదించండి. నా దశ ఏమిటో తమకు బాగా తెలిసినదే. ఎందుకంటే నా హృదయం కొంచమే కాకుండా, సంపూర్ణంగా 'మాలిక్' కొరకు తెరచి ఉంచబడింది. 'నీవే' నేను, నేనే 'నీవు' అన్నట్లుగా నా దశ ఉంది. ఇప్పటివరకు నేను మాత్రమే ఒక యంత్రంలాగా ఉన్నాను అనుకుంటే ఇప్పుడు నాకు ప్రతి ఒక్కరూ 'మాలిక్' యొక్క యంత్రంలాగ పనిచేస్తున్నారు అనిపిస్తోంది. నిజానికి ఎటువంటి దశ ఏర్పడింది అంటే,

**దర్–దీవార్, దర్పణ్ భయె, జిత్ దేఖూం తిత్ 'తోయ్',**
**కాంకర్ – పాథర్–ఠీకరీ, భయె ఆరసీ మోయ్.**

అనగా తలుపులు, గోడలు వంటివి అన్నీ నాకు అద్దంలాగా కనిపిస్తున్నాయి. వాటిలో ఎక్కడ చూసినా తమర్ని దర్శించుకుంటున్నాను. ప్రతి రాయి, పెంకుముక్కలోను ఒక అద్దంలో మాదిరిగా నన్ను నేను చూసుకుంటున్నాను. సూక్ష్మంగా చెప్పాలంటే, ప్రతి దానిలోను, ప్రతి ఒక్కరిలోను, నాలోను కూడా నేను భగవంతుడినే దర్శించుకుంటున్నాను.

ఈ దశ పూర్తిగా నిశ్చలంగా ఉంది. ఏ పనిలోను అమితానందంగాని, నిరుత్సాహంగాని అనిపించటంలేదు. ఇంతకుపూర్వం దైవం తానేమీ కోరని దయాళువు అని వింటూ వచ్చాను కాని ఇప్పుడు స్వయంగా నా అనుభవానికి వచ్చింది.

తమరు ఇక్కడి నుండి వెళ్ళాక, (Nothingness) "ఏమీలేదు" అనునటువంటి దశ చాలా అధికంగా వృద్ధి చెందింది. అయితే నిన్న పూజ్య మాస్టర్ సాహెబ్‌గారి సిట్టింగ్ తర్వాత ఈ స్థితి నుంచి ఒక్క క్షణమైనా బయటకు రాలేదు. నాలో ఎటువంటి ఆలోచనలు కలగకపోయినప్పటికీ, అన్ని పనులు నా ద్వారా జరపబడుతున్నాయి. పూజ్య శ్రీ బాబూజీ, ఇదంతా 'తమరు' ఇచ్చిందేకాని, నాదేమీ లేదు. దయచేసి సర్వదా ఈ దీనురాలిపై ఇటువంటి దయనే నిలిపి ఉంచండి.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 30

లఖీంపుర్,

14.03.1949

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామము. పవిత్రమైన "బఇయా దోజ్"కు సంబంధించిన "రోరీ" పంపుతున్నాను. పండుగ కానుకను పొందాను. అయితే 'దోజ్' రోజున సోదరుని నుదుట ఏమీ లేకుండా ఉండకూడదు కనుక తప్పనిసరిగా కుంకుమ పెట్టుకోండి. సోదరా, నేనేమి చేయను! సోదరులంతా ధనవంతులైన కారణంగా ఆకర్షించబడే గుణం ఉంటుంది. తద్వారా ఎంతో ఆనందదాయకమైన వస్తువులు (బహుమతులు) బహూకరిస్తారు. వాటిని మాటలతో వర్ణించలేము. నేను ఇంతకుముందే నా ఆధ్యాత్మిక స్థితులను గురించి ఉత్తరం వ్రాశాను. అది తమకు చేరే ఉంటుంది. కేసర్ మరియు బిట్టో తమకు ప్రణామం తెలుపుతున్నారు. అలాగే మాతాజీ తమకు ఆశీర్వాదాలు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

**గమనిక:** బఇయా దోజ్ అను ఉత్సవం సోదర - సోదరీమణుల మధ్య ప్రేమానురాగాలు పంచుకునే సందర్భంగా జరుగుతుంది (మన ప్రాంతంలో అన్నా చెల్లెళ్ళ పండుగ వంటిది). సోదరీమణులు తమ సోదరుల నుదుట కుంకుమ (తిలకం) దిద్ది హారతి నివ్వటం రివాజు. అందుకు ప్రతిఫలంగా సోదరీమణులకు సోదరులు కానుక నివ్వటం పరిపాటి. సిస్టర్ ప్రత్యక్షంగా వెళ్ళలేకపోయారు కనుక కుంకుమ పంపించి నుదుటన పెట్టుకోమని కోరారు. ప్రతిఫలంగా కానుక ముట్టింది అనటంలో అర్థం దానిని ఆధ్యాత్మికోన్నతి దశగా భావించవచ్చు. సోదరులందరు భాగ్యవంతులే అనటంలో అర్థం అందరూ ఆధ్యాత్మిక సంపన్నులే అని.

## ఉత్తరం సంఖ్య - 31

లఖీంపుర్,

20.03.1949

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

వినయపూర్వక వందనాలు. తమ ఉత్తరం చేరింది. చదివి చాలా సంతోషించాను. ఆరోగ్యం బాగుండని కారణంగా వెంటనే ఉత్తరం వ్రాయలేకపోయినందుకు క్షమించగలరు. మిషన్ అభివృద్ధి కొరకు, తమరు ఆజ్ఞాపించిన విధంగా "ప్రార్థన" చేయటం ఎప్పటినుంచో ఆరంభించాను. సంస్థ సేవలో ఈ తనువు, మనస్సు అన్నీ నిమగ్నమై ఉన్నాయి కనుక తమరు ఎప్పుడు ఏ విధంగా కావాలనుకుంటే ఆ విధంగా సేవ చేయటానికి సిద్ధంగా ఉన్నాను. నా ఆరోగ్యం గురించి తగినంతగా శ్రద్ధ వహిస్తున్నాను. కాని పూర్వజన్మ సంస్కారాలు వెంటాడుతున్నందువలన, ఎంతో కొంత కష్టం తప్పటం లేదు, అయినా ఫర్వాలేదు. శ్రీ బాబూజీ, తమరు ఈ విషయం గురించి అధికంగా ఆలోచించవద్దు. సహజమార్గం 'తమ' జీవితకాలంలోనే వ్యాప్తి చెందుతుంది. దాని వలన ఈ ప్రాపంచిక విషయాలను మహాసముద్రంలో మునుగుతూ తేలుతూ ఉన్న మాలాంటి పాపాత్ములు ఉద్ధరించబడతారు.

"నేను ఎలా ఉన్నానో 'నీవు' అలానే ఉన్నావు, 'నీవు' ఎలా ఉన్నావో నేను అలానే ఉన్నాను" అని నేను వ్రాసిన దానిలో అర్థం ఏమంటే– ఈశ్వరునికి నాకు మధ్య భేదమేమీ అనిపించటంలేదు. ఎందుకంటే అన్ని పనులు నేను చేసినవి అయినా, 'ఆతడు' చేసినవి అయినా అన్నీ ఒకటిగానే తలపిస్తున్నాయి. వేరే విధంగా చెప్పాలంటే 'ఏకత్వం' అనిపిస్తోంది. ఆ పద్యపాదం యొక్క అర్థం ఏమిటంటే, ప్రతి వస్తువులోను, ప్రతి మనిషిలోను ఒకే ఒక్క ఈశ్వరుడు

మాత్రమే దర్శనమిస్తున్నాడు. జ్ఞాపకములేని కారణంగా, "నేనెలా ఉన్నానో 'నీవు' అలానే ఉన్నావు (నేను ఏమిటో 'నీవు' అదే)" అని, స్థితి గురించి మరల తమకు వ్రాశాను. ఆ సమయంలో ఉన్న అసలైన దశ అది. దానిని గురించి తమకు తర్వాత ఉత్తరంలో వ్రాశాను. ఆ (Nothingness) "ఏమీలేదు" స్థితి ఇంకా కొనసాగుతూనే ఉంది.

పూజ్య బాబూజీ, నేను అప్పుడు తమకు ఒక దశ విషయం వ్రాయటానికి సంకోచించాను. కాని ఇప్పుడు మాస్టర్ సాహెబ్‌గారి ఆజ్ఞానుసారంగా దానిని వ్రాస్తున్నాను. దయచేసి నన్ను క్షమించండి. 'తమ' నుంచి మరియు మాస్టర్ సాహెబ్‌గారి నుంచి ఎప్పుడైతే సిట్టింగ్ తీసుకోవటానికి కూర్చున్నానో, అలాగే ఇప్పుడు కూడా కూర్చుంటున్నానో, ఆ సందర్భంలో నేను సిట్టింగ్ తీసుకోవటానికి బదులుగా నేనే తమకు సిట్టింగ్ ఇస్తున్నట్లుగా అనిపిస్తోంది. ఈ దశ ఇంకా కొనసాగుతూ ఉంది. తమ ఉత్తరం అందుకున్న తరువాత రెండు లేదా మూడవ రోజున మామూలుగానే సిట్టింగ్‌లో కూర్చున్నపుడు, ఒక్కసారిగా అంతటా నేను వ్యాపించి ఉన్నానని అనిపించింది. 'తమ'లోను, మాస్టర్ సాహెబ్‌లోను కూడా నేనే ఉన్నట్లుగా అనిపించింది. తరచుగా ఈ స్థితి రోజంతా కలుగుతూనే ఉంది. ఇటువంటి అనుభవం కలగరాదని నేను ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. ఇంతేగాకుండా 'తమ' ఉత్తరం అందిన తర్వాత, స్థితిలో మార్పు వచ్చింది. కాని నేను దానిని ఇంతవరకూ కనిపెట్టలేకపోయాను. అయితే ఆ స్థితి చాలా సరళంగా ఉంది. టాన్సిల్స్ మరియు దవడలు యొక్క బాధవలన ఆ స్థితి మీద ధ్యాస పెట్టలేకపోయాను.

పరమ ప్రియులైన బాబూజీ, తమరు మార్చి 28 నుంచి సెలవు తీసుకుని యాత్ర చేయబోతున్నారని తెలిసింది. తమ పావన పాద ధూళితో మమ్మల్ని ధన్యులు గావించి, ఆత్మోన్నతి కలిగించే సౌభాగ్యాన్ని ప్రసాదించవలసిందిగా తమరిని కోరుతున్నాను. నేను నా చేతులు జోడించి, 'తమరు' పర్యటన ప్రారంభించబోయే ముందు నాలుగైదు రోజులు తప్పకుండా ఇక్కడకు దయచేయాలని 'తమరి'ని ప్రార్థిస్తున్నాను.

ఆరోగ్యం చక్కబడిన తరువాత, ప్రస్తుత స్థితిని బాగా అర్థం చేసుకొనగిలిగితే దానిని గురించి లేఖ వ్రాస్తాను. అదేమిటో 'తమకు' తెలియకుండా ఉండేది కాదు. తప్పనిసరిగా విచ్చేస్తారు గదా! 'తమకు' ప్రయాణించటానికి చాలా కష్టమే అయినప్పటికీ, ఈ సోదరి తన సహోదరుని దర్శనం కొరకు ఆరాటపడుతున్నది.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 32

లఖీంపూర్,
30.03.1949

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తర మొకటి తమకు చేరే ఉంటుందను కుంటాను. ఇప్పుడు నా ఆరోగ్యం బాగానే ఉంది. తమరు కూడా కుశలమేనని భావిస్తాను. పూజ్యులు మాస్టర్ సాహెబ్‌గార్కి తమరు వ్రాసిన ఉత్తరాన్నిబట్టి తమరు ఏప్రియల్ 3వ తేదీ రాత్రికి బయలుదేరుతున్నారనీ, కస్తూరీతో ఇప్పుడు అక్కడికి రాలేకపోతున్నానని చెప్పమనీ, అందువలన క్షమించమని వ్రాసినట్లుగా తెలిసింది. ప్రియ బాబూజీతమరు దయ ఉంచి ఈ దీనురాలిపట్ల ఇటువంటి మాటలు ప్రయోగించకుండా ఉంటే బాగుంటుంది. అదేమంత విశేషం కాదు కాని, నాకు ఈ మాటలు గ్రుచ్చుకున్నట్లుగా ఉంది. అందుకు ప్రతిగా నేనే తమరిని క్షమించమని కోరవలసి ఉంటుంది. ఎందుకంటే, 'మాలిక్' యొక్క పనిలో నిమగ్నమై ఉన్న తమరిని రమ్మని కోరవలసింది కాదు. అయితే తమతో సంబంధం ఇప్పుడు ఇలా అయిపోయింది. మరయితే తిరుగు ప్రయాణంలో అవకాశం ఉంటే దయచేసి తప్పనిసరిగా రావలసిందిగా కోరుతున్నాను.

నేను నా ఆధ్యాత్మిక దశను గురించి తర్వాత వ్రాస్తాను అని నా గత ఉత్తరంలో వ్రాశాను. కాని ఇప్పటివరకు దానిని నేను గుర్తించలేక ఏమీ చేయలేకపోయాను. అయితే ఇప్పుడు ఈశ్వరుని కృపవలన దశ బాగున్నట్లు అని

మాత్రం గ్రహించగలిగాను. పూజ్య బాబూజీ, తమరు ఇంకా ముందుగా నన్ను ఎందుకు కలవలేదు, అలా జరిగినట్లయితే నేనింకా త్వరగా ఉన్నతి చెంది ఉండేదానను, దానివలన తమకు నా గురించిన శ్రమ కూడా తగ్గి ఉండేది. తమ అపారకృపతో యోగ్యమైనటువంటిది, సరళమైనటువంటిది అయిన మార్గంలో నడిపించటానికి ఈ దీనురాలికి తమతో పరిచయం కలిగించినందుకు ఆ ఈశ్వరునికి కోటి ధన్యవాదాలర్పిస్తున్నాను. బాబూజీ, ఏదో విధంగా ప్రతిక్షణం నా ఆత్మోన్నతి కలుగుతూ ఉండాలని ఒకే ఒక లక్ష్యంతో నేను ఉన్నాను. తమరు మరియు మాస్టర్ సాహెబ్‌గారి కృషి మరియు ఆశీస్సులతో అంతా ఒకే ధారగా అయిపోయినట్లుగా అనిపిస్తోంది. నేను గతంలో వ్రాసిన స్థితి, నేనే సిట్టింగ్ ఇస్తున్నట్లుగా ఉన్నటువంటిది కాని, నేనే అన్నిటిలోనూ ఉన్నట్లుగా అనిపించినటువంటి దశగాని ఇప్పుడు లేదు. ఇప్పుడు ఉన్న దశ ఎలా ఉందంటే, ప్రతిసమయంలోను కూర్చున్నప్పుడు మైండ్ ఖాళీగా ఉన్నట్లనిపిస్తున్నది. ఇది చాలా మంచి దశ. ఎందుకంటే, ఇప్పుడు ఇచ్ఛాశక్తి దినదినమూ వృద్ధి చెందుతున్నట్లుగా అనిపిస్తోంది. ఈరోజు నేను సిట్టింగ్ తీసుకున్న సందర్భంలో, నేను, తమరు కూర్చుండి ఉన్నట్లుగా ఒక దృశ్యం కనిపించింది. ఆ సమయంలో నేను, తమతో 'మాలిక్' ఇప్పుడు ఏది కావాలనుకుంటే దానిని నానుంచి తీసుకోవచ్చని చెప్పినప్పుడు, తమరు అలాగయితే నా హస్తాన్ని కోరుతున్నట్లుగా తెలియజేశారు. తమ వాక్యం పూర్తి కాకుండానే నేను వెంటనే కత్తితో నా చేతిని ఖండించి తమకు అర్పించుకున్నాను. దానికి తమరు చాలా సంతోషించారు. ఆ విధంగా ఈ దీనురాలిపట్ల తమరు ఎప్పుడూ దయాళువుగానే ఉంటున్నారు. తమరు 'మాలిక్' పనిమీద వెళ్తున్నారు కనుక 'అతడి' యొక్క పని పూర్తయ్యాక, ఏ మాత్రమైనా అవకాశం ఉన్నట్లయితే, సమస్త అవగుణాలు కలిగి ఉన్న ఈ కస్తూరీపట్ల దయచూపటం మరచిపోవద్దనీ, 'మాలిక్' పని నిర్వహించిన తర్వాత తమ శరీరానికి కలిగిన కష్టాన్ని, అలసటను దయచేసి నాకు బదలాయించమని నా చేతులు జోడించి మరి మరి ప్రార్థిస్తున్నాను.

అమ్మ తమకు ఆశీస్సులు తెలుపుతున్నది, కేసర్ వందనమర్పిస్తోంది.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 33

లఖీంపుర్,

02.05.1949

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ నమస్కారములు. తమరు సుఖంగా ఇంటికి చేరి ఉంటారని భావిస్తున్నాను. 15వ తేదీ నుంచి, ధ్యానం చేస్తూన్న సమయంలో హృదయంకాని, మరేదైనాకాని కనిపించటంలేదని, 'తమరు' మాత్రమే దర్శనమవుతున్నారనీ కేసర్ చెప్తూన్నది. హృదయంలో శాంతి మరియు ఆనందం అత్యంతధికంగా అనుభూతమైనట్లు తెలిపింది.

నా స్థితి అయితే తమరికి తెలిసినదే, అది ఇక్కడ శూన్యంగా ఉంది. నిజం చెప్పాలంటే, నేను నా సాధనతో సంతృప్తి పొందలేకపోతున్నాను. ఒకవేళ నేను 24 గంటలూ 'మాలిక్'ను స్మరించగలిగినట్లయితే బహుశా కొంత సంతృప్తి కలుగుతుందేమో. కాని అలా కాదు, అది నా అవివేకమే. **సాధన అను శబ్దకోశంలో సంతృప్తి అను మాట ఉండరాదు. నా అభిప్రాయం ప్రకారం, అది నా వరకే కాకుండా ఇప్పుడే కాదు, మున్ముందు కూడ, అభ్యాసీ సాధనా కాలంలో సంతృప్తి అనే మాట ఎవ్వరి ఆలోచనకు వచ్చినా, అది వారి అతిబలహీనతగా భావిస్తాను.** రేయింబవళ్ళు 'అతని' స్మరణలోనే ఈ దీనురాలు కస్తూరీ రమించి ఉండునట్లుగా 'మాలిక్'ను ప్రార్థిస్తున్నాను.

ప్రస్తుత ఆత్మికదశను గురించి బహుశా తమకు చెప్పి ఉంటాను. రోజంతా కూడా మరో క్రొత్త దేశంలో నుంచి వచ్చినట్లుగా అనిపిస్తోంది. అది ఎంతగానంటే అప్పుడప్పుడు వంట గదిని కూడా మరచిపోతున్నాను, ప్రార్థన చేస్తూ

చేస్తూనే ఎవరిని ప్రార్థిస్తున్నానో, ఏమని ప్రార్థిస్తున్నానో కూడా తెలియకుండాపోతున్నది. సాధకుల కొరకు ప్రచురించబడిన దశ నియమాల పుస్తకంలో, ప్రేమతో హృదయం నిండిపోయే విధంగా ప్రార్థన చేయాలని ఉంది. కాని, నాకు ప్రేమతో హృదయం నిండిపోవటమనేది సఫలం కాలేదు సరికదా హృదయం పూర్తిగా శూన్యంగా ఉంది. అందులో ప్రేమ లేదనిపిస్తున్నది. అదేమిటో 'మాలిక్'కే తెలియాలి. ప్రస్తుతం ఉన్న దశ ఇంతకముందు ఉన్న దానికంటె బాగున్నట్లనిపిస్తున్నది. శరీరంలోని వ్యాధుల నివారణ కొరకు 'తమరు' చెప్పిన పద్ధతులను ఆచరించటానికి ప్రయత్నిస్తాను. 'తమరు' ఒక ఉత్తరంలో నాకు వ్రాసిన సంగతి తమకు జ్ఞాపకం ఉండే ఉంటుంది – "ఎప్పుడూ ముందడుగే వేయాలి" అని. ఈ వాక్యం నాకు శిలా శాసనంలాగా అయిపోయింది. ఒకవేళ ఎప్పుడైనా నేను ముందడుగు వేయటంలో 'తమరు' ఏదైనా లోపం గమనించినట్లయితే, దానిని వెంటనే నాకు తెలియజేయవలసిందిగా 'తమరి'ని ప్రార్థిస్తున్నాను. ఏ కరుణామయుడైతే నావంటి అధమరాలును కూడా తమ పుత్రికగా సంభోదించి పిలిచారో అటువంటి 'వారి' పేరును నవ్వులపాలు గాకుండా చేయటానికి నేను ప్రయత్నిస్తాను. 'మాలిక్'ను కూడా దీని కొరకే ప్రార్థిస్తున్నాను. అమ్మ తమకు శుభాశీస్సులు తెలుపుతోంది. కేసర్ మరియు బిట్టో నమస్సులు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 34

షాజహాన్‌పూర్,
08.05.1949

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

నువ్వు సంతోషంగా ఉండాలని ఆశీర్వదిస్తున్నాను. నీ ఉత్తరం అందింది. అది చదివి చాలా సంతోషించాను. నిన్ను సోదరిగా భావిస్తున్నాను. ఎందుకంటే, మనమంతా లాలాజీగారి సంతానం. వారి సేవకులం కదా! కాని నిన్ను నా కుమార్తె వంటి దానివనే భావంతోనే ప్రతిసారీ చూస్తూ వచ్చాను. అందుమూలంగా హృదయంలో నా కుమార్తెగానే భావించడం జరుగుతోంది. లోపల స్పష్టంగా 'సోదరి' భావం ఉంచుకుంటే అలాంటి భావన కూడా మంచిది. నీ అన్య సోదరిలందరి ఎడల 'సోదరి' భావమే ఉంటుంది. కాని నీతో ఈ భావం ఉండదు. బహుశా నువ్వు ఒకానొకప్పుడు ఒక ఋషి కుమార్తెవి. ఒకసారి నీకు మోక్షం లభించింది కూడా. కాని ఆ మోక్షకాల సమయం పూర్తి అయ్యిపోయాక నువ్వు మరల జన్మ ఎత్తవలసి వచ్చింది. భగవంతుని కృపవలన నీకు బహుశా లిబరేషన్ దొరికే సమయమాసన్నమైంది. ఇంకా నేను అనుకునేది, నువ్వు పతంజలి ఋషి జీవనకాలంలో కూడా జన్మించి ఉంటావు. అప్పుడు ఆయన నీకు తెలుసు. ఆయన చెప్పే వాక్యాలు నీ హృదయంలో స్పందించేవి. ఆ తరువాత జన్మలో నువ్వు యోగాభ్యాస సాధన చేసావు. కాని పూర్తిగా చేయలేకపోయావు. నీకు మోక్షగతి ప్రాప్తించింది. బహుశా ఇందుమూలంగా కూడా నువ్వు నా దృష్టిలో కుమార్తెగానే కనిపిస్తున్నావు. ఇవన్నీ చదివినవాళ్ళు నాగురించి ఏమనుకొంటారో అని ఈ ఉత్తరంలో ఆ వివరాలన్నీ వ్రాయటానికి వెనుకాడుతూ వ్రాస్తున్నాను. ఇది తెలుసుకోవాలని ఎక్కువ ఉబలాటం ఉంటే మాస్టర్ ఈశ్వర్‌సహాయ్‌గారిని అడిగి తెలుసుకోవచ్చు. ఇంతకుముందు జన్మలో నీవు ఒక రైతు కుమార్తెవు. 14 ఏళ్ళ వయస్సులో నీ మృత్యువయ్యింది. అప్పుడు అమాయక బాలికవు. నేను ఈ విషయాలన్ని నీ ఉత్తరానికి జవాబు ఇవ్వాల్సిన దాని కంటే మించి వ్రాయడం జరిగింది.

ఒక విషయం నీకు వ్రాస్తున్నాను. స్వామీ వివేకానంద కూడా ఇదే అన్నారు. గురువువద్ద నేర్చుకొనేవారంతా –వయస్సులో పెద్ద అయినా, చిన్న అయినా, ఆయనకి ఆధ్యాత్మిక సంతానం. నేను ఇలా వ్రాసానని, నన్ను ఒక గురువునని అనుకోవద్దు. గురువు ఒక్కరే. ఆయనే అందరికీ నేర్పేవారు. కేసర్ (నీ చెల్లెలు) స్థితి భగవంతుని దయవలన చాలా బాగుంది. ఆమె గురించి నీ తండ్రిగారు కూడా సిఫారస్ చేసారు. ఆమెకు 'అభీ దిల్లీ దూర్ హై' (అంటే గమ్యం ఇంకా చాలా దూరంగా ఉంది), ప్రయత్నం చేస్తూ ఉండమని చెప్పాలి.

**అభ్యాసికి ఎప్పుడూ కూడా సంతృప్తి అనేది ఉండకూడదు. ఎంత వీలైతే అంతవరకూ గురుదేవుల స్మరణలో ఉండాలి. 'వారి' స్మరణ విషయంలో ఎప్పుడూ సంతోషం అనేది రానివ్వకూడదు. ఇదే మన ధర్మం. అభ్యాసి ఎప్పుడు సంతృప్తిపడతాడు అనేది 'మాలిక్' (గురువుగారి) అనుగ్రహం, అంటే 'వారి' చేతిలోనే ఉంది.** నీవు (ప్రార్థన గురించి) ఉదహరించిన నియమాలు, అటువంటి దశ ఉద్భవించటానికై ప్రారంభంలో ఔత్సాహికులు (ప్రవేశికులు) కోసమై చెప్పబడ్డాయి. వాస్తవంలో శూన్యదశ ఉత్పన్నమవటానికి చేయాల్సిన ప్రార్థన నీవు చేస్తూన్నటువంటిదే. దీనిని గురించి నేను వ్రాసిన గత ఉత్తరంలో ఉంది. చదువుకో. దీని నకలు మాస్టర్ ఈశ్వర్‌సహాయ్‌గారి వద్ద ఉంది. బహుశా మీ తండ్రిగారివద్ద కూడా ఉందేమో. **అభ్యాసి ఆధ్యాత్మికోన్నతి చెందుతూ ఊర్ధ్వలోకంతో సంబంధం ఏర్పడినప్పుడు, అక్కడి దశలో ఉంటుండగా, ఆ అభ్యాసికి అదే తన ఇల్లు అనిపిస్తుంది.** ఒకప్పుడు నాకు కూడా ఇటువంటి స్థితి ఉండేది. నువ్వు "నేను అప్పుడప్పుడు వంటిల్లు కూడా మరచిపోతాను. ఆకస్మాత్తుగా ఆశ్చర్యంతో ఉలిక్కిపడుతూ ఉంటాను" అని వ్రాశావు. దీనికి చౌబేజీ (మీ నాన్నగారు) అనారోగ్యం మూలంగా నీకు ఆకలి వేయటంలేదని అంటారు. కాని నేను అనేది ఏమంటే, నీలో 'మరుపు' అనే ఆధ్యాత్మిక అవస్థ తయారౌతున్నది. కాని బాగా ఎక్కువగా ఇలా ఉండటానికి, కొంచెం మైండ్‌లో బలహీనత కూడా కారణం కావచ్చు. అకస్మాత్తుగా ఆశ్చర్యపోవటం లేదా ఉలిక్కిపడటం అనేది ఒక ఆధ్యాత్మిక దశ. ఇంకా ఇది ప్రారంభదశ, పూర్ణ రూపేణా ఇంకా రాలేదు. ఆ అవస్థ పూర్ణరూపంలోకి వచ్చాక ఎటువంటి లక్షణాలు ఉంటాయి అనేది, ఆ దశ వచ్చేలోగానే నువ్వు ఊహించుకొనే ఆస్కారం ఉంటుంది. కాబట్టి, ప్రస్తుతం నేను నీకు ఆ విషయాలు వెల్లడి చేయటంలేదు. సాధనలో మనిషి ఎప్పుడైతే ఆశ్చర్యపడుతూ ఉంటాడో, అప్పుడే దైవిక జ్ఞానం (Godly Science) అతనికి ప్రారంభమవుతుంది.

**స్వామి వివకానంద ఆదేశం (సాయంత్రం 8.15 గం॥లకు):** ఇటువంటి దశ చాలా అరుదుగా చూడటానికి దొరుకుతుంది. అభ్యాసులందరికి ప్రవేశం దొరుకుతుంది కాని వారు ఇందులో ఉండలేరు. నిస్సందేహంగా నీకు ఇది ప్రసాదించబడింది. పుత్రీ! ఇది ఎంతో చక్కటి ఉత్తరం. **మీ గురువుగారి విధానాన్ని గమనించు. ఇటువంటి గురువుగారు నీకు వేరే ఇంక ఎక్కడా దొరకరు.** నాకు చాలా బాధగా ఉంది. వేరే ఎవ్వరూ ఇటువంటి శిక్షణ కోసమే 'వారి' దగ్గరికి రారు. అందరూ ఎంతో హర్షిస్తున్నారు. **ఇటువంటి గురువు భవిష్యత్తులో ఎవరికీ దొరకరు. 'వారి'కి గురువుగా పట్టు (ఆధ్యాత్మిక శిక్షణ మీద పూర్తి ఆధిపత్యం) ఉంది. నేను మరల మరల హెచ్చరిస్తున్నాను. జనాలు గాఢనిద్రలో మునిగి, అందులో నుంచి బయటకు రావటంలేదు. ఈ సదవకాశాన్ని పూర్తిగా ఉపయోగించుకోవాలి.** భగవంతుడు నిన్ను ఆశీర్వదించుగాక! నీ తల్లిదండ్రుల ఆధ్యాత్మిక స్థితి ఎలా ఉందో నీకు తెలియదు. వాళ్ళకు కూడా తెలియదు. **రామచంద్రులు (శ్రీ బాబూజీ మహరాజ్) లఖింపుర్‌లో చేసిన పని వేరే ఎవరైనా చెయ్యాలంటే వేలాది సంవత్సరాలు పడుతుంది.** 'వారి'ది ఎంతటి ప్రతిభావంతమైన శిక్షణయో కదా! చూడు. మీ అమ్మగారికి ముక్తి తప్పకుండా లభించి తీరుతుంది. ఎందుకంటే, అటువంటి గురువుగారిని ఆమె తెచ్చారు. అటువంటి గురువర్యులను రాళ్ళు తేలేవు. ఆమెవంటి వారికే అది చెల్లింది."

లాలాజీగారు ఇప్పుడు మీ తల్లిగారి గురించి పొగుడుతూ "పుత్రుడు అనే భావనతో ప్రేమించాలని అనుకునే వారు, మీ తల్లిలా ప్రేమపూర్వకంగా ఉండాలి. అప్పుడే లాభదాయకంగా ఉంటుంది" అని అంటున్నారు. మాస్టర్ ఈశ్వర్‌సహాయ్‌గారితో నేను ఈ ఉత్తరాల కాపీ ఉంచుకోలేదు కాబట్టి, కావాలంటే చౌబేజీ (మీ తండ్రిగారి) నుంచి అడిగి తీసుకోమని చెప్పాలి.

నేను ఉత్సాహంగా, ఒక ప్రవాహంలాగా చెప్పుకుంటూపోయాను. కాని నిన్ను ఒక రైతు కుమార్తె అని వ్రాసాను. నాకు అలా అనిపించి, అలా వ్రాసాను. నీకు నచ్చకపోతే క్షమించు.

నీ శ్రేయోభిలాషి,
రామచంద్ర

# ఉత్తరం సంఖ్య - 35

లఖీంపూర్,
12.05.1949

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

వినయపూర్వక నమస్కారాలు. తమరు దయతో వ్రాసిన ఉత్తరం అందింది. ఆ ఉత్తరం చదువుతున్నప్పుడు, ఆనందించవలసిందిపోయి నేను శూన్యత్వస్థితికి చేరాను. అప్పుడు నేను నిశ్శబ్దంగా చాలాసేపు పండుకున్న తరువాత స్థితి క్రమక్రమంగా మెరుగుపడడం ఆరంభించింది. ఒక గంటలో అది పూర్తిగా మెరుగుపడింది. కాని నాకు ఇప్పటికీ అప్పుడప్పుడు దాని రమణీయత అనుభవమవుతూనే ఉంది. తమరు నన్ను ఏ విధంగా తలచినా తమ అభీష్టానికే వదిలిపెడ్తున్నాను. అయితే మాత్రం మొట్టమొదటగా తమ మొదటి భావన అనగా కుమార్తెయే నాకు ఇష్టంగా ఉంది. అమ్మ చెప్పిన కారణంగా తమరిని సోదరునిగా భావించి అదే విధంగా ఆచరించాను కూడ. అయితే ఈ భావం నాకు ఏమాత్రం మనస్కరించలేదు. ఆఖరిసారిగా తమరు గయ వెళ్ళినపుడు, నేను తండ్రిగారితో తమరిని సోదరునిగా భావించటానికి అశక్తురాలను అని స్పష్టంగా చెప్పాను. ఎప్పుడైతే నేను 'తమరి'ని మొట్టమొదటగా చూశానో, అప్పుడే నాలో తండ్రిగా భావం ఏర్పడి ఆ దృష్టితోనే తమపట్ల ప్రేమ కలిగి ఉన్నాను. అది ఒక కుమార్తె తన తండ్రిని కలుసుకున్నపుడు కలిగే అనుభూతి వంటిది. కనుక తమ ఇష్టానుసారంగా వ్యవహరించండి. నా స్థితి, తమకు గత ఉత్తరం వ్రాసినప్పటి నుండి రెండు మూడు రోజుల వరకు హృదయం చాలా నిస్తేజంగా (Dull) ఉంది. ఆ తర్వాత నిన్నటి నుంచి బాగుంది. "నీవు ఈ రహస్యం తెలుసుకోవాలనే అభిలాష కలిగి ఉంటే మాస్టర్ సాహెబ్‌ను సంప్రదించు" అని తమరు వ్రాశారు. దానికి నా సమాధానం ఏమిటంటే, నా అభిలాష పూర్తిగా ఆ ఒకే ఒక్కని (ఈశ్వరుడు) మీదే ఉంది. దానికిమించి ఏ విషయంమీద నాకు అభిరుచి లేదు. ఒకవేళ అటువంటిది ఏమైనా కలిగితే నేను అడుగుతాను. ప్రస్తుతం ఆధ్యాత్మిక స్థితుల గురించిన చిహ్నాలను తెలుసుకోవటానికి కూడా నేను ఇష్టపడటం లేదు. 'మాలిక్' దయతో ఈ దీనురాలికి ఆధ్యాత్మిక దశ పూర్ణ స్థాయిలో ఎప్పుడు ప్రాప్తమవుతుందో అప్పుడు చెప్పండి. పూజ్య స్వామి వివేకానంద యొక్క సందేశం (Dictate) మరియు దానిలో తెలిపిన శుభాశీస్సులకు కోటి ధన్యవాదాలర్పిస్తున్నాను. 'అతని'కి ఎటువంటి మాటలతో ధన్యవాదాలర్పించాలో నాకు తెలియదు. అంతేకాదు, మామూలుగా ధన్యవాదాలర్పించటం నాకు ఏమాత్రం ఇష్టంలేదు. 'మాలిక్' కృపతో 'వారి' (స్వామి వివేకానంద) యొక్క ఆజ్ఞ ("Avail daughter this opportunity") "పుత్రీ! ఈ సదవకాశాన్ని వినియోగించకో" అను దానిని అక్షరాల పాటించి దివ్య మార్గంలో పురోగమించినట్లయితే మరి తమకు మాటలతో ధన్యవాదాలు ఎలా అర్పించమంటారు! దేనినయితే తమరు మాకందరికీ ఇవ్వటానికి తాపత్రయపడుతున్నారో, దానిని పొందిన తర్వాతనే నేను తమకు ధన్యవాదాలు తెలుపగలుగుతాను. అదేమిటోగాని, తమ స్వహస్తాలతో ఏమాటలైతే వ్రాసి ఉన్నారో వాటిలోని ప్రతి అక్షరం ద్వారా పితృ సమానమైన ప్రేమ, ఆశీస్సులు నాకు అందుతున్నట్లుగా అనిపిస్తూ ఉంది. అంతేగాక ప్రతివాక్యంతోను సిట్టింగ్ పొందుతున్నట్లుగా ఉంటున్నది. "నేను నిన్న రైతు కుమార్తెగా వ్రాసినందుకు నాకు బాధగా ఉంది. అది నీకు తప్పుగా అనిపిస్తే నన్ను క్షమించు" అని తమరు వ్రాసి ఉన్నారు. దయచేసి తమరు ఈ దీనురాలిపట్ల ఈ క్షమ అను మాటను ప్రయోగించవద్దు. స్వయంగా నేనే తమర్ని క్షమించమని వేడుకొనవలసి ఉంది. ఎందుకంటే, మహర్షి పతంజలి కాలంలో జన్మ పొంది ఉండి కూడా (Liberation) ముక్తిని పొందలేకపోయాను. ఇంకా చెప్పాలంటే, తమ వంటి సహాయకుల అండ ఉన్నప్పటికీ శీఘ్రంగా పురోగమనం చెందలేకపోతున్నాను. రైతు కనుక దివ్యత్వం లేనివాడు అయి ఉంటే నాకు తప్పనిసరిగా బాధ కలుగుతుంది.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 36

షాజహాన్‌పుర్,
15.05.1949

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

ఆశీస్సులు. నీ ఉత్తరం చేరింది. సంతోషం. భగవంతుడు రోజురోజుకి నీకు ఆధ్యాత్మిక ఉన్నతి ప్రసాదించుగాక! నీ జీవిత చరిత్ర గురించి నువ్వు వ్రాయటం ప్రారంభించాలని నా కోరిక. ఎప్పటినుంచైతే నువ్వు బ్రహ్మవిద్య అభ్యసించటం ప్రారంభించావో, ఆనాటి నుంచీ నీ ఆధ్యాత్మిక స్థితులు గురించి వ్రాయాలి. నా దగ్గర నీ ఉత్తరాలు అన్నీ ఉన్నాయి. అవి నీకు పంపుతాను. అందులో ఏ ఏ స్థితులు వ్రాయబడి ఉన్నాయో, వాటన్నిటి గురించి వ్రాస్తూ ఉండు. నీకు ప్రారంభంలో కలిగిన స్థితుల గురించి మీ తల్లిగారికి తెలిసి ఉండవచ్చు. ఆమెను అన్నీ అడిగి తెలుసుకొని, నీ ఆధ్యాత్మిక ఉన్నతి కొరకు నీవు ఏమి పద్ధతులు అవలంబించావో అవి అన్నీ వ్రాస్తూ ఉండాలి.

తల్లిగారికి నమస్కారాలు తెలియజేయి.

నీ శ్రేయోభిలాషి
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 37

లఖీంపుర్,
20.05.1949

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసిన ఉత్తరం అందింది. దానిని చదివి చాలా ఆనందించాను. తమ ఆజ్ఞానుసారంగా నేను డైరీ వ్రాయటం ఇదివరకే ప్రారంభించాను, కాని దానిని సంక్షిప్తంగా వ్రాశాను. తమరు వ్రాసిన ఉత్తరాన్నిబట్టి దానిని వివరంగా వ్రాయాలని 'తమరు' భావిస్తున్నట్లుగా అర్థం చేసుకున్నాను. అందువలన పూజ్య మాస్టర్ సాహెబ్ మరియు తండ్రిగారి సహకారంతో దానిని వివరంగా వ్రాయటం ఆరంభించాను.

పరమ ప్రియులైన బాబూజీ, నాకు ఎందుకోగాని నేను చంటిపిల్లగా తయారై 'తమ' ఒడిలో ఆడుకోవాలని నా హృదయం కోరుతోంది. దానికి తగ్గట్లుగానే భావాలు చేలరేగుతున్నాయి. 'మాలిక్' దయతో నేను 6 మాసాల బిడ్డగా గాని, సంవత్సరం వయస్సు ఉన్న పిల్లగా గాని 'తమ' ఒడిలో పండుకొని ఉన్నట్లుగాను, అప్పుడు హృదయం ఆలోచనారహితంగా అయిపోతున్నట్లుగాను, అంతేగాక హృదయంలో ఎంతో సౌఖ్యవంతంగా అనుభూతి చెందుతున్నట్లుగాను ఉంటోంది. ఇదేమిటో నాకు తెలియటంలేదు. ఇప్పుడు ఉన్న స్థితి అర్థం కాకుండా ఉన్నదా లేక దానిని గ్రహించటానికి అభిరుచి లేకపోతున్నదా తెలియటంలేదు. అయితే దైవేచ్ఛ ఎలా ఉంటే అలా ఉంటుంది. ఇంకొక విషయం ఏమంటే, తరచుగా కొంతసేపు నేను అంతటా వ్యాపించి ఉన్నట్లుగా అనిపిస్తోంది.

ఇప్పుడు నా చిలిపితనం గురించి వ్రాయాలంటే, నేను 'తమ' ఒడిలో కూర్చుని చంటిపిల్లలాగా తమ గడ్డంతో ఆడుకుంటున్నట్లుగా అనిపిస్తోంది. అమ్మ తమకు ఆశీర్వాదాలు అందిస్తోంది.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

# ఉత్తరం సంఖ్య - 38

లఖీంపుర్,
28.05.1949

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. పెదనాన్నగారికి మరియు మాస్టర్ సాహెబ్‌కు తమరు వ్రాసిన ఉత్తరాలు చేరాయి. తమ ఉత్తరాలను చదువుతుంటే విని నాకు ఆనందంతోపాటు బాధ కూడా కలిగింది. ఎందుకంటే, దానిలో **తమరు, "మీరందరూ నన్ను తనఖా పెట్టుకున్నారు" అని వ్రాశారు.** ఇది నాకు సంతోషాన్ని కలిగించింది. బాధ కలిగించిన విషయం ఏమంటే, నేను ఇంకను తమర్ని కొనివేయలేదు. ఇపుడు మేము తమర్ని తనఖా పెట్టుకున్నామా లేక తమరే మమ్మల్ని తనఖా పెట్టుకున్నారా అనే విషయాన్ని తీర్మానించ వలసింది 'మాలిక్'యే. అయితే ఈ తనఖా వ్యవహారం ఇంకనూ జరుగుతూనే ఉన్నది. ఇంకనూ ఏ పక్షం నుంచీ కొనుగోలు జరగలేదను కుంటాను. ఎందుకంటే, మేమే కనుక పూర్తిగా అమ్ముడైపోయి ఉంటే మాలోని 'అహం' పూర్తిగా తొలగిపోయి ఉండేది. తమరు ఒకసారి దీనిని గురించి వివరిస్తూ 'నేను' అని చెప్పేటపుడు, ఆ 'నేను' అనేది ఎవ్వరని తెలియకుండా ఉండాలని చెప్పి ఉన్నారు. 'మాలిక్' కనుక నన్ను ఖరీదు చేయటానికి పూనుకుంటే నేను 'అతని'కి అమ్ముడుపోవటానికి సిద్ధంగా ఉన్నానని ధైర్యంగా చెప్పగలను. కొద్ది రోజులుగా ఇటువంటి స్థితియే కలుగుతూ ఉన్నది కూడ. ఇప్పుడు ఉన్న ఆత్మిక స్థితి ఎలా ఉందంటే, అసలు 'మాలిక్' యొక్క జ్ఞాపకం వచ్చిందా లేదా అనేది కూడా తెలియకుండా ఉంది. ప్రయత్నపూర్వకంగా 'మాలిక్'ను మళ్ళీ మళ్ళీ జ్ఞాపకం చేసుకుంటున్నాను కాని కొద్దిసేపటికే నేను మరచిపోతున్నట్లుగా అనిపిస్తోంది. అసలు విషయం ఏమిటంటే, 'మాలిక్' యొక్క జ్ఞాపకం ఉన్నదా లేకపోయిందా అను విషయం కూడా జ్ఞాపకం లేకుండా ఉంటున్నది. జ్ఞాపకం ఉన్నది అను విశ్వాసం కుదిరినపుడు ధైర్యం కలుగుతోంది, జ్ఞాపకంలేదు అని అనిపించినపుడు కొంత అశాంతి కలుగుతున్నది. దయచేసి ఈ సమస్యకు తమరే సమాధానం చెప్పాల్సి ఉంది. మళ్ళీ మళ్ళీ ఆశ్చర్యపోవటం జరుగుతున్న దశ క్రమంగా వృద్ధి చెందుతూ ఉంది. ఇంకొక విషయం ఏమిటంటే, రాత్రి సమయంలో ఈరోజు పగటిపూట నేనేమి పని చేశాను అని జ్ఞాపకం తెచ్చుకుందామని ప్రయత్నించినా అది జ్ఞాపకం రావటం లేదు అనగా అసలు నేను ఏమైనా పని చేశానా అనేది కూడా జ్ఞాపకం రావటంలేదు. కొద్ది రోజులుగా నేను రాత్రంతా గాఢనిద్రలో మునిగిపోయి ఉండటమే కాకుండా పగలు కూడా కొన్ని నిమిషాలపాటు నిద్రపోతున్నాను. మరి రెండు సందర్భాలలో కూడా నిద్ర నుండి మేల్కొనగానే నేను ఎక్కడి నుండి ఊడిపడ్డానో అన్నట్లుగా ఉండి అన్నీ మరచిపోయినట్లుగా ఉంటున్నది. 'మాలిక్' కృపతో దశ కొంత బాగుగానే ఉంది. నిద్ర గురించి ఏమి అనిపిస్తోందంటే 'తండ్రి' ఒడిలో నిద్రించటంలోనే చాలా సౌఖ్యంగా ఉందనిపిస్తోంది. నిద్ర నుండి లేచినపుడు కలుగుతున్న ఈ స్థితి పగలు కూడా పలుమార్లు కలుగుతూ చాలాసేపు ఉంటున్నది. కాని ఇంతకుపూర్వం ఏదో ఆశ్చర్యకరంగా ఉన్నట్లు ఉండేది ఇప్పుడు అనిపించటం లేదు. బహుశా ఈ స్థితికి నేను అలవాటుపడి పోయాననుకుంటాను. అమ్మ మా అందరిచేత ధ్యానం చేయించింది అని తమరు వ్రాసింది చదువుతుంటే నాకు చాలా ఆనందం కలిగింది. తమరు చెప్పింది సిట్టింగ్ గురించి అయి ఉంటే, దాని గురించిగాని, అది ఎలా ఇవ్వబడుతుందోగాని తనకు తెలియనే తెలియదని అమ్మ చెబుతున్నది. తమకు, మాస్టర్ సాహెబ్‌కు ఆమె ఆశీస్సులు తెలుపుతున్నది. కొద్ది రోజులుగా మనస్సు ఎక్కడ విహరిస్తోందో కూడా తెలియకుండా ఉంది. పూజ్యులు మాస్టర్ సాహెబ్‌గార్కి నా ప్రణామం కూడా తెలియజేయండి.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

# ఉత్తరం సంఖ్య - 39

షాజహాన్‌పుర్,

02.06.1949

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నీవు వ్రాసిన ఉత్తరం చేరింది. కొన్ని పనులలో నిమగ్నమై ఉండటంవలన జవాబులు వ్రాయటానికి అవకాశం దొరకలేదు. నీవు అనుభూతి చెందుతున్న వ్యాపకత (విస్తారం) అనేది హృదయం మధ్యలో ఒక స్థానం యొక్క స్థితి. దీనినిబట్టి, దేని తరువాతనైతే స్థూలదశ ప్రారంభమవుతుందో, ఆ భాగంతో నీ సంబంధం ఏర్పడిందని తెలుస్తోంది. వేరే చెప్పాలంటే, దాని సూక్ష్మ స్థితిలోకి నీవు చేరి, అందులోనే నీ విస్తరణ జరుగుతోంది. ఇంతకంటే కూడా నీవు ఉన్నతంగా వెళ్ళే సంతోషకరమైన వార్త తొందరలోనే అందుతుంది.

నీవు చిన్నపిల్ల మాదిరిగా నాతో ఆడుకుంటున్నట్లు ఉండటం అనేది దైవిక ఆలోచనతో ఉండే ఒక పద్ధతి. ఎప్పుడూ ఒక్కటే ఆలోచన ఉండాలి. రూపం మారినా పరవాలేదు. ఈ విధంగా చేయటంవలన మస్తిష్కానికి విశ్రాంతి అందుతుంది.

నీ మొదటి ఉత్తరానికి జవాబు ముగించాను. ఈలోగా నీ రెండవ ఉత్తరం కూడా అందింది. ఇప్పుడు దీనికి కూడా జవాబు వ్రాస్తున్నాను. లయావస్థ యొక్క సూక్ష్మదశ ఆరంభమయ్యే దశకు నీవు దగ్గరగా ఉన్నావని నీ ఉత్తరం ద్వారా నాకు ఆశ కలుగుతోంది. కాని ఇవన్నీ హృదయచక్రపు దశలు. ఇంకా వీటిలో కాస్త ప్రయాణం మిగిలి ఉంది. దీని తర్వాత రెండవది ఇంతకంటే మెరుగైన స్థితిలో నీవు ప్రవేశించే సంతోషకరమైన వార్త అందుతుంది. ఈ స్థితి మొదటి చక్రముదే. ఇంకా అనేక చక్రాలను దాటవలసి ఉంది. పైగా వీటన్నింటి తర్వాత ఇంకా ఎన్నెన్ని (లెక్కలేనన్ని) స్థితులు ఉన్నాయో భగవంతునికే తెలుసు. వాటికి కూడా హద్దు లేదు. 'మాలిక్'ని జ్ఞాపకం చేసుకున్నానో లేదో జ్ఞాపకంలేదని వ్రాసావు. ఇటువంటి అనుభూతి కలగటం, ఆంతరికంగా నీ హృదయపులోతుల్లోకి 'అతని' జ్ఞాపకం చేరిందని అనడానికి ఇది నిదర్శనం. కాని ఇది భగవంతుని పని. మనం చేయవల్సిందల్లా ఒక్కటే, ఎలా వీలైతే అలా, ఏదో విధంగా మనం 'అతడి'ని జ్ఞాపకం చేసుకోవాలి. మన సాధనలో అభ్యాసీ, ఏమాత్రం భక్తిభావంతో ఉన్నా, అతనికి తెలియకుండానే భగవత్ స్మరణ జరుగుతూ ఉంటుంది. మనం మన ఆలోచనలను 'అతడి'లో నిలిపితే, అప్పుడు అది వేగంగా అనుభవానికి వస్తుంది. అకస్మాత్తుగా ఉలిక్కిపడటం లేదా ఆశ్చర్య చకితులవ్వడం గురించిన జవాబు ఇంతకుముందు ఉత్తరంలో వ్రాసాను.

నిద్ర గురించి నీవు వ్రాసినదానికి అర్థం ఏమంటే, నీవు సుషుప్తి దశలోకి వేగంగా వెళ్ళుతున్నావు. కాబట్టి, కళ్ళు తెరచిన వెంటనే ఏదో క్రొత్త ప్రపంచంలోకి వచ్చినట్లు నీకు అనిపిస్తుంది. నా అంచనా ప్రకారం నువ్వు సుషుప్తి దశలోకి వెళ్ళుతున్నావని అర్థం. మాములుగా, సామాన్యమైన ఇతరులు గాఢనిద్రలోకి వెళ్ళితే, మెలుకువ వచ్చాక, ఎక్కడి నుంచో వచ్చామని వాళ్ళకు అనిపించదు. ఇందులో లయమైపోవటం (ప్రయత్నంతో కాకుండా దానంతట అదే అవ్వాలి) మరియు దానిలో మునిగిపోయి జీవించటం (బకా) అనే స్థితిలోకి వెళ్ళడం తురీయ అవస్థను సూచిస్తుంది. కాని ఇవి రావడానికి ఇంకా చాలా సమయం పడుతుంది. మీ తల్లిగారికి సిట్టింగ్ ఇచ్చే విధానం మాస్టర్ ఈశ్వర్‌సహాయ్‌గారు నీకు చెబుతారు.

నీ శ్రేయోభిలాషి

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 40

లఖీంపుర్,
13.06.1949

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ యొక్క దయామయమైన ఉత్తరం తావూజీ (కస్తూరీగారి పెదనాన్న గారు) ద్వారా చేరింది. దానిని చదివి చాలా ఆనందించాను. శ్రీ బాబూజీ, తమకు నేను ఋణపడియే ఉన్నాను. ఒక బీదరాలికొరకు ఇంత శ్రమ ఎవ్వరు తీసుకుంటారు! ఎనిమిది – తొమ్మిది రోజుల నుంచి స్థితి మళ్ళీ మారిపోయింది. అదేమిటో ఇంకను పూర్తిగా అవగాహనకు రాలేదు కాని ఇంతకుముందు కంటే బాగానే ఉన్నదనిపిస్తోంది. ఇప్పుడు వ్యాప్తి చెందటం లేదనిపిస్తోంది. ఆశ్చర్యపడటం కూడా ఇప్పుడు అనుభవానికి రావటంలేదు. అయితే, నిద్ర మాత్రం ఇంకా గాఢంగా ఉంటున్నది. సిట్టింగ్ సమయంలో కలిగే ఆనందం కంటే రాత్రి నిద్రించటంలో ఎక్కువ ఆనందం కలుగుతోంది. దానికి కారణం ఏమిటో తమరు వ్రాశారు కూడ. 'మాలిక్'ను జ్ఞాపకం చేసుకునే విషయంలో తమరు వ్రాసినటువంటి దానిని ఇప్పుడు మరచిపోవటం కష్టమే. నేను ఏ విధంగానైన చేసినప్పటికీ జ్ఞాపకం చేసుకుంటాను. నేను ఇంకనూ చాలా చక్రాలు దాటవలసి ఉందని తమరు వ్రాశారు. నా అభిప్రాయమైతే **నావికుడు దొరికినట్లయితే దాటటం ఏమంతగా కష్టం కాకపోవటమేకాక ఆ మార్గాన్ని సులభతరంగా, ఆహ్లాదంగా దాటివేయవచ్చు.** ఆ స్థితులు ఏమిటో భగవంతునికే తెలియాలి. వాటి తర్వాత వాటి అంతు కూడా లేదని తమరు వ్రాసిన దానినిబట్టి నా మనస్సులో ఇంకా ఆశ, ఉత్సాహమూ పెరుగుతున్నాయి. నా హృదయాన్నైతే 'మాలిక్'కు నేను అర్పించివేశాను. కనుక ఇప్పుడింక 'ఆతడి' ఇష్టానుసారంగా చేస్తారు. ఇప్పుడు నాలో కలిగిన స్థితి ఏమిటంటే, మనస్సులో ఏవైతే ఉన్నాయో, అవి నోటి నుంచి నాకు తెలియకుండానే వెలువడుతున్నాయి. ప్రస్తుత దశను తెలుసుకోగలిగినట్లయితే, లేదా ఇంకేమైనా మార్పు ఉంటే తమకు వ్రాస్తాను. ఈరోజు ఏదో మార్పు కనిపిస్తోంది కాని దానిని స్పష్టంగా చెప్పలేక పోతున్నాను. కేసర్, బిట్టో తమకు ప్రణామం అందజేస్తున్నారు. అమ్మ ఆశీస్సులందిస్తోంది.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 41

లఖీంపుర్,
02.07.1949

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామాలు. ఇక్కడ అందరూ క్షేమంగా ఉన్నారు. తమరు కూడా కుశలమేనని భావిస్తున్నాను. 'మాలిక్' యొక్క అపార కృప మరియు తమ యొక్క, మాస్టర్ సాహెబ్ యొక్క కృషి వల్లనూ నా ఆత్మిక దశ బాగానే ఉంది. ఇప్పుడు హృదయంలో ఆనందంగాని, విచారంగాని వ్యక్తంకానటు వంటి ఆశ్చర్యకరమైన దశగా ఉంది. ఇటీవల నాలుగైదు రోజులు చాలా అశాంతిగా ఉంది. మనస్సు కూడా విసుగ్గా ఉన్నట్లనిపించింది కాని ఇప్పుడు ఆ దశ మళ్ళీ మామూలు స్థితికి వచ్చింది. ఆరు ఏడు రోజులైతే పూజ చేయటానికి మనస్సు ఏమాత్రమూ ఇష్టపడలేదు. అదే దశ ఇప్పటికీ కొద్దిగా నెలకొని పూజ చేయాలను ధ్యాస నన్ను చింతకు గురిచేస్తోంది. ఇలా ఉండగా ఇప్పుడు 'మాలిక్' కృపవలన హృదయం పూజలో నిమగ్నమవుతూ ఉన్నది. నేనయితే చాలా భయపడిపోయాను కాని చాలా మొండిపట్టుదల కారణంగా మామూలుగా తీసుకున్న సిట్టింగ్‌ల కంటే ఎక్కువసార్లు సిట్టింగులు తీసుకొన్నాను. నా పరిస్థితి ఏ విధంగా ఉన్నదంటే తమకు ఉత్తరం వ్రాయటానికి కూడా హృదయం ఇష్టపడలేదు. అతిప్రయత్నంమీద జూలై 1వ తేదీన ఏదో వ్రాయటానికి ఆరంభించాను కాని, అర్ధగంటసేపు కలం పట్టుకొని కూర్చున్నప్పటికీ ఏమీ

వ్రాయలేని కారణంగా ఆ ప్రయత్నం విరమించాను. ఈరోజు 'మాలిక్' ఇచ్ఛానుసారంగా వ్రాయగలిగాను. 'మాలిక్' యొక్క అపార కృపవలన నా దశ చెడిపోయిందని కాని, చెడిపోవటం కాని జరగదని నాకు విశ్వాసం ఉన్నది.

పూజ్య బాబూజీ, ప్రార్థన చేస్తూ ఉండమని తమరు వ్రాశారు. నేను ఆ విధంగా చేస్తూనే ఉన్నాను కూడ. కాని ఇప్పుడు ప్రార్థన అంత బాగా జరగటం లేదు, ఎందుకంటే హృదయం సహకరించటంలేదు. అయినప్పటికీ క్రమంతప్పకుండా చేస్తూనే ఉన్నాను. ఇప్పుడు రెండు మూడు రోజుల నుండి హృదయం మళ్ళీ పూజ చేయటానికి ఇష్టపడతూ ఉన్నది.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 42

లఖీంపుర్,
10.07.1949

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తర మొకటి తమకు అందే ఉంటుందను కుంటాను. కొద్దిరోజులు నుండి నాలో సోమరితనం ఏర్పడి, ఎప్పుడూ నిద్రపోవాలని అనిపిస్తున్నది. ఈ స్థితి నేను గతంలో తమకు ఉత్తరం వ్రాసినపుడు కూడా ఉంది కాని, ఇప్పుడది విపరీతంగా ఉంది. ఈ మధ్యకాలంలో 'మాలిక్' స్మరణలో మగ్నమై ఉండాలను కోరిక ఎంతగా పెరిగింది అంటే రాత్రిళ్ళు నిద్రపోవాలని కూడా అనిపించటంలేదు. దీనికొరకు నా శిథిల శరీరంతో అవకాశం ఉన్నంతవరకే కాకుండా ఇంకా అధికంగానే పరిశ్రమించాను. రేయింబవళ్ళు మనస్సు పనిచేసిన కారణంగా ఇప్పుడది అలసిపోయింది. తల తిరుగుతోంది, హృదయం కూడా కలవరం చెందుతూ ఉంది. శిరస్సులోని నరాలు కూడా తెగిపోయినట్లయి శరీరమంతా బలహీనమైపోయింది. అయితే ఈ దీనురాలు ఒక్కసారి హృదయంలో నిండుగా 'మాలిక్'ను జ్ఞాపకం చేసుకోగలిగిన ఆనందాన్ని పొందాను. ఈ ఆనందం ముందు ఆ బాధలన్నీ దిగతుడుపే. కాని 'అతని' జ్ఞాపకంతో హృదయం నిండిపోవలసిందిపోయి అది ఖాళీగా అయిపోయింది.

శ్రీ బాబూజీ, తమరు దయచేసి కోపగించుకోవద్దు. ఇందులో నా తప్పు ఏమీ లేదు. ఎందుకంటే, 'తమ'రే దాని రుచి చూపించారు. మరి ఈ శారీరిక బాధలు ఇంకెంత కాలం ఉంటాయి? ఇప్పుడు ఆ స్థితి తగ్గిపోయింది. ఒక్క సిట్టింగ్ కూడా తీసుకోలేదు. శిరస్సుకు బాగా తైలం పట్టించి, మళ్ళీ నా రేపటి పని కోసం సన్నద్ధమవుతాను. నా బలహీనతను తగ్గించుకోవటానికి డాక్టర్‌గార్ని సంప్రదించి మందులు వాడాను. అయితే **ఇప్పుడు నా స్థితి గురించి అసలైన డాక్టర్‌కు వ్రాస్తున్నాను. కాని నాకు ఈ వ్యాధిలోనే ఆనందం ఉన్నది కనుక తమరు దానిని నయంచేయవద్దని కోరుతున్నాను.** తమరు ఒక ఉత్తరంలో **అశాంతియే మనల్ని గమ్యానికి చేర్చుతుంది** అని వ్రాసి ఉన్నారు కూడ. సాధారణంగా నాకు ఏ విధమైన అశాంతి అనిపించదు. స్థితి మామూలుగానే ఉంది. ఇప్పుడు ఇంకొక విషయం ఏమిటంటే, నా అంతట నేను స్వయంగా ధ్యానం చేసుకోవాలా లేక మాస్టర్ సాహెబ్‌వద్ద సిట్టింగ్ తీసుకోవాలా అని తోచకుండా ఉంది. దీనితోపాటు అనుభవమవు తున్నది ఏమిటంటే, శరీరం శిథిలమైనందువలన నేను లేచి నిలబడాలంటే కాళ్ళు తడబడుతున్నాయి. కొంతసేపు గుండెమీద చాల ఒత్తిడికి గురవుతున్నాను. మళ్ళీ కొద్ది సమయానికే మామూలు స్థితి కలుగుతూ ఉంది. ఇప్పుడు నిరంతరం మనస్సును 'మాలిక్'వైపు మాత్రమే మరల్చి ఉంచాలి అను భావం నాలో కలుగుతోంది. అది 'మాలిక్' అపారకృపకు నిదర్శనం. ఇప్పుడు స్థితిలో చాలా గాంభీర్యం ఏర్పడింది. అది ఎలా అంటే, సందర్భం ఎంత నవ్వు కలిగించేదైనా సరే, నాకు మాత్రం నవ్వు రావటంలేదు. నాకేమీ వినిపించటం లేదు కూడా! అది ఎందుకో నాకు తెలియటం లేదు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు తెలుపుతోంది. కేసర్, బిట్టో నమస్కారం తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 43

లఖీంపుర్,

12.07.1949

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

నమస్సులు. నిన్న ఒక ఉత్తరం పోస్టు చేశాను. తమరు మాస్టర్ సాహెబ్‌గార్కి వ్రాసిన ఉత్తరంలో నన్ను ఉద్దేశించి వ్రాసినది –'ఫకీరు' ఎప్పుడూ ముందడుగే వేయాలి అని వ్రాసినదానిని విని కొంత చింత కలిగింది కాని అది ముందంజవేయటానికి శిక్షణగా నిలిచింది. దానివలన నా హృదయానికి కొంత ఉల్లాసం కలిగింది. నా బాబూజీ, ముందడుగు వేయటంలో ఎక్కడైనా ఎప్పుడైనా వెనకాడటం జరిగిందా అను సందేహం ఈ దీనురాలికి కలిగినపుడు, నా హృదయం చాలా అశాంతికి గురవుతుంది. జూలై 7వ తేదీతో వ్రాసిన నా ఉత్తరం తమకు చేరే ఉంటుందనుకుంటాను. దానిలో పూజ చేయటానికి నా హృదయం సహకరించక పోవటమేకాక తమరికి లేఖ వ్రాయటానికి కూడా మనస్కరించటంలేదని వ్రాశాను. అన్ని వేళలా విచారంగా ఉండటమేకాక నిద్రిస్తున్నాను. ఇప్పుడు కూడా అలాగే కొనసాగుతోంది. మానసం పూర్తిగా శూన్యంగా అయిపోయింది. నిన్నటి ఉత్తరంలో నేను వివవరించినటువంటి శారీరిక బాధలు, ఈరోజు శాంతించాయి.

పూజ్య బాబూజీ, **శారీరక బాధలు ఉన్నప్పటికీ, దీక్షతో సాహసించి ముందడుగు వేయటానికి ఏమాత్రం వెనుదీయనని నేను ఇదివరకే ప్రతిజ్ఞ చేశాను. మళ్ళీ ఇప్పుడు కూడా చేయటమే కాక నేను ఈ మార్గంలో రోజు రోజుకూ ముందుకు సాగిపోతాను. ఒకవేళ నేను పురోగమించటంలేదని నా గ్రహింపుకు వచ్చినట్లయితే ఈ దీనురాలి హృదయం అశాంతిని భరించలేక క్రుంగి కృశించిపోవచ్చు.** ఏవిధంగా చూసినా ఇప్పుడు హృదయ స్థితి సమతుల్యంగా ఉంది. ఎవ్వరైనా నన్ను నిందించినట్లయితే నా హృదయం పూర్తిగా ఉద్రేకం చెందుతుంది. ఏదైనా పని చేసిన తర్వాత హృదయం మళ్ళీ ఉద్రేక పడుతుంది. ఇప్పుడు స్థితి బాగున్నదని చెప్తున్నదానిని తమరు విశ్వసించండి. నేనొక విషయం ప్రస్తావించటం మరచిపోయాను. అదేమిటంటే, **ఫకీరు యొక్క గమనం ఎల్లప్పుడూ ముందుకే సాగాలి అని తమరు వ్రాసి ఉన్నారు గదా! అయితే బాబూజీ ఈ విషయంలో విచారం, సంతోషమూ రెండూ ఎలా ఉన్నాయంటే, ఫకీరుకు పాదాలే లేకుంటే మరి అడుగులు ఎలా ఉంటాయి, అసలు అతని ఉనికియే లేనప్పుడు అతనికి పాదాలు ఎలా ఉంటాయి? అని తలపిస్తుంది.** శ్రీ బాబూజీ, ఒకవేళ ఎప్పుడైనా, ఒకటి రెండు సార్లు 'అహం' ('నేను' అను భావం) తలెత్తినప్పటికీ, నా హృదయం దానిని పట్టించుకోవటంలేదు. అసలు విషయం ఏమిటంటే, ఈ స్థితి స్పష్టంగా తెలియటంలేదు. ఈ కారణంగా ఉత్తరం వ్రాయటానికి ఆలస్యమవుతోంది. ఒక విధంగా చెప్పాలంటే, ఈ స్థితి మనస్సులో అర్థమవుతుంది కాని దానిని వివరించలేకపోతున్నాను. స్థితిలో తేలికదనం చాలా అధికంగా ఉన్నది.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 44

లఖీంపుర్,

15.07.1949

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

వినయపూర్వక ప్రణామం. నా రెండు ఉత్తరాలు తమకు అంది ఉంటాయని భావిస్తున్నాను. మొన్నటి నుండి స్థితిలో కొంత మార్పు వచ్చింది. ప్రతి దానికి హృదయం హత్తుకు పోవాలనుకుంటోంది. అప్పుడుప్పుడు గోడకు

హత్తుకు పోవాలనిపిస్తుంది, కాని ఏదో రకంగా నేను నియంత్రించుకుంటున్నాను. నేను చంటి పిల్లలాగా తరచుగా తమతో ఆడుకుంటున్నట్లుగా ఉందని తమకు ఒకసారి వ్రాశాను. ఇప్పుడది చాలా రోజులుగా తొలగిపోయింది. ఎందుకంటే, ఇప్పుడు ఏకాంతంగా, ప్రశాంతంగా కూర్చుండిపోవాలని అనిపిస్తోంది.

మతిమరుపు చాలా ఎక్కువైపోయింది. ఇది వ్రాయకూడదు కాని, నిజం చెప్పాలంటే ఎంతసేపు బాత్‌రూమ్‌లో ఉంటున్నానో తెలియకుండా ఉంటున్నది. భోజనం చేస్తూన్నపుడు ఏమి తిన్నానో, ఎవరు తిన్నారో కూడా తెలియటంలేదు. కూర్చుని ఉండి కూడా కొద్దిసేపటిలోనే ఎవరు కూర్చున్నారో కూడా తెలియనంతగా ఉంటున్నది. అందువలన నన్ను నేను చైతన్య పరచుకోవలసి వస్తున్నది. ఈ స్థితి పది – పదిహేను రోజులుగా ఉన్నప్పటికీ, ఏడు ఎనిమిది రోజుల నుంచి వృద్ధి చెందుతోంది. పూజ్య బాబూజీ, ఈ దీనురాలు ఎక్కడా నిలిచిపోకుండా ముందుకు లాక్కుని వెళ్ళండి. అమ్మ తమకు ఆశీర్వాదాలు తెలుపుతున్నది.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

# ఉత్తరం సంఖ్య - 45

లఖీంపుర్,
23.07.1949

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. మాస్టర్ సాహెబ్‌కు తమరు దయతో వ్రాసిన ఉత్తరం చేరింది. దానిలోని విషయాలు తెలిశాయి. ఆ ఉత్తరంలో, నా ఆత్మోన్నతి నిలిచిపోయింది అను విషయం చదివి నాకు చాలా దుఃఖం కలిగింది. అన్నింటికి మించిన బాధ ఏమిటంటే, నేను 'ఎవరికయితే తనువు (శరీరం), ఆత్మను అర్పించివేశానో, ఎవరైతే ఈ దీనురాలికి సర్వస్వం, లక్ష్యంగా ఉన్నారో, అటువంటి 'అతడి'ని చేరటానికి, నా ఉన్నతి ఎంత కాలం నిలిచిపోయిందో అంత కాలం ఇంకను ఆలస్యమవుతుంది కదా! అని. పూజ్య బాబూజీ, ఈ నిరుపేద చేసిన తప్పు ఏమిటో తమరు చెప్పండి. నా సాధనలో ఉన్న లోపం ఏమిటి? అది ఏమిటో తెలిస్తే దానిని నేను సరిదిద్దుకొని, ఎవరైతే నా శాంతి హరించారో 'అతడి'ని ఉత్సాహం, ఆనందంతో చేరతాను. ఒక విధమైన ఉత్సాహంతోపాటు అశాంతిలో ఆనందం ఉంటున్నది, ఇకపై ఎప్పటికీ ఉంటుంది. మొదట, ఎప్పుడైతే ధ్యానం చేయటానికి ఇచ్ఛగించలేదో, హృదయంలో ఒక వింతైన విసుగుదల కలిగిందో, అప్పుడు నేను ఇది కూడా ఒక దశ వంటిదేనని భావించాను; అయినప్పటికీ నేను సిట్టింగ్‌ను తీసుకోవడం ఆపలేదు. నేను ధ్యానం చేస్తున్నపుడు హృదయంమీద బాగా ఒత్తిడి కలిగినప్పటికీ కూడా నేను పగలనక రేయిఅనక ఆరు లేక ఏడు సిట్టింగులు తీసుకొంటున్నాను. పగలంతా కూడా అవకాశం ఉన్నంతలో 'పూజ' చేశాను. అప్పుడు నాకు సిట్టింగ్ జీర్ణంకావటం లేదు అని ఒక నమ్మకం కలిగింది. ఒకసారి మాస్టర్ సాహెబ్– 'మాలిక్' స్మరణతో ఉంటే అంతా జీర్ణమైపోతుంది అని చెప్పిన విషయం నాకు జ్ఞాపకం వచ్చి, రాత్రిళ్ళు అంతా మేల్కొని అలా చేయడం ఆరంభించాను. అయితే దాని వలన హృదయం మీద ఒత్తిడి పెరుగుతూ పోయింది. ఆ భారం వలన పగలు నాలుగేసి దఫాలు కలుగుతున్న దశ వికలమైపోయి, ముఖం వాడిపోయినట్లవ్వటమేకాక దానితో హృదయం కృంగిపోతున్నట్లుగా అనిపించేది. అయితే ఆ విషయం నేను ఎవ్వరికీ చెప్పలేదు. ఇంకా ఏమి చెప్పమంటారు! నా అంతట నేను 'గ్రాండికో' మరియు 'గ్లుకోజు' లను తరచుగా త్రాగుతూ ఉండేదానిని. అలా చేయటంవలన బలహీనత ఇంకా పెరిగిపోయింది. పురోగమనం నిలిచిపోవటం గురించి ఏమాత్రమైనా సందేహం కలిగితే నేను వెంటనే 'తమకు' లేఖ వ్రాసి ఉండేదానను. ఏదైతేనేమి, 'మాలిక్' ఇప్పుడు ఉన్నతి కల్పించారు. శ్రీ బాబూజీ, అప్పుడప్పుడు తమరు నన్ను గమనిస్తూ ఉండండి. నేను కూడా తమకు వెంటనే వ్రాస్తూ ఉంటాను. తమ అపారమైన కృపతో నా స్థితి ఇప్పుడు మళ్ళీ మెరుగైంది. హృదయంలో ఒత్తిడి తొలగిపోయి తేలికదనం మళ్ళీ

అనుభవమవుతోంది. నేను ఇదివరలో వ్రాసిన, అన్నింటికీ అతుక్కుపోవాలను కోరిక ఇప్పటికీ ఉంది. ఇప్పుడు నూతన విషయం ఏమిటంటే, అప్పుడప్పుడు సిట్టింగ్ తీసుకుంటున్న సమయంలో అకస్మాత్తుగా ఏవో ఒక విధమైన కంపనాలు లాంటివి కలుగుతూ ఉంటూ, శరీరమంతటి నుండి బయటకు ఆ సిట్టింగ్ వెలువడుతున్నట్లుగా ఉంటున్నది. ఇటీవల ధ్యానంలో కళ్ళు మూతబడటం లేదు, అప్రయత్నంగానే తెరుచుకుంటున్నాయి; అప్పుడప్పుడు సిట్టింగ్ తీసుకొంటూ ఉన్నప్పుడు కూడ. కాళ్ళ మీద జెర్రులు ప్రాకినట్లుగా అనిపిస్తోంది. ఈ విధంగా వ్రేళ్ళలోను, చేతుల్లోను, శిరస్సులోను కూడా అనిపిస్తోంది కాని అది వాస్తవంగా కాదు. ఒక్కొక్కసారి పాడుతున్న సందర్భంలో నోటి నుండి పవిత్రత వెలువడుతున్నట్లుగా అనిపిస్తుంది. శ్రీ బాబూజీ, స్వయంగా తమరు, స్వామీజీ మరియు లాలాజీ తమ పుస్తకాలలో ఎక్కడికి చేరవలసి ఉందని వ్రాశారో నేను అక్కడికే చేరాలి. “నేను ఆమెను సక్రమంగా తీసుకువెళ్తాను” అని ఈ దీనురాలిని ఉద్దేశించి తమరు ఉత్తరంలో వ్రాసినది చదివి అత్యంత సంతోషం కలిగింది. నా వంటి అల్పురాలి గురించి తమరు వ్రాసినది తమ యొక్క కృప మరియు గొప్పదనానికి నిదర్శనం. అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ మరియు బిట్టో ప్రణామాలు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 46

లఖీంపుర్,

26.07.1949

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరే ఉంటుందనుకుంటాను. ఇప్పుడు నా ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను. ఐదు ఆరు రోజుల నుండి నా స్థితిలో ఆత్మ సమర్పణ ఉందా లేదా అనే విషయం తెలియటంలేదు. ఇంతకుపూర్వం అన్ని పనులూ యాంత్రికంగా జరిగిపోతున్నట్లుగా అనిపించేది కాని ఇప్పుడు అలా లేదు. అది ఏమిటోగాని, నేను మాస్టర్ సాహెబ్‌కు నా స్థితి వివరిస్తున్నప్పుడుకాని, ఏదైనా చేస్తున్నప్పుడుకాని నేను ఎవరినో, నేను ఏమిటో కూడా తెలియకుండా ఉంది. ఇంకొక విషయం ఏమిటంటే, సిట్టింగ్ తీసుకుంటున్నప్పుడు అది ఎంత సమయం కొనసాగిందో కూడా తెలియటంలేదు. అయితే శరీరం త్వరగా అలసిపోయినపుడు ధ్యాస కలుగుతోంది. అప్పుడప్పుడు శిరస్సు ముందుభాగంలో వ్యాపకం జరుగుతున్నట్లుగా అనిపిస్తోంది. ఇంతకుముందు వ్రాసిన ఉత్తరంలో సంపూర్ణ శరీరం నుండి సిట్టింగ్ వెలువడుతున్నట్లుగా ఉన్నదని చెప్పినది తప్ప మరే విధమైన నూతన స్థితి లేదు.

హృదయం ‘మాలిక్’ యొక్క జ్ఞాపకంతో పూర్తిగా గాయపడింది. తమ యొక్క సహజమార్గంలో నేను ప్రవేశించడానికి ఇది ఒక కారణం. అయితే ఈ గాయాలను మాన్పుకోవటంలో ఒక వింతైన ఆనందం ఉంటుందని నేను చెప్పగలను. ఈ గాయాలు చాలా ఆంతరికమైనవి (లోతైనవి) అయి ఉంటాయి కాని శరీరంపైన కనిపించవు. అందువల్లనే ‘తమ’ మిషన్‌లో చేరటానికి ఎవ్వరూ త్వరపడరు. నేను ఇలా ఎందుకు వ్రాసానో భగవంతునికే తెలియాలి, దయచేసి క్షమించండి. మరేదైనా స్థితి అనుభవం కాగానే వెంటనే వ్రాస్తాను.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 47

షాజహాన్‌పుర్,

27.07.1949

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

నీకు కుశలమగు గాక! నీ ఉత్తరం ద్వారా నీ స్థితి తెలిసింది. **విశ్వాసం సరిగ్గా ఉంటే మన సాధనలో ఎవ్వరూ ఆగిపోవటమనేది ఉండదు.** కొంత సమయం వేచి ఉండాల్సిన సందర్భాలు అనగా మజిలీలు మన యాత్రలో తప్పకుండా ఉంటాయి. అలా ఎక్కువ రోజులు నిలిచిపోవటం జరిగితే, అంత వ్యవధి వరకు (ఆమేరకు) ఉన్నతిలో వెనకబడవచ్చు. కాని వ్యవధి తక్కువైతే పెద్దగా తేడా ఏమీ లేనట్లే. ఇలా ఏదైన స్థితిలో నిలిచిపోవలసివస్తే అది కూడా శుభప్రదమే. ఎందుకంటే ఈ నిలకడ మూలంగా ముందుకు పోవటానికి శక్తి ఉత్పన్నమవుతుంది. ఇలా ఆగటానికి వేరే కారణం కూడా ఉండవచ్చు. అది ఎటువంటిదంటే, ఎక్కువగా తినడంవలన పూర్తిగా జీర్ణించుకోలేకపోవటం మాదిరిగా ఉంటుంది. మహాత్ములు దీనిని కూడా శుభసూచకముగానే నిర్వచించారు. ఇంకా ఏమన్నారంటే, అభ్యాసులు సంవత్సరాల తరబడి ఇదే స్థితిలో నిలిచిపోవటం జరిగినట్లయితే దీనిని అవరోధం (Spiritual constipation) అని అన్నారు. కాని మన గురు మహరాజ్ (లాలాజీ సాహెబ్) కృపవలన ఇటువంటి ఆధ్యాత్మికత యొక్క అజీర్ణం వలన ఆగిపోవటమనేది మన పద్ధతిలో రావటానికి ఆస్కారం లేదు. భగవంతుడు అనుగ్రహిస్తే ఆగి ఉన్న నీ స్థితి అటువంటి ఆధ్యాత్మిక అజీర్ణం వలన కాదు, కానేరదు కూడా. ఇది ఒక దశను దాటి, తరువాత దశలోకి చేరబోయే మధ్యనున్న స్థితి. ఇటువంటి రెండు స్థితుల మధ్య స్థానాలు ప్రతి అభ్యాసీకీ అనుభవమవుతాయి. నా ఆత్మికబలంతో నిన్ను అందులో నుంచి బయటకు తీసుకొనివచ్చే ప్రయత్నం చేయలేదు. నీవు స్వయంగా నీ ఆత్మబలంతో ఊర్ధ్వస్థితికి వచ్చావు. నేను కోరుకున్నది కూడా ఇదే. ఒకవేళ ఇప్పటికీ ఆ స్థితి నుంచి కదలకపోయినట్లయితే తప్పకుండా నేను నా ఇచ్ఛాశక్తిని (Will -Power) ప్రయోగించి నిన్ను బయటకు తీసుకొనివచ్చే వాడిని. **ఎవ్వరైనా తన స్వయంకృషితో సాధించిన పురోగతినే ఉత్తమమైనదిగా చెప్పాల్సి ఉంటుంది.** నీవు నీ మనస్సులో దిగులు పెట్టుకోకూడదు. ఎందుకంటే, ఆ ఆగిపోయే స్థితి లేకపోతే నువ్వు అందులో నుంచి బయటకు రావటానికి ప్రయత్నం కూడా చెయ్యవు. అయితే ఇందులో నుంచి బయటపడటానికి నీవు కాళ్ళు, చేతులూ ఆడించావు (విలవిల లాడావు). కాబట్టి, ముందుకు పోవటానికి నీకు ఇంకా శక్తి లభించింది. నీవు శరీరంలో ఏదో పాకుతున్నట్లు అనిపించిందని వ్రాశావు. అలా ఉన్నప్పుడు నీకు శరీరంలో గిలిగింతలు పెడుతున్నట్లు ఉంటుందా లేక ఏదైనా ప్రతిక్రియ జరుగుతున్నట్లు ఉంటుందా? ఇంకొక విషయం ఏమిటంటే, అది పెరుగుతోందా లేక అలాగే ఉంటున్నదా?

మీ అమ్మగారికి నమస్కారము, పిన్నలకు ఆశీస్సులు.

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 48

షాజహాన్‌పుర్,

30.07.1949

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

భగవంతుడు నిన్ను ఆశీర్వదించుగాక! నీ జాబు అందింది. దానికి జవాబు మాష్టర్ ఈశ్వర్ సహాయ్‌గారి చిరునామాకు పంపించాను. ఇప్పుడు 26.07.1949వ తేదీతో ఉన్న నీ రెండవ జాబు అందింది. “నా మనస్సు పూర్తిగా ‘మాలిక్’ జ్ఞాపకంతో గాయపడింది. అయితే నేను ఇది మాత్రం గట్టిగా చెప్పగలను, ఏమంటే ఇటువంటి

గాయాలను మాన్పటంలో ఏదో వింతైన ఆనందం ఉంటుంది. కాని ఈ గాయాలు బాగా లోతుగా గ్రుచ్చుకున్నవై ఉండి పైకి కనిపించనవిగా ఉంటాయి. అందవల్లనే 'తమ' మిషన్‌లో చేరటానికి ఎవ్వరైనా త్వరగా సిద్ధపడరు" అని వ్రాశావు. నీవు వ్రాసిన ఈ మాటలు చాలా నిజమనిపించాయి. ఇటువంటి గాయాలు ఆ విధంగా పైకి వచ్చి అభ్యాసికి తెలిసేటటువంటి ప్రక్రియ నీకు తోస్తే దానిని నాకు తప్పకుండా తెలియజేయాలి. బహుశా చౌబేజీగారు కూడా ఆలోచించి ఏదైనా చెప్పగలిగితే ఇతరులకు లాభదాయకంగా ఉంటుంది. జనం కూడా మిషన్‌వైపు ఆకర్షించబడతారు.

జనులకు అభిరుచి లేనికారణంగా వారికి మిషన్‌లోకి ప్రవేశించాలని అనిపించదు. మరి ఈ అభిరుచిని కల్పించటం ఎలా? దీనికి మార్గం నేను చెబుతాను. ఎవ్వరూ చేయలేకపోయినంతగా నేను ఇచ్చే ప్రాణాహుతి చాలా స్వచ్ఛమైనదిగా ఉంటుంది. దీనిలో పొంగిపోవటం, లేశమాత్రంగా మాయాకల్పితం (ప్రయోగం)గాని ఉండదు. అది ఎటువంటిది అంటే, అందులో శాంతి, తేలికదనం తప్ప ఇంకేమీగాని, భక్తి ప్రేమలుగాని అనుభవానికి రావు. ఈశ్వరీయ స్థితి ఏదైతే ఉన్నదో ఖచ్చితంగా అదే కలుగుతుంది. అది చేయగలిగిన పనిని అన్యవిధాలైన ప్రాణాహుతి పద్ధతులు ఏవీ చేయలేవు. నేను ఇటువంటి ప్రాణాహుతినే ఇవ్వటానికి ఎందుకు కట్టుబడి ఉన్నానంటే, నా 'మాలిక్' అనగా గురుదేవులు నన్ను ఈ స్థితిలోనే పూర్తిగా లయం చేశారు. అటువంటి తీక్షణత కలిగించే వారు ఇప్పటికీ ఉన్నారు. అటువంటి వారి యొక్క ప్రాణాహుతి (ట్రాన్స్‌మిషన్) అభ్యాసికి తీవ్రంగా ఉన్నట్లనిపిస్తుంది. ఆ ప్రశిక్షకులు దానిని శ్రేష్ఠంగా భావిస్తారు. ఈ విధంగా ఎందుకంటే, వాస్తవమైనది, స్వచ్ఛమైనటువంటిది వారి అనుభూతికి రాలేదు. నా పరిస్థితి కూడా కొంచెం ఇలాగే ఉంది. దీనిని చూసి ప్రతివ్యక్తీ నన్ను నా 'మాలిక్' (గురుదేవులు) ఎంత వాస్తవంగా తయారుచేశారో దానిని గుర్తించడం లేదు. అందుచేత జనులు తరచుగా అపార్థం చేసుకుంటున్నారు. **జనులు, 'హల్వా' తినిపిస్తే సంతృప్తి చెందకుండా 'శనగలు' తినడానికి ఆశపడితే దానికి నావద్ద చికిత్స ఏమీ లేదు.**

దేవుని దయవలన నీలో కలిగిన స్థితి మంచిదే. హృదయచక్రంలో నీ ప్రయాణం చాలా బాగాను, సరిపడినంతగాను జరిగింది. నేను దానిని ఇంకా స్పష్టంగా చూడాలనీ, అభివృద్ధి చేయాలనీ అనుకుంటున్నాను. ఎందుకంటే, అది సంపూర్ణంగా తెరువబడే స్థితికి రావటానికి అడ్డంకి ఏమీ ఉండకూడదని నా యోచన.

మీ తల్లిగారికి నా నమస్కారాలు, పిన్నలకు ఆశీస్సులు అందజేయి.

నీ శ్రేయోభిలాషి
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 49

లఖీంపుర్,
01.08.1949

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

ప్రణామం. తమరు దయతో వ్రాసిన రెండు ఉత్తరాలు చేరాయి. అందులో ఒకటి మాస్టర్ సాహెబ్‌గారి చిరునామతో వ్రాసినదికాగా, రెండవది వారి ద్వారా పంపినది. ఇప్పుడు ఉన్న స్థితి ఎంటువంటిదంటే, రాత్రి నిద్రించానో లేదో తెలియనటువంటిది. నిద్ర నుంచి మేల్కొన్న తర్వాత నిద్రించి మేల్కొన్నట్లుగా అనిపించటంలేదు. అంతేకాదు, పగలు గడచి రాత్రి ఎప్పుడు వచ్చిందో కూడా స్ఫృహలో ఉండటం లేదు. ఇంకా ఏమిటంటే, ప్రతిదీ ఒకటిగానే తలపిస్తోంది. సిట్టింగ్ తీసుకుంటూ ఉన్నప్పుడు సిట్టింగ్ తీసుకుంటున్న సంగతి మరచిపోతున్నాను. ఒక్కొక్కసారి ఎక్కువసేపు నిద్రపోయి, ఏదో ఆలస్యమైపోయినట్లుగా గాబరాగా నిద్ర నుంచి లేస్తున్నాను. కాని కళ్ళు తెరచిచూస్తే ఆ విధంగా జాగు జరగలేదని గ్రహిస్తున్నాను. శరీరంలో ఏదో ప్రాకినట్లుగా ఉంటున్నదని నేను వ్రాసినటువంటిది,

ఏదో కొంత సంచలనం కలిగిస్తోంది కాని అది కూడా తరచుగా అప్పుడప్పుడు మాత్రమే అనుభవమవుతోంది. ఇప్పుడైతే దాదాపుగా ఏమీ లేనట్లుగానే తలపిస్తోంది. పగటి సమయంలో ఒకటి, రెండుసార్లు శిరస్సు ముందు భాగంలోను, అప్పుడప్పుడు నాభివద్ద అనుభవమవుతున్నప్పటికీ అది కూడా లేనట్లే. నేను తమకు ఉత్తరం వ్రాసిన తర్వాత రెండు, మూడు రోజులు అలా ఉంది.

తమ ఉత్తరంలో, "మన విధానంలో ఎవ్వరూ నిలిచిపోవటమంటూ ఉండదు" అని వ్రాసినది చదివి నాకు అత్యంత ఆనందం కలిగింది. 'మాలిక్' యొక్క అపార కృపతో ముందుకు సాగిపోతూనే ఉంటానని ఆశిస్తున్నాను. ఇంకా ఏమిటంటే, తమ వంటి సహాయకులు అందుబాటులో ఉన్న వారికి (పతనం) పడిపోవటం ఎలా సంభవిస్తుంది! ఇంకను నేను చెప్పేదేమంటే, ఎవరి కృప మరియు దయవలన మావంటి దీనులైన సాంసారిక జీవులను అగాధ భవసాగరాన్ని సులువుగా దాటించగల 'మాలిక్'ను తెలియపర్చిన తమ యొక్క శ్రీ గురుదేవ్ భగవాన్ మరియు మన శ్రీ దాదాజీలు అత్యంత ధన్యులు. వారికి కోటానుకోట్ల ధన్యవాదాలు మరియు లక్షలసార్లు కృతజ్ఞత లర్పిస్తున్నాం. గొప్ప గొప్ప ఋషులు, సెయింట్లు అత్యంత సాధనచేసి కూడా పొందలేనటువంటిది తమరు ప్రాప్తింపచేసుకొని ఈ ధార్మిక చరిత్రలో నిలిచిపోయారు.

ఇంకా చెప్పాలంటే, వారు దీనిలో పావు భాగం కూడా పొంది ఉండకపోవచ్చు. తమ శ్రీ గురుదేవ్ మహరాజ్‌కు వర్తింపజేయబడిన ఈ రూపకమే 'తమ'కు కూడా వర్తిస్తుంది.

**"ఇన్ సమ్ ఏ ఉపమా ఉర్ ఆనీ,**
**కవి–కుల్ అగమ్ కరమ్ మన్ బానీ"**

అనగా 'అతడి'కి 'అతడే' సాటి, 'అతడి'కి సాటి మరెవ్వరు లేరు. 'అతడు' కవుల ఊహకు కూడా అందనటువంటివాడు. కర్మకు, మానసానికి, వాక్కుకు అతీతమైనవాడు.

ఈ దీనురాలు గమ్యం చేరునట్లుగా దయచేసి తమ ఆశీస్సులను, దృష్టిని సదా ఉంచండి. నా మానసంలో ఎటువంటి కలవరం లేకపోగా ఉత్సాహమే ఉంది. ఇంకొక మాట ఏమిటంటే, ఆ దీనత్వం ఇప్పుడు నన్ను వెంటాడుతోంది. ఇప్పుడు ఆ దీనత్వానికి కూడా జ్ఞాపకం లేకుండా ఉంటోంది. రెండవ ఉత్తరంలో, బహుశా హృదయం 'మాలిక్' యొక్క జ్ఞాపకంతో గాయపడి ఉండవచ్చును అని వ్రాశాను. దీనిని కేవలం నేను చిలిపితనంతో వ్రాశాను. దీనిలో నా ఉద్దేశ్యం ఏమిటంటే, బాగా మంచి మనిషి ఎందుకు గాయపడాలి అనుకుంటాడు అని మాత్రమే. పూజ్య శ్రీ బాబూజీ, తమ మిషన్ తప్పకుండా శీఘ్రగతిని పురోగమిస్తుంది. **మా అభిరుచి కొరవడిన కారణంగా తమ సిట్టింగ్‌లో లభించునటువంటి ఆ హల్వా యొక్క తీయదనాన్ని గుర్తించలేకపోవటం మా దోషంగానే పరిగణించాలి. సూక్ష్మంగా పరిశీలించినట్లయితే ఆ ఉజ్వల కాంతి (Ebullition) కంటే ఈ చిరు వెలుగు (Slow sparkling) లక్షరెట్లు మంచిది. ఎవరైనా నన్ను ఈ చిరువెలుగు లేదా చిరు కాంతికి బదులు ఉద్వేగపర్చమని కోరినట్లయితే నేను సూటిగా నిరాకరిస్తాను.** ఇంకొక మాట ఏమిటంటే, నాకు చిన్నతనం నుంచి తీపి అంటే మహాయిష్టంగా ఉండేది. నేను 'తమరి'ని ప్రార్థిస్తున్నది ఏమంటే, మాకు ప్రాణాహుతిని ఇప్పుడు ఇస్తూన్న ఇటువంటి దానినే ఎల్లప్పుడు అనుగ్రహించమని ప్రార్థిస్తాను. **లేశమాత్రమైనా మాయలేనటు వంటిది, శాంతి మరియు తేలికదనంతో పూరించబడినది అయిన 'తమ' సిట్టింగ్‌ను మాయొక్క అవగుణముల మూలంగాను, మాయ వలలో పడిపోయి ఉన్న కారణంగాను, దానియొక్క అనుభూతి పొందలేకపోతున్నాము.** 'మాలిక్' యొక్క ఔన్నత్యాన్ని గ్రహించగలుగునట్లుగాను, 'అతడి'ని బాగా అర్థంచేసుకొనగలుగునట్లుగాను మరియు 'అతడు' ఇచ్చిన దానిని 'అతడు' కోరుకుంటున్న విధంగా మేము దానిని, ఇచ్చిన దానిని ఇచ్చినట్లుగా ప్రాప్తింప చేసుకునేటట్లుగాను మా మానసం విలసిల్లునట్లుగా చేయమని నేను 'మాలిక్'ను సదా ప్రార్థిస్తాను. దయచేసి 'తమరు' తమ ఇష్టప్రకారం నన్ను నడిపించుకు వెళ్ళండి. దేనినైతే తమరు

వృద్ధి చేయాలనుకుంటున్నారో దానిని వృద్ధి చేయండిగాని శనగలు నమిలినట్లుగా చేయకండి. ఎందుకంటే, నా దంతాలు చాలా బలహీనమైనవిగా ఉన్నాయి.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 50

లఖీంపుర్,

08.08.1949

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం ఒకటి తమకు చేరే ఉంటుందను కుంటాను. ఇప్పుడు నా స్థితి ఎలా ఉందంటే, అన్ని పనులు 'మాలిక్' నిర్వహిస్తున్నాడనీ, పదే పదే ఇదే భావాన్ని నిలుపుకోవాల్సి వస్తోంది. హృదయంలో చాలా తేలికదనం మరియు సున్నితత్వం ఏర్పడి ఉన్నాయి. ఇంకొక పరిస్థితి ఎలా ఉందంటే, నేను ఎక్కడికైనా వెళ్ళినపుడు, ఎవ్వరైనా 'బాబూజీ' పేరు స్మరించినపుడు, ఒక్కసారిగా నా సమస్త శరీరం నుండి పవిత్రత పూర్తిగా వెలువడుతున్నట్లుగా అనిపిస్తోంది. అదేమిటో దైవానికే తెలియాలి. తమకు ఇంతకుముందు వ్రాసిన ఉత్తరం తరువాతరోజు నుండి, మూడు నాలుగు రోజులవరకు ఈ స్థితి నెలకొని ఉంది. కాని ఆ తరువాత నుండి హృదయంలో జటిలత్వం వృద్ధి చెందింది. ఇంతకుముందైతే ఈ స్థితి అప్పుడప్పుడు కలుగుతూ ఉండేది కాని ఇప్పుడు రోజంతా ఇదే స్థితి నిలిచి ఉంటున్నది. నేను ఒక ఉత్తరంలో –"నాకు 'మాలిక్' యొక్క జ్ఞాపకం ఉందా లేదా అను విషయం జ్ఞాపకం ఉండటంలేదు" అని తమకు తెలియజేసాను. సాధ్యమైనంతవరకు, 'మాలిక్'ను జ్ఞాపకం చేసుకుంటూ ఉండే ప్రయత్నమే చేస్తున్నాను. ఎప్పుడైనా 'అతని' జ్ఞాపకం చేసుకోవలసిన జ్ఞాపకాన్ని మరచిపోయినపుడు తరచుగా కోపం వస్తోంది. ధ్యానంలో కూడ పూర్తిగా శూన్యంగా ఉంటున్నాను. రోజంతా గడపటంలోను, ధ్యానంలో కూర్చుని ఉండే స్థితిలోను ఏమాత్రం తేడా కనిపించటంలేదు. ఇందువలన అప్పుడప్పుడు ధ్యానంలో కూర్చోవడం వలన లాభం ఏమిటి అని హృదయానికి అనిపిస్తోంది. అయితే నా అలవాటు ప్రకారం దేన్నినైతే ఇంతవరకు ఎంతగా చేస్తూ వచ్చానో, అంతమాత్రమే కాదు ఇంకా ఎక్కువ స్థాయిలోనే చేస్తున్నాను, చేయటమే కాదు, చేస్తాను కూడ. ఇప్పుడు ఉన్న స్థితి ఏమిటంటే, హృదయం పూర్తిగా (జటిలమై) మొండిదైపోయింది.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ మరియు బిట్టో ప్రణామాలు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 51

షాజహాన్‌పుర్,

25.08.1949

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ! ఏ వ్యక్తి అయినా ప్రకాశమువైపు సూటిగా చూస్తున్నప్పుడు కనుగ్రుడ్డులోని తెర (రెటినా) విస్తరించి కళ్ళు జిగేలు మనిపిస్తాయి. దాని మూలంగా ప్రకాశంలో కూడా అంధకారం కనిపిస్తుంది. ఇది త్రికుటి (నుదుటిలో రెండు నేత్రాలకు మధ్యస్థానం) కి చేరినప్పుడు ఈ స్థితి కలుగుతుంది. అక్కడ ప్రకాశం ఎక్కువగా ఉండటం మూలంగా అంధకారంగా ఉన్నట్లు అనిపిస్తుంది. ఈ విషయాన్ని నేను భవిష్యత్తుకోసం వ్రాశాను. లఖీమ్‌పుర్ (కస్తూరీగారి నివాస ప్రాంతం) పరదేశంగాను, కుటుంబ సభ్యులంతా అపరిచితులుగాను అనిపిస్తున్నట్లు వ్రాశావు. నీవు చెప్పిన దానినిబట్టి, అభ్యాసి తన ఆత్మతో లయమైపోతున్నప్పుడు, అనగా అతని జడత్వం 'దాని'లో (ఆత్మ) విలీనమైపోతున్నప్పుడు, అతడు

తన ఆత్మతోనే అనుసంధానమవుతూ ఉంటాడు. ఆ ఆత్మ సంబంధానికి విరుద్ధమైనటువంటి బాహ్యదృష్టి బలహీనపడి పోతుంది. అతని ఆంతరిక దృష్టి ఆ అసలు శక్తి మీదనే కేంద్రీకరించబడుతుంది. దాని ఫలితంగా తనకు ఎప్పుడూ ఎదురుగా ఉంటూ ఉండేవి కూడా ఇప్పుడు తన దృష్టిని ఆకట్టుకోలేవు. ఆ తర్వాత యావత్ ప్రపంచమూ అలాగే అనిపిస్తుంది. ఆ తర్వాత స్థితిలో ఇంకా మార్పు ఉంటుంది కాని దానిని ఇప్పుడే బహిర్గతం చేయటం అనుచితంగా భావిస్తున్నాను. ఖాళీగా అనగా శూన్యంగా ఉండటం మంచిదే (అనగా క్రియారహితంగాను, ఆలోచనా రహితంగాను తయారుకావటం). దీనినిబట్టి మన బాహ్య ఆవరణలు కొన్ని తొలగిపోయాయన్న మాట. హృదయం మీద అవధానం ఎక్కువగా చేయటం మూలంగా దృష్టి అక్కడే నిలబడదు. ఎందుకంటే, మన హృదయ బిందువును ఏదో ఒక ప్రాంతం ఉపరితలం మీదకు (Plane of Region) సారించబడేటట్లుగా చేశాము కనుక ఇంక హృదయం మీదనే మన దృష్టి అదే పనిగా అనగా బలవంతంగా నిలపవలసిన అవసరం లేదు. మొదట హృదయం మీద ధ్యానం ఆరంభించాం. తర్వాత అది స్వయంగా దేని మీద లగ్నమవుతుందో దానిపైనే మన దృష్టి నిలపాలి. మాడు (శిరస్సు పైభాగం)లోను, తల వెనుకభాగంలోనూ ఏదో తెరుచు కున్నట్లుగా అనిపిస్తున్నదని వ్రాశావు. మెదడులో దాని ప్రభావం తప్పకుండా ఉన్నట్లే కాని శిరస్సు వెనుక భాగంలో కలిగిన ప్రకంపనాల అనుభూతి, మన విధానంలోని అభ్యాసు లందరికీ తరుచుగా కలుగుతూ ఉంటుంది. నేను ఇచ్చేటటువంటి సాధారణ సిట్టింగ్ (సూక్ష్మాతి సూక్ష్మ ప్రాణాహుతి) యొక్క ప్రభావం ఎక్కడ అవసరమో అక్కడ శీఘ్రంగా పని చేస్తుంది. నీవు ఇంటికి చేరాక అక్కడి ఇంటి వాతావరణంలో ఏదైనా మార్పువచ్చినట్లు గమనించావా? ఒకవేళ మార్పు గమనించినట్లయితే అది ఎంతమేరకు అనగా ఏ స్థాయికి ఉందో తెలియజేయి.

నీ శ్రేయోభిలాషి

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 52

లఖీంపుర్,

31.08.1949

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు వ్రాసిన ఉత్తరం చేరింది, దానిలోని విషయాలను తెలుసుకున్నాను. తమరు రెటీనా గ్లేజ్ (కంటి తెరమీద కాంతి) గురించి వ్రాశారు. దానిని గురించి ఏదో కొద్దిగా అర్థం చేసుకున్నాను. అయితే నా మైండ్ ఎలాంటిదంటే, దాని స్థితి లేదా వివరం తెలియకుండా అనగా స్వానుభవం లేకుండా అర్థం చేసుకోవటానికి అంగీకరించదు. అందువలన నాకు బాగా అర్థం కాదు. నా ఉద్దేశ్యంలో ఏదో విషయం గురించి తెలుసుకోవటానికి ఎంత సమయం వినియోగిస్తానో, ఆ సమయాన్ని 'మాలిక్' జ్ఞాపకంలో వినియోగించినట్లయితే ఎంతో మేలు అనిపిస్తుంది. నాకు, 'మాలిక్'కు మధ్య దృఢసంబంధం ఎంత బలంగా ఏర్పరచు కోదలచానంటే, ఒకవేళ 'అతడు' దానిని సడలించాలని ప్రయత్నించి నప్పటికీ ఆ బంధం వీడనంతగా. మాలిక్ యొక్క ఎడతెగని దయతో అలా సంభవించు గాక! సంభవమవుతుంది కూడ. శిరస్సు వెనుక భాగానికి సంబంధించి 'తమరు' తెలిపిన ఝుంకారం సబబుగానే ఉంది. అయితే ఈ శబ్దం చాలా తీవ్రంగా ఉంది. తమరు ఇక్కడ వాతావరణం గురించి ప్రస్తావించారు. ఈ వాతావరణం నాకు బాగా ఉల్లాసంగా ఉన్నట్లు అనిపిస్తోంది. ఇందులో ప్రశాంతత, తేలికదనాన్ని తలపిస్తున్నాయి. నేను 'తమ' వద్దకు వెళ్ళినపుడు కేవలం శాంతి మాత్రమే ఎక్కువగా అనుభవమవుతూ ఉండేది. ఇప్పటి వాతావరణ స్థితికి, గతంలో ఉన్న స్థితికి చాలా భేదం ఉంది. నేనిప్పుడు నా ప్రస్తుత ఆత్మిక స్థితిని గురించి వ్రాస్తున్నాను. ఇప్పుడు నా హృదయ పరిస్థితి ఎలా ఉందంటే, 'మాలిక్'పట్ల ప్రేమగాని, భక్తిగాని కొంచెం కూడా లేవు. బహుశా ఈ కారణంగానే కొద్దిరోజుల

నుండి 'అతని జ్ఞాపకం' యొక్క జ్ఞాపకం కూడా తరిగిపోతూ ఉంటోంది. అప్పుడప్పుడు 'అతడి'ని పూర్తిగా మరిచిపోయానేమోనని అనిపిస్తుంది. ఈ మరపుస్థితిలో కూడా హృదయం 'అతని'వైపు ఉండి, 'అతని'లోనే స్థిరపడి ఉన్నట్లుగా అనిపిస్తుంది. ఇంతకుముందు, 'మాలిక్ జ్ఞాపకం' యొక్క జ్ఞాపకం రానప్పుడు, చాలా అసహనం కలుగుతూ ఉండేది. కాని ఇప్పుడు అది చెడుగా అనిపించకపోగా పూర్తిగా తేలికగా ఉంటున్నది. ఇప్పుడు ఆత్మ సమర్పణ స్థితిని మళ్ళీ మళ్ళీ అనుకరిస్తూ ఉన్నట్లుగా అనిపిస్తోంది. కాని కనీసం నేను ఏ పనిని చేస్తున్నానో కూడా తెలియకుండా ఉన్నది. ఇదంతా ఈ విధంగా ఉన్నప్పటికీ, తమరు వ్రాసిన విధంగా, నా కర్తవ్యంగా భావించి, ఇంతకుక్రితం 'మాలిక్' యొక్క జ్ఞాపకం మరియు ధ్యానం ఎంతగా చేశానో అంతగా చేస్తూనే ఉన్నాను. పూజ్య బాబూజీ, 'మాలిక్' నాపట్ల చూపుతున్న అపార దయకు చెందిన శుభవార్తను 'తమ'కు తెలియచేస్తున్నాను. అది ఏమిటంటే, పరమ దయాళువుడైన 'మాలిక్' నాపట్ల దయతో నా సంస్కారాలను భోగించటంలో కూడా నాకు చాలా సహాయం చేశాడు. ఎందుకంటే, **ఇప్పుడు కష్టాలు ఇంకా ఎక్కువయ్యాయి. కాని 'మాలిక్' ప్రతి సందర్భంలోను ఇవి కష్టాలు కావు, 'అతని' కృపయే నామీద వర్షిస్తూ ఉందని, దానితో నా సంస్కారాలు తొలగిపోతున్నాయని చెబుతున్నట్లుగాను గ్రహింపజేశాడు.** ఇందుకుగాను 'మాలిక్'కు మరీ మరీ ధన్యవాదాలర్పిస్తూ ఉండిపోయాను. ఇంతకూ వాస్తవం ఏమిటంటే, నేను ధ్యాస నిలిపినా, నిలపకపోయినా, 'మాలిక్' దయతో నా హృదయం ఏకధాటిగా 'అతని'వైపు ఆకర్షితమై 'అతని'తో బంధించబడి ఉన్నట్లుగా అనిపిస్తున్నది.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 53

లఖీంపుర్,
2.09.1949

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నేను ఒక ఉత్తరం వ్రాశాను, అది తమకు చేరే ఉంటుందనుకుంటాను. మొన్నటి నుంచి దశలో మరికొంత మార్పు వచ్చింది. అది నా అవగాహనకు వచ్చినంతమేరకు వ్రాస్తున్నాను.

మొన్నటి రోజునుంచి చాలాసార్లు, ఏదైనా పనిచేస్తూ ఉన్నప్పుడు హృదయం ఎక్కడికి పోతున్నదో తెలియటంలేదు. కొద్దిసేపటిలోనే మళ్ళీ దారిలోకి వస్తోంది. ఈ విధంగా జరుగుతున్నది కొద్ది సమయం వరకే, అయినప్పటికీ చాలాసార్లుగా ఇలా సంభవిస్తున్నది. ఇప్పుడు పగలు అంతా 'సుషుప్తి' స్థితిలో ఉన్నప్పటికీ మరేదో జరగటం ఆరంభమైనది. హృదయం ఎంతగా ఒకవైపు మరలుతూ ఉందంటే, దాని నుంచి ఒక్క క్షణం కూడా వైదొలగడానికి అంగీకరించటంలేదు. స్థితి, మరైతే, చాలా కోమలంగా అనిపిస్తుంది. ఇప్పటికీ ఈ దశను ఇంతవరకే అర్థం చేసుకోగలిగాను. తర్వాత మళ్ళీ వ్రాస్తాను.

ఉదయం నిద్ర నుండి లేచిన తర్వాత చాలా అలసటగా ఉంటున్నది. ఈ అలసట పగలు కూడా అనుభూతమవుతున్నది. అయితే నిద్ర మాత్రం చాలా గాఢంగా ఉంటున్నది.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

# ఉత్తరం సంఖ్య - 54

లఖీంపుర్,
04.09.1949

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందనుకుంటాను. ప్రస్తుతం ఉన్న ఆత్మిక దశ ఏదో మంచి ప్రాధాన్యత కలిగినదిగా అనిపించటంలేదు. పూజ చేయటం ప్రారంభించినప్పుడు ఉన్నటువంటి దశలాగ అయిపోయింది. అప్పటికీ ఇప్పటికీ ఉన్న భేదం ఏమిటంటే, అభ్యాసం కారణంగా మొదట హృదయంమీద అధిక భారంగా ఉండేది, ఇప్పుడు అది అభ్యాసం అధికంగా చేసినప్పటికీ తేలికదనమే ఎక్కువగా ఉంటోంది. ఇటీవల నేను తమ దగ్గర నుండి వచ్చిన తర్వాత ఏమైందో దైవానికే తెలియాలి.

**"మన్ హఠ్ పరా న సునహి సిఖాయా,**
**చహత్ బారి పర్ భీతి ఉఠావా."**

నా హృదయం చాలా మొండిగా తయారై నేను చెప్పినట్లు వినకుండా ఉంది. అది కేవలం ఇసుక మైదానం మీద గోడ కట్టాలనుకుంటోంది. మరి అది నిలవదు కదా!

నిజంగా అది-**"చాహియ అమియ జగ్ జురహిన్ ఛాఛీ"** అనగా అది (హృదయం) భౌతికంగా పోల్చినట్లయితే మజ్జిగకు గతిలేదు కాని మధువు త్రాగాలనుకుంటున్నట్లుగా ఉంది.

పూజ్య బాబూజీ, దీనిలో నా దోషం ఏమి లేదు. కారణం ఏమిటనిపిస్తూ ఉందంటే, **నేను 'తమ' యొక్క ఈ పూజ (ధ్యానం) లో చేరినప్పటి నుండి, ఈ మనస్సు అనగా అంతరనేత్రం చాలా ఉన్నతంగా చూస్తూ ఉండేది. అది ఇప్పుడు 'తమ' ఎదుట, తమరిని కొనివేసినట్లుగా, నిర్లక్ష్యంగా, నిర్భయంగా వ్యవహరిస్తోంది.** ఇదంతా చూస్తూ ఉంటే, ఇంతకూ ఈ హృదయం కోరుతున్నది ఏమిటి? 'తమ'కు తెలియజేయకుండా మనస్సు శాంతించటం లేదు. అయితే ఇంతకు నా కోరిక ఏమిటంటే, 'తమ' మాలిక్ యొక్క ఎడతెగని ప్రేమ తమపై ఎంత ఉన్నదో, అంత ప్రేమ 'తమరు' నాపట్ల చూపండి. ఇంకా ఏమిటంటే, తమరు తమ యొక్క 'సమర్థ' గురువు (లాలాజీ) పట్ల ఎంత ప్రేమ కలిగి ఉన్నారో అంత ప్రేమను నేను నా 'బాబూజీ'పట్ల కలిగి ఉండాలి అని కోరుకుంటాను. నాలుగైదు రోజుల నుండి నా మనస్సులో ఇదే కోరిక చాలా తీవ్రంగా ఉంది, మరి నేను ఏం చేయాలి! ప్రార్థన వంటి స్థితియే 'మాలిక్' సమక్షంలో మళ్ళీ మళ్ళీ రూపుదాల్చుకుంటున్నది బహుశా అందుకేనేమో! అయితే ఇప్పుడది కనిపించటంలేదు. అటువంటి స్థితి బహుశా రెండు రోజులు రాత్రింబవళ్ళూ కొనసాగి ఉంటుంది. పూజ్య బాబూజీ, నా ఈ కోరిక నెరవేరుతుందంటారా? నేను ఏమైనా సరే అది చేసి తీరాలి. ఇంకా చెప్పాలంటే, భావోద్వేగం కంటె కర్తవ్యం చాలా మిన్నయైనది. శూన్య భావోద్వేగాలు నా లక్ష్యాన్ని చేర్చటంలో విజయం సాధించలేవు. నేను నా ధ్యానంలో సంతృప్తి చెందకపోవటానికి గల కారణం భగవంతునికే తెలియాలి. ఏది ఎలా ఉన్నా నేను మాత్రం తమకు వ్రాసి ఉన్నాను- "నడవడం కోసం నా తండ్రి చేతివ్రేళ్ళు పట్టుకుని నడక ప్రారంభించాను" అని. 'మాలిక్' యొక్క అపార అనుగ్రహంతో సాధ్యపడనిది ఏమీ లేదు. దయచేసి నా కొరకు తొందరపడవద్దు. నా హృదయంలో కలిగినవన్నీ నేను వ్రాస్తాను. తమరు వ్రాసిన దానినిబట్టి చూస్తే, మన బంధుమిత్రులు, ఇతరులందరూ పరాయివాళ్ళగా ఉంటున్నారు. దానికి ఏం చెప్పగలం! ఇప్పుడు మనస్సు అప్పుడప్పుడు మాస్టర్ సాహెబ్ నుంచి సిట్టింగ్ తీసుకోవటానికి కూడా ఇష్టపడనంతగా మొద్దుబారిపోతుంది. ఇప్పుడు నేను పూజ అంతటినీ మళ్ళీ ప్రారంభిస్తున్నట్లుగా తలపిస్తోంది.

అమ్మ తమకు శుభాశీస్సులు, కేసర్ మరియు బిట్టోలు ప్రణామాలు తెలియజేస్తున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 55

లఖీంపుర్,
10.09.1949

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు అందే ఉంటుందను కుంటాను. ఇక్కడంతా క్షేమంగానే ఉన్నాము. తమరు కూడా కుశలమేనని భావిస్తున్నాను. నా ఆత్మిక దశ సామాన్యంగా ఉంది. దానిని తమకు వ్రాసాను కూడా. నేను సిట్టింగ్ తీసుకుంటున్న సందర్భంలో అప్పుడప్పుడు, నా శరీరం యొక్క ఉపరితలం నుంచి కాంతి వెలువడుతున్నట్లుగా అనిపిస్తూ ఉంది. ఆ కాంతి అప్పుడప్పుడు కిరణంలాగా కనిపిస్తోంది. నా హృదయం బాగా లీనమై ఉన్నప్పుడు మాత్రమే ఇటువంటి స్థితి అనుభవమవుతోంది. ఆ సమయంలోనే కాంతి ఉన్నట్లుగా అనుభవమవుతోంది. స్థితిలో ఇంక ప్రత్యేకమైనది ఏమీ లేదు. స్థితి ఆలస్యంగా మార్పు చెందుతున్నట్లుగాను, చాలా స్వల్పంగా అనుభవానికి వస్తున్నట్లుగాను ఉంది.

అమ్మ తమకు ఆశీస్సులు, బిట్టో మరియు అక్కయ్య (శకుంతల) ప్రణామాలు తెలియజేస్తున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 56

లఖీంపుర్,
16.09.1949

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం అందే ఉంటుందనుకుంటాను. ఇక్కడంతా క్షేమంగానే ఉన్నాము. తమరు కూడా కుశలంగానే ఉన్నట్లుగా తెలుస్తున్నాను. తావూజీ (పెదనాన్న) మరియు మాస్టర్ సాహెబ్‌గారి ద్వారా 'తమరు' బహుశా ఈ నెల 28వ తేదీన ఇక్కడకు వస్తున్నట్లుగా తెలిసింది. దయచేసి 'తమరు' తప్పకుండా విచ్చేయండి. నా ఆత్మిక దశను గురించి ఏమని వ్రాయమంటారు? స్థితి అంతా స్థితిలేని స్థితిగా తయారైపోతూ ఉంది. స్థితి మారిపోతున్నది, అయితే అది ఎంత తేలికగా ఉంటున్నదంటే, అది అంత త్వరగా అర్థం కావటంలేదు. అంతేకాదు దానిని గ్రహించుకోవాలని హృదయం కూడా ప్రయత్నించటం లేదు. నాలుగైదు రోజుల నుండి స్థితి మళ్ళీ మారిపోయింది.

పుజ్య శ్రీ బాబూజీ, **ఇప్పుడు ఏమైందో కాని, అప్పుడప్పుడు నేను హుందాగా కూర్చుని ఉండగా, 'మాలిక్' నా స్మరణతో తపించిపోతున్నట్లుగా అనిపిస్తోంది. అది సామాన్యమైన స్మరణ /జ్ఞాపకం చేసుకోవటం కాదు, బాగా తీవ్రంగా ఉంటున్నట్లుగా అనిపిస్తోంది.** తమరు నన్ను (Chief Commander) ముఖ్య నిర్దేశకురాలిగా తయారు చేసేరేమో, అది దైవానికే తెలియాలి. దానితో ఈ ప్రపంచంలో నాకు ఎవరైనాసరే భయం లేకుండాపోయింది. **అప్పుడప్పుడు ఏమని అనిపిస్తూ ఉందంటే, ఈ ప్రపంచంలో ఏ శక్తీ కూడా నా 'లక్ష్యం' చేరే ప్రయత్నంలో ఎటువంటి విఘ్నం కలిగించలేదు అని. దారిలో పర్వతం అయినాసరే నాకు అడ్డుగా నిలిచినట్లయితే దానిని కూడా తునాతునకలుగా చేసి ముందుకు సాగిపోతాను అన్నట్లుగా ఉంది. నా కళ్ళ ముందు కేవలం నా 'ధ్యేయం' మాత్రమే నిలిచి ఉంది కాని, దాని ఎదుట ఈ ప్రాపంచిక వస్తువులన్నీ అల్పంగా అనిపిస్తున్నాయి.** ఒక్కొక్కసారైతే, నాకు కేవలం ఈ మాత్రమే తెలుస్తుంది. అదేమంటే, నేను చేరుకోవాలి అని, అంతేగాని అది ఎక్కడికో తెలియదు. 'మాలిక్' దయతో నా దశ బాగున్నట్లుగానే అనిపిస్తోంది. ఇప్పుడు ఎక్కువగా సిట్టింగ్‌కు కూర్చున్నప్పుడు హృదయం పగలంతా లగ్నమై ఉన్నంతగా లగ్నమవుతున్నట్లు అనిపించటంలేదు. ఎప్పుడైనా ఆవేశం కలిగినప్పుడు, నేను పైన వ్రాసిన విధంగా నాలో విపరీతమైన శక్తి అనుభవమవుతూ ఉన్నది. అయితే ఈ ఆవేశం అప్పుడప్పుడు మాత్రమే ఉంటుంది కాని

పెరిగిపోవటం జరగకుండా వెంటనే బలహీనపడిపోతుంది. ఇప్పుడు నిద్రిస్తున్నప్పుడు ఉన్న స్థితికాని మేల్కొని ఉన్నప్పుడు ఉన్న స్థితికాని లేదు. ఇప్పుడు దశ ఇంకొక రకంగా ఉంది.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 57

లఖీంపుర్,
20.09.1949

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు అందే ఉంటుందను కుంటాను. ఇక్కడంతా క్షేమం, తమరు కూడా కుశలమేనని భావిస్తున్నాను. ఈ రోజు ఒక వింతైన దశ కలిగింది, దాని ప్రభావం ఇప్పుడు కూడా ఎంతోకొంత ఉంది. అందువలన తమకు వెనువెంటనే జాబు వ్రాస్తున్నాను. తమరితో ఎటువంటి బంధం ఏర్పడిందంటే, తమకు ఉత్తరం వ్రాయకుండా మనస్సుకు శాంతి కలగటంలేదు. దశ ఒకే బిందువు (పాయింట్) మీద స్థిరపడి ఉన్నప్పటికీ తమకు ఉత్తరం వ్రాయకుండా మనస్సుకు శాంతి కలగటంలేదు. ఎంతోకొంత వ్రాస్తూనే ఉన్నాను. ఇప్పుడు నేటి దశను గురించి వ్రాస్తూ ఉన్నాను.

ఈ రోజు ఉదయం నిద్రలేచినపుడు దశ మామూలుగానే ఉంది. కాని షుమారు అర్ధగంట తర్వాత హృదయంలో అలల వంటివి లేస్తున్నట్లుగా అనిపించింది. ఇంకా ఏమంటే, ఒక విషయం మీద మనసులోనే ఒక మంచి వ్యాసం వంటిది తయారవుతూ ఉంది. హృదయంలో ఆ అలలుతోపాటు అదే విషయం మీద మాటలకు మాటలు దొర్లుతూనే ఉన్నాయి. ఇప్పుడు ఆ విషయం ఏమిటో వ్రాస్తున్నాను.

నిన్నటి రోజున హాస్పిటల్‌కు వెళ్ళాను. అక్కడ డాక్టర్‌గారు ఒక మహాశయుని రక్తపరీక్ష చేశారు. అది ఆ పెద్దమనిషికి బాధ కలిగి, డాక్టర్లు చాలా క్రూరంగా ఉంటారు అని వ్యాఖ్యానించాడు. అప్పుడు దాని గురించి నా దృష్టికి ఏమీ రాలేదు. నిన్న సాయంత్రం పెదనాన్నగారు ఏదో చెప్పారు గాని దానిపైకి కూడా నా ధ్యాస మరలలేదు. ఈ రోజు ఉదయం కొద్దిసేపు అలల వంటివి అనుభూతికి వచ్చాయి. అప్పుడింక నాలో ఆవేశం బాగా వచ్చింది. అప్పుడు మనస్సులో ఒక ఉపన్యాసం ధారగా కొనసాగింది. దాని సారాంశం ఏదో కొద్దిగా మాత్రమే జ్ఞాపకం ఉంది. దానిని వ్రాస్తున్నాను. అది ఇలా ఉంది– **"ఈ రోజుల్లో, జనంలో ఒక సూదిని గ్రుచ్చుకుంటే కలిగిన బాధ కూడా భరించలేనంత అసహనం ఏర్పడిపోయింది. ఒకానొకప్పుడు మన భీష్మపితామహుడు, ఆరు నెలలపాటు బాణాలతో నాటబడిన శయ్య (అంపశయ్య) మీద పరుండి ఉన్నాడు. వారిది కూడా అందరిలాంటి శరీరమే. అయితే ఇప్పటివరకు ఎవ్వరూ కూడా జాలిగా అయ్యో అన్నవారులేరు, ఆ విషాదాన్ని లేశమాత్రం కూడ చూడలేదు. దీనికి కారణం ఏమంటే, సర్వశక్తులకు అధిపతి అయిన ఆ ఈశ్వరుడ్ని మరచి పోయారు. ఎప్పుడైతే సర్వశక్తివంతుడైన ఆ ఈశ్వరుడ్ని ప్రేమిస్తామో అప్పుడు అతని శక్తి మనలో ప్రవేశిస్తుంది. శ్రీ బాబూజీ, సహించగలగటం కూడా ఒక శక్తియే. ఆ శక్తితోనే మనం అధికాధికమైన బాధల్ని, భరించలేని విపత్తులను సహించగలుగుతాము."** ఈ విధంగా దీర్ఘమైన ఉపన్యాసం తయారయ్యింది. ఆ సమయంలో, 'మాలిక్' నాలో పూర్తిగా లయమై ఉన్నట్లుగాను, అతని శక్తి అంతా నాలో ప్రవేశించినట్లుగాను అనిపించింది. హృదయంలో అలలన్నీ ఎగసిపడుతున్నట్లుగాను, ముఖవర్చస్సు కాంతివంతం ఉన్నట్లుగా అనిపించింది. అప్పుడింక స్నానంచేసి వంట తయారుచేస్తూ ఉంటే, 'మాలిక్' శక్తి అంతా నాలోనే ఇమిడిపోయి అన్ని పనులు చేస్తున్నట్లుగా అనిపించింది. పూజలో కూర్చుండి ఉన్నప్పుడు, ధ్యానం చేస్తూ ఉండగా, నేను నా ఆలోచనల్లోనే పులకించిపోయి కూర్చున్నట్లుగా తోచింది. ఆ సమయంలో అందరిపట్ల, అందరూ నావారే అన్నంత ప్రేమ కలిగి ఉన్నట్లనిపించింది. ఆ సమయంలో శరీరం ఎట్లా ఉన్నదో చెప్పలేను. ఎప్పుడైతే హృదయంలో అలలు

ఎగిసిపడుతూ, మాటలు వినపడుతూ ఉన్నాయో అప్పుడు శరీరం కంపించిపోయింది. ఇప్పుడు కూడా వాటి ప్రభావం కొంత ఉన్నది. ఈ రోజు వంట చాలా బాగున్నట్లుగాను, చాలా పవిత్రత కూడా అందులో ఇమిడి ఉన్నట్లుగా పెదనాన్నగారి ద్వారా తెలిసింది.

పూజ్య బాబూజీ, ఇదంతా ఏమిటో నాకైతే తెలియదు. ఇపుడు పూర్తిగా ప్రశాంతంగా ఖాళీగా ఉంది. శరీరంలో మాత్రం కొంత బలహీనత ఏర్పడిందని చెప్పక తప్పదు. నాలో ఏమి కలుగుతూ ఉందో, దానిని తమకు వెంటనే వ్రాస్తూ ఉన్నాను.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ మరియు బిట్టో ప్రణామాలు తెలియజేస్తున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 58

లఖీంపుర్,

22.09.1949

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. భగవంతుని దయవలన మేమందరమూ చాలా సౌఖ్యంగా ఇక్కడకు చేరాము. 'తమరు' మాత్రం ప్రతి అభ్యాసీ యొక్క అంతరంగాన్ని చాలా చక్కగా పసిగట్టానే ఉన్నారు. అయినప్పటికీ 'మాలిక్' దయతో నాలో కలిగిన దశను, నాకు అవగాహన కలిగినది వ్రాస్తున్నాను. ఇప్పుడు జరిగిన ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, నేను ఇంటికి రాగానే నేను ఇక్కడ ప్రతి విషయాన్ని మర్చిపోయినటువంటి స్థితి ఏర్పడింది. ఏ ప్రదేశమూ జ్ఞాపకం రావటంలేదు. లఖీంపుర్ పూర్తిగా విదేశంలాగా అనిపిస్తోంది. మా కుటుంబీకులను చూస్తూ ఉంటే వారిని గుర్తించ లేనంతగా ఉండటమేగాక, వారిపట్ల మనస్సులో ప్రేమ అనేది లేకుండా ఉన్నది. ఈ దశలో ఆనందం ఉండటంగాని, లేకపోవటంగాని లేదు. అంతా శూన్యంగా ఉన్నట్లు అనిపిస్తోంది. ధ్యానం చేసేటప్పుడు కూడ, హృదయం మీద ధ్యానం చేయటానికి బదులు ఖాళీగా కూర్చుండి ఉండటమే బాగున్నట్లుగా అనిపిస్తోంది. హృదయం మీద ధ్యానం చేసినప్పుడు కొద్దిసేపటికే భారంగా అనిపించటమేగాక అది ఇప్పుడు భరించలేనిదిగా ఉంటోంది. నేను ఈ విషయం 'తమ'కు అక్కడ (షాజహాన్‌పూర్) చెప్పినప్పుడు, 'తమరు' హృదయం మీద ధ్యాస నిలబడకపోతే దానిని పట్టించుకోనవసరం లేదు అని బహుశా చెప్పారనుకుంటాను. కనుక ఇదేమంత సంగతి కాదు. అప్పుడప్పుడు శిరస్సు పైభాగంలోను, శిరస్సు వెనుకభాగంలోను ఏదో కలిగినట్లుగా అనిపిస్తుంది. ఆ తర్వాత సద్దుమణిగిపోయినట్లుగాను అనిపిస్తుంది. నేను షాజహాన్‌పూర్ చేరి ఉన్నప్పుడు, రైల్వే స్టేషన్‌లో శిరస్సు వెనుక భాగంలో ఈ విధంగానే జరిగింది. అయితే శ్రీ బాబూజీ, ఈ శూన్యత్వం బాగున్నట్లుగానే అనిపిస్తుందిగాని చెడుగా అనిపించటంలేదు. తమవద్ద నుంచి తిరిగి వచ్చిన తరువాత, స్థితి బాగా మార్పు చెందినట్లుగా అనిపిస్తోంది. ఈసారి తమరిని బాగా జ్ఞాపకం చేసుకుంటున్నాను. స్థితిలో ఒక విధమైన సౌఖ్యం ఉంది. ఏది ఏమైనప్పటికీ, ఇప్పుడు పూజ్య తండ్రిగారి వ్రేళ్ళుపట్టుకుని నడక నేర్చుకోవటం ఆరంభించాను. 'మాలిక్' దయ కలిగితే అది ఏమంత దూరం కాబోదు. నిద్రలో ఏ స్థితి అయితే పూర్వం కలుగుతూ ఉండేదో, అది మనస్సుకి, ఎక్కడకిపోతూ ఉందో తెలియకపోవచ్చును కాని ఇప్పుడు అది పూర్తిగా 'మాలిక్'లో లయమై ఉన్నట్లుగా అనిపిస్తోంది లేదా నిద్ర కూడా లేకుండా పగలంతా 'సుషుప్తి' స్థితిలోనే, కేవలం 'సుషుప్తి' లోనే ఉంటున్నానేమో. ఒక సుఖవంతమైన ధారా ప్రవాహంలో ఏమీ తెలియకుండానే సాగిపోతున్నట్లుగా అనిపిస్తోంది. 'తమరు' నాకు ఇంకా పూర్వమే పరిచయమై ఉంటే ఎంత బాగుండేదో. చిన్నతనంలో నేను పూజచేస్తూ ఉంటున్నప్పుడు, నేను తరచుగా పెదనాన్నగారితో నాకు ఏదైనా ధ్యానంచేసే విధానం తెలపండి అని అడుగుతూ ఉండినట్లుగా నాకు జ్ఞాపకం ఉంది. నేను ఆ విధంగా ధ్యానం చేయటం తెలపమని అడిగినప్పుడు

పెదనాన్నగారు నాకు రామ, సీత అనుకుంటూ ధ్యానం చేయమని చెప్పారు. కాని దానితో నాకు పూర్తిగా సంతృప్తి కలగలేదు. అలా ఉండగా, 'మాలిక్' నాపై దయతలచి ఈ దీనురాలి మొరాలకించి, ఇటువంటి ధ్యానం నేర్పునటువంటి వారిని అనుగ్రహించగా, నేను ఇప్పుడు పూర్తిగా నిశ్చింతగా ఉన్నాను.

అమ్మ తమకు ఆశీస్సులు, బిట్టో ప్రణామాలు తెలియజేస్తున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 59

లఖీంపుర్,
30.09.1949

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నిన్న శ్రీ నారాయణ దద్దాగారి ద్వారా పూజ్యురాలు శ్రీ మాతాజీ (బాబూజీగారి ధర్మపత్ని) దేహాంతం యొక్క వార్త విని మాకందరికీ చాలా దుఃఖం కలిగింది. 'ఆ' దివంగత ఆత్మకు పరమ శాంతిని చేకూర్చమని భగవంతుని ప్రార్థిసున్నాము. ఇది ఆ విశిష్ట ఆత్మకు సూర్యునికి దీపం పట్టినటువంటిదే అయినప్పటికీ, మాకు 'ఆమె'పట్లగల అలౌకిక ప్రేమ కారణంగా మాకందరికీ ఇది పరమ కర్తవ్యం. దద్దాగారి ద్వారా 'వారి' మరణానంతరం కలిగిన ఉచ్చస్థితిని తెలుసుకొని మాకందరికీ పరమ సంతోషంతోపాటుగా పరమాశ్చర్యం కూడా కలిగింది. ఆ ఆశ్చర్యం అను విషయం ఏమై ఉంటుంది? ఎందుకంటే, **'ఎవ్వరి' యొక్క ఒక్క సంకల్పం మాత్రంచేత నరకం కూడా స్వర్గంగా మార్చబడుతుందో**, అటువంటి వారి ధర్మపత్నికి అత్యున్నతమైన స్థితియే ఔచిత్యంగా ఉంటుంది. ఏమైనాగాని, మహిళా మండలి మధ్య నుంచి ఒక నిత్య ప్రసన్నవదనం శాశ్వతంగా తరలిపోయింది. రెండవసారి ఆమెను దర్శించలేక పోయినందుకుగాను అమ్మకు చాలా బాధగా ఉంది.

నా ఆత్మిక దశను గురించి ఏమని వ్రాయాలి? విశేషమైన విషయం ఏమీ లేదు. నేను గత ఉత్తరంలో వ్రాసినటువంటి దశయే తరచుగా మళ్ళీ మళ్ళీ కలుగుతున్నది. ఆ దశ తర్వాత ఏదో దశను గురించి వ్రాయవలసి ఉంది కాని అదేమిటో జ్ఞాపకం రావటంలేదు. ఎందుకంటే అది భగవంతునికే తెలియాలి. ఈ వార్త తెలిసినప్పట్నించి హృదయం ఎంత ప్రశాంతంగాను, నిశ్చలంగాను ఉన్నదంటే, అది ఏవైపుకు మరలటంగాని, ఎటువంటి ఆలోచనలు రావటంగాని జరగటంలేదు. ఏమైనాగాని, ఈ స్థితి షుమారు పది పన్నెండు రోజుల నుంచి నిరంతరంగా కొనసాగుతూ ఉన్నది.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 60

లఖీంపుర్,
08.10.1949

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. ఇక్కడ అంతా కుశలమే. అక్కయ్య వ్రాసిన ఉత్తరం కూడా వచ్చింది. దానిని తమకు పంపుతున్నాను. ఆమె నాకు, బాబూజీకి తనను గురించి జ్ఞాపకం చేయమని వ్రాసింది. ఇది చాలా బాగుంది. ఎవ్వరైతే స్వయంగా ఆమె జ్ఞాపకాన్ని ఇప్పటివరకు కల్పించుకోలేక పోయారో, వారు (నేను) కేవలం సిఫారసు మూలంగా ఏమి చేయగలరు? ఎవ్వరిలోనయితే తన అస్థిత్వం కొద్దిగా మిగిలి ఉంటుందో, అనగా ఎక్కడైతే 'మాలిక్'

అంటే 'మాలిక్'యే నిలిచి ఉండి, 'అతని' జ్ఞాపకమే మరీ మరీ మననం చేసుకోగలిగితేనే తన జ్ఞాపకాన్ని తమకు కల్పించుకోవటంలో సరైన సహాయంగా ఉంటుంది. ఈ విషయమే నేను అక్కకు వ్రాస్తాను.

మాతాజీ వెళ్ళిపోయారు, ఆమె పోవటంతో 'తమకు' మరియు పిల్లలమైన మాకు చాలా కష్టమైపోయింది, కాని ఇది జరిగినమీదట, మా బాబూజీ యొక్క మహాశక్తి ఏమిటో మాకందరికీ తెలిసింది. ఏ శక్తి యొక్క ఛాయలో మేమంతా సుఖంగా, నిశ్చింతగా నిద్రిస్తున్నామో మాకు అర్థమయ్యింది. నేను స్వేచ్ఛగా ఉన్నాను. 'తండ్రి' యొక్క రక్షణలో ఎటువంటి స్వేచ్ఛ ఉంటుందో అది కొద్దిగా అవగాహనకు వచ్చింది. 'మాలిక్' యొక్క జ్ఞాపకం నాకు అతికష్టం మీద కలుగుతూ ఉంది. అదేమిటో దైవానికే తెలియాలి. ఎంతమాత్రం ఆసక్తి చూపకపోయినట్లయితే రోజంతా మరిచిపోయి ఉంటున్నాను. యావత్ శక్తి నాలో ప్రవేశిస్తున్నట్లుగా తరచుగా అప్పుడప్పుడు అనిపిస్తూ ఉంది. కొద్దిరోజుల నుండి తరచుగా ఏమి జరుగుతున్నదంటే, నాలో ఏ విషయం గురించినైనా కోర్కె కలిగినట్లయితే, నేను దానిని వెంటనే తిరస్కరించి అణచిపెట్టినప్పటికీ, అది ఏదో విధంగా నెరవేరుతున్నది. నేను ఏ విధమైన కోరిక జనించకుండా నిరోధించు కుంటున్నప్పటికీ, అది కేవలం 'మాలిక్' యొక్క జ్ఞాపకం తప్ప మరే కోరికా కలగటంలేదు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ ప్రణామం తెలియజేస్తున్నారు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 61

షాజహాన్‌పుర్,

09.10.1949

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. నీవు వ్రాసిన చాలా ఉత్తరాలు వచ్చాయి. కాని జవాబు లివ్వలేకపోయాను. ఇప్పుడు కొంచెం క్లుప్తంగా వ్రాస్తున్నాను. నేను గమనించినంతవరకూ, ఆధ్యాత్మికంగా హృదయచక్రంలో నీ ప్రయాణం పిండదేశం వరకు పూర్తి అయ్యింది. ఇప్పుడు ఆత్మచక్ర ప్రయాణం ముందుంది. "నేను గమనించినంతవరకూ" అని ఎందుకు వ్రాస్తున్నానంటే, ఈ సమయంలో నా శిరస్సు భారంగా ఉంది. అందుచేత నా అంచనా సరైనది కాదేమోనని అనిపిస్తోంది. అది సర్దుకుంటుందని ఆశిస్తున్నాను.

**'మాలిక్' (దైవం) భక్తుడ్ని తలచుకుంటూ ఉన్నారంటే, భక్తుని తపన యొక్క తాపం 'అతడి' హృదయాన్ని తాకిందని అర్థం. అంతేకాదు, భక్తుడు ఎవరో తనను తలచుకుంటున్నట్లుగా 'అతడి'కి తెలిసిపోతుంది.** క్లుప్తంగా చెప్పాలంటే, నీ పిలుపు 'మాలిక్' చెవులను తాకింది. ఎవ్వరినుంచైనా ఎవ్వరినైనా పిలిచినట్లుగా శబ్దం వస్తే, ఎవ్వరైతే పిలువబడతారో వారు, పిలిచేవారివైపు దృష్టి సారిస్తారు. వారివైపు తిరిగి, అతనికి ఎంత ప్రేమ, వ్యథతో తనను పిలుస్తున్నారో కూడా తెలిసి, పిలిచేవారిమీద వారికి ప్రేమపుట్టుకొని వస్తుంది. కబీర్, **"మేరా రామ్ ముఝే భజె జబ్, తబ్ హెూవూఁ విశ్రామ్"** అని వ్రాశాడు. అనగా నా రాముడు (భగవంతుడు) నన్ను తలచినప్పుడే నాకు విశ్రాంతి దొరుకుతుంది" అని అన్నాడు. ఇది చాలా మెచ్చదగిన యోగ్యమైన విషయం. దీనినే పూర్వీకులు, ఇటువంటి స్థితిలో భగవంతుడు ప్రేమికుడుగాను, భక్తుడు ప్రియురాలుగాను అవుతారని నిర్వచించారు. (అంటే భక్తుడు, భగవంతుడు వారి భూమికలు తారుమారవుతాయి) భక్తి మార్గంలో ఇదొక ఉన్నత స్థితిగా ఉండగా, మనం భక్తి భావంతో పురోగమిస్తూ ఉంటాము. ఒకవేళ మనం దీనిని తాత్త్విక (Philosophy) పరంగా చర్చించినట్లయితే అది జ్ఞానమార్గానికి దారి తీస్తుంది. ఆ కారణంగా నేను దీనిని గురించి మాట్లాడను. నా దృష్టిలో, దీని తత్త్వాన్ని (Philosophy) గురించి పూర్వీకులు కూడా ఎవ్వరూ వ్యాఖ్యానించి ఉండలేదు. ఎందుకంటే, ఇది సభ్యత, సంస్కారలను (Etiquette) ఉల్లంఘించినట్లవుతుంది / అతిక్రమించినట్లవుతుంది. నీవు ఆ బిందువు (Point) కు వచ్చిన తర్వాత నేను ముమ్మందు

వెలువరించనున్న పుస్తకంలో వర్ణించిన కేంద్రమండలం (Central Region) గురించి నీకు వివరిస్తాను.

"నా ఈ స్థితి, సాధన ఆరంభించినప్పటి స్థితిలాగా ఉంది" అని నీవు వ్రాశావు. ఈ దివ్యస్థితి యొక్క రమణీయత కొద్ది కొద్దిగా పొడసూపుతుంది. ఆ దశ పూర్ణ రూపంలోకి వచ్చేటందుకు నిరీక్షిస్తున్నాను. అది నేను ఆశించినంతగా రావటానికి ఇంకా సమయం ఉంది. ఇది పూర్తిగా దైవీయ దశ. ఇది పరిపక్వత చెందిన తర్వాత మానవుడు 'సంత్' (Saint) అని, ఇంకా పరిపూర్ణత చెందిన దశలో "పరమసంత్" (Great Saint) అని పిలువబడతాడు. దీనిని వివరించాలంటే, ఒక మృతశరీరం వంటి స్థితిలాగా ఉంటుంది. ఇప్పుడు మానవుడు జీవించి ఉండగానే ముక్తి యొక్క తమాషా చూస్తాడు. ఇందులో పరిపక్వత వచ్చాక మాత్రమే జీవన్ముక్తి దశ వస్తుంది. బీజం (అంటే పునర్జన్మకి మూలకారణం) దగ్ధమవుతుంది. ఈ దశలోకి వచ్చిన తరువాతనే మానవుడిని 'మానవుడు' అని అనగలం. దీనికి పూర్వం అతడు పశుప్రాయుడు మాత్రమే.

నీవు హాస్పటల్‌లో ఒక దృశ్యం చూసి, ఇంటికి వచ్చాక భీష్మపితామహుని ఉదహరిస్తూ ఉప్పొంగిన నీ ఆలోచనలు, ధైర్యాన్ని కలిగించేవిగా ఉన్నాయి. వీటికి ఆధ్యాత్మిక దశతో సంబంధం లేదు. తర్వాత నీవు ఇంకా కొనసాగిస్తూ, బలహీనంగా ఉన్నట్లనిపించిందని వ్రాశావు. దీనినిబట్టి నీలో అలసత్వం ఉందని తెలుస్తుంది. ఆవేశం పొంగినప్పుడు రక్తములో వేడి పెరిగి, ఆ ఆవేశం చల్లబడినతర్వాత మళ్ళీ యధాస్థితికి వచ్చేశావు. నీలోని శక్తి ఏదో ఆవేశంలో ఖర్చుకాగా, శరీరంలో పటుత్వం (vigour and vitality) తగ్గి, దానిమూలంగా బలహీనతను అనుభూతి చెందావు. ఉదాహరణకు హృదయం బలహీనంగా ఉన్నప్పుడు, దాని కోసం ప్రేరణ కలిగించే ఔషధం (Stimulant medicine) ఇచ్చినప్పుడు శక్తి వచ్చినట్లు అనిపిస్తుంది. దాని ప్రభావం అయిపోయిన తర్వాత, ఆ ఔషధం ద్వారా కల్పించిన శక్తి తరిగిపోతూనే, దానితోపాటు మనలో ప్రకృతిసిద్ధంగా ఉన్న శక్తి కూడా నష్టపోయిన కారణంగా బలహీనత తెలుస్తుంది. అందుచేత హృదయం ఎక్కువగా పనిచేయటం కారణంగా అలసిపోవటం కూడా సహజమే. దీనినే 'బలహీనత'గా భావిస్తారు.

ఇప్పుడు నీ మాతాజీ (బాబూజీగారి ధర్మపత్ని) గురించి నీవు విచారం వ్యక్తం చేశావు. అది ఒక మానవ ధర్మంగా సహజమే. నిస్సంకోశంగా చెప్పాలంటే, నాకు అందరికంటె చిన్నపిల్లవాని గురించి బాగా జాలి వేస్తుంది. కాని 'మాలిక్' (ఈశ్వరుడు) చేసే పనుల్లో ఏదో ఒక కారణం ఉంటుంది. దీనికి రెండే రెండు ప్రత్యామ్నాయాలు (alternatives) ఉన్నాయి. ఒకవేళ నేనే ముందుగాపోయి ఉంటే ఆమె చేసే ఆక్రందనం లేదా పిలుపు నా చెవులకు సోకేది కాదేమో! అప్పుడు దాని మూలంగా ఆమెకు ఇంత మేలు జరిగి ఉండేది కాదు. అది ఖచ్చితంగా జరిగి ఉండేది; ఎలాగంటే లాలాజీ సాహెబ్ నాతో ఒకసారి చెప్పిన మాట ప్రకారం 'వారు' ఏమన్నారంటే – "ఆమె నిన్ను ఎంతో వేధించి నీకు కష్టం కలిగించింది. అందుమూలంగా నీలో ఆధ్యాత్మిక ఉన్నతికి చాలా అవసరమైన సహనశీలత అలవడింది. దీనిమూలంగా ఆమెకు ముక్తి లభిస్తుంది" అని. ముక్తి నివ్వటం పూజ్యులైన పెద్దలకు ఎడమచేతితో అయ్యేపని (సులభమైన పని). అటువంటి పనిని 'వారు' (లాలాజీ సాహెబ్) చేసేస్తారు. అలాగే ఆ పనిని చేశారు కూడ. **"నామ్ మేరా, గాంవ్ తేరా"** అనగా పేరు నాది, ఊరు నీది అన్నట్లుగా, చేసింది 'వారు' (లాలాజీ సాహెబ్), పేరు మాత్రం నాది.

కేసర్, బిట్టో (కస్తూరిగారి సోదరుడు)లకు ఆశీస్సులు. తల్లిగారికి నమస్కారములు.

నీ శ్రేయోభిలాషి

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 62

షాజహాన్‌పూర్,
09.10.1949

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. నీవు ఇంతకుపూర్వం వ్రాసిన ఉత్తరాలకు జవాబు పూర్తి చేసాను. మాస్టర్ ఈశ్వర్‌సహాయ్‌గారు తనతో నిన్న తెచ్చిన నీ ఉత్తరానికి జవాబు ఇప్పుడు వ్రాస్తున్నాను. వాటిని కూడా దీనితోపాటుగా పంపిస్తున్నాను.

నీ ఆధ్యాత్మికదశను గురించి ఏమి వ్రాశావో అది బాగుంది. మనం ఎప్పుడూ కూడా, ఏదో విధంగా 'మాలిక్' స్మరణలో ఉండటానికి ప్రయత్నించాలి. ఒకానొకప్పుడు 'మాలిక్' స్మరణ మరచిపోయే సమయం / అవకాశం కూడా తప్పక వస్తుంది. అయితే మనం అక్కడ ఆగిపోకూడదు. ఒకవేళ ఏ విధంగానూ స్మరణకు రాకపోయినట్లయితే, 'అతడి' రూపం మార్చి మరో రూపంతో స్మరణకు తెచ్చుకోవాలి. అప్పటికీ ఏ రూపమూ స్ఫురించకపోయినట్లయితే మనం 'అతడి' స్మరణలోనే ఉన్నామని భావన చేసుకోవాలి. దీని తర్వాత మరేదైనా స్థితి ఆరంభమైతే దానిని గురించి అప్పుడు వివరిస్తాను.

తల్లిగారికి నమస్కారాలు. పిల్లలకు ఆశీస్సులు.

నీ శ్రేయోభిలాషి
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 63

లఖీంపూర్,
14.10.1949

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. పూజ్య మాస్టర్ సాహెబ్‌గారి ద్వారా తమరు దయతో పంపిన ఉత్తరాలు చేరాయి. దానిలో "నా ఉద్దేశ్యం ప్రకారం హృదయచక్రంలో నీ ప్రయాణం పూర్తయ్యింది. ఇప్పుడు ఆత్మ చక్రంలో ప్రయాణం ఆరంభంకావలసి ఉంది" అని వ్రాసారు. అయితే బాబూజీ, తమర్ని అనుసరించి ఒక ఏమీ తెలియని ఒక అజ్ఞాన బాలిక ఉన్నదని తమకు తెలిసిన విషయమే. ఆమె తండ్రి (బాబూజీ)గారి శిక్షణలో ఇప్పటివరకు "ముందుకు, సాగిపోవాలి" అను రెండు మాటలు మాత్రమే నేర్చుకోగలిగింది. ఆమెకు బహుశా ఈ చక్రాలను, మరియు పిండదేశం గురించి అర్థం చేసుకోగలగటానికి జ్ఞానం మరియు సమయం ఉండి ఉండవు. ఇంకో విషయం ఏమిటంటే బాబూజీ, నేను గమ్యం ఎంత దూరంలో ఉన్నదని తెలియని ప్రయాణీకురాలిని, కనుక ప్రయాణిస్తూనే ముందుకు సాగిపోవాలి. అవును మరి, ఒక అజ్ఞాన బాటసారి నిరంతరం ప్రయాణిస్తూనే ఉండాలి. దారిలో ఇంకొక బాటసారి పిలిచి, "నీవు ఇంత దూరం ప్రయాణించావు. నీవు ఈ గ్రామానికి చేరావు" అని చెబుతే, అప్పుడు ఆ బాటసారి ఒక్క క్షణం ఆగి, ఆ మాట విని, సంతోషించి, మళ్ళీ తన ప్రయాణాన్ని కొనసాగిస్తాడు. అయితే, నాపట్ల దయామయుడైన 'మాలిక్', నేను దీనురాలిని, విశ్వాసవంతురాలిని అని తెలిసి ఒక విధమైన ఇటువంటి దశనే ప్రసాదించాడు. దాని ఆంతర్యం ఏమిటంటే, ఇంకొక బాటసారి ప్రయాణిస్తున్నా ఆ బాటసారికి చెప్పటం మాత్రమే జరుగుతుంది కాని ఈ (ఆత్మిక మార్గం) బాటలో 'మాలిక్'యే స్వయంగా పర్యవేక్షణ చేస్తూ మార్గంలోని కందకాల బారి నుంచి కాపాడుతూ బాటసారిని ఆ మార్గం యొక్క అవతల తీరానికి చేర్చుతాడు. అలా చేర్చటమేకాక తన అపారకృపతో, బాటసారి అనబడే మనకు తెలియకుండానే తన మహిమతో ప్రయాణించవలసి ఉన్న దూరాన్ని తగ్గిస్తాడు. ఇందుకుగాను 'తమ'కు కోటి

ధన్యవాదాలు. ప్రస్తుతం మరణ స్థితి లాంటిది మళ్ళీ తటస్థించింది. నాలో చాలా నిర్జీవత్వం కలుగుతోంది. పూజ చేస్తూన్న సమయంలోనూ, పండుకున్న సమయంలోనూ పూర్తిగా ఒక మృతురాలుగా అనిపిస్తోంది. కాని పగలంతా హృదయం ఉదాసీనంగాను, ప్రశాంతంగాను ఉంటున్నది. తమరు 'మాలిక్' యొక్క జ్ఞాపకం గురించి వ్రాసారు, దానిని గురించి తమరు నిశ్చింతగా ఉండండి. ఇప్పటివరకు నాలో కొంచెం మాత్రమే నియంత్రణ నిలిచి ఉన్నప్పటికీ, రూపం మార్చి అయినా సరే లేదా ఊహించుకొంటూనైనా సరే, 'అతని' జ్ఞాపకం నుంచి ఒక క్షణమైన వైదొలగకుండా ఉండటానికే ప్రయత్నిస్తాను. ఎప్పుడైతే ఊహా కల్పితంగా మాత్రమే జ్ఞాపకం చేసుకుంటానో అప్పుడు రూపంలేని స్థితిలో జ్ఞాపకం చేసుకోవటంలో సంతృప్తి కలగకపోగా, నేను అసలు 'మాలిక్'ను జ్ఞాపకం చేసుకున్నానా అని అనుకోవటానికి విశ్వాసం కూడా ఉండటంలేదు. అయితే ఇంకనూ పరిపూర్ణంగా కాకపోయినా ఏదో విధంగా ఎంతోకొంత జ్ఞాపకం చేసుకొనగలిగినంతలో జ్ఞాపకం చేసుకుంటున్నాను. మరపుస్థితి కూడా తగినంతగా స్థిరపడి ఉంది. మాతాజీ (తల్లిగారు) గురించి, ఆమె తమవద్దకు వచ్చినప్పుడు పొందిన స్థితి, ఇప్పుడు కలగటంలేదని, హృదయంలో శూన్యత్వం, తేలికదనం ఎప్పుడూ ఉంటున్నాయి, అవి కూడా చాలా రోజులనుంచి నిరంతరం ఉంటున్నాయి అని తమరు వ్రాసినది యదార్థమే. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమ తెలుపుతున్నాను.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 64

లఖీంపూర్,
18.10.1949

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు అందే ఉంటుందను కుంటాను. దైవకృపతో మేమందరం క్షేమంగానే ఉన్నాము. తమరు కూడా క్షేమమేనని భావిస్తాను. తావూజీ (పెదనాన్న)గారికి 'మాలిక్' దయతో సంబంధం కల్పించారని తెలిసి అత్యంతానందం కలిగింది. సర్వశక్తిమంతుడైన 'మాలిక్'ను నేను చేతులు జోడించి ఎల్లప్పుడు ప్రార్థిస్తున్నది ఏమిటంటే, 'అతని' దయతో నా తల్లిదండ్రులు ఆధ్యాత్మికంగా పురోగమనం చెందుతూ ఉండాలి. ఏ 'మాలిక్' కృప కొరకైతే యావత్ ప్రపంచమూ ఆవేదన చెందుతూ ఉందో, ఆ పరమ దయామయుడైన 'మాలిక్'తో నా తండ్రిగారు అనుసంధాన మయ్యారు. ఇది ఎంతో ఆనందించవలసిన విషయమూ, గర్వకారణం కూడ. ఆ పరమ దయాళువు 'మాలిక్'కు ఈ పేదరాలు కోటి ధన్యవాదాలు, తమకు ప్రణామలు అర్పిస్తోంది.

ఇంక నా ఆత్మిక దశను గురించి చెప్పాలంటే, అది అంతగా బాగుండలేదనిపిస్తోంది. అప్పుడప్పుడు హృదయం ఎంత శుష్కించి పోతూన్నదంటే, 'మాలిక్'పట్ల రవ్వంత ప్రేమగాని, అల్పంగానైనా ఆనందం గాని అనుభవానికి రావటంలేదు. తమకు ఉత్తరం వ్రాసినప్పటి నుండి స్థితిలో మార్పు వచ్చింది. శాంతి గురించి అనుమానంగానే ఉంది. దానిని శాంతి అనిగాని, అశాంతి అనిగాని చెప్పలేము. మనం భక్తి మార్గంలో పయనిస్తున్నామని తమరు వ్రాసి ఉన్నారు; అయితే నేనిక్కడ పూర్తిగా భక్తిశూన్యంగా ఉన్నాను. ఇప్పుడింక 'మాలిక్' కృపతో 'అతడి'పట్ల నిజమైన భక్తిని కలిగి ఉండటానికి తప్పనిసరిగా ప్రయత్నిస్తాను. ప్రస్తుతం హృదయం చాలా నిస్సారంగా ఉంటున్నది. అయితే ఈ స్థితి అప్పుడప్పుడు మాత్రమే వస్తూ ఉండేది. కాని ఇప్పుడు అది హృదయంలో నిలకడగా ఉంటున్నట్లుగా అనిపిస్తోంది. ఈ హృదయం నిస్సారమై ఉండటమనేది చెడుగా అనిపించటం లేదు. 'మాలిక్'ను జ్ఞాపకం చేసుకోవటానికి ప్రయత్నిస్తున్నాను. ఎప్పుడైనా 'మాలిక్'ను జ్ఞాపకం చేసుకొనలేకపోతే అప్పుడు 'మాలిక్' ఉన్నట్లుగా భావించుకొనమని తమరు గతంలో వ్రాసి ఉన్నారు; అయితే అలా భావించు కోవటానికి కూడా జ్ఞాపకం అవసరమై ఉంటుంది. కనుక అటువంటి భావన కల్పించుకొనటానికి కూడా జ్ఞాపకం రావటంలేదు. ఇప్పుడు ఏదో విధంగా కొనసాగుతూ ఉంది.

అది పూర్తిగా నా వశంలో లేకుండాపోయినప్పుడు, ఇక ముందు ఆచరించాల్సిన దానిని గురించి తమను సంప్రదిస్తాను. ప్రారంభంలో పలుమార్లు 'అతడి'ని జ్ఞాపకం చేసుకోవటానికి ఏ విధంగా పోరాడానో ఇప్పుడు కూడా అదే విధంగా మళ్ళీ పోరాడుతున్నాను. అప్పుడైతే నేను విజయం సాధించాను. మరి ఇప్పుడు 'మాలిక్' ఎవరిని గెలిపిస్తాడో చూడాలి. ఇప్పుడు, నేను ధ్యానం చేశానో లేక ఇంతకుక్రితం ఎప్పుడైనా చేశానో తెలియటంలేదు. ఇంతకుపూర్వం, 'మాలిక్' నాకోసం తపించి పోతున్నట్లుగా అనిపించేది, కాని ఇప్పుడు 'అతని'కి నేను జ్ఞాపకం వస్తున్నానో లేదో కూడా తెలియటంలేదు. ఎందుకంటే, ఇప్పుడు నాకు 'అతని' జ్ఞాపకం అరుదుగా వస్తున్నది కనుక 'అతని'కి కూడా నా జ్ఞాపకం అరుదుగా వస్తూ ఉండి ఉండవచ్చు. ఏది ఏమైనా, స్థితి మాత్రం బాగానే ఉంది. ఎందుకంటే, నాకు ఉన్న విశ్వాసాన్నిబట్టి, నా ఆత్మికదశ ఎంతోకొంత పురోగతి చెందుతూ ఉంది. ఇక ముందు 'మాలిక్' దయమీద ఎక్కువగా ఆధారపడి ఉంది. 'అతడు' చేసేది ఏదో అది మంచిగానే ఉంటుంది. పూజ్య బాబూజీ, నాలుగు ఐదు రోజుల నుండి 'మాలిక్' ధ్యానం చేస్తూ ఉన్నప్పుడు, అదేమిటో తెలియదుకాని, మన శ్రీ సమర్థ మహరాజ్ యొక్క రూపం నా ఎదుట ప్రత్యక్షమవుతూ ఉంటోంది. ఈ విధంగా చాలాసార్లు అనుభవమైంది.

చాలావరకు ప్రస్తుత దశ శూన్యంలాగా ఉండి, అప్పుడప్పుడు ప్రతిదీ శూన్యంలాగా ఉన్నట్లు అనిపిస్తోంది. జడ, చైతన్యములన్నీ కూడ శూన్యంలాగా ఉంటున్నాయి.

చిన్నవారైన సోదరీ సోదరులకు ప్రేమ తెలుపుతున్నాను.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 65

లఖీంపుర్,
26.10.1949

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నిన్నటిరోజున పూజ్య మాస్టర్ సాహెబ్‌గారి ద్వారా సెలవురోజుల్లో తమరు అస్వస్థులైనట్లుగా తెలిసింది. తమకు శ్వాస ఇబ్బంది కలిగిందన్నారు. తమ ఆరోగ్యం ఇప్పుడు కుదుటపడిందని ఆశిస్తున్నాను. ఈ సాటిలేని రత్నం మా మధ్యనే చాలా సంవత్సరాలు నిలిచి ఉండి, మేమందరం 'వారి' నీడలోనే నిరంతరం పురోభివృద్ధి చెందునట్లుగా చేయమని 'మాలిక్'ను ప్రార్థిస్తున్నాము. పూజ్య బాబూజీకి మా తల్లిదండ్రులు బాగా జ్ఞాపకం ఉంటున్నందుకు, అదే విధంగా అప్పుడప్పుడు నన్ను కూడా వారి పుత్రికగా జ్ఞాపకం ఉంచుకుంటున్నందుకు మేము చాలా అదృష్టవంతులం. పూజ్య మాస్టర్ సాహెబ్ ద్వారా తమకు ఉత్తరం పంపించినప్పటి నుండి, ఆత్మికదశలో మళ్ళీ కొంత మార్పు వచ్చింది. నా జ్ఞాపకం యొక్క స్థితి బాగుండలేదు. ఊహించుకొని జ్ఞాపకం చేసుకోవటం కూడా చాలావరకు మరచిపోతున్నాను. అయినప్పటికీ 'మాలిక్' కృపతో ఏదో విధంగా కొనసాగుతోంది. నేను తమకు ఇదివరకు వ్రాసినట్లుగా నిద్ర కూడా చాలా గాఢంగా ఉంటోంది. అయితే అప్పటిదానికి ఇప్పటిదానికి కొంచెం భేదం ఉంది. ఇప్పుడు ఈ గాఢనిద్ర వలన ఎంత ఆనందంగా ఉందంటే, నేను రాత్రి పది నిమిషాలు మరియు పగలు పది నిమిషాలు నిద్రిస్తే, శరీరం మరియు మనస్సు బడలిక తీరిపోయి ఎంత ఉల్లాసంగా ఉంటున్నాయి అంటే, మరల నిద్రపోవాల్సిన అవసరం లేకుండా ఉన్నది. అది ఎలా అనిపిస్తోందంటే, ఇంతవరకు మనస్సు మరియు శరీరం ఏ పనిని స్వీకరించలేదు అని. అయితే నిద్ర నుంచి లేచిన తర్వాత షుమారు 8, 10 నిమిషాలవరకు, నేను ఎక్కడ ఉన్నానో, అది రాత్రి అనిగాని లేక పగలు అనికాని స్పృహలోకి రావటంలేదు. కొంతసేపటికి క్రమంగా విషయాలన్నీ తెలుస్తున్నాయి. మేల్కొన్న తర్వాత ఎక్కడో విదేశానికి వచ్చినట్లుగా ఉంటున్నదని బహుశా తమకు నేను ఇంతకుముందు

వ్రాసే ఉంటాను. 15-20 రోజులవరకు పగలంతా ఇదే స్థితి కొనసాగుతూ వచ్చింది. ఇప్పుడయితే, నేను విదేశంలో ఉన్నానా లేక ఇంటిలో ఉన్నానో కూడా గుర్తింపుకు రావటంలేదు. ఇంతకుపూర్వం ఉత్తరంలో వ్రాసిన విధంగానే, దాదాపు స్థితి అలాగే ఉంది.

అమ్మ తమకు ఆశీస్సులు తెలుపుతున్నది. కేసర్, బిట్టో ప్రణామాలు తెలుపుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు నా ప్రేమ తెలుపుతున్నాను.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 66

షాజహాన్‌పుర్,

11.11.1949

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. ఇప్పుడు ఈశ్వరుని దయతో నీవు బాగుంటావు. ఒక రోజున నేను న్యాయస్థానం (కోర్టు)లో ఉండగా నీ పని తిలకించాను. చాలా ఆనందం కలిగింది. కోరిక దానంతట అదే కలిగినా లేదా దానిని నీవు స్వంతంగా కల్పించుకున్నప్పటికీ, విధానం మాత్రం సరిగ్గా ఉంది. ఇది హిందుస్థాన్ స్వచ్ఛత గురించినది. నీ పరిస్థితి బాగుపడిన తర్వాత ఉత్తరం వ్రాయాలి. ఈసారి నీవు వచ్చినప్పుడు ఈశ్వరానుగ్రహం కలిగితే నీలో అనుభవశక్తి బిందువును కూడా తెరుస్తాను. ఆ బిందువును నీకు కూడా తెలియచేస్తాను. ఆ బిందువు తెరుచుకోవటం మూలంగా అనుభవశక్తి వృద్ధి చెందుతుంది. అయితే దాని వృద్ధి శక్తి తెరుచుకోవటం ద్వారా మాత్రమే కాకుండా దానిని సాధన చేయటంమీద ఆధారపడి ఉంటుంది. అనగా ఏ శక్తి అయినప్పటికి తెరవబడిన తర్వాత దానిని ఉపయోగించకపోయి నట్లయితే దానిలో అధికంగా వృద్ధి కలగదు. ఈశ్వరుడు నీకు పిండదేశం (Micro-Cosmic Region), బ్రహ్మాండ దేశం (Cosmic Region)ల మీద ఆధిపత్యం కలిగించాడు. పిండదేశంమీద ఆధిపత్యం అంటే వ్యక్తిత్వంమీద ఆధిపత్యం (నియంత్రణ) అనగా పిండము మీద నైపుణ్యం కాగా బ్రహ్మాండదేశంమీద ఆధిపత్యం అనగా బ్రహ్మాండ శక్తి (Cosmic Power) మీద అనగా విశ్వంమీద అధికారం కలిగి ఉండటం అని అర్థం చేసుకోవాలి. ఏ సమయంలోనైనా నాకు ఏదైనా తలంపుకువస్తే, అదీగాక పైనుంచి సంకేతం వస్తే మళ్ళీ వ్రాస్తాను. ఇంతేగాకుండా నీ యొక్క ప్రతి నాడి (Nerve)ని, శరీరం యొక్క ప్రతి భాగాన్ని ఆధ్యాత్మిక శక్తి (Spiritual Force)తో నింపివేశాను. దీనిని జీర్ణించుకోవటానికి సంవత్సరాల కొద్దీ కాలం పట్టుంది. ఇప్పుడు ఈశ్వరేచ్ఛ ఉన్నట్లయితే ఈ శక్తిని ఒకటి లేదా రెండు సంవత్సరాలలో, ఈ సమయం చాలా స్వల్పమే అయినప్పటికీ, జీర్ణించుకుపోవునట్లుగా నేను ప్రయత్నిస్తాను. నీతో పని చేయించవలసి ఉన్నందుననూ, మరియు నీవు, నన్ను వత్తిడి చేసినందువల్లనూ నేను ఇలా చేయవలసి వచ్చింది. నీవు జీర్ణించుకోవటానికి సహకరించే ఒక చిట్కాను నీకు వ్రాస్తున్నాను. అది ఏమిటో తెలుసా? అది 'మాలిక్' (దైవ) స్మరణ! మామూలుగా నయితే ఒక జీవితకాలం గడిచిపోయినా ఇది జీర్ణం కాకపోవచ్చు; ఒకవేళ ఇది జీర్ణం కాకపోయినప్పటికీ వచ్చే నష్టం ఏమీ ఉండదు కూడ. అప్పుడు నేను ఇంకా ఎక్కువ ఆధ్యాత్మిక శక్తిని ఇవ్వవలసిన అవసరం రావచ్చు, అందుకు అవకాశం కూడా దక్కాల్సి ఉంటుంది. మంచి ఆరోగ్యం, అభ్యాసులకు శిక్షణను ఇవ్వటం ఈ జీర్ణక్రియలో తోడ్పడతాయి. నీ సోదరీమణులు, తల్లిగారు పూజకై నీవద్ద కూర్చుంటూ ఉండే ఉంటారు. ఇంకను ఇతర మహిళలు కూడా దీనిలో పాల్గొంటే ఇంకా బాగుంటుంది. శిక్షణ ఇవ్వటంలో నీకు ఏమైనా ఇబ్బందులు అనిపిస్తే మాస్టర్ సాహెబ్ (ఈశ్వర సహాయ్‌గారి)ని సంప్రదించగలవు. ఈశ్వరుడు నీకు అన్నీ అనుగ్రహించాడు. అయితే ఏ విధంగానైతే 'అతడు' అపరిమితుడో అదే విధంగా మన ఉన్నతికి కూడా పరిమితి అంటూ లేదు. నాకు సంబంధించినంతవరకూ, నేను

ఢంకా మ్రోగించి "నాకు తెలిసిందంతా ఏమీ తెలియదు అని మాత్రమే" అని చెప్పటానికి సిద్ధంగా ఉన్నాను. చూడు బిటియా! మన గురుమహరాజ్‌వద్ద శిక్షణ పొందినవారి పరిస్థితి ఎలా ఉందంటే "పసుపు కొమ్ము ముక్క దొరికిన వాడు, తాను వ్యాపారిని" అనుకున్నట్లుగా ఉంది. ఈ ఆధ్యాత్మిక విద్యాసాగరం యొక్క వైశాల్యం ఎంతగా ఉందంటే, మానవుడు తన జీవితకాలం అంతానే కాదు, ఆ తర్వాత కూడా ఈదినప్పటికీ దరి (ఒడ్డు) చేరలేనంతగా ఉంది. 'ధన్యవాద ప్రసాదము' నీవు అక్కడే నివేదించితే సమంజసంగా ఉంటుందని నేను అనుకుంటున్నాను. కేసర్‌చేత ఈ ఉత్తరం యొక్క నకలు వ్రాయించి నాకు పంపించగలవు.

నీ శ్రేయోభిలాషి

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 67

లఖీంపుర్,

11.11.1949

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. 'మాలిక్' కృపతో ఇక్కడకు మేమంతా క్షేమంగానే చేరాము. నా ఆత్మిక దశను గురించి ఏమి చెప్పమంటారు! 'మాలిక్' యొక్క కీర్తి ప్రతిష్ఠలను ఈ విధంగా వివరించవచ్చు.

**"జుంబిసె అబరు మే హై; క్యా జానె క్యా - క్యా ఆబో తాబ్"** అనగా ఊహకందని ఆ వెలుగు, ఆకర్షణ, వైభవం మరియు శక్తి ఆ భగవానునికే తెలియాలి. అంతేకాదు, ఆ 'మాలిక్' కనుసన్నలలో అదంతా ఇమిడి ఉంది. ఎవరైతే 'మాలిక్' యొక్క అపరిమిత కృపతో, మన పూర్వీకుల సమక్షంలో, ఆత్మిక ఉన్నతిలో ఇంకేమీ మిగలనంతగా ఉన్నతి చెందుతారో, వారి భాగ్యాన్ని ఎంతగా వర్ణించగలం! తమ యొక్క దయామయ వాక్కు - "చౌబేజీ, ఈశ్వరుడు కావాలనుకున్నట్లయితే కస్తూరికి నేను ఇవ్వవలసింది ఏమీ ఇంక లేనంతగా చేస్తాను" అన్నది నా హృదయంలో నాటుకుపోయింది. 'మాలిక్' కూడా ఇదే విధమైన దయ కలిగి ఉంటే, కస్తూరి కూడా తనవైపు నుంచి చేయవలసిందేమీ లేనంతగా చేస్తుందనే విశ్వాసం తమకు కల్పిస్తున్నాను. బాబూజీ, దయచేసి నన్ను క్షమించండి, తమరు నాకు నాలుగు రోజులు విశ్రాంతి తీసుకోమని సలహా ఇచ్చారు. ఆ ప్రకారంగానే నేను శరీరానికి పూర్తిగా విశ్రాంతి నిచ్చాను. అయితే నేను మొన్నటి నుంచే అన్ని పనులూ చేయటం మొదలుపెట్టాను. పని చేసిన తరువాత హృదయం చాలా ఉల్లాసంగా ఉంటున్నది. మొన్న నేను పనిని చేస్తూ ఉన్నప్పుడు, నెం. 1, నా ఎదుట ఏదో కరిగి ప్రవహిస్తున్నట్లుగా అనిపించింది. అప్పుడప్పుడు, నేను పని చేస్తూనే ఉన్నప్పటికీ, పని జరుగుతున్నదా లేదా అని అనిపిస్తోంది. కాని, నేను వెంటనే తమ శక్తిని గురించిన ఆలోచన కలగగానే ఆ పని తప్పనిసరిగా జరుగుతున్నట్లుగానే విశ్వాసం కలుగుతోంది. నిజం చెప్పాలంటే, నా మీద నాకు సంపుర్ణ విశ్వాసం ఉంది. నా స్థితి ఎలా ఉందంటే, నా హృదయం ఎక్కడో మునిగి పోయినట్లుగా అనిపిస్తోంది. ఇప్పుడు కొద్దికొద్దిగా ఆత్మ సమర్పణ (శరణాగతి) జరుగుతూ ఉంది. నేను సంపూర్ణ సమర్పణ కొరకే ప్రయత్నిస్తాను. ఎందుకంటే, స్వల్పంగానే ఉన్న అహం ఎందుకు నన్ను అవిశ్రాంతంగా ఉంచుతుందో అది భగవంతునికే తెలియాలి. ఇంకొక విషయం ఏమిటంటే, తపన ఇంకా పెరిగిపోయింది. హృదయం చాలా తేలికగాను, సరళంగాను అయిపోయింది. తమర్ని కలుసుకోవాలనే కోరిక నన్ను అలహాబాదువైపు లాగుతోంది. నా తండ్రిగారి ధనం కేవలం షాజహాన్‌పూర్ వెళ్ళటానికే పరిమితం, అనగా కేవలం ఆధ్యాత్మిక ఉన్నతికొరకే ఖర్చు కావాలి అను కోరిక ఎందుకు కలుగుతుందో అ భగవంతునికే తెలియాలి. మరి నేను ఏమి చేయాలి! తమరు మొట్టమొదటి ఉత్తరంలో - **"ఏకై సాధె సబ్ సబ్ సధే, సబ్ సాధె సబ్ జాయె"** అనగా "ఒకే ఒక్కరైన 'అతని'నే చూడాలి, కలవాలి, ఆ ఒక్కరిగానే అయిపోవాలి" అని తమరు వ్రాసిన విధంగా, నేను ఒక్కరినే చూడాలని, ఒక్కరినే చేరాలని

అలాగే కేవలం ఆ ఒక్కనిలోనే లయంకావాలని కోరుకుంటున్నాను. తెలియక నేనేమి వ్రాశానో మరి నన్ను క్షమించండి. నేను మీ విషయంలో పూర్తిగా స్వతంత్రురాలనే. ఒక నానుడి ప్రకారం– “పిల్లవాడు తన తల్లివద్ద ఎంత స్వతంత్రంగా వ్యవహరిస్తాడో, ఎంత స్వేచ్ఛగా మాట్లాడతాడో అంత ఇదిగా మరెవ్వరివద్దా వ్యవహరించలేడు, మాట్లాడలేడు” – అని. నా పనిలో, వ్రాతలోను ఏమైనా దోషం ఉంటే వ్రాయండి. ఈ పూజలో ప్రతి విషయాన్ని కూలంకషంగా తెలుసుకోవాలనే కోర్కె కలుగుతోంది. ప్రతియొక్క స్థితిలోను పూర్తిగా మునిగిపోవాలని నా మనస్సు కోరుతోంది. పని చేసిన తర్వాత, నెం. 2. ఏ స్థానాన్నైతే తమరు విడిచిపెట్టాలని చెప్పారో దానిని విడిచిపెట్టి మిగిలిన వాతావరణం అంతటిలోను పవిత్రత యొక్క ధార ప్రవహిస్తున్నట్లుగా అనుభవమవుతోంది. మిగిలినవి తమరు గ్రహించగలరు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 68

లఖీంపుర్,

13.11.1949

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమకు ఒక ఉత్తరం మొన్నటి రోజున వ్రాసి, నిన్న మాస్టర్ సాహెబ్‌కు అందజేశాను. నేడు తమరు దయతో వ్రాసిన ఉత్తరం అందగా, చదివి చాలా సంతోషించాను. నా ఆరోగ్యం ఇప్పుడు చాలా బాగున్నది. తమరు అందరు కూడా కుశలమేనని భావిస్తాను. ఈ దీనురాలిని నిమిత్తమాత్రురాలిగాచేసి ‘మాలిక్’ పనిని స్వయంగా తమరే నిర్వహిస్తున్నందుకు తమకు హృదయపూర్వక ధన్యవాదా లర్పిస్తున్నాను. ‘మాలిక్’ యొక్క అపార దయ మూలంగా, ‘అతని’కి సంబంధించిన పనులు నాకు అప్పగించిన వాటిలో నా హృదయం పూర్తిగా లగ్నమై ఉంటూ అధికంగా ఆనందంతో ఉప్పొంగుతూ ఉంది. అప్పుడప్పుడు ఆ ఆనందం పూజ సమయంలో అనుభవమవుతున్నది. తమరు దయతో పిండదేశం మరియు బ్రహ్మాండదేశం గురించి చెప్పిన విషయాలు నేను శ్రద్ధగా చదివాను. పూజ్య శ్రీ బాబూజీ, నేను తెలుసుకొనవలసిన విషయం ‘ఒక్కటి’ మాత్రమే ఉంది. ఆ ‘ఒక్కటి’ తెలుసుకొనగలిగితే సమస్తమూ అర్థమవుతుంది. తమరు వ్రాసినట్లుగా ‘మాలిక్’ దయ కలిగినట్లయితే, త్వరగా బాగా అర్థం చేసుకొనటానికి నేను కూడా ఎంతోకొంత ప్రయత్నిస్తాను.

మనస్సు అలసిపోతున్న కారణంగా ‘మాలిక్’ పని ఒక్కసారిగా ముప్పదియైదు నిమిషాలకు మించి జరగటంలేదు. ఇంట్లో పూజలో అందరూ కూర్చుంటున్నారు. వారంలో ఒక రోజు జియా, ఇతరులు కూడ హాజరవుతున్నారు. అలాగే వారు కూడా పూజ నిర్వహిస్తున్నపుడు అవకాశం కల్పించుకుని నేను కూడా ఒక రోజు అక్కడికి వెళ్తున్నాను. తమరు, “నీకు అన్నీ లభించాయి” అని వ్రాసారు కాని నేను సర్వస్వమూ కోల్పోయాను అని చెప్పగలను. అవును, నాకు తపన లభించింది. ఇది కాకుండా దక్కింది, దక్కనున్నది ఎవ్వరికీ సాటిరాని ‘అతడు’ మాత్రమే. నిజంగా ‘అది’ పొందగలిగితే ఇంక పొందాల్సింది ఏమీ ఉండదు. అంతేకాదు ‘అది’ ఏదో తమకు తెలుసు. తమరు “ప్రసాదం” యొక్క ధన్యవాదాల గురించి వ్రాశారు. అది ఎల్లుండి నివేదించబడుతుంది. కాని ఇంతమాత్రం దానికే, నాకు సంతృప్తి కలగటంలేదు. దయచేసి తమరు, గౌరవనీయులైన, మహిమాన్వితులైన మా పూర్వీకుల పాదాలకు ఈ దీనురాలి సవినయ ప్రణామములు ఆచరిస్తున్నట్లుగా తెలియజేయాలని, ‘వారి’ యొక్క దయ, కటాక్షం వృథా చెందవని విశ్వాసం కల్పించాలని, నిన్నటి నుంచి నా మనస్సులో ఈ విషయమే తలెత్తుతూ ఉంది. వారి కటాక్షాన్ని పరిపూర్ణంగా నిర్వర్తించటానికి ప్రయత్నించటం ద్వారానే నేను వారికి ఈ మాత్రమైనా కృతజ్ఞత తెలిపినట్లవుతుంది. మరి ‘తమ’ గురించి ఏమి వ్రాయమంటారు? తమయొక్క చరణాలమీద నా శిరస్సు సదా సాగిలపడి ఉంది. దీనిని మాటల్లో ఈ విధంగా మాత్రమే చెప్పగలను–

**"చరణోంపర్ అర్పణ్‌హై, ఇస్కో చాహె తొ స్వీకార్ కరొ,**

**యహతొ వస్తు తుమ్హారీ హీ హై, ఠుకరా దొ యా ప్యార్ కరొ.**

అనగా తమ చరణాలకు దీనిని అర్పించాను, అంగీకారమైతే దీనిని స్వీకరించండి, ఈ వస్తువు తమదే, తృణీకరించండి లేదంటే ప్రేమించండి.

సాధ్యపడినంతవరకు, నేను 'మాలిక్' పనిని విడిచిపెట్టను. అందరి మనస్సుల్లోను ఏమున్నదో తమకు స్వయంగా అంతా తెలుసు. కనుక తమరికి ప్రత్యేకంగా వ్రాయాల్సిన అవసరంలేదు. సోదరుడు మరియు వదిన, తదితరులు, ప్రార్థనను హిందీలో వ్రాసి ఇవ్వమని కోరినందున దాని నకలు పంపుతున్నాను. అందరు దానిని వ్రాసుకోగలరు.

డైరీలో నిత్యం కలుగుతున్న స్థితుల గురించి వ్రాస్తూనే ఉన్నాను. తమరు ఇక్కడకు వచ్చినపుడు పరిశీలించగలరు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 69

షాజహాన్‌పుర్,

16.11.1949

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ! నీ ఉత్తరం, కేసర్ ఉత్తరమూ అందాయి. నేను విపులంగా జవాబు ఇవ్వాలని అనుకున్నాను కాని ఇప్పుడు సమయం రాత్రి ఒంటి గంట అయినందున కొద్దిగా అవుసరమైనవాటినే వ్రాస్తున్నాను. నీ విశ్రాంతిలేని శ్రమకు అభినందనలు. నీవు చేస్తున్నటువంటి పని సమంజసంగానే ఉంది కాని మెదడు అలసిపోనంతమేరకే చేయాలి. నీవు అలహాబాదు వెళ్ళాలని కోరుకుంటున్నావు. ఆ విషయం చౌబేజీ నిర్ణయానికి వదిలిపెట్టు. నేను కూడా అలహాబాదు వెళ్ళాల్సి ఉంది, కాని ఈశ్వరుని కృప ఉంటే అక్కడికి చేరతాను. నా ఉనికి అక్కడ ఉంటే, నీవు అక్కడకు వెళ్ళగల్గావని అనుకోవటంతప్ప, నీకు నేను నేర్పగల్గేది ఏమీ ఉండదని దృష్టిలో ఉంచుకో. ఎందుకంటే, అక్కడ మీరందరు నా సమక్షంలో మెలగటం అక్కడి పరిస్థితికి తగినట్లుగా ఉండదు. ఎందుకంటే, ఇతర బంధువులు హాజరవుతారు, పరదా నియమం కూడా తప్పక పాటించాల్సి ఉంటుంది. కేసర్ వ్రాసిన దాని ప్రకారం ఆమెలో అభిరుచి వృద్ధి అవుతున్నట్లుగా అర్థమవుతోంది. ఇంతకుపూర్వం చౌబేజీ మరియు మాస్టర్ సాహెబ్ (ఈశ్వర్‌సహాయ్) కూడా ఈ విషయం చెప్పారు. అయితే నా అభిప్రాయం అందుకు విరుద్ధంగానే ఉంది. ఆ అభిరుచి ఇంకా పెరగవలసే ఉంది. దాని కొరకు నిరీక్షించాలి. ఆమె అభిరుచి పూర్తిగా నమ్మదగిన స్థాయికి ఇంకా పెంపొందలేదు. నాకయితే ఎవ్వరికి సేవ చేయటానికైనా ఎప్పుడూ అయిష్టత ఉండకూడదు, అలా లేదు కూడ. మీరందరూ నన్ను ఏ దిశలో నడిపిస్తే ఆ దిశలోనే నడుస్తాను. నేను నా వాడినైతే కదా నా వశంలో ఉండేది! ఇప్పటికే చాలా సమయమైంది కనుక ఉత్తరం ముగిస్తున్నాను. మళ్ళీ ఎప్పుడైనా వ్రాస్తాను. కేసర్ ఉత్తరానికి జవాబు కూడా దీనిలోనే ఉంది.

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

# ఉత్తరం సంఖ్య - 70

లఖీంపుర్,

19.11.1949

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దద్దాగారి ద్వారా పంపిన ఉత్తరం అందింది. కేసర్ అభిరుచి పెరుగుతున్నదన్న విషయం తెలిసి చాలా ఆనందం కలిగింది. షుమారు పదకొండు గంటల సమయం నుంచి అదేమిటో తెలియదు కాని, ఒక విశేషమైన అసౌకర్యం అనుభవమవుతున్నది. దానికి అర్థం ఏమిటో ఇప్పుడు కొంచెం అర్థమైంది. ఇప్పుడు మనస్సు యొక్క చేష్ట దారిలోకి వచ్చింది. ఇంతకుపూర్వంకంటె ఎక్కువ పని చేసినప్పటికి ఇప్పుడు అది అలసిపోవటంలేదు. నేను అలహాబాద్‌కు వెళ్ళటంలేదు. తమరు పరదా యొక్క మర్యాదను గురించి వ్రాసినది చాలా సబబుగా ఉంది. దానిలో ఔచిత్యం కూడా ఉంది. దానిలో ఉన్న భేదమల్లా ఏమంటే, 'మాలిక్'పట్ల పరదా వేసుకున్నవారిపట్ల పరదా ధరించటం తగినదే అవుతుంది. (అనగా దైవానికే ముఖం చాటేసుకున్నవారికి కనిపించకుండా పరదా వేసుకోవటమన్న మాట) ఇప్పుడింక ఒకటి రెండు విషయాలు 'పని'లో ఉండగా దృష్టిలోకి వచ్చిన వాటిని గూర్చి 'తమ' నుంచి వివరణ కోరుతున్నాను.

**1.** 13వ తేదీ రాత్రి 2 గంటలకు కళ్ళు తెరవగానే భారతదేశాన్ని శుభ్రపరచే 'పని' చేయటానికి హృదయం బాగా మధనపడింది. నేను 'పని' చేయటం ప్రారంభించగానే కొద్దిసేపటికే ఏదో పటం (Map) వంటిది ప్రత్యక్షంకాగా, హృదయంలో ఇండోర్, ఇండోర్ అను శబ్దాలు మాటి మాటికీ ఉత్పన్నమయ్యాయి. కాని వాటి అర్థం ఏమిటో నేను గ్రహించలేకపోయాను. దీనికి సంబంధించి తమ ఆజ్ఞ ఏదైనా ఉంటే వ్రాయగోర్తాను.

**2.** ఈ నెల 16వ తేదీన పండిత్ మహాదేవ్ ప్రసాద్ ఇంటికి వెళ్ళాను. కొద్దిసేపు సంభాషణ జరుగుతూ ఉండగానే, అలా ఎందుకో తెలియదుకాని హృదయంమీద భారం మోపినట్లుగా అనిపించింది. దాని తీవ్రత పెరుగుతున్న సమయంలో 'మాలిక్' కృపవలన వెంటనే 'క్షాళన' చేయాలని మనస్సుకు తట్టింది. క్షాళన తరువాత హృదయం మళ్ళీ తేలికగా ఉన్నట్లనిపించింది. నేను తిరిగి రాగానే మళ్ళీ ఇంకొకసారి శుభ్రపరచుకున్నాను. అప్పుడింక హృదయం గతంలో లాగానే ఉంది.

**3.** ఈ నెల 17వ తారీఖున రాత్రి 9 గంటలకు, అదేమిటో తెలియదుగాని 'తమ'కు సిట్టింగ్ ఇవ్వాలని హృదయంలో కోర్కె కలిగింది. అప్పుడు షుమారు 15 నిమిషాలు సిట్టింగ్ ఇచ్చాను.

**4.** ఈ నెల 18వ తారీఖున మధ్యాహ్నం 2 గంటల సమయంలో 'పని' చేస్తూ ఉండగా, పాకిస్తాన్‌కు సంబంధించిన 'పని' చేస్తున్నపుడు కొంచెం లేతఎరుపురంగు కనిపించింది.

'మాలిక్' దయతో ఆత్మికదశ బాగానే కొనసాగుతూ ఉంది. ఈ రోజు కారణం ఏమిటో తెలియదుగాని, నాకు ఏదైనా పని చేయటానికి కాని, ఎవ్వరితోనైనా మాట్లడాలనిగాని అనిపించటంలేదు. నిశ్శబ్దంగా కూర్చొని ఉండాలనిపిస్తూ ఉంది. ఇంకా ఎక్కువ 'పని' చేయాలని తమరు ఆజ్ఞాపించి నట్లయితే అలాగే చేస్తాను. ఈ రోజు హృదయం నిలకడగా ఉంది. ఎటువంటి ఆలోచన రావటం లేదు, అది అంతా ఖాళీగా ఉంది. అది ఏ విషయం జోలికీ పోవటంలేదు. ఇటువంటి దశ తరచుగా అనుభవమవుతూ ఉంది.

పిన్నలైన సోదరీ సోదరలకు ప్రేమాభిమాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

# ఉత్తరం సంఖ్య - 71

లఖీంపుర్,

30.11.1949

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. మాస్టర్ సాహెబ్‌గారి ద్వారా 'తమరు' కూడా నిన్ననే షాజహాన్‌పూర్ చేరి ఉంటారు అని తెలిసింది. అలహాబాద్ సంగతులు తెలుసుకొని ఆనందించాను. **ప్రపంచంలోని జనులందరూ పూజ చేయ నారంభిస్తే ఎంత బాగుంటుంది!** దైవేచ్ఛ ఎలా ఉంటే అలా జరుగుతుంది. 'మాలిక్' కృపతో నా ఆత్మిక దశ బాగున్నది, సర్వదా నిశ్చయంగా అలాగే ఉంటుంది కూడ. ఇప్పుడు స్వయంగా పూజ నిర్వహించటానికి హృదయం బాగా లగ్నమవుతోంది. ఇంతకుపూర్వమైతే షాజహాన్‌పూర్ నుంచి తిరిగి వచ్చిన తర్వాత కొద్దిరోజులపాటు హృదయం పూజ చేయటానికి సన్నద్ధం కాలేదు. ఇప్పుడు ఎలా ఉందంటే, హృదయం అధికంగా లోలోపలే కుమిలిపోతున్నట్లుగా అనిపిస్తోంది. ఎందుకంటే, 'మాలిక్' జ్ఞాపకం నాకు మనస్ఫూర్తిగా కలగటంలేదు. అంతగా జ్ఞాపకం చేసుకోవటం కూడా ఎలా! ఎందుకంటే సమస్త విశ్వంలోను 'అతని'కి మించిదంటూ ఏది లేదని నాకు అనిపిస్తోంది. అయితే 'అతని'పట్ల నాకు ప్రేమ ఉన్నదా అను సందేహం ఉంది. శ్రీ బాబూజీ, నేను ఎప్పటికైనా హృదయపూర్వకంగా నా 'మాలిక్'ను ప్రేమించగలనా? అలా కాదు, (limit) పరిమితమైన ప్రేమను 'అతని'పట్ల కలిగి ఉండటానికి నేను సమ్మతించను. 'అతని'పట్ల (Unlimited) అపరిమితమైన ప్రేమను కలిగి ఉండటానికి నేను ప్రయత్నిస్తాను. శ్రీ బాబూజీ, నేనేమి చేయగలను? నేను 'తమ'కు ఉత్తరం వ్రాయనారంభించగానే హృదయం పూర్తిగా తెరుచుకొని ఏమీ దాచడానికి అంగీకరించటంలేదు. అప్పుడు నేను ఎలా ఉన్నా, నేను పూర్తిగా హృదయం తెరిచి చూపుతున్నట్లుగా భావిస్తున్నాను. ఇప్పుడు 'అతడు' ఏమి నాచేత చేయించదలచాడో దానినే చేయాల్సి ఉంది. ఇప్పుడు అసలు చేయటం, చేయించటం ఏమి ఉంటాయి? 'అతని' వస్తువు మీద 'అతని'కి సంపూర్ణ అధికారం ఉంది. నా తరపున 'అతని' మీద ప్రేమ గురించి ఎటువంటి దావా వేయలేను (అనగా ఎటువంటి పరిహారం కోరలేను). ఏమైనప్పటికీ, ఏదైతే అది అనుకోవటమే. పూజ చేయటానికి ఉపక్రమించినప్పుడు, అప్పుడప్పుడు నేను పూర్తిగా జీవం లేనట్లుగా అనిపిస్తోంది. ఇటువంటి అసంబద్ధమైన మాటలు వ్రాస్తూ ఉన్నందుకు, తమ ఈ కుమార్తెను హృదయపూర్వకంగా క్షమిస్తూ ఉండండి. ఇప్పుడు ఏమి జరిగిందో కాని, ఈ బీదరాలు (దీనురాలు) యొక్క పేదరికం కూడా తొలగించబడిపోతుంది. ఇప్పుడు నా డైరీలోని కొన్ని స్థితుల గురించి వివరణ కోరుతున్నాను.

**1. నవంబర్ 20వ తారీఖు –** అది ఎందుకో తెలియదుకాని, నెం. 1వ 'పని' (భారత్‌ను శుద్ధి చేయటం) చేస్తున్నప్పుడు హృదయం చాలా నమ్రతతోను, ఉల్లాసంగాను ఉంటున్నది. అయితే నెం. 2 'పని' (పాకిస్తాన్‌కు సంబంధించినది) చేస్తూ ఉండగా వెంటనే నివ్వెరపోవటం, అవేశం చెందటం జరుగుతోంది. అయినప్పటికి వశం తప్పటంలేదు. అయినప్పటికీ చాలావరకు ఈ రెండు పనుల సందర్భంలోను హృదయం సమతుల్యంగానే ఉంటున్నది.

**2. నవంబర్ 22వ తారీఖు –** ప్రతి పనిని నేను పూర్తిగా చేసేస్తానను సంపూర్ణ విశ్వాసం నాకు ఉంది. ఇది 'అతను' చేసిన పనికి ఎవరికి పేరు వస్తోందో తమరు చూశారా బాబూజీ!

**3. నవంబర్ 23వ తారీఖు –** ఈ రోజు ఒకటి, రెండుసార్లు హృదయం స్పందించికపోయినప్పటికీ అయిష్టంగానే 'పని' పూర్తిగా చేశాను. అప్పుడు జియా వచ్చింది. ఆమెకు నామీద గురి ఉంది. అందుచేత నేను ఆమెతో పూజ చేయిస్తూ ఉంటాను. అప్పుడు ఇద్దరమూ కూర్చున్నాము. అప్పుడు స్వయంగా నేను కూడా పూజ చేస్తున్నట్లు నాకు అనిపించసాగింది. జియా హృదయం కూడా సున్నితంగాను, తేలికగాను అయినట్లు తోచింది.

**4. నవంబర్ 29వ తారీఖు –** కొద్ది రోజుల నుండి నెం. 1 (భారత్‌కు చెందినది) పని చేస్తూన్నప్పుడు పృథ్వి అంతా మెత్తగా అవుతున్నట్లనిపించింది. ఈరోజు హృదయం కొంచెం ఉదాసీనంగాను, మందకొడిగాను ఉండి పోయింది. కారణం ఏమిటో తెలియదు కాని, మున్నీతో పూజ చేయించటానికి హృదయం సహకరించటంలేదు. ఆమె హృదయంమీద కొన్ని బలీయమైన సంస్కారాలు పేరుకుపోయి ఉండవచ్చు.

పూజ్య శ్రీ బాబూజీ! ఇప్పుడు కొద్ది రోజుల నుండి నేను ఎవరిచేతనైతే పూజ చేయించాల్సి ఉందో, అతడు లేదా ఆమెకు రాత్రంతా నిద్రపట్టకుండా పోయింది. జియాతో పూజ చేయించాలనుకుంటే వారు మేల్కొన్నారు, కేసర్‌తో చేయించాలనుకుంటె ఆమె మేల్కొన్నది. మరి నా తప్పు ఏమిటో ఆలోచన చేస్తే ఏమి అర్థం కావటంలేదు.

ఇటీవల 'పని' చేసిన తర్వాత ఏదైనా తీరిక దొరికినప్పుడు పాత అలవాటు ప్రకారం ఎప్పుడైనా సరే పూజ చేయాలను కోరిక తరచుగా కలుగుతోంది. ఎప్పుడైనా ఎవ్వరికైనా సిట్టింగ్ ఇస్తూ ఉన్నప్పుడు కూడా 'మాలిక్' యొక్క జ్ఞాపకంతోనే ఇవ్వటం జరుగుతున్నది. నేను ఎప్పుడైతే ఈ స్మరణను నిలువరించి పూజ చేయించతలపెట్టినట్లయితే అప్పుడు అందరికీ గాఢ నిద్ర రావటం మొదలవుతోంది. ఈ విషయమై మాస్టర్ సాహెబ్‌ను సంప్రదించగా వారు తరచుగా ఈ విధంగా జరుగుతుందని చెప్పిన తర్వాత నాకు భయంలేకుండా పోయింది. ఒక విషయం వ్రాయటానికి జంకుతున్నాను. ఆ విధంగా వ్రాస్తున్నందుకు నన్ను క్షమించండి. అది ఏమిటంటే, **'మాలిక్' నన్ను జ్ఞాపకం చేసుకోవాలను భావం కలుగుతోంది. అంతేగాకుండా అప్పుడప్పుడు 'మాలిక్' నా జ్ఞాపకం కోసం తపించిపోతున్నట్లుగాను తలపిస్తోంది.** జియాకు చెందిన ఉత్తరం నకలును నేను తీసుకున్నాను. ఎంతో ఉన్నతులైనటువంటి వారి ఉపదేశం గదా! అది అందరికీ చెందుతుంది. అయితే ఈ ఉపదేశం ఎంత మహోన్నతమైనదో, దానిని గురించిన నా అవగాహన ఎంత అల్పమైనదో 'తమ'కు తెలుసు.

చిన్నవారైన సోదర సోదరీలకు నా ప్రేమాభినాలు, నాయనమ్మగార్కి నా ప్రణామాలు అందజేయండి.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 72

లఖీంపుర్,
02.12.1949

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

వినయపూర్వక ప్రణామము. నిన్న తమరికి ఒక ఉత్తరం వ్రాసి పూజ్య మాస్టర్ సాహెబ్‌కు అందజేశాను. అయినా కాని మళ్ళీ ఈరోజు ఉత్తరం వ్రాయాలనిపించింది. నిన్నటి నుండి నామీద 'మాలిక్' యొక్క ప్రత్యేక ప్రేమ కలిగి ఉన్నట్లనిపిస్తోంది. నిన్న సాయంకాలమైతే నాలో ఏమి జరుగుతూ ఉందో తెలియకపోయింది. ఆంతరికంగా అంతర్నేత్రాలు వంటివి తెరుచుకోబడి నప్పుడు 'మాలిక్' యొక్క జ్ఞాపకం ఎలా చేసుకోవాలి? అని అనిపిస్తోంది. దానిని గురించి ఎంత ఆలోచించినప్పటికీ ఏమీ స్ఫురించటం లేదు. అసలు నేను ఎప్పుడైనా 'అతడి'ని జ్ఞాపకం చేసుకోవటం జరిగిందా అనేది కూడా బాగా జ్ఞాపకం రావటంలేదు. ఒకసారి నాతో 'తమరు' నీవు 'మాలిక్'ను జ్ఞాపకం చేసుకుంటున్నావు అని అన్నారు. అప్పట్లో నాకు కూడా అలాగే అనిపించింది కాని ఇప్పుడైతే ఇంతకుపూర్వం నేను ఎలా జ్ఞాపకం చేసుకుంటూ ఉండే దానినో కూడా నాకు స్ఫురించటంలేదు. ఇంతకీ విషయం ఏమిటంటే, 'మాలిక్' జ్ఞాపకం అంటూ మరచిపోయినపుడు, ఇప్పుడు జ్ఞాపకం చేసుకోవటం జరుగుతుంది? మరి 'మాలిక్' జ్ఞాపకమంటూ ఎవరిని స్మరించాలి? చేయాల్సిన పని మాత్రం బాగానే చేస్తున్నాను. హృదయం చాలా ఉన్నతం గాను, గంభీరంగాను ఉన్నట్లుగా అనిపిస్తోంది. అందుచేత రెండు, మూడు మాటలు అసంబద్ధమైనవి వ్రాసి వేశాను. అంతేకాదు ఆ విధంగా వ్రాయకుండా నిలువరించుకోలేకపోయాను కూడ. తావూజీ మరియు చిన్న సోదరుడు మొన్ననే వచ్చేశారు

కాని అమ్మ ఇంకనూ రాలేదు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

'పని' మరియు పూజ చేయిస్తున్నపుడు, ఇది జరుగుతోంది అను ఆలోచన మాత్రమే కలుగుతోంది, దానిలోనే మంచి ఆనందం కూడా లభిస్తోంది. ఇంతకుపూర్వం జరిగిన విషయం ఒకటి జ్ఞాపకం వస్తోంది, దానిని వ్రాస్తున్నాను. కనుక క్షమించండి. "ఇప్పుడు బాబూజీ కస్తూరితో కొంత పని జరిపిస్తారు" అని మాస్టర్ సాహెబ్ చెబుతూ ఉన్నప్పుడు, నేనయితే మనసులో ఏమనుకుంటూ ఉండే దానినంటే, మన పూజ్యులు, గౌరవనీయులు అయిన 'శ్రీ లాలాజీ', 'శ్రీ బాబూజీ'ని బాగా అభిమానిస్తూ ఉండేవారు అనీ, అందువలన 'వారు' (లాలాజీ) 'శ్రీ బాబూజీ'తో 13, 14 సంవత్సరాల తర్వాత పని చేయించ నారంభించారని భావించేదానను. మరయితే బాబూజీ నన్ను బాగా అభిమానించినట్లయితే అదే విధంగా నన్ను కూడ 14, 15 సంవత్సరాలలో పరిష్కరించి పని చేయించుకుంటారు కనుక నేనిప్పుడే ఎందుకు త్వరపడాలి అని నాకు అనిపించేది. అలా ఏమీ కాదు కాని, 'మాలిక్'కు ఇప్పుడు ఏది ఇష్టమైతే, దాని ప్రకారమే జరుగుతూ పోతుంది. నిన్నటి నుంచి స్థితిలో కొంత మార్పు వచ్చింది కాని అది ఏదో బాగా అంతుబట్టటంలేదు. దయచేసి నేను కోరటం సమంజసమే అనుకుంటే, 'మాలిక్' ఎలా జ్ఞాపకం చేసుకోబడతాడో తెలియజేయండి. లేదంటే తమకు తోచినట్లు చేయండి.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 73

షాజహాన్‌పుర్,

05.12.1949

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నీవి రెండు ఉత్తరాలు అందాయి. అందులో ఒకటి అలహాబాద్ వెళ్ళకముందు, మరొకటి డిశంబర్ 3వ తేదీన. అలహాబాద్‌లో నాకు చాలా ఉల్లాసంగా ఉంది. పాపం, నీ సోదరి శకుంతల నా కారణంగా అలహాబాద్‌కు వచ్చింది. ఆమె తన హృదయం యొక్క ఫిట్స్‌ను కూడా లెక్కచేయకుండా వచ్చింది కాని అక్కడ ఆమెకు చాలాసార్లు వచ్చాయి. నాకు చాలా జాలివేయటమే కాకుండా, చౌబేజీ ఎన్నోసార్లు జ్ఞాపకం చేస్తూనే ఉన్నప్పటికి, అటువంటి అమ్మాయిని జ్ఞాపకంలో నిలుపుకోలేకపోయినందుకు నాకు చాలా దుఃఖం కలిగింది. అక్కడికి వెళ్ళబోయే ముందు అతిప్రయత్నం మీద రెండు మూడుసార్లు ఆమె నా తలపుకు వచ్చింది. ఒకరోజు ఆమె హృదయం తీవ్రంగా కొట్టుకుంటూ ఆమె తల్లడిల్లిపోతూ ఉంటే అది చూసి నాకు చాలా ఇబ్బంది కలిగింది. ప్రార్థన ద్వారా ఫలితం కలిగి చాలా స్వల్ప వ్యవధిలోనే ఆమె బాధ శాంతించింది. ఆమె మొరలను దృష్టిలో ఉంచుకొని, ఆమె పరిస్థితికి జాలిపడి ఆమె ఆత్మోన్నతికి దృష్టి కేంద్రీకరించగా భగవంతుడు నా మొర ఆలకించాడు. 'పిండదేశం'కు చెందిన చక్రాలన్నింటిలోను ఆమె ప్రయాణం పూర్తయిపోగా ఇప్పుడు 'బ్రహ్మాండ మండలం'లో జీవిస్తున్నది. ఆమె శరీరమంతటా ఈశ్వరీయ ప్రకాశం వ్యాపించిపోయి 'అన్‌హద్' అనగా హద్దులేమి తెరవబడింది. అనగా రోమ రోమము నుంచి 'అజప' జపం ప్రారంభమైంది. ఆమె బలహీనత మరియు హృదయ దౌర్బల్యం కారణంగా హృదయంమీద వత్తిడి కలగకుండా ఫలితం చేకూరే విధంగా పని చేశాను. ఆమె తిరిగి వెళ్ళే సమయంలో కూడా తనను గురించి జ్ఞాపకం నిలుపుకోమని అభ్యర్థించింది. నిన్ను జ్ఞాపకం ఉంచుకొనమని నీ సోదరి కస్తూరికి జాబు వ్రాయమని ఆమెకు చెప్పాను. ఈ ఉత్తరం పూర్తి చేశానో లేదో ఇంతలోనే నీ జాబు మరొకటి ఈరోజునే చేరింది.

సాధ్యమైనంతవరకు 'దైవ స్మరణ' విషయంలో నిర్లక్ష్యం తగదు. ఈ స్మరణ అనేది ఎంత తేలికదనంతో ఉంటుందో, అంతే స్వల్పమైన రూపాన్ని 'అతడు' స్మరణకు నిలుపుకోవాలి. చివరకు ఏమి దక్కుతుందో అది 'దైవేచ్ఛ'కు తగినదిగా ఉంటుంది. "నిన్న సాయంత్రమైతే నాలోపల ఏమవుతోందో నాకు అర్థం కాలేదు. లోలోపల ఏదో కళ్ళు తెరచుకున్నట్లుగా అనిపిస్తోంది" అని వ్రాశావు. ఇది నాకు అర్థంకాలేదు. కళ్ళు తెరుచుకోవటమంటే శరీరంలో

అంగాంగాలు సాదృశ్యమయ్యాయో లేక ఇంకేమైన అయ్యాయో తెలియజేయి.

ఇప్పుడు నీ గత ఉత్తరానికి జవాబు వ్రాస్తున్నాను. ఈశ్వరుని స్మరణలో నిలుపుకొని పూజ చేయించినట్లయితే ఎదుటి వారిలో మంచి జాగృతి ఉత్పన్నమవుతుంది. ఆ కారణంగా మనిషి నిద్రిస్తూనే తనకు తాను మెళకువగా (జాగృతావస్థలోనే) ఉన్నట్లుగానే భావిస్తాడు. నీకు నిద్ర ఎలా పట్టూవుందో, నిద్రిస్తూనే మేల్కొన్నట్లుగా అనుభూతి కలుగుతోందో లేదా గాఢనిద్రలో మునిగిపోతున్నావో – ఆ స్థితిని గురించి నీవు వ్రాయనేలేదు. నేనయితే గాఢనిద్రలోనే నిదురిస్తాను, అయితే 'ఫకీరు' (బైరాగి / సన్యాసి) అయినవాడు గాఢంగా నిద్రించటం నిషిద్ధం. పైనుంచి నన్ను నిద్రింపజేయటానికి ఎటువంటి ధారా ప్రవాహం రానట్లయితే నేను ఇరువది నాలుగు గంటల్లో ఎప్పుడూ నిద్రించను. నా మూలంగా నా గురు మహరాజ్‌కు ఈ కష్టం భరించాల్సి వస్తోంది. నాపట్ల ఈ మినహాయింపు ఎందుకో నాకు తెలియదు, అది 'అతని' (దైవం) కే తెలియాలి.

పండిత మహాదేవ్ ప్రసాద్ ఇంటివద్దకు నీవు వెళ్ళినప్పుడు చాలా భారంగా (జడత్వంగా) తోచినట్లుందని వ్రాశావు. దానికి కారణం ఆయన భౌతిక (Grossness) ఆలోచనలు, విగ్రహారాధనయే. **అధికంగా చేసే విగ్రహారాధనల ఫలితం ఎలా ఉంటుందంటే, జన్మజన్మాంతరాలకు కూడా ఈశ్వరప్రాప్తిని పొందే అర్హత కలగదు.** ఈ విషయం ఎవరితోనైనా ప్రస్తావిస్తే జగడానికి సన్నద్ధమవుతారు. **ఎవ్వరికైనాసరే ముక్తి (Liberation) కలగాలంటే మనం ఆచరించే రాజయోగం తప్ప ఇంకేమీ సరిరావు.** ఎక్కడో ఒక్కచోట, ఏదో ఒక సందర్భంలో స్వామి వివేకానందగారు కూడా ఈ విషయం చెప్పారు. ధృవపదం వరకు చేర్చగల్గినది ఈ యోగం తప్ప మరే యోగమూ చేర్చలేదు. కేవలం ఆజ్ఞాచక్రం వరకే హఠయోగం చేర్చగల్గుతుంది. ఈ చక్రం రెండు కనుబొమ్మల నడుమ ఉంటుంది. దానికిమించి ముందుకు నడిపించే శక్తి రాజయోగమునకు మాత్రమే ఉంది.

నీ ఉత్తరానికి జవాబు కొంత ఆంగ్లంలో కూడా వ్రాశాను. అది స్వామి వివేకానంద ఇచ్చిన సందేశం (Dictate). ఒకవేళ అర్థంకాకపోతే మాస్టర్ సాహెబ్‌గారిచేత అర్థం చెప్పించుకోవచ్చును కాని ఇతరులు ఎవ్వరికీ చెప్పాల్సిన అవుసరం లేదు. ఏ వ్యక్తి యొక్క ప్రాణ రక్షణకైనా చేయవల్సిన విధానం ఈ విధంగా ఉంటుంది. ఆ వ్యక్తి చుట్టూ తన ఇచ్ఛాశక్తితో రక్షణకోసం కల్పనచేస్తూ, అది ఆ వ్యక్తికి రక్షణ కల్పిస్తుంది అని సంకల్పం చేసుకోవటంతోపాటు అప్పుడప్పుడు దానిని జ్ఞాపకం చేసుకోవాలి. అంతేకాని నిరంతరం దానిని గురించి ఆలోచించాల్సిన పని లేదు. మారీచుడు లేడి రూపంలో అరణ్యానికి వచ్చినప్పుడు శ్రీరామచంద్రుడు దానిని వేటాడటానికి వెళ్ళగా తర్వాత లక్ష్మణుడు కూడా సీతాదేవి రక్షణలో లేకుండా వెళ్ళవలసివచ్చినప్పుడు, లక్ష్మణుడు ఇటువంటి వలయాన్నే సీతాదేవి చుట్టురా ఏర్పాటుచేశాడు. ఈరోజు సుఖదేవానంద ముముక్షు ఆశ్రమంలో ఒక ఉత్సవం ఉంది. ఇది మూడు నాలుగు రోజులు కొనసాగుతుంది. దాని కొరకు ప్రజలు పదిహేను వేల రూపాయలు విరాళంగా ఇచ్చారు. మహాత్ములైనవారి ఉపన్యాసాలు ఉంటాయి. ఒకాయన ఒప్పించిన కారణంగా ఈరోజు నేను కూడా వెళ్ళి ఒక గంటసేపు ఉండదలచాను. మెదడు అలసిపోకుండా చూసుకుంటూ పని చేయాలి.

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 74

లఖీంపుర్,

09.12.1949

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

వినయపూర్వక నమస్కారం. తమరు దయతో వ్రాసిన ఉత్తరం చేరింది. దానిని చదివి చాలా సంతోషించాను. పెద్దక్కపట్ల తమకు కలిగిన అపార ప్రేమను చూశాక, ఆమెకు కలిగిన భాగ్యమే అందరిపట్ల ఆ 'మాలిక్' యొక్క కృప

కలుగుతూ ఉండాలని నేను ఆ పరమదయాళువైన 'మాలిక్'ను ప్రార్థిస్తున్నాను. మరి తమ మిషన్‌లో 'తమ' కృపతో హృదయపీడిత రోగులకు (అనగా దైవం కొరకు హృదయంలో తపన చెందేవారు అని అర్థం) కూడ ఎంతో సరళమైన విధానం వెలువడింది.

సాధ్యమైనంతవరకు 'మాలిక్' యొక్క జ్ఞాపకం గురించిన విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని 'తమరు' వ్రాశారు. నాలో ఊపిరి ఉన్నంతవరకు 'వారి' జ్ఞాపకం ఏదో విధంగా ఉండితీరుతుందని నేను తమకు విశ్వాసం కల్పిస్తున్నాను. నేను ఆ రోజున తమకు వ్రాసినది –"లోపల ఏదో కళ్ళు తెరుచుకున్నట్లుగా అనిపిస్తోంది" అను దానికి అర్థంకాని లేదా అనుభవంకాని నాకు కూడా ఎందుకోగాని తెలియకుండా ఉంది. అయితేమాత్రం ఆ రోజున సిట్టింగ్ తీసుకున్నవారికి కూడా బాగా లాభం చేకూరి ఉంటుందని నా విశ్వాసం. తమరు నిద్ర గురించి ప్రశ్నించి ఉన్నారు గదా, దాని గురించి చెప్పాలంటే షాజహాన్‌పుర్ వెళ్ళకముందు, అక్కడి నుంచి తిరిగి వచ్చిన తరువాత 6,7 రోజుల పర్యంతం నిద్రపోతూనే మెళుకువగా ఉన్నట్లు అనుభవం కలుగుతూ ఉండేది. అయితే ప్రస్తుతానికి 'మాలిక్' దయతో 5,6 గంటలపాటు మెళకువ రానంత గాఢంగా నిద్ర పట్టుతోంది. ఇంత దీర్ఘమైన నిద్రను బహుశా నేను ఇంతకుముందు ఎప్పుడూ అనుభవించి ఉండలేదు. అవునుకాని, ఇప్పుడు ఆ విధంగా నిద్రపోవటానికి ఇష్టం ఉండటంలేదనే మాట మాత్రం వాస్తవం. సాధ్యపడినంతవరకు నిద్రను దరిజేరనివ్వకుండా ఉంటున్నాను. నేను ఇలా ఎందుకు చేస్తున్నానో అది 'తమ'కు తెలిసినదే. 'పని' ప్రారంభించిన మొదలుగా నిద్ర గాఢంగా అలముకుంటోంది. అప్పుడప్పుడు ఒకటి రెండు రోజులు, ఇప్పుడు కూడా అదే విధంగా జరుగుతూ ఉంది. ఇది రాత్రంతా నిద్రలేకుండా ఉండటంవల్లనే అనుకుంటాను. ఆ నిద్ర కూడా స్వల్పమే. **ముక్తి (లిబరేషన్) ప్రాప్తించేది మన 'మిషన్'లో తప్ప మరే విధానంలో ప్రాప్తించదనేది అక్షరాల నిజం.**

నాకు చెప్పినటువంటి 'పని'ని తమ లేఖలో వ్రాసిన పద్ధతిలోనే ప్రారంభించాను. కుట్ర (Plot)ను భగ్నం (Destroy) చేసే పనిని కూడా నేటి నుంచి ప్రారంభిస్తున్నాను. దానికి సంబంధించి తగిన విధానం కూడా లేఖలో వ్రాయగలరు. పూజ్యులు శ్రీ స్వామీజీ –"ఈ విషయం భారతదేశ మంతటా నెలకొని ఉన్నది" అని వ్రాసినట్లుగానే, నేను 'P' లో ఆ రోజున ఆ విషయం చూసినప్పుడు, అదే రోజున భారతదేశమంతటా అదే విషయం, ఇంకా ఎరుపుగా నిరంతరం కనిపించింది. నేను దానిని నా భ్రమగా భావించి దానిపై దృష్టిపెట్టలేదు. క్షమించండి. ఇకమీదట సావధానంగా ఉంటాను. నాకు హృదయమంటూ ఉంటే దానిలో ఇది నా పిరికితనమై ఉండవచ్చని శ్రీ స్వామీజీ చరణాలకు నా వినమ్ర ప్రణామమును నివేదన చేయండి. అయితే ఇప్పుడు నా శక్తి ఏమిటో 'తమ'కు తెలియును గదా! ఇప్పుడింక గుండె ధైర్యం ఎలా ఉండాలో అలాగే ఉంటుంది. నా 'మాలిక్'కు గాయం కలిగేటట్లుగా, ఈ బీదరాలువలన ఇటువంటి తప్పిదం జరగకుండా ఉండాలని నేను నా 'మాలిక్'ను సదా ప్రార్థిస్తాను. ఆ విధంగా ప్రయత్నిస్తాను కూడ. అందుకు నాకు తగిన శిక్ష గురించి నేను భయపడను కాని 'మాలిక్' హృదయం గాయపడటం నేను సహించలేను. ఆ విధంగా జరగబోదు అని నాకు సంపూర్ణ విశ్వాసం ఉంది. "He has fatherly relation with you" అనగా "వారికి నీ తండ్రిగా బాంధవ్యం ఉంది" అని స్వామీజీ అన్నారు. అయితే నాకు మాత్రం ఇప్పటికీ శాంతి లేదు. ఇంకా చేయాల్సినది చాలా ఉంది. నేను 'వారి' నుంచి ఎటువంటి ప్రేమను ఆశిస్తున్నానో, అటువంటి ప్రేమనే నేను స్వయంగా నా 'మాలిక్' పట్ల ప్రదర్శించాలనుకుంటున్నాను. ఆ విషయం నా 'మాలిక్'కు బాగా తెలుసు. ఏదో ఒక రోజున నేను తప్పకుండా విజయం సాధిస్తాననే దృఢ విశ్వాసం నాకు ఉన్నది. అవును, అది జరిగి తీరుతుంది. 'మాలిక్' యొక్క పనిలో అది ఏ ఆటంకాన్ని కలుగజేయదు. ఈ విషయంలో 'మాలిక్'ను ఎంతగా పొగిడినప్పటికీ అది స్వల్పమే. 'వారి'ని ప్రశంసించటానికి మాటలు చాలవు. పూజ్య శ్రీ బాబూజీ! తమరు వ్రాసిన (Self surrender) ఆత్మ శరణాగతి యొక్క దశలు చాలా అద్వితీయమైనవి. ఇంకేమి చెప్పను? తమరే అద్వితీయమైన వారై ఉండగా 'తమ' నోటి నుండి వెలువడే ప్రతి మాట అద్వితీయం కాకుండా ఎలా ఉంటుంది. నాకు 'ఒకటి' తప్ప మరేదీ తెలియనటువంటి అమాయకురాలిని నేను.

నా ప్రస్తుత స్థితి మూగవాని గొంతులో బెల్లంలాగా ఉంది. అది చాలా బాగుంది. ఎందుకో తెలియదుకాని అప్పుడప్పుడు నేను 'తమ'కు సిట్టింగ్ ఇవ్వాలను తలంపు కలుగుతూ ఉంది, అలా ఇచ్చినపుడు ఎటువంటి మంచి స్థితి ఏర్పడుతూ ఉందంటే, నేను స్వయంగా పూజ చేసినప్పుడు కూడా కలగనటువంటిదిగా ఉంటున్నది. ఎక్కువగానే ప్రశాంత స్థితి ఉంటున్నది. రోజంతా ఏవైనా ఆలోచనలు రావటంకాని, మరేమైనా విషయాలు దృష్టికి రావటంకాని జరగటంలేదు.

అమ్మ తమకు ఆశీస్సులు తెలుపుతూ ఉంది. అంతేగాక తమరు అప్పుడప్పుడు మమ్మల్ని జ్ఞాపకం చేసుకుంటూ ఉండమని కూడా చెబుతూ ఉంది.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 75

లఖీంపుర్,

15.12.1949

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తర మొక్కటి తమకు చేరే ఉంటుందను కుంటాను. ఇక్కడ అందరూ క్షేమం. తమరు కూడా కుశలమేనని భావిస్తాను. కేసర్‌కు గొంతు క్రింద ఏర్పడిన గడ్డ తొలగిపోయింది. 'మాలిక్' దయతో అంతా బాగుపడింది గాని కేవలం కొంత గాయం మిగిలి ఉంది. 'మాలిక్' కృపతో నా ఆత్మికదశ బాగానే ఉంది కాని అనుభూతి కొంచెం అల్పంగా ఉంటున్నది. దానివలన చలి – వేడి అనగా ఋతువుల గుర్తింపు కూడా దాదాపుగా లేనట్లుగానే ఉంటున్నది. చలిగా ఉందన్న ధ్యాస కూడా కలగటంలేదు. అయితే శరీరం వణికినప్పుడు ఒక పులకరింతలాగా వచ్చి కొంతసేపు చలివేస్తూ ఉందన్న భావం కలగ్గా మళ్ళీ వెంటనే మర్చిపోతున్నాను. అలవాటు ప్రకారం వెచ్చదనం కూర్చే దుస్తులు ఎలా తొలగించివేస్తానో, అదే విధంగా మళ్ళీ వాటిని ధరిస్తున్నాను. అప్పుడప్పుడు హృదయం నిరుత్సాహంగా ఉంటోంది. అది ఎందుకో తెలియదు. కొద్ది రోజుల నుంచి ఏమని తలపిస్తూ ఉందంటే, ఒక మనసు అన్ని పనులూ నిర్వహిస్తూ ఉండగా మరో మనసు 'మాలిక్' విషయంలో పూర్తిగా మునిగిపోయినట్లుగా ఉంటోంది. ఇదే విధంగా ఒక మనస్సు గాఢ నిద్రలో మునిగిపోయి ఉంటే, మరో మనస్సు అప్పుడు కూడా మేల్కొని ఉన్నట్లుగానే అనిపిస్తోంది. ఈ కారణంగా ఉదయం నిద్రలేవగానే మెదడుకు విశ్రాంతి లభించినదా అని కూడా తెలియడంలేదు. ఇటువంటి దశయే రోజంతా అనుభవమవుతోంది.

'పని' కొంతవరకు జరుగుతూ ఉంది. అయితే ఎందుకో తెలియదుగాని 3, 4 రోజుల నుండి '**P**' తాలూకు పని చేయటానికి మనస్సు నిమగ్నం కావటంలేదు. మాటిమాటికీ దృష్టి మరలుతోంది. ఇటీవల నేను ప్రతి ఒక్కరికీ సేవకురాలిని అని నాకు అనిపిస్తోంది. అంతేగాకుండా నాకు ఎవ్వరిలోనూ చెడు కనిపించటంలేదు. ఎందుకంటే, ఆ దశ ఇప్పుడు ఇలా ఉంది: చెడ్డవారిని ఎవరినైనా వెదకాలి అని ప్రయత్నిస్తే, చెడ్డవారు ఎవరూ దొరకలేదు. నా హృదయంలో వెదకి చూస్తే నాకంటె చెడ్డవారు ఎవరూ లేరు.

అయితే నాకు నేనుగా ఇప్పుడు ఏమీ చెప్పలేను. ఎందుకంటారు? ఆ విషయం తమకు స్వయంగానే తెలియును గదా! 4, 5 రోజుల తర్వాత నిన్న 'P' తాలూకు పనిమీద మనస్సు బాగా లగ్నమైంది. ఈ నిద్రస్థితి చాలా రోజుల నుంచి ఉన్నది కాని ఇప్పుడు అది అవగాహనకు వచ్చింది. కేసర్, బిట్టో తమకు ప్రణామం చెప్తున్నారు. అమ్మ ఆశీస్సు లందిస్తోంది.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 76

లఖీంపుర్,

29.12.1949

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా రెండు ఉత్తరాలు అందే ఉంటాయను కుంటాను. ఇక్కడ అందరూ కుశలమే, తమరు కూడా కుశలమేనని భావిస్తాను. తమకు మళ్ళీ ఉత్తరం వ్రాయటానికి ఎందుకు మనసుపడిందో తెలియదు, అందుకు క్షమించండి. 'మాలిక్' దయతో నా ఆత్మిక దశ బాగానే కొనసాగుతోంది. ఇంకా చెప్పాలంటే సదా అదే విధంగా మంచిగా సాగిపోతుందని నా దృఢ విశ్వాసం. ప్రస్తుతం నా స్థితి ఎలా అయిపోయిందంటే, నా శరీరం యొక్క స్పృహ కూడా దాదాపు లేకుండా పోయింది. ఇంకొక విషయం ఏమిటంటే, ఇంతకుముందు పూజ చేయటానికి కూర్చున్నప్పుడు, నా ఎదుట 'తమరు' కూర్చొని సిట్టింగ్ ఇస్తూ ఉన్నట్లుగా భావించేదానను; కాని ఇప్పుడు, అప్పుడప్పుడు ఆ విధంగా చేయటానికి మనస్కరించటంలేదు. ఇప్పుడు పరిస్థితి ఎలా ఉందంటే, ఏ కన్నయితే మరోకన్నును చూడటానికి సిద్ధపడిందో, అది ఇప్పుడు శిరస్సు నుంచి పాదాలవరకు ఒకటైపోయింది. నిద్రను గురించి చెప్పాలంటే, ఒక విధంగా గమనించినట్లయితే రాత్రి నిద్ర నుంచి మేల్కొన్నపుడు నా స్థితి ఎలా ఉన్నదంటే, చాలా ఉన్నత స్థితి నుంచి దిగి వచ్చినట్లుగా అనిపిస్తోంది. అది ఎంత గాఢంగా ఉంటుందంటే, ఎవరైన నన్ను మేల్కొల్పటానికి ప్రయత్నించినట్లయితే అది నాకు ఒక విధమైన బాధను కలిగించవచ్చు. కాని మరొక విధంగా గమనించినట్లయితే, రాత్రి అంతా మేల్కొనే ఉంటున్నాను. ఒక స్థితి చాలా బాగుంది అనిపిస్తోంది కాని నేను దానిని వ్రాయడంలేదు కాని నేను అక్కడికి వచ్చినపుడు తమకు స్వయంగా తెలియజేస్తాను. ఇప్పుడు పూర్తిగా శూన్యత్వం అనుభవమవుతూ ఉంది. 'మాలిక్' అయితే నాపట్ల సదా కృపనే అనుగ్రహించారు, అదే విధంగా అనుగ్రహిస్తారు కూడ. నిద్ర నుంచి మేల్కొన్నప్పుడు కలిగిన చాలా ఉన్నతమైన స్థితి, ఇప్పుడు రోజంతా ఉంటున్నది. ఎప్పుడైనా పులకరింత కలిగినప్పుడు, ఉన్నత శ్రేణికి చెందిన స్థితి కలుగుతున్నట్లు అనిపిస్తోంది.

పని చాలా బాగా జరుగుతోంది, ప్రత్యేకించి చెప్పవలసిందేమీ లేదు. కాని తమరు దయచేసి తప్పనిసరిగా అప్పుడప్పుడు పర్యవేక్షణ చేస్తూ ఉండండి. పెద్దక్క (శకుంతల) ఇక్కడకు వచ్చింది. ఆమె, ఆమెతోపాటు కేసర్, బిట్టో తమకు ప్రణామం తెలుపుతున్నారు. అమ్మ ఆశీస్సు లందిస్తోంది. నిన్నటినుంచి తనకు అవిశ్రాంతిగా ఉన్నట్లనిపిస్తోందని కేసర్ చెబుతున్నది. తనకు తేలికదనం కూడా బాగా అనుభవమవుతూ ఉంది.

చిన్నవారైన సోదర సోదరీలకు నా ప్రేమను, నాయనమ్మగార్కి నా ప్రణామాలు తెలియజేయండి.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 77

షాజహాన్‌పుర్,

04.01.1950

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. నీవు డిశెంబరు 15వ తేదీతో వ్రాసిన ఉత్తరం చేరింది. శీతాకాలం శెలవుల్లో నేను నా గ్రామానికి వెళ్ళినందువలన ఇంతకంటె ముందుగా జవాబు వ్రాయటానికి సమయం చిక్కలేదు. ఆలస్యానికి అదే కారణం. అప్పుడప్పుడు హృదయం నిర్లిప్తంగా (ఉదాసీనంగా) ఉంటుందని వ్రాశావు. దీనికి చింతిచాల్సిన అవసరంలేదని నేను అనుకుంటున్నాను. అయితే భగవంతుని కృపతో నీలో కలిగిన ఒక స్థితి అని చెప్పవచ్చు. ఈ స్థితి కొంచెం ఉధృతిదాల్చినపుడు (బలంగా ఉన్నప్పుడు) నీకు ఉదాసీనత అనుభవమవుతుంది. ఈ స్థితినే "ఉదాసీనత" స్థితి అని

అంటారు. అభ్యాసి యొక్క మానసిక స్థితి ఎలా ఉండాలంటే, మరుగుదొడ్డికి వెళ్ళివచ్చిన తర్వాత మళ్ళీ దాని ధ్యాస ఏవిధంగా ఉండదో, ఏపని చేసినప్పటికీ మళ్ళీ దాని గురించి అంటీ అంటనట్లుగా ఉండాలి. అనగా ఆ పని అంతతటితోనే సరిగాని మళ్ళీ పునరాలోచన ఉండరాదు. ప్రాపంచిక కార్యకలాపాలు ఏవైనా సరే, వాటిని నిర్వహించిన తర్వాత వాటిమీద ఆలోచన పెట్టకుండా ఉండాలి. దీనినే 'ఉదాసీనత' (నిర్లిప్తత) స్థితి అంటాము. ఈరోజుల్లో ఒక ఉదాసీన సమూహం కూడా ఉంది కాని అది నామమాత్రమే. బహుశా ఈ స్థితి వారిలో ఏ ఒక్కరికి కూడా ఉండి ఉండకపోవచ్చు. 'ఒక్క మనస్సే అన్ని పనులూ చేస్తోంది' అని నీవు వ్రాశావు. నీవు విశ్వసిస్తున్నది సరైనదే. ఒక గ్లాసులో నీరు నింపి వేగంగా విసిరివేసినట్లయితే దాని ముఖం ఒకటి విసిరేవారివైపు, రెండవైపు మరోవంక ఉంటుంది. అదే విధంగా ఎవరి ముఖమైతే (దృష్టి) దైవం (మాలిక్) వైపు ఉంటుందో వారు దైవాన్ని స్మరిస్తూ ఉంటారు; ఎవరి ముఖమైతే ప్రాపంచికంగా ఉంటుందో వారు ప్రాపంచిక విషయాలను స్మరిస్తూ ఉంటారు. ఈ విషయాన్ని నేను చాలా క్లుప్తంగా వ్రాశాను, కాని దానిలోని తాత్త్వికతను వివరించలేదు. హృదయంలో ఎప్పుడైతే జాగృతి / చైతన్యం కలుగుతుందో, అప్పుడు అతని (అభ్యాసి) దృక్పథం ఈశ్వరునివైపు మరల్తుంది, అవసరమైనపుడు ప్రాపంచిక దృష్టి కలుగుతుంది. ఇంక చల్లదనం యొక్క అనుభూతి తక్కువ కావటానికి కారణం ఏమంటే, దృష్టి ఊర్ధ్వంగా ఎగసిపోతూ ఉండటంవలన ఈ చలియొక్క అనుభూతి మందగించింది. నాకయితే బాగా చలి వేస్తోంది. దాని కారణంగా చాలా ఆలస్యంగా నిద్ర లేస్తున్నాను, ఏపనీ చేయలేక పోతున్నాను.

ఒక విషయంలో నాకు చాలా కష్టం కలుగుతోంది, దానికి నేను ఏమీ చేయలేకపోతున్నాను. అది ఏమిటంటే, మీ తండ్రిగారి ఆర్థిక ఇబ్బందులవైపు దృష్టి మరలినపుడు, చాలా బాధ కలుగుతోంది. నేను దైవాన్ని ప్రార్థించాను, కాని ఎందుకో 'అతడు' నామొర ఆలకించలేదు. ఇది మన కారణంగానైనా కావచ్చు లేదా ఏదైనా ఇతర కారణంవల్లనైనా కావచ్చు. ఒక్క యదార్థం ఏమిటంటే, అది ఈశ్వరునికి సంబంధించనదై ఉంటే, 'అతడు' దానికి తప్పనిసరిగా స్పందిస్తాడు. ప్రార్థించాల్సిన అవసరం కూడా కనిపించదు. ఈ కష్టం తొలగిపోవటానికి నీవే ప్రార్థించు. 'అతడు' నీ మొరాలకించి ఏదైనా మేలు చేయవచ్చు. ఇంత స్వల్పమైన పని కూడా నా వలన జరగనందుకు నేను సిగ్గుపడుతున్నానని నీకు నిజం చెబుతున్నాను. మీ తల్లిగారికి ప్రణామములు.

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 78

లఖీంపుర్,

08.01.1950

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం ఈ రోజు చేరింది, చదివి చాలా సంతోషించాను. బసంత్ పంచమి ఆహ్వానానికి తమకు ధన్యవాదాలు. 'మాలిక్' కోరుకున్నట్లయితే మేమందరం ఉత్సవానికి హాజరవుతాము. 'మాలిక్' కృప ఇప్పటివరకూ ఉంది; ఇక ముందు కూడా ఉంటుంది. దానిలో సందేహం లేదు. భగవంతుని కృపతో ఆత్మిక దశ బాగానే జరుగుతోంది. ఇక ముందు జరుగుతుంది కూడ. ఉదాసీనత (నిర్లిప్తత) దశలో ఎటువంటి విచారం కలగటం లేదు. అదేమిటోగాని ఒక్కసారిగా ఆ ఉదాసీన స్థితి కలుగుతుంది. అప్పుడప్పుడు స్థితి వెంటనే వృద్ధి చెందుతోంది. ఒక్కొక్కసారి తరచుగా అది రోజంతా నెలకొని ఉంటుంది. ఎక్కువగా స్థితి ఎలా ఉంటుందంటే, ప్రతి విషయంలోను ఆలోచన పేరుకు మాత్రమే ఉంటుంది. పనిని గురించిన ఆలోచనైతే అది ఎడతెగకుండా ఉంటున్నది. పూజ్య బాబూజీ, ఈ పూజను గురించి ఎంతగా ప్రశంసించగలను! (అనగా ఎంత ప్రశంసించినా అది తక్కువగానే ఉంటుంది) ఏ స్థితులు ప్రాప్తించుకోవటానికి సంవత్సరాలుగా అభ్యాసం మరియు ప్రార్థన చేశానో, అవి ఇప్పుడు

కేవలం 'మాలిక్' యొక్క కృపతోనే వాటంతట అవే ఏర్పడి వృద్ధి చెందాయి. స్వభావం మరియు అలవాట్లలో కొంత మార్పు కలగటమే కాకుండా ఇంకా మార్పు వస్తూ ఉన్నట్లు గమనిస్తున్నాను. నాకు జ్ఞాపకం ఉన్నంతవరకు డిశంబర్ 15 తర్వాత నేను వ్రాసిన రెండు లేక మూడు ఉత్తరాలు తమకు అంది ఉంటాయానుకుంటాను. వాటిలో చివరిది జనవరి 1 లేదా 2వ తేదీకే చేరి ఉండాలి. ఒక రోజున పని చేస్తూ ఉండగా ఇండియా (భారత్) లో 'ఓమ్' శబ్దం వంటిది కనిపించింది. దీనిని గురించి నేను బాగా వివరించలేను, ఎందుకంటే అది ఇప్పుడు జ్ఞాపకం లేకపోవటమేకాక ఈ శబ్దాన్ని గురించిన ధ్యాస బహుశా ఇప్పుడు లేకపోయినందువల్లనే కావచ్చు. ఈ విషయం ఇప్పుడే జ్ఞాపకం వచ్చిన కారణంగా నేను వ్రాస్తున్నాను. కాని ఆ సందర్భంలో నేను దానిపై దృష్టిపెట్టనందువలన జ్ఞాపకం ఉన్నంతవరకు మాత్రమే వ్రాస్తున్నాను.

పూజ్య బాబూజీ, ఎందుకోగాని, ఇదివరకు నిద్ర నుంచి లేవగానే 'మాలిక్' కృపతో మొట్టమొదట 'మాలిక్' గురించిన ధ్యాస, 'అతని' జ్ఞాపకం మాత్రమే కలుగుతూ ఉండటం ఒక అలవాటుగా ఉండేది. ఇప్పుడు అది వెంటనే కలగటంలేదు. మేల్కొన్న కొద్దిసేపటి తర్వాత ధ్యాసకు వస్తోంది. చాలా రోజులుగా ఈ విషయంలో ఎక్కువగా ప్రయత్నించాను కాని ఇప్పటికీ సఫలం కాలేదు. పగలు ఈ విధంగా జరుగుతోంది. ఈ కారణంగా ఎక్కువగా విచారం కలుగుతోంది. ఇంకొకరకంగా చెప్పాలంటే, ఉదయమే ఇది దృష్టికి రాకపోగా రోజంతా ఇదే పరిస్థితి ఉంటోంది. పని మాత్రం బాగా జరిగిపోతున్నది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమను, నాయనమ్మకు ప్రణామం తెలియజేయండి. అమ్మ తమకు ఆశీస్సు లందిస్తోంది.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 79

లఖీంపుర్,
12.01.1950

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం ఒకటి తమకు అందే ఉంటుందను కుంటాను. ఇక్కడ అందరూ కుశలమే. తమరు కూడా కుశలమేనని భావిస్తాను. నా ఆత్మిక దశను గురించి ఇదివరకే వ్రాసాను. అయితే ఇప్పుడు 3,4 రోజుల నుండి ఈ దశ కొనసాగుతూ ఉంది. అది ఏమిటంటే, నేను ఎప్పుడూ పూజ చేయలేదు, ఇప్పుడు కూడా చేయడంలేదని అనిపిస్తోంది. ఇప్పుడు ఏ పూజ లేనట్లుగాను; పేదరికంగాని, ధనికత్వంగాని లేనట్లుగాను అనిపిస్తోంది. జ్ఞాపకం యొక్క పరిస్థితి ఎంత దయనీయంగా ఉందంటే, ఇప్పుడు శ్వాస పీల్చుకోవటం కూడా వెంటనే జ్ఞాపకం ఉండటంలేదు. దీని వలన ఎప్పుడైనా అసౌఖ్యం కలిగినప్పుడు, జ్ఞాపకం వచ్చి వేగంగా శ్వాస తీసుకొని శరీరం నుండి ఆ అసౌఖ్యాన్ని తొలగించుకుంటున్నాను. శ్రీ బాబూజీ, ఇప్పుడు నాకు సౌకర్యం, అసౌకర్యాల గురించిన ఆలోచనలు లేవు. ఇప్పుడు నాకింక 'మాలిక్'కు నాపై ఉన్న అనుగ్రహానికి మించి మరే ఇతర సుఖమూ లేదు. అదేకాదు 'మాలిక్' యొక్క ఏమాత్రం నిర్దయ నాపట్ల ఉన్నప్పటికి దానికి మించిన బాధ లేదు. ఇటీవల నేను పూర్తిగా శూన్యంగా ఉంటున్నందు వలన అవిశ్రాంతత తరచుగా తీవ్ర రూపం దాల్చుతున్నది. స్థితి, గత 2, 3 రోజుల నుండి ఒక వింతైన విలాపం వంటి దశ ఉంటోంది. నిన్న పని చేస్తున్న సందర్భంలో ఒక్కసారిగా '**P**' లో భారతదేశపు త్రివర్ణ పతాకం రెపరెపలాడుతున్నట్లుగా కనిపించింది. 'మాలిక్' యొక్క కృప మరియు శక్తితో పని బాగా జరుగుతోంది. అమ్మ తమకు ఆశీస్సులు తెలుపుతోంది. జనవరి 21వ తేదీన నేను తమ సన్నిధిలో ఉంటాను.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

# ఉత్తరం సంఖ్య - 80

షాజహాన్‌పుర్,
12.01.1950

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నీవు 29.12.1949న వ్రాసిన ఉత్తరం చేరింది. దానిలో నీవు "నీ శరీరం యొక్క స్పృహ కూడా దాదాపుగా లేకుండాపోయింది" అని వ్రాశావు. ఇది చాలా మంచి స్థితి. దీనిని "లయావస్థ" అని అంటారు. ఫారశీ భాషలో దీనినే 'ఫనా' అని అంటారు. భగవంతుడు తలపెట్టితే ఇప్పుడు నడుస్తున్న ఈ స్థితి తర్వాత ఇంకా మంచి స్థితి వస్తుంది. అది ఎప్పుడు వస్తుందో అప్పుడు చెబుతాను కాని ముందుగానే చెప్పదలచుకోలేదు. నిద్రపోతున్నప్పుడు ఎవ్వరూ నిన్ను హఠాత్తుగా మేల్కొల్పరాదు. ఎవ్వరికైనా అలా చేసినట్లయితే అప్పుడు నెలకొని ఉన్న దృష్టి హఠాత్తుగా తొలగిపోవటమే గాక, అతనికి (అభ్యాసికి) ఆ హఠాత్‌పరిణామానికి విస్తుపోయి (Shock) చాలా కష్టం కలుగుతుంది. అందుచేత ఏ ఒక్క అభ్యాసినీ హఠాత్తుగా మేల్కొల్పటం తగదు. నాకు సంబంధించినంతవరకు పరిస్థితి ఏమంటే, నేను మేల్కొనేటప్పుడు ఎవ్వరైనా నా మంచం కుదిపినా నాకు చాలా ఇబ్బంది కలుగుతుంది.

నీవు 8.01.1950న వ్రాసిన ఉత్తరం చేరింది. దానిలో "ఒక రోజున పనిచేస్తూ ఉండగా ఇండియాలో 'ఓమ్' శబ్దం వంటిది కనిపించింది" అని వ్రాశావు. ఈ అనుభవం సరైనదే. **ఈ సమయం ఎటువంటిదంటే, కొన్ని రానున్న శతాబ్దాలకు కూడా ఇటువంటి సువర్ణావకాశం (సమయం) ఆసన్నం కావటం దుర్లభం అని చెప్పవచ్చు. 'దివ్యశక్తి' తన స్వచ్ఛమైన రూపంలో ఎవ్వరో ఒక "మహోన్నత వ్యక్తి" (Great Personality) రూపం ద్వారా దిగి వచ్చింది. దీనికి నిరూపణ ఏమిటంటే, ఎవ్వరైనా సరే ఏ ప్రదేశంలోనైనా కూర్చుని దృష్టి సారించి, ఎవ్వరిలోనైతే స్వచ్ఛమైన రూపంలో దివ్యశక్తి ప్రవేశించిందో, అటువంటి మహాపురుషుని నుంచి నేను ఆధ్యాత్మిక ప్రయోజనం పొందుతున్నాను అని భావించుకుంటే, వారికి వెంటనే లాభం చేకూరుతుంది. ఇటువంటి 'ఓమ్' శక్తి సమేతంగా ఇంతకుపూర్వం ఏ మహాత్ముడూ రావటం సంభవించి ఉండకపోవచ్చు. అయితే ఈ విషయంలో నా గురు మహరాజ్‌కు మినహాయింపు ఉంది. ఎందుకంటే, వారిలో ఇటువంటి శక్తిని ఉద్భవింపజేయగల సామర్థ్యం ఉంది. మరి వారి శక్తిని గురించి ఏమని కీర్తించాలి!** ఇటువంటి శక్తి దిగి వచ్చినప్పుడు విధ్వంసం కూడా జరుగుతుంది. మరి దానిని అంటిపెట్టుకున్నవారికి ప్రయోజనం కూడా అపరిమితమైనదిగానే ఉంటుంది. మహాభారత కాలంలో, ఈ శక్తి పరిపూర్ణ రూపంలో బహిర్గతం కాలేదు. ప్రభావం అయితే ఉంది. 'దానికి' విధ్వంసం, నిర్మాణం రెండింటి మీద పరిపూర్ణ ఆధిపత్యం ఉంది. అయితే ఆ సమయంలో ఆ శక్తి తుంపరలుగా విడుదలై పనిచేయటం జరిగింది. ఈ కారణంగా మహాభారత సంగ్రామం విజృంభించి జరగలేదు. ఆ సమయానికి అంత శక్తి మాత్రమే సరిపోయినదిగా ఉంది. అప్పుడు దానికిమించి ప్రయోగించటం జరిగినట్లయితే ప్రపంచ వినాశనం జరిగి ఉండే పరిస్థితి ఏర్పడి ఉండేది. అందుకు ఎంతోకాలంపట్టి ఉండేది. అయితే దానితోపాటుగానే నిర్మాణం కూడా కొనసాగింది. మహాప్రళయ సమయంలో కూడా సమస్త ప్రపంచాన్ని వినాశనం చేయటానికి ఏదో ఒక శక్తి పనిచేస్తుంది. ఆ సమయంలో నిర్మాణ కార్యక్రమం ముగిసిపోతుంది. ఏదో ఒకరోజు అందరూ మరణించవలసియే ఉంది కనుక చదవటం వ్యర్థం అని తులసీదాసుగారు వ్రాశారు. ఎన్ని రోజులైతే అందరూ జీవించవలసి ఉందో అంతవరకు చదవటం తప్పనిసరి అని వారికి చెప్పవలసి ఉంది. కనుక వారి యొక్క ఈ అభిప్రాయాన్ని నీవే సవరించు. ఏ ఒక్కరిలోనో ఉన్న అభిప్రాయం లేదా దృక్పథాన్నిబట్టి ఇతరుల మీద దాని ప్రభావం ఉంటుంది.

ఇంకొక విషయం కూడా నీకు చెబుతున్నాను – అది ఏమిటంటే, భగవాన్ శ్రీకృష్ణుని అవతారం మహామాయ స్థానం నుంచి సంభవించింది. దీనిని మన గురుమహరాజ్ ఎక్కడో ఒకచోట ప్రస్తావించి ఉన్నారు. **ఈ స్థానంలో (మహామాయ) మాయ యొక్క శక్తి ఒక వలయాకారంలో తీవ్రమైనదిగా (సుడిగుండంలాగా) ఉంటుంది. దానిలో,**

**ఇష్టప్రకారం వినియోగించగల మహత్తర శక్తి ఉంటుంది. అందువల్లనే శ్రీకృష్ణ భగవానునిలో అంత శక్తి నిగూఢమై ఉంది. ఈ శక్తికి సాటియైన శక్తిని మరెవ్వరూ కలిగి ఉండలేరు. అది ఎందుకంటే, ఆ శక్తి యొక్క సంపూర్ణ పరిపక్వస్థితితో శ్రీకృష్ణుడు అవతరించాడు. దీనికి ఇంకను పైన ఒక ఆధ్యాత్మిక క్షేత్రం ఉంది. అది భక్తులకు మాత్రమే సాధ్యపడుతుంది. అంతేగాదు అక్కడికి బహుకొద్దిమంది మాత్రమే చేరగలుగుతారు. అయితే అటువంటి పరిపూర్ణస్థితి కొన్ని వేల సంవత్సరాల తపఃఫలితంగా ఏ ఒక్కరినో వరిస్తుంది. శ్రీకృష్ణునికి మహామాయ వలయం మీద పరిపూర్ణ ఆధిపత్యం ఉండటమే కాకుండా నేను వివరించిన ఆధ్యాత్మిక క్షేత్రం మీద కూడా పాదం మోపాడు. కాని ఇప్పుడు పరిస్థితి దానికి విరుద్ధంగా ఉంది. ఇప్పుడు ఒక మహోన్నతుని ద్వారా భగవంతుడు తన పని జరుపుతున్నాడు. అతనికి 'ఆ' స్థితి (భూమా) మీద భగవంతుడు సంపూర్ణ ఆధిపత్యం ప్రదానం చేశాడు. అప్పటి సమయాను కూలంగా శ్రీకృష్ణ భగవాన్‌కు మహామాయక్షేత్రం మీద ఆధిపత్యం ఉంది. మరి ఇప్పుడు ఆ ఆధిపత్యం ప్రస్తుతం మహోన్నత వ్యక్తికి హస్తగతమై ఉంది.**

**గాంధీగారు మరణించిన తర్వాత అరవింద ఘోష్‌ను "గాంధీగారు మరణించారు గదా! ఇప్పుడు హిందుస్థాన్‌లో ఎక్కడైనా జ్యోతి (Light) ఉన్నదా?" అని ప్రశ్నించటం జరిగింది. దానికి సమాధానంగా ఆయన "ఉత్తర భారతదేశంలో ఆ జ్యోతి (Light) ఇంకను ఉంది" అని అన్నారు. దీనినిబట్టి కూడా ఏదో మహోన్నత శక్తి పనిచేస్తూ ఉన్నట్లు ధృవపడుతోంది. అరవిందఘోష్ ఒక మంచి మహాత్ముడని జగమంతా అంగీకరిస్తోంది. ఆయన బ్రహ్మాండ మండలం వరకు చేరగలిగారు కాని ఇప్పటివరకు దానిని దాటి ముందుకు వెళ్ళలేకపోయారు. అయితే ఆయన చాలా శ్రమించారు కనుక, వారిలో శక్తి చాలా ఉంది. మన సంస్థలోని అభ్యాసులు బాగా శ్రమించి నట్లయితే, అనగా నాకు పనిపెట్టకుండా వారంతటవారు పైకి ఎదిగితే, మన సంస్థలో కూడా అనతి కాలంలోనే (స్వల్ప కాలం) చాలామంది అరవిందఘోష్‌లు తయారవుతారని నేను భావిస్తున్నాను.** ఎవ్వరైనా తనకు తానుగా సాధన చేయటంవలన శక్తి తన వశంలో ఉంటుంది. ఈ స్థానం చాలా ఉన్నతంగా ఉంటుంది. శ్రీకృష్ణ భగవానుడు అర్జునునికి ఈ స్థానం నుంచే తన విరాట్ రూపాన్ని దర్శింపజేశాడు. మరి ఈ స్థితిని చేరటానికి మన సంస్థలో అడుగు ముందుకు పడటంలేదు, పైగా దీనిని చాలా తేలికగా తీసుకుంటున్నారు. ఇటువంటి గొప్ప అనుగ్రహప్రాప్తి నిర్లక్ష్యం కావటానికి మనమే బాధ్యత వహించాల్సి ఉంటుంది. దీనికి కారణాలు ఏమంటే – ఒకటి, మన తొందరపాటు యొక్క అలవాటు; రెండవది శీఘ్రాతి శీఘ్రంగా జనం (అభ్యాసులు) ముందుకుపోవాలని అనుకోవటమూ; ఇంక మూడవది ఏమిటంటే, వారు (అభ్యాసులు) గట్టిగా శ్రమించకపోవటం, త్యాగం చేయకపోవటమూ. **నా జీవితకాలంలో సాధ్యమైనంతవరకు వారిని ముందుకు నడిపించాలని నేను కోరుకుంటున్నాను. వారు కనీసం ఈ జగత్తులోకి రాకుండా పునర్జన్మరాహిత్యం పొందాలనీ, ఒకవేళ అది కూడా సాధ్యపడక పోయినట్లయితే మరుజన్మలోనైనా ఆధ్యాత్మికంగా పురోగతి చెందాలని, నేను కోరుకుంటున్నాను. ముఖ్యంగా నాకు ఒకటి చాలా ప్రియమైనది ఉంది, దాని కొరకు నిరీక్షిస్తూ ఉన్నాను. ఎప్పుడైతే ఈశ్వరునిపట్ల విశ్వాసం (Faith) బాగా ఉంటుందో అప్పుడు నా హృదయం అతని పురోగతి కోసం శీఘ్రంగా స్పందిస్తుంది. మరి దేని కోసం నిరీక్షిస్తూ ఉంటానో నాకు ఇప్పటికీ తెలియదు.** ఒకవేళ ఇది ఆలోచనలోకి వస్తే, ఎవ్వరైనా నన్ను ఆపాలనుకుంటేనే ఆగిపోతాను. ఈ విషయం నీకు తెలిసినట్లయితే నీవే ఉత్తరం వ్రాయి. అప్పుడు అది నాకు కూడా తెలుస్తుంది. ఎవ్వరైనా తగిన వ్యక్తి తటస్థపడితే నాకు నా గురు (లాలాజీ సాహెబ్) కృపతో లభించినట్టి నా యొక్క ఈ స్థితితో నేను సిట్టింగ్ ఇచ్చివేసేటటువంటి వేలంవెర్రి (తపన) కూడా నాలో ఉంది. నేను ఇప్పటికీ కోరుకుంటున్నది ఏమిటంటే, ఎవ్వరైనా ఈ హద్దుకు రాగలిగి ఉంటే నేను ఆ అవకాశాన్ని జారవిడువను. అయితే ఇప్పుడు దీని గురించి తపన తరిగిపోయింది. ఎందుకంటే, దీనికి ఒక మంచి అవకాశం నాకు దొరికింది. అది ఎప్పుడు అనుకుంటావు? అది ప్రకాష్ తల్లి (శ్రీ బాబూజీ మహరాజ్ సతీమణి) పరలోక ప్రయాణానికి సిద్ధపడుతూ ఉన్నప్పుడు. అది కూడా ఒక్క అయిదు లేక ఆరు సెకండ్ల సమయం మాత్రమే. నేను ఆమెకు ఈశ్వరీయ మండలం (Godly

Region) నుంచి సిట్టింగ్ ఇచ్చాను. దానికంటె ఉన్నత స్థానం నుంచి ప్రాణాహుతి ఇవ్వాలన్న ఆలోచనే నాకు రాలేదు. మరణం సంభవించాక ఒక్కసారైతే అది నా దృష్టికి వచ్చింది. కాని నాకు ఆజ్ఞయే అందలేదు. నేను దీనినంతటినీ నీకు వ్రాయటానికి ఎందుకు మనస్సు కలిగిందో నాకు తెలియదు. ఇది నీకు వ్రాయవలసిన జవాబుతో సంబంధంలేని విషయం.

**స్వామి వివేకానంద అంతర్వాణి (14.01.1950):** "శ్రీకృష్ణ భగవానుడు విధ్వంసక శక్తితో అనుగ్రహింపబడ్డాడు అని నీవు వ్రాసింది పూర్తిగా వాస్తవమైంది. అయితే ఆయనకు నిర్మాణాత్మక (సృజనాత్మక) శక్తి అనుగ్రహింపబడలేదు. మహాభారతకాలంలో వాతావరణం విషతుల్యంగా తయారైంది. పరిస్థితులు విషమంగా తయారయ్యాయి. దీనికి కౌరవులు, తదితరులు భాద్యులు. వారు ముఖ్యకారకులు కనుక వినాశనమయ్యారు. ఇంకా చెప్పాలంటే, వారు పొందిన శక్తిని దుర్వినియోగం కావించటమేకాదు, అది అంతం కావలసి ఉంది. శ్రీకృష్ణ భగవానుడు ఆ విధంగాచేసి ఆ శక్తికి ముగింపు చేశాడు. శ్రీకృష్ణ భగవానుని శక్తి యొక్క ఉగ్రరూపం భారతదేశంలో కేంద్రీకృతమైంది. దాని సరిహద్దులు దాటిపోవలసిన అవసరంకాని, ఈద వలసిన అవసరంకాని లేకపోయింది. ఇప్పుడు దానికి భిన్నమైన మరో సమస్య ఉంది. అది అస్తికలను పూర్తిగా ప్రక్షాళనం చేయాల్సిన విషయం. ఇప్పుడు నీవు చూస్తున్నట్లుగా ఈ ప్రపంచంలో ఎంతోమంది ఉండబోరు. ఆ సమయంలో అటువంటి శక్తి అవసరమైంది కనుక ఆ శక్తి తీవ్రత భారతదేశానికి మాత్రమే పరిమితమైంది. ఇంతకుమించి ఇంకేమి వివరణ కావాలి? నాకు సంబంధించినంతవరకు ఆ ఆధ్యాత్మిక కేంద్రమునకు దుమకటానికి శ్రీకృష్ణుడికి ఆ సమయంలో ఇవ్వబడిన శక్తికి మించిన పని. శ్రీకృష్ణుడు శరీరంలోను, మనస్సులోను కలిగి ఉన్న శక్తి, నీకు ఉన్న శక్తికి మించినదని అర్థం చేసుకోకూడదు. అతడి హస్తాలు, శరీరం అత్యంత శక్తివంతమైనవి. శ్రీకృష్ణుడు ఆంతరిక సందేశం ఇవ్వబోతున్నాడు.

"ఆ కాలం నాటి (మహాభారతం) పరిస్థితులు మెరుగుపర్చటానికి ఆ శక్తి ప్రజ్వరిల్లింది. అది నాలో ఉంది కాని అణచిపెట్టబడింది. అది ఇప్పుడు అవసరమైంది. నేను దానికి విధేయుడనై ఉన్న ఫలితంగా నా అవతారం జరిగింది."

నీవు శ్రీకృష్ణ భగవానుని ఘనత చాటినంతగా ఇంక ఎవ్వరైనా చాటిచెప్పగలరా? అటువంటి శక్తిమంతుడు ఎవ్వరైనా ఉన్నారా? శ్రీకృష్ణునితోపాటు ఇంకా ఏ మహాపురుషులనైనా ఎవ్వరు మాత్రం ప్రస్తావించగలరు? శ్రీకృష్ణ భగవానుడు పైన వెల్లడించిన కొద్ది మాటల్లోనే దానికి సమాధానం ఉంది. కస్తూరికోసం నీవు ఇంకా ఏవైనా కోరుకుంటున్నావా? నేటి వాతావరణంలో మహాభారతకాలంనాటి విషతుల్యం అంతగాలేదని నీవు నీ పుస్తకంలో వ్రాసింది సజావుగానే ఉంది. అపుడు భారతదేశంలో ఉన్నత శక్తులు కలిగి ఉండి జీవించిన ఒక్క వ్యక్తి ఆనాటి వాతావరణాన్ని క్లిష్టంగాను, కలుషితంగాను చేశాడు. ఇక్కడ ప్రపంచంలోని ప్రజలందరు తమ పరిసరాలకు మాలిన్యాన్ని సమకూర్చుతున్నారు. అయితే ఆ రోజుల్లో అక్కడ ఉన్న వారంతగా, వీరు శక్తిమంతులు కారు."

ఎంతవరకు అవుసరమో అంతవరకే అనగా ఆ శక్తిమేరకే అవతారాలు అనుసంధానించబడ్డాయి. దానికిమించి అవి పనిచేయలేవు. శక్తి ఎంతైనా ఉండవచ్చునుగాక, కాని దాని పనియొక్క పరిధి అంతవరకే పరిమితమై ఉంటుంది.

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 81

లఖీంపుర్,

16.01.1950

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. పూజ్యులు మాస్టర్ సాహెబ్‌గారి ద్వారా తమరు దయతో వ్రాసి పంపించిన ఉత్తరం అందింది. దానిని చదివాక ఆనందం, దుఃఖమూ కలిగాయి. తమ యొక్క పడకమంచం కదిలించబడినట్లయితే

తమకు ఇబ్బంది కలుగుతుందను విషయం నాకు పూర్తిగా తెలియక పోయినందుకు దయచేసి నన్ను క్షమించగలరు. నేను తరచుగా తమ మంచానికి ఆనుకొని కూర్చుంటూ ఉండేదానినని నాకు జ్ఞాపకం ఉంది. దీని మూలంగా మంచం జరుగుతూ ఉండి ఉంటుంది.

**భవిష్యత్‌లో ఇటువంటి సమయం ఆసన్నం కావటమనేది చాలా దుర్లభం. అందుచేత ఇటువంటి మహోన్నత వ్యక్తులు రావటం జరగదు.** 'తమరు' నాకు పది, పన్నెండు సంవత్సరాలకు పూర్వమే ఎందుకు పరిచయం కాలేదా అని నాకు అంతులేని బాధగా ఉంది, ఉంటుంది కూడ. అయినా కూడ, తమ గురుకృపతో తమకు ఏ స్థితి అయితే కలిగిందో ఆ స్థితి నుంచి సిట్టింగ్ ఇవ్వమని తమరిని తప్పకుండా బలవంతపెట్టి ఉండేదానను. 'మాలిక్' కృప ఇదేరీతిలో ఉన్నట్లయితే శీఘ్రాతి శీఘ్రంగా ఆ స్థితి నుంచి సిట్టింగ్ ఇవ్వటమే గాకుండా, ఆ స్థితిలో స్థిరపర్చమని తమరిని బలవంతం చేయటానికి ఈ బీదరాలు అభ్యర్థన చేస్తూ ఉన్నదని, అలాగే చేస్తూనే ఉంటుందని 'తమరు' విశ్వాసం ఉంచమని కోరతాను. నా పరిశ్రమ యొక్క ఎటువంటి ఫలితం ఎంతగానైతే నేను తమ నుంచి ఆశిస్తానో అంతగానూ నాకు దక్కాలి అని సదా నేను కోరుకున్నాను, కోరుకుంటున్నాను కూడ. తమ కృప మరియు ఆశీస్సులు నా కృతనిశ్చయం నిజమయ్యేటట్లుగా చేయగలవు. 'మాలిక్' తన అమూల్యమైన ప్రేమతో శక్తినిచ్చి ఈ దీనురాలైన పేదరాలుకు సేవచేసే ఎటువంటి అవకాశం కల్పించాడో, అది నా భాగ్యవశమే. పూజ్య బాబూజీ! నేనయితే ఈ జీవితం మరియు జీవిత పర్యంతం క్షణక్షణం, కేవలం నా 'మాలిక్'ను జ్ఞాపకం ఉంచుకోవటంలోను మరియు 'అతని' సేవకొరకు సమర్పించి వేశాను. **నా బాబూజీ, తమరు నా పట్ల విశ్వాసం ఉంచండి, ఏమని అంటే, "బిటియా! నీ ఒక్క క్షణం వృథా అయ్యింది" అని తమరు ఎప్పుడైనా సరే విమర్శించేందుకు అవకాశం ఇవ్వను.** 'మాలిక్' దయతో అలా ఉండటానికే యోగ్యురాలిని కావటానికి ప్రయత్నిస్తూ ఉంటాను. 'మాలిక్' కృప కనుక నాపై ఇదే విధంగా ఉంటే దీనిని సాధించి నేను యోగ్యురాలనని నిరూపించుకుంటాను. కేవలం ఇదే నేను కోరుకుంటాను. ఆ విధంగా ఇప్పుడింక నాది అంటూ ఏమీ మిగలి ఉండలేదు. ఇప్పుడు ఇక 'మాలిక్' ఇష్టానుసారంగానే వ్యవహరిస్తాను. తమరికి వ్రాసే ఈ లేఖలో కొంత ఉద్వేగం కలిగినందుకు నన్ను క్షమించండి. అది వెంటనే శాంతించింది. ఆ ఉద్వేగంలో అంతా 'తమ'కు వ్రాసివేశాను. దానిలో ఏదైనా తప్పుగా భావించినట్లయితే క్షమించ ప్రార్థన. "నేను ఏదో విషయం గురించి నిరీక్షిస్తూ ఉంటాను. అది ఉత్పన్నమైనట్లయితే, నన్ను ఎవరైనా నిరోధిస్తేనే నేను ఆగిపోతాను" అని తమరు వ్రాశారు. ఆ విషయం అనుచితంకాకపోతే, 'తమ'కు అంగీకరామైతే దయచేసి నాకు కూడా వివరించండి. ఆ విధంగా ఆ విషయం నాలో ఉత్పన్నమైనపుడు నాకు తెలియపర్చండి.

నా ఆత్మికదశ బాగా ఉన్నతి నందుతున్నది. కొద్ది రోజులనుండి ఆత్మ సమర్పణ అనగా శరణాగతి కూడా ఏమాత్రం అనిపించటంలేదు. అవును, ఇది నిజం – నా ముఖానికి బదులుగా ఒక గడ్డం ఉన్న ముఖం ఉన్నట్లుగా అనిపిస్తోంది. ఇంకొక వాస్తవం ఏమంటే అప్పుడప్పుడు నేను బాలికను అనే విషయం కూడా మరచిపోతున్నాను. నా గురించి నేను ఎవరినో కూడా మరచిపోతున్నాను. ఇంకొక విషయం ఏమిటంటే, జనమంతా ఎవరైనా ఒక సతి (పతివ్రత స్త్రీ) గురించి ప్రశంశ చేసినా, మరెవ్వరిని గురించి ప్రశంసచేసినా కూడ నాకు ఏమాత్రం వాటిపట్ల శ్రద్ధ కలగటంలేదు. గౌరవమూ కలగటంలేదు, అస్పష్టంగా ఏదో మాట్లడతాను. ఇప్పుడు ఈ స్థితి చాలా నిస్సారంగా ఉంటోంది. గత ఉత్తరంలో 'తమ'ను గురించి శ్రీ స్వామీజీ చేసిన ప్రశంసకు చాలా ధన్యవాదాలు తెలుపుతున్నాను. దయచేసి, తమకు అంగీకారమైతే ఈ ఉత్తరాన్ని మరెవ్వరికీ చూపించవద్దు. ఇప్పుడు ఎటువంటి స్థితిని పొందటానికీ కోరిక కలగటంలేదు. నేను తమకు ఇంతకుపూర్వం చెప్పినటువంటి స్థితినే కావాలనుకుంటున్నాను. పిన్నలైన సోదర సోదరీమణులకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 82

లఖీంపుర్,
01.02.1950

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. పూజ్యులు (తావూజీ) పెదనాన్నగారు నిన్న వచ్చారు. వారి మీద వర్షింపజేసిన కృపకు కోటానుకోట్ల ధన్యవాదాలు. జనం ఇతర పూజలు, విధానాలు మరియు అభ్యాసాలకు బదులుగా ఈ సరళమైనది, సూటియైనది మరియు శీఘ్ర ఉన్నతి శీలమైనది అయిన ఈ మార్గంవైపు ఆకర్షించాలని 'మాలిక్'ను ప్రార్థిస్తున్నాను. నా ఆధ్యాత్మికదశ ఏమంత ప్రాధాన్యతలేనిదిగా అనిపిస్తోంది. జరిగిన ఉత్సవంలో కూడ నా స్థితి ఏమంత బాగా లేనందుకు నన్ను క్షమించండి. అక్కడి నుండి తిరిగి వచ్చిన తర్వాత తేలికదనం మరియు శూన్యత్వం అధికమయ్యాయని నిస్సందేహంగా చెప్పగలను. విచారించవలసిన విషయం ఏమిటంటే, 'మాలిక్' జ్ఞాపకం మరియు శరణాగతి యొక్క అనుభూతి ఇప్పుడు పూర్తిగా శూన్యమైపోయాయి. పూజ్య శ్రీ బాబూజీ, నాకు ఏమైందో భగవంతునికే తెలియాలి. నేను ఎప్పుడూ పూజచేసి ఉండలేదని, అన్ని విషయాలలోను శూన్యంగాను అనిపిస్తోంది. అప్పుడప్పుడు చాలా ఏడ్పువస్తోంది కాని ఆ ఏడ్పులో కన్నీరు రావటంలేదు. ఏదయితేనేమి, ఇప్పుడు 'అతడు' ఏది అనుగ్రహస్తే అది నాకు అంగీకారమే. **"రాజీహైఁ హమ్ ఉసీమె, జిస్‌మె రజాహై తేరీ"** ఏ స్థితియైతే పూజ ప్రారంభదశలో ఉందో ఇప్పుడూ అదే ఉంది. ఎందుకో తెలియదు కాని ఇప్పుడు నిద్ర ఎంత తీవ్రంగా ఉంటుందంటే, కళ్ళు మూసుకొని పూజ చేస్తూ ఉన్నా కూడా నిద్రపోతున్నాను. ఇప్పుడు నేను నిద్రపోతున్నా ఆ స్థితిలోనే ఉంటున్నాని చెబితే బాగుంటుందని అనుకుంటాను. అప్పుడప్పుడు పగలు కూడా ఖాళీగా కూర్చుని ఉన్నప్పుడు ఎవ్వరైనా గట్టిగా శబ్దం చేస్తే నేను ఒక్కసారిగా త్రుళ్ళిపడుతున్నాను. ఇలా ఉంటే మరి రాత్రి సంగతి ఏమని వ్రాయగలను? ఈరోజు ఉదయం చాలాసేపు నిద్రిస్తూ ఉండగా, ఆ నిద్రలోని స్థితి ఎలా ఉందంటే, కోయిల కూజితము వినబడుతూనే ఉంది కాని నిద్ర మాత్రం చాలా గాఢంగా సాగుతూనే ఉంది. అప్పుడు కళ్ళు తెరచి వెంటనే పని ప్రారంభించినంతనే శరీరం వణకసాగింది. శ్రీ బాబూజీ, నిద్రలోనయితే చాలా వింతైన అనుభవమైంది. ఎందుకంటే, ఇప్పుడు రోజంతా నిద్ర, దానితోపాటే మెలకువ స్థితి కలుగుతోంది. ఈ విశ్రాంతితోపాటు ఏదో అగ్ని లోపల రగులుతూ ఉంటుంది. ఇంక జ్ఞాపకం గురించి చెప్పాలంటే, అది ఉండీ లేనట్లుగా ఉంటోంది అని చెప్పటం సబబుగా ఉంటుంది. ఎందుకంటే ఏదో ఒక రూపంలో నేను జ్ఞాపకంతో శూన్యంగా లేకుండా ఉండటానికే ప్రయత్నిస్తున్నాను. ఇదే స్థితిలో పరమ పూజ్యులు శ్రీ పాపాజీ నాకు ప్రణామం చేసినప్పుడు నేను ప్రేమతో నిండుకొని ఆ మహాత్ముని చరణాలమీదపడి అతుక్కుపోయి ఉండవలసింది, కాని ప్రేమ మరియు ఉద్వేగం ఆ సమయంలో కూడా కలగనందువలన, దానిలో విఫలమై వారికి నేను నామ మాత్రంగానే ప్రణామం చేసాను. అదంతా దైవేచ్ఛ ప్రకారమే జరుగుతుంది. ప్రస్తుతం ఈ స్థితి నెలకొని ఉంది. అది ఏమిటంటే, 'మాలిక్' ముఖం బదులుగా నా ముఖం చూసుకోవటంలో చాలా అశాంతి కలుగుతూ ఉంది.

చిన్నవారైన సోదర సోదరీమణులకు ప్రేమ పలుకులు, నాయనమ్మ గారికి ప్రణామం తెలియజేయండి.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 83

షాజహాన్‌పుర్,
09.02.1950

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీర్వాదాలు. నేను లఖీంపుర్ నుంచి ఇక్కడకు క్షేమంగా చేరాను. ఈశ్వరుడు తన అపార దయతో నిన్ను పరబ్రహ్మాండ మండలంలో పూర్తిస్థాయిలో ప్రయాణింపజేసి ఇప్పుడు దానికి ఇంకా ముందుకు నడిపించాడు. ఇది

కేవలం ఈశ్వరుని కృప మూలంగానే, అది 'అతని' పనియే. నాకు ఉన్న ఒక అలవాటు ఏమిటంటే, నేను ఏ మకాం లేదా మండలం నుంచి ముందుకు ప్రయాణింపజేస్తూ ఉంటానో దానిని గురించి తెలియజేస్తాను. ఈ విధంగా చెప్పటంవలన భగవంతుడు ఎవ్వరికీ అహంకారం ఏర్పడకుండా చూడాలి. భగవంతుని కృపవలన నీ విషయంలో ఇటువంటిది ఎప్పుడూ జరగదు. నీవు నీ యొక్క స్థితిని బాగా పరిశీలనలో ఉంచుకోవాలి. అందుకే నేను ఈ విధంగా చెప్తూతూ ఉంటున్నాను. దీని వలన నీకు ఒక దానికి, మరొకదానికి మధ్య ఉన్న భేదం ఏమిటో తెలుస్తుంది. ఇంకా ముందుకుపోతే ఈ భేదం అతికష్టంమీద గ్రహింపుకు వస్తుంది. నిన్ను ఈరోజు నుంచే ఈ మండలంలో ప్రయాణింపజేయాలని నా మనస్సులో ఆకాంక్ష కలుగుతోంది. ఇలా ఎందుకంటే, ఆ ఐదు వలయాలు (Circles) నా ఎదుట ప్రత్యక్షంగా ఉండగా మరో పదకొండు వాటి వెనుక ఉన్నాయి. ఇతరుల యొక్క ఉన్నతోన్నత ఆధ్యాత్మిక పురోగతిని నా జీవితకాలంలోనే నా కళ్ళతో చూడాలని కోరుకుంటున్నాను. భగవంతుని కృపవలన అహం యొక్క ఈ పదహారు 'వలయాల'ను దాటించటం ఎక్కువ సమయంపట్టే పని కాబోదు. 'అతడు' దయదల్చాలేగాని ఒక్క సెకనులోనే పూర్తవుతుంది. ఈ అనుభవం నాకు ఉంది కనుకనే నాకు సాహసం కలుగుతోంది. ప్రకాష్ తల్లిగారు (బాబూజీ సతీమణి) ఈ పదహారు వలయాలు దాటి ప్రాణత్యాగం చేసింది. ఆ సందర్భంలో ఈ పదకొండు వలయాలు (Circles) నా దృష్టిలో లేకపోయాయి, అయినప్పటికి పరిశుద్ధ స్థితికి చేర్చటంకోసం భగవంతుడు వీటన్నింటినీ దాటించాడు. 'అతని'కి కోటి ధన్యవాదాలు.

బిటియా! నా స్థితి చూడు. దానిని జనులు గుర్తించలేకున్నారు, ఇక ముందు కూడా గుర్తించలేకపోవచ్చు. నాలో ఏ మాత్రం ఆధ్యాత్మికత కూడా మిగల్లేదు. నిజం చెప్పాలంటే, అది ఇప్పుడు లేకపోవటమే కాదు, చాలా భారమైనది కూడ. నేను ఎందుకు గర్వించాలో నీవే చెప్పు. ఎవ్వరైనా ఏమాత్రమైనా కలిగి ఉంటే, వారు గర్వించాలి.

**స్వామి వివేకానంద ఆంతరిక సందేశం (అంతర్వాణి):** "చాలా చక్కని వాక్యం. దాని అర్థం చేసుకోగలిగిన వారెవ్వరు? ఇది అతిమూలమైన ఆధారం (Absolute base)."

బిటియా! నేను ఈరోజు నీకు నా పరిస్థితిని అంతా వ్రాశాను. జనులకు ఇది తెలిసిపోయినట్లయితే నావద్దకు వచ్చేవారు ఎవరూ ఉండరు. ఆధ్యాత్మిక విద్య కొరకు ఇది లోపించినవారివద్దకు ఎందుకు పోవలసి ఉంటుంది.

**స్వామి వివేకానంద అంతర్వాణి:** "నీకు నిజం చెప్పాలంటే ఇది చాలా లోతైన ఆధ్యాత్మిక విషయం. వేదకాలంలో ఋషులకు కూడా అంతుబట్టనిది. ఇది చాలా విపరీతమైనది. దాన్ని గురించిన అవగాహన ఎవ్వరికీ ఉండదు. మేము ఇక్కడ శక్తిహీనులుగా ఉన్నాము."

బహుశా ఇందుకు జనులు నావద్దకు రావటంలేదనుకుంటాను. **స్వామి వివేకానంద అంతర్వాణి: "ఈ కాలాన్ని గమనించు. అమూల్యరత్నాలను నెట్టివేసి రాళ్ళ కొరకు వెదుకుతున్నారు. జనసామాన్యం యొక్క మనస్తత్వం ఎలా ఉందో చూడు. అహంకారం నశించనప్పుడు, ఫలితం ఇలా ఉంటుంది"**

నేను దీనిని నీకు యధాలాపంగా వ్రాశాను. నీవు నీ పనిలో నిమగ్నమై ఉండు. దైవం ఏదైనా చేయగలడు, అంతా 'అతని' చేతిలో ఉంది.

ఈ ఉత్తరం యొక్క నకలును తయారుచేసి మాస్టర్ సాహెబ్‌కు ఇస్తే అది ఫైలులో ఉంటుంది. ఈ ఉత్తరం నకలు నేను భద్రం చేయలేదు కనుక, అక్కడ దీనిని భద్రపరచాల్సిన అవసరం ఉంది.

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 84

లఖీంపుర్,
10.02.1950

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు సుఖప్రదంగా చేరి ఉంటారని ఆశిస్తున్నాను. 'మాలిక్' దయవలన నా ఆత్మికదశ ఉన్నతంగానే ఉంది, సదా ఉన్నతంగానే ఉంటుంది. పూజ విషయానికి వస్తే నేను ఇప్పుడే ప్రారంభిస్తున్నాను అన్నట్లుగా ఉంది. ఇప్పుడు పూజ అసలు చేస్తున్నానా! అని కూడా అనిపిస్తోంది. ఇప్పుడు ఎక్కువగా ఏ పని భారమూ నామీద లేనట్లుగా ఉంటున్నది. సర్వదా నన్ను వెన్నంటి ఉండేది నా 'మాలిక్' కృప మాత్రమే. ఇప్పుడు ఏదో స్థితిలో వ్యాప్తి ఎక్కువగా అనుభవమవుతోంది. ప్రతి స్థితిలోను ప్రశంస అనేది కేవలం 'మాలిక్'పట్లనే ఉండాలనీ, ఉంటుందని తమకు నేను విన్నవించుకుంటున్నాను. **శ్రీ బాబూజీ! అంధునకు కావలసినది ఏమి ఉంటుంది? కేవలం రెండు కళ్ళు, వాటిలోని వెలుగు కేవలం 'మాలిక్'ను మాత్రమే తదేక దృష్టితో చూడగలిగినవిగాను, మిగిలిన ప్రపంచమంతా ఆ కళ్ళకు అంధకారంగా ఉండే విధంగాను ఉండాలి.** 'మాలిక్' యొక్క అపార ప్రేమ ఈ అంధాక్షువుల్లో అటువంటి కాంతినే నింపటం ప్రారంభమైంది. ఇప్పుడు రేయింబవళ్ళు రెండూ ఒకే విధంగా ఉంటున్నాయి, ఒకే విధంగా గడుస్తున్నాయి. భేదం ఏమీ తెలియటంలేదు. శరీరానికి సంబంధించినంత వరకు కష్టసుఖాలు కూడ అనుభవానికి రావటంలేదు.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమ మరియు నాయనమ్మగార్కి ప్రణామం తెలియజేయండి.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 85

లఖీంపుర్,
15.02.1950

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసిన ఉత్తరం చేరింది, చదివి సంతోషించాను. మన 'మాలిక్' యొక్క అపారకృపకు ఈశ్వరునికి తగిన ధన్యవాదాలర్పించటం ఎప్పటికీ సాధ్యం కాదు అని తమరు వ్రాసారు. 'అతని' కృప ముందు నేను ఒక అతిదీనురాలిగాను, పేదరాలిగాను ఉన్నాను. నా అల్ప బుద్ధి నుండి ఏదైనా ఆలోచించినప్పటికీ, నా ఉన్నతి కారణం ఏమిటంటే, తమరు ఒకసారి "ఈశ్వరుడు నీకు రోజు రోజుకూ మంచి ఉన్నతి కలిగించుగాక!" అని వ్రాసి ఉండటమే. నేను నా స్థితిపైన తప్పనిసరిగా శ్రద్ధ వహిస్తున్నాను. 'మాలిక్' దయతో స్థితుల యొక్క భేదం కూడా ఎంతోకొంత తెలుస్తూ ఉంది. స్థితులు చాలా సూక్ష్మమైనవిగా ఉంటున్న మాట ఖాయం. 'తమ' ఇష్టానుసారంగా నా ఆత్మిక ఉన్నతిని కలిగించండి. నా దృష్టిలోనయితే 'మాలిక్' ఒకే ఒక్కరు. అసలు ఆత్మోన్నతి అంటే ఏమిటో కూడా నాకు తెలియదు. ఒక మంచి స్థితిని ఎంతో సుందరమైన వాక్యంలో వ్రాసినందుకు 'తమ'కు ధన్యవాదాలు. ఆ వాక్యం **–"పదహారు వలయాలు నా అధీనంలో ఉన్నాయి" అని (అనగా బాబూజీలో).** కాని ఈ దీనురాలి దృష్టిలో ఒకే ఒక్క వలయం ఉంది. దానిని 'మాలిక్' అని చెప్పాలి. **"అడుగు ముందుకే వేయాలి"** అని తమరు వ్రాసిన వాక్యం అయి ఉండగా, దానిని కూడా 'మాలిక్' యొక్క అభీష్టానికే వదిలివేశాను. 'అతడు' ఎలా కావాలనుకుంటే అలా, ఎక్కడకు కావాలంటె అక్కడికి తీసుకు పోనీయండి. తమ ఉత్తరం యొక్క నకలును పూజ్య మాస్టర్ సాహెబ్‌గార్కి రేపు తప్పనిసరిగా అందజేస్తాను. అయితే ప్రస్తుతం ఉన్న స్థితి నాకు లోలోపల కొంత అవగాహన ఉంది కాని, వ్రాయటంలేదు. అది పూర్తిగా అవగాహనకు వచ్చినపుడు వ్రాయగలను. ఇప్పుడు రాత్రి, పగలు ఉన్న స్థితిలో ఏమీ భేధం లేదనిపిస్తోంది.

అవి రెండూ ఒకటిగానే ఉన్నాయి. వాస్తవిక పేదరికం యొక్క కొద్దిపాటి ప్రభావం ప్రారంభమైనట్లుగా అనిపిస్తోంది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 86

లఖీంపుర్,

27.02.1950

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం 'తమకు' చేరి ఉంటుందను కుంటాను. నా స్థితి మళ్ళీ మార్పుచెందినట్లుగా అనిపిస్తోంది. 'మాలిక్' దయవలన అన్ని స్థితుల యొక్క తారతమ్యం ఎంతోకొంత తెలుస్తూనే ఉంది. ఇదివరలో ఏదో కొద్దిసేపు మాత్రమే కలిగినటువంటి ఉదాసీన (దిగులు స్థితి లేక నిర్లిప్తత) స్థితి ఇప్పుడు, ఎప్పుడూ ఉంటూ ఉన్నది. ఇప్పుడు ఏ పని చేయటానికైనా ముందు ఈ పని (ఫలానా పని) చేయాలి అని తోచటం లేదు. అలాగే పని జరిగిన తర్వాత ఏ పని చేసానో కూడా జ్ఞాపకం ఉండటం లేదు. పని చేసిన తర్వాత మళ్ళీ ఆ ఉదాసీన స్థితియే ఉంటోంది. ప్రతి పనీ ఆ ఉదాసీన స్థితిలోనే జరిగిపోతున్నాయి. ఈ ఉదాసీన స్థితిలో వ్యాప్తి ఎందుకు జరుగుతుందో ఆ భగవంతునికే తెలియాలి. మానసిక స్థితి ఎలా ఉంటున్నదంటె, తెలుసుకోవాలని ప్రయత్నిస్తే దానిలోని కష్టసుఖాలు అనుభవమవుతూ ఉన్నాయి, లేదంటే లేదు.

ఇప్పుడు ఎవ్వరిపట్లనూ "వీరు నా వారు" అని ఎందుకు అనిపించటం లేదో ఆ భగవంతునికే తెలియాలి. అవును, ఈ 'నా వారు' అను భావం కేవలం ఒక్కరిపట్ల మాత్రమే ఉండవచ్చు. కాని బాబూజీ! వ్రాయటానికి భయమేస్తోంది. అయినప్పటికీ తమరు ఎప్పుడూ కూడా నా అవగుణాలను క్షమిస్తూ వచ్చారు కనుక ధైర్యంగా వ్రాస్తాను. దానిని గురించి నిజం చెప్పాలంటే, నా వారు అను భావం 'మాలిక్'పట్ల కూడా లేకుండా పోయినట్లుంది. అయినప్పటికీ అది లేకుండా శాంతి లేదు, శాంతించను కూడ. అవును, ఇప్పుడు వైఖరిలో కొంత మార్పు వచ్చింది. ఇంతకుపూర్వం, దాదాపు అన్ని పనులు 'మాలిక్' మాత్రమే చేస్తున్నాడు అనీ, నేను 'అతని' జ్ఞాపకంలో పరవశమైపోతున్నానని చెబుతూ ఉండే దానిని. కాని ఇప్పుడు అలా అనుకుంటూ ఉంటే వెంటనే భారంగా అనిపిస్తోంది. **పరమప్రియులైన శ్రీ బాబూజీ! నిజం చెప్పాలంటే, నేను 'అతడి' జ్ఞాపకంలో పరవశం చెంది ఉన్నానని చెప్పటానికి బదులు "అతడే నా జ్ఞాపకంతో పరవశించిపోతున్నాడు" అనిపిస్తోంది. 'అతడు' గాఢమైన ప్రేమతో నన్ను ప్రేమిస్తున్నాడు అన్నట్లుగానే తలపిస్తోంది.** తరచుగా నా హృదయం ఆకర్షించబడుతున్నట్లు నాకు అనిపిస్తోంది. ఇంకా ఏమంటె ఈ ప్రపంచంలో నాకుగాని, ఇతరులెవ్వరికి గాని కులం, జాతి అను భావం కలగటంలేదని, ఇంకొకరకంగా చెప్పాలంటే, కులం, జాతి అను భేదభావమే దాదాపు లేకుండా పోయిందని అనిపిస్తోంది. ఇప్పుడు అప్పుడప్పుడు నిద్రలో కూడా పని జరుగుతూ ఉన్నట్లుగా అనిపిస్తోంది. ఏవేవో విషయాలు ఈ ఉత్తరంలో మర్యాద లేకుండా వ్రాసినందుకు శ్రీ బాబూజీ, దయచేసి తమ ఈ కుమార్తెను క్షమించండి. కొంత అసభ్యతగా వ్యవహరించి నట్లయ్యింది. ఇప్పుడు స్థితిలో కొంత మార్పు ఈ రోజు నుండి వచ్చింది.

తమకు అమితమైన హోలీ శుభాకాంక్షలు తెలుపుతున్నాను. అదే విధంగా తమరు నాకు శుభాకాంక్షలు తెలియజేయవద్దు, కాని నాకు మాత్రం తమకు శుభాకాంక్షలు తెలపటానికి స్వేచ్ఛ ఉంది. పని బాగా జరుగుతున్నది. నా ఆరోపణ ఒకటేమంటే, నేను 'అతడి' జ్ఞాపకం చేసుకోవాలన్నంతగా చేసుకోలేకపోతున్నాను. అన్ని పనులూ ఉదాసీన స్థితిలోనే జరిగిపోతున్నాయి, కాని వాటిని ఎవ్వరు చేస్తున్నారో అసలు తెలియటం లేదు. స్వయంగా

నా చేయి కదిపినప్పటికీ అది ఎవ్వరి హస్తమో అనుభవం కావటంలేదు. అన్ని పనుల పరిస్థితి ఇదే విధంగా ఉంది. దయచేసి నేను జ్ఞాపకం ఎలా ఉంచుకోవాలో తెలియజేయండి. ఎందుకంటె, ఇప్పటివరకు ఏదో విధంగా జ్ఞాపకం చేసుకుంటూనే ఉన్నాను కాని అతికష్టంగా. అది అంతా దైవేచ్ఛ. పూజ్య మాస్టర్ సాహెబ్ మరియు తావూజీ (పెదనాన్న) గారికి మంచి ఉన్నతి కలుగునట్లుగా దయ జూపండి. ఎందుకంటే, 'తమ' కుమార్తె మీద వారికి ఉపకారం తలపెట్టాల్సిన బాధ్యత ఉంది.

నిన్న "Pt. N." (పండిత్ నెహ్రూ కావచ్చు) జీవిత రక్షణ కొరకు పనిచేస్తూ ఉన్నపుడు, కాన్పూర్ అను మాటలు అనేకసార్లు మనస్సులో వెలువడ్డాయి. దీనిని ఏమని అర్థం చేసుకోవాలో దయచేసి వ్రాయండి.

అమ్మ తమకు ఆశీర్వాదాలు తెలుపుతున్నది.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 87

షాజహాన్‌పుర్,

03.03.1950

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. నీ ఉత్తరం చేరింది. నీ ధ్యానంలో కేవలం 'మాలిక్' (దైవం) మాత్రమే నిలిచి ఉండటమన్నది చాలా మంచి విషయం. అభ్యాసికి కేవలం 'మాలిక్'తోనే సంబంధం ఉండాలి. దానితో ఏ పనైనా జరుగుతుంది. ప్రతి ఒక్కరి పురోగమనం గురించి చెప్తూపోతూ ఉండటం నా అలవాటుగా అయిపోయింది. బహుశా ఏ శిక్షకుడూ ఈ విధంగా చేసి ఉండడు. మన గురుమహరాజ్ మాత్రం అక్కడక్కడ సూచనలు (Hints) చేస్తూ ఉండేవారు. నేను ఈ విధమైన తప్పు చేస్తున్నానా లేక ఇది సరైనదా అని నేను తెలుసుకోలేకపోతున్నాను. నేను ఎంతటివాడను? గొప్పగొప్ప ఉన్నత శ్రేణికి చెందిన మహాత్ములు సైతం దీనిని చేయలేదు. నా ఆలోచనకు ఇది అందటంలేదు. ఈ విషయం నేను ఇప్పుడు ఎవ్వరినైనా అడుగుతాను, అలాగే చౌబేజీ మరియు మాస్టర్ సాహెబ్‌ను కూడ. వారి అభిప్రాయం ఎలా ఉంటుందో గమనించు. ఒకవేళ నీకు స్ఫురిస్తే, నీవు కూడా వ్రాయి. నేను సరిదిద్దుకుంటాను.

ఐదు వలయాలు, అలాగే పదకొండు వలయాలు ఆపైన ఇంకేమైనా ఉన్నాయో, ఇంకను నాకు తెలిసినవేమైనా ఉంటే వాటిని కూడా ఇతరులకు వాగ్రూపంలోనో, లిఖితపూర్వకంగానో తెలియజేస్తూ ఉంటాను. అలా ఎందుకంటే, నా తర్వాత ఇతరులకు దీనికి ఇంకా ముందు ఉన్నది తెలుసుకునే అవకాశం కలుగుతుందని, దానిని నాహృదయంలోనే దాచి ఉంచుకోరాదని భావించటమే కారణం. అయితే ఇంకొక విషయం కూడ చూడు, జనులు ఎంతగా నేర్చుకుంటున్నారో, దానిని తగినంతగా అర్థం చేసుకోలేకపోతున్నారు. నా దృష్టికి వచ్చినంతలో ఎవ్వరికైనా కొద్దిపాటి స్థితి కలిగిన సందర్భంలోకాని, కొంచెం శాంతి లభించినట్లు అనిపించినపుడుకాని అభ్యాసి తనకుతాను పరిపూర్ణుడు అనుకోవటం జరిగింది. అది పూర్తిగా ఎలా ఉందంటే, "పసుపుకొమ్ము దొరికినవాడు తాను ఒక వ్యాపారిని" అనుకున్న సామెతలాగ ఉంది. నా అనుభవం ప్రకారం ఇప్పటికి నాకు తెలిసింది ఏమీలేదనియే నేను తెలుసు కున్నాను. నాకు ఇంకను దాని (ఆధ్యాత్మికత) సంపూర్ణమైన అంతుచిక్కలేదు. పరిపూర్ణత అంటే ఏమిటి? కొన్ని విషయాలు నేను మాస్టర్ సాహెబ్‌గార్కి వ్రాసిన ఉత్తరంలో ప్రస్తావించుతున్నాను. దానిని నీవు తెలుసుకోవాలనుకుంటే వారిచేత చదివించి తెలుసుకో. ఇది ఎందుకంటే, నీవు కూడా ప్రశిక్షకురాలిగా వ్యవహరిస్తున్నావు, ఇంకను వ్యవహరిస్తావు కూడ.

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 88

షాజహాన్‌పూర్,
05.03.1950

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. నీవు ఫిబ్రవరి 27వ తేదీతో వ్రాసిన ఉత్తరం అందింది. 'ఉదాసీనత' స్థితి కలగటం చాలా మంచిది. ఏపనైనా చేయటానికి ముందుకానీ, పని జరిగిపోయాకగానీ దాని గురించిన దృష్టి లేకపోవటంలో గల అర్థం ఏమిటంటే, ముమ్ముందు సంస్కారాలు ఏర్పడకుండా ఆగిపోవటమే. ఉదాసీనస్థితిలో వ్యాపకత్వం అనుభవమవుతున్నదని నీవు వ్రాశావు. ఇది నీ స్వయం వ్యాపకత్వం (Self Expansion), అది నీ దృష్టికి వచ్చింది. ఈ స్థితి ఇంకను వృద్ధిచెందుతుంది. లయావస్థ పరిపూర్ణస్థాయిలో ఇంకను ఏర్పడలేదు. అది ఏర్పడటానికి ఇంకా నిరీక్షించవలసి ఉంది. దాని లక్షణాలు (Symptoms) నేను ముందుగానే చెప్పదలచుకోవటంలేదు. అలా ఎందుకంటే, నీవు ఆ స్థితి కలగకముందు దానిపై దృష్టి సారించవు (ధ్యాసపెట్టవు). ఈ స్థితి ఎప్పుడైతే బాగా వృద్ధిచెందుతుందో, ఇంకనూ లయావస్థ తన పరిపూర్ణ స్థితికి వచ్చి తన స్థితిని కూడ దానిలో లయింపజేస్తుందో, అప్పుడు భోగరూపం మారిపోతుంది. ఇందులో ఆలస్యానికి తావులేదనిపిస్తోంది. ఈశ్వరుడు శీఘ్రంగా అనుగ్రహిస్తాడు. దాని ఫలితం ఏమిటో కూడా నీకు తెలుపుతాను, దానికి నీవు బాధపడవద్దు. నేను చెప్పదలచుకున్నది నీ మేలు కొరకే. ఇలా ఎందుకంటే, నీవు ఏ తీరుతెన్ను ద్వారా ఈ స్థితికి చేరుకుంటున్నావో దాని ఫలితం ఈ విధంగా ఉంటుందనిపిస్తోంది. అది ఏమిటంటే, గత సంస్కారాలు నిర్మూలింపబడటానికి 'నేను' కూడా అనుభవించ (భోగించ) వలసి వస్తుంది. అనగా కొంతభాగం నీవు, కొంతభాగం నేను. ఇక్కడ ఉన్న భయం ఏమిటంటే, నేను నా సంస్కారాలను, నీ సంస్కారాలను కూడా భోగించవలసి ఉంటుంది కనుక పని రెట్టింపు కావటానికి ఆస్కారం ఉంటుదని అనిపిస్తుంది. కాని అలా కాదు. నా సంస్కారాలను నాకు బదులుగా నా గురుమహరాజ్ అనుభవించారు (భోగించారు). భక్తి పూర్వకంగా నేను 'వారి'కి ఎంతగానో ధన్యవాదాలు తెలపాల్సి ఉంటుంది. కాని ప్రకృతి ధర్మాన్ని అనుసరించి (Law of Nature) 'వారు' ఆ విధంగా చేయవలసేఉంటుంది. అలాగే నేను కూడా చేయకతప్పదు. ఇప్పుడు నీ స్థితి ఏమిటో ఆలకించు- ఎప్పుడైతే నీవు నీ సంస్కారాల నుంచి విముక్తురాలవైపోయావో అనగా ఖాళీ అయిపోయావో అప్పుడు జీవించి ఉండటానికి (అనగా నీ తనువులో ఆత్మ నిలుపుకోవటానికి) నీవు ఇతరుల సంస్కారాలను భోగించవలసి ఉంటుంది. అటువంటిది ఎప్పటివరకు అంటే, ఎవ్వరైనా ప్రత్యేక వ్యక్తిత్వంకలవారు తన సంస్కారాలు తనకు శిక్షణను ఇచ్చేవారు భోగించకుండా ఉండే స్థితి కల్పించనంతవరకు. **శిక్షకుడు ఎటువంటి సంబంధం లేకుండానే జనుల సంస్కారాలను భోగిస్తాడు.** ఇటీవల కాలంలో గురువుగా చెలామణి కావటం బహు సులభంగా తయారైంది. ఎవ్వరైనా ఒకరు కీర్తనలు బాగా ఆలాపించబడినట్లుగా అనిపిస్తే ఆ శ్రోత లేదా వాటిని ఆలకించినవాడు అతడిని గురువుగా ముద్రవేస్తాడు. అప్పుడు ఆ గురువు అనిపించుకున్నవాడు కూడా "ఓ! శిష్యుడు దొరికాడు" అని సంతోషపడతాడు. అటువంటి వాడు తన గౌరవాన్ని చాటుకోవటానికి, దివ్యజ్ఞానం ప్రబోధించే నెపంతో శిష్యగణాన్ని తయారుచేయటానికి పూనుకుంటాడు. అలాగే ఇంకొకరు తన కీర్తిని వ్యాపింపజేసుకోవటానికి దేవుని పేరిట భిక్షాటన ప్రారంభిస్తాడు. క్రమంగా కాలం ఎలా తయారువుతోందో గదా! చూడు, ఆ కష్టాలు ఎవ్వరు భరిస్తారులే అనుకొని నేను గురువును కాలేను. ఎందుకంటే, ఒక సోదరునివలె శిక్షణ ఇవ్వటానికి ఈ విధంగా కష్టాలు ఎదుర్కోవలసివస్తుంటే ఇంకా ఆ కష్టాలు ఎందుకు. **నా దృష్టిలో, ఎవ్వరైనా గురువుగా భావించుకొని శిష్యుణ్ని భవసాగరం దాటించలేక పోయినట్లయితేనూ, కనీసం అతని పురోగతికి దారి చూపించలేక పోయినట్లయితేను, అటువంటి గురువు వేయి జన్మల వరకు అధోగతిలో పడియుండే భారీ శిక్షపడుతుంది. భగవంతుని, ప్రాణులను ఈ విధంగా మోసగిస్తున్నటువంటి స్వాములు దీనిని ఆలకించవలసి ఉంది. దాని ఫలితంగా అతడు (అనగా శిష్యుడు) వందల కొలది సంవత్సరాలపాటు దైవసామ్రాజ్యపు**

**దరిదాపులకు కూడా చేరలేదు. శిష్యుల పరలోక ప్రాప్తిని చెడగొట్టినందుకు అటువంటి గురువులను అత్యంత దోషులుగా పరిగణిస్తున్నాను.**

"బహుశా ఇప్పుడు 'మాలిక్'పట్ల కూడా 'నేను' అను భావం సమసిపోయింది" అని నీవు వ్రాసిన వాక్యం నాకు అర్థం కాలేదు. తరువాత ఉత్తరంలో దీనిని విశదీకరించి వ్రాయి. "అతడు నా జ్ఞాపకంలో అమితంగా ఉంటాడు" అని నీవు వ్రాశావు. ఇదే సందర్భంలో కబీరు సాహెబ్, "నా రాముడు నన్ను భజించినపుడు (స్మరించినపుడు) నేను విశ్రాంతి పొందుతాను" అని వ్రాశాడు. జాతి మతాలు సన్న్యాసు లెవరికి ఉండవని నీకు తెలిసిన విషయమే. అతడు వర్ణవ్యవస్థకు అతీతుడుగా ఉంటాడు. ఇదొక స్థితి, దీనినే వైరాగ్య సారాంశంగా పేర్కొనాలి. ఈ స్థితి పరిపక్వ స్థాయికి చేరినపుడు, సన్న్యాసం స్వీకరించిన మానవుడు అధికారం పొందుతాడు. కాని ఈ రోజుల్లో ఎటువంటి కష్టం పడకుండానే అతిసులభంగా సన్న్యాసులైపోతున్నారు. ఈ కాలంలో సన్న్యాసం ఎంత సుళువైపోయిందో చూసుకో. ఇలా ఎందుకు అంటావు? బాబాజీలకు (గురువు అనిపించుకునేవారు) తమ శిష్యుల సంఖ్యను పెంచుకోవటానికే.

నీవు మాస్టర్ సాహెబ్ మరియు చౌబేజీల గురించి సిఫారసు చేశావు కాని నా గురించి సిఫారసు చేయనందుకు నాకు చాలా బాధగా ఉంది. నా గురించి సిఫారసు 'నేను ఎవరికి చేయాలి' అని నీవు అనవచ్చు. వారిద్దరి గురించి సిఫారసు నీవు ఎవ్వరికి చేశావో వారికేనని చెప్పటమే దానికి జవాబు.

ఒక వింతైన విషయం ఏమిటంటే, ఏ వ్యక్తిలోనయితే ఆధ్యాత్మికత లోపించి ఉందో అట్టివాని ఉన్నతి కొరకు సిఫారసుచేయతగదు. అదే విధంగా ఎవరిలోనయితే ఆధ్యాత్మికత విలసిల్లుతూ ఉందో వారిని గురించి సిఫారసు చేయాలి. ఎవరి గురించినయితే నీవు సిఫారసు చేస్తున్నావో, వారి ఉన్నతి కోసం నీవు స్వయంగా ఎందుకు ప్రయత్నించవు అని పండిత రామేశ్వర ప్రసాద్‌గారు ప్రశ్నిస్తున్నారు. నీవు నీ గత ఉత్తరంలో తెలిపినటువంటి స్థితి చాలా మంచిది. పండిట్‌జీ అందుకు నిన్ను అభినందిస్తున్నారు. "నేను 'అతని' జ్ఞాపకం ఎంతగా ఉంచుకోవాలో అంతగా చేయలేకపోతున్నాను" అని ఫిర్యాదు చేశావు. అదే బాధ నన్ను కూడా వీడకుండా వెంటాడుతూనే ఉంది. నా బాధను నివారించుకోవటానికి నాకు ఎటువంటి వైద్య సలహా దొరకనప్పుడు ఇంక నీ సంగతి ఏమి చెప్పగలను!

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 89

లఖీంపుర్,

11.03.1950

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

వినయపూర్వక వందనములు. తమరు దయతో వ్రాసిన ఉత్తరం చేరింది. చదివి చాలా సంతోషించాను. నామీద 'మాలిక్'కు కలిగిన అపారకృపకు ఎంతగా ధన్యవాదా లర్పించగలను! ఇటువంటి కృపయే ఈ దీనురాలిపట్ల నిలిచి ఉండాలి. 'అతని'కి నా ప్రార్థన ఇదే. "నేను ప్రతి వ్యక్తి యొక్క పురోగతిని వెల్లడిస్తూ ఉంటాను. నేను ఈ తప్పు చేస్తున్నానో ఏమో తెలియటంలేదు." అని తమరు వ్రాసి ఉన్నారు, అయితే ఏదో ఒక సందర్భంలో సమర్థ మహాత్మా శ్రీ లాలాజీ "నీవలన ఎటువంటి తప్పు జరగదు" అని వ్యాఖ్యానించి ఉన్నారు. నా దృష్టిలో మా అభ్యాసు లందరిపట్ల ఎంతోకొంత అమిత ప్రేమ దాగి ఉండవచ్చునుగాని, అటువంటిది (కృప) సమర్థ మహాత్మా శ్రీ లాలాజీకి సరిసమానంగా ఏ వ్యక్తిపట్ల జరిగి ఉండలేదు, జరగబోదు కూడ. ఎప్పుడైతే వారు 'తమ'లో పూర్తిగా లయమైపోయారో, తమరు వారిలో లయమైపోయారో, అప్పుడింక తప్పు జరిగే మాట ఎక్కడ ఉంటుంది? ఏదయితేనేమి, 'తమరు' ఇటువంటి మాటలు మాట్లాడటం మా అందరికీ శిక్షార్హమే. నా ప్రార్థన ఏమిటంటే, అవకాశం ఉంటే, ఏవైనా గట్టి సంస్కారాలు ఉన్నట్లయితే వాటిని నాకు ఇవ్వండి. అటుపైన తమ ఇష్టం. "నేను ఇందువల్లనే గురువుకాలేదు" అని తమరు వ్రాసి

ఉన్నారు. ఈ ఉత్తరంలో వ్రాసినవన్నీ అభ్యాసులందరికీ శ్రేష్ఠమైన ఉపదేశాలు. తమరు ఈ దీనురాలిపై అనుగ్రహించిన కృప, మరింక అనుగ్రహించనున్న కృప మాటలతో వర్ణింపనలవి కాదు. "మాలిక్‌పట్ల 'నేను' అను భావం కూడ బహుశా లేకుండాపోయినట్లుగా ఉంది" అని నేను తమకు వ్రాసి ఉన్నాను. కేవలం దాని ఉద్దేశ్యం ఏమిటంటే, బాబూజీ! 'మాలిక్' అంటె ఎవ్వరు, ఎలా ఉంటాడు? అనేది కూడ నేను ఇప్పుడు మరచిపోయాను. అయితే ఒక్కటి మాత్రం ఖాయం. అది ఏమిటంటే నేను 'అతడి'ని మరచిపోయినప్పటికీ, 'అతడు' లేకుండా ఒక్క క్షణమైనా శాంతి కలగటం లేదు. తమకు ఆ ఉత్తరం వ్రాసినప్పటి నుండి ఆ ఉదాసీన స్థితిలో ఇంకేదో మార్పు కలిగింది. ఇప్పుడు ఒక విధమైన మృత్యుస్థితి లాంటిది కలగటమే కాదు అది నాలో స్థిరపడి పోతున్నట్లుగా ఉంది. ఇప్పుడు సహజసిద్ధమైన జ్ఞాపకం అనేది ఉంటూనే ఉంది కాని దానికొరకు ఇంకా ప్రయత్నిస్తూ ఉంటే శరీరం భారంగా అనిపిస్తోంది. ఇప్పుడు నిద్రలో కూడా ఆ మృత్యుస్థితి లాంటిది అనుభవానికి వస్తోంది. అది ఎలా ఉన్నదంటే, నిద్రిస్తూ ఉన్నా, మేల్కొని ఉన్నా స్థితిలో భేదం ఏమీ కనిపించటంలేదు. అదేమిటో తెలియదు కాని, ఇప్పటివరకు నా జీవితం ఒక స్వప్నంలాగా గడిచిపోయింది. వాస్తవంగా ఇప్పుడు అన్నీ మరచిపోయాను. ఇప్పుడు ఇంకేమి జరుగుతుందో నాకు తెలియదు. ఇప్పుడైతే 'మాలిక్'ను గురించి 'అతడు' ఎవ్వరో, ఎలా ఉంటాడో కూడా మరచి పోయాను. నా గురించి కూడా ఇదే స్థితి నెలకొని ఉంది. అది ఎంతగానంటే, నేను "ఆఫ్తాబే మరఫత్" హిందీ కవితను పాడుతున్నప్పుడు, ప్రేమ అనేది దరిదాపుల్లో లేదు. ఎవరిని కీర్తిస్తూ పాడుతున్నానో కూడా ధ్యాస ఉండటంలేదు. అసలు ఆ 'మాలిక్' ధ్యాసయే ఉండటం లేదు. అయినా ఎంతో కొంత ప్రయత్నం జరుగుతూనే ఉంది. దైవాభీష్టం ఎలా ఉంటే అలానే జరుగుతుంది. అదేమిటో దైవానికే తెలియాలి, నేను పూజ చేస్తూన్నప్పుడు, ఏదైనా వస్తువు ఇంట్లో జారిపడినాగాని, ఎవ్వరైనా పెద్దగా అరచినప్పుడుగాని, హృదయంమీద ఏదో గట్టిదెబ్బ తగిలినట్లుగా అనిపిస్తోంది. **పూజ్య శ్రీ బాబూజీ! తమరే స్వయంగా బలహీనంగా ఉన్నారు. తమరు కడుపునొప్పితో బాధపడుతూ ఉన్నారు. అయినప్పటికీ తమరు నా సంస్కారాలను కూడా అనుభవిస్తున్నారు. ఇందుకుగాను తమకు కోటానుకోట్లు ధన్యవాదాలు కాకుండా మరేమి చెప్పగలను!** ఎందుకుంటే తమరు ప్రకృతి ధర్మం (Law of Nature) అని చెప్పి నన్ను వివశురాలినిగా చేశారు. ఇప్పుడు అవసరమైన పనులన్నీ వాటంతట అవే సహజంగా జరిగిపోతున్నాయి. ఇప్పుడు నాకు తరచుగా కోపం వస్తోంది. నేను నిందిస్తూన్నప్పటికీ నాకు ఏమీ విశేషంగా గాని, విచారంగా గాని అనిపించటంలేదు. నేడు స్థితిలో కొంత మార్పు వచ్చినట్లుగా తెలుస్తోంది. ఇప్పుడు మృత్యుస్థితి లాంటిది కొంత వ్యాప్తి చెందినట్లుగా అనిపిస్తున్నది. పూజ్యులు, మహాత్ములు శ్రీ పాపాజీ చరణాలకు, వారి అభినందలకుగాను, అనేకానేక ధన్యవాదాలు తెలియ చేయండి. ఆ అభినందలకు నేను కారకురాలను కాదని, దానికి తమరే (బాబూజీ) అర్హులని కూడా వారికి తెలియ చెప్పండి.

లయ-అవస్థ పరిపూర్ణ రూపంలో వస్తుందని తమరు చెప్తున్నారు. మరైతే ఇప్పుడు ఉన్న పరిస్థితి ఏమిటంటే, నాలో లయ-అవస్థ అసలేమీ తెలియటం లేదు. అది ఎంతగానంటే, మళ్ళీ మళ్ళీ అభ్యాసం (ప్రయత్నం) చేసినప్పటికీ అది కలగటం లేదు. నిస్సహాయురాలను, నేనేమి చేయగలను! అదంతా దైవేచ్ఛకే వదిలివేస్తాను.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 90

లఖీంపుర్,

13.03.1950

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు కుశలముగాను, సుఖప్రదంగాను చేరి ఉంటారని భావిస్తున్నాను. తమరు వచ్చినపుడు, తిరిగి వెళ్ళేటపుడు, లోపల వేడి యొక్క తీవ్రత కొద్దిరోజులుగా ఎక్కువైనట్లు నేను గమనిస్తున్నాను. ఈసారి ఇక్కడ నుంచి తమరు వెళ్ళినప్పటి నుండి, మొదట 5,10 నిమిషాలు పూజలో హృదయం నిమగ్నమవుతూ

ఉండేది, ఇప్పుడు అది కూడా సమాప్తమై పోయింది. ఇప్పుడు నేను ఏదోరకంగా పూజ కొరకు ఉదయం ఒక గంట సమయాన్ని నియమించుకున్నాను కాని 'మాలిక్'ను జ్ఞాపకం చేసుకునే తపనతో గడచిపోతోంది. ఈ విషయంలో పెనుగులాడటం తప్ప ఇంకేమి దక్కించుకోలేదు. నాదేముంది, అంతా దైవేచ్ఛ. ఇటీవల నేను పగలంతా ఇతరులతో పూజ చేయిస్తున్నపుడు లేదా నేను వారికి సిట్టింగ్ ఇచ్చేటప్పుడు స్థితి మంచిగాను మరియు తేలికగాను ఉంటున్నది. ఇంతకుపూర్వం, నాలో ఎల్లవేళలా ఒక ఈశ్వరీయ ధార ప్రవహిస్తున్నట్లుగా నేను వ్రాసి ఉన్నాను కదా! అయితే ఇప్పుడు ఆ ధార వ్యాప్తి చెందినట్లు అనిపిస్తోంది. అసలు నాదైన ఏదైనా దశ ఉన్నదా లేదా, లేక అది కేవలం ఆలోచన మాత్రమేనా, అనే సందేహం ఉన్నదని తమకు ఉత్తరం వ్రాసి ఉన్నాను. కాని మళ్ళీ నేను, నాకు స్థితి ఉంది అని కల్పించుకునే దానను. ఇప్పుడయితే అది కూడా జ్ఞాపకం ఉండటంలేదు. ఇప్పుడు ఉన్న స్థితి ఎలా ఉందంటే, ఎల్లప్పుడూ హృదయం యొక్క పవిత్రత బాగా అవగాహనకు వస్తోంది. పూజలో కూడ ధ్యానంలో మునిగి ఉండటమనేది ఇప్పటివరకు చేస్తూ వచ్చానో, ఇప్పుడది కష్టంగా ఉంటోంది. ఈ హృదయ పవిత్రతా స్థితి ఇప్పుడు రోజంతా దానంతట అదే ఏర్పడుతోంది. బాబూజీ, నిజం చెప్పాలంటే, ఇప్పుడు చుట్టుప్రక్కల సంబంధం కూడ, ఆ రోజున ఇక్కడ తమరు చెప్పిన విధంగా, తెగిపోయి నట్లుగా అనిపిస్తోంది. ఇప్పుడు ఈ హృదయ పవిత్రతా స్థితి నాలోపల వ్యాప్తి చెందుతున్నట్లుగా ఉంటోంది. ఇప్పుడున్న సమాచారం ఏమిటంటే, ఆ స్థితియొక్క అనుభవమైతే నాలో ఎక్కువగానే ఉంది, కాని ఎందుకోగాని, ఆ స్థితిని చెప్పాలి అనుకున్నపుడు లేదా వ్రాయాలనుకున్నపుడు దానిని ఎలా వ్రాయాలో తెలియటంలేదు. ఆత్మ సమర్పణ (శరణాగతి) పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ప్రయత్నిస్తూ ఉంటే చాలా భారంగా అనిపిస్తోంది. ఇంకొక విధంగా చెప్పాలంటే, దాని ఆలోచన కూడ మంచిగా తోచటంలేదు. ఇప్పుడు దీనికి వైద్యం ఏమిటో తమరే చెప్పండి. ఇప్పుడు ఇది ఒక పూజ, పూర్తిగా పవిత్రంగా ఉన్నదనే ఆలోచన కలిగి, చాలా బాగున్నట్లుగా అనిపిస్తోంది. ఇప్పుడు సదా నాలో ఒక ప్రవాహం వంటిది అనుభవమవు తున్నది. పగలంతా నెలకొని ఉంటున్న ఉదాసీన స్థితి ఇప్పుడు దాని రూపం మార్చుకుంది. స్థితి అయితే అదే కాని దానిలో ఏదో మార్పు కలిగింది. బహుశా అది గాఢంగా అయి ఉండవచ్చు. తమరు ఒకసారి, హృదయంలో చైతన్యం కలిగింది అని వ్రాశారు. అప్పుడు నాకు కూడా దాని అనుభవం కలిగింది. కాని ఇప్పుడు నేను ఏమి చెబుతానంటే, హృదయం ఇంతకు పూర్వం నుంచే గాఢనిద్రలో మునిగిపోయి ఉంటుంది. ఎప్పుడు చూసినా నిద్రపోతూనే ఉంటుంది. ఎందుకంటే, ఇప్పుడు నేను చూస్తూన్న దానినిబట్టి, దానిలో తీవ్రతగాని, ఆవేశంగాని లేవు. చనిపోయినట్లుగా అనిపించడం వింతగా ఉంది. అయితే, పని చేస్తున్నప్పుడు అది మరణించినట్లుగానే ఉందనే మాట వాస్తవం. ఇప్పుడింక ఏమైపోయింది అంటే, ప్రతి సందర్భం లోను 'మాలిక్'కు 'ఎలా' తోస్తే అలా అను భావమే కలుగుతోంది. శ్రీ బాబూజీ, నాకు మరే స్థితిగాని, ఇంకేమిగాని అవసరంలేదు. మరి, నాకు 'మాలిక్'తోనే పని ఉంది, నాకు 'అతడే' కావాలి. ఎంతోకొంత ఆలస్యమైతే కావచ్చును కాని, 'అతడు' నాకు తప్పక దక్కుతాడు అని విశ్వసించండి.

నాయనమ్మగార్కి ప్రణామము. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు తెలియజెప్పండి.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 91

లఖీంపుర్,

18.03.1950

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు రావటంలేదని తమ నుంచి టెలిగ్రామ్ వచ్చినట్లుగా పూజ్య మాస్టర్ సాహెబ్‌గారి ద్వారా తెలిసింది. ఇందువలన నేను ఉత్తరం వ్రాస్తున్నాను. అక్కడ అందరు కుశలమేనని భావిస్తున్నాను. నా ఉత్తరం

ఒకటి తమకు చేరి ఉంటుందనుకుంటాను. 'మాలిక్' దయతో నా ఆత్మికదశ బాగానే పురోగమిస్తోంది. నా స్థితినిబట్టి నాకు కేవలం రాత్రి అంటే రాత్రి, పగలు అంటే పగలుగానే ఉంది. అలా ఎందుకంటే, నేను ఇప్పుడు ఏమి చేస్తూన్నానో చెప్పలేకున్నాను. నా స్థితి స్వప్నంలాగా ఉందని చెబుదామంటె అది సబబు కాదు.

పోనీ దానిని దిగులు అందామా అంటే అదీ సరైనది కాదు. ఈ స్థితి ఏమిటో 'మాలిక్'కే తెలియాలి. నేను రోజంతా ఏదైనా పనిని మంచిగా గానీ, చెడుగా గానీ, తప్పుగా గాని, సరిగ్గా కాని చేసానో లేదో కూడా తెలియడంలేదు. అయితే నాకు మంచి చెడు, తప్పు సరి వంటివి ఇపుడు నాకేమీ లేవని మాత్రం ఖచ్చితంగా చెప్పగలను. స్వతఃస్సిద్ధంగా జరిగే పనులేవో అవి జరిగిపోతున్నాయి. ఇప్పుడు నాలో పూజ, భక్తిగాని; లయ–అవస్థ, ఆత్మ సమర్పణ (శరణాగతి) స్థితులుగాని; 'మాలిక్' జ్ఞాపకం, ఇంకేవీ లేవు. నా శ్రీ బాబూజీ, ఇప్పుడు నాలో గుణములు ఏవీ లేవు. ఇంకా చెప్పాలంటే అసలు నేను ఎవ్వరినో, నేను ఏమిటో కూడా తెలియకుండా ఉంది. ఇపుడు ఉదాసీనత వంటి స్థితిగాని, ఇంతకుముందున్న అతితేలిక స్థితిగానీ, శూన్యస్థితిగానీ ఏమీ లేవు. ఇప్పుడు నాలో ఏమీ లేదనిపిస్తోంది. పూజ్య బాబూజీ, నేను చేతులు జోడించి తమ యొక్క ఈ దీనురాలైన కుమార్తెలో ఏదైనా గుణం లేదా ఇంకేమైనా గాని ఉన్నాయా అని అడుగుతున్నాను. 'మాలిక్' యొక్క జ్ఞాపకమనేది ఏదైతే తమకు ఆనందం కలిగిస్తుందో, దాని పరిస్థితి ఎలా ఉందంటే, ధ్యానం చేస్తున్నపుడుగాని, రోజంతా 'మాలిక్' జ్ఞాపకం కోసం ప్రయత్నిస్తున్నపుడుగాని, 'మాలిక్' స్వయంగా తన జ్ఞాపకంలో లీనమై ఉన్నట్లుగా అనిపిస్తోంది. 'మాలిక్' యొక్క అభీష్టాన్ని సంతృప్తికరంగా చేయటానికి ఇప్పుడు 'మాలిక్' తప్ప నాదగ్గర ఇంకేమున్నాయో తమరే చెప్పండి బాబూజీ! అవును, కాని అవకాశం ఉన్నంతవరకు ఇప్పటికీ ప్రయత్నం చేస్తూనే ఉన్నాను. మొన్న ఉదయం నుంచి నాలో చాలా తేలికైన ఈశ్వరీయ ధార ప్రవహిస్తున్నట్లుగా అనిపించింది. దాని పరిస్థితి కూడ చాలా తేలికగాను, కొంతవరకు నిదానంగాను, శాంతియుక్తంగాను ఉన్నట్లు తలపిస్తూ ఉంది. కాని దాని స్థితి అతికష్టంమీద అవగాహనకు వచ్చేటట్లుగా ఉంది. ఈ ధార ఏకధాటిగా సదా ప్రవహిస్తూనే ఉంది. ఇప్పుడు ఇంకొక ప్రయత్నం మాత్రమే మిగిలి ఉంది. అది కూడా 'మాలిక్' ఇష్టప్రకారమే. దానితోపాటుగానే 'అతని' జ్ఞాపకం ఇంక హృదయపూర్వకంగా చేయలేను అను అభియోగం కూడ సిద్ధంగా ఉంది. పని యొక్క పరిస్థితి ఎలా ఉందంటే, అది 'మాలిక్'కు ఇష్టమైనది, ఇష్టమైనరీతిలో జరుగుతూ ఉంది. అంతకుమించి నాకేమీ తెలియదు.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 92

లఖీంపుర్,
25.03.1950

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా రెండు ఉత్తరాలు చేరే ఉంటాయనుకుంటాను. అక్కడ ఉన్న ఆందోళనల కారణంగా తమరు రాలేకపోతున్నారని, ఈరోజు తమ ఉత్తరం ద్వారా తెలిసింది. అదంతా దైవేచ్ఛ. నా ఆత్మికదశను గురించి ఏమి వ్రాయమంటారు! నా దశ ఉన్నతంగా ఉందని నేను ఇప్పుడు చెప్పలేక పోతున్నాను. తమ శుభాశీస్సుల ప్రకారంగా నా ఉన్నతి రోజు రోజుకూ వృద్ధి చెందుతూ ఉంటుందని నాకు దృఢ విశ్వాసం గతంలోనూ, ఇప్పుడూ ఉంది. జ్ఞాపకం యొక్క పరిస్థితి చెప్పాలంటే, ఇంతకుపూర్వం 'మాలిక్' స్వయంగా తన జ్ఞాపకంలోనే మునిగి ఉన్నాడని చెప్పినటువంటిది, ఇప్పుడు అది కూడా లేకపోయినట్లుగా ఉంది. ఇప్పుడు ఏదో సంతృప్తికొరకు అన్నట్లుగా దానిమీద దృష్టి నిలుపుతాను. ఎప్పుడైతే పూజ నిలుపుచేసి నిలబడతానో అప్పుడు గాఢనిద్ర నుంచి లేచినట్లుగా

అనిపిస్తోంది. అయినప్పటికీ పూజలో ఆలోచనలు కలుగుతూనే ఉన్నాయి. ఈ స్థితి ఎలా ఉందంటే, నేను ఎప్పుడు ఏ విధంగా ఉండాలనుకుంటే ఆ విధంగా ఉంటోంది. అది ఎలా అంటే, ఎవ్వరైనా నాతో మాట్లాడినపుడుగాని, ఎవ్వరైనా పాటపాడినపుడుగాని వినాలనుకుంటే వింటాను. ఒకవేళ నాకు వినాలి అని అనిపించకపోతే ప్రక్కనే ఉండి కూడా వాటిని వినలేకపోతాను. రోజంతా నిలిచి ఉండే జ్ఞాపకం యొక్క స్థితి ఇది. అది ఏమిటోగాని, ఈ విషయమై దీర్ఘంగా ఆలోచించినట్లయితే, ఒక రకంగా నేను రోజంతా జ్ఞాపకం చేసుకోలేదు అని చెప్పటానికిగాని, లేదా ఇంకొక విధంగా నేను జ్ఞాపకం కలిగే ఉన్నాను అని చెప్పటానికిగాని నాకు అధికారం లేనట్లుగా అనిపిస్తోంది. ఇప్పుడు 'అతని'కి (మాలిక్) ఏది ఇష్టమైతే అది జరుగుతూ ఉంది. దానిని ఎవరు చేస్తున్నారో, ఎలా జరుగుతూ ఉందో అది 'అతని'కే తెలియాలి. పూజ్య శ్రీ బాబూజీ! నిజం చెప్పాలంటే, 'నేను' అను శబ్దం వెలువడుతున్నది ఎవ్వరికి సంబంధించి ఉందో నాకు తెలియదు. ఒకవేళ నేను బలవంతంగానైనా నన్ను దృష్టిలో పెట్టుకుని నేను మాట్లాడినా కూడా, అలా మాట్లాడుతున్న సందర్భంలో ఆ 'నేను' శబ్దానికి ఆ 'నేను' ఎవరో తెలియటంలేదు. ప్రస్తుతం అంతా నిర్లక్ష్య స్థితిగానే ఉంది. ఏ పనిలోనైనా అలసత్వంగాని, నిర్లక్ష్యంగాని లేకపోయినప్పటికీ కూడా ఆ స్థితి ఏమిటో తెలియటం లేదు. నాకు 'మాలిక్' జ్ఞాపకం రావటంలేదు అను అభియోగం (నింద) ఎక్కువవుతూనే ఉంది. నా 'పని'లో ఉత్సాహం మరియు వేగం ఏవైతే పూర్వం ఉండేవో, అవి 'మాలిక్'ను చేరటంకొరకే అని తలుస్తాను. నాకు 'మాలిక్' మాత్రమే కావాలి అంటూ కలిగిన ఆవేశం, వేగమూ ఇప్పుడు లేకుండాపోయాయి. ఇప్పుడు నేను నిర్జీవంగా అయిపోయి 'మాలిక్' అభీష్టం మీదే ఆధారపడి ఉన్నాను.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 93

షాజహాన్‌పుర్,
27.03.1950

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

క్షేమంగా ఉండు. నీ ఉత్తరాలు చేరాయి, కొన్ని వారాల క్రిందటనే నీ స్థితి తెలిసింది. నీ ఉత్తరాల్లో జవాబు ఇవ్వదగిన అంశాలను ఎర్రసిరాతో గుర్తుపెట్టి ఉంచాను. నేను వాటిని ఎక్కడ భద్రపరచానోగాని ఇప్పుడు అవి కనిపించటంలేదు. దీనికి నేను విచారిస్తున్నాను. ఇదే కారణం కాకుండా ఇక్కడ వర్గ సమస్యల మూలంగా వ్రాసేవారు (సహాయకులు) కూడా ఎవ్వరూ దొరకలేదు. అందుచేత జవాబు వ్రాయటంలో ఆలస్యమే కాకుండా, చాలా రోజులు గడచిన కారణంగా ఏ విషయాలు వ్రాశావో నాకు జ్ఞాపకం కూడా లేవు. ఇప్పుడే ప్రియమైన నారాయణ ఇంకను నీ రెండు ఉత్తరాలు అందజేశాడు. వాటిని చదివాక నీ స్థితి ఏమిటో అంచనా వేసుకొన్నాను. ఈశ్వరుని కృపవలన స్థితి అయితే చాలా మంచిదే. అయితే బిటియా! నీవు నిజం తెలుసుకోవాలనుకుంటే, లక్ష్యం ఇంకా చాలా దూరంలో ఉంది, దానికి ఇంకా హద్దూ పద్దూ లేదు. సృష్టి ప్రారంభమైన నాటి నుండే ఏ వ్యక్తియైనా బ్రహ్మవిద్యలో పురోగమిస్తూ ఉన్నప్పటికీ, ఈ సృష్టి వినాశనం జరగటానికి కొద్ది కాలం ముందు వరకు దాని అంతుచిక్కదని నేను భావిస్తున్నాను. జనం తమకుతాము పరిపూర్ణులమని అనుకోవటం నాకు ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇప్పుడు 'అతని' యొక్క అపార దయతో నీపై సత్యత్వం (రియాలిటి) యొక్క జల్లు కురిసింది. ఇదే జల్లు అభివృద్ధి చెందుతుంది. ఈ స్థితి 'ఉదాసీనత' యొక్క చమత్కారం. ఉదాసీనత యొక్క చమత్కారం వలన కలిగే ఆనందం ప్రారంభమయ్యేది ఇప్పుడే. దీని అంతిమ హద్దు చేరటానికి వేచి ఉండాలి. అది కూడా దైవేచ్ఛ ఉంటే త్వరగానే సమకూరుతుంది. నీ అంతట నీవు పూజ చేయాల్సిన అవుసరంలేదు. నీవు చేస్తే చేయవచ్చు, లేకుంటే లేదు. నా జీవితకాలంలో నా సమక్షంలో కొంతమంది

ఈ విధంగా తయారుకాగలిగితే ఈ ఆధ్యాత్మిక ఆనందం నేను స్వయంగా చూడాలని కోరుకుంటున్నాను. కాని చాలామంది ఇటువైపు మళ్ళటానికి సాహసించరు. 'అతడు' (దైవం) ఏది తలిస్తే అదే జరుగుతుంది. ఇది నా వశంలో లేదు. నా జీవితకాలంలో నేను ఎంత పురోగమనాన్ని ఇవ్వగలనో అంతా ఇవ్వాలనుకుంటున్నాను. కాని నీకు దీని అవుసరం ఉన్నట్లుగా ఉంచలేదు. అయినప్పటికీ భవిష్యత్తులో నా స్థానంలో ఉండేవారిని (ఎవరు కాబోతారో చెప్పలేను) గౌరవించాల్సిన అవుసరం అందరికీ ఉంటుంది. నీకు ఇతరులపై, నాపై ఆధారపడి ఉండాల్సిన అవుసరం, నేను ఉన్నా, లేకపోయినా నీకు ఇంక ఉండదు. నీకు దశలు నేరుగా నిర్ణయించబడుతూ ఉంటాయి. ఎందుకంటే, నీకు నా వెన్నంటి ఉండే అవసరం తొలగించి ఈశ్వరునితో నేరుగా నీకు సంబంధం కల్పించాను. 'అతని' (ఈశ్వరుని) అనుజ్ఞ ఉంటే నీ పనిలో ఆటంకం ఏమీ ఉండబోదు. మన పూజ్యులు చౌబేజీగారికి పరోక్షంగా ప్రాణాహుతిని ఇస్తూ ఉండు. అలాగే ఆయన నిర్మలీకరణ మీద ప్రత్యేక శ్రద్ధ వహించు. ఆయన అతిశీఘ్రంగా తనకుతానుగా తన స్థితిని భంగపరుచుకుంటారు. అందుచేత నాకు చాలా పని భారం పడుతుంది.

నిరంతరం ఒక ఈశ్వరీయ ధార ప్రవహిస్తూ ఉంటున్నదని నీవు వ్రాసినది పూర్తిగా వాస్తవమైనదే. దీనినిబట్టి ఈశ్వరునితో నీ సంబంధం నేరుగా ఏర్పడిందనటానికి ఇదే నిదర్శనం.

నీ శ్రేయోభిలాషి,
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 94

లఖీంపుర్,
30.03.1950

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. 'తమ' దయతో కూడిన ఉత్తరం చేరింది, విషయాలు తెలిసాయి. 'అతడి' అపార దయతో సత్యత్వం (రియాలిటీ) యొక్క ఒక్క తుంపర వెదజల్లబడింది అని తమరు వ్రాసారు. అయితే నా దృఢ విశ్వాసం కూడా ఈ విధంగా ఉంది – ఏ 'మాలిక్' అయితే ఇంత కృపను కల్పించాడో, అతడే ఈ తుంపరను కూడా అభివృద్ధి చేస్తూపోతాడు అని. ఎందుకంటే, 'అతడు' నా వాస్తవిక స్థితి ఏమిటో బాగా తెలిసి ఉన్నాడు. దయచేసి నన్ను క్షమించండి. "నేను నీ వెన్నంటి ఉండటం మానివేశాను" అని తమరు బాగానే వ్రాసారు. అవును, తమరు ఏదైనా చెప్పవచ్చును కాని, నేను మాత్రం చెప్పేది ఏమిటంటే,

**"బాహ్ ఛుడాయె జాత్ హెు, నిబల్ జాని కె మోహి**
**హృదయ్ తె తబ్ జాహుగె, మర్ద్ బదౌ తబ్ తోయ్"**

అనగా నన్ను అశక్తురాలిగా భావించి తోడుగా ఉండి, తీసుకువెళ్తూ, నా చేయి వదిలిపెట్టావు. అయితే నా హృదయం నుంచి తొలగిపోగలిగితే అప్పుడు నిన్ను నేను మనిషిగా (ధీరుడుగా) భావిస్తాను. అలా మాత్రం కాదు. నేను ఏమీ చెప్పను. నేను ఏమి చేయాలో అది చేయాల్సి ఉంది. నా 'మాలిక్'కు ధన్యవాదాలు ఎంతో మిన్నగా చెప్పాల్సి ఉంది. 'అతడి' అపార ప్రేమ నామీద సదా ఉంటూనే ఉంది, ఇంకా అలాగే ఉంటుంది. "సాహసాన్ని ఇలాగే నిలుపుకో" అని తమరు వ్రాసారు గదా! మరి నేను నా సాహసాన్ని కూడా 'అత్యంత సాహసికుడు'కే అర్పించివేశాను లేదా ఎవరైతే నావంటి దీనురాలు (అల్పురాలు)కు కూడా దయతో తనవైపు గుంజుకునే సాహసం చేశాడో 'అతడే' స్వయంగా దోచుకున్నాడు. ఇటీవల నా ఆత్మికదశ ప్రత్యేకంగా ఉన్నది. నేను పని చేస్తున్నప్పుడు ఉన్న తీవ్రత తొలగిపోయింది అని బహుశా తమకు వ్రాసే ఉంటాను. అది ఎంత ఎక్కువగానంటె, నేను చాలాసార్లు, ఆ ఆవేశాన్ని, ఉద్వేగాన్ని కల్పించుకోవటానికి ప్రయత్నించినప్పటికీ అది కలగటంలేదు. కేవలం ఆలోచనతోనే సరిపెట్టుకుంటున్నాను. దాదాపుగా ఒకే రకమైన స్థితి (మార్పులేనిది) ఉంటున్నది. అయితే ఆ స్థితి నిస్సందేహంగా చెడ్డది కాదని చెప్పగలను.

అవును, అది 'మాలిక్' కృపతోనే కలిగింది అనుకుంటె దానిని మంచిది అనే చెప్పాలి. అందులో ఎగుడు దిగుడులుకాని, ఉద్రేకంగాని, దైన్యంగాని ఏమీ అనిపించటంలేదు. ఒకవేళ నేను దానిని ఒక స్థితియే కాదు అని చెప్పినట్లయితే అది కూడా సబబుకాదు; ఆ స్థితి ఏమిటో భగవంతునికే తెలియాలి. పూజ్య శ్రీ బాబూజీ! నిజం చెప్పాలంటే ఆ స్థితి ఎటువంటిది అంటె దానితో నేను తరచుగా భీతి చెందుతున్నాను – ఇది నా దశయా లేక ఆలోచన మాత్రమేనా అని. ఇప్పుడు నాకు ఎటువంటి స్థితి కలిగి ఉండలేదని అనిపిస్తోంది. ఎప్పుడైనా ఎటువంటి పూజ చేయకుండా పూర్తిగా మామూలుగా ఉన్నదానిలాగా ఇప్పుడు నేను ఉన్నాను అని చెప్పాల్సి ఉంటుంది. ఇప్పుడు ఎలా ఉన్నదంటే, ప్రపంచంలోని జనులందరూ ఒక ఫకీరు లేదా ఒక అభంశుభం తెలియని పిల్లవాడు తనలోనే ఆనందించు కున్నట్లుగా నాకు అనుభవమవుతూ ఉంది. అటువంటివారికి లోకంలో జనం గురించి ఏమీ పట్టనట్లుగాను లేదా అన్ని రకాలుగాను విముఖత్వం కలిగి ఉన్నట్లుగాను ఉంటుంది. ఇప్పుడు నాలో దానంతట అదే కలుగుతున్న స్థితి ఎటువంటిది అంటె, 'మాలిక్' పూర్తిగా నాలో లయమైపోయినట్లుగాను, నాకు సిగ్గుతోచనట్లుగాను ఉంది. ఎప్పుడైనా మందలించటం జరిగితే కావాలనుకుంటే దాని ప్రభావాన్ని స్వీకరిస్తాను లేదంటే అలాగే కూర్చుండి పోతాను.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 95

లఖీంపుర్,

18.04.1950

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు అంది ఉంటుందను కుంటాను. ఇక్కడ అందరూ కుశలమే. తమరు కూడా కుశలమేనని భావిస్తాను. దేవుని దయతో నాకు అనుభవమైన నా ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను. బహుశా నేను నా గత ఉత్తరంలో ఇప్పుడు చుట్టపక్కాల సంబంధం ఏమీ లేకుండా తెగిపోయినట్లుగా అనిపిస్తోంది అని వ్రాసి ఉంటాను. అయితే ఇప్పుడు సంబంధీకులు, బంధువులే కాకుండా ప్రపంచంలోని మానవులందరితోనూ సంబంధం తెగిపోయినట్లుగా అనిపిస్తోంది. నేను ఇప్పుడు ఈ లోకంతో పూర్తిగా విడిపోయినట్లుగా అనుభూతి చెందుతున్నాను. అది ఎలాగంటే, ఏ వస్తువుతోగాని, లోకులుతోకాని లేశమాత్రమైనా నా సంబంధం తోచటంలేదు. ఇంకా నేను అతిగా చెప్పదలచుకుంటే నాకు ఇప్పుడు బంగారం, మట్టి రెండూ సమానంగానే అనగా ఒకే విలువైనవిగా తలపిస్తున్నాయి. ఇంకొక నిజం ఏమిటంటే, మానవులు, జంతువులు కూడా ఒక విధంగా సమానమేనని అనిపిస్తోంది. నాలో అస్పృశ్యత (అంటరానితనం) యొక్క ఆలోచన కూడా ఏమీ లేకుండాపోయింది. నాకు ఈ లోకంతో సంబంధం లేకుండా వేరైపోయినట్లుగానే అనిపిస్తోంది. ఎందుకంటే, ఎవరిపట్ల కూడా కొంచెమైనా ఏవగింపుగాని, ఏ విధమైన అనుబంధంగాని కలగటంలేదు. దాని మూలంగా అందరిపట్ల ప్రేమ అధికమైంది. పవిత్రత, అపవిత్రత, శుభ్రత, అశుభ్రత విషయాలలో ఏ నియమాలైతే ఇప్పటివరకు కొనసాగుతూ వచ్చాయో అవి ఇప్పుడు కూడా వాటంతటవే అమలవుతున్నాయి. శ్రీ బాబూజీ, నాకు ఏమయ్యిందో చెప్పండి. నేను ఇప్పుడు నా స్వాధీనంలో లేను. ఇప్పుడు అన్ని భావనలూ అనగా సోదర సోదరీమణులు, తల్లిదండ్రులు లాంటివి ఆవిరైపోయాయి. ఇప్పుడు నేను పూర్తిగా 'మాలిక్' అభీష్టానుసారంగానే ఉన్నట్లుగా అనిపిస్తోంది. ప్రతి సమయంలోను, ప్రతి పనిలోనూ కేవలం 'మాలిక్' యొక్క ఇచ్ఛానుసారంగా జరుగుతున్నది. ఈ పనులన్నీ ఎవరు చేస్తున్నారు? ఎలా జరుగుతున్నాయి? ఇలాంటి ప్రశ్నలే తలెత్తటంలేదు. ఇప్పుడు 'అతడు' ఏది తలిస్తే అదే జరుగుతుంది. నన్ను ఇప్పుడు 'అతడు' లేదా 'తమరి' యొక్క సేవకురాలిగానో లేదా 'అతని' అభీష్టానికి సేవకురాలిగానో భావించండి. శ్రీ బాబూజీ, దయచేసి నన్ను క్షమించండి. నాకు దీనిని వ్రాయటానికి జంకు కలుగుతోంది, అది ఏమిటంటే, 'మాలిక్'కు 'తమ'కు మధ్య అంతరమే

లేకుండాపోయినట్లుగా ఉన్నదని చెప్పాలనిపిస్తోంది. ఈశ్వరీయ ధార నాలోపల ఎప్పుడూ ప్రవహిస్తున్నట్లుగా కలిగిన స్థితి ఏదైతే ఇంతకుపూర్వం ఉందో, అదే స్థితి ఇప్పుడూ లోన బయట ప్రవహిస్తూన్నట్లు అనిపిస్తోంది. ఇంకా చెప్పాలంటే, ఇప్పుడు ఆ స్థితిలోనే నేను లయమైపోయాను. ఒకవేళ తమరు ఆ స్థితిని గురించి వివరించమని కోరినట్లయితే అలా చేయటానికి లేదా వ్రాయటనికి నేను అసమర్థురాలినవుతాను.

చిన్నవారైన సోదర సోదరీమణులకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 96

లఖీంపుర్,

26.04.1950

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయ ఉంచి పూజ్య మాస్టర్ సాహెబ్‌గార్కి వ్రాసిన లేఖలో నా గురించి వ్రాసిన విషయం ఏమిటంటే, నా స్థితిలో కొంత కల్పితం (ఊహాజనితం) ఉన్నట్లుగా తోస్తున్నదని వ్రాశారు. అది పురోగమనానికి సంబంధించి నిలిచిపోవటమేమోనని నేను మొదట చాలా భయపడ్డాను. కాని పూజ్య మాస్టర్ సాహెబ్ దాని గురించి వివరించిన తర్వాత కొంత మనశ్శాంతి కలిగింది. పూజ్య బాబూజీ! తమ దయవలన ఎటువంటి ఆటంకం కలగబోదని నాకు సంపూర్ణ విశ్వాసం ఉంది. తమరు దయ ఉంచి ఈ దీనురాలిని గమనిస్తూ ఉండాలని 'తమరి'ని ప్రార్థిస్తూ ఉన్నాను. ఎందుకంటే, ప్రస్తుతం ఎందుకో తెలియదు కాని, నా స్థితి కొంత నిలిచిపోయినట్లుగా అనిపిస్తోంది. అందువలన బాగా దిగులుగా ఉంది. ఇంకా ఏమిటంటే, ప్రస్తుతం నా స్థితి చాలా చెడ్డదిగా కూడా తలపిస్తోంది. ఒక్కొక్కసారి, బాబూజీ నాకు చాలా దూరమైపోయారేమోనని అనిపిస్తోంది. మరొకసారి తమరు ఏ విషయంలోనైనా నాపట్ల కోపంగా ఉన్నారేమో అని కూడా నాకు ఆలోచన కలుగుతోంది. 'మాలిక్' దయతో నేను ఎంత చేయాలో అంతగా ప్రయత్నిస్తున్నాను. శ్రీ బాబూజీ! నేను 'అతని'తో ఒక్క క్షణమాత్రమైనా వేరుపడి ఉండటానికి భయపడుతున్నాను అంటే నమ్మండి. ఇప్పుడు, ఎప్పుడైతే 'అతని'తో దూరంగా ఉన్నాను అని అనిపించిన స్థితిలో ఉన్నప్పుడు, రోజంతా హృదయం లోలోపల కుమిలిపోతూ ఉంటుంది. నేను కోరుకున్నంతగా జ్ఞాపకం, దాని కొరకు ప్రయత్నం మనస్ఫూర్తిగా చేయలేకపోతున్నాను. ఎందుకంటే, 6,7 రోజుల నుండి ఆరోగ్యం కూడా అంతగా బాగుండటంలేదు. అది రేపుగాని, ఎల్లుండిగాని బాగుండవచ్చు. పూజ్య మాస్టర్ సాహెబ్‌వద్ద నిన్న సిట్టింగ్ తీసుకున్నపుడు, అదేమిటో దైవానికే తెలియాలి, ఎక్కడి నుంచో నల్లని పొగవంటి ధూళి బయటకు వచ్చిందని వారు చెప్పారు. ఇంతకుముందు నాకు ప్రతి విషయంలోను, ప్రతి పనిలోను 'మాలిక్' యొక్క ఇష్టప్రకారమే జరుగుతున్నదని అనిపించేది; కాని ఇప్పుడు అలా అనిపించడంలేదు. ఇప్పుడు ఏమైందో తెలియదు కాని, ఎక్కడైనా తప్పు జరిగిందంటారా? 'అతడు' మాత్రం ఎప్పటి నుంచో తన ఈ దీనురాలిని క్షమించి కృప చూపుతూనే ఉంటున్నాడు, ఇప్పుడు కూడా అదే ఆశతో ఉన్నాను. ఇప్పుడు ఉన్న పరిస్థితి ఎలా ఉంది అంటే, నా ఆరోగ్యం బాగుండలేదను మాట కూడా పూర్తిగా మరచిపోతున్నాను. విధి ప్రకారం పూర్వంలాగే అన్ని పనులూ నిర్వహిస్తూనే ఉన్నాను. ఇది అంత ముఖ్యమైన విషయం కాదు. అన్ని పరిస్థితుల్లోను, అన్ని స్థితుల్లోను నాకు 'మాలిక్'తో అవసరం ఉంది, అయినప్పటికి నాలో ప్రేమ అనేదే లేదు. నా స్థితి నిలిచిపోయినట్లుగా తలపిస్తున్నందువలన ప్రస్తుతం నా హృదయం విచారగ్రస్తంగా ఉంది. ఇంకా చెప్పాలంటే, అది కుంచించుకుపోయి దిగులుగానే ఉంటున్నది. పూజ్య శ్రీ బాబూజీ, ఏది ఏమైనా సరే, నేను మాత్రం ఆగిపోయేదిలేదు. నేనయితే ముందుకు సాగిపోవటానికే పూనుకున్నాను, కనుక ఈ మార్గంలో పయనిస్తూనే పోతాను. నా 'పని' (Working) విషయంలో కొంచెం గమనించండి, ఎందుకంటే నాలో కొంత ఉత్సాహం సన్నగిల్లినట్లుగా అనిపిస్తోంది. దయచేసి 'తమరు'

పూజ్య మాస్టర్ సాహెబ్‌కు నా పరిస్థితిని గురించి వ్రాయండి. నేను ఆగిపోలేదు కదా! దయచేసి వ్రాస్తూ ఉండండి.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 97

లఖీంపుర్,

29.04.1950

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందనుకుంటాను. ఇక్కడ అందరూ కుశలమే. అక్కడ కూడా అందరూ కుశలమేనని భావిస్తున్నాను. నాకు షుమారు 8,10 రోజుల నుండి స్థితి చాలా హీనంగా ఉన్నట్లు అనిపిస్తోంది. హృదయం ఎప్పుడూ విచారగ్రస్తంగానే ఉంటున్నది. ఏ సమయంలో కూడా సంతోషంగా ఉండటంలేదు. ఏ పని చేయడానికి ఆసక్తి ఉండటంలేదు. (working) 'పని' చేయడంలోగాని మరియు పూజ చేయడానికిగాని మనస్సు నిమగ్నం కావటంలేదు. అయితే 'పని' (working) మాత్రం ఎప్పటిమాదిరిగానే అదే స్థాయిలోనే జరుగుతూ ఉంది. ఇప్పుడు ఉన్న స్థితి, పూజ చేయకుండా ఉన్నటువంటి స్థితి కంటె బాగుందనిపిస్తోంది. ఎవరితోనూ మాట్లాడటానికిగాని, ఎవరికైనా సిట్టింగ్ ఇవ్వడానికిగాని నాకు ఇష్టం ఉండటం లేదు. పూజ చేయకుండా ఏకాంతంగా, నిశ్శబ్దంగా, నిరాలోచనగానే దైన్యంగా ఉండటానికే హృదయం ఇష్టపడుతోంది. ఏమైనా ఆలోచించడానికి కూడా మనస్సు ఇష్టపడటంలేదు. ధ్యానం చేయకుండా ఉంటే మనస్సుకు శాంతి లభించదు. కాని ఎలా చేయాలి? ఏమీ తోచటం లేదు. బాబూజీ, కొంచెం ఆలోచిస్తే అన్నీ విషయాలు అవగాహనకు వస్తాయి. ఇటువంటి నిర్లిప్త స్థితిలో ఉంటూ నేను ఏమి చేయగలను? ఎలాగైనా సరే, నేను 'మాలిక్'ను చేరవలసిందే. శ్రీ బాబూజీ నన్ను ఏమి చేయమంటారు? ఎలా చేయమంటారు? నాకు మాత్రం 'మాలిక్' మాత్రమే కావాలి. 'తమరు' నాకు పూర్వంలాగానే ఉత్సాహం కల్పించండి. అది నాకు ఇష్టం. అయినప్పటికి నేను 'అతని' (మాలిక్) యొక్క జ్ఞాపకం లేకుండా ఒక్క క్షణమైనా ఉండలేను.

కేసర్ తమకు ప్రణామం తెలియజేస్తున్నది. ఆమె తన హృదయంలో ఏదో కొంత తెరచుకున్నట్లుగా ఉందని, వేగంగా పురోగమించాలి అని తాపత్రయపడుతున్నట్లుగా ఉందని తెలియజేస్తున్నది. అమ్మ తమకు ఆశీస్సు లందిస్తోంది.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 98

షాజహాన్‌పుర్,

01.05.1950

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

ప్రసన్నమస్తు. నీ ఉత్తరం అందింది. చదివి సంతోషించాను. దానితోపాటు ఆశ్చర్యం కూడా కలిగింది. అది దేనికంటే, నేను కోపంతో ఉన్నాను అని నిరాధారం, వ్యర్థం అయిన ఆలోచన నీకు ఎందుకు కలిగిందా! అని. ఇటువంటి ఆలోచనకు ఎప్పుడూ అవకాశం ఇవ్వవద్దు. ఇది చాలా హానికరం. నేను నా విషయం చెబుతున్నాను. ఒకవేళ నేను నా గురుమహరాజ్ నాపై కోపంగా ఉన్నారు అని భావించితే మన లాలాజీ సాహెబ్ కళ్ళు మనమీద నుంచి వెంటనే మరలిపోతాయి. నేను, ఏ స్థాయిలో 'వారు' నాపై కోపంగా ఉన్నారని భావిస్తానో అదే స్థాయిలో 'వారు' నాపై కోపంతో ఉంటారు. ఒకవేళ నావలన ఏదైనా తప్పు జరిగింది అనుకుంటే, ఆపైన నేను దానిని హృదయపూర్వకంగా గ్రహించగలిగితే లాలాజీ సాహెబ్ వెంటనే దానికి శిక్ష విధించటానికి సిద్ధపడతారు. (తప్పు చేయటం ఏ మానవునికైనా

మామూలే) భగవంతుడు నాపై దయ చూపుగాక! అందుకని ఒకవేళ నేను ఎప్పుడైనా తప్పుచేసినప్పటికీ నేను తప్పు చేస్తున్నాననే భావన రాదు. ఏదైనా స్థితి కలగబోయే ముందు, ముందుగా దాని ప్రతిబింబం కనిపించి తర్వాత అసలైన రూపం సాదృశ్యమవుతుంది. ఈ అభూత కల్పనలో ఏదైనా తెలిసీ తెలియనట్లుగా ఆ దశలో కలిగినట్లయితే, దాని అసలైన రూపం కూడా అవగాహనకు వస్తూ ఉంటుంది. ఇలా జరిగిన విషయం ప్రత్యక్షమైనపుడు, అది కూడా తన స్థితిగానే అనిపిస్తుంది. నీవు వ్రాసినటువంటి ఈ స్థితిలో కొంత భ్రమ లేదా ఊహ కూడా ఉన్నదని నేను మాస్టర్ సాహెబ్‌కు వ్రాశాను. అనగా దీనిలో సత్యత్వం అయితే ఉంది కాని కొంతమేర ఊహా ప్రభావం ఉంది. దీనిని గురించి నీవు కలత చెందాల్సిన అవసరం లేదు. ఇది జరుగుతూనే ఉంటుంది.

నీ ప్రయాణం ఆగిపోలేదు, కొనసాగుతూనే ఉంది. అక్కడ ఉన్నటువంటి నిలకడ స్థితిని నీవు నిలిచిపోవటంగా అర్థం చేసుకున్నావు. ఇది ఇలా తప్పకుండా జరుగుతూనే ఉంటుంది. గమనం ఒక్కోసారి మందకొడిగాను, మరోసారి వేగవంతంగాను ఉంటుంది. ఇప్పుడు నీ గమనం మధ్యమస్థాయిలో అనగా మందకొడిగానే ఉంది. అభ్యాసి ఒక స్థానం నుంచి మరొక స్థానానికి చేరాలనుకున్నప్పుడు, ఈ మధ్యమస్థాయి నడక తప్పనిసరి అవుతుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని ఎవ్వరూ తన గమనం ఆగిపోయిందని అనుకోరాదు. ఇంకొక అవకాశం కూడా ఉంది. అది ఏమిటంటే, ఏదైనా చక్రం లేదా మకాం మీద స్వరూపం వ్యాపించినపుడు కూడా మందగతి అనుభవమవుతుంది. దీనిని గుర్తించటం కొంచెం కష్టసాధ్యమే. నీ విషయానికి వచ్చేసరికి నీకు ఈశ్వరునితో సూటిగా అనుబంధం ఏర్పడినట్లు చెప్పి ఉన్నాను. నీ పురోగమనం ఆగిపోలేదు. ఇంకెవరైనా నిన్ను ముందుకు నడిపించినా, నడిపించకపోయినా కూడా నీకు ఈశ్వరుడు స్వయంగా ఆధ్యాత్మిక ఉన్నతిని అనుగ్రహిస్తూనే ఉంటాడు. ఇప్పుడు 'పూజ'కు నీవు ఇంక దూరమయ్యావు. **'మాలిక్'ను 'మాలిక్'గాను అనగా దైవాన్ని దైవంగానే స్వీకరించి, 'అతని' ఆజ్ఞను శిరసావహించటమే నీవు చేసే పూజ అవుతుంది.** నీవు 'పని' (working) బాగా చేస్తూ ఉన్నావు, ఇంకా అలాగే చేస్తూ ఉండు. ఈ వర్తమాన దశలో (ప్రస్తుతదశలో) గతంలో కంటె ఇప్పుడు అంత వేగవంతంగా లేదు. నేను కూడా 'పూజ' చేయటంలేదు కాని ఇతరులకు మాత్రం చేయమని చెప్తున్నాను. ఇది తెలిసినవారెవరైనా, నన్ను విమర్శించకుండా ఉండరు. అనగా నేను చెప్తున్నాను కాని స్వయంగా చేయటంలేదు అని. నిజం చెప్పాలంటే, పూజ జరగటమే లేదు. ఈ స్థితిని గురించి నేను "భక్తిలేకనే తరింపజేయి, అప్పుడు తరింపజేసిన కీర్తిమంతుడవు తావు" అని అనుకుంటాను. ప్రజలు ఆది నుంచీ దీనిని వల్లిస్తూనే ఉన్నారు. అయితే అటువంటివారి మాటలుగాని, శ్లోకాలుగాని భగవంతుడు ఆలకించడు కూడ. మాస్టర్ సాహెబ్ (ఈశ్వర సహాయ్) యొక్క అనుభూతి 'ఆయన'ను మోసంచేసింది అని నేను తలుస్తున్నాను కాని ఆయన అనుభూతితో ఆయన మోసపోలేదు. ఎందుకంటే, దేనినైతే ఆయన నల్లని పొగవంటిదిగా ఉన్న దానిని దోషంగా లేదా ధూళిగా భావించారో అది సత్యత్వం యొక్క రంగు మాత్రమే. అంతేగాకుండా ఈశ్వరునితో ఎంతో కొంత సంబంధం ఏర్పడిందని చెప్పటానికి నిదర్శనం కూడ. మాస్టర్ సాహెబ్ యొక్క అనుభూతి తప్పకుండా కీర్తించదగినదే. దానిని వారు గుర్తించగల్గటాన్ని చూసి నాకు సంతోషం కలిగింది. ఆయనకు పాపం అదేమిటో అర్థంకాలేకపోయింది. ఏ సమయంలో నైనా ఈశ్వరానుగ్రహం కలిగితే అపుడు వారికి అనుభూతి కలిగించి, వాస్తవికత యొక్క నలుపు రంగుకు, ఇప్పుడు ఆయనకు అనిపించిన రంగుకు తేడా ఏమిటో గ్రహింపజేస్తాను. ఇదే రంగు చివరివరకు ఉంటుంది. అయితే దానిలో కూడా లెక్కలేనన్ని స్థితులు ఉంటాయి. ఇది చాలా మంచి స్థితి. దానికి కారణం దైవంతో సూటిగా సంబంధం ఏర్పడటమే. నాకు ఇటువంటి దశ ప్రాప్తమైనపుడు నేను నా గురు మహరాజ్‌కు తెలియపర్చాను. 'వారు' దానికి ఎంతో సంతోషించి ఉంటారు.

"బిటియా! దీర్ఘాయువుతో వర్థిల్లు. నీ జీవిత గమనంలో కడ (చివరి) దాకా చేరుకో. ఈ స్థితిని అవగాహన చేసుకోవటం కష్టం. 'అతడు' (రామచంద్ర) ఒక్కడే వాస్తవిక జీవిత పరామార్థాన్ని చవిచూసాడు, కనుకనే దానిని మీకందరికీ పంచుతున్నాడు. భవబంధాలతో కొట్టుమిట్టాడుతున్న వారిపట్ల దయ కలిగి ఉండు" అని స్వామి వివేకానంద

ఆదేశం ఇస్తున్నారు. "ఇది చాలా మంచి స్థితి. దీనిని గురించి మనస్సులో బాధపడనవసరం లేదు. భగవంతుడు నిన్ను అభినందించి ఇంకా ముమ్మందుకు నడిపించు కుంటూ పోవాలి." ఇది లాలాజీ సాహెబ్ సందేశం.

ఆంగ్లంలోని ఈ వాక్యాలు అర్థంకాకపోయినట్లయితే మాస్టర్ సాహెబ్‌గారిని అడిగి తెలుసుకోగలవు. చౌబేజీ కూడా విడమర్చి చెప్పగలరు. నేను విమల ఉత్తరానికి జవాబు వ్రాశాను. నీవు నీ జీవితచరిత్రను కొద్దికొద్దిగా వ్రాస్తూ ఉండాలని నేను అభిలషిస్తున్నాను. నీ బాల్యానికి చెందిన చాలా సంగతులు నీ తల్లిదండ్రులు తెలియపరుస్తారు. నీవు సహజమార్గంలో అభ్యాసం ప్రారంభించినప్పటి నుండి నీవు నాకు వ్రాసిన లేఖలు, వాటికి నా సమాధానాలు అన్నీ కూడా దానిలో (జీవిత చరిత్రలో) పొందుపరచాలి. నీ ఉత్తరాలన్నీ నావద్ద ఉన్నాయి, వ్రాయటం మొదలుపెట్టాక కోరినట్లయితే పంపిస్తాను. నేను వ్రాసిన జవాబులు నీవద్ద ఉండే ఉంటాయి.

శకుంతల, పాపం అనారోగ్యంతో బాధపడుతున్న కారణంగా ధ్యానం బాగా ఆచరించలేకపోతున్నది. ఆమెపట్ల నాకు బాగా జాలి వేస్తోంది. నీ తండ్రిగారు, తల్లిగారు ఆమె గురించి బాగా సిఫారసు చేశారు. ఆమె తనను నాకు జ్ఞాపకం చేయవలసిందిగా నీకు కూడా జాబు వ్రాసింది. ఆమె నాకు జ్ఞాపకం ఉందా, లేదా అనేది వేరే సంగతి. నీకు అలా చేయాలని అంగీకారమైతే, నీ తల్లిగారి అనుమతి, నీ తండ్రిగారు కూడా అలా కోరినట్లయితే ఆమెను ఉన్నత మండలానికి చేర్చవచ్చు. కాని ఆమె యొక్క పిండదేశం, బ్రహ్మాండ మండలమును నీవు స్వయంగా నిర్మలీకరించు. అయితే ఆమె హృదయంమీద నీ ఇచ్ఛాశక్తిని బలంగా ప్రయోగించవద్దు కాని అతి త్వరగా నిర్మలీకరణ కావించు. శకుంతలను నేను ఉన్నత మండలానికి చేర్చినప్పటికి ఆమె ఆనందాన్ని పొందలేకపోగా "నేను ఏమీ పురోగతి పొందలేదు" అని ఫిర్యాదు చేస్తుంది. కనుక మీరందరూ కలిసి ఆలోచించండి. మీ అందరి ఏకైక అభిప్రాయం ఏమిటో తెలపండి. నారాయణ (ఈశ్వరసహాయ్‌గారి కుమారుడు) ఇక్కడి నుండి తరలిపోవటం మూలంగా జవాబులు వ్రాయలేకపోతున్నాను. అదృష్టవశాత్తు ఎవ్వరైనా దొరికినపుడే వ్రాస్తున్నాను. మీ సోదరుడు హరికి తన పనులకే తీరక దొరకటంలేదు. నీవు అతడిని ప్రక్షాళనం చేస్తే పురోగతి సాగుతుంది. ఇప్పుడు నీవు నీ స్థితిని గురించి వ్రాయగలవు.

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 99

లఖీంపూర్,

04.05.1950

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసిన ఉత్తరం అందింది. అది చదివిన తర్వాత నా దిగులు పూర్తిగాను మరియు తమరు కోపగించుకున్నారేమోనను అనవసర అభిప్రాయం తొలగిపోయాయి. ఈ అమాయక పిల్లపై ఉన్న అపారమైన కృపను కలిగి ఉన్న 'మాలిక్'కు చాలా చాలా ధన్యవాదాలు. తమ దయాపూర్ణ హస్తం సదా నా శిరస్సుపై ఇదే విధంగా ఉండాలి. అది ఇంకా ఎంత ఎక్కువగా ఉండే అవకాశం ఉంటే, అంతగా ఉండాలి. దానితో నేను సూటిగా నా 'మాలిక్'వైపు పయనిస్తూ పోతాను. దయచేసి నన్ను క్షమించండి. ఇంతకుపూర్వం నేను ఎంత ప్రయత్నం చేయగలుగుతూ ఉండేదాననో అంత ప్రయత్నమూ చేస్తూనే ఉన్నాను. అయితే ఎప్పుడైతే పురోగమనం వేగవంతం కాలేదో అప్పుడు నేను చాలా గాబరాపడ్డాను. ఆ సందర్భంలోనే నేను ఒకటి రెండుసార్లు తమరు కోపగించుకున్నారేమోనని అనుకున్నాను. దీనిని నిజమని తలంచండి లేదా తమరు నిర్ధారించుకోవాలనుకుంటే పూజ్య మాస్టర్ సాహెబ్‌గారిని, ఈ ఆలోచనను నేను ఎప్పుడైనా ఆపలేకపోయానా అని అడిగి తెలుసుకోండి. ఈ విధంగా జరగటానికి వీల్లేదని నేను ఎప్పుడూ చెబుతూనే వచ్చాను. అదేమిటో దైవానికే తెలియాలి. ఎందుకంటే, ఎప్పుడైనా నాకు ఇటువంటి ఆలోచన వచ్చినప్పటికీ, అప్పుడు వెంటనే ఎవ్వరో "వద్దు. ఇటువంటి ఆలోచన రానీయకు" అని అడ్డుపడినట్లయ్యింది. దీనివలన

నష్టం కలగవచ్చును కూడ. ఇప్పుడు ఇంకను ఏమైంది అంటే, అది సబబు–తప్పు, మంచి–చెడు, ఏదైనా సరే అది 'మాలిక్' ఇష్టప్రకారమే అన్నట్లయ్యింది. ఇందుకు విరుద్ధంగా ఆలోచన రాకపోవటానికి ఇది కూడా కావచ్చు. ఇంకను 'మాలిక్' దయవలన స్థితిని గురించి కూడా హృదయంలో బాగా తెలుస్తోంది. స్థితి నిలిచిపోయిందని అనుభవానికి వచ్చినప్పుడు, అప్పుడు వెంటనే కాదు, ఇది ఒక దశ నుంచి మరొక దశకు వెళ్ళే సమయంలో మధ్యలో కలిగే నిలుపుదల స్థితి అని స్ఫురించేది. కాని తమ దయాపూర్వక ఉత్తరం రానంతవరకు విచారంతో మనస్సుకు శాంతిలేకుండా పోయింది. తమ కృపకు ధన్యవాదాలు తెలపాలి అని అనుకుందామంటే, నేను స్వయంగా నా అస్థిత్వాన్నే లేకుండా చేసుకోవటానికే ప్రయత్నించాను, ప్రయత్నిస్తాను. కనుక నా శరణాగతి మూలంగా నా అనుభూతి యొక్క పరిధి కూడా సమాప్తమైపోయింది. ఎందుకంటే, ఎప్పుడైతే తమరు నాకు వ్రాసిన మరొక ఉత్తరంలో "ఆ ఒక్క దానినే సాధించగలిగినపుడు, అన్నీ సాధించబడతాయి" అని వ్రాసారో అప్పటి నుండి మరి దేనిని కూడా నావైపు తలెత్తి చూడడానికి కూడా ఆస్కారం లేకుండా చేశాను. ఇదంతా కేవలం నా 'మాలిక్' మరియు 'తమ' యొక్క కృపయే. 'పని' (working) బాగా జరుగుతోంది. అదంతా 'మాలిక్' యొక్క కృపవల్లనే, అదీగాక అదంతా 'అతని' పనియే. పరమపూజ్యులు సమర్థ శ్రీ లాలాజీ సాహెబ్ మరియు పరమ పూజ్యులు శ్రీ స్వామి వారి ఆశీస్సులు సదా ఈ దీనురాలి శిరస్సుపై ఉన్నాయి.

ఈరోజు స్థితిలో మళ్ళీ కొంత మార్పు వచ్చింది కాని అది పూర్తిగా అవగాహనకు రాలేదు. ఒక వింతైన లెఖ్ఖలేనితనం నెలకొని ఉంటున్నది. నేను ఇప్పుడు 'మాలిక్'తో సామీప్యంగా ఉన్నట్లు అనుభూతి చెందుతున్నాను. ఇప్పుడు నా హృదయం చాలా చిన్నదిగా అయిపోయినట్లు అనిపిస్తోంది. హృదయం ఎప్పుడూ కూడా ఆలోచనా రహితంగానే ఉంటున్నట్లు అనిపిస్తోంది. దానిని బలవంతంగా ఈశ్వరునిపై దృష్టి నిలిపేటట్లు లేదా జ్ఞాపకంలో నిలుపుకునేటట్లుగా చేస్తున్న మాట నిజం. ఈ బలవంతం యొక్క పరిణామం బహుశా కొంత భారం మరియు కొంత మానసిక ఆహ్లాదం కావచ్చు. ఇప్పుడు ఉన్న పరిస్థితి ఎలా ఉందంటే, నేను ఎంతగా 'అతని' జ్ఞాపకం కొరకు ప్రయత్నిస్తున్నానో, అంతగా హృదయం మీద భారం లేక ఒత్తిడి అనుభవమవు తున్నాయి. అప్పుడప్పుడు రోజంతా దిగులుపడి 'మాలిక్' జ్ఞాపకాన్ని మరచిపోవలసి వస్తోంది. అప్పుడు కొంతసేపటికి ఆ భారం తగ్గిపోతూ ఉంది. అయితే నేను జ్ఞాపకాన్ని మరచిపోతున్నానని అని కూడా చెప్పజాలను. పూజ్య శ్రీ బాబూజీ! 'అతడి'ని సదా జ్ఞాపకం ఉంచుకునే విధానాన్ని ఏదైనా నాకు చెప్పలేరా! బాబూజీ మీరే చెప్పండి! అప్పుడింక మీరేమి చెబితే అదే విధంగా తయారుకావటంలో సఫలమవుతాను. పూజ్య మాస్టర్ సాహెబ్‌గారు మొన్న నాకు ఇచ్చిన సిట్టింగ్‌లో దీనిని గమనించినట్లుగా చెప్పారు. అదేమంటే, ఇంతకుపూర్వం నా చుట్టురా అలముకుని ఉన్నటువంటి నల్లని పొగలాంటిది ఇప్పుడు ఒక్కటిగా అయిపోయింది అని. అదేమిటో దైవానికే తెలియాలి గాని నాకైతే దాని అర్థం ఏమీ కాలేదు. బహుశా ఇది కూడా 'మాలిక్' యొక్క కృపయేనని అనుకుంటాను. ఇంతకుముందు నేను వ్రాసినటువంటి స్థితి ఇప్పుడు చాలా తేలికగా అనిపిస్తోంది. నాకు అనుభూతి కూడా తక్కువగా ఉంటోంది. ఎందుకంటే, ఇప్పుడు నా స్థితి చాలా అశ్రద్ధతో కూడి ఉంది.

నా జీవిత చరిత్ర వ్రాస్తూ ఉండమని 'తమరు' ఇదివరకే చెప్పి ఉన్నారు. అయితే నేను ఏం చేయాలి? ఎందుకంటే, నా హృదయం ఏదైనా వ్రాయటానికిగాని, చదవటానికిగాని చొరవ చూపటంలేదు. ఇంకా చెప్పాలంటే, నాకేమీ తెలియదు కూడ. ఇప్పుడు ప్రతి దానిలోను నా 'మాలిక్'ను మాత్రమే చూడాలని అనిపిస్తోంది. అలా అనిపించటమే కాదు, 'మాలిక్' దయతో అది స్వయంగానే జరుగుతూ ఉంది. సమస్త ప్రపంచం ఒక్కటిగానే తలపిస్తోంది. మట్టి అంతా కలిసి ఒక్కటైపోయింది.

తమ విధేయురాలైన<br>కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 100

లఖీంపుర్,
12.05.1950

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తర మొకటి తమకు చేరి ఉంటుందను కుంటాను. ఇప్పుడు నా ఆధ్యాత్మిక దశ గురించి ఏమని వ్రాయగలను? అనారోగ్యముగా ఉన్న కారణంగా స్థితి గురించి ఏమీ తెలియడంలేదు. ఆలోచిస్తే, ఇంతకుముందు ఎలా ఉందో, అలాగే ఉన్నట్లుగా అనిపిస్తోంది. పురోగతి కూడా కొంచెం మందకొడిగా ఉన్నట్లే అనిపిస్తోంది. ఇప్పుడు నేను నిరంతరం నన్ను ఒక మృతురాలిలాగా అనుభూతి చెందుతున్నాను. హృదయం ఎప్పుడూ ఎటుపోతూ ఉందో తెలియటంలేదు. అందుచేత హృదయాన్ని సావధానంగా ఉంచటానికి ప్రయత్నించాల్సిన అవసరం ఏర్పడుతోంది. ఒక రకంగా చెప్పాలంటే హృదయం ఇప్పుడు (Innocent) అమాయకంగా ఉంటున్నది. శ్రీ బాబూజీ, దయచేసి నన్ను క్షమించండి. పెద్దక్క విషయంలో, ఆమెను 'తమరు' ఉన్నత ప్రాంతానికి (Higher Region) చేర్చవచ్చునా అని అడిగారు. ఆమె మీద, అదే విధంగా మా అందరిమీద ఉన్న 'తమ' దయ అటువంటిది. అందుకు ధన్యవాదాలు తెలపటానికి మాకు మాటలు చాలవు. ఆ విషయంలో మా అందరి అభిప్రాయం - 'తమకు' ఎలా అనిపిస్తే ఆ విధంగా చేయమని.

అమ్మ తమకు ఆశీస్సులు తెలుపుతోంది. కేసర్, బిట్టో ప్రణామం తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 101

లఖీంపుర్,
06.06.1950

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నిన్న మధ్యాహ్నం అమ్మ మరియు పెదనాన్నగారు వచ్చారు. 'తమ' ఆరోగ్యం బాగా చెడిపోయిందని తెలిసి హృదయం చింతాగ్రస్తమయ్యింది. 'తమరు' ఇంతకుక్రితం - "కొంత నీవు భోగిస్తావు, కొంత నేను" అని వ్రాసారు. కాని ఇప్పుడు చూస్తూ ఉంటే, నేను భోగించిన దంటూ ఏమీ లేకపోగా అంతా తమరే అనుభవిస్తున్నారు. అయితే 'తమ' అభీష్టానికి విరుద్ధంగా నా నోరు మెదపాలని కూడా అనిపించటంలేదు. ఒక ఉత్తరం పంపించివేశాను. దయచేసి తమ ఆరోగ్య పరిస్థితిని గురించి అతిత్వరగా వ్రాయించగలరు.

శ్రీ బాబూజీ! ఇప్పుడు ఉన్న ఆత్మిక దశ ఎలా ఉందంటే, 24 గంటలూ నిద్రిస్తూ మేల్కొంటూ ఉన్నట్లుగా ఉంది. తేలికదనం మరియు ఒక వింతైన శాంతి పూర్వక అలలు కలిగిన స్థితి నిరంతరంగా ఉంటున్నది. ఇంతకుమించి విశేషమైన స్థితి ఏమీ అవగాహనకు రావటంలేదు. పిన్నలైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 102

మీరట్,
16.06.1950

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. 'తమరు' ఇప్పుడు పూర్తిగా కోలుకున్నారని ఆశిస్తాను. 'తమ' దయతో కూడిన ఉత్తరాలు వచ్చి చాలా కాలమైంది. నా ఆత్మిక దశ గురించి కొద్దిగా వ్రాస్తున్నాను. చాలా రోజుల నుంచి నా స్థితి బాగుండలేదు.

ఏమైందో ఆ భగవంతునికే తెలియాలి. ఎప్పుడూ పూజ నిర్వహించనివారిలాగే నేను కూడా తయారైపోయాను. నాలో పూర్వం ఉన్నటువంటి దయామయ స్థితి కూడా ఇప్పుడు లేకుండాపోయింది. ఇంతకుపూర్వం ఎవ్వరైనా బీద వికలాంగుడిని చూసినట్లయితే హృదయం చలించిపోయేది, కాని ఇప్పుడు అటువంటి దయ, జాలి ఏమీ కలగటంలేదు. ఇప్పుడు దయచేసి తమరు నా స్థితి ఏమిటో, అది మంచిదో, చెడ్డదో చెప్పండి. దయ అని మాత్రమే కాదు ప్రతి విషయంలోను స్పందించలేకుండా ఉంటున్నాను. అసలు ఈ స్థితి ఏమిటో తెలియకపోవటమనేది వాస్తవం. 'మాలిక్' యొక్క రూపం ఎంత ప్రయత్నించినప్పటికీ ఏమీ జ్ఞాపకం రావటంలేదు. అది ఎందుకో, నాకు ఏమైనదో భగవంతునికే తెలియాలి. లఖీంపుర్‌లో 'అతని' ఫోటో చూసినపుడు 3,4 నిమిషాలు ఆ రూపం జ్ఞాపకంలో నిలిచేది. అయితే ఇప్పుడు పూజ మరియు సిట్టింగ్‌లో మాదిరిగ 'అతని' రూపం గుర్తించలేకపోతున్నాను. ఇప్పుడు స్థితిలో విశేషమైన మార్పు ఏమీ కనిపించటంలేదు. ఇంతకుముందు అయితే అన్ని స్థితులూ పూర్తిగా విడమర్చినట్లుగా కలుగుతూ ఉండేవి కాని ఇప్పుడు ఏమైందో ఆ దైవానికే తెలియాలి. శ్రీ బాబూజీ, ఇప్పుడు పరిస్థితి ఎలా ఉందంటే, నేను కోరుకున్నట్లుగా పగలు ఎంతగానైనా నిద్రపోవటం, రాత్రి కూడా నిద్రించటమో లేక మేల్కొని ఉండటమో జరుగుతుంది. కాని ఇప్పుడు నేను గమనిస్తున్నది ఏమిటంటే, 'పని' (Working) లేదా 'మాలిక్' యొక్క జ్ఞాపకంలో ఎటువంటి భేదంలేనట్లుగా అనిపిస్తోంది. ఎందుకంటే, రేయింబవళ్ళు రెండూ నాకు ఒకటిగానే అయిపోయాయి. 'తమరి' దయ సదా అపారంగా నిలిచి ఉండాలనేదే నా నిరంతర ప్రార్థన. స్థితిలో తరచుగా కొంత తేడా అయితే నిస్సందేహంగా ఉంటోంది. అది ఏమిటంటే, స్థితి ఇంతకుపూర్వంలాగే ఇప్పుడు కూడా కొన్ని నిమిషాల తర్వాతనే తెలుస్తోంది. అందువలన అప్పుడప్పుడు హృదయం ఆనందపడుతోంది. అయితే కేవలం 19-20 శాతం మేరకే భేదం ఉంటున్నది. అప్పుడప్పుడు నాకు ఈ ఆలోచన తప్పనిసరిగా కలుగుతున్నది ఏమని అంటే, నేను ఈ పూజ, 'పని' (Working) చేస్తున్నానా లేక ఇది అంతా సరదాగానా అని. పూజ లేక 'పని' (Working) నిర్వహించటానికి సంబంధించినంతవరకు ఇది ఒక విధమైన మానసిక అలవాటు చర్యగా అయిపోయిందేమోనని అనిపిస్తోంది. ఆ మానసిక అలవాటు చర్య అప్పుడప్పుడు స్వల్పంగానే ఉంటోంది.

పిన్నలైన సోదర సోదరీమణులకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 103

షాజహాన్‌పుర్,
25.06.1950

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. వ్రాయటానికి ఎవ్వరూ అందుబాటులో లేనందున జవాబు ఇవ్వలేకపోయాను. నీ అనారోగ్యం గురించి కొంచెం బాధపడక తప్పదు కాని అది నా వశంలో లేదు. "ఏది ఎలాగో అది అలా" -అది ఈశ్వరుని ప్రత్యేకత. 'అతడు' ఎలా ఉన్నాడో అలాగే ఉన్నాడు, అది 'అతడి' యొక్క ప్రత్యేకత. 'అతడి' యొక్క ప్రత్యేకత దశలోనే మనం కూడా వ్యవహరించాలి. మనం ఎంతవరకూ పోగలమో అది 'అతని' కానుక. మనది సామ్యావస్థగా ఉండాలి. త్రాసులోని రెండు పళ్ళేలు సమానంగా ఉండాలి. తూకం వేసేటప్పుడు కొంచెం ఎగుడుదిగుడుగా ఉన్నప్పటికీ, తర్వాత ఒకే స్థాయిలో (సమతూకం) ఉండాలి. **దయ, జాలి అనేవి ఎక్కడ, ఎంతవరకు అవసరమో ఆమేరకే ఉండాలి. నేను రాజాహరిశ్చంద్రతో ఏకీభవించను. ఎందుకంటే, అతడు సర్వస్వము అర్పించివేసి ఒక కాటికాపరి చేతికి తనను తాను విక్రయించుకున్నాడు. ఇది ధర్మము అనదగదు సరికదా ఒక రకంగా ఆత్మహత్యా సదృశ్యమే. అతడు ఆచరించిన ఈ పని అసలుకు మానవత్వానికి విరుద్ధమైనది. నా దృష్టిలో దీని వలన అతనికి ఖ్యాతి, కష్టాలు మినహా ఇంక దక్కిందేమీలేదు.** ఫలితం ఏమిటంటే, త్రాసులో ఒక పళ్ళెం క్రిందికే ఉంది. యంత్రంలోని భాగాలన్నీ

సరిగ్గా అమరిక లేకపోతే అది పనికిరాదని చెప్పాల్సి ఉంటుంది. యంత్రంలో (మిషన్) లోపాలు ఉన్నట్లయితే ఇంజనీర్ యొక్క అవుసరం కలుగుతుంది. అసలైన మూలాలు (నియమాలు) తెలిసిన వారు, చాలా అరుదుగానే ఉంటున్నారు. అయితే పూర్వపు రోజుల్లో (మంచి కాలంలో) అటువంటి వ్యక్తుల సంఖ్య ఎక్కువగానే ఉండేది. ఇది గమనించు, ఈశ్వరునితో కలయిక లేదా దైవసాక్షాత్కారం అంటే, 'అతడి'లో ఉన్నటువంటి ఆ దివ్యతేజస్సు, దివ్యలక్షణాలు మనలో కూడా ఉద్భవించాలి. అంచనా వేయటానికి అది సింధువు (సాగరం)కు బిందువుకు ఉన్నంత తారతమ్యం ఉండవచ్చుగాక. ఇపుడు నీ ఉత్తరాలకు వ్రాసే జవాబుల్లో ఏ ఏ విషయాలు అవుసరమో అవి క్రమక్రమంగా వెల్లడవుతున్నట్లు అర్థంచేసుకో. నీకు తెలిసినా తెలియకపోయినా కూడా నీవు నిరంతరం పూజ చేస్తూనే ఉన్నావు. ముమ్ముందు ఇంకా ఏమి జరగబోతోంది అంటే సూత్రప్రాయంగా పూజ జరగనే జరగదు. అంతేకాదు, ప్రయత్నించినట్లయితే హృదయంలో దడ కలుగుతుంది. ఇంకా ఏమిటంటే, ఎవ్వరైనాసరే జీవితపర్యంతం పూజ చేస్తూనే ఉండాల్సిన అవుసరంలేదు. ఏ లక్ష్యసాధన కొరకు పూజ గావించబడుతుందో అది సిద్ధించిన తర్వాత దాని అవసరమే ఉండదు. అయితే ఈ విషయాన్ని ప్రశిక్షకుడు నిర్ధారణచేస్తాడు. ఎవ్వరైనాసరే తనకు తానుగా నిర్ణయం తీసుకోకూడదు. స్వామి వివేకానంద కూడ ఏమి వ్రాశారంటే, రెండు తరగతుల (రకాల) మానవులు దైవపూజ నిర్వహించరు. అందులో ఒకరు అమానుషమైన మూర్ఖుడు; రెండవవారు తనను మించి (ఆధ్యాత్మికంగా) పైకి ఎదిగినవారు.

నీ శ్రేయోభిలాషి,
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 104

లఖీంపుర్,
29.06.1950

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

వినయపూర్వక ప్రణామం. 'తమరు' దయతో వ్రాసి, నారాయణ దద్దా ద్వారా పంపిన ఉత్తరం అందుకుని, చదివి చాలా ఆనందించాను. తమ ఆరోగ్యం ఇంకనూ బాగుపడలేదని కూడా తెలిసింది. దయచేసి ఇప్పుడు 'తమరు' త్వరగా ఆరోగ్యవంతులు కావాలి. 'తమరు' పూర్తిగా ఆరోగ్యవంతులు కావటానికి ప్రార్థనకు మించి మరేదైనా ఉండి ఉంటే, ఆ ఉపాయాన్ని చెప్పినట్లయితే, నేను రేయింబవళ్ళు హృదయపూర్వకంగా దానిని ఆచరిస్తాను. తమరు అనుజ్ఞ ఇచ్చినట్లయితే, కొద్దిరోజులు 'తమరి' ఇచ్ఛా శక్తిని ప్రయోగిస్తాను. అయితే 'తమరి' ఆజ్ఞ లేకుండానే రెండు రోజులు ఆ ప్రయోగం చేసినందుకు క్షమించమని 'తమరి'ని అర్థిస్తున్నాను. నా ఆరోగ్యం గురించి 'తమరు' నిశ్చింతగా ఉండండి. ఇప్పుడు అంతా బాగానే ఉంది. ఇప్పుడు ఎలా ఉందంటే, జబ్బు తదితరమైన వాటిలో 'మాలిక్' సంకల్పంలోనే మునిగిపోయి చాలా ఆనందంగా ఉంటున్నది.

నా ఆత్మిక దశను గురించి చెప్పాలంటే, అది ఒక విరక్తి (ప్రాపంచిక వ్యవహారాలతో అనుబంధం లేకుండా ఉండటం) వంటిదిగా అయిపోయింది. ఇప్పుడు, నా హృదయం దేనివైపూ గాఢంగా మొగ్గుచూపడం లేదని తెలుస్తోంది. మీరట్‌లో వివాహ వేడుకలో, అక్కడ ఉన్న హడావుడిలో నేను ఏమాత్రమైనా లీనమయ్యానో లేదో నాకు తెలియదు కాని, 'మాలిక్' దయతో నా దృష్టి 'అతడి' నుంచి ఎంతమాత్రం మరలకుండా ఉండటమే జరిగింది. ఇప్పుడు ఉన్న స్థితి ఎలా ఉంది అంటే, ఎటువంటి విషయాలుగాని, గుణాలుగాని, అవగుణాలుగాని లేదా దోషాలుగాని నావి కానట్లుగా అనిపిస్తోంది. అలా ఎందుకో తెలియదుకాని, మేమంతా మీరట్ నుంచి వెళ్ళిపోయాక జనమంతా శోకంలో మునిగిపోయారు. నా కళ్ళు కూడా కొంచెం ద్రవించాయి. అలా ఎందుకయ్యిందో నాకు అప్పుడు గాని, ఇప్పుడు గాని అర్థం కావటంలేదు. ఈ దుఃఖం అందరినీ వదలిపెట్టి వెళ్ళటం మూలంగానా అంటే అదీ చెప్పలేను. ఎందుకంటే, ఇప్పుడు ఈ లోకంలోని జనులందరూ నాకు ఎలా అనిపిస్తారో, నా కుటుంబీకులు కూడా అదే విధంగా అనిపిస్తున్నారు.

నిజం చెప్పాలంటే, ఎవ్వరిపట్ల రవ్వంత కూడా అనుబంధం కలగటం లేదు. అది ఎలా ఉందంటే, ఒక చిన్న పిల్లవాడు విలపిస్తూన్న వాళ్ళందరినీ చూసి అకారణంగా అతడు కూడా విలపిస్తున్నట్లుగా ఉంది. ఇంతకుపూర్వం నాకు ఎవ్వరి గురించైనా కోపం వచ్చినట్లయితే, తర్వాత దానిని గురించి బాగా దుఃఖం కలిగి వారిని క్షమించమని చెప్పేదానిని. ఇప్పుడైతే దేనిని గురించినైనా కలిగిన దుఃఖం మాట ప్రక్కన పెట్టితే, అసలు ఏమి జరిగిందో అను విషయంవైపు కూడా నా దృష్టి పోవటంలేదు. ఇప్పుడు నేను ఎక్కడికైనా వెళ్ళినాగాని, లేదా ఎవ్వరైనా నా ఎదుటి నుంచి వెళ్ళినాగాని, ఆ సంగతే నా దృష్టికి రావటంలేదు. ఇప్పుడు, కేవలం ప్రేమ మరియు అనుబంధం మిగిలి ఉన్నట్లుగా స్పష్టంగా కనబడుతున్నది. ఇక్కడకు (స్వగృహం) వచ్చిన తర్వాత ప్రతి ఒక్కరినీ చూసి జ్ఞాపకం చేసుకోవాల్సి వస్తోంది. నా పూజ్య బాబూజీ! నేను ఎంత అని, ఏమని చెప్పి 'మాలిక్'కు ధన్యవాదాలర్పించాలి! ఇంకా ఇప్పుడు ఉన్న స్థితి ఏమిటంటే, ఈ ధన్యవాదాలు ఎవరికి అర్పించాలి, ఎవ్వరిచేత అర్పించబడాలి అనే సమస్య. 'అతని' అభీష్టం ఎలా ఉంటే అలా జరుగుతుంది. నేను ఇప్పుడు తప్పనిసరిగా చెప్పవలసింది ఏమిటంటే, ఇప్పుడు నాలో ఇంకేమీ మిగిలి ఉండలేదు కాని సమయం వచ్చినప్పుడు సందర్భానికి తగ్గట్లుగా అన్నీ ఉంటాయి. అయితే దేని ప్రభావమూ నా మీద ఉండదు. శ్రీ బాబూజీ, ఈ స్థితి ఏమిటోగాని, నేను ఎప్పుడైనా ఎక్కడికైనా వెళ్తున్నపుడు దారిలో ఎవరైనా గడ్డం ఉన్న మనిషి కనిపించినట్లయితే, అప్పుడు ఒక్కసారిగా నా గుండె కొద్ది క్షణాలపాటు దిగులు చెందినట్లవుతుంది. పూజను గురించి 'తమరు' ఏదో వ్రాశారు, కాని వాస్తవం ఏమిటంటే, ఇప్పుడు పూజ చేయాలంటే మనస్సు ఇష్టపడటంలేదు. ఎందుకంటే హృదయం ఆనందించాల్సిందిపోయి విచారగ్రస్తమవుతోంది. అయినప్పటికి కొంచెంసేపు పూజలో కూర్చొన్న తర్వాత కళ్ళు తెరవగానే ఏదో పెద్ద కుదుపు కలిగినట్లుగా ఉంటున్నది. ఏదో ఇతర లోకం నుంచి ఊడిపడినట్లుగా, ఇదివరలో ఎలా అనిపించిందో ఆ విధంగా అనిపిస్తోంది. అందుచేత ఇప్పుడు పూజ అంటే హృదయం గాబరా పడుతోంది. ఇప్పుడు నాకు పూజాదికాలు ఏమీ అవసరం లేదు. నాకు కావలసిందల్లా కేవలం 'మాలిక్' మాత్రమే. ఏదైనా స్థితి కలిగినా లేదా కలగకపోయినా, మరింకా నాకు దేనితోనూ అవుసరం లేకుండా పోయినపుడు ఇంక పూజ మాట ఏమిటి? బాబూజీ, ఇప్పుడు కూర్చుని 'పని' చేస్తున్నప్పుడు భయంగా ఉంటుంది. అది ఏమిటో దైవానికే తెలియాలి గాని, నా స్థితి ఎలా ఉందంటే, 'మాలిక్'ను కూడా క్రమంగా మరచి పోతున్నానా అన్నట్లుగా ఉంది. 'అతడి' రూపమంటూ ఏదీ జ్ఞాపకానికి రావటంలేదు. అందుచేత అప్పుడప్పుడు 'తమరి'ని దర్శించాలను కోర్కె బాగా కలుగుతున్నది. ఈశ్వరుని గురించి 'తమరు', "అతడు ఎవరో అతడే" అని వ్రాసి ఉన్నారు. తమ కృపతో మాత్రమే అది అప్పుడప్పుడు స్ఫురణకు వస్తున్నది కాని, "అతడు ఎవరో అతడే" అను స్థితి నాకు అర్థం కావటంలేదు. సరే, దానిని 'మాలిక్' అభీష్టానికే వదిలివేస్తాను. 'తమరు' మాత్రం మనం ఆ స్థితివైపుగానే వెళ్ళాల్సి ఉంది అని వ్రాసారు కనుక 'తమ' ఇష్టానుసారమే నన్ను నడిపించుకు వెళ్ళండి. నాకు ఇచ్చే ఆజ్ఞను శిరసావహించటానికి నేను సిద్ధంగా ఉంటాను. తమరు నిర్వచించిన మాట – "త్రాసులో పళ్ళేలు రెండూ సమానంగా ఉండాలి. అవి తూచేటప్పుడు కొంచెంసేపు ఎగుడు దిగుడైనా కాని మళ్ళీ సమస్థాయికి వస్తాయి" చాలా వాస్తవంగా బాగుంది. నిజంగానైతే 'తమ' ఉత్తరం బాగా అర్థం కాలేదు. ఇప్పుడు క్రమంగా పూజను విడిచిపెట్టున్నాను, అది నాకు అవసరం లేదు. ప్రస్తుతం ఎప్పుడు కూడా విరక్తిగా ఉంటున్నది. నాకైతే బాగా జ్ఞాపకం లేదు కాని, బహుశా నిన్న పూజలో సర్దార్ పటేల్ ఆకస్మాత్తుగా పడి ఉన్నట్లుగా చూసాను. దీనిని ఏమని అర్థం చేసుకోవాలి. ఆ సమయానికి నాకు ఎవ్వరి గురించీ ఏమీ తెలియదు. అది 'తమ'కు తెలియాలి. పూజ చేయాలంటే నా హృదయం భీతిచెందుతోంది. అది ఇప్పటికే ప్రతి సమయమూ తల్లడిల్లుతూ ఉంది.

పిన్నలైన సోదర సోదరీలకు ప్రేమతో.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 105

షాజహాన్‌పూర్,
07.07.1950

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

నీవు కుశలముగా ఉండుగాక. నీ ఉత్తరం చేరింది. నీ ఉత్తరాలన్నీ నావద్ద భద్రపరచాను. ప్రతి ఉత్తరానికి జవాబు విపులంగా వ్రాయాలను కుంటున్నాను కాని వ్రాసేవారు ఎవరూ లేక ఇబ్బందిగా ఉంది, పోనీ నేను స్వయంగా వ్రాద్దామంటే ఆలోచనలు ఆగిపోతాయి. అందుచేత ఉత్తరాలకు జవాబు వ్రాయటం ఆలస్యమవుతోంది. నారాయణ ద్వారా నాకు బాగా సహాయం లభించేది. హరికి తీరిక లేకుండా పోయింది. 'అతడి'కి అభీష్టం ఎప్పుడు కలిగితే అప్పుడు జరుగుతుంది. నీ ఈ ఉత్తరానికి విపులంగా జవాబు వ్రాయాలంటే కనీసం ఇరవై – ఇరవై ఐదు పేజీలవుతుంది కనుక క్లుప్తంగా వ్రాస్తున్నాను.

నా ఆరోగ్యం ఇప్పుడు బాగుంది. నీవు నీ ఇచ్ఛాశక్తిని రెండు మూడు రోజులు వినియోగించావు. నాకు దాని వలన ఎంత ప్రయోజనం కలిగిందో చెప్పలేను. నన్ను నేను పరిశీలించుకుంటున్నాను కాని విషయం ఏమీ గ్రహింపుకు రావటంలేదు. ఇది ప్రార్థన యొక్క ప్రభావం అని మాత్రం తెలుస్తోంది. 'పని' (Working) చేయటం ఎంతమాత్రం వదిలిపెట్టకూడదు. నీకు ఇప్పుడు పూజ అంటే, కేవలం 'పని' (Working), ఇతరులకు శిక్షణ నివ్వటం. 'పని' (Working) నీ అదుపులో ఉండాలని, ఇంకా దానిని సమర్థవంతంగా సరైన రీతిలో నిర్వహించటం కోసం నేను బ్రహ్మాండమండలం మీద ఆధిపత్యం నీకు కలిగించాను. నా దృష్టికి వచ్చినంతలో ఇదే మొట్టమొదటి ఉదాహరణ. ఈ 'పని' (Working) ఇప్పటివరకు స్త్రీ జాతికి ఒప్పగించబడలేదనియే భావిస్తాను. నీ వర్తమాన వైరాగ్యస్థితి (Renunciation) చాలా పవిత్రంగా ఉండటంతోపాటు నీ లయావస్థ కూడా బాగా కొనసాగుతూ ఉంది. మన స్థితి ఇలానే ఉండాలి కాని దీనిని అనుకరించాల్సిన అవసరం లేదు. భగవంతుని కృపతో నీలో ఆ స్థితి ప్రారంభమైపోయింది కనుకనే నేను ఇలా వ్రాస్తున్నాను. మనం ఎవ్వరైనా బాధపడుతున్నట్లుగాని, ఇంకొక సందర్భంలో ఎవరైనా ఆనందంగా ఉన్నట్లుగాని చూడటం తటస్థించితే, మనలో కూడా విచారం, సంతోషం వ్యక్తంకావాలి. మనం అక్కడినుంచి తొలగిపోయిన తర్వాత సుఖదుఃఖాలు ఏవీ మన అనుభవానికి రాకూడదు. మీరట్‌లో నీ కళ్ళల్లో అశ్రువులు ఉప్పొంగటానికి కారణం ఇదే.

నీ శ్రేయోభిలాషి,
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 106

లఖీంపుర్,
10.07.1950

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

వినయపూర్వక వందనములు. పూజ్య మాస్టర్ సాహెబ్ ద్వారా తమరు దయతో వ్రాసి పంపిన ఉత్తరం చేరింది. తమరి ఆరోగ్యం బాగుందని తమ ఉత్తరం చదివి తెలుసుకుని అందరమూ సంతోషించాము. రెండు రోజులుగా ఇచ్ఛాశక్తి ప్రయోగం ద్వారా మంచి ప్రయోజనం చేకూరింది. ఇలా జరిగినందుకు 'మాలిక్'కు ధన్యవాదాలర్పిస్తున్నాను. అది నాకు అసాధ్యం కనుక, బహుశా నేను 'పని' (Working) చేయటం నిలిపి వేస్తున్నాను అని వ్రాసి ఉండేదానను కాను. ఇప్పుడు 'మాలిక్' కృపతో, ఎటువంటి పూజనయితే 'అతడు' కోరుకుంటున్నాడో అదే పూజ జరుగుతోంది. తమరు విచారం, సంతోషం గురించి వ్రాసినది చాలా సబబుగా ఉంది. అది అలాగే ఉండాల్సి

ఉంటుంది కూడ. ఎవ్వరూ లేఖకులు లేనందువలన తమరు నా ఉత్తరానికి జవాబు వివరంగా వ్రాయలేకపోవటమనేది ఏమంత పెద్ద విషయం కాదు. నాకు మాత్రం కేవలం 'మాలిక్'తోనే పని ఉంది కనుక 'తమరి' కృప నాపై సదా నిలిచి ఉండాలని విన్నవించుకుంటున్నాను.

పూజ్య మాస్టర్ సాహెబ్ గారి ద్వారా, పరమ పూజ్యులు మహాత్మ శ్రీ పాపా గార్కి తీవ్రంగా జ్వరం వచ్చినట్లుగా తెలిసింది. దయచేసి వారికి నా ప్రణామాలు తెలిపి, వారి ఆరోగ్యం గురించి ఉత్తరం వ్రాయించవలసిందిగా కోరుతున్నాను. ఇప్పుడు నా ఆత్మిక దశ ఎలా ఉంది అంటే, ఇంతకు క్రితం అయితే నేను 'మాలిక్' జ్ఞాపకాన్ని మరచిపోతూ ఉండేదానిని, కాని ఇప్పుడు స్వయంగా 'మాలిక్'నే మరచిపోతున్నాను. అప్పుడప్పుడు ఫోటో చూసినప్పటికి కూడా ఆ ఫోటో ఎవరిదో కూడా గుర్తించలేనట్లుగాను ఉంటోంది. ఇంకొక ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, 'మాలిక్' యొక్క జ్ఞాపకమంటూ వచ్చిందంటే, అసలు 'అతడి'ని నేను ఇంతకుముందు ఎప్పుడూ చూడనట్లుగాను, 'అతడి'ని గురించి నాకు ఏమీ తెలియదన్నట్లుగా ఉంటున్నది. నేను ఒకసారి ఇంతకుపూర్వం ఎక్కడి నుంచైనా ఇంటికి తిరిగి వచ్చినపుడు, నా కటుంబీకులే నాకు ఎవరో తెలియదన్నట్లుగా ఉంటున్నదని, వారిని గుర్తించటానికి చాలా ప్రయత్నించవలసి వస్తున్నదని వ్రాసి ఉన్నాను కదా! అదే పరిస్థితి ఇప్పుడు 'మాలిక్'పట్ల ఉంటున్నది. ఇంతకుపూర్వం 'మాలిక్'పట్ల 'అతడు' నా వాడే అని అనిపించినటువంటిది ఇప్పుడు ఏమీ లేకుండా పోయింది. ఇప్పుడు హృదయంలో 'అతని'పట్ల ఒక విధమైన నిర్లక్ష్యం వంటిది లేక మరో విధంగా అనిపిస్తోంది. ఒక్క క్షణం కూడా శాంతి కలగటం లేదు. అది ఎందుకో 'అతని' పని ఏమిటో 'అతని'కే తెలియాలి.

తమరు పెద్ద అక్కకు వ్రాసిన ఉత్తరం చాలా అద్వితీయంగా ఉంది. అయితే అది నాకు ఎంతగా అర్థమైంది అంటే, అది నా అనుభవం కలిగినంతలోనే. గతఉత్తరానికి ముందు, తమరు వ్రాసిన జవాబులో, నేను ఒక విషయం గురించి వివరణ అడిగాను. అది ఎవ్వరికైనా చెప్పడానికి ఉపయోగపడేదైతే, దయచేసి దాని గురించి వ్రాయండి.

పిన్నలైన సోదర సోదరీమణులకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 107

లఖీంపుర్,

15.07.1950

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

వినయపూర్వక వందనములు. ఈరోజు హరిదద్దాగారి ద్వారా తమరి యొక్క మరియు పరమపూజ్యులైన పాపాగారి ఆరోగ్యం గురించిన వివరాలు తెలిశాయి. తమరు మళ్ళీ మొన్నటి రోజున తల తిరుగుడుకు గురి అయ్యారని తెలిసి మేమందరం విచారించాము. దయచేసి తమ ఇద్దరి పరిస్థితి గురించి వెంటనే తెలియజేయగలరు. ఇప్పుడు నా మరపు స్థితి ఇంకా పెరిగినందువలన దేనినీ గుర్తించలేకపోతున్నాను. ఇప్పుడు పని చేస్తున్నంతసేపు పని చేస్తున్నానుగాని, వెంటనే మళ్ళీ అన్నీ మరచిపోతున్నాను. అది ఎంతగానంటే, అప్పటివరకు నేనేమి పని చేశానో కూడా గుర్తించలేక పోతున్నాను. నా పరిస్థితి ఎలా ఉన్నదంటే, పని చేస్తూనే ఉన్నాను, మరచిపోతూనే ఉన్నాను, రెండూ ఒకేసారి జరుగుతున్నది. భోజనం చేసిన తరువాత, ఎవ్వరైనా నన్ను ఏమి కూరలు తిన్నావనిగాని, వాటి రుచి ఎలా ఉందనిగాని అడిగినప్పుడు అంతా మరచిపోయినట్లుగా అనిపిస్తోంది. బాబూజీ, నేను 'మాలిక్'నే మరచిపోగా ఇంక మిగిలినవాటి సంగతి ఏమని చెప్పను! ఇప్పుడు కూడా నా పరిస్థితి అదే విధంగా, నిలకడగా ఉంటున్నట్లు అనిపిస్తోంది. ఇప్పుడు ఒక అద్భుతం అనుభవమవుతోంది. అదేమిటో దైవానికి తెలియాలి, 'మాలిక్'లో ఏమీ ప్రత్యేకత ఉన్నట్లుగా గాని, అతనిపట్ల ఆకర్షణ ఉన్నట్లుగా గాని అనిపించటంలేదు. అయినప్పటికీ, 'అతడు' నా 'మాలిక్', నేను

మాత్రం ఏమై ఉన్నానో అదే. వాస్తవం ఏమిటంటే, నేను ఎలా ఉన్నానో, లోకంలో ఇతర జనులు ఎలా ఉన్నారో, 'నా మాలిక్' కూడా అలానే ఉన్నట్లుగా అనిపిస్తోంది. అయినప్పటికి కూడా 'మాలిక్' ఎవరో, ఎక్కడ ఉన్నారో కూడా జ్ఞాపకంలేనట్లుగా అనిపిస్తోంది. 'మాలిక్'పట్ల వైరాగ్యం చెందినట్లుగా అనిపించింది. పూజ కూడా మానివేశాను. అయినా కూడా ఆనందంగానే ఉన్నాను కాని విచారం లాంటిది ఏమీ అనిపించటంలేదు. ఈ మరపుస్థితి అన్ని వేళలా నిలిచి ఉంటూనే ఉంది. ఇప్పుడు నేను దానిని చాలావరకు గుర్తించలేనట్లుగా ఉంది. ఎందుకంటే, నేను మరపుస్థితిలో ఉన్నట్లుగా నాకు అనిపించటంలేదు. నేను పని చేస్తున్నంతసేపూ ఎటువంటి మరపు లేనట్లుగా ఉండి, పని పూర్తికాగానే మళ్ళీ మరపు స్థితిలోకి వెళ్ళిపోతున్నాను. నన్ను పరిశీలించుతున్నవారు నాలో చురుకుతనం ఉన్నట్లుగా చెప్పుకుంటూ ఉంటే, బయటివారు నేను ఏదో జబ్బుతో ఉన్నట్లుగా భావించి మోసపోతున్నారు. ఇదంతా నా 'మాలిక్'కు నాపట్ల ఉన్న అపార దయ మూలంగానే, అందుకుగాను 'అతని'కి అనేక ధన్యవాదాలు. నా శరీరంలో కనిపిస్తున్న చైతన్యం గురించి అందరూ బాగా చెప్పుకుంటూ ఉంటారు కాని నాకైతే అదంతా ఎందుకు, ఎలా జరుగుతున్నది ఏమాత్రం తెలియదు. ఈ స్థితి మధ్య మధ్యలో ఎందుకు శూన్యంగా అనిపిస్తున్నదో ఆ దైవానికే తెలియాలి. ఈ విషయం చాలాసార్లు వ్రాయాలని అనుకున్నాను కాని, వ్రాయలేదు. ఇంతకుపూర్వం ఈ స్థితి అప్పుడప్పుడు కలుగుతూ ఉండేది కాని ఇప్పుడు ప్రతిరోజు తరచుగా కలుగుతూనే ఉంది.

పిన్నలైన సోదర సోదరీమణులకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 108

లఖీంపుర్,

25.07.1950

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం 'తమ'కు చేరి ఉంటుందను కుంటాను. మాస్టర్ సాహెబ్ గార్కి నిన్న హరిదద్దాగారు వ్రాసిన లేఖనుబట్టి తమ ఆరోగ్యం బాగుపడిందని తెలిసి మా అందరకీ సంతోషం కలిగింది. నా ఆత్మిక దశ యొక్క స్థితి ఈ విధంగా ఉంది: ఇప్పుడు నిరంతరం నిర్లిప్తంగా ఉన్న స్థితి ఉంటున్నది. ఇది కూడా ఒక మంచి స్థితి అయి ఉండవచ్చునేమో అనేది నాకు తెలియకున్నది. ఇప్పుడు పూర్తిగా ఆత్మ సమర్పణ (Self-surrender) గాని, మరేదైనా గాని ఉండటంలేదు. నిజం చెప్పాలంటే, ఇప్పుడు పూజ అనేది ఏమీ లేకపోగా నేను ఆత్మ సమర్పణ (Self-surrender) కూడా చేయలేకపోతున్నాను. నా ఎటువంటి ప్రయత్నమూ నెరవేరటంలేదు. ఇంతకుక్రితమైతే నేను లోనికి తీసుకునే అన్న పానాదులు అన్నింటిలోను నాకు ఈశ్వరీయ ధారయే అనుభూతమవుతూ ఉండేది. ఇప్పుడు నాకు ఎటువంటి అభ్యాసమూ చేయాలని అనిపించటంలేదు. ఒకవేళ ఆచరించినప్పటికీ అది ఒక ఆటగానో లేదా ఒక అనుకరణగానో అనిపించటమేకాక వెంటనే హృదయం మీద భారం మోపినట్లుగా ఉంటున్నది. ఇంతకుపూర్వం ఇటువంటి స్థితి తరచుగా కలిగిన సందర్భంలో, అది నాకు అయిష్టంగా ఉండేది. యదార్థం ఏమిటంటే, ఈ స్థితినే కనుక 'మాలిక్' ఇంతకుపూర్వం ఇచ్చి ఉన్నట్లయితే, బహుశా నేను, బాబూజీ, నా స్థితి ఇప్పుడు బాగా దిగజారిపోయింది అని చెప్పి ఉండేదానను, కాని ఇప్పుడు 'అతడు' ఎటువంటి స్థితిని అనుగ్రహించినప్పటికీ దానిని స్వీకరిస్తాను. ఇప్పటికి కూడా అప్పుడప్పుడు నేను తికమకపడుతూ ఉంటాను. శ్రీ బాబూజీ, ఎందుకని నా మనస్సు ఎల్లప్పుడు ఒక విధమైన కృంగుబాటుతో ఉంటున్నదో, ఆ దైవానికే తెలియాలి. ఇప్పుడు దయచేసి నేను సరైన మార్గంలో నడుస్తున్నానో లేదో చెప్పండి. ఇప్పుడు నా నడక నాకు సంతృప్తికరంగా లేదు. ఇంతకు పూర్వం ఒకసారి, "నడక అప్పుడప్పుడు

కొంచెం మధ్యస్తంగా తప్పనిసరిగా ఉంటుంది" అని తమరు వ్రాసారు. అప్పుడు రెండు మూడు రోజులు అదే విధంగా ఉండి మళ్ళీ యధాస్థితికి వచ్చినట్లుగా గ్రహించేదాన్ని, కాని ఇప్పుడు ఈ మధ్యస్థ స్థితి తొలగిపోకపోగా ఇంకా మందగించిపోతున్నట్లుగా అనిపిస్తోంది. ఇది కూడా ఒక స్థితియే అంటారా? నిజం చెప్పాలంటే, ఇప్పుడు ఈ స్థితినిబట్టి నాలో ఆధ్యాత్మికత అంటూ ఏమీ లేదు అనిపిస్తోంది. బాబూజీ, దీనిలోని నిజానిజాలు తమకే తెలియాలి. నా ఈ స్థితిని నేను ఇంతకుముందు వ్రాసినట్లుగానే అనిపిస్తోంది. ఇప్పుడైతే అప్పుడప్పుడు మెదడులో ఒక విధంగా టక్ టక్ అనిపిస్తూ ఒక వింతైన ఆశ్చర్యం కలుగుతోంది. అదేమిటో నేను సరిగా అర్థంచేసుకోలేకపోతున్నాను.

చిన్నవారైన సోదర సోదరీలందరికీ ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 109

లఖీంపుర్,

02.08.1950

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. దయతో కూడిన తమ ఉత్తరాలు చాలా రోజుల నుంచి రాలేదు. ఇక్కడ అంతా కుశలమే. తమరు కూడా కుశలమేనని భావిస్తాను. ఇప్పుడు నా స్థితి ఎలా ఉంది అంటే, ఏదైనా చదివినా గాని లేదా స్వయంగా వ్రాసినాగాని అదేమిటో నాకు అర్థం కావటంలేదు. అదేమిటో దైవానికే తెలియాలి. అంతేకాకుండా ఏదైనా ఉత్తరం వ్రాసి దానిని మళ్ళీ చదువుదామని అనుకుని ఉత్తరమంతా పూర్తిగా కళ్ళు తెరచి చదవటానికి ప్రయత్నించినప్పటికీ ఏమీ కనిపించటంలేదు. ఒకవేళ పూర్తిగా చదివినప్పటికి కూడా, ఏమీ వ్రాసానో తెలియని పరిస్థితి నెలకొని ఉంది. ఇప్పుడు ఆత్మ సమర్పణ (Self-surrender) చేసుకొనే ప్రయత్నం గాని లేదా ప్రార్థనగాని చేస్తూ ఉంటే, అది అంతా కల్పితంగా ఉండి బాహ్యంగానే సంచారం చేస్తున్నట్లుగానే అనిపిస్తోంది. ఇప్పుడు ఇంకా ఎలా ఉందంటే, ప్రపంచంపట్ల, స్వయంగా నాపట్ల కూడా ఒకే భావం నెలకొని ఉంటోంది. ఆ భావం ఏమిటో కూడా నాకు తెలియకుండా ఉంది. నిజంగానైతే, అసలు ఆ భావం అంటే ఏమిటో దాని అర్థం కూడా నాకు తెలియకుండా ఉంది. ఇంకొక విధంగా చెప్పాలంటే, ప్రపంచం యావత్తు ఒకే ధార/ ప్రవాహంగా అయిపోయింది. మంచి ఏదో, చెడు ఏదో కూడా నాకు తెలియటంలేదు. శ్రీ బాబూజీ, ఇలా ఉంటున్నప్పటికి కూడా, నా స్థితి నెలల తరబడి ఒకే విధంగా ఉంటున్నది. అంతా దైవేచ్ఛ. ఇప్పుడు స్థితి అతికష్టం మీద గాని, తెలియటంలేదు. అదేమిటో దైవానికే తెలియాలి.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు. అమ్మ తమకు ఆశీస్సులు తెలుపుతోంది.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 110

లఖీంపుర్,

03.08.1950

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. దయాన్వితమైన తమ ఉత్తరం చాలాకాలంగా అందలేదు, అలాగే తమరి క్షేమ సమాచారం కూడా తెలియలేదు. దీని మూలంగా అందరూ దిగులుతో ఉన్నారు. ఇటీవల నా ఆరోగ్యం కూడా బాగుండలేదు. సరే, 'మాలిక్' దయతో అది బాగుపడుతుంది. నా ఆత్మిక దశ గురించి ఏమని వ్రాయమంటారు? నాలో ఇప్పుడు అల్పంగానైనా ఆధ్యాత్మికత అంటూ ఉందని చెప్పటానికి నాకు అధికారం లేకుండాపోయింది. ఇప్పుడు నాలోను, నా స్థితి గురించి చెప్పదగిన విషయం ఏమీ లేకుండా పోయింది. ఈ నిర్లిప్తదశ ఇంకా ఎంతకాలం ఉంటుందో

ఆ దైవానికే తెలియాలి. పూజ్య శ్రీ బాబూజీ, తమరికి యదార్థం వ్రాస్తున్నాను, ఆత్మ సమర్పణ (Self-surrender) అనేది కలగకపోగా దాని కోసం చేసే అభ్యాసం నిరుపయోగమైనదిగా ఉన్నట్లు అనిపిస్తోంది. ఇప్పుడు నాలోను, 'మాలిక్'లోను చెప్పదగిన విషయం ఏమీ లేకుండాపోయింది. దయచేసి తమరు నన్ను చూసి ఏమి జరిగిందో వ్రాయండి. ఇక భారం (Heaviness) విషయానికి వస్తే, అది దానంతట అదే నాలో కలిగి, అకస్మాత్తుగా కూర్చున్నప్పుడు కూడా భారం అధికమైపోతున్నట్లుగా అనిపిస్తోంది. ఆ తర్వాత అది శీఘ్రంగా గాని, ఆలస్యంగా గాని సర్దుబాటు అవుతోంది. అప్పుడప్పుడు ఎక్కువసార్లు గాను, మరొకప్పుడు ఒకటి రెండుసార్లు మాత్రమే ఇది అనుభవమవుతోంది. ఇప్పుడు ఇలా కూడా జరుగుతోంది: ఇప్పుడు 'పని' (Working) జరుగుతూ ఉన్నప్పుడు దీని గురించి ఒకసారి ఆలోచించినప్పుడు పెద్దగా భారమనిపించటంలేదు. అయితే ఆ 'పని'ని పదే పదే దృష్టిలో పెట్టుకుని చేస్తున్నట్లయితే, భారం అనుభవమవుతోంది. దానంతట అది ఏమి జరుగుతుందో అదే జరుగుతుంది. ఏమాత్రం వత్తిడి చేసినా అది ఇంకా భారమవుతోంది. నిస్సందేహంగా, ఇప్పుడు గ్రహింపు కొంత చురుకుగా ఉంది. అయినప్పటికీ, ఇప్పుడు నా స్థితి గురించి నయితే ఏమీ ఇబ్బంది లేదు కాని, 'మాలిక్'పట్ల నాకు తెలియకుండానే ఏదో ఆవేదన లాంటిది నిలిచి ఉంటున్నది. దయచేసి తమరు, తమ క్షేమ సమాచారం వెంటనే తెలియజేయగలరు.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 111

లఖీంపుర్,

10.08.1950

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. చాలా రోజులుగా తమ నుంచి ఉత్తరం రానందున, అందరూ దిగులుగా ఉన్నాము. ఏమాత్రం అవకాశం ఉన్నా, మాయతో (బాబూజీగారి కుమార్తె) తమ క్షేమం గురించి ఉత్తరం వ్రాయించి, త్వరగా పోస్టు చేయించే విధంగా దయ చూపండి. నా ఆరోగ్యం కూడా ఇప్పుడు బాగానే ఉంది.

నా ఆత్మిక దశను గురించి, ఏమి వ్రాయాలి? ఇప్పుడు నేను గమనిస్తున్నది ఏమిటంటే, నా నుంచి 'మాలిక్'ను ప్రార్థించటం కూడా జరగటంలేదు. మనస్సు అందులో లగ్నం కావటంలేదు. తరచుగా ప్రార్థన చేసినపుడు, స్థితిలో ఏదైనాగాని, ఎటువంటిదైనాగాని మార్పు వస్తున్నట్లుగా అనిపిస్తోంది. ఏమైనప్పటికీ, ఇప్పుడు దాని (ప్రార్థన) నుంచి దూరమవు తున్నాను. శ్రీ బాబూజీ, ఇప్పటికీ నాకు మనస్కరించటంలేదు. 'తమరు' ఇంతకుక్రితం ఒకసారి, నడక (పురోగమనం) మధ్యమగతిలో ఉంది అని వ్రాశారు. దానిని సరిదిద్దుకోవటానికి బదులు ఆ గమనం దాదాపు మందగించిపోతూ ఉన్నట్లుగా తలపిస్తోంది. దయచేసి 'తమరు' ఈ విషయం ఏమిటో పరిశీలించండి. స్థితి ఎలా ఉందంటే, అది నా వశం తప్పిపోయింది. బహుశా 'మాలిక్' యొక్క అభీష్టం ఇదేనేమో! ఇప్పుడు నాలో (activity) చురుకుదనం కూడా క్రమంగా క్షీణించిపోతున్నట్లుగా నాకు అనిపిస్తోంది. ఇలా ఉన్నప్పటికీ, దీనిని అలసత్వం అనటానికి వీలులేదు. ఇంతకుపూర్వం నాలో ఉన్న ఉత్సాహం - "ఈ పని ఏదైతే ఉందో దానిని నేను చేసితీరతాను" అన్నంతగా ఇప్పుడు లేదు. ఇక్కడ 'తమరు' చెప్పినట్లుగా- "ఎవ్వరైనాగాని తమ శరీరంలోని అణువణువునూ 'మాలిక్'లో లయం చేయాలి"అను మాట తలచుకున్నపుడు వెంటనే నాలో ఉత్సాహం పొంగిపోయింది. అప్పుడు నేను -"నేను తప్పకుండా చేస్తాను" అని చెప్పాను, అయితే ఇప్పుడు మాత్రం నాలో అటువంటి భావం ఏమీ లేదు. ఇప్పుడు నేను తరచుగా అనుకుంటున్నాను - "నేను శ్రీ బాబూజీతో చెప్పాను కనుక ఇప్పుడు ఎంతోకొంత ప్రయత్నించాలి" అని. అయితే నిజం చెప్పాలంటే, రోజంతా ఒక్క క్షణం కూడా ఏమీ చేయలేకపోతున్నాను. ఒక విధమైన అశ్రద్ధ మానసాన్ని ఆవహిస్తోంది, నేనేమీ చేయలేకపోతున్నాను. ఎందుకంటే ఇప్పుడు నా స్థితి ఎటువంటిది అంటే, నాలో ఏదో ఉంది

అనికాని, నాలో ఏమీ లేదు అనికాని చెప్పలేకుండా ఉన్నాను. ఇప్పుడింక ఉన్నది ఏదో ఉంది, ఇదీ ప్రస్తుత స్థితి. 'పని' (Working) విషయానికి సంబంధించి, ఇప్పుడు నేను దృఢంగా, విశ్వాసంతో జరుగుతున్నట్లుగా గమనిస్తున్నాను. ఇంతకూపూర్వం 'పని' (Working) గురించి అడిగినట్లయితే సక్రమంగా జరుగుతున్నదా లేదా అనే సందేహం కలిగేది.

నా విషయంలో గ్రహింపుకు సంబంధించినంతవరకు 'మాలిక్' నాకు ఇంతకుముందు కంటె ఇప్పుడు అధికంగా అనుగ్రహించాడు. బాబూజీ, వాస్తవం ఏమిటంటే, నా ద్వారా ప్రార్థనయే కాదు, మరేదీ కూడా కావటంలేదు. ఏదైతే అది. అది మంచికే. నాకు నిద్రావస్థ మరియు జాగృతావస్థ, రెండింటిలోను భేదం లేదన్నట్లుగా అనిపిస్తోంది. నిస్సందేహంగా, నాకు నిద్రావస్థలో భౌతికంగా శరీరానికి విశ్రాంతి కలుగుతోంది. బాబూజీ, 'తమ'తో ఇప్పటికీ చేస్తున్న ఫిర్యాదు ఏమిటంటే, 'మాలిక్'ను గురించిన జ్ఞాపకం, ప్రేమ ఎంతగా ఉండాలో అవి నాలో లేకపోతున్నాయి. ఎందుకోగాని కొద్దిరోజుల నుంచి, ఎటువంటి శ్రమ లేకపోయినప్పటికీ శరీరంలో బలహీనత నిర్విరామంగా అనుభవమవుతున్నది. అది ఎందుకో దైవానికే తెలియాలి. అప్పుడప్పుడు ఇదే విధంగా అలసట కూడా కలుగుతూ ఉంది. అయితే ఇది కూడా ఒక విధమైన 'మాలిక్' యొక్క దయ కావచ్చు. దయచేసి తమరు దీనిని తొలగించటానికి ఆలోచన పెట్టవద్దు. అది ఏమిటో తెలియదు కాని, ఇప్పుడు నాలో ఆత్మ సమర్పణ (Self-surrender) అనేది పూర్తిగా లేకుండాపోయింది.

పిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 112

లఖీంపుర్,
11.08.1950

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నేను నిన్న 'తమ'కు ఒక ఉత్తరం వ్రాసాను, అలాగే అందరినీ ఉద్దేశించి తమరు వ్రాసిన ఉత్తరం నాకు చేరింది. దానిని చదివిన తర్వాత, అందరికీ కూడా తమ నుంచి ఉత్తరం రాలేదన్న చింత తీరిపోయింది. ఇప్పటికి షుమారు 3–4 మాసాల నుంచి 'తమ' ఆరోగ్యం ఎందుకు బాగుపడలేదో దయచేసి నిజం చెప్పండి. నా సంస్కారాల భోగ మంతటినీ తమరే స్వయంగా భోగించటానికి నిశ్చయించుకున్నారా? పూజ్య బాబూజీ, తమరు ఇప్పుడు ఆరోగ్యవంతులు కావాలని, తమ జీవన ప్రమాణానికి మాత్రం అవసరమైన కష్టాలను మీరు నిలుపుకొని, మిగిలిన వాటినన్నింటినీ నాకు ఇచ్చివేయాలని నేను ప్రార్థిస్తున్నాను. అంతేగాకుండా **తమరు ఎవ్వరెవ్వరి కష్టాలను తమవిగా స్వీకరించాలనుకుంటున్నారో వాటిని నేను సంతోషంగా పరిగ్రహించటానికి సిద్ధంగా ఉన్నాను అని నివేదించు కుంటున్నాను.** తమరు ఇప్పుడు ఆరోగ్యవంతులవ్వండి, ఈ ప్రపంచంలో జీవించాలను తమ ఇచ్ఛ / కోరిక ఏదైతే ఇప్పుడు 'తమ'లో తగ్గిపోయిందో, దయచేసి దానిని ఇప్పుడు పునరుద్ధరించండి. ఈ సంకల్పం తమ కోసం కాకపోయినా కనీసం ఈ దీనురాలైన తమ కుమార్తె కొరకైనా చేయండి. తమరు గతంలో వ్రాసి ఉన్నారు– "ఈ యాత్రను నీవు స్వయంగా పూర్తి చేయాలని నేను కోరుతున్నాను" అని. అందుకు నేను సంతోషంతో సిద్ధంగా ఉన్నాను. తమరు నా కొరకు తక్కువ శ్రమించాలి అని నేను ప్రారంభం నుంచీ కోరుకుంటూనే ఉన్నాను. అయినప్పటికి అప్పుడప్పుడు తప్పనిసరి అవుతూ ఉంది. అది తమ యొక్క ఇచ్ఛానుసారంగానే జరుగుతుంది. తమరు వ్రాసి ఉన్నారు, ఏమని అంటె – "ఆమెకు అప్పగించిన 'పని'ని (Working) సక్రమంగా నిర్వర్తిస్తూ ఉండమని కస్తూరితో చెప్పాలి" అని. కనుక 'పని' (Working) గురించి తమరు నిశ్చింతగా ఉండండి. ఏ 'పని' (Working) అయితే నిర్దేశించబడిందో దానిని నిర్వహించటంలో నా తరఫునుంచి, 'మాలిక్' కృప ఇలాగే కొనసాగినట్లయితే ఎటువంటి తప్పుగాని, లోపంగాని

జరగనివ్వను. ఇప్పుడింక తమ ఆరోగ్యం మెరుగుపడింది అను శుభవార్తను త్వరగా తెలియజేయండి. అప్పుడప్పుడు 'తమరి'ని, పాపాజీగార్ని చూడాలను తాపత్రయం కలుగుతూ ఉంది. 'మాలిక్' దయ ఎప్పుడు కలిగితే అప్పుడు చూడటం జరుగుతుంది. నేను వ్రాసిన దానిలో అపశ్రుతులు ఏమైనా ఉంటే, దయచేసి క్షమించగలరు.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు. పాపాజీకి ప్రణామం తెలియజేయండి.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 113

లఖీంపుర్,
14.08.1950

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం నిన్న చేరి ఉంటుందనుకుంటాను. ఇప్పుడు 'తమ' ఆరోగ్యం కుదుటపడిందని భావిస్తాను. నా ఆత్మిక దశ యొక్క స్థితి ఎలా ఉంది అంటె, నాకు ఇప్పుడు శూన్యత్వం యొక్క భావన కూడా చెడుగా అనిపిస్తోంది. ఏదైతే చెడ్డదిగా అనిపిస్తుందో, అనగా ఇప్పుడు ప్రార్థనకు హృదయం మొగ్గుచూపలేకపోవటం వంటిది, శూన్యత్వం యొక్క జ్ఞాపకం వంటిది కూడా సహించలేనిదిగా ఉంటున్నది. అయితే, ఇలా ఉన్నప్పటికీ దానిని జ్ఞాపకం చేసుకున్నట్లయితే, ఒక 'షాక్'లాగా అనుభవమవు తోంది. ఆ నిద్రావస్థయే నాకు తెలియకుండానే రోజంతా నిలకడగా ఉంది, దానిలోనే మరపుస్థితి కూడా మిళితమై ఉన్నట్లుగా నేను గమనిస్తున్నాను. ఎందుకంటే నేను ఏదైనా పని చేస్తున్నపుడు, నేను నిద్రావస్థలో ఉన్నానో లేక మరపుస్థితిలో ఉన్నానో తెలియకుండా ఉంటున్నది. ఇంకా ఏమంటే, నేను ఎప్పుడైనా దాని మీద దృష్టి పెట్టినట్లయితే అదే స్థితిలో ఉన్నట్లుగా అనుభూతి చెందుతున్నాను. నిజం చెప్పాలంటే, నా హృదయం ఈశ్వరీయతవైపు ఆకర్షితమవుతున్నట్లుగా నాకు అర్థమవుతోంది. అది అలా కాదు, కాదు అని నాలో చెప్పుకున్నాను. 'మాలిక్' ఇచ్ఛ ఎలా ఉంటే అలా అవుతుంది. ఇప్పుడింక ఏదైతే ఉందో, అది ఉంది. దానిని గురించి చింతించాల్సిన పని లేదు.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 114

లఖీంపుర్,
22.08.1950

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా జాబు తమకు చేరి ఉంటుందనుకుంటాను. తమ ఆరోగ్యం ఇప్పుడు బాగుపడిందని ఆశిస్తాను. నా ఆత్మిక దశ ఏదో వింతగా ఉంది. ఎందుకంటే, 'సిట్టింగ్' (ధ్యానం చేయించటం) పేరు తలిస్తేనే నాకు భారంగా అనిపిస్తోంది. ఇంక నేను ధ్యానం చేస్తూన్న విషయం గురించి ఏమని చెప్పాలి? అయినప్పటికీ నేను 'సిట్టింగ్' ఇతరులకు ఇస్తూన్నప్పుడు, ఇదివరకటిలాగా "ఈశ్వరీయ ధార (ట్రాన్స్‌మిషన్) 'అతని' హృదయం నుంచి అందరి హృదయాల్లోకి ప్రవేశిస్తున్నది" అని అలోచించినప్పుడు (అనగా 'మాలిక్' తరుపునుంచి కూడా), వెంటనే నేను భారంగా అనుభూతి చెందుతున్నాను. బాబూజీ, ఈ విధంగా నాకు 'పూజ' పేరు తలిస్తేనే భారమని అనిపిస్తోంది. అది 'మాలిక్' అభీష్టం మీదనే ఆధారపడి ఉంది. ఇప్పుడు ఉన్న స్థితి ఏమిటో ఆ దైవానికే తెలియాలి, ఎందుకంటే ప్రతిదీ చూస్తున్నప్పటికి కూడా ఏదీ కనిపించనట్లుగానే ఉంటోంది. అన్నీ వింటూనే ఉన్నప్పటికీ ఏమీ వినపడనట్లుగాను,

అన్ని పనులు చేస్తున్నప్పటికీ ఏమీ చేయనట్లుగాను, ఇంకా ఎంతగానంటే అందరి ముఖాలు చూస్తూనే ఉన్నప్పటికీ ఆ ముఖాలు గుర్తించలేనట్లుగాను ఉంటోంది. అదేమిటో 'అతని'కే తెలియాలి.

నాకు 3-4 రోజుల నుండి నాలోన బయట కూడా అంతా తెరచుకుని (Wide-openness) ఉన్నట్లుగా తలపిస్తోంది. ఈ బహిరంగమైన దానిలో వెలుగు ఏమీ లేనట్లుగా తలపిస్తూ కేవలం బాహాటం (openness) మాత్రమే అనుభవమవుతోంది. దీని మూలంగా ఎంతగా తేలికదనం ఉన్నదంటే, ప్రతిదాని లోపల బోలు (hollow)గా ఉన్నట్లు అనిపిస్తోంది. ఈ బాహాటం (openness) లేదా బోలుతనం (hollowness) విస్తారంగా వ్యాపించినట్లుగా అనిపిస్తోంది. బహుశా ఈ విషయం నేను నా గత ఉత్తరంలో కూడా వ్రాసి ఉంటాను. అది ఏమని అంటే, 'మాలిక్'లో నాకు ప్రత్యేకత ఏమీ కనిపించటంలేదనీ, ఏమీ ఆకర్షణ ఉన్నట్లుగా లేదనీ, అయినా కూడా అతడు నా 'మాలిక్' అని వ్రాసాను. బాబూజీ, నిజం చెప్పాలంటే, నా 'మాలిక్' నాలాగానే మరియు అందరిలాగానే ఉన్నారు. ఇంకా చెప్పాలంటే, 'అతని'పట్ల ఒక విధమైన వైరాగ్యం (అనుబంధం లేకుండా) ఉన్నట్లుగా చెప్పుకోవచ్చు. సరే, నేనింక చేయవలసిందేమీ లేదు. ఇంకా కేవలం 'తమరి'ని ప్రార్థించేది ఏమిటంటే, నేను త్వరత్వరగా 'మాలిక్'ను చేరుకోవాలి అని.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు. అమ్మ తమకు ఆశీస్సులు తెలుపుతూ ఉంది.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 115

లఖీంపుర్,
10.09.1950

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. దయాపూర్ణమైన 'తమ' ఉత్తరం చాలా కాలంగా అందలేదు, కారణం ఏమిటో తెలియదు. జన్మాష్టమి సందర్భంలో కూడా అక్కడికి వెళ్ళినవారు ఎవ్వరూ లేరు. ఆ విధంగా కూడా సమాచారం ఏదీ అందలేదు. అయితేనేమి, ఇప్పుడు పూజ్య మాస్టర్ సాహెబ్ ద్వారా పరిస్థితి తెలుస్తుంది. నా ఆత్మికదశ గురించి వివరించాలంటే, చాలా రోజుల నుండి ఒకటి రెండు రోజులు బాగుంటుంది కాని మళ్ళీ వెంటనే చెడిపోతుంది. కొన్ని మాసాలతరబడి నా అనుభవానికి తెలిసి లేదా తెలియకుండా, అన్ని వేళలా ఉన్నటువంటి నిద్రావస్థ స్థితి లేదా మరుపుస్థితి ఇప్పుడు నాలో లేనట్లుగా అనిపిస్తోంది. ఆ స్థితిలో ప్రతి పని నా చేత చేయబడేది కాని ఇప్పుడు గత కొన్ని రోజుల నుంచి ఆ విధంగా జరగటంలేదని అనిపిస్తోంది. నా స్థితిని సంస్కరించటానికి చాలా ప్రయత్నించాను, కాని 'మాలిక్' యొక్క అపారకృప వలన ఎన్నో మాసాలుగా ఉన్నటువంటి ఆ స్థితిలో నేడు కొంత మార్పు కనిపిస్తోంది. ఆ నిద్రావస్థ లేదా మరపుస్థితి వంటి దానిలో కూడా ఇప్పుడు కొంత వింతైన మార్పు అనుభవమవుతూ ఉన్నట్లుగా అనిపిస్తోంది. దానిని నేను ఇంకను పూర్తి స్థాయిలో గ్రహించలేకపోతున్నాను. ఈ బాగుండలేదు అనిపిస్తున్న స్థితిలో కూడా, ఆ పరమ దయాళువు 'మాలిక్' యొక్క కృప ఏదో దాగి ఉంటుంది. స్థితి బాగుండలేదని అనిపించినప్పుడు, అంతకు పూర్వపు స్థితిని గురించి ఆలోచించి నెమరు వేసుకొనడానికి ప్రయత్నిస్తున్నపుడు, హృదయం దానిని ఒక్క క్షణం కూడా సహించలేకపోతున్న కారణంగా చాలా చింతించాల్సి వస్తోంది. బాబూజీ, ఇందువలన ఇప్పుడు ఉన్నదేదో ఉన్నది అను దానిలోనే సంతోషం, సంతృప్తి కలుగుతున్నాయి. నా బాబూజీ, ఇలా అయినప్పటికీ తమరు తప్పనిసరిగా ఈ దీనురాలి సంగతి పట్టించుకొనండి. నా పని (Working)లో కూడా ఏమైనా లోటుపాట్లు ఉన్నట్లయితే మాస్టర్ సాహెబ్‌కు తెలియజేస్తే వారు నాకు చెబుతారు. అయినప్పటికీ ఆ లోటుపాట్లను నా 'మాలిక్' ఏదో ఒక రకంగా సంస్కరించి వాటిని సక్రమం చేసి తీరతారు. అందుకుగాను 'అతని'కి అనేక ధన్యవాదాలు.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 116

లఖీంపుర్,
16.09.1950

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. పూజ్యులు మాస్టర్ సాహెబ్ ద్వారా పూజ్య పాపాజీగారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని అందరికీ విచారం కలిగింది. మన పూజ్య పాపాజీగారు కోలుకోవాలని మేమందరం భగవంతుని ప్రార్థిస్తున్నాము. నా విషయంలోనైతే నెల మొత్తంలో ఒక్క నిమిషం కూడా లయ అవస్థ కలగలేదు, మరి అది ఎందుకో దైవానికే తెలియాలి. అందుచేత హృదయంలో కొంత దిగులు వంటిది కలుగుతోంది. బూడిదలో పన్నీరు పోసినట్లుగా, సర్వప్రయత్నాలు నిరర్థకమవుతున్నాయి. నా అహంభావం (Self-consciousness) పెరిగిపోయిందో లేక ఇంకా ఏమి అయ్యిందో తెలియకుండా ఉంది. ఇప్పుడు నాలో చెప్పుకోదగ్గ మంచి విషయాలు ఏమీ కనిపించటంలేదు. రోజంతా ఉంటూ ఉన్న మరపుస్థితి ఇప్పుడు లేకుండా పోయింది. ఇప్పుడు నాలో ఎటువంటి స్థితి లేకుండా పోయింది. ఇప్పుడు నన్ను కేవలం ఒక మట్టిబొమ్మ (మూర్ఖురాలి)గా భావించండి. ఈ కారణాల వలన నా హృదయంలో కొంత దిగులు ఏర్పడుతూ ఉంది. ఇప్పుడు అసలు లయ అవస్థ అంటే ఏమిటో కూడా తెలియనిదిగా ఉంటోంది. ఇప్పుడు నేనేమి చేయాలో దయచేసి తమరు వ్రాయండి. పూజ్య బాబూజీ, ఇప్పుడు తమరితో నిజం చెబుతున్నాను- ఏమంటే, కేవలం నా పురోగతి జరుగుతున్నది అను ఒక్క విశ్వాసం మినహాయించి, అందుకుతగ్గ చిహ్నాలేమీ లేవు. దీనితో నాకు ఉన్నతి కలుగుతున్నట్లుగా 'తమ'తో చెప్పుకోవాలో లేక నేను అర్థం చేసుకోవాలో చెప్పండి. అది 'తమ'కు, 'తమ' పనికి తెలియాలి. నా స్థితిని గురించి 'తమ'కు వ్రాసాను. బిటియా చాలా ఉన్నతి చెందుతోంది - అని తమరే చెబుతూ ఉండేవారు. ఇప్పుడు దయచేసి నన్ను పైకి లాగండి. రేపు స్థితి మెరుగుపడవచ్చు అని ఆశాభావంతో ఉంటున్నప్పటికీ, రేపు లేదు, ఎల్లుండి లేదు, ఏమీ గాడినపడటంలేదు. సరే, అది దారికి వచ్చినా రాకపోయినా కూడా, నేను దానివైపుగా పురోగమిస్తూనే ఉంటాను. ఆ తర్వాత దైవేచ్ఛ ఎలా ఉంటే అలా అవుతుంది. ఈ 'దైవేచ్ఛ' అనే మాటలు కూడా కేవలం నామ మాత్రంగానే ఉంటున్నాయి. నిజం చెప్పాలంటే, ఇప్పుడు స్థితి కూడా ఏమీ తెలియటం లేదు. పాపాగారి ఆరోగ్య స్థితిని గురించి దయచేసి వ్రాయించండి.

అమ్మ తమకు, పాపాజీకి ఆశీర్వాదాలు తెలుపుతోంది.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 117

లఖీంపుర్,
20.09.1950

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నేను, పూజ్యులు మాస్టర్ సాహెబ్‌గారి ద్వారా పంపిన ఉత్తరం 'తమ'కు చేరి ఉండవచ్చు. తమ పుస్తకం నిర్విఘ్నంగా ప్రచురించబడాలని మేము ప్రార్థిస్తున్నాము. పూజ్యులు పెదనాన్నగారి (తావూజీ) ద్వారా తమకు బాగా కష్టం కలుగుతున్నట్లుగా తెలిసింది. దీని మూలంగా 'తమ'కు శిరస్సులో బాధ కలుగుతోంది. 'తమరు' మూడు, నాలుగు సార్లు తైలంతో శిరస్సు మర్దన చేయించుకుంటే, బహుశా శిరోవేదన నుంచి విముక్తి కలగవచ్చు. నా ఆత్మిక దశ ఎలా ఉన్నదో తెలియకున్నది. సరే, అది ఎలా ఉంటే అలా ఉంటుంది. ఆ విధంగా తెలియకున్నప్పటికి కూడ, షుమారు 8-10 రోజుల నుండి, నెలల తరబడిగా ఉంటున్నటువంటి స్థితి, ఇప్పుడు మార్పు చెందినట్లుగా అనిపిస్తోంది. నాకయితే కేవలం ఇంతమాత్రం భేదం తెలుస్తోంది. అది ఏమిటంటే, ఇంతకుపూర్వం ఒక స్థితి ఉండి,

అది ఎప్పుడూ నాలో ఒకే విధంగా ఉంటూ ఉండేది. అటువంటిది ఇప్పుడు అది నాలో ఎటువంటి విశేషములేని స్థితిగా అనిపించటమేకాక, ఇప్పుడింక పూజ అంటే ఏమిటి అన్నట్లుగా భావన కలుగుతోంది. ఇది ఏమిటో, ఎందుకో నాకు తెలియదు. ఇప్పుడు నాలో ఆంతరికంగా ప్రవహిస్తున్నటువంటి ధార, ఎల్లప్పుడూ, అన్నిచోట్లా ప్రవహిస్తున్నట్లుగా అనిపిస్తోంది. ఇప్పుడు లోన బయట కూడా ఒకే రకమైన ధార ఉంటున్నది. బహుశా ఇందువల్లనే నాలో ఎటువంటి స్థితి తెలియటం లేదు. నేను గతస్థితిని గురించి నెమరువేసుకున్నప్పుడు అది ఇంకెవరిదో స్థితిని నెమరు వేసుకుంటున్నట్లుగా అనిపిస్తోంది. అదేమిటో దైవానికే తెలియాలి. సరే, శ్రీ బాబూజీ! ఇప్పుడు 'ఏదైతే అది' అనేది నా స్థితిగా ఉంది, అది అన్ని వైపులా విస్తరించి ఉంటోంది. ఆ తర్వాత తమకే తెలియాలి. అన్నివైపులా కూడా ఏదో తెరచి ఉన్నట్లుగా ఉంది.

అమ్మ 'తమ'కు, పాపాజీకి ఆశీర్వాదాలు తెలుతోంది.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 118

లఖీంపుర్,
27.09.1950

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నిన్న పూజ్య మాస్టర్ సాహెబ్‌గారి ద్వారా, పరమ పూజ్యులు పాపాజీ ఆరోగ్యం కొంచెం మెరుగైనట్లుగా తెలిసింది. ఇందుకు దైవానికి ధన్యవాదాలు. తమరు 'దసరా' రోజుల్లో తప్పక విచ్చేయండి. నా స్థితిని గురించి చెప్పాలంటే, ఏ దశ అయితే ఇంతకుపూర్వం ఎల్లప్పుడూ ఆంతరికంగా అనుభవమవుతూ ఉండేదో అది ఇప్పుడు బాహ్యంగా వచ్చింది. ఇప్పుడు, ప్రపంచమంతటా, ప్రతి సమయం, ప్రతి స్థలం, ప్రాణులు లేదా అప్రాణులు ఏదైనా కావచ్చు - వాటన్నింటిలోను, ఆఖరికి మొక్కలు, చెట్లు అన్నింటిలోను నాకు ఒకే రకమైన స్థితి ఉన్నట్లుగా అనిపిస్తోంది. సమస్త ప్రపంచంలోను, నాలోను కూడా సర్వసమానత్వం అనగా ఒకే విధంగా అయిపోయింది. బాబూజీ, నిజం చెప్పాలంటే, నా దృష్టిలో జడ, చేతనములన్నీ (చలనములు, అచలనములు) ఒకే రకంగా కన్పిస్తున్నాయి. అయితే, అలా ఎందుకు అనిపిస్తోందో నాకు మాత్రం తెలియదు. అదంతా ఈశ్వరేచ్ఛ. ఇప్పుడు ఎలా ఉందంటే, నా దృష్టిలో, నా చుట్టూతా కేవలం వ్యాప్తి చెందినట్లుగా కనిపిస్తోంది. బాబూజీ, దయచేసి క్షమించండి, నాలో స్వామిత్వమే (Lordliness) వృద్ధి చెంది, పూజ మొదలైనవి అల్పమైనవిగా తోస్తున్నాయి. సరే, ఉన్నది ఏదో ఉంది, అంతా 'మాలిక్'కే తెలియాలి.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 119

లఖీంపుర్,
3.10.1950

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. పూజ్యులు మాస్టర్ సాహెబ్‌గారిని ఉద్దేశించి తమరు దయతో వ్రాసిన ఉత్తరం ద్వారా పరమ పూజ్యులు పాపాజీ జ్వరం పెరగకుండా ఆగటంలేదని తెలిసింది. అదేమిటో దైవానికే తెలియాలి. బాబూజీ,

పెద్దలైన (గౌరవనీయులైన) వారి సంగతి, ఆ దైవానికే తెలుసు. నా ఆత్మికదశ ఇటీవల ఏమంత బాగున్నట్లుగా అనిపించటంలేదు. నేను 'తమ'కు వ్రాసి ఉన్నట్లుగా నాలో ఎటువంటి స్థితి అనుభూతి కావటంలేదు. సెప్టెంబర్ 30వ తేదీతో నేను వ్రాసిన ఉత్తరం ఒకటి బహుశా తమకు చేరి ఉండాలి. దానిలో నేను, నా ఆంతరికంలో ఇంతకుముందు ఏ స్థితి అయితే ఉందో, అది ఇప్పుడు అన్ని దిశలా, అన్నింటిలోను, చివరకు మొక్కలు, చెట్లులో సైతం, సమస్త ప్రపంచంలోను, ఒకే రకమైన స్థితి కానవస్తున్నదనీ, నా దృష్టిలో, నా చుట్టూతా వ్యాపించిపోయినట్లుగా కనిపిస్తున్నదని వ్రాసాను. ఇప్పుడైతే స్వయంగా నా విషయంలో నేను స్త్రీనో, పురుషుణ్నో, ఎవరినో కూడా తెలియడంలేదు. సరే, ఏదైతే అదే అవుతుంది. జాతి, కులముల విషయమైతే ఎప్పుడో చెల్లిపోయింది. మరైతే ఇప్పుడు ఇది ఏమిటో తెలియటంలేదు. అంతేకాదు, ఇప్పుడు మరపుస్థితి కూడా నాలో లేకుండా పోయింది. పూజ్య శ్రీ బాబూజీ, ఆత్మ సమర్పణకు (Self-surrender) బదులు నాలో 'అహం' (Self) పెచ్చుమీరిపోతోందో, ఏమిటో తమరు దాపరికం లేకుండా వాస్తవం తప్పనిసరిగా వ్రాయండి, ఎందుకంటే, దీని మూలంగా నాకు చాలా వ్యధ కలుగుతూ ఉంది. ఆ దైవేచ్ఛ ఎలా ఉంటే అలాగే కానివ్వండి. నేను స్వయంగా నిర్మలీకరణ చేసుకుంటున్నాను, అయినప్పటికీ ఫలితం ఉండటం లేదు. ఈరోజు నాలో మరేదో స్థితి అనుభవానికి వస్తోంది. దాని సంగతి తెలిశాక జాబు వ్రాస్తాను. పూజ్య శ్రీ బాబూజీ, 'తమ'కు తప్పనిసరిగా శ్రమ కలుగుతుంది, అందుకు నేను క్షమార్థిని కూడా. కాని తప్పకుండా నా స్థితి గురించి 'తమరు' ఉత్తరంలో వ్రాయండి. ఎందుకంటే అప్పుడప్పుడు నాకు నా స్థితి బాగుండలేదని అనిపిస్తోంది. ఏది ఎలా ఉన్నా, దైవకృపతో, నేను తప్పకుండా పురోగమిస్తూనే ఉంటాను. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 120

లఖీంపూర్,

06.10.1950

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు అంది ఉండవచ్చు. 'తమ' ఆరోగ్యం బాగుపడుతుందని ఆశిస్తున్నాను. 'తమరు' ఇక్కడకు వచ్చి చాలా రోజులైంది, కనుక గంగా స్నానం శెలవురోజుల్లో తప్పక రాగలరు. 23, 24 తారీఖులు 'తమ'కు శెలవు రోజులని విన్నాను, 25వ తేదీ శనివారం 'తమరు' దయచేసి శెలవు తీసుకోగలరు. కనుక అవకాశం ఉంటే, 'తమరు' 22వ తారీఖు సాయంత్రం 6 గంటలకు రైలులో వచ్చినట్లయితే, 'తమరు' పూర్తిగా 3 రోజులు శెలవు గడపవచ్చు. కనుక తమకు ఏది ఇష్టమైతే అది చేయండి. నాకు ఇప్పుడు ఎటువంటి స్థితి ఏర్పడింది అంటే, ప్రపంచంలోని జనులందరు, అన్ని వస్తువులు కూడా వింతైన చిత్రాల్లాగా అనిపిస్తున్నాయి, బహుశా నేను కూడా అలాగే అనిపిస్తున్నాను. నాటక రంగస్థలం మీద దృశ్యానికి దృశ్యానికి మధ్య తెర మారినట్లుగా రోజు తర్వాత రోజు గడుస్తున్నాయి. పరిస్థితి ఎలా ఉందంటే, ఉదయం జరిగిన మాటలు సాయంత్రం అయ్యేసరికి అవి ఎప్పుడో సంవత్సరాల క్రిందట చెప్పబడిన మాటల్లాగా అనిపిస్తోంది. బాబూజీ, ఇప్పుడు స్థితి ఎలా ఉందంటే, ఒకవేళ నాకు, కుక్కకు ఒకే ప్లేటులో ఆహారం పెట్టినట్లయితే, మేమిద్దరం సంతోషంగా, ఇష్టంగా భుజిస్తూ ఉంటాము. బహుశా ఇలా ఎందుకంటే, కుక్క, కస్తూరికి మధ్య బేధం ఏమీ అనిపించటంలేదు. అదేమిటో తమకే తెలియాలి. ఈ పరిస్థితి కేవలం కుక్క విషయంలోనే కాదు అందరి విషయంలోనూ ఇలాగే ఉంటోంది. సరే, అది దైవానికే తెలియాలి. ఇంకొక విషయం ఏమిటంటే, ఈ విస్తరణ అంతటా ఇంకా వ్యాపిస్తోంది. బాబూజీ, నాకు నాలోపల ఏమి ఉన్నదో తెలియటంలేదు కాని తప్పకుండా ఏదో ఉన్నది. అదేమిటో 'మాలిక్'కు తెలుసు. అది భగవంతునికే తెలియాలి– ఏమంటే నా అనుభవం కొంచెం మందకొడిగా సాగుతోంది అని. ఇప్పుడు 10–12 రోజులు నుండి నా స్థితి గురించి ఎంతోకొంత అవగాహనకు వస్తూంది. ఇప్పుడు

2–3 రోజుల నుంచి నాలో కొంచెం స్వల్ప మార్పు కలిగినట్లుగా అనిపిస్తోంది. 'తమ' శ్వాస సమస్య మళ్ళీ పెరిగింది అని పూజ్య మాస్టర్ సాహెబ్ ద్వారా ఈరోజు తెలిసింది. నేనేమి చేయగలను బాబూజీ, ఎందుకో తెలియదుగాని నా ఇచ్ఛాశక్తి (Will-power) ద్వారా 'తమ' శరీరానికి ఉపశమనం కల్పించలేని స్థితికి వచ్చింది, అయితే 'సిట్టింగ్' విషయంలో నేను కోరిన విధంగానే జరుగుతూ ఉంది. సరే, ఇది కూడా 'మాలిక్' ఇష్టానుసారమే జరుగుతున్నది. ఈ విధంగా బలహీనత ఉంటూ ఉంటే ఎలా రాగలను అని 'తమరు' మాస్టర్ సాహెబ్‌తో చెప్పారు. కనుక మా అందరి ప్రార్థన ఏమంటే, తమరు ఇక్కడకు రావాలని గట్టిగా తలచినట్లయితే బలహీనతలన్నీ దూరమైపోతాయి. ఎందుకంటే దీనికి అడ్డురాకూడదు. ఈ విషయంలో తమరు మమ్మల్ని ఎలా ఉంచితే అలా ఉంటాము.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 121

లఖీంపుర్,
11.10.1950

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. 'తమ' ఉత్తరం ద్వారా పూజ్య శ్రీ పాపాజీ నిష్క్రమణం యొక్క పిడుగులాంటి వార్త విని మాకందరికీ చెప్పలేనంత దుఃఖం కలిగింది. ఈ వార్తను వినగానే మాకు ఆశ్చర్యం కూడా కలిగింది. ఎందుకంటే, ఆ గొప్ప మహాత్ముని నిష్క్రమణ సంభవిస్తుందని ఇప్పటివరకు ఎంతమాత్రం స్ఫురించలేదు. మా దురదృష్టవశాత్తు ఈశ్వరుడు మా ప్రార్థనను మన్నించలేకపోయాడా లేదా బాబూజీ! మా మొర 'అతడి'కి చేరలేదా! ఈ విషయంలో నా సంతోషం కేవలం ఎంతవరకునంటే, నేను 'వారి'కి ఏ ప్రార్థన నయితే చేస్తానని చెప్పానో దానిని పూర్తిచేయగలిగాను అను సంతృప్తి. అది ఎంతగానంటే, రోజుకు మూడుసార్లు ప్రార్థన చేయటమేగాక, రెండు నెలలపాటుగా అనేకసార్లు నా ఇచ్ఛాశక్తి (Will-power)ని కూడా ప్రయోగించాను, కాని లాభం లేకపోయింది. ఫలితం ఏది జరగవలసి ఉందో అది జరిగింది. దీనినిబట్టి నేనేమీ చేయలేదు అని ఇప్పుడు చెప్పవలసి వస్తోంది. ఇప్పుడు మేము ఆ పరమ పుజ్యుడు పాపాజీ చరణాలకు పత్రపుష్పాలు వంటి శాంతివచనాలు మాత్రమే అర్పిస్తున్నాము. అయినా వారికి ఇంకా ఏదైనా చేయాలనుకుంటే అది "సూర్యునికి దీపం పట్టినట్లుగా" ఉంటుంది. ఇప్పుడు మన మిషన్ యొక్క మూలస్తంభం ఒకటి కూలిపోయింది అని చెప్పాల్సి ఉంటుంది. వారి దుఃఖిత కుటుంబానికి శాంతి చేకూర్చమని మేము భగవంతుణ్ని ప్రార్థిస్తున్నాము. అలా జరుగుతుంది కూడా. శ్రీ బాబూజీ! వారు (పాపాజీ) ప్రేమ మూర్తులు. వారి మాటలతీరు, వ్యవహరించే విధానం మరియు వారి దర్శనభాగ్యంతో మాకు దివ్య ప్రేమ లభ్యమవుతూ ఉండేది. సరే, వారి గురించి నేను ఇంకేమి వ్రాయగలను. వారికి వారే సాటి. ఇంక ఇది చాలు అనుకుంటాను. ఎందుకంటే, వారి వాస్తవిక విలువను ఇక్కడ అంచనా వేయగలిగినవారు స్వయంగా 'తమరు' ఒక్కరు మాత్రమే. ఈశ్వరుడు ఇక్కడ ఉన్న వారందరికి శాంతి సహనాలు ప్రసాదించాడు.

నా స్థితి ఎలా ఉన్నదంటే, నాకు బాహ్యంగా ఎంత కష్టంగాని, దుఃఖంగాని కలిగినప్పటికీ, ఆంతరికంగా దృష్టి సారించినట్లయితే ఒక నిశ్చలమైన శాంతి మరియు స్థిరత్వం అనుభవమవుతున్నాయి. అందరూ వారిని గురించి మాట్లాడుతున్నంతసేపూ నేను కూడా దిగులు చెందాను, కాని అక్కడి నుంచి వెళ్ళిన తర్వాత నాకు ఎటువంటి దుఃఖం కలగలేదు. ప్రతి విచారకర సందర్భంలోనూ ఇటువంటి స్థితియే కలిగి ఉంటోంది. ఈ కారణంగా, నాకు ఇప్పుడు అమితమైన కష్టంగాని, విచారంగాని అనుభవానికి రాకపోవటమే కాకుండా, సుఖంగాని ఆనందంగాని అనుభవానికి రావటంలేదు. పూజ్య శ్రీ బాబూజీ! నెలల తరబడిగా నాకు అత్యంత ఆనందానుభూతులు ఏమీ కలగలేదు. ఇప్పుడు నా స్థితి కొంత వింతగా అనిపిస్తోంది. ఇంకా ఎలా ఉందంటే, ఏది ఎలా ఉన్నప్పటికి, నాలో ఇప్పుడు భారమనేది ఒక

క్షణం కూడా అనుభవం కావటంలేదు. కొన్ని నెలల నుంచి ఈ విధంగా ఉంటోంది.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 122

లఖీంపుర్,
14.10.1950

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం ఒకటి 'తమ'కు అంది ఉండవచ్చు. ఇక్కడ అందరూ క్షేమమే. 'తమరు' కూడా కుశలమేనని అశిస్తున్నాను. నా స్థితి ఎలా ఉందో బహుశా తమకు వ్రాసే ఉంటాను. అది ఎలా ఉందంటే, నేను స్త్రీనా, పురుషుణ్నా అనేది తెలియకుండా ఉంది. నేను ఎవరినో, ఏమిటో అది దైవానికే తెలుసు. దాదాపు ఇటువంటి స్థితియే ప్రపంచంలోని జనులందరిపట్ల ఉన్నట్లుగా అనిపిస్తోంది. దీని వలన నావారెవ్వరు, పరులెవ్వరు అనేది కూడా తెలియకుండా ఉంది. పైన చెప్పిన పరిస్థితి కేవలం జీవించి ఉన్న మానవులపట్లనే కాకుండా, సమస్త జంతుకోటి మరియు వృక్ష సంపదపట్ల కూడా అనుభవమవుతోంది. ఇప్పుడు కొద్ది రోజుల నుండే కాదు, చాలా రోజుల నుండి రాత్రిళ్ళు నిద్ర పట్టటంలేదు. ఈ కారణంగా విశ్రాంతి లభించటం లేదు కాని పగటి సమయంలో 15-20 నిమిషాలు నిద్రించినంత మాత్రాన్నే చాలా విశ్రాంతి కలిగినట్లుగా అనిపిస్తోంది. నేను ఇంతకుపూర్వం వ్రాసినట్లుగానే, ఏ కొద్ది చికాకులోగాని దృష్టిని ఆంతరికంలోకి మరలించినంతనే నాకు సడలని శాంతి మరియు స్థిరత్వం అనుభవమవు తున్నాయి. అయితే, ఎప్పుడైతే మనస్సు వ్యాకులం చెందుతుందో అప్పుడు ఈ స్థితి ఎక్కువగా అనుభవానికి వస్తోంది. అలాకాకపోతే ఒకే రకమైన స్థితి నన్ను అలముకుని ఉంటోంది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 123

లఖీంపుర్,
26.10.1950

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నిన్న పూజ్య మాస్టర్ సాహెబ్‌గారి ద్వారా అక్కడి సమాచారాలు తెలిసాయి. ఈశ్వరుని కృపతో 'తమ' శ్వాస కూడా మెరుగుపడిందని విని సంతోషించాను. ఇంకను గంగా స్నానపు శెలవు దినాల్లో తమరు ఇక్కడకు విచ్చేసే ఆలోచనలో ఉన్నారని కూడా తెలిసింది. తమయొక్క ఈ నిర్ణయాన్ని ఈశ్వరుడు నిశ్చయంగా ఉంచాలన్నదే మా ప్రార్థన. ఇప్పుడు నాలో ప్రత్యేక స్థితి అంటూ ఏమీ అనుభవానికి రావటంలేదు. నిస్సందేహంగా, నేను ఏదో అధిగమించాల్సి ఉన్నది కాని అప్పుడప్పుడు దానిని అధిగమించలేకపోయినట్లుగా అనిపిస్తోంది. సరే, అదేమిటో దైవానికే తెలుసు. ఇప్పుడు ఇంకా ఏమవుతున్నది అంటే, నాలో ఉన్న శక్తి అంతా కూడా నా స్వాధీనంలోనే ఉన్నట్లుగా అనుభవమవ్వటమేకాక, నా అంతర్ దృష్టి దానిమీదకు సారించినప్పుడు, అవి (శక్తులు) ఈదులాడుతున్నట్లుగా అర్థమవుతోంది. ఇప్పుడు మేల్కొని ఉండేటటువంటి స్థితి ఎంత ఎక్కువగా ఉంది అంటే, రాత్రి సమయంలో నిశ్శబ్దంగా పండుకొని ఉండి ఎంతసేపైనా మేల్కొని ఉండగలుగుతున్నాను. ఇప్పుడు నా స్థితి గురించి ఏమి చెప్పను; ఇప్పుడు నాలో మరపుస్థితి ఏమీ లేకుండా పోయింది. అలాగే, తమరు గతంలో వ్రాసి ఉన్నట్లుగా లయ అవస్థ వృద్ధి చెందుతూ ఉన్నది అను విషయమై ప్రయత్నం చేస్తూ విసిగిపోతున్నాను, అయినప్పటికి అది ఏమాత్రం కలగటంలేదు. అయితే

ఈ ప్రయత్నం పూర్తిగా విరమించుకున్నప్పుడు, నిస్సందేహంగా, ఈ స్థితి కొంచెంగా అనుభవమవుతున్నది. బాబూజీ, నిజం చెప్పాలంటే, ఇప్పుడు నాలో ప్రత్యేకించి చెప్పవలసిన విషయమంటూ ఏమీ లేదు. ఈ జగత్తులో జనులందరూ ఉన్నట్లుగానే నేను అలాగే ఉన్నాను. అయితే పరిహాసం ఏమిటంటే, నేను పురోగతి చెందుతూ ఉన్నానని అనిపిస్తోంది. ఇంకా చెప్పాలంటే బాబూజీ, నాలో ప్రత్యేకత ఏమిటంటే, ఇంతకుపూర్వం నాకు సిట్టింగ్ వస్తున్నట్లుగా తెలుస్తూ ఉన్నటువంటిది, ఇప్పుడు తెలియకుండా పోయింది. ఇప్పుడు నేను ఏమిటో, ఎలా ఉన్నానో, చెట్టునో, మొక్కనో అదంతా ఈశ్వరునికే తెలియాలి. అయితే నేను ఏమై ఉన్నాగాని, ఎలా ఉన్నాగాని, నేను 'అతడి'కి చెందిన దాననే. ఇది నా యోచన మరియు విశ్వాసం. నా స్వభావ విషయానికి వస్తే, వారు నావారైనా లేదా పరాయివారైనా సరే పూజ చేయిస్తున్నంతసేపుగాని, మాట్లాడుతున్నంతసేపు గాని (అతడు నాకు బంధువు అవ్వవచ్చు కాకపోవచ్చు) అతడు నా వాడేనని అనిపిస్తుంది. అలాకాకపోతే అతనితో నాకు సంబంధంలేదనిపిస్తుంది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు. అమ్మ తమకు ఆశీర్వాదాలు తెలుపుతున్నది.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 124

లఖీంపుర్,

12.11.1950

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా జాబు తమకు అంది ఉండాలి. 'తమ' ఆరోగ్యం ఇప్పుడు ఎలా ఉంది? డాక్టర్‌గారి మందుతో ఇప్పుడు శ్వాస బాగుపడుతుందని ఆశిస్తాను. దయచేసి 'తమరు' త్వరగా ఆరోగ్యవంతులు అవ్వండి. ఎందుకంటే, ఇక్కడకు చేరవలసిన రోజులు దగ్గర పడుతున్నాయి. ఇప్పుడు నా స్థితిని గురించి చెప్పాలంటే, తరచుగా వ్యాపకం (expansion) బాగా పెరిగి, ప్రతిదానిలోను, అన్నిదిక్కులా నేను మాత్రమే వ్యాపించి ఉన్నట్లుగా అనిపిస్తోంది. మరో విధంగా చెప్పాలంటే, అన్నివైపులా నేనే వ్యాపించి ఉన్నట్లుగా అనిపిస్తోంది. ఇప్పుడు అన్ని విషయాల ఆకర్షణ పూర్తిగా లేనట్లుగా అనిపిస్తోంది. అయినప్పటికి ఏదైనా పాట వినాలంటే నాకు చాలా ఇష్టంగా ఉంటుంది. ఎప్పుడైనా పాట వినటానికి సిద్ధమైనప్పుడు, వెంటనే నా దృష్టి మరో వైపుగా మరలుతోంది. అది ఎందుకో దైవానికే తెలియాలి. ఇప్పుడు ఎటువంటి స్థితి ఉంటున్నది అంటే, ఏదైనా బాగుంది అనిపించినట్లయితే, దానిని ప్రశంసిస్తున్నాను కూడ. అయితే అన్నీ కూడా ఇదే విధంగా అనిపించినప్పుడు, అవి బహుదూరంగా వినిపిస్తాయి, కనిపిస్తాయి, లోనికి చొచ్చుకుపోతాయి. బాబూజీ, వాస్తవం ఏమిటంటే, అన్ని విధాలుగా చూశాను - ఎలాగంటే ప్రపంచంలోని అన్ని వస్తువుల నుంచి, ప్రతి మనిషి నుంచి, ఇప్పుడు సంబంధం అను త్రాడు తెగిపోయి దూరంగా తొలగిపోయింది (అనగా సంబంధం తెగిపోయింది). అయినప్పటికి దుఃఖం, ఆనందం స్వల్పంగా ఉంటాయి, అది కూడా అందరి మధ్య కూర్చున్నపుడు మాత్రమే అనిపిస్తుంది. అలా ఎందుకో ఆ దైవానికే తెలియాలి. అయినా కూడా, 'నేను' అను భావం వంటిది ఇంకా మిగిలి ఉంది లేదా దాగి ఉంది; అది ఎక్కడ ఉందో, ఆ దైవానికే తెలియాలి. పూజ్య శ్రీ బాబూజీ, ఏది ఎలా ఉన్నా, నేను 'మాలిక్'ను ఎంతగా జ్ఞాపకం ఉంచుకోవాలో, నేను ఎంతగా జ్ఞాపకం ఉంచుకోవాలని అనుకుంటున్నానో అది జరగటంలేదు. దీని వలన కొంత దిగులుతో హృదయం ప్రశాంతంగా ఉండలేకపోతోంది. నేను ఇంకా ఏమి గమనిస్తున్నాను అంటె, నేను ఇదివరలో ఏ స్థితుల గురించినయితే తమకు వ్రాసానో, అవి తమ నిజరూపంలో 'మాలిక్' అపార దయతో క్రమక్రమంగా నా ఎదుట కనిపిస్తున్నాయి. ఈ నెల 10వ తేదీ ఉదయం పూజలో కూర్చుండగానే, అకస్మాత్తుగా ఒక అత్యంత ఎర్రని ప్రకాశం నా ఎదుట నిలిచింది. అది సూర్యుని ఉదయాస్తమాన సమయాల్లో ఆకాశంలో కనిపించే రంగులాగా ఉంది. ఇది 4,5 సార్లు కనిపించింది. షుమారు

8–10 రోజుల నుండి శిరస్సు వెనుకభాగంలో ఏదో గట్టిగా తట్టినట్లుగా అయి శిరస్సులో అంతా ఒక ప్రత్యేక స్థితి ఏర్పడింది. అది ఏదైనా బలహీనతయా లేక ఇంకా ఏమై ఉంటుందో తెలియదు. అప్పుడప్పుడు కొంత తలనొప్పిగాను, ఇంకొకప్పుడు చల్లగాను అనుభవమవుతోంది. ఆ విషయం ఏమిటో తమకే తెలియాలి.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 125

లఖీంపుర్,

01.12.1950

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు క్షేమంగా చేరి ఉంటారని ఆశిస్తున్నాను. తావూజీ మరియు మాస్టర్ సాహెబ్‌గారి నుంచి ఉత్తరాలు అంది ఉంటాయని భావిస్తాను.

'తమరు' ఇక్కడకు వచ్చి వెళ్ళిన తర్వాత 25వ తారీఖు నుంచి నా స్థితిలో కొంత మార్పు తలపిస్తోంది. అయితే 27వ తేదీ నుండి ఎంతో కొంత దానిని గ్రహించగలిగాను. ఇప్పుడు దానిని తమకు నివేదించుకుంటున్నాను.

ఇప్పుడు ఉన్న స్థితిలో నా శారీరక స్పృహ ఏమాత్రమూ లేకుండా పోయింది. ఈ స్థితి దాదాపుగా చాలా రోజులుగా ఉంది. దేనినైనా తాకినప్పుడు మాత్రమే చల్లదనం లేదా వేడి యొక్క అనుభూతి శరీరానికి కొంచెంగా తెలుస్తుంది లేదా అది కొంచెంసేపు మాత్రమే నిలిచి ఉంటోంది. బహుశా శరీరం యొక్క స్పృహ కలిగినప్పటికి అది నాకు తెలియటంలేదు. అయితే మనస్సు మాత్రం ఎప్పుడూ సమాధి స్థితిలోనే మునిగి ఉంటోంది లేదా అది దాదాపు మృతుని యొక్క స్థితిలాగానే అన్నివేళలా ఉంటున్నది. నాకు ప్రతి వస్తువూ ఒకే విధంగా అనిపిస్తున్నది. ఇప్పుడు (Working) 'పని' చేస్తూ ఉన్నప్పుడు, నిద్రిస్తున్నప్పుడు లేదా మేల్కొంటున్నప్పుడు ఏదో పెద్ద యుద్ధం మొదలవుతున్నట్లుగా అనిపిస్తోంది. నవంబర్ 14, 15వ తారీఖుల్లో నా ఎదుట ఒక మృతదేహం కనిపించింది. నా అంచనా ప్రకారం బహుశా సర్దార్ పటేల్ యొక్క మరణం చాలా దగ్గరలో ఉందని అనిపిస్తోంది. అదేమిటో దైవానికే తెలియాలి. బాబూజీ, తమరు ఇక్కడకు వచ్చినప్పటి నుండి, ఒక వింతైన స్థితి అనుభవమవుతోంది. అదేమిటంటే, స్వప్నంలోనే అన్నీ చివరివరకు భోగించినట్లుగా అనిపిస్తోంది. ఇంకా ఏమిటంటే, ఏ శక్తి నయితే 'మాలిక్' అనుగ్రహించాడో దాని మీద నాకు ఆధిపత్యం లేదా స్వామిత్వం కలిగినటువంటి స్థితి ఉన్నట్లుగా ఉంది. అన్నింటి యొక్క భోగం (అనుభవించడం) శీఘ్రంగా ముగుస్తున్నట్లుగా అనిపిస్తోంది. ఇదివరలో 'మాలిక్' నా జ్ఞాపకంలోనే బాగా ఉన్నట్లుగా అనిపించేది. అదే విధంగా ఇప్పుడు ఆత్మ సమర్పణ (Self-surrender)లో లోలోపలనే బహుశా 'మాలిక్'యే నాలో లయంకావటం ఆరంభమవుతున్నట్లుగా అనిపిస్తోంది. బహుశా ఇది కావచ్చు– లయ అవస్థలో తన అవస్థను నాలో లయం చేయటం ఆరంభించినట్లుగా ఉంది. ఈ సంగతి ఏమిటో తమకే తెలియాలి. ఇంతకుపూర్వం తమరు జ్ఞాపకం నిలుపుకోవాలి అని చెప్పినది ఆంతరికంగా స్థిరమైపోయింది. ఇప్పుడు (Self-surrender) ఆత్మ సమర్పణ విషయంలో అదే విధంగా తలపిస్తోంది.

ఇప్పుడు ఇంకా జరుగుతున్నది ఏమిటంటే, **'మాలిక్' నా నుండి వేరుగా ఉన్నట్లు అనిపించటంలేదు సరికదా, 'అతడి'ని ఒక్క క్షణమైనా వేరుగా ఉన్నట్లు చూసినట్లయితే సహించలేకపోతున్నాను.** ఇప్పటివరకు ఎదుట కుర్చీ మీద 'మాలిక్' నా ఎదురుగా కూర్చుని ఉన్నట్లుగా ధ్యానం చేస్తూ ఉండే దానను. ఇప్పుడు ముఖ్యంగా మొదట నాకు కుర్చీ ఎక్కడా ఏమీ కనిపించటంలేదు. ఇక రెండవది ఏమిటంటే, నేను ధ్యానం చేయటానికి ప్రయత్నించినపుడు, మళ్ళీ ఇదివరకటిలాగా (అనగా 'మాలిక్' వేరుగా లేకపోవటం) అనిపిస్తోంది. తమరు ఈసారి వచ్చినప్పుడు స్థితి ఎంతవరకు

వచ్చిందంటే, నేను ఎక్కువగా అదే స్థితిలో ఉన్నాను, ఆ స్థితి ఏమిటంటే, తమరు నా ఎదురుగా కూర్చుని ఉన్నట్లుగా కూడా ఆ సంగతి మరచిపోతున్నాను. ఒకవేళ ప్రయత్న పూర్వకంగా తమరు కూర్చొని ఉన్నారన్న విషయంపై దృష్టి నిలిపినప్పటికీ, దానిని నా హృదయం సహించలేక పోవటమేకాక, నాకు విచారం కలుగుతోంది. పాట పాడుతున్నప్పుడు మరియు ప్రార్థన చేస్తున్నపుడు కూడా ఇదే స్థితి ఉంటున్నది. నా స్థితి ఈ విధంగా ఉన్నప్పుడు, ప్రార్థన ఎవ్వరి గురించి చేయాలి, దానిలో సంతృప్తి ఏమి ఉంటుందో తమరే చెప్పండి. అయితే అదేమిటో తమకు తెలిసినదే. ఇప్పుడు నా స్థితి ఎలా ఉందో చూడండి, హృదయం ఎప్పుడూ ఆలోచనారహితంగా ఉంటున్నది. అయినప్పటికి తమరు ఏది అనుకోమంటె అది అనుకోవటానికి నేను సంతోషంగాను, సిద్ధంగాను ఉన్నాను. బాబూజీ, నిజం చెప్పాలంటే, ఆ స్థితి ఎటువంటిది అంటె, అహం తనను తాను గుర్తించినట్లుగా ఉంది. శ్రీ బాబూజీ, నా అవగాహనకు ఏదైతే వస్తూ ఉందో దానిని తప్పనిసరిగా వ్రాస్తూ ఉంటాను, మిగతాది తమకు తెలిసినదే. బహుశా ఈ విషయం ఇంతకుముందు వ్రాసే ఉంటాను, అది ఏమిటంటే, ప్రతివైపున, ప్రతివస్తువు, ప్రతిదానిలోను ఒకే రకమైన స్థితి దర్శనమవుతున్నట్లుగానూ లేదా ప్రవహిస్తున్నట్లుగాను అనుభవమవుతోంది అని. బహుశా మరొక స్థితి కూడా ఉన్నట్లుగా ఉంది కాని దానిని నేను ఇంకనూ గ్రహించలేకపోయాను.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన<br>
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 126

లఖీంపుర్,<br>
11.12.1950

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు సుఖప్రదంగా చేరి ఉంటారని, నా కవరు కూడా తమకు అంది ఉంటుందని భావిస్తాను. ఒకవేళ చేరకపోయినట్లయితే దయచేసి నాకు వ్రాయండి. నేను దానిలో వ్రాసిన స్థితులను మళ్ళీ వ్రాసి పంపుతాను. ఎందుకంటే, "స్థితులు గురించి వ్రాసిన ఉత్తరాలు ఏవైనా సరే అవి నావద్ద ఉండి తీరాలి" అని తమరు గతంలో చెప్పి ఉన్నారు. ఇప్పుడు ఈశ్వరుని కృపతో ఏ స్థితినైతే ఇప్పుడు కలిగి ఉన్నానో దానిని వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఏమి జరుగుతున్నదంటే, ప్రతి దానికీ ఒక పరిమితి వలయం ఏర్పడుతున్నట్లు, దయ, జాలి లాంటి ఎటువంటి విషయం కూడా దానిని దాటిపోవటానికి వీలులేనట్లుగా ఉంటున్నది. అది ఒక నియంత్రణవలె ఉంటున్నది. ఇప్పుడు ఉన్న స్థితి ఎలా ఉంటున్నదంటే, నేను అందరిమధ్య కూర్చొని అందరినీ చూస్తూ ఉన్నాను, గుర్తించగలుగుతూనే ఉన్నాను, ఇంకా మాట్లాడుతూ ఉండి కూడా మాటి మాటికీ వారిని మరచిపోతున్నాను. దీనిని ఇంకొక రకంగా చెప్పాలంటే, నేను ఇదివరలో వ్రాసి ఉన్నట్లుగా - ప్రతిదీ చూస్తూనే ఉన్నాను కాని ఏమీ కనిపించటంలేదు అనీ, వింటూనే ఉన్నప్పటికీ ఏమీ వినబడటంలేదనీ అలాగే ఏదైనా చేస్తూ ఉన్నా కూడా అదేమీ తెలియనట్లుగానే ఉంటున్నదనీ - అదే విధంగా ఉంటున్నది. భగవంతుని కృపతో దాని నిజస్థితి ఇప్పుడు ఎంతోకొంత విశదమవుతూ ఉంది. ప్రపంచంలోని అందరూ ఒకే విధంగా అనిపిస్తున్నారు. నాకు ఏదైనా తెలుస్తోందో లేదో కూడా తెలియటం లేదు. ఇంతకుపూర్వం నేను, చేతనా చేతనములు (అనగా కదిలేవి కదలనవీ), మొక్కలు, చెట్లూ కూడా అన్నీ ఒకే విధమైన స్థితిలో ఉన్నట్లు దర్శనమిస్తున్నాయి అని వ్రాసి ఉన్నాను గదా, కాని ఇప్పుడు ఆ స్థితి ఏమైపోయిందో ఎలా అయిపోయిందో కూడా తెలియటంలేదు. సిట్టింగ్‌లో ఉన్నప్పుడు, దైవ కృప వస్తూ ఉన్నదనే ఆలోచన మీద దృష్టి నిలిపినా కూడా కొంత భారంగా అనిపిస్తోంది. అదేమిటో దైవానికే తెలియాలి. 'అతడి'కి ఎలా అనిపిస్తే అలా చేస్తాడు. స్థితి ఎలా ఉందంటే- అహం (Self) తనను తాను గుర్తించినట్లుగా ఉంది. శ్రీ బాబూజీ, ప్రస్తుత స్థితి ఎలా ఉందంటే, ఆత్మ

సమర్పణవైపు హృదయం మరలినట్లయితే, శరీరం కరిగి, విస్తరిస్తూ లేదా ప్రవహిస్తూ ఉన్నట్లుగా అనిపిస్తోంది. ఇంకా ఏమి అనిపిస్తోంది అంటే, శరీరం యొక్క అంగాంగాలు అన్నీ కూడా విడిపోయి ఛిన్నాభిన్నమైపోయి చెదరిపోయినట్లుగా ఉంది. మొన్నటిరోజు అనగా డిశంబర్ 9వ తారీఖు రాత్రి, స్వప్నంలో ఏదో ఆజ్ఞ జారీ చేయబడినట్లుగాను, లేచిన తర్వాత అదేదో వ్రాద్దామనుకుంటే అది జ్ఞాపకం లేకపోగా, జ్ఞాపకం చేసుకుందామని ప్రయత్నించినా జ్ఞాపకం రాలేదు. కనుక తమకు చేతులు జోడించి ప్రార్థిస్తున్నది ఏమిటంటే, నిజంగా ఈ పేదరాలు ఏదైనా సేవ చేయవలసి ఉంటే దానిని పురమాయించండి. ఆపైన దైవేచ్ఛ. తమ ఆజ్ఞను శిరసావహించటానికి నేను సిద్ధంగా ఉన్నాను. ఇదే సరైన నిర్ణయంగా అనిపిస్తోంది. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 127

లఖీంపుర్,

18.12.1950

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం ఒకటి తమకు అంది ఉండవచ్చు. 'తమరు' చేరుకున్నట్లుగా జాబు ఏమీ అందలేదు. తమ ఆరోగ్యం బాగుందని ఆశిస్తాను. 'తమరు' ఇక్కడి నుంచి వెళ్ళిన తర్వాత, స్థితి మారిపోయినట్లుగా ఉంది. అదంతా తమ అనుగ్రహం ప్రకారమే. ఇదేమంత క్రొత్త స్థితి కాకపోయినప్పటికీ, మృతజీవిలాంటి స్థితుల రూపం మార్పుచెందుతూ ఉన్నట్లుగా అనిపిస్తోంది. నేను తమకు ఇంతకుపూర్వం ఎప్పుడో, ఈశ్వరీయ ధారవంటిది ఏదో లోపల (అంతర్లీనంగా) నిరంతరం ప్రవహిస్తున్నట్లుగా ఉంది అని వ్రాసిన విషయం ఏదైతే ఉందో ఆ ధారయే నా ప్రతిరూపంగా అయినట్లుగా నాకు కనిపిస్తోంది. ఆ స్థితియే నా స్వరూపంగా అయిపోయింది. ఒక మృతజీవి లాంటి స్థితి నామీద అధికారం చలాయిస్తూ ఉంది. ఇప్పుడు నాభిలో ఒక గుంటవంటిది, అది తెరచుకుని ఉన్నట్లుగా అనుభవమవుతోంది. బహుశా ఆ ఈశ్వరీయ ధారయే నా స్వరూపంగా అయిపోయిన కారణంగా శరీరమంతా అన్నివేళలా బాగా తేలికగాను, ప్రశాంతంగాను ఉన్నట్లు నేను గమనిస్తున్నాను. ఇప్పుడు స్థితి ఎలా ఉందంటే, తమరు చెప్పి ఉన్నట్లుగానే కేంద్రం నుంచి కృప వర్షిస్తోంది అను స్థితిగా ఉంటున్నది. ఇప్పుడు హృదయం అన్నివేళలా లీనమై ఉన్నట్లుగా అనిపిస్తోంది. సమస్త ఇంద్రియాల వృత్తులన్నీ కూడా ఒక్కపెట్టున శాంతించటం లేదా సమాప్తమవుతున్నట్లుగా అనిపిస్తోంది. తమరు దయతో వ్రాసిన ఉత్తరం ఈరోజు అందింది. దానిలో తమరు ఆజ్ఞాపించన ప్రకారం 'పని' (Working) చేయటం ఆరంభించాను. తమకు ఎలా అనిపిస్తే అలా పని చేయించుకోండి. తమరు చాలా ప్రియమైన మాట - "ఎవరైతే నావంటి వానిని తమ శరణులోకి తీసుకున్నారో ఆ ఘనత ఆ మాలిక్‌దే" అని వ్రాసారు.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 128

లఖీంపుర్,

20.12.1950

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. దయతో 'తమరు' వ్రాసిన ఉత్తరం నిన్న చేరింది. 'తమరు' వ్రాసిన (Working) పని విధానాన్ని గురించి నాకు మార్గదర్శనం చేయండి. ఉత్తర భారతదేశం ప్రక్షాళనం గురించి అనుసరించవలసిన దానిని ఏదైతే తమరు మాస్టర్ సాహెబ్‌కు వ్రాసారో దానిని ఆచరించమంటారా లేక ఈశ్వరీయ ధార ప్రభావంతో సమస్త మాలిన్యాలు తొలగిపోతున్నాయి అని నేను ఆచరిస్తున్న విధానాన్ని కొనసాగించమంటారో నిర్దేశించండి. ఈ పృథ్వి

యొక్క అపవిత్రతలన్నీ వాతావరణంలో కలిసిపోతున్నాయనీ, మూల విరాట్ యొక్క శక్తితో తేలికైన తుంపరులు వాతావరణంలో కలిసి పోతున్నాయనీ, ఆ విధంగా కలిసిన తుంపరులు సమస్త అపవిత్రతను అతివేగంగా ధ్వంసం చేస్తున్నాయని తమరు పూజ్య మాస్టర్ సాహెబ్‌కు వ్రాసి ఉన్నారు. తమ ఉత్తరం అందింది, లేకుంటే 4,5 రోజుల నుంచి ఆ పని చేయటానికి నా హృదయం తల్లడిల్లుతోంది. అయితే బహుశా కొంత పని ప్రారంభమైపోయింది కూడ.

అమ్మ తమకు ఆశీస్సులు తెలుపుతున్నది.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 129

షాజహాన్‌పుర్,
22.12.1950

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నారాయణ ద్వారా నీ ఉత్తరం అందింది. 'పని' గురించి నీవు వ్రాసిన విధానం చాలా బాగుంది. నీవు పని చేస్తూ ఉన్నప్పుడు విధానం తానంతటదే అర్థమవుతూ ఉంటుంది. 'పని' ముఖ్యం, కాని ఏ ఒక్క విధానమైనా అనుసరించవచ్చు. ఇక్కడ అందరూ బాగున్నారు.

నీ శ్రేయోభిలాషి,
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 130

లఖీంపుర్,
28.12.1950

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ నుంచి ఒక పోస్టుకార్డ్ వచ్చింది. నా ఆత్మిక దశను గురించి ఏమి వ్రాయను! ఇప్పుడు ఉదాసీన స్థితియే అన్ని వేళలా ఉంటోంది. అది ఎందుకో తెలియదు. ఇంకా ఎలా ఉందంటే – 'మాలిక్' జ్ఞాపకమూ ఉండటం లేదు, అలాగే నన్ను గురించిన ప్రత్యేకత కూడా ఏమీ ఉండటం లేదు. అసలు ఏమైనా ఉందో లేదో కూడా తెలియదు. అయితే స్థితి మంచిదిగా గాని, చెడ్డదిగా గాని ఏమీ అనిపించటంలేదు. నిజం చెప్పాలంటే, ప్రత్యేకమైన స్థితి అంటూ ఏదీ అనుభవానికి రావటంలేదు. శాంతి మొదలైన విషయాల గురించి చెప్పవలసి వస్తే, ఏదైనా గాబరాపడవలసిన విషయం అనగా పెద్ద సోదరి అనారోగ్యం గురించిన వార్త విన్నప్పుడు, హృదయంలో విచారం కలుగుతుంది. అయితే ఆంతరికంగా దృష్టి నిలిపినట్లయితే, అప్పుడు నిశ్చలమైన శాంతియే అనుభవానికి వస్తోంది. ఇంకా ఎటువంటి స్థితి అంటె, ఆలోచనలు వస్తూనే ఉంటాయి, కాని హృదయం వాటిని గురించి పట్టించుకోనట్లుగానే ఉంటుంది. ఆత్మ సమర్పణ (Self-surrender) అంటూ ఉందో లేదో తెలియదు. అయితే నేను దీనిని గురించి పట్టించుకోవటంలేదు. 'మాలిక్' నన్ను ఎలా ఉంచితే అలాగే ఉంటాను. కాని తరచుగా హృదయం అశాంతికి గురవుతూ ఉంటుంది. పూజ్య శ్రీ బాబూజీ, అదేమిటోగాని పూర్తిగా నిర్లిప్త స్థితి నన్ను ఎల్లప్పుడూ వెన్నంటి ఉంటోంది. దానితో అప్పుడప్పుడు నా హృదయం విసుగు చెందుతుంది. ఈ స్థితి ఏమిటో తెలియదు కాని ఇప్పుడు ఇంకొక స్థితి, జీవం ఉండి కూడా నిర్జీవంగా తలపిస్తోంది. ఇంతకుపూర్వం ధ్యానం చేస్తున్నపుడు నా హృదయం 'మాలిక్' జ్ఞాపకంలో నిమగ్నమై ఉన్నట్లుగా అనిపించేది, కాని ఇప్పుడు ఆ విధంగా కూడా అనిపించటం లేదు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 131

లఖీంపుర్,

02.01.1951

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. ఈరోజు తావూజీ క్షేమంగా తిరిగి వచ్చారు. తమ ఆరోగ్యం అయితే బాగానే ఉందన్నారు కాని, తావూజీ ద్వారా 'తమ' కడుపునొప్పి పెరిగిందని తెలిసింది. ఇప్పుడు తగ్గి ఉంటుందని ఆశిస్తాను. దైవం తమ జీవితకాలంలో మాకు జన్మనిచ్చి ధన్యం చేశాడు. 'మాలిక్' చరణాలను, బాహువులను ఆశ్రయించుకుని నేను సంపూర్ణంగా ఈ సమయాన్ని (జీవిత కాలాన్ని) లాభదాయకం చేసుకోవాలని 'మాలిక్'ను ప్రార్థిస్తున్నాను. 'మాలిక్' కనుక ఈ దీనురాలిపట్ల సర్వదా ఇదే రకమైన దృష్టి నిలిపినట్లయితే, ప్రపంచంలో ఎటువంటి ఆటంకం కూడా నా మార్గంలో ఒక్క క్షణమైనా ఎదుర్కోలేదు. 'మాలిక్' తప్పక ఈ దీనురాలిపట్ల తమ కృపను సదా వర్షింపజేయటంలో ఎటువంటి సంశయంలేదని భావిస్తున్నాను. అది ఎందుకో ఆ భగవంతునికే తెలియాలి. ఇంక నా స్థితి గురించి ఏమని వ్రాయమంటారు. అన్ని విషయాలు విన్న తర్వాత ప్రతిదీ ఆరంభమవు తున్నట్లుగా అనిపిస్తోంది. అయితే సరే, ఎవరైతే దయతో ఈ ఆరంభాన్ని అనుగ్రహించారో, వారే క్రమక్రమంగా అంతా సర్దుబాటు చేస్తారని విశ్వసిస్తున్నాను. ఇప్పుడు నడుస్తున్న స్థితి ఎలా ఉందంటే, ఫలితం ఆశించకుండా పని చేయటమే నావంతు అన్నట్లుగాను, దానిని గురించి తెలుసుకోవాలను ఆకాంక్ష హృదయానికి లేనట్లుగాను ఉంది. అన్ని విషయాలలోను ఇలాగే ఉంటున్నది. ఈ స్థితినే చెప్పాలంటే– **"సేవకునికి సేవ మాత్రమే పరమావధి"** అన్నట్లుగా ఉంది. అటుపైన అదేమిటో దైవానికే తెలియాలి. పూజ్య శ్రీ బాబూజీ! నా గమనంలో (నడకలో) ఇంతకుపూర్వం ఉన్నటువంటి వేగం ఎందుకు లేకుండాపోయిందో తెలియటంలేదు. అయినా కూడా, 'మాలిక్' ఆశించినట్లుగా ఏ పని అయినా నా శక్తి మేరకు చేస్తాను; దానిలో ఎటువంటి లోపం రానివ్వను. నేను ఆత్మ శోధన చేసుకున్న ప్రకారం, ఇదివరకు ఉత్సాహం మూలంగా గమనం చాలా ఎక్కువగా ఉండేది, కాని ఇప్పుడు ఆ ఉత్సాహం తపనగా మారిపోయిందన్న విషయం తమకు తెలిసినదే. ఇక నిద్ర విషయానికి వస్తే, ఇప్పుడు ఎలా ఉందంటే, నిద్రపోతున్నప్పుడు ఎక్కడైనా నొప్పిగా ఉన్నట్లయితే తెలుస్తుంది, కాని నిద్రపోతూనే ఉన్నాను. తమరు, బ్రహ్మాండ మండలంలో సంచారం గురించి చెప్పినటువంటిది, 'మాలిక్' దయతో ఆ స్థితికి చేరుకున్నాను. అయితే సరే, అది దైవేచ్ఛగా భావిస్తాను.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 132

లఖీంపుర్,

07.01.1951

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు అంది ఉండవచ్చు. ఇక్కడ అందరూ క్షేమమే. తమరు కూడా కుశలమేనని ఆశిస్తాను. నా స్థితి ఎలా ఉందంటే, నావలన ఏమి పనులు (కర్మలు) జరపబడుతున్నాయి, ఏమి చేయబడ్డాయి అను ప్రసక్తియే లేకుండాపోయింది. ఇంకొక విధంగా చెప్పాలంటే, హృదయం ఇటువంటి వాటిని గురించి పూర్తిగా విస్మరించింది. అయితే ఈ స్థితి చాలా నెలల తరబడి నడుస్తూ ఉంది. కాని ఇప్పుడు అది ఖచ్చితమైన రూపం దాల్చింది. ఎలా అంటే, ఒక చిన్నపిల్లవాడు ఎక్కడ నుంచైనా తిరిగి వచ్చినా లేదా ఎవరి దగ్గరైన ఎక్కువ

రోజులు ఉండి అతనిని వదలి వచ్చినా, అతనికి (ఆ పిల్లవానికి) ఆ విషయం ఒకటి రెండు రోజులు జ్ఞాపకం ఉంటుంది. ఆ తర్వాత పూర్తిగా మరచిపోవటం జరుగుతుంది. నా స్థితి కూడా అదే విధంగా ఉంది. నాకు రూపం కూడా గుర్తుకు రానట్లుగా ఉంది. ఎప్పుడైనా అమ్మ, పెద్దక్క గురించిగాని, పిల్లల గురించి గాని మాట్లాడుతున్నప్పుడు, వాళ్ళ ముఖాలు కొద్ది కొద్దిగా జ్ఞాపకం వస్తూ ఉన్నాయి, కాని ఎప్పుడైతే ఆ ప్రస్తావన ముగుస్తుందో మళ్ళీ అదే స్థితి నెలకొని ఉంటుంది. ఈ స్థితి చాలా మాసాలుగా ఉంటున్నప్పటికీ ఖచ్చితమైన దాని పూర్తి స్వరూపం ఇప్పుడు అవగాహనకు వచ్చింది. దీనికి ఏ మాటను వాడమంటారు? నాకైతే తెలియటంలేదు. ఇంకొక స్థితి ఎలా ఉంది అంటె, ఎవ్వరైనా నావద్దకు సంతోషకరంగా వచ్చినట్లయితే, అప్పుడు నా హృదయం దానంతట అదే ఆంతరికంగా సంతోషపడుతుంది. అది ఆ దైవానికే తెలియాలి. నిరంతరం ఆలోచనారహితంగా ఉంటున్నాను. ఈ మరపుస్థితి ఎలా అయిపోయింది అంటె, నేను అమ్మతోపాటు ఎవ్వరి ఇంటికైనా వెళ్ళి తిరిగివచ్చిన తర్వాత నేను ఎవరి ఇంట్లో ప్రవేశిస్తున్నానో కూడా తెలియటంలేదు. ఇంకా ఏమవుతోంది అంటె, ఆ విధంగా ఇతరుల ఇంటికి ఫంక్షన్‌కు వెళ్ళి ఎందరితోనే కలిసిమెలిసి ఉన్నప్పటికీ, వారందరిని విడిచి ఇంటికి రాగానే అందరినీ మరచిపోయినట్లవుతోంది, తోడు వచ్చిన వారు, మినహా. అదేమిటో దైవానికే తెలియాలి. 'అతడు' ఏది తలిస్తే అది అవుతుంది. ఇప్పుడు కొన్ని రోజుల నుండి నిద్రలో ఆలోచనలు వస్తున్నాయి, ఎందుకో ఆ దైవానికే తెలియాలి. అటువంటి సందర్భంలో, నిద్రలేచి వెంటనే నడవటం ప్రారంభించినట్లయితే, తల తిరగటం జరుగుతూ ఉంది. అప్పుడు నేను ఏమైనా గాఢనిద్ర నుంచి లేచివచ్చానా లేక ఇంకెక్కడి నుంచి అయినా ఊడిపడ్డానా అన్నట్లుగా ఉంటున్నది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు. అమ్మ తమకు ఆశీర్వాదాలు తెలుపుతున్నది.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 133

లఖీంపుర్,
12.01.1951

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. పూజ్య మాస్టర్ సాహెబ్‌గారి నుద్దేశించి తమరు దయతో వ్రాసిన ఉత్తరం ద్వారా సమాచారం తెలిసింది. భగవంతుని కృపతో ఏ స్థితి అయితే కలిగిందో దానిని వ్రాస్తున్నాను.

ఉదాసీనత స్థితి ఇప్పుడు అన్ని సమయాల్లోను చాలా గాఢంగా ఉంటోంది. అప్పుడప్పుడు దాని రూపం ఎలా ఉంటున్నదంటే, దానిని దుఃఖం మాత్రంలేని అత్యంత ఉదాసీన స్థితి అని చెప్పినా అందుకు అభ్యంతరం ఏమీ ఉండదు. తమకు ఉత్తరం వ్రాసిన తర్వాత 4,5 రోజులు నా గమనంలో కొంత వేగం పుంజుకుంది. అయితే ఇప్పుడు మళ్ళీ మందగించింది. 'మాలిక్' ఎలా నడిపిస్తాడో, అది 'అతని' ఇష్టం. ఇప్పుడు ఉన్న స్థితి ఎటువంటిది అంటే, నేను తమకు ఇదివరకు, అందరిలో కలిసి ఉండి కూడా అందరినీ మరచిపోతున్నాను అని వ్రాసినది అలా ఉండగా, ఇప్పుడు అది ప్రపంచంలోని సమస్త జనులేకాదు, సమస్త వస్తువులన్నీ కూడా నీడల్లాగా కనిపిస్తున్నటువంటి స్థితిగా ఏర్పడింది. అది ఎంతగానంటె, ఆఖరికి నా శరీరం కూడా ఒక నీడలాగా లేదా ఒక ఆకారమాత్రంగా ఉంటున్నది. ఇంకా ఏమి అనిపిస్తున్నది అంటె, అహం భావం (అనగా నేను అను భావం) కూడా ఒక నీడలాగా కనిపిస్తున్నది అని చెబితే సబబుగా ఉండవచ్చు. ఇటువంటి ఆలోచనారహితమైన స్థితి మరియు ఉదాసీన స్థితి నిరంతరం ఉంటోంది. ప్రస్తుతం స్వప్నావస్థయే రాత్రింబవళ్ళు అనగా 24 గంటలూ నిలిచి ఉంటోంది. ఏడు, ఎనిమిది రోజులు, ప్రక్షాళన క్రార్యక్రమం జరుపుతూ ఉన్నప్పుడు, ప్రతిదీ దట్టమైన మంచుతెరలాగా అనిపించింది. మిగిలినదంతా బాగానే

జరుగుతోంది. 'మాలిక్'కు కోర్కె కలిగినట్లయితే ఉత్సవంలో 'తమ' దర్శనం చేసుకుంటాను.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 134

లఖీంపుర్,
24.01.1951

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. పూజ్య తావూజీ నుద్దేశించి తమరు దయతో వ్రాసిన ఉత్తరం, పూజ్య మాస్టర్ సాహెబ్‌గారు తీసుకొని వచ్చిన దానిని నేను చదివాను. దానిని అర్థం చేసుకోవటం నావంటి మందబుద్ధిగల వారికి చాలా కష్టం. దానిని గురించి 'మాలిక్'కు బాగా తెలుసు. తమ ఆరోగ్యం బాగుందని విని సంతోషించాను. దైవం తమరిని దీర్ఘాయువునిగాను, ఆరోగ్యవంతునిగాను ఉంచి, మా వంటి అమాయక పిల్లల ఆత్మోన్నతిలో 'తమ' అభయహస్తాల నీడలో ఫలం ప్రాప్తించి అభ్యున్నతి చెందునట్లు అనుగ్రహించు గాక! అంతకుమించి నాకేమీ అవసరంలేదు. శ్రీ బాబూజీ, ఎందుకో తెలియదుకాని, ప్రస్తుతం నా ఆత్మిక దశ బాగా సాగటంలేదని అనిపిస్తోంది. ఇప్పుడు 12-14 రోజుల నుండి రేయింబవళ్ళు ఆలోచనలు వస్తూనే ఉన్నాయి. అయితే ఎటువంటి ఆలోచనలు వస్తూ ఉన్నాయి అనేది మాత్రం నాకు తెలియదు కాని, వాటి ప్రభావమైతే నామీద ఏమాత్రమూ లేదు. అయినా ఆలోచనలు మాత్రం వస్తూనే ఉన్నాయి. ప్రస్తుతం నా స్థితిలో ఎటువంటి పురోగతి ఉన్నట్లుగా కనిపించటంలేదు. నిస్సందేహంగా, నా ఆత్మోన్నతి ఎప్పుడూ పురోగమనం చెందుతూనే ఉన్నదని నాకు విశ్వాసం ఉంది, ఇక ముందు ఉంటుంది కూడా. ఇప్పుడు ఉన్న స్థితి ఏమిటంటే, దానిలో ఏదైనా గ్రంథి వంటిది అయ్యి ఉంటుందేమో లేక మరేదో, నాకు తెలియడంలేదు. 'తమరు' అదేమిటో వ్రాస్తేనేగాని తెలియదు. ఇంతకుపూర్వం నేను స్వప్నావస్థయే ఇరవై నాలుగు గంటలూ ఉంటోంది అని వ్రాసి ఉన్నాను. అది ఇప్పుడు కూడా ఉంది కాని ఇంకొక స్థితి ఎలా ఉందంటే, పగటిపూట మేల్కొని ఉన్న స్థితిలో కూడా నిద్రిస్తూ ఉన్నటువంటి స్థితి ఉంటున్నది. దానిని స్వప్నావస్థ అని చెప్పాలో మరేమని చెప్పాలో తమకే తెలియాలి. 'పని'ని (Working) వదిలిపెట్టి నిరంతరం క్రియాశూన్యంగా (Inactiveness) ఉన్నటువంటి స్థితి ఇప్పుడు నిలిచి ఉంది. శ్రీ బాబూజీ, నిజం చెప్పాలంటే, 'మాలిక్' తప్ప ఒక్క క్షణం కూడా ఇంకేమీ మంచిగా తోచటంలేదు. అంతకుమించి నాకేమీ అవసరం లేదు. ప్రస్తుతం స్థితి ఏమిటో తెలియటం లేదు. దేనిలోనూ బాహ్యంగాను, ఆంతరికంగాను నాకు భేదం ఏమీ తెలియటంలేదు. ఇంతకుముందు, "కుక్కకు, నాకు ఒకే ప్లేటులో ఆహారం పెట్టినట్లయితే మేమిద్దరం సంతోషంగా భుజిస్తూ ఉంటాము" అని బహుశా నేను వ్రాసి ఉంటాను. అయితే ఇప్పుడు నాకు ఎవ్వరిపట్ల నిరసనగాని, మరెవ్వరి తోడుగా భుజించడానికి ఆసక్తిగాని లేనట్లుగా అనిపిస్తోంది. ఏదైతే అది అవుతుంది అన్నట్లుగానే నా స్థితి ఉంది. ఎవ్వరితోనూ ఏమీ సంబంధం లేనట్లుగా ఉంది. అందరిపట్ల ఇదే భావం కలిగి ఉంటున్నాను. ఏమి ఉన్నదో ఏమి లేదో కూడా తెలియకుండా ఉంది. బహుశా ప్రతిదీ ఒక ప్రత్యేకమైన మసకబారిన నీడలాగా అయిపోయినట్లు భావించవచ్చునేమో. ప్రస్తుతం నాస్థితి ఏమీ చెడిపోలేదు గదా! దయచేసి 'తమరు' తప్పక తెలియజేయండి. ఇప్పుడు ఉన్న ఇంకొక స్థితి ఏమిటంటే, ఇంతకుపూర్వం ఎప్పుడైతే రాత్రిపూట నా కళ్ళు తెరచుకుంటాయో అప్పుడు అన్నటికంటె ముందు 'మాలిక్' యొక్క ధ్యాసయే కలుగుతూ ఉండేది, మరి ఇప్పుడేమో కొంత సమయం తర్వాత కాని కలగటంలేదు.

పిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ దీనురాలు, అజ్ఞాన పుత్రిక,
కస్తూరీ.

## ఉత్తరం సంఖ్య - 135

లఖీంపుర్,
29.01.1951

పరమ పూజ్యులు, వందనీయులు శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం ఒకటి అంది ఉంటుందని భావిస్తున్నాను. దాదాపు 10,15 రోజులుగా నా ఆత్మిక దశ చాలా దయనీయంగా ఉంది. ఒక దశ నుంచి మరొక దశకు మారే సందర్భంలో, ఆ రెండింటికీ మధ్యన ఉన్న స్థితిలాగా అనిపిస్తోంది. ఏదో విధంగా, తప్పనిసరి అన్నట్లుగాను మరియు అలసటతోను ఈ 10,15 రోజులు గడిచాయి. అయితే శ్రీ బాబూజీ, ఎలాగైతేనేమి ఈశ్వరుడు దయతో నిన్నటి నుంచి నా స్థితిని మార్చాడు. అందుకుగాను 'మాలిక్'కు చాలా ధన్యవాదాలు. నాకయితే 'అతడే' దిక్కు, 'అతడే' తోడు. నా బాబూజీ, ఏది ఏమైనా కానీయండి, నేను నా 'మాలిక్'ను పూర్తిగా పొంది, ప్రస్తుత కాలంలో సంపూర్ణమైన లాభాన్ని పొందగలిగేటట్లుగా నన్ను ఆశీర్వదించి, తమ దయకు పాత్రురాలిని చేయండి. 'మాలిక్' యొక్క ఇటువంటి అపార దయ కలిగి ఉన్నట్లయితే, నా నుంచి 'తమ'కు ఎటువంటి ఫిర్యాదు స్వీకరించే అవుసరం కూడా లేకుండా పోతుంది. ఇంకా త్వరత్వరగా ముందుకు సాగిపోతానని అశిస్తున్నాను. ఈ దీనురాలైన కుమార్తె తమకు నివేదించే ప్రార్థన ఇదే. ఇప్పుడు స్థితి ఎలా ఉంది అంటె, నేను ధ్యానం చేస్తున్నప్పుడు గాని, ఇతరులకు సిట్టింగ్ ఇస్తున్నప్పుడు కాని, నేను ధ్యానం చేస్తున్నట్లుగాని, ఇతరులకు సిట్టింగ్ ఇస్తున్నట్లుగా గాని నాకు అనిపించటంలేదు. ప్రతి పని విషయంలోను ఇదే స్థితి నెలకొని ఉండి, అన్నీ వాటంతట అవే అప్రయత్నంగానే జరిగిపోతున్నాయి. ఆ విషయం కూడా నాకు తెలియనిదిగా ఉంటోంది. 'మాలిక్' దయ ఎలా ఉంటే అలా జరుగుతుంది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 136

లఖీంపుర్,
16.02.1951

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. 'మాలిక్' దయతో మేమందరం క్షేమంగా ఇక్కడకు చేరాము. దేవుని దయతో నాలో కలిగిన ఆత్మికదశను, నాకు అనుభవమైన దానిని వ్రాస్తున్నాను. అది ఎలా ఉన్నదంటే, నేను రైలులో ప్రయాణిస్తున్నప్పుడుగాని, ఎక్కడికైనా వెళ్ళినప్పుడుగాని, ప్రతిచోట నా ఇల్లుగానే అనిపిస్తోంది. అదే విధంగా ఎవరైనా పూజ నిమిత్తం వచ్చినప్పుడు వారు, నావారుగానే అనిపిస్తున్నది. అందుచేత ఇతరులు ఎవ్వరితోనూ మాట్లాడటానికి సంకోచించటంగాని, మరేమీగాని ఉండటంలేదు. ఈ విధంగా అందరూ నావారే అనిపిస్తున్నప్పటికీ, వారందరికీ దూరంగా ఉన్నప్పుడు, ఒక విధమైన నిర్లక్ష్యం ఏర్పడి, ఎవ్వరి గురించిన ఆలోచనా లేకుండా పోతున్నటువంటి స్థితి నాకు అనుభవమవుతున్నది. శ్రీ బాబూజీ, ఇంకేమి చెప్పను? పెద్దక్క ఇక్కడ ఉన్నంతసేపు, ఆమెను గురించిన ఆలోచన, కలుపుగోలుతనం ఉండేవి. ఇప్పుడైతే ఆమె ఇక్కడ లేకపోయాక కనీసం ఆమె ముఖం కూడా నాకు గుర్తుకు రావటంలేదు. అయితే ఇంకొక విషయం – ఎప్పుడైతే ఆమె నుంచి ఉత్తరం వస్తుందో లేదా ఆమె గురించిన ప్రస్తావన వస్తుందో అప్పుడు మళ్ళీ ఆ ధ్యాస కలుగుతుంది. అయితే ఆ ప్రస్తావన ఎవ్వరి గురించో తెలియనదిగా ఉంటుంది. అలాగే ఆమె అనారోగ్యం గురించి తెలుసుకున్నప్పుడు ఒక విధమైన దిగులు కూడా కలుగుతుంది. ఇంకా ఏమని చెప్పను! ఎవరినైనా కలుసుకున్నప్పుడు, ఉదాహరణకు జియా వంటి వారిని కలుసుకున్నపుడు, నేను ముఖస్తుతి

చేస్తున్నటువంటి స్థితిగా అనిపించి నాకు కొంత సిగ్గుగా అనిపిస్తుంది. ఏమైనా కాని, దానితో నాకు పని ఏమిటి? నేనయితే 'మాలిక్' నన్ను ఎలా ఉంచుతాడో అలాగే ఉంటాను. నేను ఇదివరకు 'నిద్ర నుంచి లేచి కూర్చున్నపుడు, ఎక్కడో పరదేశం నుంచి ఊడిపడినట్లుగా ఉంటున్నది" అని వ్రాసినట్లుగా ఇప్పుడు స్థితి ఉంటున్నది. ఇదే విధంగా పగలు ఎప్పుడైనా కూర్చుని ఉన్నప్పుడు గాని, పూజలో కూర్చున్నపుడు గాని, ఎప్పుడైనా కళ్ళు మూతపడినపుడు అటువంటి కుదుపు కలుగుతోంది. అటువంటి స్థితి రోజంతా అనుభవమవుతోంది. ఇప్పుడు ఉన్న స్థితి ఇంకొకటి ఎటువంటిది అంటే, నేను ఎక్కడికైనా వెళ్ళినపుడుగాని, తిరిగి వచ్చినప్పుడు గాని, నేను షాజహాన్‌పూర్ నుంచి తిరిగివచ్చిన సందర్భంలో, మనసులో తమతో విడిపోయిన కారణంగా చెడుగా అనిపించి దుఃఖం నాలోపల కలిగినప్పటికీ దానిని వెంటనే మరచిపోయినట్లుగానే ఇప్పుడు అటువంటి అనుభూతి కలుగుతోంది. అటువంటి ప్రత్యేక స్థితిలో కూడా, 'మాలిక్' కృపతో 'మాలిక్' నుంచి ఒక్క క్షణమైనా కూడా వేరుపడి ఉన్నట్లుగా అనిపించటంలేదు. హృదయం చాలావరకు అమాయకంగా ఉన్నట్లుగా అనిపిస్తోంది. నిద్ర యొక్క స్థితి ఎలా ఉందంటే, మేల్కొని ఉన్నప్పుడు తమతో నేను ఎట్లా మాట్లాడేదానినో, రాత్రి నిద్రలో కూడా అదే విధంగా మాట్లాడుతున్నట్లుగాను ఉంది. నిద్రలో కూడా అదే విధంగా మాట్లాడుతూ ఉండవచ్చునుగాని, దానిని నేను గ్రహించలేకపోయాను.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 137

లఖీంపూర్,
20.02.1951

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నేను వ్రాసిన ఉత్తరం తమకు చేరి ఉండవచ్చు. తమరు ఆరోగ్యంగా ఉన్నారని భావిస్తాను. పూజ్య తావూజీ మరియు మా అందరిమీద పరమ పూజ్యులైన తమరు ఎంత అపారప్రేమను చూపి ఉన్నారో, చూపుతూ ఉన్నారో, ఇంకను చూపనున్నారో - దీనిని ఎవ్వరూ అంచనా వేయలేరు, మరి ఇందుకుగాను తమకు కేవలం ధన్యవాదాలు మాత్రమే గాకుండా ఇంకా ఏమి అర్పించమంటారు! నేను ప్రయత్నమైతే తప్పనిసరిగా చేస్తున్నాను, ఆ పైన 'మాలిక్' ఉన్నాడు. నేను ఏమైతే కృతనిశ్చయం చేసుకున్నానో అది 'మాలిక్' దయతో తప్పక సఫలమై తీరుతుంది. తమరు మాపై వర్షింపజేసిన కృప, తమ ఔదార్యానికి, మహనీయతకు నిదర్శనం. ఆ అదృష్టం దక్కించుకున్న మేము నిస్సందేహంగా ధన్యులం. ఇప్పుడు 'మాలిక్' దయతో ఏర్పడిన ఆత్మికదశను, నా అనుభవానికి వచ్చినదానిని తమకు నివేదించుకుంటున్నాను.

అసలు అదేమిటో దైవానికి తెలియాలిగాని, తమరు ఆంగ్లంలో వ్రాసిన పుస్తకం చదువుతూ ఉన్నప్పుడు నా హృదయం ఎక్కడికి పోతోందో తెలియకుండా ఉంది. ఆ విధంగా చదువుతూ ఉన్నప్పుడు అర్థంచేసుకుంటూనే ఉన్నాను, కాని ఎప్పుడైతే చదవటం నిలిపివేస్తానో అప్పుడు నా మానసం (Absent-minded) మూగపోతుంది. ఆ తర్వాత ఒక్క కుదుపు కలిగిన తర్వాత అంతా మరచిపోతున్నాను. అదేమిటో దైవానికే తెలియాలి. బాబూజీ, ఇప్పుడైతే ఎటువంటి స్థితి కలిగి ఉన్నదంటే, ఈ ప్రపంచంలో నేను జీవిస్తూనే ఉన్నప్పటికీ ఇక్కడ లేనట్లుగా అనిపిస్తోంది. మరెక్కడ ఉంటున్నానో కూడా తెలియకుండా ఉంది. ఈ స్థితి ఎంతోకొంత ఎప్పటినుండో ఉన్నప్పటికీ, ఇప్పుడు అది (Free position) స్వతంత్రించి ఉన్నట్లుగా ఉంది. ఒకప్పుడు ఏ స్థితినైతే తమరు "నీవు సుషుప్తి స్థితిలో వేగంగా పురోగమిస్తున్నావు" అని వ్రాసి ఉన్నారో, ఈ స్థితిని అటువంటి దానిగానే చెప్పటం సముచితంగా ఉంటుందని అనుకుంటున్నాను. అప్పటికీ ఇప్పటికీ ఉన్న భేదం ఏమిటంటే, ఇప్పుడు ఇది నిరంతరంగా ఉంటోంది. అది తమకే

తెలియాలి. ఇంకొక విషయం ఏమిటంటే, హృదయం దేనిమీదకు మరల్తుందో దాని నుంచి వైదొలగటానికి ఇష్టపడటంలేదు. వాస్తవంగా ఏమిటంటే, 'మాలిక్' దయతో ఈ దీనురాలికి 'మాలిక్' మాత్రమే కావాలి. నేను 'అతడి'నే వేడుకుంటున్నాను. ఈ స్థితిలో నాకు ఎక్కువగా తలపిస్తున్నది ఏమిటంటే, ఏ పని చేయటానికి ఆసక్తి లేదు. ఇంకా చెప్పాలంటే, ఈ ప్రపంచంతో సంబంధం లేనటువంటి స్థితి ఉంటున్నది. ఏమీ పట్టనటువంటి (Absent-mindedness) మానసిక స్థితి ఇప్పుడు నిలిచి ఉన్నట్లుగా భావించండి. శ్రీ బాబూజీ, ఇదివరకైతే 'మాలిక్' స్మరణయే నా శరీరంలో ఎల్లవేళలా ఉంటూ ఉండేది, కాని ఎప్పుడైనా అది స్థిరంగా నిలవకుండా తప్పిపోతున్నపుడు, దానిని బలవంతంగానైనా ఏదో విధంగా నిలిపి ఉంచేదానను. మరి ఇప్పుడు ఏమైందో ఏమోకాని, నా శరీరం దాని రూపంతోపాటు పూర్తిగా కనిపించకుండాపోయింది. మరి ఇప్పుడు ధ్యానం ఎలా చేయగలను? అయినా కాని, 'మాలిక్' దయతో ఆ ధ్యానం దానంతట అదే నా లోపల అప్రయత్నంగానే ఎక్కడో నిలిచి ఉంది. 'మాలిక్' దయ ఎటువంటిదో వర్ణింపనలవికాదు. నేను 'మాలిక్'కే సంబంధించి ఉన్నాను. 'మాలిక్' ఎలా తలిస్తే అలాగే అవుతుంది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 138

లఖీంపుర్,

02.03.1951

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉండవచ్చు. 'తమరు' బాగున్నారని భావిస్తాను. ఈశ్వరుని కృపతో ప్రస్తుతం ఉన్న ఆత్మికదశను గురించి వ్రాస్తున్నాను. అదేమిటోగాని, ఆలోచనలు నిరంతరం వస్తూనే ఉన్నాయి. నామీద వాటి ప్రభావం పడకపోయినప్పటికీ, అప్పుడప్పుడు అసలు ఇవి ఆలోచనలా ఇంకా ఏమన్నానా అని తెలియటం లేదనిపిస్తుంది. అయినా కూడా అప్పుడప్పుడు మనస్సు వ్యాకులం చెందుతోంది. అప్పుడప్పుడు ఒక ఆలోచన రావటం, దాని మూలంగా గాని మరే కారణంగానైనా గాని, అదే విషయం నా కళ్ళముందు నిలిచి, అంతటా అగ్ని రగులుతూ ఉన్నట్లుగాను, గాలిలో ఏదో గందరగోళం జరుగుతున్నట్లుగాను అనిపిస్తుంది. అప్పుడప్పుడు అకారణంగా ఏదో విచారం క్రమ్ముకొని ఉన్నట్లు ఉండి,  వెంటనే శాంతి ఆవహించి ఉన్నట్లుగాను అనిపిస్తుంది. ఏమి జరుగనున్నదో ఆ దైవానికే తెలియాలి. ఒకప్పుడు నెలల తరబడి ఏ ఒక్క ఆలోచన కూడా రాకుండా ఉండటమూ, నిరంతరం హృదయానికి 'మాలిక్' ఆలోచన మినహా మరి ఎటువంటి ఇతర ఆలోచన రాకుండా ఉండటమూ జరిగింది. అదేమిటో నాకయితే అర్థంకాలేదు, దైవానికే తెలియాలి. అదేమిటోగాని చాలా రోజుల నుండి హృదయం, అన్నివైపుల నుంచి, అన్ని సమయాల్లోను మరియు అన్నింటిపట్ల ఒక విధమైన విరక్తిగా ఉంటున్నది. ఎవ్వరైనా నాతో మాట్లాడటం జరిగినట్లయితే నాకు విసుగుదల కలుగుతోంది. ఈ పరిస్థితిని నివారించటానికి మార్గాలు అన్వేషిస్తున్నానుగాని, అది ఏదో కొద్దిసమయం మాత్రమే సఫలమై ఆ తర్వాత హృదయాన్ని సమాధానపర్చుకోవటంలో విఫలమవుతున్నాను. ఇది కూడా ఒక స్థితియేనా లేక మరేమైనా, అనేది తెలియటంలేదు. నాలో ఎప్పుడూ ఒక ఆనందం మరియు శాంతి క్రమం ఏదైతే నిర్విరామంగా ఉంటూ ఉండేదో, అది సాధారణ విషయమే అయి ఉండవచ్చునుగాని, ఇప్పుడు వాటి సంగతి లోపల బయట కూడా జాడలేకుండా పోయింది. నా పరమపూజ్య బాబూజీ, నేను నా 'మాలిక్'పట్ల ఉన్నతమైన ప్రేమను ఎంతగా కలిగి ఉండాలో అంతగా కలిగి ఉండలేకపోతున్నాను. ఏదైతేనేమి, అది 'అతని' ఇష్టప్రకారమే. ఇప్పుడు నాకు 'మాలిక్' గురించిన కోర్కెతప్ప మరేదీ ఉండటంలేదు. 'మాలిక్' యొక్క కృపవలన కలిగిన నా ఈ స్థితి ఎటువంటిదంటే, నన్ను ఒక అంధురాలనటమనేది అనుచితంకాదు. ప్రేమ ఉన్నా లేకపోయినా

కూడా నాకు 'మాలిక్' కావాలి. ఒకరోజు తప్పకుండా వస్తుంది, అది ఏవిధంగానైనా రావచ్చు, అపుడు 'మాలిక్'కు పూర్తిగా చేరువౌతాను, పొందుతాను; అటుపైన 'అతడు' ఏది తలిస్తే అది జరుగుతుంది. అయితే ఇప్పుడు ఈ విసుగుదల లేదా విరక్తి స్థితి నిరంతరం ఎందుకు ఉంటున్నదో తెలియటంలేదు. ఒక స్థితి మారుతున్నప్పుడు అదేమిటో తెలియకపోయినా కూడా, అది అహంకార రూపంగా పరివర్తనం చెందుతున్నదా లేక అహంకార రూపమే మారిపోతూ ఉన్నప్పుడు ఆ స్థితిలో మార్పు కలుగుతోందా అనే ఆలోచన కలుగుతోంది. పూజ్య బాబూజీ, ఈ విరక్తి మరియు ఉదాసీనత స్థితియే నాలో ఎడతెగని స్థితిగా ఉంటున్నది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 139

షాజహాన్‌పుర్,

03.03.1951

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

శుభాశీస్సులు. నీ ఉత్తరాలన్నీ చేరాయి. ఇప్పుడు నీ స్థితిని గురించి వ్రాయవలసిందేమంటే, నీవు 'ఫనాయే ఫనా' స్థితిని దాటిపోయావు. ఇప్పుడింక 'బకా' స్థితిలో ప్రవేశించావు. 'ఫనాయే ఫనా స్థితి' ఎంత తీవ్రంగా ఉంటుందో అదే పరిమాణంలో ఈశ్వరుని దర్బారులో ఆ వ్యక్తికి 'బకా' దక్కుతుంది. నీ సోదరీసోదరులకు నా శుభాకాంక్షలు అందజేయి. అలాగే అమ్మగారికి నా నమస్కారాలు తెలియజేయి.

('ఫనాయే ఫనా' అనగా లయావస్థ, దైవంలో లయమగునటువంటి స్థితి. 'బకా' అనగా లయావస్థ యొక్క పరిపక్వ స్థితి)

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 140

లఖీంపుర్,

04.03.1951

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. పూజ్య మాస్టర్ సాహెబ్‌ను ఉద్దేశించి 'తమరు' వ్రాసిన ఉత్తరంలోని సంగతులు విని హృదయంలో ఆనందం కలిగింది, కాని తమ కష్టాలు మరియు ఆధ్యాత్మికంగా లాభం చేకూర్చలేని స్థితిని విని దుఃఖం / విచారం కలిగాయి. ఏది ఏమైనా సరే, తమరు మాత్రం మాకు చేకూర్చే ఆధ్యాత్మిక లబ్ధిని ఒక్క క్షణం కూడా విస్మరించకుండా ఉండండి. ఇప్పుడు 'మాలిక్' దయతో కలిగిన ఆత్మికదశను వివరిస్తున్నాను.

ఇప్పుడు స్థితి ఎలా ఉందంటే, ఆలోచనలు వగైరా తగ్గిపోవడటమో లేదా వాటి రూపం మారటమో జరిగింది, కాని విరక్తి వంటి స్థితి ఇంకా గాఢమవుతూ ఉంది. మనస్సు ఏమి కావాలనుకుంటోంది? స్థితి ఎలా ఉంది అంటే, నేను నిశ్శబ్దంగా, పూర్తిగా ప్రశాంతి మరియు ఆరోగ్య స్థితిలో పని చేస్తూనే ఉన్నాను. ఇదే స్థితి ఒక అలవాటుగా అయిపోతూ ఉంది. ఇంకా ఎలా ఉంది అంటె, నవ్వు కలిగించే సందర్భంలో కూడా నవ్వు కలగటంలేదు, అయినప్పటికి యదాలాపంగా నవ్వుతున్నాను. హృదయం లోపల ఎల్లప్పుడూ సోమరితనం లేదా నిర్లక్ష్యం నిలకడగా ఉంటున్నాయి. దానిని సోమరితనం అనిగాని మరేదైనా వింత స్థితి అనిగాని చెప్పవచ్చు. ఇంతకుపూర్వం, నా దృష్టి దాదాపు ఎప్పుడు కూడా నా ఆంతరికంలోనే నిలిచి ఉండేది, కాని ఇప్పుడు దానికి ఏమైందో తెలియదు. ఇప్పుడైతే

నాకు ఎక్కడా గాని, ఎదుట కాని ఏమీ కనిపించదు. దయచేసి మరొక విధంగా తలంచకండి, పనిలోను లేదా దాని తీరులోను 'మాలిక్' తలచినట్లుగానే జరుగుతూ ఉంది. నాకు ఏమీ స్ఫురించటంలేదు, ఎలాగంటే, ఈ ప్రపంచంలో ఉన్న ఏ వస్తువులుగాని, మనుషులుగాని, ఇంటి విషయాలుగాని, బయట విషయాలుగాని, ఇంకా ఏమీ కూడా దృష్టికి రావటంలేదు. అంతా దైవేచ్ఛకే వదిలివేస్తాను. ఈరోజు నుంచి 'మాలిక్' దయతో స్థితిలో ఏదో కొంత మార్పు కలుగుతున్నట్లుగా అర్థమవుతోంది. అది 'తమ'కే తెలియాలి. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 141

లఖీంపుర్,

12.03.1951

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుంది. 'మాలిక్' కృపతో ప్రస్తుతం నడుస్తున్న ఆత్మికస్థితిని గురించి వ్రాస్తున్నాను. తమకు, దీనికి క్రితం ఉత్తరం వ్రాసినప్పటి నుండి హృదయంలో విరక్తి భావం బాగా తగ్గిపోయింది. ఎలా ఉందంటే, అది అప్పుడప్పుడు ఏర్పడింది, మళ్ళీ దానికదే తొలగిపోయింది. ఇప్పుడైతే ఆ విరక్తిలేదు కాని, దానితో కలగలసి ఉన్న దశ కలుగుతున్నది. ఆ విధంగా ఇప్పుడు ఉన్న ఈ స్థితిని మంచిదనటానికి గాని, బాగాలేదని చెప్పటానికిగాని వీలుపడదు. ఇదేదో వింత స్థితిగా ఉంది. పూర్తిగా ప్రయత్నించినప్పటికీ కూడా 'మాలిక్' రూపంగాని, జ్ఞాపకంగాని ఏవో కొద్ది నిమిషాలు మాత్రమే ఉంటున్నది. ఇంకా ఏమవుతున్నదంటే, ఆ 'మాలిక్' జ్ఞాపకం దానంతట అదే కలుగుతున్నదో ఏమో తెలియటంలేదు. ఈ కారణంగా చింత ఇంకా ఎక్కువగా ఉంటూ అది నా వశంలో లేకుండా ఉంటోంది. బాబూజీ, ఇందువలన దానిని 'మాలిక్' అభీష్టానికే వదిలివేస్తున్నాను. బాబూజీ, ఈ స్థితి ఏమిటో గాని లయావస్థ యొక్క జాడే లేదు. అశాంతి లేకపోయినప్పటికీ శాంతి వంటి దశ కూడా లోన బయట కూడా లేకుండా పోయింది. ఇప్పుడు ఇటువంటి స్థితియే ఎక్కువగా ఉంటున్నది. కనుక ఈ స్థితిని మంచిది అనాలో లేక చెడ్డది అనాలో తమరే నిర్ణయించండి. దీనిని 'మాలిక్'యే ఇచ్చారు కనుక చెడ్డది అని చెప్పటానికి వీలులేదు, అది నాకు నచ్చినా సరే నచ్చకపోయినా సరే. అయినా కూడా ఈశ్వరుని కృపతో స్థితి ఈ రోజున కొంచెంగా మారినట్లు అర్థమవుతోంది. బాబూజీ, నేను చూసిన ఇంకొక విషయం ఏమిటంటే, రెండు మూడు రోజులుగా అహం యొక్క భావం పెల్లుబికి వచ్చినట్లుగా ఉంది. అదేమిటో ఆ దైవానికే తెలియాలి. అయితే నామీద దాని ప్రభావం ఏమీ ఉన్నట్లుగా అనిపించలేదు. సరే, ఏమైనాగాని నా కోరిక నా 'మాలిక్'ను గురించియే. 'అతడు' నా మొర ఆలకించి, అన్ని అవరోధాల నుంచి తప్పించి, దయతో 'అతడు' నాకు పూర్తిగా దక్కుతాడు అను ఆశతో ఉన్నాను.

చిన్నవారైన సోదరీ సోదరులకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 142

షాజహాన్‌పుర్,

14.03.1951

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నీ ఉత్తరం అందింది. నీవు తెలిపిన విరక్తివంటి స్థితిని గురించి చెప్పవలసివస్తే, అది వాస్తవంగా విరక్తి స్థితి కాదు కాని దానిని 'హృదయపూర్వక శ్రద్ధ' అని చెప్పాల్సి ఉంటుంది. ఇంకా ఈ చిరాకుకు కారణం ఏమంటే,

ఎవ్వరైనా సమీపంలో మాట్లాడినట్లయితే, అప్పుడు హృదయం ఆ స్థితి నుంచి వైదొలగవలసి వస్తుంది, అది అసహనానికి కారణమౌతుంది. నీలో కలిగేటటువంటి ఆలోచనలు, వాస్తవానికి అవి నీకు చెందినవి కావు. అది నీవు విరాట్‌దేశంలో వ్యాపిస్తూ ఉండటానికి నిదర్శనం. ఏదో నిప్పు అంటుకున్నట్లుగాను, గలాటా జరుగుతున్నట్లుగాను వినిపించటం వంటివి వాస్తవానికి అవి పరిసరాల్లో జరుగుతున్న సంఘటనలు. మార్చి 2వ తేదీతో నీవు వ్రాసిన ఉత్తరంలో తెలిపిన స్థితి, నిజానికి అది అసలు సిసలైన శాంతికి మూలరూపం. "బకా స్థితి తెరచుకుంటోంది" అని నీవు వ్రాశావు. బకా స్థితిని తురీయ స్థితిగా చెప్పవచ్చు. ఎందుకంటే, నేను బకా స్థితిని, తురీయస్థితిని పరిశీలించినప్పుడు రెండూ సరిపోలినట్లుగానే ఉన్నాయి.

నీ సోదరీ సోదరులకు ఆశీస్సులు, అమ్మకు ప్రణామము తెలుపుతున్నాను.

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 143

లఖీంపుర్,

16.03.1951

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసిన ఉత్తరం అందింది, దానిని చదివి చాలా సంతోషించాను. మేమందరం వాస్తవంగా చాలా అదృష్టవంతులం. **మామీద ఈశ్వరునికి ఉన్న అపార ప్రేమ మూలంగా, 'అతడు' మాకు అలాగే 'తమ' మీద విశ్వాసం, ప్రేమ ఉన్న ఎవ్వరికైనా కూడా ఈ ఆధ్యాత్మిక స్వర్ణయుగంలో జన్మనిచ్చి కృతార్థులను చేశాడు. ఇప్పుడు ఈ సమయాన్ని ఉపయోగించుకుని సంపూర్ణ లాభాన్ని పొందటం మా వంతుగా ఉంది. మా ఉన్నతి కొరకు మాకు ఇటువంటి మహాపురుషుణ్ని ప్రసాదించినందుకు పరమ పూజ్య మహాత్ముడు శ్రీ లాలాజీకి మేము ఎంతో కృతజ్ఞులము.** నా 'మాలిక్' యొక్క ఈ దీనురాలిపై సర్వదా ఇటువంటి కృపయే నిలిచి ఉండాలని నేను 'అతడి'ని, 'తమ'ను కూడా సర్వదా ప్రార్థించి ఉన్నాను మరియు ప్రార్థిస్తున్నాను కూడా. ఇప్పుడింక 'మాలిక్' దయతో ఏర్పడిన ఆత్మికదశను వివరిస్తున్నాను. కొద్దిరోజుల నుండి ఎటువంటి స్థితి ఉంటున్నది అంటె, రెండు రోజులు స్థితి మారినట్లుగా అనిపించి మళ్ళీ అదే స్థితి కలుగుతోంది. ఆ విరక్తి, అసహనం వంటివి ఎప్పుడో తొలగిపోయాయి. అది ఆ విధంగా రెండు, మూడు రోజుల నుండి అప్పుడప్పుడు నాలో లోపలే ఆనందం వ్యక్తమవుతూ ఉంది. అయితే అది నిన్నటి నుంచీ ఇంకా పెరిగిపోయింది. స్థితి మారుతున్న విషయం నేను తమకు వ్రాసినది ఎలా ఉంది అంటె, ఎప్పుడైతే స్థితి కొద్దిసేపు కొంత స్వచ్ఛంగా ఉన్నట్లుగా అనిపిస్తుందో, అప్పుడే స్థితి మారుతున్నట్లుగా అనుభూతికి వస్తుంది. ఇప్పుడు ఏ స్థితి అయితే ఉందో, అది ఇంకా స్వచ్ఛంగా రూపుదాల్చినట్లుగా నా దృష్టికి వస్తోంది. ఇంకా నేను గమనించుగలుగుతున్నది ఏమంటే, నా స్థితి ఏదైనప్పటికి, ఎలా ఉన్నప్పటికి నా హృదయానికీ లోలోపల బాగున్నట్లుగానే అనిపిస్తూ ఉంది. ఇంకొక రకంగా చెప్పాలంటే, అది బాగున్నా లేకపోయినా సరే హృదయం దానిని విడిచిపెట్టటానికి ఇష్టపడటంలేదు. అదేమిటో 'మాలిక్'కు తెలియాలి, 'అతని' పనికి తెలియాలి. గతంలోని ఆ విరక్తి స్థితి నేను ఏదైతే వ్రాసానో అది బహుశా నాలో జీర్ణించుకుపోతోంది. ఇంకొక విధంగా చెప్పాలంటే నా హృదయం దానికి (అనగా ఆ స్థితికి) అలవాటు పడిపోయింది. తరచుగా లోలోపలనే ఆనందం అధికమవుతున్నట్లుగాను, అది హృదయం నుంచి ఉప్పొంగిపోతున్నట్లుగాను అనుభూతమవుతోంది. ఈ స్థితి ఈ నెల 14వ తారీఖు వరకు ఉంది. నిన్నటి నుంచి కలిగిన స్థితిని ఇప్పుడు వివరిస్తున్నాను. ఇప్పుడు ఇటువంటి దశలో, గుండె పట్టుకుని ఎంతసేపు అయినా సరే, మనస్సు లోలోపలనే ఒంటరిగా ఆనందిస్తూ ఉండాలని అనిపిస్తోంది. హృదయమంతటిలోనే ఆనందం గిలిగింతలు పెడుతోంది. ఆనందం అంటే నేను సదా నవ్వుతూనే ఉన్నాను అనిగాని, నవ్వుతూ ఉండాలి

అనిగాని కానేకాదు. అలా కాకుంటే లోపలి ఆత్మకు ఆ ఆనందం ఎందుకు కలుగుతూ ఉందో ఆ దైవానికే తెలియాలి. అవునుగాని, నేను 14వ తారీఖు వరకు ఉన్న స్థితిని వర్ణించినపుడు, కలిగినటువంటి స్థితి ఏదైనాగాని అది స్పష్టమైన రూపంలో లేదని వ్రాశాను. ఇప్పుడైతే 'మాలిక్' అపార దయతో ఇటువంటి విషయాలేవీ దృష్టికి రావటంలేదు. అదేమిటో దైవానికే తెలియాలి. అసంతృప్తిగాని, దుఃఖించటంగాని లేకుండా దైవానికి ధన్యవాదాలు తెలపాలి అని తమరు వ్రాసారు. ఆ విధంగా తమరు ఇదివరలో వ్రాసిన తర్వాత నాలో ఎటువంటి దుఃఖం వగైరా లేకుండాపోయాయి. అయితే ఎప్పుడైతే జ్ఞాపకం బాగా కలగదో అప్పుడు మాత్రం హృదయం అశాంతికి గురవుతుంది. ఆ ఆనందస్థితిని గనుక లోతుగా పరిశీలించి నట్లయితే, ఆ అశాంతియే దర్శనమిస్తుంది. అప్పుడప్పుడు ఈ కలతకోసమే కలత చెందాల్సి ఉంటుంది కూడా.

చిన్నవారైన సోదరీ సోదరులకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 144

లఖీంపుర్,

21.03.1951

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం ఒకటి తమకు అందిందని ఆశిస్తున్నాను. 'మాలిక్' కృపతో నాలో కలిగిన ఆత్మికదశను వ్రాస్తున్నాను. నిన్నటి నుండి స్థితి తెరచుకున్నట్లుగా అర్థమవుతోంది. అదేమిటోగాని, అప్పుడప్పుడు ఇంతకుపూర్వం శిరస్సులో ఖాళీ లేదా శూన్యత్వం, దానితోపాటు గిలిగింత లాంటివి అనుభూతికి వచ్చాయో, అదే విధంగా ఇప్పుడు తరచుగా సరిగ్గా వెనుకభాగంలో, షుమారు ఎనిమిది అంగుళాల పరిధిలో తీవ్రమైన గిలిగింత మరియు ఖాళీ అనుభవమవుతున్నాయి. ఇంకొక విషయం ఏమంటే, ఇంతకుపూర్వం ఎవ్వరితోనైనా సరే ఎంతగా మాట్లాడినప్పటికీ, హృదయం ఎప్పుడూ ఏదో ఒక ఉన్నత స్థానంలో అనుబంధం కలిగి ఉన్నట్లుగా అనిపించేది. కాని ఇప్పుడు ఇటువంటి విషయం పూర్తిగా అనుభవానికి రావటంలేదు. 'మాలిక్' జ్ఞాపకం విషయంలో కూడా ఇదే స్థితి ఉండి, ఆ జ్ఞాపకం దానంతట అదే కలుగుతున్నదేమో నాకు తెలియకపోతోంది. ఇప్పుడు ఇంకొక స్థితి ఏమంటే, ఇంతకుపూర్వమైతే ఎవ్వరైనా గాని వారు నా ఇంటివారైనా, బయటివారైనా అందరూ నావారుగానే అనిపించేవారు. ఇంకా ఎవ్వరైనా 'మాలిక్' గురించి మాట్లాడిన వారైనా కూడా పూర్తిగా నావారుగానే అనిపించేది. అటువంటిది ఇప్పుడు అలా 'మాలిక్' గురించి మాట్లాడిన వారుగాని, మరెవ్వరైనాగాని కావచ్చుగాక, ఎవ్వరిపట్ల కూడా నాకు నావారు అనిగానీ, పరాయివారు అనిగానీ అనిపించటంలేదు, ఇక మనస్సులో ఒక విగ్రహంలాగా అయిపోయి కూర్చుంటున్నాను. ఇంకొకరకంగా చెప్పాలంటే, నాకు ఎవ్వరిపట్లగాని ఎటువంటి భావమూ ఒక క్షణమైనా కలగటంలేదు లేదా ఆలోచన రావటంలేదు. అది ఎంత చెప్పుకోతగ్గదిగా ఉందంటే, నాకు ఎవ్వరైనా జనం చెడ్డవారు అని తెలిసి ఉన్నా కూడా, 'మాలిక్' దయతో వారిపట్ల మనస్సులో ద్వేషం గాని, చెడు భావంగాని ఉండటంలేదు. అందుచేత నా ప్రవర్తన కూడా అందరిపట్ల అదే విధంగా ఉండి ఎటువంటి తారతమ్యం లేకుండా ఉంటోంది. బాబూజీ, అసలు విషయం ఏమంటే, మంచి చెడులనేవి ఏమాత్రం దృష్టికి రావటంలేదు. 'మాలిక్' కృపతో ఈ స్థితి కలిగి ఉన్నప్పుడు నాకు ఎక్కడా, ఏదీ కనిపించకపోతుండగా మరి మంచి చెడుల ప్రసక్తి ఎలా ఉంటుంది! ఏదైనా వస్తువుగాని, మానవుడుగాని నా దృష్టికి రావటంలేదు. ఎవరి రూపమూ నాకు దర్శనం కావటంలేదు. నీవు మాస్టర్ సాహెబ్‌ను చూశావు గదా, అని తమరు నన్ను ప్రశ్నించవచ్చు. వారు నాకు సిట్టింగ్ ఇచ్చి ఉండవచ్చును కూడా, అయినప్పటికి నాలో 'లేదు' అను సమాధానం మాత్రమే వస్తుంది. నాలో ఎటువంటి భావాలు లేకుండాపోయాయి. వాటిని కూడా

'మాలిక్' కనికరించి తీసేసుకున్నాడు. అది 'అతని' ఇష్టం. నాకు ఇంక కావలసినది కూడా ఇంకేమీ లేదు. అయితే ఒకే ఒక్కటి – 'మాలిక్' మాత్రమే కావాలి. అది ఏమైనా కానీయండి, అది నా 'మాలిక్'ది మాత్రమే. నా వంటి అజ్ఞానురాలిపైన కూడా, 'అతని' అపార కృపా ఫలితం ఇదే. ఇప్పుడు రెండు మూడు రోజుల నుండి, స్థితి స్వచ్ఛమైనదిగాను, లేదా అమాయకమైనదిగాను అనిపిస్తోంది.

చిన్నవారైన సోదరీ సోదరులకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 145

లఖీంపుర్,
26.03.1951

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరిందనుకుంటున్నాను. 'మాలిక్' కృపతో కలిగినటువంటి ఆత్మికదశను తమకు నివేదిస్తున్నాను. నేను దీనికి క్రితం ఉత్తరంలో సంతోషం గురించి వ్రాసినటువంటిది ఇప్పుడు కనిపించకుండా పోయింది. పూజ్య బాబూజీ, చాలా రోజుల నుండి నాలో అహం (Self) ఎక్కువ అవుతున్నట్లుగా గమనిస్తున్నాను, అది నా వశంలో లేకుండా ఉంటోంది. అది దైవానికే తెలియాలి, బహుశా ఇది కూడా ఒక స్థితి అయి ఉండవచ్చునేమో! నేను 'తమ'కు ఎప్పుడో ఒకసారి 'మాలిక్' మరియు నేను ఒక్కటైపోయినట్లుగా ఉన్నదని వ్రాసాను. బాబూజీ, యదార్థం చెప్పాలంటే, ఆ స్థితి నాకు నచ్చినది, కాని ఇప్పుడైతే అది క్రమంగా బలహీనపడిపోతూ, ఆఖరికి ఒక నెల, నెలన్నర రోజుల నుండి ఆ స్థితి పూర్తిగా కనిపించకుండాపోయింది. అది ఒక్క క్షణకాలం కూడా తిరిగి కలగటంలేదు. మరి ఇప్పుడు ఎందుకోగాని, నాకు 'మాలిక్'లో ఏకత్వం అనేదిగాని, కొంచమైన ప్రేమకాని కలగటంలేదు. ఇంకా ఆ సంబంధం (link) కూడా లేనట్లుగా నాకు నిరంతరం అనుభవానికి వస్తోంది. బహుశా ఈ కారణంతోనే నాలో అహం (Self) పెరిగిందని అనుకుంటున్నాను. అయినా కూడా 'మాలిక్' కృపతో స్థితి మెరుగుపడుతోంది. ఇంకా చెప్పాలంటే, దానికి నా మనస్సు అలవాటు పడిపోయిందనుకుంటాను. ఈ విధంగా ఎందుకు అయ్యిందో ఆ దైవానికే తెలియాలి, కాని నేను నా శారీరక రూపం పూర్తిగా ఒక్కపెట్టున మాయమైపోయింది అని గతంలో వ్రాసినప్పటినుండి నా స్థానంలో ఎప్పుడూ 'మాలిక్'యే కనిపిస్తున్నాడు. 'మాలిక్' ధ్యాస ఒక్క క్షణమైనా కూడా కలగటం లేదు. అయినప్పటికీ హృదయం 'మాలిక్' యొక్క స్మరణకొరకు తపన చెందుతోంది. పూజ్య శ్రీ బాబూజీ, 'అతడు' ఎక్కడైనా, ఎలా అనుకుంటే అలా ఖచ్చితంగా ఉంటాడు. 'అతడు' ఎలా ఉండాలను కుంటాడో, ఏ స్థితిలో నన్ను నిలపాలనుకుంటాడో అది 'అతని' ఇష్టం. ఇంకొక విషయం చెప్పాలంటే, సిట్టింగ్ ఇవ్వటంలోను, తీసుకోవటంలోనూ ఒకే రకమైన దశ ఉంటోంది. సిట్టింగ్ ఇస్తున్నానో లేదా తీసుకుంటున్నానో కూడా తెలియటంలేదు. ఈ స్థితి ఇంతకుపూర్వమే ప్రారంభమై ఉన్నప్పటికీ, ఇప్పుడు అది పూర్తిగా అంతమైపోయింది. పూజ చేసేవారు (ధ్యానం చేసేవారు) ఎవ్వరైనాగాని, ఎందుకో తెలియదు, వారి (పూజ చేసేవారి) హృదయం ఇంతకుపూర్వం అనిపించినట్లుగా ఇప్పుడు మంచిగా అనిపించటం లేదు. 'మాలిక్' దయతో నిద్ర అధికంగా ఉంటున్నదన్న ఫిర్యాదు కూడా చేయటంలేదు. హృదయం బాగుండని కారణంగా అభ్యాసులు తమ స్థితిని గ్రహించలేకపోవటానికి నేను కారకురాలిని కాను అని తమరు తప్పక తెలియజేయాలి. పూజ ప్రారంభించడానికి ముందు ఏర్పడుతున్న నిద్రాస్థితి ఎలా ఉందో ఇప్పుడూ అలాగే ఉంది. నిరర్థకమైన కలలు కనిపిస్తున్నాయి. అయితే వాటితో నాకు మాత్రం సంబంధం ఉండటంలేదు. ఈ పరిస్థితి ఉన్నప్పటికీ 'మాలిక్' దయతోనే నా పురోగమనం జరుగుతోంది, దీనిలో ఏ మాత్రం సంశయం లేదు. 'మాలిక్' ఇష్టప్రకారం అని చెప్పుకుంటూ ఆ స్థితులను పొందుతున్నాను. అలా కాకుంటే ఇప్పుడు ఆ స్థితి కూడా తెలియకుండాపోతుంది.

చిన్నవారైన సోదరీ సోదరులకు ప్రేమాభిమానాలు. కేసర్, బిట్టో తమకు ప్రణామం తెలుపుతున్నారు. అమ్మగారు ఆశీర్వాదాలు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 146

షాజహాన్‌పుర్,
03.04.1951

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నీ ఉత్తరాలన్నీ చేరాయి. స్థితి తెలిసింది. “నాలో ప్రేమ వగైరాలు పూర్తిగా లేవు” అని నీవు వ్రాసిన దానికి జవాబు ఏమిటంటే, ఎంతెంతగానైతే లయావస్థ (ఫనాయియత్) వృద్ధిచెందుతూ పోతుందో, అంతంతగా నీవు చెప్పినది అనుభవమవుతూ ఉంటుంది. నీ యొక్క లయావస్థ (ఫనాయేఫనా) పరిపక్వస్థితి తెరుచుకుంటూ ఉందని నేను వ్రాశాను. అయితే ఇంకా చూడు, ‘బకా’ పూర్ణస్థితిలో కూడా లయావస్థ ఉంటుంది.

నీ సోదరీ సోదరులకు నా ఆశీస్సులు అందించు. అమ్మగారికి నమస్కారాలు తెలియజేయి.

నీ శ్రేయోభిలాషి,
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 147

లఖీంపుర్,
03.04.1951

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు అంది ఉంటుందను కుంటాను. ‘తమ’ గురించిన సమాచారం చాలా రోజులుగా తెలియనందున మాకందరికీ దిగులుగా ఉన్నది. తమరు ఆరోగ్యంగానే ఉన్నారని ఆశిస్తాం. తావూజీ ద్వారా, తమరు జగన్నాథ పూరీకి కూడా దానిని పవిత్రం చేయటం కొరకు వెళ్తున్నారని, ఆ తర్వాత ఏప్రియల్ 26 లేదా 27 తారీఖుల్లో తిరిగి వస్తారని తెలిసింది. ఏమీ అసౌకర్యం అనిపించకపోయినట్లయితే తిరుగుప్రయాణంలో ఒకటి రెండు రోజులు ఇక్కడ విశ్రాంతి తీసుకుని షాజహాన్‌పుర్ వెళ్ళవచ్చు. ఇక్కడ మా అందరి హృదయపూర్వక ఆకాంక్ష ఇది. ఆ విధంగా తమకు వీలుకలుగుతుందని, విశ్రాంతి కూడా కలుగుతుందని మా అందరి కోరిక మరియు ప్రార్థన.

ఇంక, మార్చి 28వ తారీఖు నుండి ఉన్నట్టి స్థితి తమకు నివేదిస్తున్నాను. అది ఎందుకో తెలియదుకాని, మరపుస్థితి ఎలాగైతే నెలల తరబడి నాలో అనుభవానికి లేకుండాపోయిందో, అదే విధంగా లయ అవస్థ విషయంలో కూడా జరుగుతోంది. బాగా ప్రయత్నించినపుడు మాత్రం ఆ సమయంమేరకు ఆ రెండు స్థితులు అనుభవమవుతూ ఉండేవి. కాని ఇప్పుడు ఈ స్థితి ఎలా ఉందంటే, ఆ రెండింటిలో ఏ ఒక్కటి కలగకపోయినప్పటికీ, ఇంతకుముందు కంటె మంచిగాను, స్వచ్ఛంగాను ఉన్నాను. ఒకవేళ ప్రయత్నం చేసినప్పటికీ ఆ ప్రయత్నం ఎంతసేపు చేస్తానో అంతసేపు మాత్రమే ఆ స్థితి నుంచి వేరవుతున్నాను. ఇది నాకు చాలా బాధగా ఉంది. ఇప్పుడు చెప్పండి. “రోగికి మందు ఎంతగా ఇస్తే రోగం అంతగా పెరుగుతుంది” అన్నట్లుగా ఉంటే దానికి చికిత్స ఎలా చేయాలి? బాబూజీ, ఏ స్థితిలో ఉన్నప్పటికీ, సంతోషంగానే ఉన్నాను. నాకు ఏ స్థితిని గురించి కోరికగాని, మరేమీగాని లేదు, ఉన్న కోరికల్లా ఒకే ఒక్కటి, అది ‘మాలిక్’ అభీష్టం ప్రకారమే.

మార్చి 30వ తారీఖు నుండి ఏమయ్యిందో తెలియదుగాని, వెనుక వీపు అంతటాను, దానికి అటూ ఇటుగా వెన్నుముక క్రిందను ఒక విధమైన గిలిగింత మరియు ఏదో ప్రాకుతున్నట్లుగాను అనుభవమవుతోంది. ముఖ్యంగా వీపు పైభాగంలో ఈ అనుభూతి ఎక్కువగా ఉంది. దానితోపాటు చాలా తేలికదనం (Lightness) మరియు ఖాళీతనం (Hollowness) అనుభవానికి వస్తోంది. మెద వెనుక, ఎక్కడి నుండి నయితే వెన్నుముక ప్రారంభమవుతుందో అక్కడి నుండి, ముఖ్యంగా గుండెకు సరిగ్గా వెనుకభాగంలో వెన్నులోను ఎక్కువగా అనుభవమవుతోంది. ఇంకా ఏమంటే, దాదాపు అన్ని వేళలా గుండె వెనుక వీపు భాగంలోను, అలాగే ఎడమ భుజం క్రింద ఈ గిలిగింత మరియు ఏదో ప్రాకుతున్నట్లుగాను అనుభవమవుతోంది. అదే విధంగా వీపులోను, ఇతరచోట్ల కూడా ఉంటోంది. ఈ దశయే కాకుండా, ఆరోజు నుంచి స్థితిలో మరొక మార్పు ఏదో కలిగింది. ఇంక ఇప్పుడైతే ఏమయ్యిందో తెలియదుకాని, శరీరం మాత్రం పూర్తిగా స్వేచ్ఛగా, హాయిగా ఉన్నట్లు అనిపిస్తోంది. ప్రతి పనిలోను, ప్రతి మాటలోను పూర్తిగా స్వేచ్ఛగా ఉంటోంది. హృదయానికి ఎలా అనిపిస్తే అలా చేశాను. అది ఎలాగంటే, సాధన లేదా పూజ వంటివి దానితో ఎప్పుడూ జరపబడనట్లుగానే అనిపించింది. అంతా భగవదేచ్ఛ.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 148

లఖీంపుర్,
07.04.1951

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. హరిదద్దా ద్వారాను, తమ పోస్టుకార్డ్ ద్వారాను సమాచారం తెలిసింది. 'మాలిక్' అపారకృపతో నా ఆత్మిక దశ బాగుంది. ఇది తమరు కూడా వ్రాసారు. నేను జన్మించినప్పటి నుంచీ ఈ దీనురాలి మీద 'మాలిక్' కృప ఉంటూనే ఉంది; అది సదా ఇంకా ఇలాగే ఉంటుందని నా విశ్వాసం. ఇంతకుపూర్వం నాకు వ్యాప్తి గురించి కలిగిన అనుభూతులు ఏవైతే ఉండేవో అవి అన్నీ రూపుమాసిపోయాయి. నేను గత ఉత్తరంలో వ్రాసినటువంటి వెన్నులో జలదరింపు, ఖాళీతనం మరియు ఏదో ప్రాకుతున్నట్లు వంటివి ఇప్పుడు కూడా ఉంటున్నాయి. కాని వెన్ను ఎడమవైపున, భుజం దిగువ వరకు మరియు వెన్నెముక మధ్యన దాదాపుగా ఎప్పుడూ ఉంటూనే ఉన్నాయి. ఇప్పుడు దీనికిమించి ప్రత్యేక స్థితి ఏమీ తెలియరాలేదు. 'తమరు' తిరిగివచ్చిన తర్వాత ఇంకా ఏమైనా వ్రాస్తాను. శరీరం యొక్క స్వేచ్ఛ గురించి చెప్పాలంటే, ప్రతి పని, ప్రతి మాట సులభంగా వెలువడుతున్నాయి. ఇంక వాటిపైకి ఏమీ దృష్టి పోవటంలేదు. బాబూజీ, తమరైతే శరీరాన్ని పూర్తిగా స్వేచ్ఛగా చేశారు. దీని మూలంగా, పూజ, సాధన ఎప్పుడూ చేయనట్లుగాను, అవి అవసరంలేనట్లుగాను అనిపిస్తోంది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 149

లఖీంపుర్,
27.04.1951

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. అందరికీ తమ దర్శనం మరియు తమ ఉనికితో కృతార్థులను చేస్తూ, సుదీర్ఘ యాత్ర తర్వాత 'తమరు' షాజహాన్‌పుర్ చేరి ఉంటారు అని భావిస్తాను. ఎవ్వరైతే తమ యందు విశ్వాసం ఉంచి, తమరి

దర్శనం చేసుకున్న కొద్ది క్షణాలుగాని, కొద్ది రోజులుగాని గడిపి ఉన్నారో లేదా గడపబోతున్నారో, వాస్తవానికి అటువంటివారికి ఆ క్షణాలు, ఆ రోజులే అసలైన జీవితం అవుతుంది. ఎవ్వరైతే 'మాలిక్'కు మాత్రమే తమ సర్వస్వం అర్పించివేశారో లేదా అర్పించటానికి ప్రయత్నిస్తున్నారో వారిని గురించి చెప్పాల్సిందేమి ఉంటుంది. 'మాలిక్' కృప ఈ విధంగానే ఉంటే కనుక, ఈ దీనభిక్షకురాలి యొక్క ప్రయత్నం కూడా సఫలమవుతుంది. ఇంత ప్రయాణం తర్వాత కూడా దేవుని దయవలన తమ ఆరోగ్యం బాగానే ఉండి ఉండాలని ఆశిస్తున్నాను. అయినా కూడా అలసట బాగా కలిగి ఉండవచ్చు. ఈ కారణంవల్లనే బహుశా తమరు ఇక్కడకు దయచేయలేకపోయి ఉంటారు. ఏమైనాగాని తమరు ఈరోజు ఇక్కడకు వస్తారను ఆశ అందరిలోను ఉంది. నిన్న పెద్ద సోదరుడు వచ్చారు. తమరు ఇప్పుడే ఇక్కడకు రాలేకపోతున్నారన్న విషయం వారి ద్వారా తెలుసుకున్నాము. 'మాలిక్' దయతో నిన్న తమ జన్మదినోత్సవం కూడా ఆనందంగా జరిగింది. ఇప్పుడు 'మాలిక్' దయతో, తమరు షాజహాన్‌పుర్ విడిచి వెళ్ళినప్పటి నుండి, కలిగినటువంటి ఆత్మిక స్థితిని వివరిస్తున్నాను.

ఇంతకుక్రితం నేను ఏదైనా పనిలోగాని, సంభాషణల్లోగాని నిమగ్నమైనపుడు, ఆ తర్వాత నాకు చాలా బాధ కలగటం, దాని ప్రభావం కనిపించటం జరుగుతూ ఉండేది, కాని ఇప్పుడు అటువంటిది ఏమీ తెలియటంలేదు. ఇప్పుడు ఎనిమిది రోజులుగా నేను ఇంటివద్ద లేకుండా ఉన్నా కూడా అటువంటిదేమీ అనిపించలేదు. ఎవ్వరైనా నన్ను పూజారిణి అని అంటే అతడు చెప్పేదానిలో యదార్థం ఉందో లేదో నాకేమీ తెలియటంలేదు. జనులు ఇంతకుపూర్వంలాగానే అనుకుని అలా అంటున్నారు. వారు చెప్పేది నిజమో కాదో ఆ 'మాలిక్' కే తెలియాలి. ఈ విధంగా ఎప్పుడైనా నా పనిని గురించిగాని, నా సంభాషణ గురించిగాని ఎవ్వరైనా ప్రశంసచేసినట్లు వింటున్నపుడు, నాకు మనసులో ఎటువంటి సిగ్గుగాని అనిపించటంలేదు, మరింకేమీ కూడా తెలియటంలేదు. ఏదైనా పొరపాటు దొర్లినపుడు ఇతరులు ఎవరైనా నన్ను తప్పుపట్టినా లేదా మంచిగా చెప్పినా కూడా అటువంటి స్థితియే కలిగి ఉంటోంది. శ్రీ బాబూజీ, పొగడ్త విన్నపుడు సాధారణంగా సిగ్గుపడవలసి ఉంటుంది కాని నా విషయంలో అందుకు భిన్నంగా ఉంది. దీనిని గురించి కూడా నాకేమీ దిగులులేదు. ఎందుకంటే, 'అతడు' ఎలా తలిస్తే అలా జరుగుతుంది. నా స్థితి పూర్తిగా స్వతంత్రంగా ఉన్నదని బహుశా నేను తమకు ఇదివరకే వ్రాశాను. ఇంకొక విషయం ఏమిటంటే, అసలు ఈ పనులు అన్నీ ఎవరు చేస్తున్నారు, ఎవరి ద్వారా జరుగుతున్నాయి అనేది పట్టించుకోవటానికి నా హృదయం మొగ్గటం లేదు. అన్ని పనులూ వాటంతట అవే (అసంకల్పితంగా) జరుగుతున్నట్లుగా అనిపిస్తోంది. అయితే కొన్ని నెలల నుంచి ఈ అసంకల్పితం అను ఆలోచన కూడా తొలగిపోయింది. ఇప్పుడు వేటిమీదకీ దృష్టి మళ్ళటంలేదు, ఆలోచనలు కూడా అసంకల్పితంగా కలగటంలేదు. బాబూజీ, ఇంక ఏదైతే అది. 'మాలిక్' అభీష్టం ఏమో కాని నాలో ఇప్పుడు కొన్ని నెలలుగా దీనత్వం కూడా లేకుండాపోయింది. ఇంకా చెప్పాలంటే, ఈ దీనత్వం స్థానంలో సంపన్నతగాని, ప్రశంశగాని ఉండటంలేదు. యదార్థం ఏమిటంటే, నేను ఇప్పటికే ఒక నునుపైన కుండలాగా కొంత సిగ్గులేకుండా ఉన్నాను, కాని 'బకా' (పూర్ణ లయావస్థ) స్థితి ప్రారంభమయ్యాక అప్పటి నుంచి ఇది ఆ సిగ్గు స్థితిని పూర్తిగా తుడిచివేసింది. నేను కాన్పూరు మరియు ఇటావా వెళ్ళినపుడు, అక్కడ 'మాలిక్' యొక్క జ్ఞాపకం చేసుకునే ప్రయత్నం కూడా బహుశా కొంత తగ్గిపోయింది, కాని ఇదే స్థితి నెలకొని ఉంది. ఇప్పుడు ఇక్కడ కూడా అలాగే ఉంది అనగా ఎవ్వరితోనైనా సంభాషించినట్లుగాని, అసలు ఎక్కడికైనా వెళ్ళినట్లుగాని తెలియకుండా ఉంది. ఇదివరకు, నేను ఎప్పుడైనా 'మాలిక్'ను మరచిపోవటం జరిగినట్లయితే చాలా దుఃఖం కలిగేది, కాని ఇప్పుడు ఆ విధంగా మరచిపోయినా కూడా దుఃఖం కలగటంలేదు. కనుక బాబూజీ, నేటి స్థితి యొక్క అర్థం ఏమిటంటే, నేనొక మృదువైన కుండ లాంటి దానను. ఇప్పుడు ఇంకొక స్థితి ఏమి ఏర్పడింది అంటె, నేను ఎక్కడికైనా వెళ్ళినట్లయితే అదే నా గృహంలాగా అనిపిస్తోంది. నేను ఆ ప్రదేశంలో ఉన్న వారిని ఎప్పుడూ చూడనప్పటికీ, వారు నాకు అపరిచితులని అనిపించటం లేదు. ఇంకా ఏమిటంటే, అక్కడ నేను ఉన్నంతకాలం వారు నాకు బాగా పరిచయస్థులుగా అనిపించేది. కాని ఇంటికి

తిరిగివచ్చాక అందర్నీ మరచిపోతున్నాను. అసలు విషయం ఏమిటంటే, నావారు, పరాయివారు అని ఎవరిని గురించి అంటామో, వారు ఏమవుతారో ఏమో కూడా నాకు ఏమాత్రం తెలియటంలేదు. ఇప్పుడు ఉన్న దశ ఏమిటంటే, నేను కొద్దిసేపు పూజ మూలంగా నాకు దక్కిందేమిటని స్వయంగా ఆలోచించినపుడుకాని, ఇతరులు ఎవ్వరైనా నాకు కలిగిన పూజాఫలం ఏమిటి అని ప్రశ్నించినపుడుకాని, అలా దక్కింది ఏమిటో నాకు తెలియరావటంలేదు. బాబూజీ, అసలు జీవితంలో నేను ఎప్పుడైనా పూజ అంటూ చేశానా అనేది కూడా తెలియకుండా ఉన్న స్థితి ఉంటూ ఉంటే నేను ఎలా అర్థం చేసుకోగలను? అయినా దాని గురించి బాధపడను. ఆ బాధ ఏదో 'మాలిక్'దే గాని నాది కాదు. అంతా ఆ దైవానికే తెలియాలి. బాబూజీ, ఇప్పుడు మరొక ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, అసలు ఈ లాభం, ఫలం, లబ్ధి వగైరా వంటివి కూడా నాకు తెలియనివిగా ఉంటున్నాయి. నిన్న 'తమ' జన్మదినోత్సవ సందర్భంలో అభ్యాసులు అందరూ తమకు చేకూరుతున్న లాభం (ఫైజ్)తో ఓలలాడుతూ ఉండగా, అది నాకు ఏమీ పట్టని స్థితిని నేను అనుభవించి నప్పుడు నేను పూజ్య మాస్టర్ సాహెబ్‌ను –'ఏమైనా కృప వర్షిస్తూ ఉందేమో తమరు చెప్పండి" అని అడిగాను. అప్పుడు వారు, ఇతరులు కూడా నిజంగా కృప వర్షిస్తూనే ఉంది అని చెప్పారు. సరే, నా 'మాలిక్' కొరకు తపన చెందాను. బాబూజీ, ఇప్పుడు నా స్థితి ఏమిటో చెప్పండి –నేను తమ జన్మదినోత్సవంలో నా శక్తికొలది పని చేశాను. అయినా కూడా నేను ఇదివరకు ఉత్సవాలలో అనుభవం పొందినట్లుగా కాకుండా అందుకు భిన్నంగా ఇప్పుడు నాలో ఉత్సాహం, ఆనందం, కుతూహలం కలగనేలేదు, ఎందుకు? ఇంకొక వాస్తవం చెప్పాలంటే, నేను ఈరోజున, అసలు నిన్నటి రోజున ఇంటిలో ఏమైనా ఉత్సవం లాంటిది జరిగిందా అని కూడా ప్రశ్న తలెత్తుతోంది. అసలు ఎందుకు ఇలా జరుగుతూ ఉందో నాకయితే తెలియటం లేదు. ఒకవేళ అవకాశం ఉంటే, విష్ణుతో నాలుగు వాక్యాలు వ్రాయించి పంపండి. ఎందుకంటే, నా ఈ స్థితిని చూసి నాకు చాలా దిగులుగా ఉంటోంది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 150

షాజహాన్‌పుర్,
04.05.1951

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

నీకు క్షేమం కలుగుగాక! నీ ఉత్తరం, కేసర్ ఉత్తరమూ చేరాయి. స్థితి తెలిసింది. "ఎవ్వరైనా ప్రశంసలు కురిపిస్తే నాకు సిగ్గు అనిపించటంకాని, ఏదైనా తెలియటం (అవగాహనకు రావటం) కాని జరగటం లేదు" అని నీవు తెలియజేశావు. ఈ స్థితి మంచిదే. యోగి యొక్క గొప్ప లక్షణం ఏమిటంటే, అతనికి మానావమానములతో సంతోషంగాని, బాధగాని కలగవు. అసంకల్పితింగానే (దానంతట అదే) పని జరగటమనునది ఈశ్వరీయ గుణం అయి ఉండటమేగాక, ఈ దశలో సంస్కారాలు ఏర్పడవు. ఎప్పుడైతే పని దానంతట అదే జరిగిపోతోంది అను ఆలోచన లేదా స్పృహ కూడా లేకుండాపోతుందో అప్పుడు కలిగేది అసలైన స్థితి. ఈ దశను నేను "రాజయోగ ప్రభావం" (Efficacy of Rajayoga)లో వివరించిన సందర్భంలో తెలియజేశాను. మన మిషన్‌లో అభ్యాసులు ముందుకు సాగిపోతూనే ఉంటారు. ఇలా ఎందుకంటె ఏదశలోనైనా నిలిచిపోవటం జరిగినట్లయితే, వాళ్ళ పురోగమనం ఆగిపోయినట్లుగానే అర్థం చేసుకోవాలి. దైన్యం, అమాయకత్వముల స్థితి తెలియకపోవడం అంటే ఈ గుణాలు వారిలో మంచి పూర్ణస్థాయిలో కలిగినట్లుగాను, ఇప్పుడు దానికింకా ముందుకు అడుగుపెట్టూ ఉన్నట్లుగాను భావించాలి.

ఎప్పుడైతే అభ్యాసికి శిరస్సు నుంచి పాదాలవరకు జ్ఞాపకం యొక్క స్వరూపంగా అవుతుందో అప్పుడు ఆ జ్ఞాపకం క్షణకాలం మాత్రమే నిలిచి ఉంటుంది ప్రయత్నపూరక్వంగా చేసినప్పటికీ కూడా. "నేను ఎవరివద్దకైనా వెళ్ళినపుడు నాకు అపరిచితులైనవారు కూడా నాకు పరిచయస్థులు లాగానే అనిపిస్తారు" అని నీవు వ్రాశావు. దీనికి

జవాబు నీవే స్వయంగా చెప్పావు. దాని అర్థం ఏమిటంటే, తనవారు, పరాయివారు అను విషయం కూడా ఏమాత్రం జ్ఞాపకం లేకుండాపోయిందన్న మాట. "నాకు కృప, జాలి వంటివి గుర్తింపులేకుండాపోయాయి" అని నీవు వ్రాశావు. దీనికి నాకు తోచిన కారణం ఏమిటంటే, నీవు ప్రతిక్షణం (ఫైజ్) కృపలోనే మునిగి ఉంటున్నందువల్లనే అనుకుంటాను; నిండా మునిగినవాని కళ్ళకు కనిపించేది నీళ్ళుగాక మరేమిటి? అది గాకుండా ఇంకేమైన ఉంటే అది వేరే సంగతి.

అమ్మకు ప్రణామములు, సోదరీసోదరులకు ఆశీస్సులు.

నీ శ్రేయోభిలాషి,
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 151

లఖీంపుర్,
12.05.1951

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు సుఖప్రదంగా చేరి ఉంటారని భావిస్తాను. తమకు బాగా జలుబు, దగ్గు వస్తోంది అన్నారు, అది మెరుగుపడిందా లేక అలాగే ఉన్నదా? 'మాలిక్' కృపతో నాకు అనుభవానికి వచ్చిన కొద్దిపాటి స్థితిని గురించి వ్రాస్తున్నాను. నేను బహుశా నా గత ఉత్తరంలో, షుమారు ఒక నెల, నెలన్నర రోజుల నుండి, ఏ పనియైన అసంకల్పితంగా జరుగతున్నదను భావన కూడా లేకుండాపోయిందని వ్రాసి ఉన్నాను. అనగా ఇప్పుడు ఏ పనియైన అది ఎలా జరుగుతున్నది అను ఆలోచన ఒక్క క్షణంసేపు కూడా కలగటంలేదు. ఇప్పుడు ఉన్న స్థితి ఏమిటంటే, 'మాలిక్'పట్ల తపన చెందటానికి ప్రయత్నిస్తూ ఉన్నప్పటికీ, మనస్సుమీద దాని ప్రభావం ఉండటంలేదని అర్థమవుతోంది. ఇప్పుడు 'పని' (Working) చేయటమే నాకు ఆధారంగా ఉంది. ఇదే నా పూజగా ఉంది. "నా శారీరిక రూపం మామమైపోయినట్టి స్థితి" ఎప్పటి నుండి కలిగిందో, అప్పటి నుండి నా దృష్టి కేవలం సూక్ష్మశరీరం మీద అది కూడా సూక్ష్మరూపంలో నిలిచి ఉన్నట్లుగా అనిపిస్తోంది. అప్పుడు నా వ్యాప్తియే అంతటా కనిపిస్తోంది, అయితే ఇప్పుడు అవి అన్నీ ముగిసిపోయాయి. పూజ్య శ్రీ బాబూజీ, ఇప్పుడు నాకు ఎటువంటి స్థితితో సంబంధంకాని, దానిపట్ల కోరికగాని లేవు. అయినా కూడా శ్రద్ధగా పరిశీలించినట్లయితే, నాకు తెలియకుండానే మనసులో చాలా కొద్దిపాటిదైన ఆవేదన, తపన ఉన్నట్లు తెలుస్తోంది. దాని కారణంతో కూడా, నాకు సంబంధం లేనట్లున్న స్థితి కూడా ఇప్పుడు తెలుస్తోంది. ఏమైనా కూడా 'మాలిక్'యే నా సర్వస్వం, ఎలా ఉంచితే అలాగే ఉంటాను. పెద్ద సోదరి కొరకు తమరు ఇక్కడ ఏమైతే ఉన్నతి కలిగించారో అది వర్ణనాతీతం, అందుకు మరీ మరీ ధన్యవాదాలు. ఈ ప్రపంచం యొక్క నిర్వహణ కొరకు, తమరు ఒక్క క్షణంలో ఎంతో సులభమైన మరియు లాభదాయకమైన యోచన చేస్తారు, ఆలోచన చేయటమేకాక దానిని క్షణాల్లో పూర్తి చేస్తారు కూడా. అయినప్పటికీ **తమపట్ల విశ్వాసం లేనివారు నిజంగా నిర్భాగ్యులు. ఆధ్యాత్మికత యొక్క ఈ స్వర్ణయుగంలో ఎవ్వరూ కూడా ఆధ్యాత్మిక లబ్ధిని పొందనివారుగా ఉండనటువంటి సమయాన్ని ఈశ్వరుడు త్వరగా అసన్నం చేయుగాక!.** తమరు ఇక్కడకు దయచేసినట్లయితే, బహుశా స్థితి కొంత మెరుగు పడుతుందని తలంచుతూ ఉండేదాన్ని. అయితే తమరు ఇక్కడి నుండి వెళ్ళిన తర్వాత, తమరు వెళ్ళి చాలా సంవత్సరాలు గడచినట్లుగా అనిపిస్తోంది. తమరు రాకపూర్వం ఏ స్థితి అయితే ఉందో ఇప్పుడూ అదే ఉంది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 152

లఖీంపుర్,
15.05.1951

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం చేరిందని భావిస్తాను. ఈ ఉత్తరం ఇంత త్వరగా పంపిస్తున్నాను; ఎందుకంటే, నేను 13వ తారీఖు రాత్రికి, ఒక స్వప్నం వంటిది చూసాను. కాని దానిని పూర్తిగా స్వప్నం అని కూడా చెప్పలేను. షుమారు రాత్రి మూడు గంటలకు లేదా మూడున్నర గంటల సమయంలో తమరు సరిగ్గా నా ఎదుట నిలబడి ఉన్నట్లుగా కనిపించింది. అప్పుడు నేను తమతో, "తమరిని చూస్తూ ఉంటే తమకు శ్వాసకోశ సమస్యతో బాగా ఇబ్బందికరంగా ఉన్నట్లుగా ఉంది" అని అనగా తమరు కూడా శ్వాస ఇబ్బంది బాగా ఎక్కువగా ఉన్నది అని చెప్పారు. తమరు బహుశా ఏదో 'పని' విషయంలో ఒక విధానం కూడా చెప్పి ఉన్నారు. దానిని నేను బాగానే అర్థం చేసుకున్నాను కాని నేను ఆ సమయంలో వ్రాసుకొనలేకపోయాను. ఇంక ఎప్పుడైతే తమ అనారోగ్యాన్ని, బాధను చూసానో ఇంకేమీ జ్ఞాపకం లేవు. తమరు ఈపాటికి స్వస్థత పొంది ఉంటారని భావిస్తాను. రాత్రి సమయంలో ఎటువంటి స్థితి ఎక్కువగా ఉంటున్నది అంటె, స్వప్నంలో కూడా నేను మాట్లాడుతూ ఉన్నట్లుగాను, అలా మాట్లాడటం నాకు తెలిసి ఉన్నట్లుగాను అర్థమవుతోంది. అయినప్పటికి నేను నా నోరు మెదుపుతున్నానో లేదో కూడా నాకు తెలియటంలేదు. ఆ విషయం ఏదో తమకే తెలియాలి. దయచేసి తమ క్షేమ సమాచారం వెంటనే తెలియజేయండి. ఈశ్వరుని కృపతో తమరు పూర్తిగా ఆరోగ్యవంతులు కావాలి. ఇప్పుడు 'మాలిక్' నాకు అనుగ్రహించినటువంటి స్థితిని వ్రాస్తున్నాను.

ఇంతకుపూర్వమైతే 'మాలిక్'పట్ల నా దృష్టిలో కృతనిశ్చయం అంతులేని బలీయంగా ఉండేది. ఏమయ్యిందో ఏమో కాని ఇప్పుడు ఆ దృష్టిగాని, నిశ్చయంగాని లేకుండాపోగా ఇంక దాని దృఢత్వం లేదా బలీయం గురించిన ప్రశ్నకు తావేలేదు. ఇప్పుడింక దీక్ష వంటివి కూడా నాలో ఏమాత్రం లేకుండాపోయాయి. అసలు నా లక్ష్యం ఏమిటో కూడా మరచిపోయినట్లుగా ఉంది. దీని మూలంగా నా ఉత్సాహమంతా కూడా చల్లారిపోయింది. ఇప్పుడు, నా ఆత్మోన్నతి జరుగుతూ ఉందో లేక జరిగిపోయిందో లేక భవిష్యత్‌లో జరుగుతుందను ఆలోచన కూడా దాదాపుగా మాయమైపోయింది. పూజ్య శ్రీ బాబూజీ, నేను నా స్థితులు ఏవైతే పైన తెలిపి ఉన్నానో అవి అన్నీ నా స్వాధీనంలో లేకుండాపోయాయి. దానిని గురించి పెద్దగా చింతించవలసిన పనిలేదు. అదేదో 'మాలిక్'కే తెలియాలి, 'అతడి' పనికే తెలియాలి, అది 'అతడి' అభీష్టానికే వదిలివేస్తున్నాను.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 153

లఖీంపుర్,
03.06.1951

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. పూజ్య మాస్టర్ సాహెబ్‌గారి ఉత్తరం ద్వారా నిన్న, తమ ఆరోగ్యం కొంత కుదుటపడిందని చదివి సంతోషం కలిగింది. 'మాలిక్' కృపవలన నాలో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను. బాబూజీ, ఇప్పుడు నా స్థితి ఎలా ఉందంటే, నేను ఇప్పుడు ఎటువంటి అదుపు లేకుండా అయిపోయినట్లుగా ఉంది. నాకు ఏ మాటమీదగాని, ఏ విషయంలోనైనాగాని, ఆఖరికి నామీద కూడా నాకు నియంత్రణ లేకుండాపోయినట్లుగా అనిపిస్తోంది.

ఇప్పుడు స్థితి పూర్తిగా నా వశంలో లేకుండాపోయింది, కాని 'మాలిక్' కృపతో అంతా సవ్యంగా జరిగిపోతున్నట్లు నేను కనిపెట్టున్నాను. అయితే ఎప్పుడైన, ఎక్కడైనా అవసరమైనప్పుడు, సందర్భానుసారంగా అది నియంత్రణలో ఉంటుంది. ఇప్పుడు అసలు నాలో ఈ విషయాలు అన్నీ ఉన్నాయా లేదా అనిగాని చెప్పలేనట్లుగాను, అలానే ఇంకా ఎంతగానంటే, 'మాలిక్'పట్ల నాకు అసలు విశ్వాసం ఉందా లేదా అనిగాని చెప్పలేనట్లుగాను ఇప్పుడు నా స్థితి నడుస్తోంది. ఈ విషయం ఎంతవరకు వెళ్ళిందంటే, 'మాలిక్'లో నా ప్రేమ గురించిన దావాను నేను ఇదివరకే వదిలేశాను. అయినా ఇప్పుడు ఇది కూడా నేను ఖచ్చితంగా చెప్పలేను అనగా నాకు 'అతని'పట్ల కొంచెమైనా విశ్వాసం ఉందా లేదా అని కూడా చెప్పలేకపోతున్నాను. సరే; నేను 'అతడు' ఏ విధంగా నడపదలచుకుంటే ఆ విధంగా ఉంటాను. పూజ్య బాబూజీ, అనుక్షణమూ నా ఉన్నతి జరుగుతూ ఉండేటట్లుగా తమ కృపా దృష్టిని నాపై సదా నిలపండి.

పూజ్య మాస్టర్ సాహెబ్‌గార్కి నా ప్రణామం అందజేయండి. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 154

షాజహాన్‌పుర్,

04.06.1951

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నీవు నన్ను స్వప్నంలో చూసినప్పుడు, ఆరోజు పగలు రాత్రి కూడా నేను రెండుమార్లు అపస్మారకంతో తీవ్రంగా బాధపడ్డాను. మళ్ళీ నిన్న అనగా నాల్గవ రోజున దానితో బాధపడ్డాను. నీవు ఎక్కువగా చింతించవద్దు. భగవంతుడు ఆదేశిస్తే ఇది తొలగిపోతుంది. ఎందుకంటే, ఈ దశలో చాలా పనిని పూర్తిస్థాయిలో నిర్వహించటం నాకు కష్టమవుతుంది. ఇపుడు మే 15వ తేదీ ఉత్తరానికి జవాబు వ్రాస్తున్నాను. గతంలో 'మాలిక్'పట్ల నా దృక్పథం, నిర్ణయం అంతులేనంత బలీయంగా ఉండేవి, అయితే ఇప్పుడు అవి అనిపించటమే లేదు. అభ్యాసి లయావస్థను పొందటమనేది దైవానుగ్రహం. అతడు ఎంత బాగా లయావస్థలో లయింపజేసుకోగలుగుతాడో, అదే స్థాయిలో లక్ష్యాన్ని చేరగల్గుతున్నట్లుగా అర్థం చేసుకోవాలి. ఎప్పటివరకు నయితే అతని వ్యాపకస్థితి ప్రారంభంకాదో అప్పటివరకు మాత్రమే అతని కృతనిశ్చయం అతని ఎరుకలో ఉంటుంది. ఆ వ్యాప్తి ఎంతగానైతే అభివృద్ధి చెందుతూ పోతుందో అంతగానే అభ్యాసికి సూక్ష్మత్వం కలుగుతూ ఉంటుంది. ఈశ్వరుడు ఎంత సూక్ష్మం అంటే 'అతడి'లో భారమేమీ ఉండదు. దీనికి ప్రారంభంలో కృతనిశ్చయం, దృఢదీక్ష చాలా అవసరం, పోను పోను దీని భారం తగ్గుతూ ఉంటూ, చివరకు ఏమీ మిగలదు. "సంపూర్ణ సత్యత్వాన్ని" చేరుకోవటానికి ఇది పునాది. ఇంత జరిగినా లేదా పొందినప్పటికీ గమ్యం ఇంకా దూరంగానే ఉంది. లాలాజీ సాహెబ్ ఒకసారి నాతో 'వారి' దశను గురించి వివరించారు. 'వారు' వర్ణించిన ఆ స్థితిని గురించి నేనేమి చెప్పగలను! భగవంతుడు దీనిని అందరకీ అనుగ్రహించుగాక! నా యొక్క ఒక చిన్న స్థితిని గురించి కూడా వివరిస్తున్నాను. అది ఎందుకంటే, ఎప్పుడైతే ఈశ్వరుడు నిన్ను ఈ స్థితికి సమీపింపజేయటానికి ప్రయత్నిస్తాడో అప్పుడు నీవు ఇబ్బందిపడకూడదని చెప్తున్నాను. నేను ఈ మాటల్లో నా స్థితిని వివరిస్తున్నాను– "నాకు దేహం, ప్రాణం, ఆత్మ మరియు ఆధ్యాత్మిక ఉన్నతికి చెందిన ఎరుక ఏమీ లేకపోయింది. అన్నిటికంటె తేలికైనది లేక సూక్ష్మమైనది అని చెప్పబడి నటువంటి ఆకాశతత్త్వముగా కంటె భారమనిపించింది."

మే 24వ తేదీ ఉత్తరంలో, గౌరవ మర్యాదల గురించి ఏమైతే వ్రాశావో దానికి జవాబు ఇవ్వాల్సిన అవసరంలేదు. నీవు నీ స్థితిలో ఉంటూ ఉండగా అప్పుడు సమత్వం భాసిల్లుతూ ఉంటుంది. అక్కడ అన్నీ సమానమే కనుక మానమర్యాదల భావనయే ఉండదు. ఆ సమత్వం ఇపుడు పరిపూర్ణస్థాయికి చేరింది కనుక, ఎవ్వరి మాటలతోను

ప్రభావితం కాకుండా ఉండటం సహనశీలత్వమని భావించాలి. అది చాలా మంచిది.

ఇంక అంతా బాగానే ఉంది.

నీ శ్రేయోభిలాషి,
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 155

లఖీంపుర్,
05.06.1951

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నిన్న తమరు వ్రాసిన ఉత్తరం, అలాగే మాస్టర్ సాహెబ్ వ్రాసిన ఉత్తరమూ చేరాయి. తమ ఆరోగ్యం బాగుండలేదని చదివాక మాకందరికీ చాలా బాధ కలిగింది. దైవేచ్ఛ ఏమిటో 'అతని'కే తెలియాలి. దయచేసి తమ ఆరోగ్య పరిస్థితిని గురించి వెంట వెంటనే తెలియపరచండి. నేను కూడా దాదాపు 20 రోజుల నుండి సుస్తీగా ఉన్నాను. నిన్న, మొన్నటి నుంచి కొంచెం లేచి తిరగ గలుగుతున్నాను. ఇప్పుడు బలహీనత మాత్రం ఉంది కాని ఆరోగ్యం బాగానే ఉంది. విచారించాల్సిన పని లేదు. ఈ కారణంగా చాలా రోజుల నుండి తమకు ఉత్తరం వ్రాయలేకపోయాను. అయినప్పటికి డైరీ (దైనందిని)లో చాలా రోజుల స్థితులు వ్రాశాను. దయచేసి క్షమించండి. ఎందుకంటే, ఉత్తరాలు వగైరా వ్రాయాలంటే తల తిరుగుడు మరియు అలుపు వస్తున్నాయి. నా గురించి ఏమాత్రమూ దిగులుపడవద్దు. ఒకటి రెండు రోజుల్లో పూర్తిగా కోలుకుంటాను. ఇప్పుడు నేటివరకు ఉన్న స్థితిని గురించి వ్రాస్తున్నాను.

ఇంతకుపూర్వం నేను, "నా దశ యొక్క అనుభూతిగాని, దశానుభూతి యొక్క అనుభూతిగాని తెలియకుండా పోయాయి" అని వ్రాశాను. కాని ఇప్పుడు వెంటనే లేదా కొంచెం ఆలస్యమైనాగాని స్థితిని తెలుసుకోగలుగు తున్నాను, అనుభూతి చెందుతున్నట్లు గమనిస్తున్నాను. కాని అప్పుడప్పుడు ఏదైనా సంభాషణ జరిగినప్పుడు, తావూజీ (పెదనాన్న) ఏదైనా చెప్తూ ఉన్నప్పుడు, అది కూడా నా దశయేనని అనిపిస్తుంది. కాని విన్న తర్వాత కొద్దినిమిషాలకే అన్ని నా దృష్టి నుంచి తొలగిపోతున్నాయి. నా స్థితి మరొకటి ఏమిటంటే, నేను అసలు ఆస్తికురాలినో (దైవంమీద నమ్మకం) లేక నాస్తికురాలనో (దైవం మీద నమ్మకం లేకపోవటం) తెలియటంలేదు. స్థితినిబట్టి విశ్లేషించినట్లయితే నేను నా నాస్తికురాలుగానే మొగ్గు చూపాల్సి వస్తోంది. ఇంతకుపూర్వమైతే నేను వ్రాస్తూ ఉండేదానను, తమరు కూడా వ్రాశారు, ఏమంటే – సమత్వస్థితి వృద్ధి చెందుతున్నది అని. కాని ఇప్పుడు అది కూడా నాలో లోపించిందని, అసలు లేనేలేదని, ఇంక ఇప్పుడు మున్ముందు కలగబోదని అనిపిస్తోంది. తేలికదనం యొక్క స్థితి కూడా ఇదే విధంగా ఉంది. ఒకవేళ ఒక్క క్షణకాలం నాలో దాని కొరకు వెదకటం ప్రారంభిస్తే, హృదయం వెంటనే భీతి చెందుతున్న కారణంగా నేను అసలు ఈ విషయాల మీద దృష్టి పెట్టటమే మానివేశాను. హృదయం కూడా ఆ విధంగా కోరుకోవటం లేదు. పూజ్య శ్రీ బాబూజీ, ఇప్పుడు మరొక స్థితి ఎలా ఉంది అంటె, గతంలో నాకు ఎదుట కూర్చున్నటువంటి వారు ఏవో నీడల్లాగా కనిపించేవారు, ఇప్పుడైతే ఆ నీడలు వంటివి కూడా అదృశ్యమైపోయాయి. ఇప్పుడు ఉన్న స్థితినిబట్టి, వారి శరీరాలుకాని, ప్రాణం (ఆత్మ) కాని, ఏమీ కూడా అనుభవానికి రావటంలేదు; నా విషయంలో కూడా ఇదే స్థితిగా ఉన్నది. ప్రస్తుతం ఉన్న స్థితినిబట్టి, ఈ సమయంలో పూర్తిగా నిశ్శబ్దంగా ఉండిపోవాలని హృదయం కోరుకుంటుంది. అందుచేత అదే విధంగా పడి ఉంటున్నాను. ఏదైనా చదవటానికిగాని, వ్రాయటానికిగాని, ఎవరిచేతనైనా ధ్యానం చేయించటానికిగాని హృదయం అంగీకరించటంలేదు.

పూజ్య బాబూజీ! అమ్మ స్థితిని చూడలేకపోతున్నాను. ఆమె కన్నీరు ధారగా ప్రవహించటం చూసి, ఎందుకోగాని, నా కన్నీరు రాకుండా ఆపుకోవటం చాలా కష్టంగా ఉంది. అయినా కూడా పాపం ఆమె ధైర్యం నింపుకుంటూ ఉన్నది. ప్రపంచంలో తన వంటి పాపులు దొరకరని, ఆ పాపాలు తన జీవితాంతం తొలగిపోవు అని చాలా తరచుగా

వాపోతోంది. ఆ కారణంగా నేను కూడా విచారపడకతప్పటం లేదు. పూజ్య శ్రీ బాబూజీ! తమరు ఆరోగ్యవంతులు కావాలని మేమంతా ప్రార్థిస్తున్నాము.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 156

షాజహాన్‌పూర్,

06.06.1951

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

ప్రసన్న ప్రాప్తిరస్తు! నీ ఉత్తరం అందింది. శీఘ్రంగా ఉన్నతి కలిగేలా దయ చూపమని నీవు వ్రాశావు. దానికి జవాబు ఏమిటంటే, గురు మహరాజ్ నాకు ఇచ్చినటువంటి వస్తువు ఏదైతే నావద్ద ఉన్నదో అదే నీ ఇంటినిండా కూడా నింపబడుతూ ఉంది (అనగా దివ్య ప్రాణాహుతి మరియు కృప). నీవు నీ స్థితిని గూర్చి తెలుపుతూ 'అది నీ వశంలో లేదు' అని వ్రాశావు. దీని అర్థం గ్రహింపుకు రావటంలేదు కనుక మళ్ళీ వ్రాయి. ఇక నీ ఆంతరిక స్థితి అవగతమైంది. అయితే దాని ప్రభావం 'గుమ్‌సుమ్' 'గప్‌చిప్' అనగా ఉలుకుపలుకూలేని మౌనస్థితిలో నీవు ఉంటూ ఉండాలి. ఒకవేళ అది ప్రారంభమై ఉంటే ఇంకను అభివృద్ధి చెందుతుంది. ప్రాచీన మహాపురుషులు తురీయ, తురీయాతీత స్థితులు గురించి వ్రాశారు. తురీయ స్థితి తరువాతనే తురీయాతీతస్థితి కలుగుతుంది. మన గురు మహరాజ్ మూడు రకాల తురీయ స్థితుల గురించి వ్రాశారు. నీ దశను గురించి నేను 'బకా' అని చెప్పిన దానిని 'తురీయ' అని కూడా అంటారు. దీని లయ–అవస్థ కూడా ప్రారంభమైపోయింది కాని అది స్వల్పంగా ఉంది. మిగిలినదంతా బాగుంది.

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య – 157

లఖీంపూర్,

10.06.1951

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. దయతో తమరు మరియు మాస్టర్ సాహెబ్‌గారు వ్రాసిన లేఖలు అందాయి. తమకు అనారోగ్యం మరొకసారి తిరగబెట్టిందని చదివి చాలా విచారించాను. అయినప్పటికీ, చింతించడానికి బదులు తమకు సేవ చేయటానికే నేను ఎక్కువగా ప్రయత్నిస్తున్నాను. ఈ సేవ ఏమిటంటే, తమ యొక్క ఈ కష్టం తగ్గించబడాలని. ఈ విధమైన ప్రయత్నం పది నెలలుగా చేస్తున్నప్పటికీ, ఎందుకోగాని తమకు ఆరోగ్యం కల్పించలేక పోయాను. **నేను ఎప్పటి నుండో ఎంతమేరకు సిద్ధపడ్డానో, ఇంకా సిద్ధంగా ఉన్నానో చెప్పాలంటే తమ యొక్క ఈ అపస్మారకం వగైరా వంటి కష్టాలన్నీ కూడా, 'మాలిక్' నాకు బదలాయించటానికి దయ తలిస్తేను, ఆ తర్వాత కస్తూరి ఇక మీదట ఎటువంటి బాధ, కష్టం తన హృదయంలో మాస్టర్ యొక్క ఆరోగ్యం మరియు సంతోషాలను గురించి ఒక్క క్షణం కూడా దిగులు చెందకుండా ఉండునట్లుగాను, అందుకుగాను ఆమెకు (కస్తూరిగార్కి) తీవ్రమైన, అనంతమైన కష్టాలనైనాసరే అనుగ్రహిస్తే భరించటానికి సిద్ధంగా ఉన్నాను.** "మాస్టర్ సాహెబ్ మరియు కస్తూరి మనస్ఫూర్తిగా తమకుతాముగా ప్రయత్నించినట్లయితే వ్యాధి ఇంక నిలువలేదు" అని పూజ్య స్వామీజీ తమ సందేశంలో చెప్పారు. ఈ విషయమై నన్ను చైతన్యపరచినందుకు వారికి అనేక ధన్యవాదాలు. అయితే 'మాలిక్' కృపతో దీనిని నా జీవిత ముఖ్య కర్తవ్యంగా భావించి, వారు ఆదేశించకపూర్వం నుంచే నేను ఏదో విధంగా ఎంతోకొంత ఆచరిస్తూ వస్తూనే ఉన్నాను. ఎప్పుడైనా నాకు బాగా దగ్గు వచ్చినపుడు, తమ దగ్గును జ్ఞాపకం చేసుకున్నప్పుడు, ఈ దగ్గు తమకు

బదులు నాకు వస్తోంది అని నా హృదయానికి అనిపిస్తోంది. అటుపైన దైవేచ్ఛ! ఇక్కడైతే అందరూ తమ ఆరోగ్యం కొరకు ప్రార్థన చేస్తూనే ఉన్నారు. మాస్టర్ సాహెబ్‌గారితో, నేను బాగా చేస్తున్నానని ఇంకా ఎక్కువగా ధ్యాస నిలిపి చేస్తానని చెప్పండి. "ఇదంతా ఇలా ఉన్నాకాని ఢిల్లీ ఇంకా దూరంగానే ఉంది" అని తమరు వ్రాసి ఉన్నారు. అయితే నేను మాత్రం ఇదే చెబుతాను – అది నిజంగా దూరంగానే ఉన్నప్పటికి కూడా, తమ దయాదృష్టితోను, తమ అభయహస్తాల ఆశ్రయంలో ఉండటం మూలంగాను ఇప్పుడు 'ఢిల్లీ'యే స్వయంగా మన దరికి వస్తుంది. నా ఆత్మిక దశలో ఇంకా చెప్పుకోదగిన స్థితి ఏమీ తెలియటంలేదు. మరైతే ఇప్పుడు స్థితి, శరీరం మీద ఉన్నదా లేక దానిని అధిగమించియున్నదా అన్నట్లుగా ఉంది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ.

## ఉత్తరం సంఖ్య - 158

షాజహాన్‌పుర్,
10.07.1951

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

ప్రసన్న ప్రాప్తిరస్తు! నీ ఉత్తరం, కేసర్ వ్రాసిన ఉత్తరమూ అందాయి. కేసర్ ఏమి కావాలని అనుకుంటూ ఉన్నదో, దేని కొరకు ఆమె ప్రయత్నిస్తూ ఉందో, దాని ఫలితం దైవాధీనంలో ఉంది. 'అతడు' ఏమైనా చేయగలడు. భక్తిభావం కూడా ఎలా ఉండాలంటే అంతా చేస్తూనే ఈశ్వరుని మీదనే భారం మోపాలి. ఎవ్వరైతే ఈశ్వరుని దిశగా రెండు అడుగులు వేశారో, వారి కొరకు ఈశ్వరుడు నాలుగు అడుగులు ముందుకు వేయటమే జరిగింది. నేను నీ స్థితిని గురించి గత ఉత్తరంలో కొంత వ్రాశాను, అంటే దానిలో రానున్న స్థితి యొక్క సంకేతం తెలిపాను. ఇప్పుడు నీ స్థితి అంతుచిక్కనిదిగా ఉంది. దిగులు కారణంతో ఈ స్థితిలో ఇంతవరకు అడుగు ముందుకు పడలేదు. దానివలన స్థితి ఇంకనూ పూర్తిగా తెరచుకోలేదు. ఆ దిగులు ప్రభావం పూర్తిగా తొలగిపోతున్నట్లయితే దైవేచ్ఛ ఉంటే మళ్ళీ ముందుకు సాగుతుంది. నా విధి ప్రకారం కూడా ఈ సమయంలో నేను అక్కడికి (లఖీంపూర్) వచ్చి ఉండవలసింది. కాని అనారోగ్యానికి వైద్యం చేయించు కుంటున్న కారణంగా రాలేకపోయాను. నేను తప్పనిసరిగా వస్తాను కాని ఏ రోజున అని ఇప్పుడే చెప్పలేను.

తల్లిగార్కి ప్రణామములు, నీ సోదర సోదరీలకు ఆశీస్సులు.

నీ శ్రేయోభిలాషి,
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 159

లఖీంపుర్,
23.07.1951

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు అంది ఉంటుంది. ఇప్పటికి తమ ఆరోగ్యం పూర్తిగా కుదుటపడిందని ఆశిస్తున్నాను. నా బలహీనత కూడా తగ్గి ఆరోగ్యం మెరుగుపడుతుంది. తమరు చెప్పినట్లుగా ఈ వారంలోగానే నేను పూర్తిగా బాగుపడ్డాను. ఇదంతా తమ కృప మరియు లేఖ మూలంగానే జరిగింది. ఎందుకంటే, ఇంతకుక్రితం నాలో అణగారి ఉన్న శక్తి, తమ కృపతో మళ్ళీ సజీవమై సచేతనమైనది. అందుకు తమకు అనేక ధన్యవాదాలు.

మళ్ళీ అదే విధంగా ఆత్మిక దశ పునరుద్ధరించబడింది. పూజ్య శ్రీ బాబూజీ! ఈమధ్య నేను ఏ విధంగా సాధన చేయాలి అనేది అర్థంకాక కష్టమనిపించింది. సిట్టింగ్ మొదలైన సాధనలు మినహాయించి, ఇప్పటివరకు ఏయే అభ్యాసాలు చేస్తూ వచ్చానో, లేదంటె ఈశ్వరుని కృపతో ఏవైతే వాటంతట అవే జరుగుతూ వచ్చాయో, అవన్నీ ఇప్పుడు నిరర్థకంగా ఉంటున్నాయి. పూర్తిగా నిరుపయోగంగా అనిపిస్తున్నాయి. అసలు అర్థంకావటమే లేకపోయినప్పుడు, నేనింక ఏమి చేయగలను? అదంతా దైవం చేతిలో ఉంది. ఇప్పుడు 'అతడు' ఏమి చేస్తాడో చూస్తాను, ఇప్పటివరకు ఏ విధంగానైతే సరిదిద్దుకుంటూ వచ్చాడో, ఇప్పుడు కూడా ఆవిధంగానే చేస్తాడు. ఇప్పటివరకు ఎంతో కొంత అభ్యాసం నాకు తెలిసియో లేక తెలియకయో జరుగుతూనే ఉంది కాని ఎటువంటి అభ్యాసం నావలన జరగలేదని నేను మాత్రం గట్టిగా చెప్పగలను. ఈశ్వరుని కృపతో నాలో కలిగిన స్థితి మూలంగా ఈ అభ్యాసం కంటె నన్ను నేను తేలికగా అనుభూతి చెందుతున్నాను. అయినా కూడా 'మాలిక్'కి ధన్యవాదాలు. ఇప్పుడు ఈ విధానం ద్వారా నాలో ఎంత తేలికగా ఉంది అంటె, దానిని గురించి ఎవ్వరైనా ప్రశ్నిస్తే ఏమీ చెప్పలేకపోయినట్లుగా ఉంది. బహుశా అది అభ్యాసం కంటె కూడా తేలికైనది కావచ్చు.

శ్రీ బాబూజీ! నేను అర్థం చేసుకున్నదాని ప్రకారం, నాకు తెలిసో తెలియకుండానో, నా స్థితి మృత్యుస్థితి లాంటిదియే ఉంటోంది. ఇప్పుడు నా ఆంతరిక స్థితి ఎలా ఉన్నట్లు అనిపిస్తోంది అంటే, గతంలో నేను ఎప్పుడో తమకు వ్రాసినట్లుగా – "శరీరం యొక్క ప్రతి కణమూ కరిగిపోయి ప్రవహిస్తున్నట్లుగా ఉంది." అటువంటి స్థితియే ప్రస్తుతం నా ఆంతరికంలో ఉంది.

'తమ' ఉత్తరం ద్వారా తమ ఆరోగ్యం చెడిపోయిందని తెలిసి మేమందరం దిగులుతో ఉన్నాము. నేను ఎంత అస్వస్థతగా ఉన్నా ఫర్వాలేదుకాని, తమరు మాత్రం బాగుండాలని, అదే నాకు ఆనందమని ఈశ్వరుడ్ని వేడుకుంటున్నాను. నా విచారం గురించి తమరు వాకబు చేశారు. తమ ఉత్తరం అను దివ్వెతో అది భస్మీపటలమైపోయింది. ఇతరుల విషయంలో ఎలా ఉందో నేను చెప్పజాలను. తమ దయతో అంతా బాగానే ఉంటుంది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 160

లఖీంపుర్,

10.08.1951

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు క్షేమంగా చేరి ఉంటారని భావిస్తున్నాను. నా ఆత్మికదశ ఎలా ఉందో తమరు చూసియే వెళ్ళారు. అది ఏమైనాగాని, ఎటువంటిదైనాగాని అది ఆరంభమేనని నాకు అనిపిస్తోంది. తమరు మాస్టర్ సాహెబ్‌గారి ఇంటివద్ద – "నీ విషయంలో శీఘ్రగతిని (వేగాన్ని) కల్పించమంటావా?" అని నన్ను అడిగారు. పూజ్య శ్రీ బాబూజీ! తమ యొక్క ఈ అపార దయకు ఈ నాలుకతో ధన్యవాదాలు చెప్పటమంటే అది శక్తికి మించిన పని. అయితే, తమ కృపతో ప్రతి స్థితిని దాటుతూ 'మాలిక్'ను పూర్తిగా పొందగలుగుతాను. ఇంకా చెప్పాలంటే, తమ అభయం మరియు వరదహస్తా నీడలో సదా ఉండాలని నా ప్రార్థన. తమరు ఎక్కువగా శ్రమపడకూడదు. **తమ దయతో నేను తప్పకుండా లక్ష్యాన్ని సాధించి, సాక్షాత్కారం పొందితీరతాను. అసలు కావలసిన దానిమీద శ్రద్ధ పెట్టినట్లయితే, ఇంక దూరం ఎంత మిగులుతుంది!** వాస్తవంగా **తమ ఈ మాటలో యదార్థం ఉంది.** ఈ విధంగా ఎందుకు జరుగుతున్నదో తెలియదు, కాని తమరు ఈసారి వచ్చినపుడు, మా ఇంటిలో ఉన్నప్పుడుకాని, మాస్టర్

సాహెబ్ ఇంటిలో ఉన్నప్పుడుగాని, నేను తమ ఎదుటి నుంచి వెళ్ళిన తరువాత అసలు తమరు విచ్చేసినట్లుగానే అనిపించటంలేదు. ఇటువంటి అసాధారణ విషయాన్ని ఎలా వ్రాయాలి? పూజ్య శ్రీ బాబూజీ! భగవద్గీతలో వివరించిన స్థితియే నాలో నడుస్తూ ఉంది అని తమరు చెప్పారు, అలానే ఈ స్థితి నాలో సదా చాలా స్వచ్ఛంగా ఉన్నది కాని, ఇప్పుడు ఇక్కడ ఎంత తీవ్రంగా పరిశీలించినప్పటికీ తెలియటంలేదు. ఇదివరకటిలాగా నాకు తెలియకుండానే ఇది (స్థితి) నా ఆంతరికంలో జరుగుతున్నట్లుగా అనిపించటంలేదు. తమరు చెప్పారు కనుక, అది తప్పకుండా ఉంటుంది. ఇప్పుడు నాలో సహజంగానే కలుగుతున్న భావం ఏమిటంటే, నాలో కలుగుతున్న ఈ ఆధ్యాత్మిక స్థితులు కేవలం అనుభూతి కలిగించటం కొరకేనా అని. కాని నేను గమనిస్తున్నది ఏమిటంటే, నాలో ఏదైనా కోరికంటూ ఉంటే అది 'మాలిక్'పట్ల మాత్రమే ఉంటున్నది. ఇప్పటివరకు ఏమి జరిగిందో, ఇప్పుడు ఏమి జరుగుతూ ఉందో అలాగే ముస్ముందు ఇంకా ఏమి జరగనున్నదో, అదంతా నా 'మాలిక్' కృపమీదను, అభీష్టంమీదను మాత్రమే ఆధారపడి ఉన్నాయి. అయితే ఇప్పుడు ఉన్న స్థితి ఏమిటంటే, అసలు కోరిక ఉండటం అంటె ఏమిటి, అసలు అది నాలో ఉన్నదా లేదా అనే విషయంలో కూడా నాకు సంశయం కలుగుతోంది, ఎందుకంటే ఇప్పుడు ఆ కోరిక అనేది నా ఎదుట నిలవటంలేదు.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 161

లఖీంపుర్,

22.08.1951

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుందనుకుంటాను. తమ ఆరోగ్యం బాగుందని భావిస్తాను. 'మాలిక్' కృపతో ఇప్పుడు ఉన్న ఆత్మిక దశను వివరిస్తున్నాను. గత 4-5 రోజులుగా హృదయం దేనిలోనూ నిమగ్నం కాలేదు, దీనిమూలంగా నాతో ఎవ్వరైనా మాట్లాడుతున్నపుడు నాకు విసుగెత్తినట్లుగా ఉంటూ ఉండేది, కాని ఇప్పుడైతే ఆ విసుగుదల వంటివి ఏమీ లేకుండాపోయాయి. ఇంతకు క్రితం అస్తవ్యస్తమైన స్థితి ఉండేది కాని 'మాలిక్' దయతో ఇప్పుడు అది సాఫీగానే ఉంది. ఇప్పుడు నా ఆధ్యాత్మిక ఉన్నతిని గురించి ఏమీ తెలియటంలేదు. ఇప్పుడు ఇంకా ఏమయ్యింది అంటె, నా శరీరం యొక్క బాగోగుల మాట ప్రక్కనబెడితే, నాకు తరచుగా అసలు ఈ శరీరంలో ప్రాణంలాంటిది ఏమైనా ఉందా లేదా అని సందేహం కలుగుతూ ఉంటుంది. నిజం చెప్పాలంటే, నాకు అటువంటి అనుభూతి కలగటంలేదు సరికదా అసలు దాని ధ్యాసయే లేకుండాపోతోంది. ఇంతకుపూర్వం నాకు సంబంధించిన వారందరితోను సంబంధం తెగిపోయినట్లుగా అనిపించేది కాని ఇప్పుడు సంబంధం కలిగి ఉన్నట్లుగాని, లేనట్లుగాని తెలియటంలేదు. ఇప్పుడు ఎటువంటి అనుభవమూ తెలియటంలేదు. అది ఎంతగానంటె, ఎటువంటి స్థితి కూడా ఒక్క క్షణమైనా కలగనపుడు ఇంక దాని స్థిరత్వం గురించి ఏమని చెప్పను? ఇప్పుడు నా స్థితి ఏమిటో తెలియకుండా ఉంది. నాలో ఏమైనా వైరాగ్యం ఏర్పడిందా అనికాని, నేను 'మాలిక్' యొక్క ప్రియురాలిని అనికాని నా వరకు నేను చెప్పలేకపోతున్నాను. అసలు వీటన్నింటి గురించి నాకేమీ తెలియటంలేదు. అసలు నాలో ఈ స్థితి ఎప్పుడైనా కలిగిందా అనిగాని, అది ఎలా ఉంది అనిగాని నాకు తెలియటంలేదు. నేను ఇదివరలో ఎలా ఉన్నానో, ఇప్పుడూ అలాగే ఉన్నాను. బాబూజీ, ఇప్పుడైతే ఉదాసీన స్థితి మరియు మృతునిలాంటి స్థితి రెండు కూడా తొలగిపోయినట్లుగా అనిపిస్తోంది. ఆగష్టు 18వ తారీఖు నుండి స్థితి మారిపోయింది. ఇప్పుడు 'మాలిక్' యొక్క అపార దయతో, ప్రతిదాని నుండి జీవం, కాంతి వెలువడుతున్నట్లుగా అనిపిస్తోంది. శ్రీ బాబూజీ! ఇంకా ఏమిటంటే, ఈ కాంతి ఎలా ఉంది

అంటె, దీనిలో ప్రకాశంగాని, అంధకారంగాని ఏమీ లేనట్లుగా ఉంది. ఈ స్థితి ఏమిటో తెలియటంలేదు. నా అవగాహనకు వచ్చినదానిని వ్రాశాను. ఇప్పుడు తమరికే తెలియాలి. తమ నిర్వాకానికి తెలియాలి.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 162

షాజహాన్‌పుర్,

25.08.1951

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

నీకు కుశలమగుగాక! నీవు 23.7.1951వ తేదీన వ్రాసిన జాబుకు నేను 30.7.1951న జవాబు వ్రాశాను. కాని తపాలా ఆఫీసు నిర్లక్ష్యంవలన నీకు అది చేరలేదు. అందులో స్వామి వివేకానందుని ఒక చిన్న సందేశం (అంతర్వాణి) కూడా ఉంది. ఏమి వ్రాశానో నాకు జ్ఞాపకంలేదు. ఏ మాత్రమైనా జ్ఞాపకంవస్తే వ్రాస్తాను. ఇంకా ఏమైనా క్రొత్త విషయాలు జ్ఞాపకంవస్తే అవి కూడా వ్రాస్తాను. “నా ప్రస్తుత స్థితి అభ్యాసం కంటె తేలికగా అనిపిస్తోంది” అని నీవు వ్రాశావు. అది సరైనదే. అభ్యాసం ఎంత సూక్ష్మమైనది అని చెప్పబడినప్పటికీ అది కూడా కర్మాచరణమే. అది శారీరక శ్రమ కంటె ఎప్పుడైనా భారీగానే ఉంటుంది. అలాగే మానసిక శ్రమ ఎప్పుడైనా సరే, శారీరక శ్రమ కంటె భారంగా ఉంటుంది. అనగా అభ్యాసం, దాని ఫలితం ఏదైతే ఉంటుందో, దాని కంటె భారమైనదిగా ఉంటుంది. నీవు ఇంతకుపూర్వం వ్రాసినటువంటి మృతస్థితి లాంటిది అనుగ్రహించినందుకు ‘మాలిక్’కు ధన్యవాదాలు. ఎందుకంటె ఇటువంటి స్థితిని నేను నా జీవితంలో మొట్టమొదటిసారిగా నా కంటితో చూస్తున్నాను. ప్రయత్నం ఎంతగా చేసినప్పటికీ, దైవం సహాయపడనంతవరకూ, స్వప్రయత్నముతో ఏదీ ప్రాప్తించదు. అయితే మనలో దైవ సహాయంకోసం అర్థించేవారు ఎవ్వరు ఉన్నారు! భగవంతుని పొగిడేవారైతే చాలామంది ఉంటారుగాని తమకు తాముగా ‘అతడి’ని శరణుజొచ్చేవారు చాలా అరుదుగా ఉంటారు. మన పరిధిలో, ప్రతి ఒక్కరూ ముష్టెత్తడానికి ఇక చేయిచాపి ఉంచుకునేటంతగా భిక్షాటన పెరిగిపోయింది. అర్థించవలసిన అవసరం లేకుండానే దైవమే స్వయంగా దయతలచేటంతగా తమంతటతాము మార్పు చెందటానికి ఎవ్వరూ కూడా సిద్ధపడటంలేదు. భిక్షాటన చేసేవారు భిక్షాపాత్ర చేతబట్టి రోజంతా గడప గడపకూ తిరిగినా ఆఖరికి శ్రమ ఫలితంగా పొట్ట నింపుకునేందుకు భిక్ష సరిపడా దొరకని పరిస్థితిని నీవు గమనించే ఉంటావు. మరి ఒకరైతే ‘మాలిక్’ను స్మరించుకుంటూ ఒక చెట్టునీడలో కూర్చుని ఉంటే అతనికి తినడానికి దొరికేదానితో అతడు స్వయంగా కడుపు నింపుకోవటమేగాక ఇతరులకు కూడా ఆరగింపు చేస్తాడు, అయినా ఇంకను కొంత మిగుల్తుంది కూడ. ఇది సన్యాసుల యొక్క యోగ్యత, మొదట చెప్పుకున్నవారిని భిక్షకులు అని చెప్తుతాము.

ఎప్పుడైతే ఈ జీవన్మృత స్థితి లాంటిది ఏర్పడుతుందో, అప్పుడు అతని ఆధ్యాత్మిక విద్య ప్రారంభమైందని చెప్పాలి. అంతేకాదు, ఈ స్థితిని కలిగిఉన్నప్పటికీ దానిని గురించిన ఆలోచన ఏమాత్రం ఉండకూడదు. అది ఏ స్థాయికి అని చెప్పాలంటే, ఆలోచన చేసినాగాని, దాని మీద నిఘాపెట్టినాగాని ఆ స్థితి యొక్క అనుభూతి కలగకూడదు. ఇదే అసలైన స్థితి మరియు ఆధ్యాత్మిక విద్యకు ఆరంభం కూడ. దీనికి ముందు **ఏదో ఆదేశం వచ్చింది. దాని స్వరూపం ఏమిటంటే, “ఎక్కడైతే అందరూ ఆధ్యాత్మికతను ముగిస్తారో, అక్కడి నుండి రామచంద్ర శిక్షణ ప్రారంభిస్తాడు” అని.** ఇది వాస్తవం కూడా. ఈ స్థితి నుంచే సంస్కారాల బంధనం నుంచి విముక్తి కలుగుతుంది. తరచుగా నా ఉత్తరాలలో నేను ఈ స్థితి నిరీక్షణ కొరకే వ్రాశాను.

నీవు 22.8.1951వ తేదీతో వ్రాసిన ఉత్తరానికి ఇప్పుడు జవాబు వ్రాస్తున్నాను. ఈశ్వరానుగ్రహం వలన జీవన్మృత స్థితి లాంటిది కొనసాగుతూనే దాని గురించిన జ్ఞానం లేకుండాపోవటం అను స్థితి కూడా కలుగుతూ ఉంది. అది ఇంకా పూర్ణస్థాయికి చేరలేదు. దానికి ఇంకా సమయం పట్టుంది. దానిని కూడా ఈశ్వరుడు పూర్తి చేస్తాడు. "ఇప్పుడు 'మాలిక్' దయవలన ప్రతి ఒక్కదానిలోని ప్రకాశం, లేదా జీవనం తొలగిపోతూ ఉన్నట్లుగాను, మరి ఆ ప్రకాశం కూడా ఎటువంటిది అంటే దానిలో అంధకారంగాని, కాంతిగాని ఏమీ తెలియనటువంటిది" అని నీవు వ్రాశావు. నీవు ఆంతరికంగా ఎక్కడ, ఏ స్థితిలో ఉంటావో, అదే స్థితి బాహ్యంలో కూడా అనుభవమవుతూ ఉంటుంది. నా అభ్యాస కాలంలో కూడా, ఆంతరికంగా ఏమి అనిపించిందో, అదే బాహ్యంలో కూడా సాక్షత్కరించినటువంటి స్థితి కలిగింది. తల్లిగార్కి ప్రణామములు అందజేయి.

నీ శ్రేయోభిలాషి,
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 163

లఖీంపుర్,
29.08.1951

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసిన ఉత్తరం అందింది, దానిలోని విషయాలు తెలిసాయి. స్థితిని గురించి తమరు ఏమైతే వ్రాసి ఉన్నారో దానిని గురించి నేను ఇంతవరకు చెప్పగలను – "దైవానికి ధన్యవాదాలు. 'మాలిక్' నాకు ఏదైతే అనుగ్రహించాడో అది సాటిలేనిది, నిరుపమానమైనది." ఈ కృప ఇలాగే నిలిచి ఉండాలి అని ఈ దీనురాలు ప్రార్థిస్తున్నది. **తమరు చేసిన ఈ వ్యాఖ్య –"బిచ్చగానివలె తయారు కాదలచినపుడు, అగ్రశ్రేణి బిచ్చగానిలాగే తయారుకావాలి, లేకపోతే వ్యర్థం" –నాకు బాగా నచ్చింది.** అయితే బాబూజీ, స్థితి మాత్రం ఎలా ఉందంటే, సదా నేను 'అతని' బిక్షకురాలినే అయి ఉన్నాను కాని, ఇప్పుడు ఆ విషయం యొక్క జ్ఞానం లేకుండాపోయింది. ఇది కూడా 'అతడి' అభీష్టం మేరకే. నా ఆత్మిక దశ ఎలా ఉన్నదంటే, నేను ఇంతకుముందే వ్రాసాను, ఏమని అంటే, అది ఇప్పుడే ప్రారంభమైనట్లుగా అనిపిస్తోంది. **పూజ్య బాబూజీ! మనిషి ఎప్పుడైతే సత్యవంతమైన హృదయంతో కేవలం 'మాలిక్'పట్ల వాంఛతో 'తమ' ద్వారం వద్దకు చేరతాడో అప్పుడే అతనికి బంధనాల నుంచి విముక్తి కలుగుతుంది.** ఇప్పుడు 'మాలిక్' దయతో అనుభవమవుతున్న దశను గురించి వ్రాస్తున్నాను.

ఇప్పుడు నాలో ఎక్కువగా మరపుస్థితి ఉన్నట్లుగా అర్థమవుతోంది. అది తరచుగా తెలుస్తుంది, తర్వాత మళ్ళీ తెలియకుండాపోతుంది. దీనినిబట్టి ఈ మరపుస్థితిని కూడా మరచిపోయి ఉంటున్నట్లుగా అనిపిస్తోంది. ప్రస్తుతం ఉన్న స్థితి స్వచ్ఛంగా ఉంది. **తమరు ఒకసారి –"తపన ప్రతిచోట దారి చూపుతుంది" అని వ్రాశారు.** బాబూజీ! నా స్థితి ఎలా ఉన్నదంటే, నాలో తపన లేదా కోరిక అనేది లేకుండా ఉన్నది. దాని కొరకు ప్రయత్నించు దామనుకుంటేనే హృదయంలో ఆవేదన మొదలవుతుంది, అయినప్పటికీ ఒక్క కన్నీటి చుక్క కూడా రాకపోయింది. అందువలన ఎప్పుడు ఏ స్థితిలో ఉంటే దానితోనే సరిపెట్టుకుంటున్నాను. ఎందుకంటే, అది నా చేతిలో లేకపోయింది కనుక. 'అతని' అభీష్టం మేరకే ఉంటున్నాను. ఇదివరకు ఒక రకమైన ఆనందం నా లోపల ఎప్పుడూ ఉంటూనే ఉండేది కాని ఇప్పుడు నా స్థితి ఎలా ఉన్నదంటే, ఎంత వెదికినా ఆ ఆనందం, ఎవరిలోను ఉచ్చనీచాలు (మంచిచెడులు), చిన్నాపెద్దా అను భేదభావం యొక్క జ్ఞానం నాలో జాడ లేకుండాపోయాయి.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

# ఉత్తరం సంఖ్య - 164

షాజహాన్‌పూర్,
30.08.1951

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. ఈశ్వరానుగ్రహంవలన నీ ఉత్తరాలన్నీ అందాయి. నీవు ప్రస్తుతం ఉన్న స్థితిలో అభ్యాసం కష్టతరంగా ఉంటుంది. అభ్యాసం యొక్క ఫలితం ఇది. ఇటువంటి స్థితిలో ఏ అభ్యాసం దీనితో సంబంధం కలిగి ఉంటుందో, అది ఎరుకలేకుండానే దానికి అదే జరుగుతూ ఉంటుంది. ఆ విధంగా విశ్వాసం దృఢంగా ఉన్నట్లయితే మన సంస్థలోని అభ్యాసి ప్రతి ఒక్కరు దానిని గురించి తెలియకుండా కూడా ఈశ్వరునివైపు దృష్టి సారించి ఉంటాడు. ఇలా ఎందుకంటే, బ్రహ్మాండమండల దశలో మనస్సును మునక వేయించటం జరిగిన కారణంగా దానిలో అదే రంగు ఏర్పడుతుంది. మరి నేనయితే అతని మనఃప్రవృత్తిని (వైఖరిని) ఊర్ధ్వముఖం చేస్తాను. ఇలా ఎందుకంటే, దాని శక్తి క్రమక్రమంగా అథోముఖం అనగా ప్రాపంచికదిశగా మరలకుండా ఉంటుంది. అభ్యాసి లయావస్థను ఏ స్థాయికి చెందినదైనా పొందినపుడు, అతనికి మార్గనిర్దేశం దానికదే కలుగుతుంది. నేను కూడా అభ్యాసం ప్రారంభించినపుడు దేనినైతే తలపెట్టానో, అదే తడవుగా దానంతటదే జరిగిపోయింది. అంతేగాక అది నేను లక్ష్యం చేరనంతవరకు, ఆ లక్ష్యాన్ని చేరటానికిగాను ఏదో నిర్దేశం చేస్తూ, పురికొల్పుతూనే ఉంది. ఇంకా చెప్పాలంటే, భగవంతుని కృపతో నేను ఆ లక్ష్యాన్ని చేరుతూపోయాను. ఇప్పుడు ప్రారంభించిన దానిని నేను ఇతరులతో ప్రస్తావించినట్లయితే నా గురించి ఏమనుకుంటారో నాకు తెలియదు. అలా చెప్పటానికి కూడా నాకు సిగ్గు కలుగుతోంది. ఒకవేళ దానిని చెప్పాల్సిన సందర్భమే వస్తే, ఆ సమయానికి అభ్యాసి దానిని పూర్తిగా అభ్యసించటానికి యోగ్యుడు కాలేదు. నీవు వ్రాసిన జీవచ్ఛవం లాంటి స్థితి, అదే అసలైన స్థితి కనుక ప్రతి ఒక్కరూ ఆ స్థితిని చేరటానికి ప్రయత్నం చేయాల్సి ఉంది. అసలైన ఆధ్యాత్మిక విద్య ఇక్కడి నుండే ప్రారంభమవుతుంది అనగా అ, ఆ లు నేర్వటం ఇక్కడి నుండే ప్రారంభమవుతుంది. అదేకాదు, జీవన్మృత స్థితి లాంటిది ఏరకంగాను దృష్టికి రానప్పటినుంచే ఆధ్యాత్మిక విద్య యొక్క అ, ఆ లు ప్రారంభమవుతాయి.

**స్వామి వివేకానందుని సందేశం:**

“బిటియా! చూడు. ఇది చాలా ఉన్నతమైన ఆలోచన. ప్రజలు ఈ దశలో ఆధ్యాత్మికతకు ముగింపు పలుకుతారు కాని అతడు (రామచంద్ర) ఆరంభిస్తాడు. ఆ ఉద్దేశ్యం సరైనదే. ఇటువంటివారు ఎవ్వరినైనా నీవు చూడగలవా? జనం నవ్విపోదురు గాక! అన్నిరకాల కార్యకలాపాలకు ఇదే అంతం కాని వాస్తవానికి  ఆధ్యాత్మికతకు ఇదే అరంభం.”

“అభ్యాసం మూలంగా నా అంతట నేను చాలా తేలికగా అనుభవం చెందుతున్నాను” అని నీవు వ్రాసినది సరైనదే. ఏ విధంగానైతే ఒక వస్తువు మరొక వస్తువును పనిచేసేటట్లు చేస్తుందో, ఆ పనిని అభ్యాసంగా భావించాలి. ఇంకేముంది, ఆ వస్తువు సరిచేయబడినపుడు దాని పనితీరు బాగుపడుతుంది. లయావస్థను పొందాల్సి ఉంది. సాలోక్యత, సాయుజ్యత, సామీప్యత మరియు సారూప్యత వంటివన్నీ దాని దశలుగా ఉన్నాయి. వీటి అన్నింటినీ నేను కోరుకుంటున్నాను కాని అవి అన్నీ దరిచేరుతున్న శుభవార్త ఇంకా అందలేదు. ఈ స్థితిని నా జీవితంలో నీవిగా చూడగలుగుతున్నందుకు దేవునికి ధన్యవాదాలు అర్పిస్తున్నాను. ఈ స్థితికి చేరినప్పుడు బంధనాలన్నిటి నుంచి విముక్తి కలుగుతుంది. వాస్తవానికి ఇది మన చేతుల్లో లేదు, అది ఈశ్వరానుగ్రహమే. “శరీరం యొక్క అణువణువు కరిగి ప్రవహించి పోతున్నాయి” అని నీవు వ్రాసినది సరైన భావనయే. వర్షం కురిసినప్పుడు చెట్లమీద ఉన్న దుమ్ము, ధూళి శుభ్రంచేయబడుతుంది. అయితే ఈ నీరు ఎటువంటిదంటే, అణువణువులోకి ప్రవేశించి వాటి మాలిన్యాలను తొలగించివేసి వాటి పూర్వ వైభవాన్ని చాటుతుంది. (నీరు అనగా దివ్యప్రాణాహుతిగా భావించవచ్చు)

నీ శ్రేయోభిలాషి,
రామచంద్ర

# ఉత్తరం సంఖ్య - 165

లఖీంపుర్,
05.09.1951

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరం పోయింది అనుకున్నది చేరింది, సమాచారం తెలిసింది. అభ్యాసం గురించిన చింత ఇప్పుడు నాకేమీ లేదు, ఎందుకంటే ఇప్పుడు నాకు సంబంధం ఉన్నది ఒకే 'ఒక్కరి'తో మాత్రమే. అందువలన నా అభ్యాసం వగైరా కూడా 'అతడు' మాత్రమే. తమరు నా అభ్యాసం గురించి వ్రాసినటువంటిది చాలా అద్వితీయంగా ఉంది. తమరు చెప్పిన ఈ మాట – "ఈ స్థితి పరిపక్వత చెందినమీదట ఆధ్యాత్మిక విద్య యొక్క 'అ', 'ఆ' లు చదవటం ఆరంభమవుతుంది"– పూర్తిగా సహేతుకంగా ఉంది. ఇప్పుడు నాకు అనుభవమవుతున్న ఆధ్యాత్మిక స్థితిని గురించి వ్రాస్తున్నాను.

పూజ్య శ్రీ బాబూజీ, అదేమిటోగాని, మృతుని లాంటి స్థితి నాలో ఉన్నట్లుగా ఇప్పుడు నాకు తెలియటంలేదు, కాని ఇతరులందరిలోను, నా ఎదుట అన్ని వైపులా అదే స్థితి ఉన్నట్లుగా తెలుస్తోంది. తరచుగా ఇప్పుడు అది కూడా మాయమైపోతున్నది. కొన్ని నెలల తరువాత ఇప్పుడు నాలో తరచుగా మరపుస్థితి మరియు విభ్రాంతి (ఆశ్చర్యపోవటం) స్థితి వంటివి అనుభవమవుతున్నాయి. ఇప్పుడు 'నేను' (Self) అను భావన యొక్క స్థితి ఎలా ఉంది అంటె, ఇంతకుపూర్వం నేను దానికి దూరంగానే ఉన్నట్లు అనిపించినప్పటికీ, ఇప్పుడు అది ఉంటూనే ఉండి కూడా నేను దానికి అంటనట్లుగాను, ఇంకా తేలికగాను అనుభూతి చెందుతున్నాను. ఇప్పుడు 'నేను' (Self) అని చెబుతున్నప్పుడు, దాని భావం గురించి ఏమీ తెలియనట్లుగా ఉంటున్నాను మరియు దాని భావంతో నన్ను నేను తేలికగా అనుభూతి చెందుతున్నాను. ఇంకా చెప్పాలంటే, అసలు ఆ స్థితి నాలో కలిగిందో, లేదో అన్నంతగా నిర్లక్ష్యం వహించి ఉంటున్నాను. శ్రీ బాబూజీ! నేను ఇప్పుడు తరచుగా మోసపోతున్నాను, ఏమని అంటె అసలు 'నేను' (Self) అనేది నాలో ఏర్పడిందా అని. ఇంకేం చెప్పను, అసలు నాకు 'నేను' (Self) అనేది తెలియకపోయినపుడు ఇంక దానిని గురించి చెప్పటం ఎలా సంభవమవుతుంది! అయినా కూడా 'మాలిక్' దయా దాక్షిణ్యాలపట్ల పూర్ణ విశ్వాసంతో ఉన్నాను. ఆ స్థితిలోని వాస్తవం ఏమిటో తమకే తెలియాలి. మొదట నాకు 'నేను' అని చెప్పుతున్నపుడు, ఈ 'నేను' అను శబ్దం ఎవరి గురించి ప్రస్తావించబడుతున్నదో కూడా తెలియనట్లుగా, నా స్థితి ఉండేది. ఇది నాకు చెందినదా లేక 'మాలిక్'కు చెందినదా అను విషయం షుమారు రెండున్నర నెలలుగా నన్ను విడిచిపోతున్నట్లుగా గ్రహించాను. నేను దీనికి పూర్తిగా దూరమైపోయాను. ఆ సంగతి తమకే ఎరుక. ఎందుకంటే, ఈ విషయాలన్నింటిపట్ల నా హృదయం స్పందిచటంకాని, అసలు నా దృష్టి వాటివైపు మరలటంకాని లేనపుడు నా స్థితి గురించి ఏమి చెప్పగలను. శ్రీ బాబూజీ, నా లయ–అవస్థ అయితే ఎప్పుడో జరిగిపోయింది. శారీరిక మరియు ఆంతరిక లయ–అవస్థ మాత్రం ఏమీ తెలియటంలేదు. దానిని తెలుసుకొనటానికి గట్టిగా శ్రద్ధ పెట్టినప్పటికీ మరియు ప్రయత్నించినప్పటికీ కూడా అది గ్రహింపుకు రాకపోగా నా హృదయం విచారానికి గురవుతోంది. అందుచేత ఇప్పుడు ఈ ఆలోచన కూడా విరమించుకోవలసి వచ్చింది. ఇప్పుడింక దానిని గురించి తమకు తెలియాలి, తమ నిర్వహణకు తెలియాలి.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు. అమ్మ తమకు ఆశీర్వాదాలు తెలుపుతోంది.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 166

లఖీంపుర్,
14.09.1951

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఆత్మికదశను గురించి వ్రాసిన ఉత్తరం తమకు చేరి ఉంటుంది. ఇప్పుడు మూడు, నాలుగు రోజుల నుండి ఏదో స్తబ్ధత ఏర్పడినట్లుగా ఉన్న స్థితి అనుభవమవుతూ ఉంది, దాని సంగతి తమకు తెలియాలి. చాలారోజుల నుండి మరపుస్థితి మరియు అధిక విశ్రాంతి స్థితి స్వల్పంగా అనుభవమవుతున్నాయి. మృతుని లాంటి స్థితి యొక్క జాడ మాత్రం లేదు, కాని ఈ స్థితి ఏమిటో నాకు సరిగ్గా తెలియటంలేదు. నిద్రలో రాత్రి అంతా కలలు వస్తూ ఉన్న పరిస్థితే ఉంటున్నది. అయితే అవి ఏమిటో జ్ఞాపకం ఉండటంలేదు. గత ఆరు ఏడు నెలలుగా ఒకటి రెండుసార్లు మాత్రమే ఈ కలలు చూసాను, కాని ఇప్పుడు ఇలా ఎందుకు జరుగుతోందో ఆ దైవానికే తెలియాలి. ఇంతకుపూర్వం కూడా ఒకసారి ఇటువంటి స్థితియే అనగా రాత్రంతా కలలు, పగలంతా ఆలోచనలు కలిగాయి. ఇప్పుడైతే పగలు ఆలోచనలు రావటంలేదుకాని, కలలు వంటివి మాత్రం ఒకదాని వెంట ఒకటి రావటం, పోవటం జరుగుతున్నది, వాటిని తప్పించుకుందామని అనుకున్నా తొలగకపోవటంతో వాటిని దైవానికే వదిలివేశాను. ఇంకా ఏమేమి కలుగుతున్నాయో జ్ఞాపకంలేదు. మనస్సు కూడా ఎందుకోగాని బలహీనపడి పోయినట్లుగా అనిపిస్తోంది. పూజ్య శ్రీ బాబూజీ, దయచేసి ఈ స్థితిమీద తమరు తప్పక దృష్టిపెట్టాలి అని కోరుతున్నాను. ఎందుకంటే, ఇప్పుడు ఏ స్థితి కూడా మంచిగా అనిపించటంలేదు. ఈ కలలుగాని, ఆలోచనలుగాని నన్నైతే ఇబ్బంది పెట్టలేకపోతున్నాయని, నా హృదయాన్ని తాకలేక పోతున్నాయని నేను గ్రహించగలుగుతున్నాను. ఇంకొక విషయం ఏమిటంటే, నేను కావాలి అనుకొని నన్ను నేను పరిశీలించుకున్నప్పుడు ఈశ్వరీయ ధార ఏదైతే చుట్టూరా నెలకొని ఉందో దానిలో నేను పూర్తిగా మిళితమై పోయినట్లుగా అనుభూతి చెందుతున్నాను. అంతకుమించి మరేమీ తెలియటం లేదు. నేను కనుక ఎప్పుడు గమనించాలి అనుకున్నా కూడా ఇదే స్థితి దాదాపు నిరంతరం అనుభవమవుతున్నట్లుగా ఉంది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 167

లఖీంపుర్,
21.09.1951

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు, పూజ్య తావూజీ మరియు పూజ్య మాస్టర్ సాహెబ్‌లను ఉద్దేశించి వ్రాసిన ఉత్తరం నిన్న వచ్చిన దానిలోని విషయాలను తెలుసుకొని చాలా ఆనందించాను. ముఖ్యంగా తావూజీ గురించి తమరు 'కుకరా'లో చెప్పిన మాటలు నూతన ప్రపంచంలో వారిని తమ వెంట ఉంచుకుంటాను అనేది చదివినమీదట 'మాలిక్'కు వందలాదిగా లేదా వేయి నోళ్ళతో ధన్యవాదాలు చెప్పినా చాలదు. మా అందరిపట్ల 'మాలిక్'కు ఉన్న అపార దయను తలచుకుని మా హృదయం పరవశించిపోతున్నది. నా సంస్కారాలు కొన్నింటిని తమరు హరించివేసినట్లుగా 'మాలిక్' దయతో నాకు అర్థమయ్యింది. అందుకని నేను తమతో చెప్పి ఉన్నాను కూడ, ఏమని అంటె, **శ్రీ బాబూజీ, నేనే కనుక ఈశ్వరుడు అయి ఉంటె కనీసం అతికష్టమైన సంస్కారాలను పరమ దయాళువైన సద్గురువు వాటిని భోగించటానికి ఏ విధంగాను అనుమతించి ఉండేదానను కాదు.** సరే, ఆపైన తమ ఇష్టం. అయితే ఇంకొక ముఖ్యమైన ప్రార్థన ఉంది, ఏమిటంటే, ప్రకృతి ధర్మాన్ని (Law of Nature) అనుసరించి ఏఏ సంస్కారాలు

తమ వంతుగా అప్పగించబడ్డాయో, అవి తప్పదు కనుక, వాటినిమించి మరొక్కటి కూడా దయచేసి తమరు భోగించరాదు. ఆ విధంగా తమ దయపట్ల కోటి నాలుకలు కూడా తమకు ధన్యవాదాలు తెలపటానికి అసమర్థమైనవిగానే ఉంటాయి. ఇంక నేను నా 'మాలిక్'కు మాత్రమే కట్టుబడి ఉంటాను. సాధ్యమైనంతవరకు నాలో 'మాలిక్' జ్ఞాపకం తగ్గింది అని తమకు అనిపించే అవకాశం లేకుండా చేస్తాను. తమరు ఈ దీనురాల్ని గురించి సర్వదా సంతోషంగా ఉండండి. దీనికొరకే నేను ప్రార్థిస్తూ ఉంటాను. అదే నేను అర్పించగల ధన్యవాదాలు. **పరమ దయాళువు అయిన శ్రీ లాలాజీ నిజానికి మనకు పూర్తిగా అసాధ్యమైన ఆ 'మాలిక్'ను ప్రదానం చేశారు. గతంలో లేనటువంటిది, భవిష్యత్తులో ఉండనటువంటిది అయిన అమూల్య రత్నాన్ని వారు మనకు ప్రసాదించారు.** ఈ దీనురాలి ప్రణామాన్ని 'వారి' పాదాలకు నివేదించండి, అలాగే **నేను 'మాలిక్'ను పూర్తిగా ప్రాప్తింపచేసుకుంటాను అని కూడా చెప్పండి, ఆఖరికి భూమి తలక్రిందులైనా సరే. ఇది నా తిరుగులేని దృఢ నిశ్చయం.** శ్రీ బాబూజీ! ఇప్పుడు తపన ఏమైపోయిందో తెలియటంలేదు, ప్రత్యేకించి ఏ స్థితీ కనిపించటంలేదు. ఇంకా చెప్పాలంటే, ఆ తపన యొక్క ఉనికియే ఏకోశాన కనిపించటంలేదు. దానిని తక్కువ స్థాయిలో ఉందనిగాని, స్వల్పంగా అనుభూతి కలిగిస్తోందనిగాని చెప్పవచ్చు. ఇప్పుడు కలిగేటటువంటి ఉత్సుకత (ఉత్సాహం) చాలా చల్లగా (మందకొడిగా) ఉందిగాని ఉప్పొంగటంలేదు. శ్రీ బాబూజీ, నాకు 'మాలిక్' కావాలి, 'అతని' అభీష్టం ఎలా ఉంటే అలాగే ఉండవచ్చు. ఇప్పుడు స్థితి ఎలా ఉంది అంటె శాంతి కూడా శాంతించినట్లుగా ఉంది. ఇప్పుడు ఇంకా ఉన్న స్థితి ఎలా ఉంటున్నది అంటే, షుమారు 15-20 రోజుల నుంచి ఒకటి రెండు రోజులు స్థితి శుభ్రమైనదిగా ఉండగా మళ్ళీ ఒకటి రెండు రోజులు అశుభ్రంగా ఉంటున్నది; మంచి-చెడు, హెచ్చు తగ్గులు వంటి స్థితియే ఉంటున్నది. అయితే అశుభ్రంగా ఉంది అనిపించిన తర్వాత స్థితి ఏదైతే శుభ్రమైనదిగా అనిపిస్తుందో అంతకుపూర్వం శుభ్రమైనదాని కంటె కూడా ఎక్కువ శుభ్రమైనదిగా అనుభవమవుతోంది. ఇప్పుడైతే నేను ఎంత ఖాళీగా ఉంటే అంత ఆత్మోన్నతిని పొందుతున్నట్లుగా అనిపిస్తోంది. ఇప్పటికి నా అనుభవానికి వచ్చినది ఇంతే.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 168

లఖీంపుర్,

24.09.1951

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ నుంచి చాలా రోజులుగా ఉత్తరం ఏమీ రానందున తమ అందరి యొక్క క్షేమ సమాచారం కూడా తెలియలేదు. నా ఉత్తరం తమకు చేరి ఉంటుంది. ఇప్పుడింక తమరు విచ్చేసేరోజులు కూడా దగ్గరపడుతున్నాయి. నా ఆరోగ్యంలో కొద్దిగా లోపం వచ్చింది. ఇప్పుడు 'మాలిక్' కృపతో, నాలోని ప్రస్తుత స్థితిని గురించి వ్రాస్తున్నాను.

22 నుంచి 26వ తారీఖు వరకు ఒక వింతైన నిశ్శబ్దం ఆవరించి తర్వాత మళ్ళీ బాగుపడింది. ఈ నిశ్శబ్ద స్థితి తర్వాత కలిగినటువంటి స్థితి చాలా స్వచ్ఛమైనదిగా ఉన్నట్లు నేను గమనించాను. ఇప్పుడు ఉన్న పరిస్థితి ఏమిటంటే, ఆంతరిక దశ మరియు బాహ్య దశలలో ఎంత సమానత్వం ఏర్పడిందంటే, నన్ను నేను పూర్తిగా మరచిపోయి, ఒక ప్రత్యేకమైన తేలికైన నిర్మల ధారలాగా ప్రవహించిపోతున్నట్లుగా అర్థమవుతోంది. అది బాహ్యరూపంలాగా లేదనిపిస్తోంది. ఒక వింతైన స్థితి కనిపిస్తోంది, కాని దానిని స్థితి అనటం కూడా వ్యర్థమే. ఎందుకంటే, ఈ 'స్థితి' అను మాట దాని కంటె భారమనిపిస్తోంది. దానిని ఈ విధంగా అర్థం చేసుకోవచ్చు- మనకు గాలి వీస్తున్నట్లుగా అనుభవం కాకపోయినా

సూక్ష్మ వాయువు నిరంతరం ఎలా ప్రవహిస్తూ ఉంటుందో అంత తేలికగాను లేదా అంతకంటె తేలికగాను ఉంటుంది. ఇంకొక రకంగా చెప్పాలంటే, పెద్ద నదులు సైతం సముద్రంలో కలిసిపోయి ఒక్కటైపోతాయో అదే విధంగా అంతకంటె కూడా తేలికగా ఊహించుకోండి. శరీరం యొక్క తత్వాలన్నీ దాని వెలుపలి తత్వాలతో కలిసిపోయి ఒకే రకంగా ప్రవహిస్తున్నట్లుగా అనిపిస్తోంది.

నా శ్రీ బాబూజీ, 'మాలిక్' కృప ఎటువంటిదో చూడండి– దివ్య రహస్య విషయాలు కూడా వాటంతట అవే వెల్లడవుతున్నాయి, అవి స్పష్టంగా, వాటిలో చాలావరకు వాస్తవమైనవిగానే ఉంటున్నాయి. ఎందుకంటే, వీటిని గురించి పూజ్య మాస్టర్ సాహెబ్ చర్చించినపుడు అవి నిజమనే నిర్ధారించబడుతున్నాయి. వీటిని తమరు మాస్టర్ సాహెబ్‌కు వ్రాసిన ఉత్తరాలలో కూడా తెలియజేసి ఉన్నారు. ఆ విషయం తమకు తెలిసినదే. ఈ దశయే కాకుండా, బాహ్యంలో ఉన్న దశ, నేను ఆంతరికంగా పరిశీలించినపుడు చాలావరకు అదే స్థితి కొనసాగుతూ ఉన్నట్లుగా కనిపిస్తోంది. అది కనిపించటం ఏమిటి, దానిని అనుభూతి చెందుతూ కూడా అనుభూతి చెందనట్లుగా ఉంటున్నాను. నాలో నేను పరిశీలించుకున్నపుడు అగాధ సముద్రంలాగానే నాలో కూడా ఉన్నట్లుగాను, అది కూడా అత్యంత శాంతంగాను, ఒక వింతైన విధంగాను ఉన్నట్లు అనుభవమవుతోంది. శ్రీ బాబూజీ, నాకు కలిగిన అనుభూతి ఏదైతే ఉందో దానిని వ్రాసేసాను. అటుపైన తమకు, తమ పనితనానికి తెలియాలి. ఇప్పుడు అనుబంధాల గొలుసుకట్టు వంటివి కూడా ఆ ధారలో కలిసి ఒక్కటైపోయాయి. పూజ్య శ్రీ బాబూజీ! ఇప్పుడు ఇది వాస్తవిక 'శరణాగతి' (Surrender) యొక్క ఆరంభంగాను, "సింధువులో బిందువు కలిసిపోయినట్లు" ఉన్నటువంటి స్థితిగాను అనుభవమవుతూ ఉంది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 169

షాజహాన్‌పూర్,
30.09.1951

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నీ ఉత్తరాలు అన్నీ చేరాయి. ప్రస్తుతం నీది ఆరోహణ, అవరోహణల స్థితి. మానవుడు ఎంత ఎత్తుకు ఎదిగితే అంతగానే క్రిందకు చూస్తాడు. అవరోహణలో దైన్యం మరియు శూన్యతల స్థితి ఉంటుంది. నిన్ను వెంటాడే ఆలోచనలు నీకు చెందినవి కావు. ఏ ఆలోచనలైతే కలుగుతూ ఉన్నాయో అవి వాతావరణంలోని తేలియాడుతున్న ఆలోచనల యొక్క ప్రకంపనాలు. ఇప్పుడే నీ రెండో ఉత్తరం చేరింది. దానికి విస్తృతమైన జవాబు తర్వాత వ్రాస్తాను. నీ స్థితి, లక్ష్యం యొక్క శిఖరాన్ని చేరటానికి సంకేతంగాను, ఆశ కలిగేదిగాను ఉంది.

అమ్మగార్కి ప్రణామములు అందజేయి. నీ సోదరసోదరీమణులకు ఆశీస్సులు.

నీ శ్రేయోభిలాషి,
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 170

షాజహాన్‌పూర్,
01.11.1951

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

నీకు కుశలము. నేను ఇప్పుడు ఇంతకుక్రితం కంటె బాగున్నాను. సెప్టెంబరు 17వ తేదీతో నీవు వ్రాసిన ఉత్తరానికి జవాబు ఇస్తున్నాను. "జీవిత సమయంలో మోక్షం యొక్క ఆనందం ప్రాప్తిస్తున్నది" అని నీవు వ్రాశావు.

ఈ స్థితి చాలా మంచిది. ఈ స్థితిని చివరికంటూ చేర్పించగలిగితే, అది కూడా దాని గురించి ఏమీ ఎరుకలేనంతగా చేస్తే, దానిని "జీవనమోక్ష దశ" అని చెప్పాల్సి ఉంటుంది. ఇది దానికి ప్రారంభ సూచన. ఇప్పుడు అది ఎంతవరకు వృద్ధి చెందుతుందో! ఇప్పుడు నా అభిప్రాయం ఎలా ఉందంటే, నాకు ఏ స్థానం మీదా పూర్తిగా తృప్తి కలగటంలేదు. అభ్యాసి జీవనమోక్షదశ యొక్క పూర్ణస్థితికి చేరాడు అని అనుకున్నప్పటికీ చేరవలసిన స్థితులు ముందు ఇంకా చాలా ఉన్నాయి. పూజ్య లాలాజీ సాహెబ్ ఒకానొక సందర్భంలో నాకు కొన్ని దృశ్యాలు చూపించారు. నేను ఆశ్చర్యపోయేవాడిని. మరి ఇప్పుడు నాకు ఏమయ్యిందో కాని, నా సంగతే నాకు తెలియటంలేదు. నాకు కేవలం లాలాజీ సాహెబ్ నుంచి అప్పుడప్పుడు నేను అనంతంలో ఈదుతున్న స్పృహ కలుగుతుంది. ఎప్పుడైతే నీ యొక్క గొప్ప శ్రేష్టస్థితులు నీ ఉత్తరాలలో చూస్తూ ఉంటానో అప్పుడు ఈ విషయం జ్ఞాపకం వస్తుంది. అది చూసి నాకు సంతోషం కలుగుతుంది. ఇంకా నిజం చెప్పాల్సివస్తే ఇదంతా నీ శ్రమ ఫలితమేనని అంటాను. నేను నీకోసం ఏమీ శ్రమించలేదు. ఇతరుల గురించి నేను పడిన శ్రమ, అంత సంతృప్తికరమైన ఫలితం చూపించలేదు అంటే నా యోగ్యత ఇంతవరకేనని అనుకుంటాను. ఒకవేళ నీవు ఇదంతా నా సామర్థ్యం యొక్క ఫలితమేనని చెప్తే, మరి వారందరిలో ఇటువంటి స్థితులు ఎందుకు కలగటంలేదు? ఎవ్వరికైనా వారి శ్రమయే ఫలిస్తుంది. (శ్రమనుబట్టే ఫలితం ఉంటుంది) నీవు జీవన్ముక్తస్థితిని పొందినందుకు నాకు సంతోషం. అయితే దాని స్వచ్ఛస్థితి యొక్క సారాంశమే ఆధ్యాత్మిక యొక్క ఎ, బి, సి, డి. నీకు తేలికదనం యొక్క అనుభూతి కూడా కలగటంలేదని నీవు వ్రాశావు. దీనికి సమాధానం ఇంతకుపూర్వమే వ్రాశాను. నీ అస్థిత్వం ఉన్నట్లుగాని, లేనట్లుగాని అనుభూతి కలగటంలేదు అని కూడా నీవు వ్రాశావు. ఇది లయావస్థకు చెందిన అత్యున్నత స్థితి. **అందరికీ ఉన్నతి కలగాలనే కాంక్ష చాలా మంచిది. ఇది ఒక రకమైన సేవ. అభ్యాసి ఎంతగా ఉన్నతి చెందుతూ ఉంటే అంతగాను ఈ భావన (లేదా కాంక్ష) పెరుగుతూ ఉంటుంది.** నా విషయంలో కూడా ఇలాగే ఉంటుంది. మనం వ్యాప్తి చెందుతున్నాం అను భావనకు కారణం, విరాట్‌దేశంలో మన విహారం ప్రారంభం కావటమే. వ్యాప్తి చెందటం అనేది ఇక్కడి నుండే ప్రారంభమవు తుంది. ఇది ఎంత ముందుకు విస్తరించుకుంటూపోతే, ఆ వ్యాప్తి యొక్క స్థితులు కూడా అంతగా మార్పు చెందుతూపోతాయి. ఎందుకైనా మంచిది, నేను ఈ విషయం కూడా వ్రాస్తున్నాను. ఏమంటే, ఈ దశ దానంతట అది కలగనంతవరకు దాని యొక్క భావన నీకు కలగదు. అభ్యాసీ ఈశ్వరీయ దశలో ఉన్నంతవరకు, ఈ వ్యాప్తి యొక్క రూపం (లేదా లక్షణం) మార్పుచెందుతూనే ఉంటుంది. దానిని దాటి వెళ్ళిన తర్వాత, ఇంక ఈ వ్యాప్తి (Expansion) గురించిన జ్ఞానమే లేకపోతుంది. దాని రూపం మరేదో విధంగా ఉంటుంది. అయితే ఇంతవరకు బంధనం ఉన్నట్లే. మనం ఈశ్వరుణ్ని ప్రార్థన ద్వారా పిలుస్తున్నంతవరకూ ఈ బంధనం కొనసాగుతూనే ఉంటుంది. దీనికి ముందుగానే మోక్షం కలుగుతుంది. ఇది మనం అనుకున్నంతగా గొప్ప విషయం ఏమీ కాదు. జీవితాంతం మనం చేసే దైవస్మరణయే మన బంధనానికి కారణమౌతుంది. ఏ సమాజంలోనైనా ఈ మాట చెప్పినట్లయితే, అది నన్ను నాస్తికుడుగా పరిగణించవచ్చు. నేనయితే 'అతడి' నుండి ఒక్క క్షణం కూడా వదలి ఉండలేను కనుక నన్ను నాస్తికుడు అనటం తప్పుగా భావించాలి. అయితే ఈ వ్యాప్తిలో కూడా ఇంకా అసంపూర్ణత ఉంది. నేను ముందుగానే వ్రాయదలచుకోవటంలేదు కాని దానిలో వ్యాప్తి (Expansion), ఇంకొకటి కూడా ఏర్పడవలసి ఉంది.

ఇప్పుడు, అక్టోబర్ 26వ తేదీన వ్రాసిన ఉత్తరానికి జవాబు ఇస్తున్నాను. నీవు ఏకాగ్రత కలిగి ఉన్నందున నీకు తెలియకపోయినా నీ దృష్టి 'మాలిక్' మీదే కేంద్రీకరించి ఉంటుంది కనుక ఎవ్వరైనా గట్టిగా మాట్లాడినట్లయితే ఆ ధ్వని కారణంగా శరీరంలో ప్రకంపనం కలిగి, బాధపడవలసి వస్తుంది. నీవు చూసిన మరియు అనుభూతి చెందిన రక్తపాతం, విధ్వంసం వంటివి భవిష్యత్‌లో జరగబోయే విషయాలు. ఇవి లేకుండా ప్రపంచం ఉద్ధరించబడదు. మూడు, నాలుగు రోజుల క్రితమే నిన్ను ముందు (మకాం) స్థితిలో నిలిపాను. నేను తరచుగా నీకు ఇలాంటి చిన్న

సహాయం చేస్తూ ఉంటాను. నాకు కనిపించిన పరిస్థితి ఏమంటే, ఈ స్థావరం (మజిలి)లో నయితే నీ వ్యాప్తి జరిగిపోయింది. ఈ స్థితి ముందుకు సాగిపోవాలని అనుకుంటోంది కాని పోలేకపోతోంది. అందుకు నేను దానిని కొంచెం నెట్టుతున్నాను.

అమ్మగార్కి ప్రణామములు అందజేయి.

నీ శ్రేయోభిలాషి,
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 171

లఖీంపుర్,
04.11.1951

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసిన ఉత్తరం పూజ్యులు మాస్టర్ సాహెబ్‌గారి ద్వారా అందినది. దానిని చదివి చాలా సంతోషించాను. తమ ఆరోగ్యానికి మేలు చేకూరినందుకు, శ్వాసకు సంబంధించిన ఇబ్బంది తగ్గినందుకు ఈశ్వరునికి అనేక ధన్యవాదాలు. తీవ్రమైన తలనొప్పి కారణంగా తమకు వెంటనే జాబు వ్రాయలేకపోయాను. ఇప్పుడైతే తల తిరగటం మరియు శిరస్సులో పూర్తిగా శూన్యత్వం ఏర్పడిన కారణంగా చాలా వ్యధ చెందుతున్నాను. ఇదివరకులాగానే అది రెండు మూడు రోజుల్లో తొలగి పోవచ్చు. ఈ కారణంగా, 'మాలిక్' అనుగ్రహంతో ముందుకు సాగిపోతున్న అనుభవం కొద్దిగా తెలిసినా గాని దాని సరైన అవగాహన పొందలేక పోయాను. సరే, అలాగున్నా ఏమీ ఫర్వాలేదు. 'అతడు' దయచూపి ముందుకు నెట్టాడు. 'అతడి' ఈ దయకు ధన్యవాదాలర్పించటానికి తగిన మాటలేవీ లేనప్పటికి కూడా, చాలా చాలా ధన్యవాదాలర్పిస్తున్నాను. "నాకు ఏ రకంగాను తృప్తి కలగనపుడు నా ఆలోచనల గురించి ఏమనిచెప్పను!" అని తమరు వ్రాసి ఉన్నారు. అందుకు చాలా చాలా ధన్యవాదాలు తెలుపుతున్నాను. ఈ దీనురాలు ఏ విధంగా, ఎంతగా తమరు తలచిన విధంగా తయారుకాబోదో అప్పటివరకు ఈ తృప్తిని నా దరిచేరనీయవద్దని 'తమరి'ని ప్రార్థిస్తోంది. ఇక ఆధ్యాత్మిక ఉన్నతి గురించి చెప్పాలంటే, 'మాలిక్' యొక్క అపార దయ కారణంగానే మొదలు కావటం ప్రారంభమైంది. దాని పరిపూర్ణంగా పొందాలను తపనాగ్ని జ్వలిస్తూ ఉండాలని, అది మూడు పూవులు ఆరు కాయిలుగా ఉన్నతి చెందుతూ ఉండాలని తమరు నన్ను ఆశీర్వదించండి, అలాగే కనికరించండి. బాబూజీ, ఇక సామర్థ్యం గురించి తమరు వ్రాసిన దానికి జవాబు చెప్పాలంటే, నిజానికి ఆ సామర్థ్యం మరియు ఆయోగ్యతలు రెండింటిని కూడా, ఈ సాధన ప్రారంభించిన రోజు నుంచి మరియు తమరు ఇక్కడికి (కస్తూరిగారి  ఇంటికి) వచ్చిన మొదటిరోజు నుంచే విస్మరించాను. ఇక రెండవ విషయానికి వస్తే, తమరు నా ప్రయత్నాన్ని నిరర్థకం అని వ్రాస్తున్నారు గదా, మరి తమరే గదా "ఓ నా దైవమా, నీ అభీష్టం లేకుండా నీ దర్శనం సాధ్యపడదు" అని నేర్పి ఉన్నారు. "ఏదో ఒక దానితోనే సాధన చేసినట్లయితే అన్నీ సాధ్యపడతాయి, అన్నిటిని పట్టుకుని సాధన చేసినట్లయితే ఏదీ దక్కదు" అని కూడా తమరే చెప్పారు. బాబూజీ, ఇందువలన అసలు సమర్థత లేక శ్రమ (కృషి) అంటే నాకేమీ తెలుస్తాయి. అందుచేత తమరు నాకు ఏ పాఠం చెప్పారో దానినే నేర్చుకోవటానికి ప్రయత్నిస్తున్నాను. ఈ దీనురాలిపట్ల సదా ఇటువంటి దయనే నిలిపి ఉంచినట్లయితే ఈ విషయంలో కూడా సాఫల్యం చెందుతాను. అయితే అల్పమైన ఈ జీవనమోక్ష దశ గురించి నంటారా, అదేముంది! 'మాలిక్' దయ మరియు అభీష్టం ఉండాలేకాని ఇటువంటి కోటానుకోట్ల మోక్ష దశలను కూడా నా 'మాలిక్' కొరకు త్యాగం చేయగలను. బాబూజీ, ఎందుకంటే, నేను 'అతడి'ని మాత్రమే ఎరుగుదును, నాకు 'అతని'తో మాత్రమే అవుసరం ఉంది. ఇప్పుడు ఆత్మిక దశ ఎలా ఉందంటే, "జీవించి ఉంటూనే మోక్షం యొక్క ఆనందం పొందుతున్నాను" అని నేను ఎప్పుడో వ్రాసినటువంటి స్థితి ఇప్పుడు అనుభూతికి రావటంలేదు. అసలు ఆ స్థితిని నేను ఎప్పుడో మరచిపోయాను కూడా. ఆ అనుభూతి ఎటువంటిది, ఎలా ఉంది అనేది కూడా నాకు తెలియకుండాపోయింది. వ్యాప్తి చెందటం అయితే

అనుభవమవుతోంది కాని అది నాకు చెందినదా లేక మరెవ్వరిదైనదా అని తెలియటంలేదు. ఇప్పుడు స్థితి ఒక విధమైన వింతైనదిగా నడుస్తోంది. ఇంకొక ప్రపంచంలోనో లేక పైప్రపంచంలోనో పూర్తిగా వ్యాప్తి చెందిపోయింది అన్నట్లుగా ఉంది, కాని ఈ వ్యాప్తిలోను, ఆ వ్యాప్తిలోను రూపభేదం ఉంది. నిన్న నా స్థితి ఎలా ఉంది అంటె, ముక్తి చెందిన ఆత్మలు ఈదుతున్నట్లుగా అనిపించింది. బహుశా అందులో నేను కూడా ఉన్నట్లనిపించింది. ఇప్పుడు కలుగుతున్న స్థితులు, ఇంతకుపూర్వం కలిగిన స్థితుల కంటె పూర్తిగా భిన్నంగా ఉంటున్నాయి. ఇప్పుడు కలుగుతున్న స్థితులు, పైలోకానికి చెందినవిగా అనిపిస్తున్నాయి. ఏ స్థితులైతే ఇప్పటివరకు ఏర్పడి ఉన్నవో, అవి పైలోకంలో జరుగుతున్నట్లు నాకు అనుభవమవు తున్నదేమోనని అనిపిస్తోంది. ఇప్పటివరకు ఎక్కడ ఉన్నానో, అక్కడివరకు నా వ్యాప్తి కలిగినట్లుగా అనుభూతమవుతోంది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 172

లఖీంపుర్,

10.11.1951

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. ఒక ఉత్తరం తమకు వ్రాసి పంపాను, దానిలో తమ ప్రశ్నకు సమాధానం ఉంది. అది తమకు చేరిందని భావిస్తాను. తమ ఆరోగ్యం ఇప్పుడు కుదుటపడిందని అనుకుంటాను. 'మాలిక్' దయతో కలిగినటువంటి ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

బహుశా ఈ విషయం నేను నా గత ఉత్తరాలలో వ్రాసి ఉంటాను. అది ఏమిటంటే, ఎగువ ప్రపంచంలో పూర్తిగా వ్యాప్తమైపోయినట్లుగాను మరియు ఆ తర్వాత దానితో పరిచయం కలుగుతున్నట్లుగాను అనిపిస్తోంది. అదేమిటో తెలియకున్నది, నాకు షుమారు అన్ని సమయాల్లోను ఆ పైప్రంచంలోనే స్థిరపడినట్లుగా అనిపిస్తోంది. నేను ఇక్కడ అన్ని పనులుచేస్తూ ఉండి కూడా, ఎక్కడో ఉంటున్నట్లుగా ఉంటున్నది. ఎందుకంటే, ఎల్లవేళలా నా స్థితి లేక ఉనికి పైప్రపంచంలోనే ఉన్నట్లుగాను అనిపిస్తోంది. నా ఉనికి యొక్క ఆలోచన ఏదైతే ఉందో అదే 'నేను' లేక 'నాది' అని చెప్పవచ్చు. ఆ విధంగా ఉన్నప్పటికీ, ఒక విధంగా నేను ఆ 'నేను' లేదా 'నాది' అనుదాని నుంచి విముక్తి పొందినప్పుడు, ఎక్కడైతే నేను స్థిరపడ్డానో అక్కడి నుంచి నా దృష్టి సారించబడినంతవరకు, అన్నివైపులా విస్తారమైన, పరిమితిలేని మైదానమే కనిపిస్తోంది. ఇప్పుడు కలుగుతున్నటువంటి స్థితి స్వచ్ఛందమైనది గాను లేదా స్వతంత్రమైనదిగాను అనిపిస్తోంది. రెండు మూడు రోజుల నుంచి తలనొప్పి కారణంగానో లేక స్థితి కారణంగానో ఒక విధమైన నిశ్శబ్ద స్థితిగా అనిపిస్తోంది. అదేమిటో తమకే తెలియాలి.

పూజ్య శ్రీ బాబూజీ! నా ప్రార్థన ఒకటి ఉంది. దానిని కేవలం నాదిగానే భావించి, సాధ్యమైనంతవరకు ఆ ప్రార్థనను జ్ఞాపకం ఉంచుకునేటట్లుగా దయ చూపండి. తమకు జ్ఞాపకం ఉండే ఉంటుంది. అది ఏమిటంటే, తమరు గత సంవత్సరం అమ్మగారితో "ఇంకను ఆరు సంవత్సరాలపాటు ఈ ప్రపంచం వీడి నేను ఎక్కడికీ వెళ్ళనని హామీ ఇస్తున్నాను, అటుమీదట ఈశ్వరునికే తెలియాలి" అని చెప్పారు. నేను చేతులు జోడించి తమరిని ప్రార్థించేది ఏమంటే దయచేసి తమరు ఈ వాక్యాన్ని మరిచిపోకుండా జ్ఞాపకం ఉంచుకోండి.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 173

షాజహాన్‌పుర్,
18.11.1951

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

నీకు కుశలము. నీ ఉత్తరం అందింది. నీవు నీ స్థితిని గురించి వ్రాశావు. అది నీ స్థితిని గురించి వ్రాశావో లేక నా స్థితియా అని నాకు ఆశ్చర్యం కలిగింది. బాగా ఆలోచించినమీదట అది నాలో ఎప్పుడో కలిగినటువంటి స్థితి, అంతర్నిహితమై ఉండి ఇప్పుడు నీలో బహిర్గతమవు తున్నట్లుగా అనిపించింది. నాలో కలిగిన స్థితి ఎక్కడో ఒకచోట (ఎవ్వరో ఒకరిలో) పునరావృతమవుతున్నందుకు భగవంతునికి ధన్యవాదాలు. నీ రోమ రోమముల యొక్క ప్రతి మూలం ఇప్పుడు తెరచుకుంటోంది. దీనినే ఆధిపత్యం పొందటం అంటారు. ఇది అవతారాలలో జరుగుతుంది. అయితే ఈ ఒక్క స్థితి మాత్రమే అవతారాలకు సరిపోదు. ఇది వారికి ఒక స్వల్ప అంశం మాత్రమే. శ్రీకృష్ణ భగవానునికి ఈ విధంగా ప్రతి బిందువు మీద అధికారం ఉంది కాని శ్రీరామచంద్ర మహరాజ్ (అయోధ్య) అవతారమై ఉండి కూడా ఈ ఆధిపత్యం వారిలో లేకపోవటం విచారకరం. ఒకవేళ నేను ఈ రెండు అవతారాలను పరిశీలించినట్లయితే ఆ రెండు అవతారాల మధ్య అపారమైన అంతరం ఉన్నట్లు బోధపడుతుంది. శ్రీరామచంద్ర మహరాజ్ (అయోధ్య)లో సంకల్పం ద్వారా (Will-power) విధ్వంసం సృష్టించగల శక్తి లేదు. శ్రీకృష్ణ మహరాజ్‌లో ఈ శక్తి పరిపూర్ణంగా ఉంది. ఇంకొక ఆశ్చర్యకరమైన విషయం నేను వ్రాస్తున్నదేమంటే, **శ్రీకృష్ణ మహరాజ్‌కు తన శారీరక స్పృహ లేనటువంటి స్థితి కలిగి ఉన్నారు.** కాని శ్రీరామచంద్ర మహరాజ్ (అయోధ్య)లో అది లోపించింది. మనమంతా శ్రీకృష్ణ మహరాజ్‌ను అనుసరిస్తున్నాం కనుక 'అతని' సంబంధంతోనే లయావస్థ రావటానికి ఇదే కారణమవుతుంది. నేను గత ఉత్తరంలో వ్రాసినటువంటి జీవనమోక్ష దశ ఏదైతే ఉందో దాని సారాంశం నీలో కొంత ఏర్పడింది. దాని మూలంగా నీవు మరికొంత పురోగమించావు. ఈశ్వరానుగ్రహం కలిగితే నీవు ఆ స్థితి యొక్క అనుభూతి చెందుతావు. ఒక గ్రంథి (బంధనం) ఉన్నట్లుగా కనిపిస్తోంది. దైవానుగ్రహంతో అది తెగిపోతే ఈ స్థితి కలుగుతుంది. మరి నీ ఈ బంధనాన్ని నా శక్తితో త్రెంచివేయటానికి ఎందుకోగాని నా హృదయం అంగీకరించడంలేదు. ఇంక ఎవరైనా ఉండి ఉంటే నేను ఈ పని పూర్తి చేసే ఉండేవాడను. నీవు నీ సాధన మరియు సంకల్పముల శక్తితో సాగిపోతూ ఉన్నట్లయితే దానితో ఇది తొలగిపోవాలని నేను కోరుకుంటున్నాను. నేను తప్పక సహాయం చేస్తాను. ఇది నా కర్తవ్యం కూడా.

అమ్మగార్కి ప్రణామములు అందజేయి.

నీ శ్రేయోభిలాషి,
రామచంద్ర

## ఉత్తరము సంఖ్య - 174

లఖీంపుర్,
21.11.1951

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. పూజ్యులు మాస్టర్ సాహెబ్‌గారితో, తమరు దయతో వ్రాసి పంపిన లేఖ అందింది. చదివి చాలా ఆనందించాను. తమరి ఆరోగ్య సమాచారం తెలిసి సంతోషం కలిగింది. 'తమరు' ఏదైతే వ్రాశారో అదంతా కేవలం 'తమ' కృప మాత్రమే. అయినా కూడా బాబూజీ, నాకు 'మాలిక్' కావాలి. నేను 'మాలిక్' నుంచి ఇది మాత్రమే తెలుసుకున్నాను. ఇప్పుడు ఉన్న నా స్థితిగాని, 'మాలిక్' కృపతో కలగబోయేదికాని భ్రమ కాదు అని నాకు అనిపిస్తున్నది. అయితే ఇది నా స్థితియో లేక 'మాలిక్' యొక్క స్థితియో తెలియటం లేదు. అవును, అది ఎవరి స్థితియో ఆ భగవంతునికే తెలుసునని చెప్పవచ్చు. అసలు విషయం ఏమిటంటే, స్థితి అయితే తెలుస్తుంది కాని ఆ స్థితి

ఎవ్వరిదో తెలియటంలేదు. శ్రీ బాబూజీ, ఇప్పుడు నాలో ఇటువంటి స్థితి కలుగుతున్నట్లుగా అనుభవమవుతోంది. అది ఎలా ఉంది అంటె, అక్కడ నేనూ లేకుండాపోయాను. ఇప్పటివరకు ఏ 'మాలిక్'ను అయితే ఈశ్వర్ –ఈశ్వర్ అంటూ చెప్పుకుంటూ వస్తున్నానో ఇప్పుడు 'అతడు' కూడా లేకుండాపోయాడు. నేను నిస్సహాయరాలునై పోయాను. ఎందుకంటే, ఇప్పుడు నావంతుగా ఎంతమాత్రం పని జరగటం లేదు. ఈ స్థితి దానంతట అదే కలుగుతూ పోతూ ఉంది. దానిని ఇంకొకరకంగా చెప్పాలంటే, ఏకాగ్రత కూడా మాయమైపోయినట్లుగా అనిపిస్తోంది. దీనిని స్థితి అంటారో లేక భావించటమంటారో కాని ఆత్మ స్వతంత్రంగా ఉండాలనుకుంటున్నది. ఎందుకంటే, ఆలోచన యొక్క ఆలోచన లేక ధ్యానమును నేను నాలోపలనే నిలుపుకుంటూ ఉండేదానను కదా, ఇప్పుడు అది ఆత్మకు ఒక బంధనంలాగా అనిపిస్తోంది; దానిని ఏమని చెప్పవచ్చునంటె ఆత్మ ఆ ఆలోచన లేక ధ్యానం అను బంధనం నుంచి విముక్తమైపోయి ఎక్కడో తన అసలు నివాసంలో ఉండాలనుకుంటోంది. ఆ ఆత్మ కూడా నాదో, మాలిక్‌దో, మరెవ్వరిదో కూడా తెలియటంలేదు. ఇది కేవలం నా స్థితి మాత్రమే కాదు, అందరి స్థితి కూడా ఇదే విధంగా ఉంటుంది. ఇంకా ఏమిటంటే, ఏమాత్రం కూడా భేదభావం లేకుండా సర్వత్రా (అంతటా), అందరిలో కేవలం ఒకే ఒక ఆత్మ సమస్థాయిలో అనుభవమవుతున్నది.

గ్రంథి గురించి కొంత వివరణను తమరు వ్రాసి ఉన్నారు. అయితే, నేను, ఏ 'మాలిక్' కృపతోనైతే జన్మ జన్మాంతరాల యొక్క వేలకొలది బంధనాల నుంచి విముక్తి పొందుతూ వస్తున్నానో, అదే 'మాలిక్' యొక్క కృపతో ఈ గ్రంథి కరిగిపోవటానికి ఎంతో సమయం పట్టదు. **పూజ్య బాబూజీ, శ్రమ మరియు అభ్యాసాలకు సంబంధించినంతవరకు లోపం ఉన్నట్లు సూచించే అవకాశం తమకు దొరకదు. 'మాలిక్' మరియు తమ యొక్క అపారకృపను దృష్టిలో నిలుపుకొని మాత్రమే నేను ఈ ప్రతిజ్ఞ చేయటానికి సాహసిస్తున్నాను.** ఈ ఉత్తరంతోపాటు మరొక చీటి వ్రాసి పంపుతున్నాను. వీలైతే దానిని తమరు ఒంటరిగా ఉన్నప్పుడు చూడండి.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 175

లఖీంపుర్,
09.12.1951

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం ఒకటి తమకు అంది ఉంటుంది. తమ నుంచి జాబు ఏదీ రానందున తమ క్షేమ సమాచారం తెలియలేదు. అందుచేత తామందరి క్షేమ సమాచారం వెంటనే తెలియజేయగలరు. ఈశ్వరుని కృపతో నాలో కలిగిన ఆత్మిక దశను నాకు తెలిసినంతవరకు వ్రాస్తున్నాను.

'మాలిక్' యొక్క కృపతో తమరు తెలిపినది గ్రంథి, మొదలైనవి ఇప్పుడు పూర్తిగా తొలగిపోయాయి, స్థితి తెరచుకొని స్పష్టంగా ఉంది. 'అతని' కృపతో మళ్ళీ నడక ముందుకు సాగుతున్నట్లుగా ఉంది. అందుకు 'అతని'కి అనేక ధన్యవాదాలు. తొమ్మిది, పది రోజుల నుండి నిరంతరాయంగా వీపు భాగమంతటా ఏదో ప్రాకుతున్నట్లుగా ఉంది. ఒక విధమైన గిలిగింత మరియు కంపనం లేదా అదరటం వంటిది ఉంటూనే తరచుగా వీపు అంతా తెరచుకుని గుంట లాంటిది (Hollowness) ఏర్పడినట్లుగా అనిపిస్తోంది. అదే విధంగా అప్పుడప్పుడు ఛాతీ ముందు భాగం, నుదుట మీద, శిరస్సులోను మరియు శరీరం యొక్క ఏ భాగంలోనైనా కాని ఇదే విషయం అనుభవమవుతూ ఉంది. పూజ్య శ్రీ బాబూజీ! నాలో అచంచలంగా ఉన్నటువంటి ఏకాగ్రత కూడా తొలగిపోయి లేదా కరిగిపోయి కట్టతెగి సమానంగా ప్రవహించి పోతున్నట్లుగా ఉంది, కాని అదేమిటో నాకు తెలియటంలేదు. నా ప్రయత్నాలు ఏమీ

ఫలించటం లేదు, అలా ఎందుకో తెలియటంలేదు. శ్రీ బాబూజీ, ఇప్పుడింక ఉన్నది ఏమిటో ఉంది, అంతా అది దైవేచ్ఛగానే భావిస్తాను. ఇంకొక విషయం, అదేమిటో దైవానికే తెలియాలి; అప్పుడప్పుడు మృత ఆత్మలు (మరణించిన వారి ఆత్మలు) తరచుగా నా ఎదుట తారస పడుతున్నట్లుగా ఉన్నాయి, అవి శాంతంగానే ఉన్నాయి. నిద్రలో ఉన్నటువంటి చైతన్యస్థితి (లేదా జాగ్రదావస్థ)లో కూడా అవి తరచుగా కనిపిస్తున్నాయి. అవి ఉన్నతాత్మలు మాత్రమే అయి ఉండవచ్చు. ఇప్పుడు ఎందుకో తెలియదుకాని, నాకు ఇప్పుడు పగలు, రాత్రి యొక్క అవసరమే లేకుండా పోయింది. ఇప్పుడు నా స్థితినిబట్టి అది (పగలు, రేయి) నాకు నిర్దేశించ బడలేదని అనిపిస్తోంది. ఋతువుల విషయంలో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. దీనిని ఒక విధంగా చెప్పాలంటే, 'మాలిక్' యొక్క దయ నన్ను రేయింబవళ్ళు మరియు ఋతువుల యొక్క అనుభూతి నుంచి కూడా విముక్తి కల్పించినట్లుగా అనిపిస్తోంది. ఇది ఇలా ఉన్నప్పటికీ నాలో ఏమైనా 'నా' లేదా 'తన' అను భావం (Self) పెరిగిందా, లేక మరి ఏమైనదో, తమరు దయచేసి పరిశీలించండి. బాబూజీ, ఇప్పుడు స్థితి ప్రత్యేకమైన రూపంలో ఉంది. దాని స్వరూపం పూర్తిగా అనుభూతి చెందాక వ్రాస్తాను. అయితే ఇప్పుడు ఇంకొక విషయం ఏమిటంటే, అప్పుడప్పుడు వింతైన వివిధ రకాల శక్తులు నాలో అనుభవమవుతున్నాయి, కాని నా దృష్టి అటు మరలటంలేదు.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు. అమ్మ తమకు ఆశీర్వాదాలు తెలుపుతోంది.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 176

లఖీంపుర్,

11.12.1951

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నేను ఇంతకుక్రితమే ఒక ఉత్తరం వ్రాసాను. ఈరోజు మరొకటి వ్రాస్తున్నాను. అనుకోకుండా ఆ ఉత్తరం కూడా ఇంకా ఇక్కడే ఉంది. ఇప్పుడు రెండు ఉత్తరాలు ఒకేసారి తమకు చేరతాయి. ఈ నెల 8వ తారీఖు నుండి ఇప్పటివరకు ఏ స్థితినయితే అనుభవానికి వచ్చిందో దానిని వ్రాస్తున్నాను. 'తమ' ఆరోగ్యం ఇప్పుడు కుదుటపడిందని ఆశిస్తాను. పూజ్య శ్రీ బాబూజీ! దయచేసి నా బాగోగులు చూడండి. నిస్సందేహంగా 'మాలిక్' సర్వదా నా 'మాలిక్'యే. 'అతడు' సర్వదా నా మంచిచెడులు చూసియే ఉన్నాడు, చూస్తూ ఉన్నాడు, ఇంకా చూస్తాడు కూడా. బాబూజీ, ఇప్పుడు ఉన్న స్థితి ఏమిటంటే, ఏ విధంగానైతే ఇదివరకు బాహ్యనేత్రాలు 'మాలిక్' ధ్యానంలో ఎప్పుడూ కూడా హృదయాన్ని హత్తుకొని ఉండేవో, అలాగే ఇప్పుడు ఆంతరిక దృష్టి 'మాలిక్' ధ్యానంలో నిలిచి ఉంటోంది, కాని ఇప్పుడు ఆ ఆంతరిక దృష్టి కూడా లేకుండాపోయింది. ఒకవేళ ప్రయత్నం చేసినట్లయితే హృదయం చాలా గాబరాపడుతోంది. అందువలన ఇప్పుడు దానికి కూడా స్వస్తి పలికినట్లయింది. నాకు అర్థం కానటువంటి విషయం ఇంకొకటి ఏమిటంటే, రోజులు ఎలా గడచిపోతున్నాయో అలాగే బహుశా 'మాలిక్'కు దూరంగా బహుదూరంగా జరిగిపోయినట్లుగా అనిపిస్తోంది. ఈ స్థితి ఇంకను ఎలా ఉందంటే, నా వద్దగాని లేదా దూరంగానైనా గాని 'మాలిక్' జాడ లేకుండా పోయినట్లయ్యింది. ఇప్పుడింక పూర్తిగా నిర్మల మైదానం మాత్రమే ఉండిపోయింది. ఇంకొక విశేషం ఏమిటంటే, ఆ విధంగా ఉన్నప్పటికీ ఎటువంటి దిగులు ఉండటం లేదు. దైవేచ్ఛ ఎలా ఉంటే అలా ఉండనీయండి. ఇంకొక అద్భుతం ఏమిటంటే, 'అతడి'ని సమీపంలోగాని, దూరంగా గాని ఉన్న అనుభూతి చెందటానికి ప్రయత్నం చేసినట్లయితే అదేమిటో దైవానికి తెలియాలి, వెంటనే నాకు ఊపిరిసలపకుండా ఉంటోంది. అందువలన ప్రయత్నించటం వంటివి కూడా మానివేశాను. ఇప్పుడు చెప్పాలంటే, ఏమీ లేకపోయిన ఆ మైదానమే 'మాలిక్', కనుక 'నాది'–'నేను'

(Self) అను తత్వం అధికమవుతున్నదేమోనని చింత కలుగుతోంది. ఎందుకంటే, ఇప్పుడు లయ–అవస్థ అనేది ఆలోచనలోకి కూడా రావటంలేదు, మరి నేను ఏం చేయాలి! అది తమకు, తమ నిర్వాకానికి తెలియాలి. కనుక ఆ విషయం ఏమిటో తమరే చూడాలి. వీపుమీద ఉన్న గతచర్య ఇంకనూ మిగిలి ఉంది. అప్పుడప్పుడు ఒక స్థితి అనుభవానికి వస్తూ ఉన్నది. అది పూర్తిగా పూజాదికాలు లేనటువంటిదిగాను, ఆనందం ఉండటం, అది లేకపోవటం వంటిది ఏమీ లేనట్లుగాను, ఒక విధమైన చెడ్డ అనుభవం కలుగుతోంది. ఆ స్థితిని గురించి నేను ఇప్పుడే ఏమీ ఖచ్చితంగా వివరించలేను. పూజ్య శ్రీ బాబూజీ! ఇప్పుడు నాలో విశిష్టమైన స్థితి ఏమీ తెలియటంలేదు. అయినప్పటికి దిగజారటం వంటిది నా దరిజేరలేదు. దయచేసి ఇప్పుడు నేను ఏమి చేయాలో వ్రాయండి. ఏమీ తోచకపోయిన కారణంగా ఏడ్పు వస్తోంది. ఏ విధమైనటువంటి సాధన నా దృష్టికి రావటం లేదు. అది తమకే తెలియాలి. 'మాలిక్' యొక్క ఇచ్ఛ ఎలా ఉంటే అలాగే ఉంటాను.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 177

లఖీంపుర్,

18.12.1951

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుంది. చాలా రోజుల నుంచి తమ ఆరోగ్య పరిస్థితిని గురించిన సమాచారం తెలియలేదు. నిన్న పూజ్య తావూజీ నుంచి తమరు 'కుకరా' వెళ్ళుతున్నట్లుగా తెలిసింది. దానితోపాటు తమరు ఆరోగ్యంగా ఉన్నారని తెలిసి సంతోషం కలిగింది. ఇప్పుడు 'మాలిక్' దయతో నా ఆధ్యాత్మిక దశను గురించి నాకు అనుభవమైనదానిని వ్రాస్తున్నాను.

ఈ స్థితి ఏమిటో దైవానికే తెలియాలిగాని, లయ–అవస్థ దశను గురించిన జ్ఞానం, అసలు అది ఎలా జరుగుతుంది అనేది లేకుండాపోయింది. జ్ఞాపకం చేసుకుందామని అనుకున్నా జ్ఞాపకం రావటంలేదు. 'మాలిక్' జ్ఞాపకం విషయంలో ఎలా ఉందంటే, 'అతని' గురించిన ఆలోచన యొక్క ఆలోచనకు కూడా దూరమైపోయాను. దీనినే మరోరకంగా చెప్పాలంటే, 'అతని' జ్ఞాపకం మరియు నన్ను (Self) గురించిన జ్ఞాపకం కూడా ఆలోచన అను బంధం నుంచి స్వతంత్రమైపోయినట్లుగా ఉంది. ఇంకొక స్థితి ఏమిటంటే, ఇంతకుపూర్వం ప్రతిపని అనాలోచితంగానే జరిగిపోతూ ఉండేది, అవి నాకు పట్టేవికావు కాని ఇప్పుడైతే ఆ అనాలోచితం అనుబడు దాని నుంచి కూడా 'మాలిక్' నాకు విముక్తి కల్పించినట్లుగా అనిపిస్తోంది. ఆ స్థితిని ఎంతగా మరచిపోయాను అంటె, ఆలోచించినప్పటికి కూడా అది దృష్టికి రావటంలేదు. ఇంకా చెప్పాలంటే, ఆ దశ కూడా ఆలోచన అను బంధం నుంచి పూర్తిగా స్వతంత్రమైపోయినట్లుగా ఉంది. బాబూజీ! ఇప్పుడు ఉన్న స్థితి ఎంత స్వతంత్రమైనదిగా ఉన్నది అంటె, అప్పుడప్పుడు నాలో నాది అను తత్వం అధికం కావటంలేదు కదా అని తెలుసుకుంటున్నాను. నా ధ్యాస అప్పుడప్పుడు 'మాలిక్'పట్ల కాకుండా ప్రాపంచికమైన ఆలోచనల్లో ఎక్కువగా నిమగ్నమైపోయిందా అను భ్రమ కలుగుతోంది. ఏమైనా సరే, అలా కావటానికి వీలులేదు, ఎందుకంటే "సంరక్షించువాడు దైవమై ఉండగా ఎవ్వరూ చంపలేరు." నిజం చెప్పాలంటే, ఇప్పుడు ఏ దశ కూడా నా వశంలో లేనట్లుగా అనిపిస్తోంది. అందుచేత బహుశా 'మాలిక్' నాకు వాటి నుంచి స్వతంత్రత కల్పించాడని అనిపిస్తోంది. ఇప్పటివరకు వినవస్తున్న సూక్తి– **"ఆత్మ స్వతంత్రమైనది (నాశనం లేనిది), దానిని కత్తి ఖండించలేదు, వాయువు దానిని ఎండించలేదు, నీరు దానిని తడపలేదు"** – నిజమే అనిపిస్తుంది. 'మాలిక్' దయతో బహుశా నేను

ఆ స్థితి యొక్క ఆనందాన్ని పొందుతున్నాను, అది తమకు తెలుసు. వీపు యొక్క పరిస్థితి అలాగే ఉంది. ఇప్పుడు, లోపల అంతా పూర్తిగా తెరచుకుపోయినట్లుగాను, బయట ఇంకను మిగిలి ఉన్నట్లుగాను అనుభవమవుతోంది. అది కూడా త్వరలో స్వచ్ఛపడుతుంది. శరీర మంతటిలోను ప్రతిభాగం కూడా తెరచుకోనంతవరకు (వికాసం చెందనంతవరకు) విశ్రమించబోను అని అనిపిస్తోంది.

తమకు అమ్మగారు ఆశీర్వాదాలు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 178

లఖీంపుర్,
27.12.1951

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం, స్వీకరించండి. నా ఉత్తరం అంది ఉంటుంది. 'తమరు' ఆరోగ్యంగా ఉ న్నారని ఆశిస్తాను. ఈ రోజంతా చెవులు 'పండిట్‌జీ' అను శబ్దం వినడానికి సత్యాగ్రహం చేస్తున్నాయి. కాళ్ళు మరల మరల ఆఫీసువైపు పరుగులు తీయటానికి ఆతృతపడుతున్నాయి. చేతులు స్వయంగా జోడించుకుని తమ ఐకమత్యాన్ని చాటుతున్నాయి. పరమ సౌమ్యం (అనగా సాధుత్వం) మరియు సుమనోహర ముఖదర్శనానికి నయనాలు ఉవ్విళ్ళూరుతున్నాయి, కనురెప్పలు తివాచీలులాగా పరుచుకని తమ ప్రియతముని స్వాగతించటంలో నిమగ్నమైపోయాయి. కాని ఇప్పుడు రాత్రి వచ్చేసింది. తమరు విచ్చేసే సమయం దాటిపోయింది. అందువలన ఈ ఉత్తరం వ్రాస్తున్నాను. అది అలా ఉంచండి. ప్రూఫులు చూడవలసి ఉండటం వలన మరియు బలహీనత కారణంగా తమరు రాలేకపోయారని అనిపిస్తోంది. మా నిట్టూర్పులు లేదా ఆవులింతల వేడి, తమ ఊపిరికి ఎక్కువ విశ్రాంతి కలిగించకపోయి ఉండటం కూడా కారణం కావచ్చు. తమరు ఎక్కడ ఉన్నప్పటికీ, నావారేనని, నా వారుగానే ఉంటారనీ నాకు విశ్వాసం ఉంది. ఇప్పుడింక "బసంత్ పంచమి" దగ్గరపడింది, కనుక అప్పుడు తమ దర్శనం తప్పక కలుగుతుంది.

నా శ్రీ బాబూజీ! ఇప్పుడు మరణంలాంటి స్థితియే అన్నివైపులా నెలకొని ఉంది. ఇంకా ఎలా ఉంది అంటె, ఈ దశలో నుంచి సుగంధ సమ్మోహనం తొలగిపోయినట్లుగా ఉంది. ఉదాసీనత అయితే లేదు, దశ శూన్యంలోకి అంతర్ధానమైపోతున్నట్లుగాను అనిపించటంలేదు. ఇంక స్పృహ కలిగి ఉండటం, లేకపోవటం గురించి ఏమి చెప్పాలి. దశ వస్తూ పోతూ ఉంది. ఇలా ఉండగా ఇంక స్పృహ ఉండటం, లేకపోవటం గురించి చెప్పటానికి ఏముంటుంది. ఎందుకంటే, హృదయం ఎక్కడో మునిగి తేలుతూ ఉంటోంది, కాని పొందేది ఏమీ ఉండటం లేదు. ఇంకొక దశ ఏమిటంటే, హృదయం మీద వ్రాసినది అంటూ ఏమీ లేనప్పుడు ఇంక చదవటానికి ఏముంటుంది? (హృదయంలో ఏ స్థితీ అనుభూతికి రావడంలేదు.) నా బాబూజీ! నా అనుబంధం యొక్క తాడులో ఏమైనా లోపంకాని, గట్టిదనం లేకపోవటంగాని ఉండి ఉంటుందా? లేశ మాత్రమైనా (రవ్వంతైనా) ఆశలేకపోయినప్పటికీ, స్వయంగా మనస్సు యొక్క స్థితి ఏమిటో తెలియదుగాని, మనస్సు మాత్రం అంతటా ఉంది, కాని ఎక్కడా లేదు కనుక ఎక్కడా లేదన్నట్లుగా నేను గ్రహిస్తున్నాను. అయినా కూడా ఎక్కడో మిగిలి ఉండే అవకాశం ఉండి ఉంటుంది, ఒకవేళ ఉంటే అదే అనగా మనసే. ఈ దశ ఎలా ఉందంటే, దాని (మనస్సు) రూపం లేకపోగా రంగు కూడా కరిగిపోయింది. బాబూజీ, ఇప్పుడు ఉన్న దశను గురించి చెప్పాలంటే, ఆరిపోతున్న దీపం యొక్క కాంతి ఒక్కసారిగా కాంతివంతమై మళ్ళీ మిణుకు మిణుకుమంటున్న దానిలాగా ఉంటున్నది. దానిని సరిచేయాల్సినది తమరే. నేను ఎలా ఉన్నానో ప్రత్యక్షంగా తమ ఎదుటనే కనిపిస్తున్నాను. నా దశ ఏమిటంటే, నేను ఒకప్పుడు పతనమైపోలేదు, మరొకప్పుడు బాగుండలేదు అన్నట్లుగా ఉంది.

నా ఆరోగ్యస్థితిని గురించి వివరించలేదు. ఎందుకంటే, నేను బాగానే ఉన్నాను కదా! మరైతే తావూజీ నా సంగతి తమకు తెలుపుతారు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు, కేసర్ మరియు బిట్టో తమకు ప్రణామాలు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 179

లఖీంపుర్,
29.12.1951

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం ఒకటి తమకు చేరి ఉండవచ్చు. పూజ్య మాస్టర్ సాహెబ్‌గారి ద్వారా అక్కడి సమాచారం తెలిసింది. తమ ఆరోగ్యం బాగుపడిందని తెలిసి సంతోషం కలిగింది. పూజ్య శ్రీ బాబూజీ! తమ ఉబ్బసం యొక్క కష్టం తమకు ఎన్నడు కూడా కష్టం కలిగించకూడదని నా హృదయపూర్వక కోర్కెగా ఉన్నది. ఆదేశాన్ని పూర్తిగా పాటించటంలో ఒక్క క్షణం కూడా గురితప్పను కాని అలా ఉన్నప్పటికీ 'మాలిక్' సహాయం లేకుండా పని జరగకపోవటం నేను గమనిస్తున్నాను. తమరు దీర్ఘాయువుగా ఉండేటట్లుగాను, కడుపుకు సంబంధించిన అల్పమైన కష్టం మినహాయించి తదితర ఎటువంటి కష్టం (ఉబ్బసం వగైరా) కలగకుండా ఉండునట్లుగా ఈశ్వరుడు అనుగ్రహించాలి. అదంతా 'మాలిక్' ఇష్టం మీద ఆధారపడి ఉంటుంది. ఇప్పుడింక ఈ నెల 23వ తారీఖు నుంచి నా స్థితిని గురించి వ్రాస్తున్నాను. అది ఎలాంటిదంటే, నాలోను, నా దృష్టి సారించబడినంతవరకు సమస్త మానవులలోనేగాక నా ఎదుట ప్రత్యక్షంగా కనిపిస్తున్నవాటి అన్నింటిలోను భౌతికత అంతా తొలగిపోయినట్లుగా అనిపించింది. భౌతికతకు బదులుగా కేవలం వాస్తవికత (రియాలిటీ) యొక్క స్థితి మాత్రమే అనుభవమవుతోంది. ఈ స్థితి ఎటువంటిదంటే, మాటలకు సాధ్యపడనిది. కాని అప్పుడప్పుడు ఎటువంటి స్థితి కలుగుతుందంటే, బహుశా తమరు ఒకసారి వ్రాసినట్లుగా "ఏమీ లేని దాని లోతులో కూడా ఏదో తప్పనిసరిగా ఉంటుంది" అన్నట్లుగానే ఇది కూడా ఉంటుంది. ఇంకొక విషయం ఏమిటంటే, నిద్రిస్తున్నపుడుగాని, మేల్కొని ఉన్నప్పుడుగాని, ఎప్పుడు కూడా చైతన్యమే ఉన్నట్లుగా అనిపిస్తోంది. నేను ఇదివరలో వ్రాసిన విధంగా- అనగా నేను పైప్రపంచంలోనే స్థిరపడిపోయినట్లుగాను, అక్కడి స్థితిలోనే ఉంటున్నట్లుగాను ఉంది అని ఏమి చెప్పానో ఇక్కడ కూడా అలాగే ఉంది. అక్కడ కూడా చైతన్యదశలో నేను స్థిరపడినట్లుగా గ్రహించుతున్నాను. ఇది నిద్రలో ఉన్నప్పటి స్థితియే అనగా నిద్రలో కూడా చైతన్యావస్థతోనే నేను ఉన్నట్లుగా అనుభూతి చెందుతున్నాను. ఈ కారణంగానే, రేయింబవలుగాని, నిద్రలో లేదా మెలకువలోగాని నా నిత్యజీవితంలో ఎటువంటి ప్రాముఖ్యత లేకుండాపోయింది. అనగా అన్నీ కూడా సమానరూపంలో వచ్చి పోతూ ఉన్నాయి. అలా ఎందుకో తెలియదు కాని, ఇప్పుడు నాకు వీటితో విశేషమైన అవుసరం ఉన్నట్లుగా కూడా అనిపించటంలేదు. బాబూజీ, అది ఎటువంటి ప్రత్యేకమైన స్థితి అంటె, దానిలో ఆలోచనకు కూడా అవకాశం లేకుండాపోయింది. 26వ తారీఖున సాయంత్రం ఆరున్నర గంటలకు కేసర్‌చేత పూజ చేయిస్తుండగా, ఎదుట తెలుపు రంగులో మూడు పొరలు, దిండు గలీబులాంటివి కనిపించాయి, అవి విడిపోయి ఎగిరి పోయాయి. అప్పుడే నాకు 'ఉన్నతి' పురోగమనం చెందుతున్నట్లుగా అర్థమయ్యింది. నాకు, మొదట కేసర్ ఇప్పుడు పురోగమనం చెందుతోంది అనీ, దానితో ఆమెకు కొంత లాభం చేకూరిందని ఆలోచన కలిగింది కాని తర్వాత అది నా స్థితిగా అనిపించసాగింది. నాలో కూడా ఏదో మార్పు జరిగినట్లుగా అనిపించింది. తేలికదనంతోపాటు ఆంతరిక ఆనందం కూడా బాగా అనుభవమయ్యింది. ఇంక అదేమిటో తమకు తెలియాలి. అయితే ఇంకా చూడండి బాబూజీ! 4,5 రోజుల నుండి స్థితి బాగా (స్వచ్ఛంగా) నడవటం లేదు. నిద్రలో కూడా ఆలోచనలు ఎక్కువగానే వస్తున్నాయి. ప్రయత్నమైతే

చేస్తున్నానుగాని, తెలుసుకోలేకపోతున్నాను .

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 180

లఖీంపుర్,
02.01.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తావూజీ తిరిగి వస్తారని ఎదురుచూస్తూ లేఖ వ్రాయకుండా ఉండలేకపోతున్నాను, అందువలన వ్రాస్తున్నాను. తమ ఆరోగ్యం ఇప్పుడు బాగున్నదని ఆశిస్తున్నాను. నిన్న ఎందుకో తెలియదు కాని, 'అతని'ని కలుసుకోవాలను తపన బాగా పెరిగిపోయింది, కాని సాయంత్రానికి నా సోదరి రావటంతో ఇంటి పనుల కారణంగా కొంత తపన తగ్గిపోయింది. 'మాలిక్' కృపతో కలిగినటువంటి ఆత్మిక దశను వివరిస్తున్నాను.

ఇప్పుడు ఉన్న స్థితినిబట్టి 'మాలిక్' యొక్క రోమ రోమంలోను, నరనరాల్లోను నా ఉనికిని చూస్తున్నాను. పూజ్య శ్రీ బాబూజీ! ఇప్పుడు ఉన్న దశ ఏమిటంటే, ఇంతకు ముందైతే, 'అతని' జ్ఞాపకం వచ్చినపుడు, ఒక్కసారిగా గుండె పట్టుకోవటం ద్వారా కొంత ఊరట లభించినట్లయ్యేది కాని ఇప్పుడు, బహుశా హృదయాన్ని చీల్చుకుని బయటకు దూసుకుపోతున్నట్లుగా ఉంది, ఎందుకంటే ఇప్పుడింక గుండె ఒత్తిపట్టుకున్నా కూడా ఏమీ ఫలితం ఉండటంలేదు. నా లోపల ఏమి జరుగుతున్నదో ఆ దైవానికే తెలియాలి. అయితే ఉప్పొంగిపోవటమైతే లేదు కనుక లోపల ఏమి జరుగుతున్నప్పటికి హృదయం భీతిల్లటంలేదు సరికదా అది నేను ముందుకు సాగిపోవటానికి ఆసరాగా అయ్యింది. నా శ్రీ బాబూజీ! ఇప్పుడు 'అతడు' నాలో ఉన్నాడా, నేను 'అతని'లో ఉన్నానో లేదో కూడా తెలియడంలేదు. ఎందుకో తెలియదు కాని, నాకు ఇప్పుడు 'అతని' జ్ఞాపకం రావటంలేదు, అయినా కాని ఏ స్థితిలో ఉంటున్నానో దానితోనే సంతృప్తి చెందుతున్నాను. నాకు ఇప్పుడు 'దివ్యత్వం' అనే సముద్రంలో మునుగుతున్నట్లుగాని, మరేమైనాగాని అనిపించటంలేదు. 'మాలిక్'లో శ్రద్ధ (భక్తి) విశ్వాసం మరియు ప్రేమల పరిశుద్ధరూపాలు ఇప్పుడు ఆరంభమైపోయినట్లుగా అనిపిస్తోంది. నాకు వీటిని గురించి ఏమీ తెలియదు. పూజ్య శ్రీ బాబూజీ! నేనైతే ఇప్పుడు ప్రతి వస్తువుతోనూ సంబంధం లేనట్లుగా ఖాళీగా అయిపోయి, నాలో ఏమీ లేనట్లుగా అనుభవమవుతోంది. అయితే ప్రపంచంలోని జనులందరూ ఎంత సాధారణంగా ఉంటున్నారో నేను కూడా అలాగే ఉంటున్నట్లుగా అనిపిస్తోంది. బహుశా తేడా ఏమై ఉండవచ్చునంటె నాలో ఇప్పుడు ఏ బరువూ (భారం) భరించటానికి స్థానం లేకుండాపోవటమే. బాబూజీ! అసలు నేనేమి కోరుకుంటున్నానో తెలియటంలేదు. నేనేమి చేస్తున్నానో, నేను ఎక్కడ ఉంటున్నానో అంతా దైవానికే తెలియాలి.

ఇప్పుడు అక్కడికి (బసంత్ పంచమికి) రావటానికి సమయం దగ్గరపడుతోంది. శ్రీ బాబూజీ! ఇప్పుడు నా స్థితి ఎలా ఉందంటే, జనులందరితోపాటుగా నేనూ ఒక సాధారణ వ్యక్తిగా, సత్సంగీయు లందరిలోను నేనూ ఒక సత్సంగీయురాలినిగాను అనుభూతి చెందుతున్నానే గాని నాకు నేను ప్రత్యేకంగా ఏమీలేను. నేను ఎలా ఉంటున్నానో దైవానికే తెలియాలి, బహుశా ఏమీ లేదనుకుంటాను.

'అమ్మ'గారు తమకు ఆశీర్వాదాలు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

# ఉత్తరం సంఖ్య - 181

షాజహాన్‌పుర్,

15.01.1952

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

నీకు కుశలము. నీ రెండు ఉత్తరాలు అందాయి. నీవు వ్రాసిన స్థితులన్నీ కూడా లయావస్థ యొక్క ఆశీస్సులు. ఎవరి లయావస్థ ఎంత బాగుంటుందో అంతగా సత్ఫలితాన్ని ఇస్తుంది. ఇది అత్యంత ప్రేమవల్లను, నిరంతర స్మరణవల్లను కలుగుతుంది. దీనికి తగిన విధానాలు ఇంకను ఉన్నప్పటికీ వాటిని విడమర్చి చెప్పటం నాకు అంతమంచిదిగా అనిపించటంలేదు. చాలా సంవత్సరాలుగా కేవలం ఒక్కరిద్దరు అభ్యాసులకు చెప్పటం జరిగింది కాని వారిలో ఒక్కరు మాత్రమే ఎంతోకొంత సాధన చేస్తున్నారు. ఇది ఎటువంటిది అంటే, దానిని గురించి ముందస్తుగా తెలియజేయకుండానే అభ్యాసిలో దానంతట అది అనుభవానికి రావాలి. బహుశా లాలాజీ సాహెబ్ దీనిని ఎవ్వరికీ చెప్పి ఉండకపోవచ్చు కాని దానిని గ్రహించి, అనుసరించి, పరిశ్రమించినవారు ఉన్నారు. మన దగ్గర ఉన్న పరిస్థితి ఎటువంటిదంటే, ఎవ్వరికైనా కొంత సంకేతం ఇచ్చినప్పటికీ దానిని ఎవ్వరూ పసికట్టలేకపోతున్నారు. గత బసంత్ పంచమి ఉత్సవ సందర్భంలో నేను ఒక వ్యాసం వ్రాశాను. దాని యొక్క తాత్పర్యం ఇదే. అయితే దానిని విన్నవారు సంవత్సరం గడచిపోతున్నప్పటికీ, జ్ఞాపకం చేసుకున్న వారు లేరు. నిజం చెప్పాలంటే, మనం దానిని బలవంతంగా రుద్దుతున్నామే కాని ఏ ఒక్కరిద్దరికి మాత్రమే శ్రద్ధ కలుగుతుంది. ఎవరైనా ఏదైనా వారి సామర్థ్యాన్నిబట్టి పొందుతారు. ఇప్పటివరకు అభ్యాసులలో లయావస్థ కూడా కలగలేదు. ఆ లయావస్థ కలగకుండా జీవితంలో ఫనాయియత్ అనగా లయావస్థ యొక్క లయ సాధ్యపడదు అని లాలాజీ సాహెబ్ తమ మహాసమాధికి కొద్దిరోజుల క్రితం నాతో ఈ విషయమే చెప్పారు. **ఇప్పుడు మీ కుటుంబంలో ఈ లయ-అవస్థ ఎందుకు పుష్కలంగా ఉంటోంది? దానికి కారణం, ఈశ్వరుని కృపవలన ఈ లయ-అవస్థ మన అభ్యాసులందరిలో కంటె నీలో మంచి స్థితిలో ఉండటమేనని చెప్పాలి.** నీ తర్వాత స్థానం కేసర్‌ది. అది మిగిలినవారిలో ఒక్కరిలో మాత్రమే రూపాయలో ఒక అణా లేదా రెండణాల పరిమాణంలో ఉంది. (గతంలో రూపాయికి 16 అణాలు ఉండేవి) ఒకవేళ అది (లయావస్థ) ఇంక ఎవరిలోనైన ఉండి ఉంటే ఒక కాని లేక దమ్మిడి వంతు మాత్రమే అయి ఉండవచ్చు. (గతంలో రూపాయికి 64 కానులు, 192 దమ్మిడీలు) ఇప్పటివరకు మిగతా వారందరిలోను అది శూన్యమే. ఇకమీదట ఈశ్వరుడు ఎవ్వరికైనా అనుగ్రహించవచ్చు. 'అతడే' 'మాలిక్', సర్వాధిపతి కనుక. నేటి కాలంలో బ్రహ్మవిద్యను అభ్యసించదలచినవారు కూడా అరుదుగా ఉండటంతో ఆ శిక్షణ (బ్రహ్మవిద్య) తగ్గిపోవటానికి కారణమైంది. మన దగ్గర ఉన్న ఈ రకమైన విద్యపైన విశ్వాసంలేక జనం దీనిని కాంచలేక పోతున్నారు. **మీ కుటుంబీకులకు నాపట్ల చాలా ప్రేమ ఉన్న కారణంగా కూడా బాగా లబ్ధి పొందుతున్నారు.** మరింక ఎవరిలో ఈ ప్రేమ ఉంటే వారికి కూడా లబ్ధి కలుగుతుంది.

నీ స్థితిని గురించి నేను ఏమి వ్రాయాలి? భగవంతునికి ధన్యవాదాలు. ఇటువంటి స్థితుల గురించి, అవి వ్యక్తి యొక్క పరిశ్రమతో దక్కేవికావని, దైవానుగ్రహంతో మాత్రమే దక్కుతాయని మన 'లాలాజీ' చెప్తూ ఉండేవారు. ఇప్పుడు నీలో కలిగినటువంటి స్థితిని, ఈశ్వరీయస్థితి అని నేను నిర్వచిస్తాను, కాని చేరుకోవలసినట్టి స్థితి ఇంకా చాలా దూరంగా ఉంది. దైవం దానిని కూడా అనుగ్రహిస్తాడు. ముఖ్యమైన విషయం ఏమిటంటే, భగవదానుగ్రహం లేకుండా ఈ స్థితికి చేరటం దుర్లభం. ఒకవేళ ఎవరైనా ఈ స్థితికి చేరగలిగినప్పటికీ, అతడు దానినే పరిపూర్ణమని భావిస్తాడు. ఆ స్థితి, వాస్తవికమైన స్థితి ఏదైతే ఉందో అది ఇక్కడి నుండి ఆరంభం కాదు కూడ. ఇంకొక స్థితి కూడా ఉంది. అది ఏమిటంటే, ఒకవేళ అభ్యాసి అక్కడకు చేరాలని సాహసించినప్పటికీ లేదా చేరగలిగినప్పటికీ తన కృషితో ఇంకా ముందుకు పోవటమనేది కష్టతరమే కాదు అసంభవం కూడ. ఎందువల్లనంటే, పైనుండి ప్రపంచంవైపుగా కేంద్రీకరించబడిన దివ్యశక్తి ఏదైతే ఉందో దానిని ఛేదించటం (దానిలోకి ప్రవేశించటం) చాలా దుర్లభమవుతుంది.

ఆ శక్తిపై ఆధిపత్యం కలిగిన గురువు ఎవ్వరైనా ఉండి ఉంటే, అతడు ఆ అభ్యాసిని దానిపై నుంచి దుమికించగలడు. ఒక మానవుడు ఏ స్థాయివరకు చేరగలడో ఆ స్థాయి వరకు తమ జీవితకాలంలోనే చేరగలిగిన 'లాలాజీ' యొక్క ఆశీస్సులు మన సంస్థలోని వారికి సమకూరుతున్నాయి. ఇప్పుడు వారు హద్దులేని వారైపోతున్నారు. ఇప్పుడు వారి శక్తి (దివ్యశక్తి)ని గురించి ఏమని చెప్పగలను? నీవు గత ఉత్తరంలో వ్రాసిన స్థితి నీ వైరాగ్యస్థితి యొక్క పూర్ణావస్థ అయినప్పటికీ, దానిలో ఇంకా స్థిరపడవలసి ఉంది, అది జరుగుతుంది కూడా. నీవు వ్రాసినటువంటి ఈ స్థితి వైరాగ్యస్థితి కంటె కూడా ఉన్నతమైనది. నిన్ను ఆ స్థితి నుంచి ఇంకా ఉన్నతంగా చేర్చాలని నాకు అభిలాష కలుగుతోంది కాని ఇంకా నిర్ణయం తీసుకోలేదు. నా హృదయంలో ఆ నిర్ణయం జరిగితే నిన్ను ఈ రోజే అక్కడి నుండి పైకి చేర్చవచ్చు. ఏమైనాకాని నీకు దాని జాడ తెలుస్తుంది.

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 182

లఖీంపుర్,

18.01.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసి నారాయణదద్దా ద్వారా పంపిన ఉత్తరం అందింది. విషయాలు తెలిసాయి. నాలో ఏదైనా అనగా ఏ కొంచెమైనా స్థితి కలిగిందని చెప్పినా, అది 'మాలిక్' యొక్క కృపా ఫలితమే. అందుకుగాను 'అతని'కి ధన్యవాదాలు ఎంతగా తెలిపినప్పటికీ అది అల్పమే. నాలో లయ-అవస్థ మరియు ప్రేమ ఉన్నదో లేదో, నాకు దాని గురించి తెలియదు. 'మాలిక్'కు మాత్రమే తెలుసు. నాకు వాటితో సంబంధంలేదు. నాకు ఉన్నదల్లా 'అతని'పట్ల కోరిక మాత్రమే, 'అతడే' కావాలి. ఇంకా ఏదైనా ఉంటే తమకు తెలియాలి, తమ అభీష్టానికి తెలియాలి. నాకు మాత్రం అల్పమైనది ఇది మాత్రమే, నిస్సందేహంగా అది వాస్తవం కూడా. ఎందుకంటే ఇప్పుడు బ్రహ్మవిద్య యొక్క ఆరంభంగానే అనిపిస్తోంది, కాని ఆ ఆరంభం యొక్క జ్ఞాపకం కూడా మరచిపోయినట్లుగా ఉంది. నాకు తెలిసిందల్లా ఏమిటంటే, వేసవిలో దీర్ఘకాల సెలవుల్లో తమరు ఒక రోజున సిట్టింగ్ ఇచ్చిన తర్వాత, "స్థితిలో బలహీనత ఏర్పడింది, దానిని మళ్ళీ సరిచేశాను" అని చెప్పారు. దాని వలన నాకు కలిగిన లాభం ఏమిటంటే, తపనలో ఎటువంటి లోటుపాటు కలిగిందో, దేనినైతే నేను నా స్వప్రయత్నంతో పూరించలేకపోయానో, అది తమ దృష్టి ఒక్కింత సోకగానే ఆ లోటు పూర్తిగా నివారించబడింది. అక్కడి నుండి తిరిగి వచ్చాక, 12,13 రోజులు నా శిరస్సు మరియు హృదయంలో ఇబ్బంది కలిగింది. హృదయమైతే బాగా భీతిల్లింది, శిరస్సులో బాగా వేదన కలిగింది, అందుచేత మనస్సు ఎక్కడా దేనిలోను లగ్నం కాలేకపోయింది. ఇప్పుడు పూర్తిగా బాగున్నాను. ఏమీ దిగులు లేదు. నాకు ఉన్నతి కలిగించిన శుభవార్తను తెలిపినందుకు తమకు అనేక ధన్యవాదాలు. 'మాలిక్' కృపతో నా అవగాహనకు వచ్చిన ఆత్మికదశను వ్రాస్తున్నాను.

బాబూజీ ఇప్పుడు పూజగాని లేదా ధ్యానంగాని, దానిని ఏమైనా అన్నప్పటికి, అవి నాకు బదులు 'మాలిక్' లోనే జరుగుతున్నట్లుగాను నాకు అర్థమవుతున్నది. ఆ చేసేది ఎవరో, ఆ పూజ ఏమిటో 'మాలిక్'కు మాత్రమే తెలుసు. ఎందుకంటే, ఇదంతా ఒక ఆలోచన వంటిదిగా అనిపిస్తోంది. దీనినే ఇంకొక రకంగా కూడా చెప్పాలంటే, పూజగాని లేదా ధ్యానంగాని అన్నీ అంతర్గతంగా 'మాలిక్'లోనే జరుగుతున్నాయి. శ్రీ బాబూజీ, ఇప్పుడు "ఈశ్వరాంశమైన జీవం అవినాశనమైనది" (అనగా పరమాత్మ అంశమైన ఆత్మకు నాశనం లేదు) అను స్థితి యొక్క దృశ్యం నా కళ్ళకు కట్టుతోంది. వాస్తవంగా ఇవన్నీ కూడా ఈశ్వరప్రాప్తికి చెందిన స్థితికి సంబంధించినవిగానే నాకు అర్థమవుతోంది. శ్రీ బాబూజీ, ఇదేమిటో దైవానికే తెలియాలిగాని, ఇప్పుడు శ్వాస కూడా నాకు అప్పుడప్పుడు చాలా భారంగాను,

ఇబ్బందికరంగాను అనిపిస్తోంది. ఇంకొక స్థితి ఎలా ఉందంటే, పూజ లేదా ధ్యానం ఏదైతే ఉన్నాయో, అవన్నీ 'మాలిక్' యొక్క ఆలోచనలోనే జరుగుతున్నాయని నేను పైన వ్రాసి ఉన్నాను కదా, అటువంటిది ఇప్పుడు ఆ ఆలోచన కూడా ఎక్కడో లయమై ఉన్నట్లుగా అనుభవమవుతోంది. పూజ్య శ్రీ బాబూజీ! నాకు మూడు రోజుల నుండి అనగా 16వ తారీఖు ఉదయం నుండి నేను నా 'మాలిక్'తో కలిసి ఎక్కడికో ఎగిరిపోతున్నట్లుగా ఉంది, రూపమైతే కనిపించటంలేదు. దీనిని అజ్ఞానం అనిగాని లేదా ఆలోచన అనిగాని చెప్తే బాగుంటుంది. పూజ్య శ్రీ బాబూజీ, మేమందరమూ ఉత్సవానికి ఎప్పటిలాగానే ఉరకలు వేస్తూ వస్తాము. తమరు ప్రత్యేకించి ఆహ్వానించాల్సిన అవసరం లేదు. ఏమైనాగాని, తమ దయ మాత్రం అనుపమానమైనది మరియు అద్వితీయమైనది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 183

లఖీంపుర్,

07.02.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. 'మాలిక్' దయతో మేమందరం కులాసాగా ఇక్కడకు చేరుకున్నాము. తమ అలసిపోయిన దేహానికి మరియు మెదడుకు విశ్రాంతి చిక్కిందని భావిస్తాను. మేమందరం ఈ ఎనిమిది రోజులు ఎంతో బాగా గడిపాము. ఇక్కడకు వచ్చిన తర్వాత మూడు, నాలుగు రోజులు ఆ వాతావరణం బాగా తలపుకు వచ్చింది. ప్రతి ఒక్కరి హృదయం ఉల్లాసంగా ఉంది. ఇప్పుడు 'మాలిక్' కృపతో ఏ ఆత్మికదశ అయితే అనుభవానికి వచ్చిందో దానిని వ్రాస్తున్నాను. శ్రీ బాబూజీ! నేను ఇప్పుడు ఇంకొక వాతావరణంలోకి వచ్చినట్లుగా అనిపిస్తోంది. అదేమిటో దైవానికే తెలియాలిగాని 'మాలిక్' రూపం బొత్తిగా దృష్టికి రానేరావటంలేదు. అయితే ఇదిమట్టుకు ఖాయం, ఏమిటంటే 'అతని' రూపం మసకబారిన నీడలాగా కనిపిస్తోంది. ఇప్పుడు నా స్థితి ఎలా ఉంది అంటె, ధ్యానం ధ్యానరహితంగా ఉంది అంటె సబబుగా ఉంటుందేమో. ఈ దశ అదోరకంగా ఉంది. ఇంకొకటి ఏమిటంటే, ఇంతకుముందు తమరు, ఒకసారి వ్రాసినట్లుగా "ఇప్పుడు ఆధ్యాత్మికత యొక్క 'అ', 'ఆ'లు ప్రారంభమైంది" అన్నట్లుగా అనిపిస్తోంది. అయితే ఇప్పుడు ఈ ఆధ్యాత్మికత కూడా అంతమైపోయినట్లుగా అనిపిస్తోంది. ఎందుకంటే, అది నా మెదడులోకి అసలు రావటమే లేదు అన్నంతగా నేను దానిని మరచిపోయానని అనిపిస్తోంది. దానిని నేను అసలు గుర్తించలేకపోతున్నాను. ఆధ్యాత్మికత అంటే ఏమిటో, దాని అర్థం ఏమిటో కూడా గ్రహించలేకపోతున్నాను. దీనికి సమాధానం నావద్ద కేవలం ఇది మాత్రమే ఉంది, బాబూజీ అదేమిటో దైవానికే తెలియాలి, ఎందుకంటే 'అతడు' నాపట్ల దయతో ఈ ఆధ్యాత్మికత జ్ఞాన బంధనం నుంచి కూడా నాకు విముక్తి కల్పించాడు. ఇప్పుడు నడుస్తున్న స్థితి ఎటువంటిది అంటె, ఆనందం, ఆనందం యొక్క సారం నుంచి కూడా ఖాళీ అయిపోతున్నట్లుగాను, శాంతి యొక్క స్థితి కూడా ఇదే విధంగా అయిపోయినట్లుగాను అనిపిస్తోంది. చివరకు శాంతి కూడా శాంతించిపోతున్నట్లుగా అనగా శాంతి కూడా లేకపోతున్నట్లుగా అర్థమవుతోంది.

పూజ్య శ్రీ బాబూజీ! అదేమిటో తెలియదుగాని నేనైతే హృదయ పూర్వకంగా 'మాలిక్'పట్ల భక్తి నిలపలేకపోతున్నాను. ఎంతగా ప్రేమించాల్సి ఉందో, అంతగా 'అతని'పట్ల ప్రేమ నిలపలేకపోతున్నాను. తప్పకుండా ప్రయత్నమైతే చేస్తూనే ఉంటాను, 'మాలిక్' మాత్రం ఎప్పుడో ఒకప్పుడు నన్ను తప్పక సఫలీకృతం చేస్తాడు, ఇందులో అనుమానంలేదు. అయితే ఇది 'అతని'పట్ల నా ఫిర్యాదు తప్పనిసరైంది. తమరు ఇచ్చిన ఐదు రూపాయలు నావద్ద ఉంచుకున్నాను. ఎప్పుడు అవసరంపడితే అప్పుడు దానిని ఇచ్చివేస్తాను. దినదిన ప్రవర్ధమానంగా నా ఉన్నతి జరగాలని నేను

నా 'మాలిక్'ను ప్రార్థిస్తున్నాను. పరిపూర్ణంగా నాకు 'అతడు' దక్కాలనేదే నా కోర్కె.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 184

లఖీంపుర్,
10.02.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. ఇప్పుడే హరిదద్దా ద్వారా అక్కడి విషయాలు తెలిసాయి. తమ ఆరోగ్యం బాగుందని తెలిసి సంతోషం కలిగింది. 'మాలిక్' కృపతో కలిగినటువంటి ఆత్మిక దశను నా అవగాహనకు వచ్చినంతవరకు వ్రాస్తున్నాను. అది ఏమిటో తెలియదుగాని, నా వ్యాప్తి పూర్తయిపోయినట్లుగా అనిపిస్తోంది. నా దృష్టి ఎంతవరకు సారించబడుతుందో అంతవరకు అంతా సామ్యస్థితిలాగా అనిపిస్తోంది. పూజ ఆరంభించినపుడు స్థితి ఎలా ఉందో అదే స్థితి మళ్ళీ ఇప్పుడు ఆరంభమైనట్లుగా అనిపిస్తోంది. భేదం ఏమిటంటే, ఇప్పటి స్థితి ఇదివరకటి కంటె స్వాభావికంగానూ, అనవసర విషయాలు ఏవీ లేకుండాపోయినట్లుగాను అనిపిస్తోంది; అలాగే అభ్యాసం (సాధన) కూడా సహజసిద్ధంగా అయిపోయినట్లుగా తెలుస్తోంది. నా గ్రహింపుకు వచ్చిన దానినిబట్టి, స్థితిలోను ప్రతి విషయంలోను, ప్రతి వస్తువులోను సహజత్వమే నెలకొని ఉంది. బహుశా వ్యాప్తి విషయంలో కూడా ఇదే స్థితి అనగా సహజత్వమే ఏర్పడినట్లుగా అనిపిస్తోంది. ఇంతేగాకుండా, ప్రతి విషయంలోను ఈ సహజత్వమే ప్రకాశవంతంగా సాదృశ్యమవుతోంది. అయితే ఈ సహజత్వంలో ఏదైన ప్రత్యేకమైన ప్రకాశం ఉన్నదని చెప్పలేను కాని అది వాస్తవికత (రియాలిటీ)గా మార్పు చెందుతున్నట్లుగా అనిపిస్తోంది. పూజ్య శ్రీ బాబూజీ! అదేమిటో తెలియదుకాని, నాలుగు దిక్కులా వాస్తవికతయే కనిపిస్తోంది, అనగా నాలుగు వైపులా కూడా వాస్తవికత యొక్క సువాసనయే గుబాళిస్తోంది. పూజ్య శ్రీ బాబూజీ, నాకయితే 'మాలిక్' కావాలి. ఎలాగైనా సరే, అది నా ఒకే ఒక్క కోరిక నెరవేరాలి. 'మాలిక్' దయపట్ల నాకు పరిపూర్ణ విశ్వాసం ఉంది, ఏదో ఒకరోజు తప్పకుండా వస్తుంది, అప్పుడు నా కోరిక నెరవేరుతుంది. ఇప్పుడు తమకు ఇంకొక స్థితిని గురించి కూడా వ్రాస్తున్నాను, అందుకు క్షమించండి. అలా ఎందుకో తెలియదు, దైవానికే తెలియాలికాని, కొంతకాలం నుంచి నాకు అసలు నా లక్ష్యం ఏమిటో, నేనేమి కోరకుంటున్నానో, వాటిని గురించిన జ్ఞానం నాలో లేకుండాపోయింది. దీనినంతటినీ నేను పూర్తిగా మర్చిపోయాను. 'మాలిక్'తో ఉన్న సంబంధం గురించి కూడా జ్ఞానం లేకుండాపోయింది. కాని ఇది మాత్రం ఖచ్చితంగా మిగిలి ఉంది, అదేమిటంటే, హృదయానికి 'మాలిక్' తప్ప మరేదీ మంచిదని అనిపించటం లేదు. అలా కాకుంటే నేను చేతులు జోడించి ఏమి చెబుతున్నాను అంటె, నేను పూర్తిగా అజ్ఞానంగా ఉండిపోయాను; ఇంకా చెప్పాలంటే, వీటి అన్నింటివైపు అసలు నా దృష్టియే మరలటంలేదు. నేను అసలు పట్టించుకోవటంలేదు కూడా. శ్రీ బాబూజీ! ఇదంతా తమకే తెలియాలి. నేను మాత్రం పూర్తిగా అజ్ఞానిని. 'మాలిక్' అభీష్టం మేరకే జరగనివ్వండి.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

# ఉత్తరం సంఖ్య - 185

లఖీంపుర్,
14.02.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసిన రెండు ఉత్తరాలు చేరాయి, సమాచారం తెలిసింది. తమ ఆరోగ్యం బాగుండాలని, తమరు క్షేమంగా ఉండాలని నేను ఈశ్వరుని ప్రార్థిస్తున్నాను. "వాస్తవానికి కస్తూరికి నేను చేయవలసిన పని ఇప్పుడు ప్రారంభమైంది" అని తమరు వ్రాసారు. పూజ్య శ్రీ బాబూజీ! అయినాకాని నేనైతే ఇదే చెబుతాను, ఏమని అంటె, నాకు ఇప్పటివరకు దక్కినది ఏమిటో దానిని 'మాలిక్'యే ఇచ్చాడు. 'అతని' కృపతోనే అది లభించింది, 'అతడు' మాత్రమే ఇస్తున్నాడు, ఇకముందు కూడా 'అతడే' ఇస్తాడు. సుఖదేవనంద, శివానంద మరియు నారదానంద లందరి గురించి తమరు ఏదో వ్రాసి ఉన్నారు. వారు సన్న్యాసులై ఉన్నప్పటికి, మరి ఎందుకోగాని వారు తమ అవమానాన్ని స్వయంగా కల్పించుకున్నారు; ఎందుకంటే పరమహంస, పరివ్రాజకాచార్య వంటి బిరుదులు వారు తమంతటతామే వాటిని తమ నామాలకు ముందు ఉంచుకున్నారు లేక ఎవరైనా వాటిని అలంకరిస్తే వారు స్వీకరించారు. ఎందుకంటే, బహుశా అల్పునకు పెద్ద బిరుదు, గౌరవనీయులకు చిన్న బిరుదు ఇవ్వటమనేది రెండూ కూడా ఆక్షేపించదగినవి. అయితే ఇది నాకు ఎందుకు, 'మాలిక్'కే తెలుసు. తమ కృప ఈ దీనురాలిపైన సదా పెరుగుతూనే ఉండాలని నా ప్రార్థన. దీక్ష తీసుకున్న అభ్యాసుల (Initiated members) గురించి దైవానికి నివేదించే నా ప్రార్థన ఏమంటే, 'అతడి' కృపతో ఏదో ఒక పరిష్కారం తప్పక లభించాలని, దానితో అందరికీ మేలు జరుగుతుంది అని. ఇప్పుడింక 'మాలిక్' కృపతో అనుభవానికి వచ్చిన ఆధ్యాత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

అదేదో దైవానికే తెలియాలిగాని, చాలాకాలం తర్వాత ఇప్పుడు ఉదాసీన స్థితి ఎంతో కొంత మార్పు కలిగిన రూపంతో మళ్ళీ ప్రత్యక్షమవుతూ ఉంది. అప్పుడప్పుడు అన్నివైపులా సమాధి స్థితియే వ్యాపించి ఉన్నట్లుగా అనిపిస్తోంది. దీనిని సామ్యావస్థ (సమత్వ స్థితి) అని చెప్పవచ్చు అని అనుకుంటాను. అసలైన సమత్వస్థితి ఆరంభమైనట్లుగా (అనగా ఆంతరికంగాను, బాహ్యంగాను కూడా దైవంతో ఏకత్వం చెందటం) అనిపిస్తోంది. ఇంకా చెప్పాలంటే, దానిలో కూడా సహజత్వం ఏర్పడినట్లుగా అనుభవమవుతోంది. శ్రీ బాబూజీ, ఇప్పుడు అది ఏమిటో తెలియకపోతున్నది గాని, నేను ఒకసారి "మాలిక్‌తో అసలు నా సంబంధం ఏమిటో తెలియకుండా ఉంది" అని వ్రాసినట్లుగానే ఉంది. ఇప్పుడు ఇంకొక స్థితి ఎలా ఉందంటే, నిజానికి నా స్వంత శరీరంతోటి సంబంధపు జాడ కూడా తెలియకుండా పోయింది. శరీరమే గల్లైంతైపోయి ఉండగా ఇంక దానితో సంబంధం ఎక్కడ ఉంటుంది? శివానంద, సుఖ్‌దేవానంద మొదలైన వారిపట్ల నేను నిందా పూర్వకంగా వ్రాయలేదు. ఆ విధంగా నేను నాలో కలిగిన ఒక ఆలోచన మాత్రంగానే వ్రాశాను. వారు నిజంగా సన్న్యాసం స్వీకరించినవారుగా ఉంటే, మన గృహస్థులకు ఆదరణీయులుగానే భావించబడతారు. పూజ్య శ్రీ బాబూజీ, అప్పుడప్పుడు ఎటువంటి స్థితి కలుగుతోంది అంటే, 'మాలిక్' నుంచి ఒక 'కాంతి' ప్రసారమవుతున్నప్పుడు, స్వాభావికమైన సమస్యలు ఏవైనప్పటికీ అవి ఆ సమయంలో పరిష్కరించబడుతున్నాయి. అయితే అటువంటి సమయంలో ఆలోచన యొక్క భారం కూడా నాపైన ఉండటంలేదు. హృదయం చాలా ఖాళీగా (అనగా ఎటువంటి ఆలోచన లేకుండా) ఉంటుంది. కనుక ఆ విధంగా కలిగిన 'కాంతి' ఏమిటో ఆ దైవానికే తెలియాలి.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

# ఉత్తరం సంఖ్య - 186

లఖీంపుర్,
19.02.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమ ఉత్తరాలు మరో రెండు చేరాయి. ఒకటి మా తావూజీ కొరకు రోహన్ భాయీ సాహెబ్ ద్వారా పంపినది అయి ఉండగా, రెండవది దాని కంటె ముందుగా పోస్ట్ ద్వారా వచ్చింది. శ్రీ బాబూజీ, అందులో నా 'కుండలిని' స్పష్టపడుతూ ఉన్నట్లుగా తమరు వ్రాశారు. ఇది కేవలం 'మాలిక్' దయవల్లనే కలుగుతోంది. **ఎక్కడైతే ఆధ్యాత్మికత యొక్క పరసువేది మెరుపు లేదా దృష్టి సోకుతుందో, అక్కడ ఉన్నవి బంగారంగానే రూపుదిద్దుకుంటాయి.** ఈ పరసువేది నేను ఉదాహరణగా వ్రాశానేకాని తమరు ఎవ్వరో అలాగే ఉన్నారు. ఎలా ఉన్నాగాని తమకు సాటిలేదు. తమరు తమ దోషాలను గురించి అడిగారు, కాని నేనైతే ఏమి చెబుతానంటె, **అభ్యాసీలో కనుక విశ్వాసం దృఢంగా ఉన్నట్లయితే, అతడు అతని యొక్క దోషాలన్నీ కూడా స్వయంగా భయపడి పలాయనం చిత్తగించినట్లుగా అతడు తిలకిస్తాడు. అలా ఎందుకంటే, అది తమ దృష్టికి వచ్చినట్లయితే మాడి మసైపోవాల్సి వస్తుందని ఆ విధంగా పరారవుతాయి.** ఇంక ప్రేమ విషయమంటారా, అది సాటిలేనిదిగా ఉంటుంది. పూజ్య శ్రీ బాబూజీ! 'మాలిక్' దయతో స్వల్పమైన నా అనుభవమైన దానిని మాత్రం వ్రాస్తున్నాను. లేదంటే నేను తమ ఎదుట అల్పబుద్ధిగల విధేయురాలునిగానే ఉంటాను. నేను ఈ విధంగా గ్రహిస్తున్నాను – **మానవుడు ఈశ్వరునికి ఎంతెంత దూరంగా జరిగిపోతూ ఉంటాడో, అతని బుద్ధి కూడా అదే విధంగా అంతగా సంకుచితమైపోతూ ఉంటుంది. ఒక సాధారణమైన విషయం కూడా అతడు అర్థం చేసుకొనలేక, నిరర్థకమైన వాదనలు చేస్తూ, ఎదుటి వానిపైన విజయం సాధించినట్లుగా భావించుకుంటాడు.** ఇంతకీ యదార్థమైన విషయం ఏమిటంటే, తమరు ఉదాహరణకు కూడా ఉదాహరణ చెప్పగల సమర్థులు. నేను మాస్టర్ సాహబ్‌ను చూస్తున్నాను గదా, వారు ఒక విధమైన భావనతో మాట్లాడుతూ ఉంటారు. వాటిని బాగా అర్థం చేసుకుంటారు. అది ఒక వేదాంతి అర్థం చేసుకొనగలిగిన దానికంటే మిన్నగా ఉంటుంది. అభ్యాసీ కనుక 'మాలిక్' ప్రేమ యొక్క తత్త్వాన్ని (Philosophy) బాగా అర్థం చేసుకుని దానిని పరిపూర్ణ స్థాయికి పెంపొందించుకున్నట్లయితే, అప్పుడు అతడు ఏమి చేసినాగాని, ఏమి చెప్పినాగాని, ఏమి అర్థం చేసుకున్నాగాని అది సాటిలేనిదిగా ఉంటుంది. ఎంత సామాన్య విషయమే అయినా కూడా, తమరు శ్రీ కబీరు పదాలను ఎంత శీఘ్రంగా, ఎంత బాగా అర్థం చేసుకొనగలరో, ఆ విధంగా పెద్ద పెద్ద ప్రొఫెసర్లు కూడా వాటిని అర్థం చేసుకోలేరు. దాని అర్థం ఏమిటంటే, వారి (ప్రొఫెసర్లు, విద్వావేత్తలు) పరిజ్ఞానం పరిమితమైనది, అలాగే వారి మానసిక స్థాయి కూడా పరిమితమైనది అయి ఉండగా తమ విషయంలో అది అపారమైనది మరియు అపరిమితమైనదిగా ఉంటుంది. 'మాలిక్' దయతో నా అనుభవానికి వచ్చిన ఆత్మికదశను వ్రాస్తున్నాను.

శ్రీ బాబూజీ! ఇప్పుడు ఈ స్థితి ఎలా ఉన్నదంటే, దాని గురించి వ్రాయడానికి సంకోచిస్తున్నాను ఎందుకంటే అది గౌరవ మర్యాదలకు విరుద్ధంగా ఉంటుంది. అయితే, ఏ విధంగా బిడ్డ తన తల్లివద్ద ఎంత స్వతంత్రంగా ఉంటాడో నేను కూడా అదే విధంగా 'మాలిక్' ఎదుట స్వతంత్రంగా ఉంటాను. స్థితి ఎలా ఉందంటే, ఈశ్వరుడు వగైరా ఎవ్వరు కూడా నా దృష్టిలో ఇక్కడా నిలవటంలేదు. నేను 'అతడి'ని అసలు పట్టించుకోవడంలేదు. 'మాలిక్' నన్ను ఇప్పుడు ఉన్నతంగా (ఊర్ధ్వముఖంగా) ఈడ్చుకుని పోతున్నట్లుగా అనిపిస్తోంది. శ్రీ బాబూజీ, ఇది అంతా 'అతని' ప్రయోజకత్వమేనని, 'అతని' కృపాకటాక్షమేనని భావిస్తాను. అది ఏమిటోగాని, ఉదాసీన స్థితి గాఢంగా ఎందుకు వస్తున్నదో తెలియడంలేదు. అప్పుడప్పుడు మేఘం వంటిది నావద్దకు ముంచుకు వస్తున్నట్లుగా అనిపిస్తోంది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 187

లఖీంపుర్,
24.02.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో పూజ్య మాస్టర్ సాహబ్‌గార్కి వ్రాసిన ఉత్తరం వచ్చింది. సమాచారం తెలిసింది. 6-7 రోజులు తమరు శ్వాసతో కొంచెం ఇబ్బందిపడినట్లుగాను, ఈశ్వరుని కృపతో అది తర్వాత తగ్గిపోయినట్లుగాను 'దద్దా' గారి ద్వారా తెలుసుకున్నాను. దైవానికి ధన్యవాదాలు. 'మాలిక్' దయతో నాలో కలిగిన ఆత్మిక దశను వ్రాస్తున్నాను.

ఇప్పుడు అదేమిటో దైవానికే తెలియాలిగాని ఆ ఉదాసీన దశ చాలా గాఢంగా ఉంటోంది. అప్పుడప్పుడు హృదయంలో విరక్తి బాగా పెరుగుతోంది; దానితో హృదయం చాలా దిగాలుగా ఉంటోంది. అది ఏమిటోగాని రోజంతా గుండెను ఛాతీమీద అదిమిపట్టుకోవాల్సి వస్తోంది. అలా చేసినా కూడా అది శాంతించటంలేదు. హృదయం 'మాలిక్' ప్రేమలో మునిగిపోవాలను కుంటోంది కాని నేను అది చేయలేకపోతున్నాను. ఎలా చేయాలి! ఏమి చేయాలి! నేను అసలు 'మాలిక్'కు నా సర్వస్వమూ త్యాగం చేసానో లేదో తెలియటంలేదు. 'అతడు' ఎలా ఉంటాడో, ఎక్కడ ఉంటాడో కూడా తెలియటంలేదు. నాకు ఈశ్వరుడు అంటే తెలియదు, పరమేశ్వరుడు అంటె తెలియదు, అసలు నాకు ఎవ్వరైనా తెలుసా అనేది కూడా తెలియదు. అప్పుడప్పుడు ఈ స్థితి బాగా ఎక్కువవుతోంది. అయితే అదేమిటో తెలియదుగాని మళ్ళీ యథాస్థితికి వస్తున్నాను. తమరు ఆదేశించినట్లయితే 'కాంగ్రెస్'కు సంబంధించిన పనిని ఇప్పుడు మళ్ళీ ప్రారంభించాల్సి ఉంటుంది. ఇప్పటికే కొంత ఆరంభించాను. ఇటీవల ఒక ప్రత్యేకమైన మరపుస్థితి ఉన్నట్లుగా అనుభమవుతోంది.

అమ్మగారు తమకు ఆశీర్వాదాలు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 188

లఖీంపుర్,
02.03.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. ఇక్కడ అందరం బాగానే ఉన్నాము. తమరు కూడా బాగున్నారని ఆశిస్తాను. నా ఉత్తరం ఒకటి తమకు చేరి ఉండాలి. ఇప్పుడు ఉన్న పరిస్థితి ఎటువంటిది అంటె, నేను పూర్తిగా ఏదో కోల్పోయినట్లుగా దిగాలుగా ఉంటున్నాను. ఏమీ శాంతి లేకపోగా అదేమిటో తెలియకుండా ఉంది. బహుశా ఒక విధమైన వెర్రితనంలాగా ఉంది. కొంత విసుగు లేదా చిరాకు కూడా పెరిగిపోయిందని అనుకుంటాను. అయితే అది స్వాధీనంలోనే ఉంటోంది. ఈ అశాంతి హద్దుమీరకుండా ఉండాలన్నది బహుశా 'మాలిక్' అభీష్టమై ఉండవచ్చు. ఈ అవరోధం ఎందుకో తెలియటం లేదు. మధ్య మధ్యలో ఒకటి రెండు రోజులు అది ఉండీ లేనట్లుగానే ఉంటుంది కాని మళ్ళీ విజృంభిస్తుంది, కాని ఎడతెగకుండా మాత్రం ఉండదు. ఈ స్థితి ఏమిటో నాకు అర్థం కావటంలేదు. బహుశా ఇది నేను 'మాలిక్'పట్ల ప్రేమను పెంపొందించుకొనలేక పోవటంవలన కావచ్చు. బహుశా ఈ కారణంగానే అప్పుడప్పుడు హృదయస్థానం మీద ఏదో బాధ వంటిది, చాలా స్వల్పంగా కలుగుతుంది. దానిని గురించి విచారించకండి. పూజ్య శ్రీ బాబూజీ, ఈ విసుగుదలలోనే కొంచెం ఆనందం కూడా కొద్దిసేపు మాత్రమే కలిగి ఉండటం కూడా వాస్తవమే కాని దాని జాడ

నాకు తెలియటంలేదు. అవునుగాని, ఇది తప్పకుండా ఉంది, ఈ సుఖానుభూతి తర్వాత విసుగుదల శాంతించినట్లుగా ఉంటుంది, మరి ఇంకా చెప్పాలంటే, ఉదాసీన స్థితి కూడా కనిపించటంలేదు. అయితే ఈ అశాంతివంటి స్థితి నిరంతరాయంగా ఉండటంలేదు. ఇంకొక విషయం ఏమిటంటే, అప్పుడప్పుడు పూజ నిర్వహించిన తర్వాత, ఆ గది యొక్క వాతావరణం అంతా ఎందుకు మారిపోతోందో నాకు అర్థం కావటంలేదు. ఒక ప్రత్యేకమైన గాంభీర్యమైనటువంటి స్థితి, అచంచలమైన శాంతి ఏర్పడుతోంది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు. దయచేసి ఉత్తరానికి జవాబు వ్రాయండి.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 189

లఖీంపుర్,
04.03.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. ఇక్కడ అందరూ క్షేమం. నా ఉత్తర మొకటి చేరి ఉండవచ్చు. 'మాలిక్' దయతో కలిగిన ఆత్మిక దశను వ్రాస్తున్నాను. ఎందుకోగాని 'మాలిక్'పట్ల నాకు ప్రేమగాని, సంబంధంగాని ఏమీ తెలియటంలేదు. బహుశా ఇందుకే నా హృదయం ఎక్కువగా విరక్తితో ఉంటోంది. ఏమని చెప్పమంటారు - పూజ అంటె కూడా హృదయం విరక్తి చెందుతోంది అని, 'అతని' జ్ఞాపకం సహితం హృదయం విసుగెత్తి పోయినట్లుగా ఉంటున్నది అని చెప్తే బాగుంటుందేమో. అది భారంగా కూడా ఉంటోంది, అయినా శాంతి కూడా ఉండటంలేదు. ఎందుకోగాని ఉదాసీనత పెరుగుతోంది. హృదయం ఎప్పుడూ శాంతంగాను, నిలకడగాను ఉంటోంది. ఏది అనుకుంటే అది జరిగినా సరే, ఏదైనా విషయమై కోపం కలిగినాసరే, ఎప్పుడైనా బాధ గురించి హృదయం అశాంతి చెందినాసరే, ఆంతరికంగా తొంగి చూసినపుడు అక్కడ సముద్రంలాగా గంభీర స్థితియే కనిపిస్తోంది. ఇంకా ఏమి అనిపిస్తోంది అంటె, ఎంతైనా 'మాలిక్' ధ్యానంకాని, ఆలోచనకాని లేదా జ్ఞాపకం వంటివిగాని కలిగినప్పుడు అవన్నీ 'మాలిక్' యొక్క సూక్ష్మరూపంలోనే జరుగుతున్నట్లుగాని లేదా అంతా సూక్ష్మరూపం ధరిస్తున్నట్లుగా గాని అనుభవమవుతోంది. ఇప్పుడు వ్యాప్తి అనేది పూర్తిగా వేరే రకంగా ఉన్నట్లుగా అనిపిస్తోంది. ఏ విధంగానైతే వాయువులాగా సర్వత్రా, సర్వం వ్యాపించి భగవంతుడు ఉంటాడో అదే విధంగా నా వ్యాప్తి 'మాలిక్'లో కనిపిస్తోంది. ఇంతకుపూర్వంలాగా నా వ్యాపకం వేరుగా ఉన్నట్లుగా ఎక్కడా లేదు. ఇప్పుడు గోప్యంగా ఉన్న లోపలి వ్యాపకం ఏదైతే ఉందో దానిని వ్యాపకం అని చెప్పటంలో అర్థంలేదు. 'మాలిక్' యొక్క అపారకృపతో సర్వవ్యాపకత యొక్క వాస్తవిక దశతో కూడిన దృశ్యం నాకు కనిపిస్తోంది. **ఈశ్వరుడు సర్వవ్యాపి అని విన్నాం కాని 'మాలిక్' కృపతో ఇప్పుడు అదే స్థితిని నా కళ్ళతో నేను చూసి అనుభూతి చెందుతున్నాను.** ఇదే విధంగా లయ అవస్థ సందర్భంలో అనుభూతి చెందాను. ఈ వ్యాపకం కూడా ఎలా ఉందంటే, దానిలో ఎటువంటి రూపంగాని, ఎటువంటి రంగుకాని లేకుండా రూపరహిత వాయువులాగా అపరిమితంగా వ్యాపించిపోయినట్లుగా అనిపిస్తోంది. ఈ వ్యాపకం లేదా వ్యాప్తిని లయ-అవస్థగా చెప్పినా లేక లయ-అవస్థ యొక్క వ్యాప్తిగా చెప్పినా కూడా ఈ రెండు అవస్థలు ఏకమైపోయినట్లుగా చెప్పినా కూడా అది సమంజసంగానే ఉంటుంది. అయితే నేను ఇంకను గత ఉత్తరంలో వ్రాసిన విధంగానే పిచ్చితనం అనే వనంలోనే విహరిస్తూ ఉన్నాను. పూజ్య శ్రీ బాబూజీ! ఇప్పుడు మరొక ప్రత్యేక స్థితి ఉంది. ఆ స్థితి ఎలా ఉందంటే, ఆత్మ, పరమాత్మల సాక్షాత్కారం కలిగినట్లుగా అనిపిస్తోంది. ఇంకా దీనికంటె కూడా ఉన్నతమైనది అనగా ఏకత్వం అయిపోయినట్లుగా భావించుకోవాలి. "ఈశ్వరాంశయైన జీవాత్మ నశింపులేనిది" అను దశలో నాకు ఏమి అనిపిస్తోంది

అంటె, జీవుడు పరమేశ్వరును గుర్తించి ఇప్పుడింక తన వేర్పాటును (ద్వైతాన్ని) వదలిపెట్టి తన వాస్తవిక దశను పొందినట్లుగా తెలుస్తోంది. అయినప్పటికి 'అహం' (నేను అనేది) ఏదో ఒక రూపంలో, ఏదో ఒకమూల మిగిలి ఉన్నట్లుగా నేను గమనిస్తున్నాను. స్థూలత్వంతో దానికి ఎటువంటి సంబంధం లేనిదిగానే ఉన్నప్పటికి దాని (అహం) ఉనికి సూక్ష్మరూపంలో ఎక్కడో అక్కడ దాగి ఉందని అనుకోవాలి. అది దైవానికే తెలియాలి, రోజులు గడుస్తున్నకొద్దీ ఆరాధన (లేదా భక్తి) పెరుగుతూ ఉంది. అది తెలిసినా తెలియకపోయినా కూడా అది నాలో అధికంగానే ఉన్నట్లుగా గ్రహిస్తున్నాను. నిన్న అయితే హృదయంవైపు ప్రక్క ఎముకలోను, వీపులోను లేదా ఎక్కడో ఒకచోట నొప్పి కలిగింది కాని ఇప్పుడు అది సర్దుకుంది. అది రేపటికి ఇంకా తగ్గిపోతుందని ఆశిస్తున్నాను.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 190

షాజహాన్‌పుర్,
05.03.1952

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నీ ఉత్తరం అందింది. అది చదివి ఆనందంతో ఉప్పొంగిపోయాను. 'ఉదాసీనత స్థితి గాఢమవుతోంది" అని నీవు వ్రాశావు. అది నా అవగాహనకు రాలేదు. ఈ ఉదాసీనత అనేది ప్రాపంచిక విషయాలపట్ల అనాసక్తతయా లేక సోమరితనమా! ధృఢమైన వైరాగ్యం మూలంగా ఈ స్థితి కలుగుతుంది. దీనికి కారణం హృదయంలో స్వస్థానం (స్వగృహం) గురించిన జ్ఞాపకం కలుగుతూ ఉండటమే. ఇక్కడ స్వస్థానం అనగా నీ భూతలం మీద ఉన్న నివాసం కాదు. అది మన మందరమూ ఎక్కడి నుండి వచ్చామో ఆ స్థానం (మూలం). "నేను రోజంతా గుండె బాదుకుంటున్నప్పటికీ నాకు ఉపశమనం కలగటంలేదు" అని నీవు వ్రాశావు. ఆహా, ఆహా! **ఎటువంటి అద్భుతమైన స్థితియో గదా! వేలకొలది సామ్రాజ్యాలు కూడా ఈ ప్రేమ ముందు దిగదుడుపే.** అయితే చూడు, ఈ స్థితిలో నీవు మునిగి ఉండి ఇతరులకు ఎవ్వరికైనా సిట్టింగ్ ఇచ్చినట్లయితే దాని ఆనందం అనుభవానికి వస్తుంది. నేను ఈ స్థితిలో కేవలం మూడు రోజులు మాత్రమే ఉన్నాను. ఇవి జీవన్మృత స్థితి లక్షణాలు. నీవు నీ స్థితిని గూర్చి ప్రతి రెండవ లేదా మూడవ రోజు ఉత్తరం వ్రాస్తూ ఉండాలని నేను కోరుతున్నాను. ఒకవేళ ఈ స్థితి నీ వశంలో (స్వాధీనంలో) లేనట్లుగా అనిపిస్తే నీ పూజగదిలో నీ శిక్షకుడి సమీపంలో ధ్యానంలో కూర్చుండిపోవాలి. నేను కూడా దృష్టి నిలుపుతాను. అయినా కూడా ఈ స్థితి చేయిదాటిపోయేటంతగా ఉండకపోవచ్చు. ఎందుకంటే, పూజ్య సమర్థ సద్గురు లాలాజీ సాహెబ్ నాకు నీ సంరక్షణ గురించి హామీ ఇచ్చారు.

నీ సోదర సోదరీలకు ఆశీస్సులు. అమ్మగార్కి ప్రణామములు.

నీ శ్రేయోభిలాషి,
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 191

లఖీంపుర్,
06.03.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసిన ఉత్తరం నిన్న చేరింది. 'మాలిక్' దయతో కలిగినటువంటి ఆత్మికదశను వివరిస్తున్నాను. బాబూజీ, నాకు బాహ్యప్రపంచ వీక్షణం (దృష్టి) లేకుండాపోయింది. ఇప్పుడు నా స్థితి ఎలా ఉంది అంటె, నాకు ఇప్పుడు ఎక్కడా ఏమీ కనిపించటంలేదు, ఏమీ ఉన్నట్లుగా తెలియటం లేదు. నా బాహ్యదృష్టి,

ఆంతరిక దృష్టి రెండూ కూడా లేకుండా పోయాయి. నేను ఎవ్వరినో, ఎక్కడ ఉన్నానో, ఏ స్థానంలో ఉన్నానో తెలియటంలేదు. తన, పరాయి అనే కాదు, నా కన్నులకు ఏమీ కనిపించటంలేదు. పూజ్య శ్రీ బాబూజీ! అదేమిటో తెలియదుకాని, కన్నులలో వెలుగు అయితే ఉంది కాని చూసేటటువంటి జ్ఞానమే లేకుండాపోయింది. కొంచెం తెలివి అయితే ఉంది కాని తెలుసుకొనగలిగిన జ్ఞానం లేకుండా పోయింది. ఈ ప్రపంచమైతే ఉంది కాని దాని జ్ఞానం కూడా లేకుండా పోయింది. చెవులు వింటున్నాయి, నోరు మాట్లాడుతూ ఉంది, శరీరం పనిచేస్తూ ఉరకలు పరుగులు తీస్తూనే ఉంది, అయినా కూడా నాకు వాటి జ్ఞానమే లేకుండా అంతా అప్రయత్నంగానే లేదా అనాలోచితంగానే జరిగిపోతోంది. ఏ దృష్టిలో నేను కోల్పోయానో కూడా నాకు తెలియటంలేదు. అది ఏమిటోగాని నా స్థితి ఎలా ఉందంటే, హృదయం నిరంతరం విలపిస్తూనే ఉన్నది.  కాని, ఏం చెప్పను! సంరక్షకుడైన 'మాలిక్' చేతిలో తాడు మాత్రం పట్టు సడలకుండా ఉంది. ధ్వని కొంచెం కొంచెం నిదానిస్తూ ఉంది కాని ప్రేమ మాత్రం పట్టుసడలకుండా ఉంటోంది, దానితో పరిస్థితి చేయదాటిపోకుండా ఉంటోంది. ఒకవేళ ఆ దీన స్వరమే కనుక పూర్తిగా నిశ్శబ్దమైపోతే ఎంతో హాయిగా ఉంటుంది. అది 'మాలిక్' ఇష్టాన్నిబట్టి ఉంటుంది. నేను ఏ విధంగా తింటున్నానో, ఏమి తింటున్నానో కూడా నాకు తెలియటంలేదు. అదే విధంగా ఎప్పుడు నిద్రిస్తున్నానో కూడా నాకు తెలియదు. అయితే ఈ నిద్రలో అశాంతి ఉండటం మూలంగా నిద్ర కూడా తగ్గిపోతోంది. రోజంతా పూజ గదిలోనే కూర్చుండిపోవాలని అనిపిస్తోంది కాని సామాజిక స్థితులు అందుకు అనుకూలించటంలేదు. అవకాశం కల్గగానే కొంచెంసేపు ఆ గదిలోకి వెళ్ళి కూర్చుని వస్తున్నాను. అక్కడ చేయవలసింది ఏదో అది చేసి బయటకు వస్తున్నాను. నేను రెండు మూడు రోజులకు ఒకసారి తమకు లేఖ తప్పక వ్రాస్తూ ఉంటాను. తమరు వ్రాసినట్లుగానే ప్రతిదీ ఆచరిస్తాను. స్థితి ఎలా ఉంది అంటె, కొంత వెర్రితనం ఆవహించి ఉంది. అయినా కూడా దైనందిన (రోజువారీ) ప్రాపంచిక వ్యవహారాలలో ఏమీ భేదం లేకుండా ఉంటున్నందుకు 'మాలిక్'కు అనేకసార్లు ధన్యవాదాలు అర్పించుకుంటున్నాను. అన్ని పనులు సక్రమంగా, అప్రయత్నంగా ఎలా జరిగిపోతున్నాయో ఆ 'మాలిక్'కే తెలియాలి. కాని ఇది మాత్రం ఇతరులు ఎవ్వరికీ తెలియదు. ఇది చాలా మేలు. తమరు ఉదాసీన స్థితి గురించి అడిగారు, కాని అది సోమరితనం మాత్రం కాదు. హృదయం ఇప్పుడు అన్నింటిపట్ల విరక్తిగా ఉంది. అన్ని పనులూ సక్రమంగానే జరిగిపోతున్నాయి కాని దేనిపట్లనూ ఆసక్తి ఉండటంలేదు. కర్తవ్యాలన్నీ పూర్తిగా నిర్వహిస్తూనే ఉన్నాను కాని ఎటువంటి అనుబంధం ఉండటంలేదు. ఎందుకంటే అసలు నాతోనే నాకు సంబంధం లేకుండాపోయినపుడు ఇతర విషయాలలో ఎందుకు ఉంటుంది. అది ఎలా అంటె, దానిని పైన వ్రాసాను – 'నేను ఎవరిని, ఎక్కడ ఉన్నాను' అనేది తెలియకుండాపోతే ఇంక వీటి సంగతి ఏం చెప్పను. గుండెవైపుగా బాధ కొంచెంగా ఉంటూనే ఉన్నది. అయితే రాత్రి సమయంలో కొంత పెరుగుతోంది, ఎందుకంటే, నాకు 'అతని' జ్ఞాపకం ఉండటంలేదు కనుక. దానిని గురించి తమరు విచారించవద్దు. అంతా సరిదిద్దుకుంటుంది. దయచేసి ఈ బాధ నుంచి ఉపశమనం కోసం ప్రార్థన చేయకండి.

అమ్మగారు తమకు ఆశీర్వాదాలు తెలుపుతున్నారు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 192

లఖీంపుర్,
09.03.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరిందనుకుంటాను. అమ్మగారు మరియు పెద్ద సోదరుడు నిన్న వచ్చారు. పెద్ద సోదరునికి తమ ఉత్తరాల మూలంగా మంచి ప్రేరణ కలిగింది. పూజ్య తావూజీ (పెదనాన్న) కూడా

కొంత కోలుకున్నారుగాని, కొంచెం జలుబు, దగ్గు ఉన్నాయి. నాకు ఈరోజు బాధ కొంచెంగా ఉన్నది. అది రేపటికి బాగా తగ్గిపోతుంది. దయచేసి తమరు నా గురించి అసలు బాధపడవద్దు. 'మాలిక్' కృపతో కలిగినటువంటి ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

శ్రీ బాబూజీ, నన్ను నేను మరియు అన్నింటినీ మర్చిపోయాను. పూజ గదిలోకి వెళ్ళుతున్నాను, అక్కడ ఏమి చేస్తున్నానో తెలియదు. ఎవరికొరకు, ఎందుకు దుఃఖిస్తున్నానో, అసలు అది ఎవరు చేస్తున్నారో కూడా తెలియడంలేదు. శ్రీ బాబూజీ, నా స్థితి ఎలా ఉందంటే, నన్ను నేను గుర్తించలేకపోతున్నాను, 'మాలిక్'నూ గుర్తించలేకపోతున్నాను – రెండూ మాయమైపోయాయి. అంతేగాక పూజ గురించిగాని, ప్రేమను గురించిగాని నాకు ఏమి తెలియడంలేదు. ఈ స్థితినిబట్టి నేను, దైవం ఇద్దరమూ లేకుండాపోయాము. ఇది ఏమిటో అర్థంకావటంలేదు. ఈ స్థితిలో, నేను లేను, నీవు లేవు వంటి దశ ఏర్పడినప్పటికీ, నేను మాత్రం ఈ స్థితిని గురించి ఏమీ తెలియనిదానిలాగా ఉంటున్నాను. పూజ్య శ్రీ బాబూజీ, అది ఏమిటో తమకే తెలియాలి, ఎందుకోగాని తరచుగా హృదయం విసుగు (విరక్తి) చెందిపోయి ఇల్లు వదలి ఎక్కడికైనా పారిపోవాలని తహతహలాడు తోంది. కాని ఏ విధంగాను హృదయంలో మార్పురానందున, పూజ గదిలోకి వెళ్ళి, కొంచెంసేపు కూర్చొని వస్తున్నాను. అప్పుడు కొంతసేపటికి హృదయం శాంతిస్తోంది. శ్రీ బాబూజీ, ఇంకొక స్థితి ఏమంటే, 'మాలిక్', 'మాలిక్' అంటూ ఎంతగానో పిలుస్తూ ఉన్నాను. కాని నిజం చెప్పాలంటే ఇప్పుడు 'అతని' గురించిన జ్ఞానం కూడా లేకుండాపోయింది. ఇప్పుడు ధ్యేయం, ధ్యేయానికి ఆసరా అయినవాడు కూడా లేకుండాపోవటం జరిగింది. మరైతే నా దృష్టి ఏమైపోయిందో తెలియదు. పూజ్య శ్రీ బాబూజీ, యదార్థం ఏమిటంటే, నేను 'అతడి'ని వెదకటమైతే చేశానుగాని, 'అతడి'ని వెదకటంలో నన్ను నేను కోల్పోయాను. ఇప్పుడింక అంతా 'అతని' చేతుల్లోనే ఉంది, 'అతడు' కావాలనుకున్నపుడు నా కోసం వెదుకుతాడు. నా నిస్సహాయత 'అతని'కి తెలిసిపోయి ఉంటుంది కనుక బహుశా 'అతడు' కూడా నాకోసం వెదుకుతూ ఉండవచ్చు. ఈరోజు లోలోపల ఏదో అమితానందం కలుగుతూ ఉంది. ఇప్పుడు అంతా 'అతని' చేతుల్లోనే ఉంది కనుక 'అతని' ఇష్టప్రకారం జరుగుతుంది. నన్ను నేను కోల్పోయిన విషయం కూడా నేను ఇపుడు మరచిపోతున్నాను. నా మనస్సు ఎక్కడా నిలవటంలేదు కనుక ఇంటి నుంచి వెడలిపోవాలని హృదయం కోరుకుంటూ ఉంది. ఎక్కడికో పారిపోయి తిరగాలని హృదయానికైతే అనిపిస్తోంది కాని 'మాలిక్' యొక్క అదుపు, అజమాయిషీ అలా జరగనివ్వటంలేదు. ఎందుకో తెలియదుగాని, నా నిద్ర మరియు ఆకలి అన్నీ హరించుకుపోయాయి, అయితే అవి పూర్తిగా లేకుండాపోయాయని మాత్రం భావించవద్దు. ఇప్పుడు నా స్థితి ఎటువంటి దంటే, ప్రతిపనీ జరిగిపోతున్నదిగాని దేనిలోనూ ఆసక్తి ఉండటంలేదు. ప్రపంచమైతే అలాగే ఉంది కాని నావరకునైతే అది కేవలం కర్తవ్యం నెరవేర్చటానికే అన్నట్లుగా ఉంది. 'మాలిక్' దయవలన, నావలన ఎటువంటి లోపంగాని, దోషంగాని, ఏ పనిలోను జరగటంలేదు.

అమ్మ తమకు ఆశీర్వాదాలు తెలుపుతున్నది. కేసర్ మరియు బిట్టో తమకు ప్రణామం చెబుతున్నారు. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 193

లఖీంపుర్,
11.03.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం ఒకటి తమకు చేరి ఉంటుందని భావిస్తున్నాను. ఇక్కడ అందరం క్షేమంగానే ఉన్నాం. అక్కడ కూడా అందరు క్షేమమేనని ఆశిస్తున్నాను. 'మాలిక్' కృపతో నాలో కలిగిన ఆత్మిక దశ నా అనుభవానికి వచ్చినంతవరకు వ్రాస్తున్నాను.

శ్రీ బాబూజీ, ఇప్పుడు పూజగది నుంచి గంటల తరబడి బయటకు రాకుండా ఉండాలని హృదయం కోరుతోంది కాని అది సంభవం కావటంలేదు. ఇప్పుడు స్థితి ఎలా ఉందంటే, నా శరీరం, ప్రాణం మరియు అంతరాత్మ అన్నీ కూడా 'మాలిక్'గానే అయిపోయినట్లుగానే అనిపిస్తోంది. శరీరం 'అతడే', ప్రాణమూ 'అతడే' మరియు ఆత్మ కూడా 'అతడే'. ఎప్పుడైతే హృదయం దేనిలోను ఆసక్తి లేకుండా ఉంటుందో అప్పుడు పూజగదిలోకి వెళ్ళుతున్నాను. పూజగదిలో పడి ఉండి తరచుగా నేను స్పృహలేని స్థితిలోనే ఉంటున్నాను. ఇప్పుడు కేవలం పిలుపు కోసమని 'మాలిక్'ను వేరుగా భావించినట్లయితే, 'అతని' రూపమే లేకుండాపోయి అంతా 'అతడే' అయిపోయాడు. శ్రీ బాబూజీ, నా స్థితి ఎలా అయిపోయిందంటే, ఒక తెలివి లేకపోయి, స్పృహలేని మనిషిలాగా అయిపోతోంది. అయితే ఉన్న తేడా ఏమిటంటే, ఈ స్పృహలేని సమయంలో కూడా ఆంతరికంలో 'మాలిక్', 'మాలిక్' అను మాట వెలువడుతోంది. ఆ అశాంతి దశ బహుశా ఇంతకు పూర్వం కంటె కూడా పెరిగినట్లుగా అనిపిస్తోంది. ఇక ఇప్పుడేమంటే, 'మాలిక్' మాత్రమే నా స్పృహ లేదా చైతన్యం, 'అతడే' నా శరీరం, ఆత్మ మరియు హృదయంగా ఉంది. పూజ్య శ్రీ బాబూజీ! ఇంతకుక్రితం నేను ఏ వాస్తవికత (రియాలిటీ) యొక్క దశను గురించి వ్రాసి ఉన్నానో, ఇప్పుడు ఆ దశ, దానితోపాటు దాని జ్ఞాపకం కూడా మాయమైపోయాయి. నేను ఇప్పుడు, నిరాకారం, నిర్గుణిరాలుగా అయిపోయాను. అప్పుడప్పుడు మధ్య మధ్యలో దివ్యానంద స్థితి కూడా కలుగుతూ ఉంటుంది.

'అతడు' (ఈశ్వరుడు) దయ ఉంచి క్లోరోఫారం (మత్తుమందు) యొక్క ప్రభావాన్ని రూపుమాపాలని, తమ జ్ఞాపకం మళ్ళీ పునరుద్ధరించి అధికం చేయాలని నేను ప్రార్థిస్తున్నాను. ఈ అశాంతి దశలో స్పృహ లేని స్థితి పెరిగినట్లుగా తెలుస్తోంది. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమభిమానాలు. అమ్మగారు తమకు ఆశీర్వాదాలు తెలుపుతున్నారు. అలాగే కేసర్ మరియు బిట్టో ప్రణామం చెప్తున్నారు. తమ అందరికీ హోలీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ఈరోజు అనగా 13వ తారీఖు, దశలో ఏదో మార్పు కలిగినట్లుగా అనిపిస్తోంది. అయితే అది (దశ) ఇప్పుడిప్పుడే మారినట్లుగాను, మళ్ళీ పాత స్థితిలాగా అయిపోతున్నట్లుగాను అనిపిస్తోంది.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 194

లఖీంపుర్,

18.03.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. చాలా రోజులుగా తమ నుంచి ఏ ఒక్క ఉత్తరమూ రానందున సమాచారం ఏమీ తెలియలేదు, కనుక తమ క్షేమసమాచారం తెలియజేయండి. అమ్మగారు, పెద్ద సోదరుడు ఈరోజు వెళ్ళారు. రెండు రోజులు ఉండటానికి పూలోం జిజ్జీ వగైరాలు ఇక్కడికి వచ్చారు. కేసర్ వారితోపాటు నిన్ననే వెళ్ళింది. ఆమె కూడా తమ ఉత్తరం కొరకు ఇక్కడ ఎదురు చూసింది. తావూజీ ఆరోగ్యం ఇంకను పూర్తిగా బాగుపడలేదు. శ్రీ బాబూజీ, ఆ బాగు ఏమిటో తమకే తెలియాలి కాని 'మాలిక్' దయతో నాకు వారిలో లోగడ నేను వ్రాసినట్లుగా కొంత నెమ్ము (చెమ్మ) ఏర్పడినట్లుగా తెలుస్తోంది.

నా ఆత్మిక ఉన్నతి 4-5 రోజులుగా, ఎందుకో తెలియదుకాని కొంత మందగించినట్లుగానో లేదా నిలిచిపోయినట్లుగానే తెలుస్తోంది. ఈ కారణంవల్లనే విరక్తి మళ్ళీ పెరిగిపోయింది. గత రెండు రోజులు, స్వప్నంలో షుమారు 2-3 గంటలపాటు విలపిస్తూనే గడిపాను కాని ఇప్పుడు ఆ స్వప్నం వగైరాలు కనిపించడంలేదు. ఇంతేగాకుండా అప్పుడప్పుడు నా హృదయం 'అతడి'ని జ్ఞాపకం చేసుకోవటానికి కూడా ఇష్టపడటంలేదు. ఏమి చేయాలో ఏమీ

తోచటంలేదు. తమరే దయచేసి ఏమి చేయాలో చెప్పండి. ఎందుకంటే, 'మాలిక్' నాకు వృధా చేయటానికి ఒక్క క్షణమైనా అవకాశం ఇవ్వటంలేదు కనుక సాధ్యమైనంత శీఘ్రంగా జవాబు వ్రాయండి. ప్రస్తుతం నడుస్తున్న స్థితిలో ప్రత్యేకత ఏమీ కనిపించటంలేదు. స్పృహలేని స్థితి కూడా చాలావరకు నాకు తెలియకుండానే ఉంటోంది. నాకు తెలియకపోయినప్పటికీ నాలో ఉన్న స్థితి ఇది ఒక్కటే. ఇంకా చెప్పాలంటే, అది కూడా నాకు తెలియకుండానే జరిగిపోతోంది. సరే, 'మాలిక్' అభీష్టం ఎలా ఉంటే అలాగే జరుగుతుంది. పూజ్య శ్రీ బాబూజీ, హృదయంలో చాలావరకు విరక్తి ఉంటోంది.

కేసర్ తమకు నమస్కారం చెబుతోంది. ఆమె వెళ్తూ వెళ్తూ తమకు నమస్కారాలు తెలుపుతూ లేఖ వ్రాయవలసిందిగా చెప్పి వెళ్ళింది. అమ్మగారు తమకు ఆశీర్వాదాలు తెలియజెప్పమని వెళ్ళారు. ఉత్తరాలకు జవాబులు వెంటనే వ్రాయండి.

తమ విధేయురాలైన

కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 195

లఖీంపుర్,

19.03.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు మాస్టర్ సాహెబ్‌గార్కి వ్రాసిన ఉత్తరం నిన్న చేరింది, విషయాలు విని సంతోషించాను. నూతన సంవత్సరంలో మేనకోడలు పుట్టినందుకు తామందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతున్నాను. 'మాలిక్' దయతో నాలో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

పూజ్య శ్రీ బాబూజీ, నన్ను ఎప్పుడు కూడా అధైర్యమే ఆవరించి ఉంటోంది. నేను నిన్నటి రోజున తమకు ఉత్తరంలో నా పురోగతి నిలిచి పోయినట్లుగా అనిపిస్తోందని వ్రాసాను. పూలోం జిజ్జీ వగైరాలు ఇక్కడకు వచ్చిన హడావిడిలో కొంచెంసేపు మాత్రమే కూర్చొండటం వలన మరియు నాకు ఏకాంతంగా గడిపే అవకాశం లేకపోయినందు వలన ఇలా జరిగిందేమోనని నేను భావిస్తున్నాను. నా శ్రీ బాబూజీ, ఇప్పుడు నడుస్తున్నటు వంటి స్థితిని నేను ప్రేమగా చెప్పలేను, ఎందుకంటే దానిని ప్రేమ అని చెప్పినట్లయితే దానిలో ద్వైతం (ఇద్దరు) అవుతుంది. నా స్థితి స్పృహలేనిదిగా అయిపోయింది. నా గురించిగాని, 'అతని' గురించిగాని ఏమి తెలియడంలేదు. అందువలన ఇప్పుడు ఉన్న స్థితి ఏమిటో నాకు అర్థం కావడంలేదు. ఏకాంతంగా కూర్చొని ఉండాలను తపన నాలో ఎప్పుడూ, ఎందుకు ఉంటున్నదో తెలియదు. అయితే అదృష్టవశాత్తు ఏకాంతం కొరకని ఎంతోకొంత సమయం దొరకుతోంది. అమ్మగారు, కేసరి ఇంటిలో లేకపోవడంవల్లనూ, పూజ్య తావూజీ ఆరోగ్యం ఇంకా బాగుపడనందువలన ఇంటివద్దనే ఉంటున్న కారణంగానూ, సభ్యత మరియు పనులపట్ల అప్పుడప్పుడు నాకు అయిష్టతగా అనిపిస్తోంది, కాని ఏం చేయను, 'మాలిక్' అభీష్టం ఎలా ఉందో మరి. నేనేగనుక మగ పిల్లవాడినై ఉండి ఉంటే, నిశ్చయంగా నన్ను 'తమ' వద్దనే అక్కడ ఉంచుకునే వారు. అక్కడికి రావాలని హృదయం ఎంతో ఉబలాటపడుతోంది కాని ఏం చేయను! హృదయం ఎప్పుడూ తాపంతో రోదిస్తూ ఉంటోంది. శ్రీ బాబూజీ! ఇప్పుడు తమరు ఈ స్థితి యొక్క ఆనందాన్ని నేను పరిపూర్ణంగా అనుభవించే టట్లుగా చేయమని నేను ప్రార్థిస్తున్నాను. నా హృదయమైతే అందుకు తల్లడిల్లు తోంది. తమరు దాని అంచనా గురించి భయపడాల్సిన పనిలేదు, ఒకవేళ అది అధికమైనాగాని అలాగే కానివ్వండి. ఎందుకంటే హృదయానికి స్థితి నియంత్రణ (కళ్ళెం వేయటం) అనేది ఎప్పుడైనాగాని చెడుగానే అనిపిస్తుంది. కనుక దయచేసి నన్ను పూర్తిగా స్వేచ్ఛ కొరకు పగ్గం వదిలినట్లయితే నాకు చాలా బాగుంటుంది. "పౌత్రి (కుమారుని కుమార్తె) కలిగిన ఆనందంలో నేను ఒక భిక్షకురాలికి ఈ దానం ఇచ్చాను" అని భావించండి. 'అతని'పట్ల ప్రేమ బహుశా నాలో ఉండకపోవచ్చు అని చెప్పలేనుగాని నాకు 'అతని' (అనగా ప్రేమ యొక్క) జ్ఞానమే లేకుండాపోయింది. నాకు స్వయంగా 'అతని' జ్ఞానం (లేదా

ఎరుక) లేకుండాపోయినపుడు ఇంక ప్రేమ గురించి ఏం చెప్పను!

బాహ్య సంబంధం ఎప్పుడో తెగతెంపులైపోయింది. ఎందుకంటే, ఈ స్థితి ఇప్పుడు ఇలా ఉంది అనిగాని లేదా అలా అయిపోయిందని గాని చెప్పవచ్చు. అదేమిటంటే శరీరాన్ని విడిచిపెట్టాక గత్యంతరం లేని పరిస్థితిలో హృదయం, ఆత్మ 'అతడి'నే దృష్టిలో నిలుపుకొని, ద్వైతాన్ని విస్మరించి అక్కడే స్థిరపడిపోయాయి. శ్రీ బాబూజీ, ఏమి చేయాలి, ఎలా చేయాలి, ఎక్కడికి వెళ్ళాలి అనేవి ఏమీ అర్థం కావటంలేదు. స్పృహ లేకుండా ఉండటం గురించి కూడా స్పృహ లేనట్లుగా ఉన్నాను. పూజ్య శ్రీ బాబూజీ, ఇప్పుడు నాకు త్యాగంతోగాని, వైరాగ్యంతోగాని సంబంధం లేకుండాపోయింది. నేను త్యాగాన్ని కూడా త్యజించివేశాను, వైరాగ్యంతో కూడా వైరాగ్యం చెంది ఉన్నాను. ఇప్పుడు నాకు దేనిని గురించి స్పృహ లేనట్లుగానే ఉంది. 'మాలిక్' దయతో ఇటువంటివన్నీ మాయమైపోయినప్పటికి, ఇంకా ఏదో మిగిలి ఉంది, కాని ఆ కొంచెం ఉన్నది అనేది ఏమిటో నాకు తెలియటంలేదు. నాకు తెలిసిందల్లా ఏమిటంటే నా 'మాలిక్'కు అన్నీ తెలుసు అని, ఎందుకంటే నా చేయి 'అతని'వైపు చూపబడి ఉంది. ఇంకా ఏమిటంటే, ఇలా అయినప్పటికి కూడా స్థితి ఇంతకుపూర్వం కంటె కూడా కొంచెం తరుగుగానే ఉంది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 196

లఖీంపుర్,
22.03.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసిన ఉత్తరం మొన్నటి రోజున వచ్చింది, సమాచారం తెలిసింది. నా ఉత్తరం ఒకటి తమకు అంది ఉండవచ్చు. 'మాలిక్' దయతో కలిగిన నా ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను. నా దశలో తమరు ఏమైతే మార్పు కలిగించి దానిని వ్రాసారో, ఆ విషయాన్ని నేను నా దైనందిని (డైరీ)లో వ్రాసేసాను, అంతలోనే తమ ఉత్తరం వచ్చింది. తమకు అనేక ధన్యవాదా లర్పిస్తున్నాను.

శ్రీ బాబూజీ, నాకు ఏమైందో ఏమో ఆ దైవానికే తెలియాలి, ఇప్పుడు ఎలా ఉందంటే, మీరాబాయి పదాలుగాని, మరేమైనా దైవ భక్తి ప్రేమలు కలిగిన పదాలుగాని నేను గానం చేయలేకపోతున్నాను, చదవలేకపోతున్నాను. 'అతని' గురించి ఏదైన చర్చ జరుగుతున్నప్పుడు కూడా వినలేకపోతున్నాను. పూజ్య తావూజీ సత్సంగ్‌లో అందరికీ ఏవో విషయాలు చెబుతున్నపుడు, నాకు ఒక్క నిమిషంపాటు కూడా వినడానికి అనాస్తకత ఉంటున్నది. హృదయంలో ఏదో ఖంగారు వంటిది కూడా కలుగుతోంది. అక్కడి వాతావరణం కూడా తర్వాత కొంచెం భారంగా అనిపిస్తోంది. నాకు ఆ విధంగా అనిపించినప్పటికీ ఇతరులకు మాత్రం చాలా బాగుందనిపిస్తోంది. నేను ఎవరికైనా, ఏమి చెప్పాలో తమరే చెప్పండి. అవునుగాని, ఒక్కటి మాత్రం ఖాయం, నేను నా పనిలో నిమగ్నమై ఉంటే మాత్రం నాకేమీ ఇబ్బంది అనిపించదు. అదేమిటో దైవానికే తెలియాలిగాని, స్థితిలో దివ్యానందం కలుగుతోంది. ఆంతరిక సంతోషం ఎంతగానంటె అది వ్యాకులత (కలత) కలిగించేదిగా ఉంటోంది. అప్పుడప్పుడు నా నుంచి అనేక కిరణాలు ఉట్టిపడుతున్నట్లుగా అనిపిస్తోంది. 3,4 రోజుల నుంచి నాభిలోను, దాని చుట్టుప్రక్కల ఏదో (బాధ వంటిది) గందరగోళం వంటిది అనుభవమవుతూ ఉంది. నిర్మలీకరణ మూలంగా తేలికదనం కూడా అనుభవం కావటంతోపాటు, అప్పుడప్పుడు తేలికపాటి బాధ కూడా ఉంటోంది. ఆనందం యొక్క స్థాయి కూడా ఎంతగా ఉందంటే, రోజంతా గుండె పట్టుకుని ఆనందిస్తూ ఉండాలని మనస్సు కోరుకుంటోంది. అప్పుడప్పుడు నా స్థితిలో స్పృహ లేకుండా ఉంటూ ఉండగా, దానిలో ఆశ్చర్యకరంగా వ్యాప్తి విశేషంగా జరుగుతున్నట్లు అనిపిస్తోంది. ఈ ఆశ్చర్యకరమైనది ఒక ప్రత్యేకమైన స్థితిని

కలిగి ఉన్నట్లుగా తెలుస్తోంది. శ్రీ బాబూజీ, ప్రస్తుతం ఎటువంటి స్థితి ఉందంటే, నేను ఆనందిస్తూ ఉండాలా, విలపిస్తూ లేదా తపిస్తూ ఉండాలా అనేది తెలియటంలేదు. ఇప్పుడు స్థితి ఎలా ఉందంటే, ప్రపంచాన్ని గురించి పట్టించుకోవటం అనేది ఏనాడో అంతమైపోయింది, కాని ఇప్పుడు దైన్యంతోగాని, ప్రాపంచిక కోర్కెతోగాని సంబంధంలేకుండా పోయింది. 'దైన్యం' మరియు ప్రపంచం రెండింటిని పట్టించుకోవడం లేదు. ఇంకా చెప్పుకోదగ్గది ఏమిటంటే ఇవన్నీ కూడా (దీన్ మరియు దునియా) ఏమైపోయాయో కూడా పట్టనట్లుగా ఉంది. ఇప్పుడు ఉన్న స్థితి ఏమిటంటే, గాఢమైన తపన కూడా పూర్తిగా దహించుకుపోయింది. అది ఎక్కడి నుండి వచ్చిందో, అది ఎవరైతే ఇచ్చారో 'అతని' వద్దకు తిరిగి వెళ్ళిపోయింది. శ్రీ బాబూజీ, 'అతడి' వస్తువు 'అతడి'కే సమర్పితమైపోయింది. ఇప్పుడింక 'అతడి'కి తెలియాలి; 'అతడి' పనికి తెలియాలి. లయ అవస్థ, త్యాగం, వైరాగ్యం ఇంకా ఏవైతే 'అతడి' కృపతో కలిగాయో అవన్నీ కూడా అలాగే అయిపోయాయి. 'అతడి' వస్తువులు 'అతడి'కే చెందిపోయాయి కనుక మంచిపనే జరిగింది. ఇంకా నావద్ద ఒక్క అగ్ని మాత్రమే మిగిలి నాలో ఇమిడి ఉంది. దానితో అన్నీ దహించుకుపోతాయి. పూజ్య శ్రీ బాబూజీ! 'మాలిక్' అపారకృపతో, 'అతడి'పట్ల మానవుడు ఏ కర్తవ్యమైతే నిర్వహించ బడాల్సిఉందో దానిని ఇంక క్రమంగా పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పుడింక 'అతని' వస్తువు మీద నా అమర్యాదపూర్వకమైన ఆధిపత్యం (అనగా నాది అనిపించుకోవటం) చెల్లిపోయింది. ఇంక 'అతడి' వస్తువులన్నీ 'అతడి'కే చెందిపోయాయి. ఇప్పుడు 'అతడు' ఏది చేయాలనుకుంటే అది చేయవచ్చు. ఈ స్థితిలో దివ్యానందాన్ని కలిగించినందుకు 'మాలిక్'కు వేలకొద్దీ ధన్యవాదాలు. శ్రీ బాబూజీ, ఇప్పుడు తమరు నా స్థితిని మార్చడమేకాక దివ్యానంద కోశాన్ని అన్ని వేళలా తెరచి ఉంచారు. అప్పుడప్పుడు అది ఎంతగా అయిపోతుందంటే, హృదయం, శరీరం నుంచి తెగతెంచుకుని బయటకు ఉప్పొంగుతుందేమో అన్నట్లుగా ఉంటోంది. 'మాలిక్' దయతో గృహమంతటా కూడా ఈ స్థితి వ్యాపించి ఉన్నది. పూజ్య శ్రీ బాబూజీ, ప్రస్తుతం ఉన్న అపరిమితమైన ఆనంద దశను గురించి మాటల్లో చెప్పతరం కాదు. ఇప్పటివరకు నాకు ఇటువంటి దశ ఎప్పుడూ దక్కి ఉండలేదు. శ్రీ బాబూజీ, నేను ఇప్పుడు ఒక దివ్యానంద పరవశుడైన ఫకీరులాగా అయిపోయాను. ఈ ఆనందం కారణంగా, కొంచెంసేపు శరీరం కంపించి పోతూ ఉంటున్నది. అయినప్పటికీ 'మాలిక్' దయతో ఏ దశలోను అది వశం తప్పకుండా ఉంటోంది. ఒకవేళ అది స్వాధీనం తప్పినట్లయితే ఆ ఆనందం చెప్పనలవికానిదిగా ఉంటుంది.

చిన్నవారైన సోదరసోదరీలకు ప్రేమాభిమానాలు. చంటిపిల్ల, చిన్నపినతండ్రి (సర్వేష్) చాలా ఆనందంగా ఉండి ఉంటారు. అప్పుడప్పుడు నేను వాయు సమానంగా అయిపోయి గాలిలో తేలిపోతున్నట్లుగా ఉంటున్నది.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 197

షాజహాన్‌పుర్,

22.03.1952

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నీ ఉత్తరాలన్నీ చేరాయి. హిందీలో వ్రాసేవాళ్ళు ఎవరూ దొరకనందున నేను నీకు హిందీలో వ్రాయలేకపోయాను. మామూలు విషయాలైతే నేనే స్వయంగా వ్రాసేవాడను కాని బాగా ఆలోచించి వ్రాయవలసివచ్చినప్పుడు, వ్రాయటం ఆలోచించటం ఒకే సమయంలో కుదరవు. చాలా ఆధ్యాత్మిక స్థితులు ఈ విధంగానే ఉంటాయి, అవి అలా వస్తూనే ఉంటాయి. ఎవరైతే సావధానంగా ఉంటారో, అలాగే 'మాలిక్'తో తోడుగా ఉంటారో వారికి అక్కడి అనుభూతులు, స్థితిగతులు బాగా తెలుస్తూ ఉంటాయి. మన మిషన్‌లో గుడ్డిగా నడిచేవాళ్ళ సంఖ్య బాగానే ఉంది. వారు సంతృప్తికోసం మరియు ఒక విధిలాగా పూజ నిర్వహిస్తారు కాని దాని

గురించి పట్టించుకోరు. ఇటువంటివారిని ప్రోత్సహించి నేను తప్పుచేసానని అనుకుంటున్నాను కాని ఏమి లాభం! చాలామందికి ఇప్పటివరకు వారు పొందగలిగినది ఏమిటో తెలియని పరిస్థితి మూలంగా నేను నా కృషిని చాలావరకు తగ్గించాను. జనానికి (అభ్యాసులకు) జిజ్ఞాస, అభిరుచి కలగటంలేదు. అలా కాకుండా ఉంటే వారికి కూడా ఇటువంటి అనుభవానందం కలిగి ఉండేది.

నీవు ఈ రోజున వ్రాసిన ఉత్తరంలో నాకు మనుమరాలు కలిగిన సందర్భాన్ని పురస్కరించుకొని కలిగిన ఆనందంలో మునిగి, నీకు పరిపూర్ణ ఆనందాన్ని కలిగించమని కోరటం బహు విచిత్రంగా ఉంది. నాకు మనుమరాలు కలిగిందంటే, అందుకు దైవానికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ఆమెకు దీర్ఘాయువును, సుఖసంతోషాలను భగవంతుడు అనుగ్రహించుగాక! అయితే నాకు మనుమరాలు జన్మించింది అను భావమే కలగనపుడు, ఆనందం యొక్క భావన మాత్రం ఎక్కడి నుంచి వస్తుంది? మరి నాకు ఆశ్చర్యం కలిగించిన విషయం ఏమిటంటే, నీవు వ్రాసినటువంటి ఆనందాన్ని ఇవ్వటానికి నేను సిద్ధంగా లేనంటావా! నీ యొక్క ప్రస్తుత స్థితి, నీవు కోరిన ఆనందస్థితి కంటె శ్రేష్ఠమైనది. దీనిలో మొదట ఆవిరి వంటిది ఉద్భవించగా ఇప్పుడు కాంతి ఉద్భవిస్తున్నట్లుగా గ్రహించుకోవాలి. దానికంటె ఇది అన్ని విధాలుగా మంచిది. నీవు అడిగిన దానిని నేను తిరస్కరించలేను, ఎందుకంటె నిన్ను గత స్థితిలోకి తీసుకువచ్చి నిలపాలని నా హృదయం, నియమ విరుద్ధంగా భావిస్తోంది. దీనివలన నిన్ను ఉన్నత స్థితి నుంచి క్రిందికి దిగజార్చినట్లవుతుంది. నా హృదయం దానికి అంగీకరించటంలేదు. అందుచేత నేను ప్రార్థన పూర్వకంగా దీనిని నియంత్రించుకోవటమా లేక ఒక్క రోజు వరకు మాత్రమే ఇటువంటి స్థితిని కల్పించమని ప్రార్థించటమా అని యోచిస్తున్నాను. అభ్యాసికి ఎప్పుడూ పైకి ఎగబ్రాకాలనే కోరికే ఉండాలి. ఈ స్థితిలో ఎవ్వరూ అవధూతగా నిలిచిపోకూడదని, ముందు ఉన్న పురోగమనం నిలిచిపోకూడదనే ఉద్దేశ్యంతో పర్యవేక్షణ చేయటం జరుగుతుంది. అందుచేత లాలాజీ సాహెబ్ నిన్ను పర్యవేక్షిస్తూ సంరక్షిస్తున్నారు.

బిటియా! ఇది గమనించు. ఇది పరమానందం (అసలైన ఆనందం) యొక్క దిగువతలం మాత్రమే. ఇందులో మాయా తత్వం ఇమిడి ఉంది. నేను ఈ స్థితిలో గడిపినప్పుడు నేను దానిని భరించలేకపోయాను. అప్పుడు ఒకాయన (ఆధ్యాత్మికతానుభవశాలి) తనకు ఉన్న పరిజ్ఞానంతో మంచి చేశాడు. కాని నా ప్రస్తుత అవగాహన ప్రకారం, ఆయన ఆ పనిని సక్రమంగా చేపట్టలేక తప్పుచేశాడని అనిపించింది. లాలాజీ సాహెబ్ దయవలన నీ స్థితిని చాలా క్రమబద్ధంగా సరిదిద్దాను. ఈ విషయంలో బహుశా నేను కొంచెం తొందరపడి ఉండవచ్చు. ఈ స్థితి నాలోనూ కలిగింది. నీవు కూడా దీనిని అనుభూతి చెందావు. అయితే ఎవ్వరైనా నన్ను వైభవం, ఆనందమూ లేనట్టి నీ ఈ ప్రస్తుత స్థితిలో నిలపదలుస్తున్నావా అని ప్రశ్నించవచ్చు. అటువంటి నీ యొక్క ఈ నిరానందస్థితిలో ఉండటానికి నేనుగా సిద్ధపడను. నేను నా యొక్క ప్రస్తుత స్థితితో చాలా తృప్తిగా ఉన్నాను. అందుకు గురుమహరాజ్‌కు నేను ఎంతగానో ధన్యవాదాలు తెలుపుతున్నాను. నేను నిన్ను రెండవ అంచెమీదకు చేర్చదలిచాను. దానిని **'B'**గా గ్రహించుకోవాలి. ఇప్పుడు నేను ఏమి చేయాలో బోధపడటంలేదు. నీ కోర్కెను తిరస్కరించాలని కూడా అనిపించటంలేదు. ఇంక నీవు ఏమి చేయమని వ్రాస్తే అది చేస్తాను. నేను అతికష్టానికి గురయ్యాను. ఉన్నతి చెందేవారిని దిగజార్చటానికి ధర్మం కూడా అంగీకరించదు. ఆ విధంగా దిగజార్చితే, ఒక త్రోపులాంటిది జరిగి తర్వాత అది అశాంతికే కారణం కావచ్చు. నాకు తెలిసినంతవరకూ అసంభవమే అయినప్పటికీ, ఆ విధంగా క్రిందికి దించకుండా పని నిర్వర్తించ గల ఉపాయం / నేర్పు ఏమైనా ఉన్నదా అని నేను ఈరోజు లాలాజీ సాహెబ్‌ను సంప్రదిస్తాను. ఈ స్థితిలో కాంతిని వృద్ధి చేయవచ్చునుకాని, ఆవిరి వంటి స్థితిని కలిగించటం అభ్యాసిని ఆ అంచెనుంచి క్రిందికి దించకుండా సాధ్యపడదు. నీవు నీ పూర్వపుస్థితిని కొంతసేపు ఆదమరచి, నీ ప్రస్తుత స్థితిని నెమరువేసుకుంటున్నట్లయితే ఇదే మంచిదనిపిస్తుంది. రాబోతున్న దశలో నిర్మలత్వం, నిరాడంబరత్వం బాగా అనుభవానికి వస్తాయి.

ఇంకను తొలగించాల్సిన పరదాలు (కవరింగ్స్) ఎన్నో ఉన్నాయి. వాటిని దృష్టిలోకి తీసుకుంటే ఆధ్యాత్మికతకు ఇదే ఆరంభం అనిపిస్తుంది. ప్రతి స్థావరంలోను ఇంత ఎక్కువ సమయం తీసుకుంటే వేల సంవత్సరాలే అవసరమవుతాయి. మరి నేనేమో నా జీవితకాలంలోనే నిన్ను 'ధృవం' అనగా గమ్యం చేర్చాలనుకుంటున్నాను. నీవు వ్రాసిన దుఃఖం వంటి స్థితిని వర్ణిస్తూ కబీరు సాహెబ్ వ్రాసిన పద్య ద్విపద ఇలా ఉంది:

**"హంసీ-ఖేల్ నహిపాయియా, జిన్‌పాయా తిన్ రోయా**

**హసీ-ఖేల్ పివ్ మిలే, తో కౌన్ దుహగిన్ హెూయ్‌॥"**

అనగా నవ్వుతూ ఆడుతూ 'అతడి'ని సులభంగా పొందటం సాధ్యం కాదు. 'అతడి'ని ఎవరు పొందారో వారు దుఃఖించినవారే. ఆ విధంగా ఆటపాటలతో సరదా సరదాగా ప్రియుడు (దైవం) దక్కితే ఇంక ప్రేమతో తపించేవారు ఎవరు ఉంటారు?

నీ సోదర సోదరీలకు ఆశీస్సులు. అమ్మగార్కి ప్రణామములు.

నీ శ్రేయోభిలాషి,
రామచంద్ర

## ఉత్తరం సంఖ్య - 198

లఖీంపుర్,
24.03.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసిన ఉత్తరం దద్దాగారి చేతి నుంచి ఇప్పుడే అందుకున్నాను. తమ దీనురాలిపట్ల ఈ అపారకృపకు ధన్యవాదాలు. నాకు ఇప్పటివరకు ఏదైతే చేకూరిందో అది అంతా 'మాలిక్' కృపవల్లనే. 'అతడు' నాకు ఇవ్వనిదంటూ ఏమీ ఉండదు. పూజ్య శ్రీ బాబూజీ! నాకు అర్థం చేసుకునే సామర్థ్యం కొంచెం తక్కువ, అందుచేత తమరు వ్రాసినది -'నేర్పువాడు' (అనగా శిక్షకుడు), నేర్చుకొనువాడు (అనగా శిష్యుడు) దగ్గర దగ్గరగా ఉన్నట్లయితే ఈ స్థితి యొక్క ఆనందం కల్పించటం సులభంగా ఉంటుంది. ఎందుకంటే, దూరం నుంచి దానిని అంచనా వేయటం సాధ్యపడదు అని తెలుపుతున్నప్పటికీ, నాకు సంపూర్ణ విశ్వాసం ఉంది, ఉంటుంది కూడ. ఎందుకంటే, ఆ విధంగా "ఇచ్చువాడు" (అనుగ్రహించు వాడు) సాటిలేనివాడు కనుక. తమరు దయచేసి నన్ను క్రిందికి దింపవద్దు. అది ఎలాగంటే, తమరు -"ఇప్పుడు ఉన్న స్థితి, గతంలో ఉన్న స్థితి కంటె అనేక రకాలుగా మంచిది" అని వ్రాసారు. పూజ్య శ్రీ బాబూజీ, నిజం చెప్పాలంటే, నాకు 'మాలిక్' కంటె స్థితి ఏదైనా నాకు ప్రియమైనది కాదు. నేను ఏమీ కోరటంలేదు, ఎందుకంటే తమరు గతంలో ఒకసారి వ్రాసారు, ఇప్పుడూ వ్రాసారు, దానినే నేను కోరుకుంటున్నాను. దానిని నేను హృదయ పూర్వకంగా సాధించే ప్రయత్నంలో అడుగు ఎప్పుడూ ముందుకే వేస్తాను. **అపార దయాళువు అయిన పూజ్య సమర్థ 'శ్రీ లాలాజీ'కి ధన్యవాదాలు ఎవరు అర్పించగలరు! 'వారు' మాపట్ల అపార దయతో 'తమరిని సమర్పించారు'.** 'మాలిక్'ను పూర్తిగా ప్రాప్తింపచేసుకొనగల ప్రయత్నమే 'వారి'కి ధన్యవాదాలర్పించగలదు. పూజ్య శ్రీ బాబూజీ, నాకు దివ్యానందం మొదలైన వాటి అవుసరం ఏమీ లేదు, నాకు 'మాలిక్' మాత్రమే కావాలి. తమరు నన్ను '**B**' పాయింట్ వద్దకు చేర్చాలనుకున్నారు, కాని దానికి కొంత ఆలస్యమైనందున నాకు నష్టం వాటిల్లింది. అయినా కూడా 'మాలిక్' దయ తప్పకుండా అన్నింటినీ సరిదిద్దుతుంది. 'తమరు' ఎలా అనుకుంటారో అదే విధంగా చేయండి. ఎందుకంటే, **నా ఆనందం కూడా ఎప్పుడూ 'తమ' ఆనందంతోనే ముడిపడి ఉంది. 'తమ' అభీష్టానికి వ్యతిరేకంగా కోట్లకొద్ది ఆనందాలు కూడా నాకు ఎట్టి పరిస్థితుల్లోను ఆనందాన్ని సమకూర్చలేవు,** కనుక 'తమ'కు ఇష్టమైనపుడే నన్ను ముందుకు నడిపించుకు వెళ్ళండి. నేను ఇలా వ్రాసినందుకు మనసులో ఏమీ పెట్టుకోకండి. నిజంగా నేను వ్రాసివేశాను కూడ, ఏమని అంటె, ఎప్పుడైతే ముందు దశ వస్తుందో అప్పుడు స్వచ్ఛత

మరియు సరళత్వం అధికమవుతున్నట్లుగా ఎప్పుడూ తెలుస్తూనే ఉంటుంది. 'మాలిక్' కృపతో కలిగిన నా ఆత్మిక దశను గురించి వివరిస్తున్నాను.

శ్రీ బాబూజీ, ఇప్పుడు 'అతని'వైపుగా చూస్తూ చూస్తూనే, దృష్టియే మాయమైపోతున్నట్లుగాను, కాంతి కూడా అదృశ్యమవుతున్నట్లుగాను ఉంది. 'అతడు' గురించియే ఆలోచిస్తూ ఆలోచిస్తూ ఉంటే చివరకు ఆలోచనయే లేకుండాపోతోంది. దీనినే ఇంకొక రకంగా చెప్పాలంటే, ఏదైనా అసలు ఆలోచించాల్సిన అవుసరమే లేకుండాపోయింది. స్పృహ (చైతన్యం) అటువైపు నిలిపి ఉంచినట్లయితే అది కూడా లేకుండాపోయి చివరకు స్పృహయే లేకుండాపోయినట్లు గాను అనిపిస్తోంది. శ్రీ బాబూజీ, ఇప్పుడు పూర్తిగా నేను 'అతడి' వశమే అయిపోయి ఉన్నాను కనుక 'ఆతడు' ఎలా ఉంచితే అలాగే ఉంటాను. ఇప్పుడు స్థితి కొంచెం ఈ విధంగా ఉంది: 'అతడు' ఎక్కడ కూర్చుండబెట్టితే అక్కడే కూర్చుంటాను, 'అతడు' ఏది ఇస్తే అది భుజిస్తాను, 'అతడు' ఏవి ధరింపజేస్తే వాటినే ధరిస్తాను, 'అతడు' విక్రయించినట్లయితే విక్రమైపోతాను. ఓ మహరాజ రామ! నేను గిరిధరుని (శ్రీకృష్ణుని) ఇంటికే పోతాను" అన్నట్లుగా అనిపిస్తోంది. (ఇవి శ్రీ కృష్ణుని ప్రేమలో మునిగిపోయిన భక్త శిఖామణి మీరాబాయి పలుకులు). శ్రీ బాబూజీ! ఎందుకంటే, 'మాలిక్' తప్ప ఇటువంటి అభాగ్యురాలిని ఎవరు మాత్రం పట్టించుకుంటారు! ఇంక ఆశ్రయ మిచ్చువాడు 'అతడే', ఆశ్రయం 'అతడి' నివాసమే. అందరినీ ఆదుకునే వాడు 'అతడే', అందరికీ ఆశ్రయమైనది 'అతని' గృహమే. అది ఎల్లవేళలా ప్రతి ఒక్కరికీ తెరచి ఉంచబడింది. శ్రీ బాబూజీ! ఇప్పుడు ఈ స్థితిలో శరీరం విదేహమైపోయింది (విదేహ స్థితి – శారీరక స్పృహ లేకపోవటం). నాలో భక్తి తగ్గిపోతున్నట్లుగా అనిపిస్తోంది, అయితే స్థితి మాత్రం చాలా బాగుంది. అదేమిటో దైవానికే తెలియాలి. ఇంకా మిగిలిన విషయాలు తర్వాత వ్రాస్తాను. ఎందుకంటే, ఏదో విధంగా ఎంత త్వరగా వీలుపడితే అంత త్వరగా ఈ ఉత్తరం తమకు చేర్చాలన్నదే నా ఆలోచనగా అయ్యింది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 199

లఖీంపుర్,
25.03.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసిన ఉత్తరం ఈ రోజు చేరింది. దానికి జవాబు వెంటనే వ్రాసి పోస్టు చేశాను. ఇప్పుడు దద్దా ద్వారా, వారు ఉదయం బండిలోనే షాజహాన్‌పూర్ వెళ్ళుతున్నట్లుగా తెలిసింది. అందుకని ఈ చిన్న ఉత్తరం తమకు వ్రాస్తున్నాను.

దయచేసి తమరు ఎప్పుడు కూడా తమకు తోచినట్లుగానే చేయండి. నేను ఆ సమయంలో ఆవేశంలో ఆ విధంగా వ్రాసేసాను. నా మనస్సు ఎప్పుడూ తమ మనస్సులాగే ఉంటుంది. నా అజ్ఞానం మూలంగా తమరు ఆలోచనలోపడ్డారు. అందుకుగాను మళ్ళీ ఇటువంటి తప్పు నావలన జరగకూడదని 'మాలిక్'ను ప్రార్థిస్తున్నాను. పూజ్య శ్రీ బాబూజీ, తమ కృప మరియు ప్రేమయే నన్ను కొనివేశాయి. తమకు మరియు శ్రీ లాలాజీకి ఎవ్వరైనా ధన్యవాదాలు ఎలా అర్పిస్తారు! ఈ దీనురాలి శరీరంలోని అణువణువూ 'మాలిక్'కు స్వయంగా అర్పించినప్పుడు మాత్రమే 'అతని'కి అసలైన ధన్యవాదాలర్పించటం జరుగుతుంది. పూజ్య శ్రీ బాబూజీ, నాకు ఏ స్థితిపట్లగాని ప్రేమ లేదు, మరి ఏ కోరికా లేదు, నాకు ఉన్నదల్లా కేవలం ఆ 'ఒక్కరు'తోనే. తమరు పలుమార్లు వ్రాసినట్లుగానే, నేను ఎల్లప్పుడూ ముందడుగు మాత్రమే వేస్తాను. అందులో సందేహం లేదు కనుక దయచేసి తమరు నన్ను క్రిందికి

లాగవద్దు. నావంటి దీనురాలిపట్ల తమ దయ ఎప్పటికీ లేకుండాపోదు. స్థితి ఉప్పొంగిన తర్వాతనే దానిలో సరళత్వం మరియు స్పష్టత ఇదివరలో వచ్చినట్లుగానే, 'మాలిక్' కృపతో ఇప్పుడూ అదే పరిస్థితి ఉంది. వదినగార్కి (ప్రకాష్ భార్య) జ్వరం తగ్గినట్లుగా తెలిసి సంతోషమయ్యింది.

నా ఉత్తరం తమకు ఎల్లుండి చేరుతుందని అనుకుంటాను. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు. తమరు ప్రతిదీ నాకు తగినట్లుగా దయతో ఇచ్చారు. ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు, దానిలో సందేహం లేదు, అందుకు తమకు అనేక ధన్యవాదాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 200

లఖీంపుర్,

26.03.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరాలు రెండు తమకు చేరి ఉంటాయాని అనుకుంటున్నాను. పూజ్య తావూజీ (పెదనాన్న) గారి ఉత్తరం ద్వారా, హోలీ సమయంలో 'తమ' శ్వాసకోశ బాధ మళ్ళీ విజృంభించిందని, దగ్గు ఇప్పటికీ ఉందని తెలుసుకుని చాలా బాధ కలిగింది. తమకు గుండె నొప్పి చాలాసార్లు వచ్చింది. తమకు శ్వాసకోశ బాధ ఇప్పటికీ ఎందుకు వస్తున్నదో అర్థం కావటంలేదు. తమ ఈ బాధ కొంచమైన ఉపశమనం కావటానికి ఏమి చేయాలో అర్థం కావటంలేదు. ఏమైనప్పటికి, 'మాలిక్' దయ నా ప్రయత్నానికి తోడుగా ఉన్నట్లయితే, ఇంక ఇటువంటిది తలపడకుండా ఉంటుంది. అందుకు నా ప్రయత్నం మాత్రం ఆగకుండా జరుగుతూనే ఉంటుంది. అయినా కూడా 'అతడి' కృపయే ఆశ్రయం, రక్షణ కల్పించేది కూడా 'అతడే' అనటంలో సందేహంలేదు.

పూజ్య శ్రీ బాబూజీ! తమ ఉత్తరం చదివాక నా కళ్ళు తెరుచుకున్నాయి (అనగా నాకు తెలిసింది). ఎందుకంటే, 'అతడు' గాకుండా ఇటువంటి కృపను ఇంకెవరు మాత్రం చూడగలరు! **అభ్యసించేవానికి (విద్యార్థి, శిక్షణ పొందేవాడు) ఆనందంగానే ఉంటుంది కాని అభ్యసింపజేసేవానికి (శిక్షణ ఇచ్చువానికి) మాత్రం ఆ పని కష్టమైనదిగానే ఉంటుంది. అయినప్పటికి కూడా సమర్థ సద్గురు శరణు సహాయంతో, ఆశ్రయమనే గొడుగు క్రింద ఉన్నప్పుడు కష్టమంటూ ఏదీ ఉండబోదు అనేది నిశ్చయం.** ఎంత క్రమబద్ధమైన విధానంతో 'తమరు' ఈ దీనురాలిపై దయ నిలుపుతున్నారో గ్రహించి అప్పుడప్పుడు హృదయం గద్గద మౌతుంది (అనగా హృదయానికి చెప్పనలవి కాకపోతుంది). శ్రీ బాబూజీ, నా ఈ ప్రార్థన ఒక్కటి ఆలకించండి, ఇంకెప్పుడూ ఇలా చేయను (అనగా తమకు ఇటువంటి ఉత్తరాలు, బాధ కలిగించేవి వ్రాయను). నేను వ్రాసిన వాటిమీద అంతగా దృష్టి పెట్టకుండా, తమకు ఏది ఉచితమనిపించితే దానిని చేయండి, నేను దానితోనే ఇప్పటివరకు సంతృప్తికరంగా ఉన్నట్లే ఇక ముందు కూడా ఉంటాను. దయచేసి తమ ఆరోగ్యం గురించి తప్పకుండా వ్రాయండి. 'అతడు' తమను క్షేమంగా ఉంచాలి అనేది 'అతని'కి మా నిరంతర ప్రార్థనగా ఉంది. పర్యవేక్షణకు ఎంత విశిష్ట ప్రాముఖ్యత ఉందో నాకు తెలియలేదు కాని ఇది కూడా 'మాలిక్' యొక్క మహత్తర కృపయేనని మాత్రం తెలుసుకున్నాను. పూజ్య శ్రీ బాబూజీ! ధర్మం ధర్మం అంటూ అందరూ గావుకేకలు పెట్టుతూ ఉంటారు కాని, ధర్మం యొక్క అంతరార్థం – "అభ్యాసీని ఉన్నత స్థానం నుంచి క్రిందికి దిగజార్చటానికి ధర్మం అంగీకరించదు" అని తెలిసినవారు తమరు మినహా ఇంకెవ్వరూ లేరు. "నేను హిందీ వ్రాయటం నేర్చుకుంటాను" అని తమరు వ్రాసి ఉన్నారు. అది చాలా దయతో కూడిన విషయం. అయితే 'తమరు' ఉర్దూలోనే వ్రాస్తూ ఉండండి. అందులో అవసరమైన మాటలను నేను హిందీలో వ్రాసుకుంటూ ఉంటాను. ఉర్దూలో వ్రాయటం తమకు తేలికగా ఉంటుంది కాని హిందీలో వ్రాయటం తమకు కష్టమనిపిస్తుంది. నాకు పని జరుగుతుంది కనుక తమకు కష్టం

అనిపించదు, తమకు ఇష్టమైతే అలా చేయండి. ఏదైనా వ్రాయడానికి ఎప్పుడూ తమకు కష్టంగా ఉంటుందని నాకు తెలుసు, కాని నిస్సహాయురాలిని, నేను ఏమి చేయగలను! నేనే కనుక మగపిల్లవాడినై ఉంటే, ఎంత కష్టమైనా సరే ఉర్దూ నేర్చుకుని, తమకు ఈ కష్టం కలగకుండా చేసి ఉండేదానను. నేను ఇప్పటికీ ఉర్దూ చదవాలనే అనుకుంటున్నాను కాని అది దైవేచ్ఛ, ఎలా ఉంటే అలా జరుగుతుంది. నేను తమవద్ద ఉన్నట్లయితే, ఖచ్చితంగా ఇంగ్లీషు మరియు హిందీ నేర్చుకొని వ్రాసి వేసేదానను. అదేం జరుగుతుందో చూద్దాం. తావూజీకి భక్తి పెరిగి, దానితో వారు సంతోషపడుతున్నందుకు 'మాలిక్'కి ధన్యవాదాలు.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె - కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 201

లఖీంపుర్,
27.03.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరాలు తమకు అంది ఉండవచ్చు. తమకు ఒక ఉత్తరమైతే వ్రాసివేశాను కాని దానిలో స్థితిని గురించి వ్రాయలేదు. అందుచేత మరో ఉత్తరం దీనిని వ్రాస్తున్నాను.

శ్రీ బాబూజీ! ఈ స్థితిలో, నేను నిశ్శబ్దంగా, కళ్ళు తెరచుకుని కూర్చుండి ఉన్నప్పుడు, కనురెప్పలు వాటి పని మూసి వేయటం, తెరవటం తమ బాధ్యత అనే సంగతినే మరచిపోయి అచేతనంగానే ఉండిపోతున్నాయి. శ్రీ బాబూజీ, ఇంకా ఏమిటంటే, అసలు ఏమి జరుగుతున్నదో, ఏమి జరగటంలేదో, వాటి ధ్యాసయే నాకు లేకుండాపోయినట్లుగా అనిపిస్తోంది. ఆలోచనలు కూడా లేకుండాపోతున్నట్లుగా నేను ఇదివరకైతే ఏమి వ్రాశానో అదే స్థితి ఇప్పుడు ఉంది. అదేమిటో గాని నాకు ఇప్పుడు ఎటువంటి స్పృహ కూడా లేకుండా పోయింది. అది ఎలా ఉందంటే, నాకు పూజను గురించిన స్పృహగాని, 'మాలిక్' గురించిన స్పృహగాని లేకపోతున్నాయి. అంతేగాకుండా ఆంతరికంగా 'అతడు' లేకపోయాడన్న చింత కూడా లేకపోయినట్లుగా అనిపిస్తోంది. వాస్తవంగా నాకు ఇప్పుడు అర్థమైంది ఏమిటంటే, (Check) 'పర్యవేక్షణ' అనేది ఏదైతే నాకు చెడ్డదిగా అనిపిస్తూ ఉండేదో అది ఇప్పుడు కీడులో మేలుగా అయ్యింది. అలాకాకపోయి ఉన్నట్లయితే, నా సమస్త చైతన్యమూ లేకుండాపోయేది, అప్పుడింక ఉన్నతి గురించిన ప్రశ్నయే ఉండేది కాదు. నాకు ఈ స్థితి యొక్క పూర్తి అనుభవం కలిగించినందుకు 'మాలిక్'కు అనేక ధన్యవాదాలు. సామాన్యంగా స్పృహ లేకుండానే అన్నీ జరిగిపోతూ ఉంటాయి కాని 2,3 నిమిషాలపాటు ఎటువంటి జ్ఞానం అనగా ఆ సమయంలో నోటిలో ఆహారపు ముద్ద ఉన్నట్లయితే, దానిని నమలాలి అనిగాని, ఊసివేయాలి అనిగాని లేక అలాగే ఉంచాలనిగాని ఏమి చేయాలో తెలియకుండా పోతోంది. ఇటువంటి స్థితిలో ఎవ్వరైనా అనేకసార్లు ఈశ్వర్ ఈశ్వర్ అని బిగ్గరగా అరచినా, 'మాలిక్' అని పలుమార్లు వల్లించినా కూడా అతడు ఏమి మాట్లాడుతున్నాడో కూడా తెలియకుండా ఉంది. అయినా కాని 'మాలిక్' దయతో 2-3 నిమిషాలకు మించి చైతన్యంలేనిదానివలె ఉన్నాననిపించటం లేదు. అలా కానట్లయితే, ఎలా ఉండేదంటే - ఎవ్వరైనా స్నానం చేయించినట్లయితే స్నానం చేయటం, దుస్తులు ధరింపజేస్తే ధరించటం, తినిపించినట్లయితే తినటమూ జరిగేది. నాకు ఏమీ తెలియదు. పూర్తిగా ఇతరులను ఆశ్రయించియే ఉండవలసివచ్చేది. ఏమైనాగాని శ్రీ బాబూజీ, నేను మాత్రం 'అతని' ఆశ్రితురాలనే, అటుపైన 'అతని' అభీష్టం ప్రకారమే చేస్తాడు. 'అతని'కి అనేక ధన్యవాదాలు. నా బాబూజీ, నిన్నటి నుండి స్థితి స్వచ్ఛంగా ఉన్నట్లుగా అనిపిస్తోంది. స్థితి ఎలా ఉంది అంటె, నిరంతరం ఆశ్చర్యకరమైన దశ గాఢంగా ఉన్నట్లుగా అనిపిస్తోంది. ఇప్పుడు ఇంకొక స్థితి

ఏమి ఏర్పడుతున్నదంటే, అది నీటి నుంచి చల్లదనం మరియు తేమలను తొలగించినట్లయితే ఎలా ఉంటుందో అలా ఉంటోంది. ఇంకొకరకంగా చెప్పాలంటే, ఏదైనా పదార్థం నుంచి దాని సారం తీసివేశాక ఏమి మిగులుతుందో దానిలాగా ఉంటోందని కూడా చెప్పవచ్చు.

పూజ్య శ్రీ బాబూజీ, జమిందారీ ఎట్టి పరిస్థితుల్లోను తొలగించబడ రాదు అను దానికి అనుకూలంగా 'పని' (Working) చేయాలని నా హృదయం ఆశిస్తోంది. దానికి తగ్గట్టుగా 'పని' ప్రారంభించి వేశాను కూడా, కాని తమ అనుజ్ఞ కోసం ఎదురు చూస్తున్నాను. ఇంకొక విషయం ఏమిటంటే, ఈ పృథ్వి మీద ఆ మూలం (Source) నుంచి ఈశ్వరీయ ధార యొక్క ధారలు పడుతున్నట్లుగా నేను దృష్టి సారించినట్లయితే, బహుశా అది త్వరగా జరగవచ్చు. తమరు ఏమని వ్రాస్తే అదే చేస్తాను.

పెద్ద సోదరుని ఉత్తరం వచ్చింది. రసాయన శాస్త్రం (Chemistry) ప్రయోగపరీక్షలో బాగా చేసినట్లుగా వ్రాశాడు, అయినా కూడా ఎవ్వరూ ఫలితం గురించి చెప్పలేరని వ్రాశాడు. భౌతికశాస్త్రం (Physics) ప్రయోగ పరీక్ష 31వ తారీఖున ఉంది. కేసర్ తమకు ప్రణామం తెలియజేసింది. చదువులో బాగా నిమగ్నమైపోయి ఉంది. ఎందుకంటే, 1వ తారీఖు నుంచి ఆమెకు పరీక్షలు ఉన్నాయి.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 202

లఖీంపుర్,
30.03.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. తమరు దయతో వ్రాసిన ఉత్తరం ఈ రోజు వచ్చింది, సమాచారం తెలిసింది. దానితో చాలా సంతోషం కలిగింది. అందుకు 'మాలిక్'కు అనేకానేక ధన్యవాదాలు. వదినగారి ఆరోగ్యం కూడా బాగుందని తెలిసి చాలా సంతోషం కలిగింది. నా ఉత్తరం బహుశా తమకు చేరి ఉండవచ్చు. ఇప్పుడు 'మాలిక్' కృపతో కలిగిన ఆత్మికదశను గురించి నాకు అనుభవమైన దానిని వ్రాస్తున్నాను.

ఇప్పుడు మరపుస్థితి ఎలా ఉందంటే, ఎప్పుడైతే నేను నా స్థితి నుంచి స్పృహ పొందుతానో, అప్పుడు ఆ మరపుస్థితి యొక్క జాడ తెలుస్తుంది, లేకుంటె తెలియదు. ఇప్పుడు నా దశ ఇంకొకరకంగా ఎలా ఉందంటే, ఎప్పుడైతే ఆ స్థితి నుంచి స్పృహ వస్తుందో అప్పుడే ఆ మరపుస్థితి, దానితోపాటు గాఢంగా నిర్భ్రాంతపోవటం వంటి దశ అనుభవమవుతున్నాయి. ప్రాపంచికంగా ఆలోచిస్తే నేను దానిలో పూర్తిగా ఏమీ పట్టనట్లుగా అనగా నిద్రపోతున్నట్లుగానే అనుభవం పొందుతున్నాను. ఇంకొకరకంగా చెప్పాలంటే ఇది స్వాభావికమే (మామూలే) అయిపోయినట్లుగా ఉంది, లేదా ఇది నా ప్రకృతి అనగా స్వభావంగా అయిపోయింది. ఇక్కడి ప్రతి మాట, ప్రతి పనీ నావలన ఈ విధంగా జరుగుతున్నట్లుగా అర్థం చేసుకోవచ్చు. ఎలాగంటే, ఏ విధంగానైతే మానవుడు స్వప్నంలో అన్ని పనులు చేస్తూ, అందరితో మాట్లాడుతూ ఉన్నట్లుగానే ఉంటుంది గాని అంతకుమించి ఇంకేమీ ఉండదు. ఇంతకూ ఆ భేదం ఏమిటంటే, ఆ స్వప్నంలో తనది (Self) గా అయిన ఆలోచన తప్పనిసరిగా ఉంటుంది కాని ఈ స్వప్నంలో దీని (అనగా తన యొక్క) జాడ ఏమీ ఉండదు. ఇప్పుడు 3–4 రోజుల నుండి వీపు భాగంలో వెన్నుపూసల్లో మళ్ళీ ప్రకంపనలు వంటివి కలుగుతున్నాయి. శ్రీ బాబూజీ, అది ఏమిటో తెలియదు, నా శరీరమంతటా పూర్తిగా గిలిగింతలు కలుగుతున్నట్లుగా అనుభవమవుతోంది. ఇప్పుడు స్థితి ఇంతకుపూర్వం దానికంటె భిన్నంగా అనిపిస్తోంది. ఇంతకుపూర్వమైతే దశ కళ్ళెదుట కనిపిస్తూ ఉండేది, కాని ఇప్పుడు నిద్రావస్థలో కూడా ఏదో చైతన్య స్థితి లేదా మృతజీవిలాంటి స్థితి

ఉన్నట్లుగా అనిపిస్తోంది. ఇంకా ఎలా అనిపిస్తోంది అంటె, దూరంగా ఉండి చాలా తేలికగా అనగా సహజంగానే ఉన్నట్లుగా అనిపిస్తోంది. ఇంతేకాదు, ఇంకా ఇప్పుడు బాగా దృష్టి పెట్టినట్లయితే, అది ఏమిటో తెలియదు కాని బాబూజీ, శరీరం యొక్క ప్రతి రోమ రోమంలోను అదే ప్రకంపనం, ఒక విధమైన గిలిగింత అనుభవమవుతున్నట్లు అనిపిస్తోంది. ఆ మరపుస్థితి లేదా స్పృహ లేని స్థితి వంటిది నా స్వభావం లేదా ప్రకృతిగా అయిపోయింది. హృదయం వీటన్నింటికి దూరంగా ఎక్కడో విహరిస్తోంది. అది ఏమిటో తెలియకపోతోంది, కాని నా అలవాటు ప్రకారం ఎప్పుడైతే ఈ విషయమై ఆలోచన కలుగుతుందో అప్పుడు ఇవన్నీ (అనగా శరీరం యొక్క అణువు అణువుగాని, మరి ఏదైనా గాని) కూడా 'అతడే'నని, 'అతడి'వేనని అనిపిస్తోంది. ఇది అర్థం కావటంలేదు సరికదా అసలు ఇవి అన్నీ ఏమిటి అనే ధ్యాసయే ఉండటంలేదు. శ్రీ బాబూజీ, చివరకు 'అతడి' గురించి ఆలోచించి ఆలోచించి ఆలోచనయే లేకుండాపోతోంది. ఇప్పుడింక 'అతడి' అభీష్టం మేరకే చేస్తాడు. ఇప్పుడు ఆ వ్యాకులత (చికాకు) తొలగిపోయింది కాని అదేమిటో దైవానికే తెలియాలి, తరచుగా హృదయం విలపించాలని కోరుకుంటోంది. ఇప్పుడు నా స్థితి కొంత వింతగా నడుస్తోంది.

పూజ్య శ్రీ బాబూజీ, ఏప్రియల్ 15వ తారీఖున ఉత్సవం దగ్గర పడుతోంది. తమకు రావాలనుకుంటె ఎప్పుడు తలచుకుంటె అప్పుడు దయ చేయగలరు. మాయ, ఛాయ, ఉమేష్ మరియు సర్వేష్‌లను కూడా వెంట బెట్టుకుని రాగలరు. 'తమ'కు ప్రయాణం చేయటానికి కష్టతరమైనందున ఆహ్వానించటానికి సాహసించలేకపోతున్నాను. తమకు ఎలా తోస్తే అలా చేయండి. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన

కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య – 203

లఖీంపుర్,

02.04.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నా ఉత్తరం తమకు చేరి ఉంటుంది. తమ ఆరోగ్యం ఇప్పుడు బాగుపడిందని ఆశిస్తున్నాను. **ఇప్పుడు ఉత్సవం రాబోతున్నది, కాని నాకైతే ఎప్పుడూ పండగ అంటె పండుగలాగానే అనిపిస్తూ ఉంది. చంద్రుడు ఎక్కడ ఉంటే వెన్నెల కూడా అక్కడే ఉంటుంది, సూర్యుడు ఎక్కడ ఉంటే ప్రకాశం కూడా అక్కడే ఉంటుంది. అదే విధంగా 'మాలిక్' ఎక్కడ ఉంటె ఉత్సవం కూడా అక్కడే ఉంటుంది. అభ్యాసీ కయితే 'మాలిక్'యే ఉత్సవం, అదే అతనికి కావలసింది. అయినా కూడా అది ప్రత్యేకత కలిగి మహిమాన్వితంగా ఉంటుంది.** 'మాలిక్' దయతో నాలో కలిగిన ఆత్మిక దశను గురించి వ్రాస్తున్నాను.

శ్రీ బాబూజీ, ప్రస్తుతం ఆత్మ మరియు పరమాత్మల సంయోగం వంటి దశగా ఉంది. కాని నాకు ఆత్మతోగాని, పరమాత్మతోగాని సంబంధం లేదు. నాకు ఈ దశ ఏ విధంగా అనిపిస్తోంది అంటే, చెలియ ప్రభు కలయికతో అంగాంగములందు అనురాగం పొందినట్లు అనగా శరీరం యొక్క అణువు అణువూ దివ్యానందంలో తలమునకలైపోయినట్లుగా అనిపిస్తోంది. అయితే నాకు మాత్రం ఈ అనురాగం వగైరాలు ఏమీ తెలియవు ఎందుకంటే, నన్ను నేనే గుర్తించలేకపోయినపుడు, ఇంక అనురాగాన్ని గుర్తించగలిగేది ఎవరు ఉంటారు. పూజ్య శ్రీ బాబూజీ, నాకు ఇంకను ఏమి అనిపిస్తోంది అంటె, నా వేర్పాటు ఎప్పుడూ జరిగి ఉండలేదు (అనగా దైవంతో తాను వేరుగా ఉన్నట్లు అనగా ద్వైతం లేనట్లు) అని. నేను 'అతని'తో ఎప్పుడైనా 'అతను' లేకుండా, వేరుగా ఉన్నానా అనేది కూడా నాకు జ్ఞాపకం రావటంలేదు. ఇది అసంభవమైన విషయం. ఇప్పటి స్థితి ఎలా ఉందంటే, రోజులన్నీ విలాపంగానే గడుస్తున్నాయి. అప్పుడప్పుడు హృదయానికి గట్టిగా ఏడ్వాలనిపిస్తుంది, కారణం ఏమిటో తెలియదు. ఏమైనాగాని నాకు 'అతడి'తోనే అవసరం ఉంది. శ్రీ బాబూజీ, ఇంకా ఎలా అనిపిస్తోంది అంటె అంగాంగముల్లో ఏదో

నిండిపోయినట్లుగాను, రోమ రోమంలోను ఏదో వ్యాపించిపోయినట్లుగాను తెలుస్తోంది. ఆ ఆనందం ఏదైతే ఉండేదో, అదంతా మాయమైపోయినట్లుగా అనుభవమవుతోంది. ఇప్పుడు శరీరం లోపల, బయట అంతటా ఒక విధమైన మధుర గిలిగింత వంటిది అనుభవమవు తున్నది. ఏడ్పు అంతా ఆగిపోయిన తర్వాత, ఈ దశ ఎక్కువగా శుద్ధమైనది గాను, స్వాభావికమైనదిగాను అనిపిస్తోంది.

పూజ్య శ్రీ బాబూజీ, నా ఈ స్థితి స్వాభావికంగా ఎప్పుడు అయి పోయిందో కూడా నాకు తెలియదు. అది ఎలాగంటె, ఎవ్వరైనా చేయి (హస్తం) అని అంటె అప్పుడు నా చేయి అప్రయత్నంగా స్వభావికంగా పైకి లేస్తుంది కాని నాకైతే చేయి ఆ విధంగా పైకి లేచినట్లు తెలియదు. పొట్టలోకాని, శరీరంలో ఎక్కడైనాగాని బాధ కలిగినట్లయితే, అది అల్పంగా ఉంటె మాత్రం ఆ ప్రాంతంలో ఏదో బాధ ఉన్నట్లుగా స్వల్పంగా అనుభూతి కలుగుతుంది. అదే కనుక తీవ్రమైన బాధగా ఉంటే మాత్రం స్పష్టంగా అది ఏ స్థానంలో ఉన్నదో దాని జాడ తెలుస్తుంది. ఇదే కాదు, ఒకవేళ నేను దానిమీద దృష్టిపెట్టి ఇది చేయి అని నిర్ణయిస్తే, అది చేయి అని చెప్తూ చెప్తూ ఆ చేతి సంగతే మరచిపోతున్నాను. ఇది ఇప్పుడు క్రొత్త విషయమేమీ కాకుండా ఎప్పుడో సహజంగా ఉన్నదని అనిపిస్తోంది. అప్పుడప్పుడు పగలు హృదయం బాగా విరక్తి చెందుతోంది. అయితే ఇది గతంలో కంటె కొంచెం తక్కువే. స్థితి తరచుగా బాగా నిస్సారంగా ఉంటోంది.

చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 204

లఖీంపుర్,
06.04.1952

పరమ పూజ్య శ్రీ బాబూజీగారికి,

సవినయ ప్రణామం. నిన్న మనియార్డర్ ఫారమ్‌మీద వ్రాసిన దానినిబట్టి అక్కడి సమాచారం తెలిసింది. అది తెలిసి చాలా దుఃఖం కలిగింది. దయచేసి తమరు తమ హృదయాన్ని నిస్పృహ చెందనీయకండి. ఎందుకంటే, తమ వలన మా అందరి జీవితాలకు వెలుగు వస్తుంది. ఇంకా చెప్పాలంటె, ఇద్దరు ముగ్గురు మనుష్యులు మాత్రమే బాగా పని చేసేవారుగా ఉండి, వారిలో పూర్తిగా పనిచేసే తత్వం ఉన్నట్లయితే అప్పుడు ఏమీ ఇబ్బంది ఉండదు. ఎందుకంటే సమర్థవంతంగా పనిచేసే వారి యొక్క ప్రతి రోమకూపం, ఒక మానవుని యొక్క శక్తిని కలిగి ఉంటుంది అని చెప్పబడుతుంది. మిషన్‌కు మాత్రం 'మాలిక్' కృపయే  సదా వెలుగు నిచ్చింది, ఇస్తూ ఉంటుంది. తమరు నాకు ఒకసారి, హృదయాన్ని ఎప్పుడు కూడా నిరాశ చెందకుండా ఉండునట్లు చేయాలి అని చెప్పి ఉన్నారు. ఇప్పుడు 'మాలిక్' కృపతో నాలో కలిగిన ఆత్మిక దశను వ్రాస్తున్నాను.

ఇప్పుడు ఈ విధంగా అనిపిస్తోంది – నాలో మరపుస్థితి ఉంటున్నదా అనే విషయం కూడా నాకు జ్ఞాపకం లేకుండా ఉంది. ఒకవేళ ఒకటి రెండు నిమిషాలు జ్ఞాపకం కలిగినప్పటికీ అది మళ్ళీ మాయమైపోతూ ఉంది. జ్ఞాపకం కలిగినపుడు మాత్రం, ఆ సెకను కాలం నేను ఎక్కడి నుండి వచ్చాను అని తలంపుకు వస్తోంది. దానిని మగతలో ఉన్న మనుష్యుడు లేదా మరణించిన మనష్యుడు ఒక్క క్షణంపాటు చైతన్యం పొందినట్లుగా ఉన్న స్థితితో పోల్చవచ్చు. అయినా కూడా ఆ క్షణిక చైతన్యాన్ని చైతన్యం అని చెప్పటం తగని పని. ఒక విధంగా, ఎవ్వరైనా గాఢనిద్ర నుండి లేచి మగతలోనే 'ఊ', 'ఆ' అన్నట్లుగానే, ఆ సెకను సమయంలో నా స్థితి కూడా అలాగే ఉంటున్నది. అది నాకు సహింపరానిదిగా అనిపిస్తోంది. ఒకవేళ నేను 10–15 నిమిషాలు ఆ స్థితిలో నిలిచిపోయినట్లయితే,

అప్పుడు ఒక విధమైన చికాకు ఆరంభమైనట్లుగా అనిపిస్తోంది. శ్రీ బాబూజీ అదేమిటో 'మాలిక్'కే తెలియాలి, ఇప్పుడు ఏమి అనిపిస్తోంది అంటె, నేను నాలో ఉండకుండా, ఎప్పుడూ ఎక్కడో బయట ఉంటున్నట్లుగా ఉంటోంది, అదే నాకు బాగున్నట్లుగా అనిపిస్తోంది కూడ. మరి ఆ బాగు ఏమిటి అని నేను ప్రశ్నించుకున్నట్లయితే అక్కడ బాగుండటం, బాగాలేకపోవటం అనేవి రెండూ లేవు కాని హృదయం మాత్రం అక్కడే స్థిరపడి ఉంటోంది. అందుచేత అక్కడ అనగా బయట బాగున్నట్లుగా చెప్పవలసి వస్తోంది. నేను ఏమి మాట్లాడినా, ఏది చేసినా కూడా నాతో నిమిత్తం లేకుండా నాకు బయటనే జరిగిపోతున్నట్లుగా ఉంది. సక్రమం, అక్రమం అనగా ఇది సరైనది, ఇది సరైనది కాదు అను ఆలోచన నుంచి కూడా 'మాలిక్' నాకు విముక్తి కల్పించాడు. ఇక అదేమిటో 'అతని'కి తెలుసు, 'అతని' పనికి తెలుసు. శ్రీ బాబూజీ, ఇప్పుడు ఆత్మ ఎక్కడ నుండి వచ్చిందో అక్కడే (మూలంలో) లయమైపోతున్న స్థితి అనుభవమవుతోంది. ఆ స్థితిలో ఎటువంటి రంగు ఉందంటే, దానిలో నుంచి (రంగులో నుంచి) రంగు తొలగిపోయిన తర్వాత నిలిచే రంగుగా ఉంటోంది అనగా హాయి అనిపించే దాని నుంచి ఆ హాయి తొలగించబడితే ఏది ఉంటుందో అది. హృదయం అన్నివేళలా చాలా సరళంగాను, అమాయకంగాను ఉంటోంది. శ్రీ బాబూజీ, ఇదివరకైతే ఒకసారి ప్రతిదాని నుంచి కాంతి వెలువడుతున్నట్లుగా ఉంది అని వ్రాసి ఉన్నాను కాని ఇప్పుడు ఆ స్థితి మారిపోయింది. ఇప్పుడు అన్నింటిలోను అంధకారం ఆవరించి ఉన్నట్లుగాను, కాంతి అనేదే లేనేలేనట్లుగాను అనిపిస్తోంది. అయితే దీనిని అంధకారం అని చెప్పటానికి వీలు లేదు. అన్నింటిలోను అనగా ఆఖరికి సూర్య చంద్రాదుల్లో కూడా నాకు కాంతి దర్శనం కావటంలేదు. ప్రస్తుతం స్థితి ఏ విధంగా ఉంటున్నదంటే, ప్రణామం చేస్తున్నాను, కాని అది ఎవరికి చేస్తున్నాను అను జ్ఞానం లేకుండా ఉంటోంది. అది విశేషించి ఇంక ఎంతగానంటే, అసలు ప్రణామం చెప్తున్నానా లేక ఇంకేమైనా చేస్తున్నానా అనే జ్ఞానం కూడా లేకపోతోంది. చిన్నవారైన సోదర సోదరీలకు ప్రేమాభిమానాలు.

తమ విధేయురాలైన
కుమార్తె – కస్తూరీ

## ఉత్తరం సంఖ్య - 205

షాజహాన్‌పుర్,
06.04.1952

ప్రియమైన కుమార్తె కస్తూరీ,

సుఖీభవ. నీ ఉత్తరాలు చేరాయి. చదివి సంతోషించాను. నీకు సిట్టింగ్ ఇవ్వకుండా చాలా రోజులు గడిచిపోయాయి. అయితే ఇప్పుడు రోజూ చాలా పర్యాయాలు దృష్టిపెట్టాల్సి వస్తోంది. నిన్ను గురించి ఎంతగా అశ్రద్ధ వహించానో అంతగా ఇప్పుడు శ్రద్ధ వహించాల్సి వస్తోంది. ఈ విధంగా సమతుల్యస్థితికి వచ్చింది. ఒకవేళ ఏ రోజైనా కుదరకపోయినప్పటికీ, నేను ప్రతిరోజూ సిట్టింగ్ తప్పనిసరిగా ఇస్తాను. ఇప్పుడింక రెండు మూడు బిందువులు (పాయింట్లు) తర్వాత నిన్ను ఇంక ఎక్కువసేపు ఉంచకూడదని నేను భావిస్తున్నాను. ఇప్పటికింకా నిర్ణయించుకోలేదు కాని స్థితినిబట్టి చేస్తాను. నేను నీకు చెబుతున్న ఇంకొక విషయం ఏమిటంటే, నీకు స్థితుల పరిచయం, వాటి అనుభవం గురించిన జ్ఞానం కలగాలి. దానివలన నీవు ఎవరికైనా దశలు (అంచెలు) దాటించాలంటే నీవు ఏమి చెయ్యాలో నిర్ణయించుకోగలవు. నేను అనుభవలేమి వలన కొన్ని తప్పులు చేస్తూ ఉంటాను. ఒక వాస్తవ విషయం ఏమిటంటే, నాకు గురుమహరాజ్ ప్రదానం చేసిన శక్తిని అంచనా వేయలేకపోతాను. నేను నిన్ను **'B'** పాయింట్ మీదకు తీసుకొని వెళ్ళినప్పుడు నాకు తెలియకుండానే నేను ఎక్కువ ప్రాణాహుతిని ఇచ్చాను. తత్ఫలితంగా **'B'** పాయింట్ యొక్క స్థితిలో చాలా ఏకాగ్రశక్తి (Concentrated Force) ఉద్భవించింది. ఇప్పుడు అది విస్తరించినట్లయితే ఈ పాయింట్‌లో ప్రయాణం ప్రారంభమవుతుంది. ఈ రోజు ఉదయం నిద్ర నుంచి

మేల్కొంటున్నప్పుడు ఇది నా దృష్టికి వచ్చింది. లాలాజీ సాహెబ్ ఏదైనా చేయగలరు (సర్వసమర్థులు) కనుక ఇది సరిదిద్దబడుతుంది.

నీ సోదర సోదరీలకు ఆశీస్సులు.

నీ శ్రేయోభిలాషి,

రామచంద్ర

***********

*****

***

*